౮

మహాకవి బమ్మెర పోతనామాత్య ప్రణీత

శ్రీమహాభాగవతము

మూఁడవ సంపుటము

(సప్తమ, అష్టమ, నవమ స్కంధములు)

ఆంధ్ర పాఠ్యాంధ్ర పరిష్కార సహిత వీక్షా సహితము

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి

హైదరాబాదు.

1964.

894.8271
POT

C1

మహాకవి బమ్మెర పోతనామాత్య ప్రణీత

శ్రీమహాభాగవతము

మూఁడవ సంపుటము

COMPLIMENTARY COPY

(సప్తమ, అష్టమ, నవమ స్కంధములు)

894.8271
POT

※

బహు పాఠాంతర పరిష్కార విపుల పీఠికా సహితము

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10101

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10101

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి
హైదరాబాదు.
1964.

సర్వస్వామ్యం సంకలితము.
ప్రథమ ముద్రణము 2000 ప్రతులు.

మూల్యము : అయిదు రూపాయలు





ముద్రణ :
శివాజీ ప్రెస్,
సికింద్రాబాదు.

AOUA105B151

AOUA105B151

సంపాదక వర్గము

ఆచార్య రాయప్రోలు సుబ్బారావు - (అధ్యక్షులు)

డాక్టర్ దివాకర్ల వేంకటావధాని

డాక్టర్ వి. రామరాజు - (సమీక్షకర్త)

శ్రీ తాపి ధర్మారావు

శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రి

శ్రీ

లలిత స్కంధము, కృష్ణమూలము, శుకా

లాపాభిరామంబు, మం

జులతా శోభితమున్, సువర్ణసుమన

స్సున్నిశ్రేయమున్, సుందరో

జ్జ్వలవృత్తంబు, మహాఫలంబు, విమల

వ్యా సాలవాలంబు నై

వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వు

ర్వీన్ సద్ద్విజ శ్రేయమై.

విషయ సూచిక

సప్తమ స్కంధము

విషయము.		పుట సంఖ్య
శ్రీహరి ద్వారపాలకులకు సనక సనంద నాదులవలన శాపంబు సంభవించుట	....	4
బాలవేషము దాల్చిన యముండు దెలిపెడు సుయజ్ఞోపాఖ్యానము	....	7
బ్రహ్మదేవుండు హిరణ్యకశిపునకు వరము లిచ్చుట	....	13
ప్రహ్లాద చరిత్ర	....	18
హిరణ్యకశిపుండు ప్రహ్లాదుని వివిధోపాయంబుల హింసించుట	....	28
శ్రీహరి నరసింహ రూపమున స్తంభమునం దావిర్భవించుట	....	44
నరసింహమూర్తి హిరణ్యకశిపుని వధించుట	....	46
బ్రహ్మాది దేవతలు నృసింహమూర్తిని వేఱువేఱ స్తుతించుట	....	48
ప్రహ్లాదుండు నరసింహమూర్తిని స్తుతించుట	....	52
త్రిపురాసుర సంహారము	....	61
నారదుండు ధర్మరాజునకు వర్ణాశ్రమ ధర్మంబులు తెలుపుట	....	64
ప్రహ్లా దాజగర సంవాదము	....	70
నారదుని పూర్వజన్మ వృత్తాంతము	....	80

అష్టమ స్కంధము

గజేంద్ర మోక్షణ కథ	....	85
కూర్మావతార కథాప్రారంభము	....	111
ఈశ్వరుండు దేవబృంద ప్రార్థితుండై హాలాహలమును భానము చేయుట	....	116
పాలకడలిలో నైరావతాదులు జనించుట	....	118
శ్రీవిష్ణుమూర్తి మోహినీ స్వరూంబు నొందుట	....	123
దేవాసుర యుద్ధము	....	127
శ్రీహరి తన మోహినీ స్వరూపముచేత నీశ్వరుని మోహింపఁజేయుట	....	138
వామన చరిత్ర ప్రారంభము	....	146
వామన మూర్త్యావిర్భావము	....	158
బలిచక్రవర్తి కడకు వామనమూర్తియే తెంచుట	....	1 9
వామనమూర్తి విశ్వరూపము నొంది విజృంభించుట	....	170
మత్స్యావతార కథ	....	182

నవమ స్కంధము

అంబరీషోపాఖ్యానము	....	202
ఇక్ష్వాకు వంశానుక్రమము	....	212
పరమేశ్వర జటాజూట నిర్గత గంగానదీ ప్రవాహ మహిమాను వర్ణనము	....	224
శ్రీరామ చరిత్రము	....	231

భవిష్య ద్రా జేతిహాస వర్ణనము 244
చంద్రవంశ్య లగు రాజుల యితిహాసము 247
పరశురాముని చరిత్ర 254
యయాతి చరిత్ర 264
దేవయాని యయాతిని వరించుట 266
శుక్రాచార్యులు యయాతికి శాపం బొసంగుట 268
యయాతి దేవయానికి బస్తోపాఖ్యాన మను వ్యాజంబున స్వప్నవృత్తాంతమును
దెలిపెడు కథ 271
భరతుని చరిత్రము 277
రంతిదేవుని చరిత్రము 280
యదువంశ చరిత్రము 290
వసుదేవుని వంశక్రమాను వర్ణనము 294

ఓమ్

శ్రీ మహా భాగవతము

—•—

సప్తమ స్కంధము

క. శ్రీమ ద్విఖ్యాతి లతా, క్రామిత రోదోంతరాళ ! కమనీయ మహా
జీమూత తులిత దేహా, శ్యామల రుచిజాల ! రామచంద్రనృపాలా ! 1

అధ్యాయము - ౧

వ. మహనీయ గుణగరిష్ఠు లగు న మ్మునిశ్రేష్ఠులకు నిఖలపురాణ వ్యాఖ్యాన వైఖరీసమేతుం డైన సూతుం డి ట్లనియె. అట్లు ప్రాయోపవిష్టుం డైన పరీక్షి న్నరేంద్రుండు శుక యోగీంద్రు నవలోకించి. 2

సీ. సర్వభూతములకు సముఁడు నెచ్చెలి ప్రియుం డైన వైకుంఠుఁ డనంతుఁ [1]డాద్యుఁ
డింద్రునికొఱకు దై త్యేంద్రుల నేటికి విషమునికై వడి వెదకి చంపె ?
నసురులఁ జంపంగ నమరులచేఁ దన కయ్యెడు లాభ [2]మిం తైనఁ గలదె ?
నిర్వాణనాథుండు నిర్గుణుం డగు తన కసురులవలని భయంబుఁ బగయుఁ

ఆ. గలుగనేర వట్టి ఘనుఁడు దై త్యులఁ జంపి
సురలఁ గాఁచుచునికి చోద్య మనుచు
సంశయంబు నాకు జనియించె మునినాథ !
ప్రజ్ఞ మెఱసి తెలియఁ బలుకవయ్య ! 3

వ. అనిన శుకుం డి ట్లనియె. 4

శా. నీ సంప్రశ్నము వర్ణనీయము గదా ! నిక్కంబు రాజేంద్ర ! ల
క్ష్మీ[3]సంభావ్యుని సచ్చరిత్రము మహాచిత్రంబు చింతింపఁ ద
ద్దాసాఖ్యానము లొప్పు విష్ణుచరణ ధ్యాన ప్రధానంబు లై
శ్రీసంధానము లై మునీశ్వరవచో జేగీయమానంబు లై. 5

క. చిత్రంబులు త్రైలోక్య ప, విత్రంబులు భవలతా లవిత్రంబులు స
న్మిత్రంబులు మునిజన వన, చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్. 6

---

1. ఆద్యుఁడు (తం. వా.) 2. ఏమైన (త); ఎంతైన (హ. వా.) 3. సంభావ్యుఁడు (హ)

వ. నరేంద్రా! కృష్ణద్వైపాయనునకు నమస్కరించి, హరికథనంబులు నెవ్వెద. వినుము. వ్యక్తుండు గాక, గుణంబులు లేక, ప్రకృతిం జెందక, భవంబుల నొందక పరమేశ్వరుండు దన మాయవలన నైన గుణంబుల నావేశించి బాధ్యబాధకత్వం బుల నొందు. అతండు గుణరహితుండు. సత్త్వ రజ స్తమంబులు ప్రకృతిగుణం బులు. ఆ గుణంబులకు నొక్కొక్కకాలంబున హానివృద్ధులు గలవు. ఆ యీశ్వ రుండు సత్త్వంబున దేవఋషులను, రజోగుణంబున నసురులను, దమోగుణం బున యక్ష రక్షో గణంబులను విభజించె. సూర్యుండు పె క్కెడలం గానంబడియు నొక్కరుం డైనతెఱంగునఁ, ద ద్విభుండును సర్వగతుం డయ్యును భిన్నుండు గాఁడు. తత్త్వవిదు లైన పెద్దలు దమలోనం బరమాత్మస్వరూపంబున నున్న యీశ్వరు ని ష్విధంబున నెఱుంగుదురు. జీవాత్మకుఁ బరుం డైన సర్వమయుండు దనమాయచేత విశ్వంబుఁ సృజియింపం గోరి రజంబును, గ్రీడింపం గోరి సత్త్వం బును, నిద్రింపం గోరి తమంబును,నుత్పాదించి చర మైన కాలంబును సృజియించు. ఆ కాలమున సర్వదర్శనుం డైన యీశ్వరుండు కాలాహ్వాయుండై సత్త్వగుణం బైన దేవానీకంబునకు వృద్ధియు, రజ స్తమో గుణు లైన రాక్షసులకు హానియుం జేయుచుండు. 7

క. జననాయక! యీ యర్థము, ఘనయశుఁ డగు ధర్మజునకుఁ గ్రతుకాలమునన్
మును నారదుండు నెవ్వెను, వినుపించెద వినుము చెవులు విమలత నొందన్. 8

వ. మున్ను ధర్మరాజు సేయు రాజసూయమహాయాగంబున బాలుం డైన శిశుపాలుండు హరిని నిందించి, నిశిత నిర్వక్ర చక్రధారా దళిత మస్తకుం డై, తేజోరూపంబున వచ్చి, హరిదేహంబు సొచ్చుటం జూచి వెఱఁగుపడి, ధర్మజుండు సభలో నున్న నారదు నీక్షించి యి ట్లనియె. 9

ఆ. ఎట్టివారి కైన నేకాంతులకు నైన
వచ్చి చొరఁగరాని వాసుదేవు
తత్త్వమందుఁ జెంది ధరణీశుఁ డహితుఁ డై
యెట్లు చొచ్చె? మునివరేణ్య! నేఁడు. 10

ఉ. [1]వేనుఁడు మాధవుం దెగడి విప్రులు దిట్టిన భగ్నుఁ డై తమో
లీనుఁడు గాఁడె? తొల్లి మదలిప్తుఁడు చైద్యుఁడు పిన్ననాఁటనుం
డేనియు మాధవున్ విన సహింపఁడు భక్తి వహింపఁ డిట్టి వాఁ
డే నిబిడప్రభావమున నీ పరమేశ్వరునందుఁ జొచ్చెనో? 11

---

1. వెన్నుఁడు (క. చ. బ. హ.)

మ. హరి సాధింతు హరిన్ [1]గ్రసింతు హరిఁ బ్రాణాంతంబు నొందింతుఁ దా
హరికిఁ వైరి నటంచు వీఁడు పటు రోషాయత్తుఁ డై యెప్పుడుఁ
దిరుగుం బ్రువ్వదు నోరు వ్రీలి పడదుఁ దేహంబు దాహంబుతో
[2]నరకావాసము నొందఁ డేక్రియ జగన్నాథుం బ్రవేశించెనో ? 12

వ. అదియునుం గాక దంతవక్త్రుండును, వీఁడును నిరంతరంబు గోవిందు నింద
సేయుదురు. నిఖిలజనులు సందర్శింప నేఁడు వీనికి విష్ణుసాయుజ్యంబు గలుగుట
కేమి హేతువు? వినుపింపుము. పవనచలిత దీపశిఖయునుం బోలె నా హృద
యంబు చలింపుచున్నది. అనిన ధర్మనందనునకు నారదుం డి ట్లనియె, దూషణ
భూషణ తిరస్కార సత్కారంబులు శరీరంబునకుం గాని పరమాత్మకు లేవు. శరీ
రాభిమానంబునం జేసి దండ వాక్పారుష్యంబులు హింస యై తోఁచుతెఱంగున,
నేను, నాయది యనియెడు వైషమ్యంబు భూతంబులకు శరీరంబునంద సంభ
వించు. అభిమానంబు బంధంబు. నిరభిమానుం డై వధించినను వధంబు గాదు.
కర్తృత్వ మొల్లని వానికి హింసయు సిద్ధింపదు సర్వభూతాత్మకుండైన యీశ్వ
రునికి వైషమ్యంబు లేదు. కావున. 13

ఆ. అలుక నైనఁ జెలిమి నైనఁ గామంబున
నైన భాంధవమున నైన భీతి
నైనఁ దగిలి తలఁప నఖలాత్మఁ డగు హరిఁ
జేరవచ్చు వేఱు సేయఁ డతఁడు. 14

క. వైరానుబంధనంబునఁ, జేరిన చందమున విష్ణుఁ జిరతరభక్తిం
జేరఁగరా దని తోఁచును, నారాయణ భక్తియుక్తి నా చిత్తమునన్. 15

క. కీటకముఁ దెచ్చి భ్రమరము, పాటవమున బంభ్రమింప భ్రాంతం బై త
త్కీటకము భ్రమరరూపముఁ, బాటించి వహించుఁ గాదె! భయయోగమునన్.

వ. ఇ ట్టి విధంబున. 17

శా. కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్య నృపతుల్ సంబంధు లై వృష్ణులున్
ప్రేమన్ మిరలు భక్తి నేము నిదె చక్రిం గంటి మె ట్లైన ను
ద్దామ ధ్యానగరిష్ఠుఁ డైన హరిఁ జెందన్‌వచ్చు ధాత్రీశ్వరా! 18

---

1. గ్రహింతు (హ) 2. నరకప్రాప్తియు (క. తం. వా.)

—:శ్రీహరి ద్వారపాలకులకు సనక సనంద నాదులవలన శాపంబు సంభవించుట:—

వ. మఱియుం బెక్కండ్రు కామ ద్వేష భయ స్నేహ సేవాతిరేకంబులఁ జిత్తంబు హరిపరాయత్తంబుగాఁ జేసి [1]తద్గతిం జెందిరి. హరి నుద్దేశించి(న) క్రోధాదులైన యేనింటిలోపల నొకటి యైన [2]వేనునికి లేని నిమిత్తంబున నతండు వ్యర్థుండయ్యె. మీ తల్లికిఁ జెల్లెలికొడుకు లైన శిశుపాల దంతవక్త్రులు దొల్లి విష్ణు మందిర ద్వారపాలకులు. విప్రశాపంబునఁ బదభ్రష్టు లై భూతలంబున జన్మించిరి. అనిన విని యుధిష్ఠిరుండు నారదున కిట్లనియె. 19

మ. అలుగం గారణ మేమి విప్రులకు? మున్నా విప్రు లెవ్వారు? నిశ్చలు లేకాంతులు నిర్జితేంద్రియులు నిస్సంసారు [3]లీశానువర్తులు వైకుంఠపురీ నివాసు లన విందుఁ వారి కే భంగి నీ ఖలజన్మంబులు వచ్చె? నారద! వినం గౌతూహలం బయ్యెడిఁ. 20

వ. అనిన నారదుం డిట్లనియె. ఒక్కనాఁడు బ్రహ్మమానసపుత్రు లైన సనక సనందనాదులు దైవయోగంబున భువనత్రయంబున సంచరింపుచు, నై దా ఱేండ్ల ప్రాయంపు బాలకుల భావంబున దిగంబరు లై హరిమందిరంబునకు వచ్చి చొచ్చు నెడ, మొగసాల నున్న పురుషు లిరువురు వారలం జూచి. 21

క. డింభకుల ననర్గళ వి, స్రంభకుల రమాధినాథ సల్లాప సుధా
రంభకుల ముక్తమానస, దంభకులం జొరఁగనీక తఱిమి రధీశా! 22

క. వారించినఁ దమకంబున, వా రించుక నిల్వలేక వడిఁ దిట్టిరి దా
వారికుల నసురయోని న, వారితు లై పుట్టుఁ డనుచు వసుధాధీశా! 23

వ. మఱియు నా పిన్న పెద్దలు వారలం జూచి, మీ రీయెడ నుండ నర్హులు గారు. నారాయణచరణమూలంబు విడిచి, రజస్తమో గుణు లై, రాక్షసయోనిం బుట్టుడు. అని శపియించిన వారు నా శాపవశంబునఁ బదభ్రష్టు లై కూలుచు మొఱ లిడిన, న మ్మహాత్ములు దయాళువు లై క్రమ్మఱం గరుణించి, మూఁడు జన్మంబులకు వైరంబున భగవ త్సన్నిధానంబు గలిగెడు నని నిర్దేశించి చనిరి. ఇవ్విధంబున శాపహతు లై హరి పార్శ్వచరు లైన పురుషు లిరువురు హిరణ్యకశిపు హిరణ్యాక్షు లన దితికి జన్మించిరి. అందుఁ గనిష్ఠుం డైన హిరణ్యాక్షుని హరి వరాహరూపంబున సంహరించె. అగ్రజుం డైన హిరణ్యకశిపుండును నరసింహమూర్తి యైన శ్రీహరిచేత విదళితుం డయ్యె. అతని కొడుకు ప్రహ్లాదుండు దండ్రిచేత హింసితుం డయ్యును నారాయణ పరాయణుం డై శాశ్వతుం

---

1. సద్గతిం (క) 2. వెన్నునికి (హ. తం. వా.) 3. ఇచ్ఛానువర్తులు (ట. త.)

డయ్యె. రెండవభవంబున[1] గైకసి యను రాక్షసికి రావణ కుంభకర్ణు లై సంభవించిన, విశ్వంభరుండు రఘుకులంబున రాఘవుం డై యవతరించి వధించె. తృతీయజన్మంబున మీ తల్లి చెల్లెలికి శిశుపాల దంతవక్త్ర లన నుద్భవించి. 24

శా. వక్రం బింతయు లేక పాయని మహావైరంబుతో నిత్య జా
త క్రోధ స్మరణంబులఁ విదళి తోద్య త్కాపసంఘాతు లై
చక్రచ్ఛిన్న శిరస్కు లై మునివచ శ్శాపావధి ప్రాప్తు లై
చక్రిం జెందిరి [2]వారె పార్శ్వచరు లై సారూప్య భావంబునఁ. 25

వ. అనిన విని ధర్మనందనుం డి ట్లనియె. 26

క. బాలుఁ హరిపద చింతా, శీలుఁ సుగుణాలవాలు శ్రీమ న్మేధా
జాలుఁ సంతోషించక, యేలా శిక్షించె? రాక్షసేంద్రుం డనఘా! 27

క. పరిభూత వ్యథనంబులు, నిరుపమ సంసారజలధి నిర్మథనంబుల్
నరకేసరి కథనంబులు, పరిరక్షిత దేవ యక్ష ఫణి మిథునంబుల్. 28

వ. మునీంద్రా! వినుపింపు మనిన నారదుం డి ట్లనియె.

అధ్యాయము - ౨

కమలోదరుచేత సహోదరుండు హతుం డయ్యె నని విని, హిరణ్యకశిపుండు రోష శోక దందహ్యమాన మానసుం డై ఘూర్ణిల్లుచు, నాభీల దావదహన జ్వాలా [3]కరాళంబు లయిన విలోకనజాలంబుల గగనంబునం బొగ లెగయ నిరీక్షింపుచుఁ, దటిల్లతాంకుర సంకాశ ధగద్ధగిత దంతసందష్ట దళనచ్ఛదుండును, నదభ్ర భయంకర భ్రుకుటిత ఫాలభాగుండును, నిరంత రాశాంత దురంత వైరవేగుండును నై మహాప్రభాజాల జటాలం బగు శూలంబుఁ గేల నందుకొని, సభామండపంబున నిలువంబడి, త్రిమస్తక, త్రిలోచన, శకుని, శంబర, శతబాహు, నముచి, హయగ్రీవ, పులోమ, విప్రచిత్తి ప్రముఖు లైన దైత్య దానవుల నాలోకించి యి ట్లనియె. 29

శా. నాకుం దమ్ముఁడు మీకు నెచ్చెలి రణ న్యాయైక దక్షుండు బా
హా కుంఠీకృత దేవయక్షుఁడు హిరణ్యాక్షుండు వానిఁ మహా
సౌకర్యాంగముఁ దాల్చి దానవవధూ సౌకర్యముల్ నీఱుగా
వైకుంఠుండు వధించి పోయె నఁట యీ వార్తాస్థితిఁ వింటిరే! 30

---

1. కైకేశి (హ. తం.) 2. వారు (తం. వా.) 3. విశాలంబులయిన (హ)

చ. [1]వనముల నుండుఁ జొచ్చు మునివర్గములోపల ఘోణి గాఁడు సం
జనన మెఱుంగ రెవ్వరును జూడ యొకింతయు లేదు తన్ను డా
సిన మఱి డాయు [3]వెంటఁబడి చిక్కక చిక్కఁడు వీని నొక్క కీ
లున మనమెల్ల లోఁబడక [4]లోఁబడఁ బట్టుకొనంగవచ్చునే? 31

సీ. భుజశక్తి నాతోడఁ బోరాడ శంకించి మున్నిట మునిఁగిన మునుఁగు గాక
యలయించి పెనఁగు నా యచల సంభ్రమమున కెఱఁగి వెన్నిచ్చిన నిచ్చుఁ గాక
జగడంబు సైపక సౌకర్య కాంక్షి యై యిలఁ గ్రింద నీఁగిన నీఁగుఁ గాక
క్రోధించి యటుగాక కొంత పౌరుషమున హరిభంగి నడరిన నడరుఁ గాక

గీ. కఠిన శూలధారఁ గంఠంబు విదళించి
వాని శోణితమున వాఁడి మెఱసి
మ త్సహోదరునకు మహిఁ దర్పణము సేసి
[5]మీఁద వత్తు మీకు మేలుఁ దెత్తు. 32

క. ఖండిత మూలద్రుమమున, [6]నెండిన విటపములభంగి నీతఁడు వడ నా
ఖండలముఖ్యులు వడుదురు, భండనమున నితఁడు దమకుఁ బ్రాణము లగుటఁ.

సీ. పొండు దానవులార! భూసురక్షేత్ర సంగత యైన భూమికి గములు గట్టి
మహిఁ దప స్స్వాధ్యాయ మౌనవ్రతస్థుల వెదకి ఖండింపుఁడు విష్ణుఁ డనఁగ
నన్యఁ డొక్కఁడు లేఁడు యజ్ఞంబు వేదంబు నతఁడె భూదేవ క్రియాది మూల
మతఁడె దేవర్షి పిత్రాది లోకములకు ధర్మాదులకు మహాధార మతఁడె

గీ. యే స్థలంబున గో భూసురేంద్ర వేద
వర్ణ ధర్మాశ్రమంబులు వరుస నుండు
నా స్థలంబుల కెల్ల మీ రరిగి చెఱిచి
దగ్ధములు సేసి రండు మీ దర్ప మెప్ప. 34

వ. అని యిట్లు నిర్దేశించిన, దివిజమర్దను నిర్దేశంబులు శిరంబున ధరియించి, రక్క
సులు పెక్కండ్రు భూతలంబునకుం జని. 35

సీ. గ్రామ పుర క్షేత్ర ఖర్వట ఖేట ఘో షారామ నగరాశ్ర మాదికములు
గాలిచి కొలఁకులు గలఁచి ప్రాకార గోపుర సేతువులు ద్రవ్వి పుణ్యభూజ
చయముల ఖండించి సౌధ ప్రపా గేహ పర్ణశాలాదులు పాడుచేసి
సాధు గో బ్రాహ్మణ సంఘంబులకు హింస గావించి వేదమార్గములు చెఱచి

---

1. వనములనుండఁ జొచ్చు (హ) 2. సంచరించు (హ) 3. ఘోణిగాడు (ట) 4. వెంటబడ చిక్కడు, స్రుక్కడు, కొన్ని వ్రాఁత ప్రతులు. 5. మెఱసివత్తు (క) 6. నెండేటి (హ. చ.) నెండెడి (ట)

ఆ. కుతలమెల్ల నిట్లు కోలాహలంబుగా
దైత్య లాచరింపఁ దల్లడిల్లి
నష్టమూర్తు లగుచు నాకలోకము మాని
యడవులందుఁ జొచ్చి రమరవరులు. 86

వ. అంత హిరణ్యకశిపుండు దుఃఖితుం డై, మృతుం డైన సోదరునకు నుదకప్రదా
నాది కార్యంబు లాచరించి, యతని బిడ్డ లగు శకుని, శంబర, కాలనాభ,
మదోత్కచ ప్రముఖుల నూఱడించి, వారల తల్లితోఁ గూడ హిరణ్యాక్షుని
భార్యల నందఱ రావించి, తమ తల్లి యైన దితి నవలోకించి యి ట్లనియె.

శా. నీరాగార నివిష్ట పాంథుల క్రియఁ నిక్కంబు సంసార సం
చారుల్ వత్తురు కూడి విత్తురు సదా సంగంబు లే దొక్కచో
శూరుల్ వోయెడి త్రోవఁ బోయెను భవ త్సూనుండు దల్లీ! మహా
శూరుం డాతఁడు త ద్వియోగమునకున్ శోకింప నీ కేటికిఁ. 88

సీ. సర్వజ్ఞుఁ డీశుండు సర్వాత్మఁ డవ్యయుఁ డమలుండు సత్యుఁ డనంతుఁ డాద్యుఁ
డాత్మరూపంబున నశ్రాంతమును దన మాయాప్రవర్తన మహిమవలన
గుణములఁ గల్పించి గుణసంగమంబున లింగశరీరంబు లీలఁ దాల్చి
కంపిత జలములోఁ గదలెడిక్రియఁ దోఁచు పాదపంబులభంగి భ్రామ్యమాణ

ఆ. చక్షువుల ధృతి చలిత యై కానంగఁ
బడినభంగి వికల భావరహితుఁ
డాత్మమయుఁడు కంపితాంతరంగంబునఁ
గదలినట్ల తోఁచుఁ గదలఁ డతఁడు. 89

—: బాలవేషము దాల్చిన యముండు దెలిపెడు సుయజ్ఞోపాఖ్యానము :—

వ. అవ్వా! యి ద్విధంబున లక్షణవంతుండు గాని యీశ్వరుండు లక్షితుం డై, కర్మ
[1]సంసరణంబున యోగవియోగంబుల నొందించు. సంభవ వినాశ శోక వివేకా
వివేక చింతా స్మరణంబులు వివిధంబులు. ఈ యర్థంబునకుఁ బెద్దలు ప్రేత
బంధు యమసంవాదం బను నితిహాసంబు నుదాహరింతురు. వినుఁడు; నెపెప్పెద.
[2]ఉశీనరదేశంబునందు సుయజ్ఞుం డను రాజు గలండు. అతండు శత్రువులచేత
యుద్ధంబున నిహతుం డై యున్నయెడ. 40

---

1. సంస్మరణంబున (హ) 2. ఉసీనర (హ)

సీ. చినఁగిన బహురత్న [1]చిత్ర వర్మంబుతో రాలిన భూషణ రాజితోడ
భీకర బాణనిర్భిన్న వక్షముతోడ తఱచుఁ గాఱెడు శోణితంబుతోడఁ
గీర్ణ మై జాఱిన కేశబంధముతోడ రయ రోష [2]దష్టాధరంబుతోడ
నిమిషహీనం బైన నేత్రయుగ్మముతోడ భూరజోయుత ముఖాంబుజముతోడఁ

ఆ. దునిసి పడిన దీర్ఘ దోర్దండములతోడ
జీవరహితుఁ డగు నుశీనరేంద్రుఁ
జుట్టి బంధుజనులు సొరిది నుండఁగ భయా
క్రాంత లగుచు నతని కాంతలెల్ల. 41

శా. ప్రస్తాకంపిత కేశబంధములతో సంచిన్న హారాళితో
హస్తాబ్జంబులు సాఁచి మోదుకొనుచుఁ హా! నాథ! యంచుఁ బహు
ప్రస్తావోక్తులతోడ నేడ్చిరి వగఁ బ్రాణేశు పాదంబుపై
నస్తోక స్తన కుంకుమారుణ వికీర్ణాస్రంబు వర్షింపుచుఁ. 42

మ. అనఘా! నిన్ను నుశీనరప్రజల కర్థానంద సంధాయిగా
మును నిర్మించిన బ్రహ్మ నిర్దయత నున్మూలించెనే? వీరికిఁ
దనయశ్రేణికి మాకు దిక్కు గలదే? ధాత్రీశ! నీవోఁటికిన్
జనునే? పాసి చనంగ భ్రాతృజనులఁ సన్మిత్రులఁ బుత్రులఁ. 43

మ. జనలోకేశ్వర! నిన్నుఁ బాసిన నిమేషంబుల్ మహాబ్దంబు లై
చను లోకాంతరగామి వై మరల కీ చందంబున న్నీవు వో
యిన [3]నె బ్భంగిఁ జరింతు మొల్లము గదా! యీ లోకవృత్తంబు నేఁ
డనలజ్వాలలఁ జొచ్చి వచ్చెదము నీ యంఘ్రిద్వయిం జూడఁగఁ. 44

వ. అని యిట్లు రాజభార్య లా రాజశవంబు డగ్గఱి విలపింపం, బ్రొద్దు గ్రుంకెడు సమయంబున వారల విలాపంబులు విని, బాలకుం డై యముండు సనుదెంచి, ప్రేతబంధులం జూచి యి ట్లనియె. 45

ఉ. మచ్చిక వీరికెల్ల [4]బహుమాత్రము చోద్యము దేహి వుట్టుచున్
జచ్చుచునుండఁ జూచెదరు చావక మానెడువారిభంగి నీ
చచ్చినవారి కేడ్చెదరు [5]చావుకు నొల్లక డాఁగవచ్చునే?
యెచ్చటఁ బుట్టె నచ్చటికి నేఁగుట నై జము ప్రాణికోటికిన్. 46

---

1. జీర్ణ (క) 2. దంష్ట్రాధరంబు (హం.వా.) 3. మేమెట్లు (తం. వా.) 4. బహుమాత్రపు (చ) 5. చావున కొల్లక (తం.వా.)

క. జననీజనకులఁ బాసియు, ఘన వృకముల బాధపడక కడుఁ బిన్నల మై
మనియెద మెవ్వఁడు గర్భం, బున మును పోషించె వాఁడె పోషకుఁ డవిక్ష.

క. ఎవ్వఁడు సృజించుఁ బ్రాణుల, నెవ్వఁడు రక్షించుఁ ద్రుంచు నెవ్వఁ డనంతుం
డెవ్వఁడు విభుఁ డెవ్వఁడు వాఁ, డి వ్విధమున [1]మనుచుఁ బెనుచు పేలాఁరతుఁ డై.

ఆ. ధనము వీథిఁ బడిన దై వవశంబున
నుండుఁ బోవు మూల నున్న నైన
నడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు
రక్షితుండు మందిరమునఁ జచ్చు. 49

క. కలుగును మఱి లేకుండును, గల భూతము లెల్లఁ గాలకర్మవశము లై
[2]యిలఁ బడియుఁ బ్రకృతిఁ ద ద్గుణ, కలితుఁడు గాఁ డాత్మమయుఁ డగమ్యుఁడు
దలఁపఁ. 50

సీ. పాంచభౌతిక మైన భవనంబు దేహంబు పురుషుండు దీనిలోఁ బూర్వకర్మ
వశమున నొకవేళ వర్తించు దీపించు తఱి యైన నొకవేళ తలఁగిపోవు
చెడునేని దేహంబు చెడుఁ గాని పురుషుండు చెడఁ డాతనికి నింతచేటు లేదు
పురుషునికిని దేహపుంజంబునకు వేఱు గాని యేకత్వంబు గానరాదు

ఆ. దారువుల వెలుంగు దహనుని కై వడిఁ
గాయములఁ జరించు గాలిభంగి
నాళలీన మైన నభము చాడ్పున వేఱు
దెలియ వలయు దేహి దేహములకు. 51

వ. అని మఱియు ని ట్లనియె. 52

సీ. భూపాలకుఁడు నిద్రపోయెడి నొండేమి విలపింప నేటికి ? వెఱ్ఱులార !
యెవ్వఁడు భాషించు నెవ్వఁ డాకర్ణించు నట్టివాఁ డెన్నఁడో యరిగినాఁడు
ప్రాణభూతుం డై న పవనుఁ డా కర్ణింప భాషింప నేరఁడు ప్రాణి దేహ
ములకు వేఱై తాను ముఖ్యుఁ డై యింద్రియవంతుఁ డై జీవుండు వలను మెలఁగుఁ

ఆ. ప్రాభవమున భూతపంచ కేంద్రియ మనో
లింగదేహములను లీలఁ గూడి
విడుచు నన్యుఁ డొకఁడు విభుఁడు దీనికి మీరు
[3]వొగల నేల ? వగలఁ బొరల నేల ? 53

---

1. మనుపుఁ బెనుపు (హ) మనుపు దనుపు(ద) 2. నిలువదు ప్రకృతిం (హ) నిలువఁబడుఁ బ్రకృతిఁ (తం) నిలఁబడుఁ బ్రకృతిం (వా.) 3. పొగలనేల వగలఁ బొగలనేల (హ)

క. ఎందాఁక నాత్మ దేహము, [1]నొందెడు నందాఁక కర్మయోగము లటపై
ఁ
జెందవు మాయా యోగ, స్పందితు లై రిత్త జాలిఁ బడ నేమిటికిఁ ? 54

మ. చెలులుం దండ్రులు దల్లు లాత్మజులు సంసేవ్యుల్ సతుల్ చారు ని
ర్మల గేహంబు లటంచుఁ గూర్తురు మహా మాయాగుణ భ్రాంతు లై
కలలోఁ దోఁచిన [2]యర్థముల్ నిజములే ? కర్మానుబంధంబులం
గలుగున్ సంగము లేక మానుఁ పిదపఁ గర్మాంత కాలంబునఁ. 55

వ. మఱియు, మాయా గుణప్రపంచంబు నెఱింగెడి తత్త్వజ్ఞులు నిత్యానిత్యంబులం
గూర్చి సుఖదుఃఖంబులం జెందరు. అజ్ఞులు గొందఱు యోగవియోగంబులకు
సుఖదుఃఖంబుల నొందుదురు. తొల్లి యొక్క మహాగహనంబున విహంగంబులకు
నంతక భూతుం డైన యెఱుకు గలఁడు. అతండు ప్రభాతంబున నొక్కనాఁడు
లేచి వాటం బైన వేఁట తమకంబున. 56

క. వల లురులు జిగురుఁ గండెలుఁ, జలిదియుఁ జిక్కంబు ధనువు శరములుఁ గొనుచుం
బులుఁగులఁ బట్టెడు వేడుక, [3]నలుకుడు వెడలంగఁ గదలి యడవికి నడచెఁ. 57

వ. ఇట్లడవికిం జని తత్ప్రదేశంబునందు. 58

క. కట్టలుకఁ [4]దడక చాటువఁ, బిట్టల [4]నురిగోలఁ దిగిచి బిరుసున ఱెక్కల్
వట్టి విఱిచి చిక్కములోఁ, బెట్టుచు విహరించె లోకభీకర లీలన్. 59

వ. మఱియు, నానావిధంబు లగు శకుంతంబుల నంతంబు నొందింపుచు, సకల పక్షి
సంహార సంరబ్ధకరుం డైన లుబ్ధకుండు, దన ముందటఁ గాలచోదితం బై సంచ
రింపుచున్న కుళింగపక్షిమిథునంబుఁ గనుంగొని, యందుఁ గుళింగి నురిం దిగిచి,
యొక్క చిక్కంబులో వైచినం జూచి, దుఃఖించి, గుళింగపక్షి యిట్లనియె.

చ. అడవుల మేఁత మేసి మన మన్యుల కెన్నఁడు నెగ్గుసేయ కి
క్కడ విహరింప నేఁ డకట ! కట్టిఁడి బ్రహ్మ కిరాతు చేతిలోఁ
బడు మని వ్రాసెనే ? నుదుటఁ బాపపు దైవము కంటి కింత యె
క్కుడు బరు వయ్యెనే బ్రతుకు ? కోమలి ! యే మననేర్తుఁ [5]జెల్ల రే ! 61

క. ఒకమాటు మనల నందఱఁ, బ్రకటించి కిరాతువలలఁ బడఁజేయక ని
[6]న్నొకతిఁ వలఁ బడఁజేసిన, వికటీకృత దక్షు మైన విధి నే మందున్ ? 62

---

1. నుండెడు (హ) 2. యోగముల్ (ట. తం.) 3. అలుగులు (తం. వా.) 4. తడుకు (తం. వా) 5. మటిఁగోల (హ) 6. చెప్పవే (క) 7. ఒకటిఁ (హ. వా.)

ఉ. ఱెక్కలురావు పిల్లలకు ఱేపటి నుండియు మేఁత గానమీ
ఱొక్కుచుఁ గూఁటిలో నెగసి పోవఁగ నేరవు మున్ను తల్లి [1]యే
దిక్కున నుండి వచ్చు నని త్రిప్పని చూడ్కుల నిక్కి నిక్కి నల్
దిక్కులు చూచుచున్న వతిదీనత నెట్లు భరింతు ? నక్కటా! 63

వ. అని యి ట్లి ద్విధంబున. 64

క. కుంఠిత నాదముతోడను, గంఠము శోషింప వగచు ఖగమును హననో
త్కంఠుం డై న కిరాతుఁ డ,కుంఠిత గతి నేసె నొక్కకోలఁ గూలఁ. 65

క. కాలము వచ్చిన శబరుని, కోలం ధరఁ గూలె ఖగము ఘోషముతోడఁ
కాలము డాసిన నేలం, గూలక పో వశమె ? యెట్టి గుఁవంతులకున్. 66

ఉ. కావున మీరు చచ్చుతఱిఁ గానరు చచ్చి ధరిత్రిఁ బడ్డ ధా
త్రీ విభు దేహముం గదిసి దీనత నేడువనేల ? పొండు చిం
తావతులార ! వత్సర శతంబుల కైన నిజేశు చక్కిదిం
బోవుట దుర్లభంబు మృతిఁ బొందినవారలు సేర వత్తురే ? 67

వ. అని యిట్లు కపట బాలకుం డై క్రీడించుచున్న యమునియుపలాల నాలాపం
బులు విని సుయజ్ఞుని బంధువు లెల్ల వెఱఁగు పడి, సర్వప్రపంచంబు నిత్యంబు గా
దని తలంచి, శోకంబు మాని, సుయజ్ఞునికి [2]సాంపరాయిక కృత్యంబులు సేసి
చనిరి. అంత నంతకుం డంతర్హితుం డయ్యె. అని చెప్పి హిరణ్యకశిపుండు దన
తల్లినిఁ, దమ్మునిని, భార్యలం జూచి యి ట్లనియె. 68

క. పరు లెవ్వరు ? దా మెవ్వరు ?, పరికింపఁగ నేక మగుట భావింపరు త
త్పరమజ్ఞానము లేమినిఁ, బరులును మే మనుచుఁ దోఁచుఁ బ్రాణుల కెల్లఁ. 69

వ. అని తెలియం బలికిన, హిరణ్యకశిపుని వచనంబులు విని, దితి కోడంబ్రుమ్ము,
దానును, శోకంబు మాని, తత్త్వ విలోకనంబు గలిగి, లోకాంతర గతుం డై న
కొడుకునకు వగవక చనియె. అని చెప్పి నారదుండు ధర్మనందనునకు ని ట్లనియె,

అధ్యాయము - 8

క. అజరామర భావంబును, ద్రిజగ ద్రాజ్యంబు నప్రతిద్వంద్వము దో
ర్విజి తాఖిల శాత్రవమును, గజరిపు బలమును హిరణ్యకశిపుఁడు గోరెన్. 71

వ. ఇట్లు గోరి, మందరాచల ద్రోణికిం జని, యందుఁ గాలిపెనుబ్రేల నేల నిలువం
బడి యూర్ధ్వబాహుం డై, మిన్ను చూచుచు, వాఁడి మయూఖంబుల తోడి

---

1. యీ దిక్కున (తం. వా.) 2. సాంప్రదాయిక (ట)

ప్రళయకాల భానుండునుం బోలె దీర్ఘ జటారుణ ప్రభాజాలంబులతోడ నెవ్వరికిం
దేటిచూడ రాక, పరమ దారుణం బైన తపంబు సేయుచుండె. నిర్జరులు నిజ
స్థానంబుల నుండిరి. అంత. 72

మ. అదరెం గుంభిని సాద్రి యై కలఁగె నే డంభోనిధుల్ తారకల్
చెదరెన్ సగ్రహసంఘ లై దిశలు విచ్ఛిన్నాంత లై మండెఁ బె
ల్లదరెన్ గుండెలు జంతుసంహతికి నుగ్రాచార దై త్యేంద్ర [1]మూ
ర్ధ దిశోద్ధూత సధూమ హేతిపట లోదంచ త్తపోవహ్నిచేన్. 73

వ. ఇట్లు త్రైలోక్య సంతాపకరం బైన దైత్యరాజ తపో దహన విజృంభణంబు
సైరింపక, నిలింపులు నాకంబు విడిచి, బ్రహ్మలోకంబునకుం జని, లోకేశ్వరుం
డైన బ్రహ్మకు వినతు లై, యి ట్లని విన్నవించిరి. 74

క. దితికొడుకు తపమువేఁడిమి, నతితప్తుల మైతి మింక నలజడి నమరా
వతి నుండ వెఱతు మె య్యది, గతి మాకును దేవదేవ! కారుణ్యనిధీ! 75

శా. శంకాలేశము లేదు దేవ! త్రిజగ త్సంహారముఁ దేవతా
సంకోచంబును వేదశాస్త్ర పదవీ సంక్షేపముఁ [2]జాల నే
వంకఁ [3]జేతు నటంచు దుస్సహ తపోవ్యావృత్తి చిత్తంబులో
సంకల్పించె నిశాచరుండు ప్రతిసంస్కారంబు చింతింపవే! 76

శా. నీ వే రీతి తపోబలంబున జగ న్నిర్మాణముఁ జేసి యీ
దేవాధీశులకంటె నెక్కుడు సిరిం దీపించి తి భ్భంగిఁ దా
నీ విశ్వంబుఁ దపస్సమాధి మహిమఁ హింసించి వేఱొక్క వి
శ్వావిర్భావకరత్వ శక్తి మదిలో నర్థించినాఁ డీశ్వరా! 77

వ. అదియునుం గాక కాలాత్మ్మ లగు జీవాత్మ్మల కనిత్యత్వంబు గలుగుటంజేసి
తపో యోగ సమాధి బలంబునం దనకు నిత్యత్వంబు సంపాదింతు నని తలంచి
నాఁడు. అని మఱియు ని ట్లనిరి. 78

మ. భవదీయం బగు నున్నతోన్నత మహాబ్రహ్మైక పీఠంబు సం
స్తవనీయం బగు భూతియుఁ [4]విజయముఁ సౌఖ్యంబు సంతోషముఁ
భువనశ్రేణికి నిచ్చు దైత్యుని తపస్సూన్నార్తి న్నివారించి యో
భువనాధీశ్వర! కావవే! భువనముల్ పూర్ణ ప్రసాదంబునఁ. 79

---

1. మూర్ధ్న (హ) 2. లేక (తం. వా.) 3. లేవ (తం. వా.)
4. విభవముఁ (హ. చ. బ.)

—: బ్రహ్మదేవుండు హిరణ్యకశిపునకు వరము లిచ్చుట :—

వ. అని దేవతలు విన్నవించిన స్వయంభూతుండును, భగవంతుండును నైన నలు మొగంబుల [1]ప్రొడ భృగు దక్షాదులతోడ మందరపర్వతంబునకు వచ్చి, యందు నియమ యుక్తుండును, బిపీలికావృత మేదో మాంస చర్మ రక్తుండును, వల్మీక తృణ వేణుపటల పరిచ్ఛన్నుండును, మహా తపః ప్రభావ సంపన్నుండును నై నీరంధ్ర నిబిడ నీరదనికర నివిష్ట నీరజబంధుండునుం బోలె నివసించి యున్న నిర్జరారాతిం జూచి, వెఱఁగుపడి, నగుచు ని ట్లనియె. 80

మత్తకోకిల. ఓ సురారికులేంద్ర ! యీ క్రియ నుగ్ర మైన తపంబు ముఁ
చేసి చూపినవారు లే రిఁక జేయువారును లేరు నే
నీ సమాధికి మెచ్చితిఁ విను నీ యభీష్టము లిత్తు నా
యాస మేటికి ? లెమ్ము [2]లెమ్ము మహాత్మ ! కోరుము కోరికల్. 81

శా. దంశవ్రాతములుఁ బిపీలికలు మేదఃక్రవ్య రక్తంబులఁ
సంశీర్ణంబులు సేసి పట్టి తినఁగా శల్యావశిష్టుండ వై
వంశచ్ఛన్న తృణావళీ యుత మహావల్మీకమం దింద్రియ
భ్రంశం బెంతయు లేక [3]నీవు నిలువం బ్రాణంబు [4]లె ట్లుండెనో ? 82

ఉ. ఉత్సుకతఁ జలాన్నముల నొల్లక యీ క్రియ నూఱు దివ్యసం
వత్సరముల్ శరీరమున వాయువులఁ నిలుపంగ వచ్చునే ?
యుత్సవ మయ్యెఁ జూచి మము నుగ్రతపంబున గెల్చి తీవు నే
వత్సలత న్నినుం గదియ వచ్చితిఁ గోరిక లెల్ల నిచ్చెదఁ. 83

వ. అని పలికి వనమక్షికా పిపీలికా భక్షితం బైన రక్షోవిభుని దేహంబుమీఁదం గమం డలుజలంబులు ప్రోక్షించిన, న ద్ధానవేంద్రుండు కమలాసన కరకమల కమనీయ కనకమయ దివ్యామోఘ కమండలు నిర్గత నిర్మల నీరధారా బిందుసందోహ సంసిక్త సకలాంగుం డై, తపంబు సాలించి, సాంద్ర కీచక సంఘాత సంచాదిత వామలూరుమధ్యంబు వెలువడి, మహాప్రభావ బల సౌందర్య తారుణ్య సహితుం డును, వజ్రసంకాశ దేహుండును, దప్త సువర్ణ వర్ణుండును నై నీర సేంధన నికర నిర్గత వహ్నియుంబోలె వెలుంగుచుఁ జనుదెంచి. 84

మ. దివిజానీకవిరోధి ప్రొక్కిఁ గని వాగ్దేవీ మనోనేతకుఁ
సవిశేషోత్సవ సంవిధాతకు నమ త్సంత్రాతకుఁ స త్తపో
నివహాభీష్ట వరప్రదాతకు జగ న్నిర్మాతకున్ ధాతకుఁ
వివిధప్రాణి లలాటలేఖన మహావి ద్యానుసంధాతకుఁ, 85

---

1. వేల్పుప్రొడ (హ. వా) 2. వేగ (హ) 3. నీకు (తం. వా) 4. ఎట్లోర్చునో (క. బ.) ఎట్లోర్చెనో (తం.)

వ. ఇట్లు దై త్యేశ్వరుండు దివి నున్న హంసవాహనునకు ధరణీతలంబున దండ ప్రణామం బాచరించి, సంతోష బాష్ప సలిల సంవర్ధిత పులకాంకురుం డై యంజలి చేసి, కంజగర్భునిమీఁద దృష్టి యిడి, గద్గదస్వరంబున నిట్లని స్తుతియించె.

సీ. కల్పాంతమున నంధకార [1]సంవృత మైన జగము నెవ్వఁడు దన సంప్రకాశ
మున [2]వెలుఁగింపుచు మూఁడుభంగుల రజస్సత్త్వ తమో గుణ[3]సహితుఁ డగుచుఁ
గల్పించు రక్షించుఁ గడపటఁ బ్రహరించు నెవ్వఁ డాద్యుఁడు సర్వహేతు వగుచు
శోభితుం డై స్వయంజ్యోతి యై యొక్కట విలసిల్లు నెవ్వఁడు విభుత మెఱసి

ఆ. సమయ మైన మానస ప్రాణ బుద్ధీంద్రి
యములతోడ నెవ్వఁ డలఘుమహిమ
[4]నడరు నట్టి సచ్చి దానందమయునకు
మహితభక్తి నే నమస్కరింతు. 87

వ. దేవా! నీవు ముఖ్యప్రాణం బగుటంజేసి ప్రజాపతివి. మనో బుద్ధి చిత్తేంద్రియంబు లకు నధీశ్వరుండవు. మహాభూతగణంబులకు నాధారభూతుండవు. త్రయీతనువునం గ్రతువులు విస్తరింతువు. సకల [5]విద్యాకళలు నీ తనువు. [6]సర్వార్థసాధకులకు సాధనీయుండవు. †(ఆత్మనిష్ఠా గరిష్ఠులకు ధ్యేయం బగు నాత్మవు.) కాలమ యుండ వై జనులకు నాయుర్నాశంబుఁ జేయుదువు. జ్ఞాన విజ్ఞాన మూర్తివి. ఆద్యంత రహితుండవు. అంతరాత్మవు. త్రిమూర్తులకు మొద లై న పరమాత్మవు. జీవలోకంబునకు జీవాత్మవు. నీవ సర్వంబును. నీవు గానిది లేశంబును లేదు. వ్యక్తుండవు గాక పరమాత్మవై, పురాణపురుషుండ వై, యనంతుండ వై న నీవు ప్రాణేంద్రియ మనో బుద్ధి గుణంబుల నంగీకరించి, పరమేష్ఠి పదవిశేషంబున నిలిచి, స్థూలశరీరంబునంజేసి యింతయుం బ్రపంచింతువు. భగవంతుండ వై న నీకు మ్రొక్కెద. అని మఱియు ని ట్లనియె. 88

క. కోరినవారల కోర్కులు, నేరుపుతో నిచ్చి మనుప నీక్రియ నన్యుల్
నేరరు [7]కరుణాకర, నేఁ! గోరెద నీ విచ్చెదేనిఁ గోరిక లభవా! 89

శా. గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిఁ దిక్కులఁ
రేలఁ ఘ్రసములఁ దమఃప్రభల భూరి గ్రాహ రక్షో మృగ
వ్యాళాదిత్య నరాది జంతు కలహావ్యాప్తిఁ సమస్తాస్త్రశ
స్త్రాళిఁ మృత్యువులేని జీవనము లోకాధీశ! యిప్పించవే! 90

---

1. సంభృతమైన (హ) 2. వెలిఁగించుచు (తం.వా.) 3. జనకుఁడగుచు (జ.ద.) 4. తనరు నట్టి (క. ట. డ.) 5. విద్యలు (హ. తం. వా.) 6. తత్త్వార్థ (చ. జ.) † తా. ప. ప్రతులలో లేదు. 7. కరుణాత్మక (క.బ) 8. పటలి (ట. జ.) ప్రబల (హ. త. బ.)

అధ్యాయము - 8

వ. అని మఱియు, రణంబులందుఁ దన కెదురులేని శౌర్యంబును, లోకపాలకుల నతిక్రమించు మహిమయును, భువనత్రయ జయంబును, హిరణ్యకశిపుండు గోరిన, నతని తపంబునకు సంతోషించి, దుర్లభంబు లైన వరంబు లన్నియు నిచ్చి, కరుణించి విరించి యిట్లనియె. 91

శా. అన్నా! కశ్యపపుత్ర! దుర్లభము లీ యర్థంబు లె వ్వారికిఁ
బు న్నె వ్వారలుఁ గోర రీ వరములఁ మోదించితి న్నీ యెడఁ
నన్నుఁ గోరినవెల్ల నిచ్చితిఁ బ్రవీణత్వంబుతో బుద్ధి సం
పన్నత్వంబున నుండుమీ! సుమతి వై భద్రికశీలుండ వై. 92

వ. అని యిట్లమోఘంబు లైన వరంబు లిచ్చి, దితినందనుచేతం బూజితుం డై యరవింద సంభవుండు బృందారక సందోహ వంద్యమానుం డగుచు, నిజమందిరం బునకుం జనియె. ఇ ట్విధంబున నిలింపారాతి వరపరంపరల సంపాదించుకొని. 93

క. సోదరుఁ జంపిన పగకై, యాదర మించుకయు లేక యసురేంద్రుఁడు కం
జోదరు పై వైరము దు, ర్మాదరతుం డగుచుఁ జేసె మనుజాధీశా! 94

సీ. ఒకనాఁడు గంధర్వ యూథంబుఁ బరిమార్చు దివిజుల నొకనాఁడు దెరలఁ దోలు
భుజగుల నొకనాఁడు భోగంబులకుఁ బాపు గ్రహముల నొకనాఁడు గట్టివైచు
నొకనాఁడు యక్షుల నుగ్రత దండించు నొకనాఁడు విహగుల నొడిసిపట్టు
నొకనాఁడు సిద్ధుల నోడించి బంధించు మనుజుల నొకనాఁడు మదము లడఁచు

తే. కడిమి నొకనాఁడు కిన్నర ఖచర సాధ్య
చారణ ప్రేత భూత పిశాచ వన్య
సత్త్వ విద్యాధరాదుల సంహరించి
దితితనూజుండు దుస్సహ తేజుఁ డగుచు. 95

క. [1]అట్టళ్ళతోడఁ గోటలు, కట్టలుకం గూలఁ ద్రోచి క్రవ్యాదులతోఁ
జుట్టువిడిసి దిక్పాలుర, [2]పట్టణములు గొనియె నతఁడు బలమున నధిపా! 96

క. కృశ లై సంప్రాపిత దు, ర్దశ లై సర్వంకషోగ్ర లై తేయాజ్ఞా
వశ లై నిశలును దినములు, దిశ లెల్లను గట్టువడియె దీనత ననఘా! 97

వ. మఱియు, నద్దానవేంద్రుండు విద్రుమ [3]సోపానంబులును, మరకతమణిమయ ప్రదేశంబులును, వైడూర్య రత్న స్తంభసముదయంబులును, చంద్రికాసన్నిభ

---

1. అట్టములతోడ(ట) 2. పట్టణములు చూరగొనియె బలమున నధిపా(క) 3. సొపానంబులును(హ)

స్ఫటికసంఘటిత కుడ్యంబులును, బద్మరాగపీఠ కనకకవాట గేహళీ విటంక వాతాయనంబులును, విలంబమాన ముక్తాఫలదామవితాన శోభిత ధవళ పర్యంకంబులును, వివిధ విచిత్ర విమానంబులును, నిరంతర సురభి కుసుమ ఫల భరిత పాదప మహోద్యానంబులును, హేమారవింద సౌగంధిక బంధుర సరో వరంబులును, రమణీయ రత్న ప్రాసాద విశేషంబులును, మనోహర పరిమళ శీతల మందమారుతంబులును, మృదు మధుర నినద కీర కోకిలకుల కోలాహలం బులునుఁ గలిగి, విశ్వకర్మనిర్మితం బై, త్రైలోక్య రాజ్యలక్ష్మీ శోభితం బైన మహేంద్రభవనంబు సొచ్చి. 98

మ. దితిపుత్రుండు జగత్త్రయైక విభుఁ డై దేవేంద్ర సింహాసనో
ద్ధతుఁ డై యుండ [1]హరాచ్యుతాంబుజభవుల్ దప్పంగ భీతిఁ సమా
గతు లై తక్కిన యక్ష కిన్నర మరు ద్గంధర్వ సిద్ధాదు లా
నతు లై కానుక లిచ్చి [2]కొల్తు రతనిన్ నానా ప్రకారంబులఁ. 99

శా. ఏ దిక్పాలురఁ జూచి నేఁ డలుగునో? యే దేవు బంధించునో?
యే దిగ్భాగముమీఁద దాఁడి చనునో? యే ప్రాణులం జంపునో?
యీ దై త్యేశ్వరుఁ డంచు నొండొరులు దా రింద్రాదు లాస్థానభూ
వేదిఁ మెల్లన నిక్కి చూతురు భయావిర్భూత రోమాంచు లై. 100

సీ. కోలాహలము మాని కొలువుఁడు సురలార! [3]తలఁగి దీవింపుఁడు తపసులార!
ఫణ లెత్తకుఁడు నిక్కి పన్న గేంద్రములార! ప్రణతు లై చనుఁడు దిక్పాలురార!
గానంబు సేయుఁడు గంధర్వవరులార! సందడిఁ [4]బడకుఁడు సాధ్యులార!
ఆడుఁడు నృత్యంబు లప్సరోజనులార! [5]చేరిక మ్రొక్కుఁడు సిద్ధులార!

తే. శుద్ధ కర్పూర వాసిత సురభి మధుర
భవ్య నూతన మై రేయ పానజనిత
సుఖవిలీనత నమరారి సొక్కినాఁడు
శాంతి లేదంద్రు నిచ్చలుఁ జారు లధిప! 101

శా. లీలోద్యాన లతాంనివాసములలో లీలావతీ యుక్తుఁ డై
హాలాపాన వివర్ధమాన మద లోలావృత్త తామ్రాక్షుఁ డై
కేళిం [7]దేలఁగ నేను తుంబురుఁడు సంగీత ప్రసంగంబులఁ
[8]వాలాయంబు గరంగఁజేయుదుము దేవద్వేషి నుర్వీశ్వరా! 102

---

1. సరోరుహాసనభవుల్ (క) 2. కొల్చి (చ) 3. తవిలి (బ) 4. బలుకుఁడు (హ. క. బ.)
5. చేరక (హ); చెదరక (జ) 6. వితానములలో (క. జ.) 7. జేయఁగ (హ) 8. వాలాయించి (క.బ)

క. యాగములు బుధులు ధరణీ, భాగములం జేయుచుండఁ బఱతెంచి హవి
ర్భాగములు దాన కైకొనుఁ, [1]జాగింపఁడు దైత్యుఁ డమరసంఘంబునకున్.103

సీ. సకల మహాద్వీప సహిత విశ్వంభరా స్థలిని దున్నక పండు సస్యచయము
కామధేన్వాదుల కరణి నర్థులు గోరు కోర్కులు గగనంబు గురియుచుండు
వననిధు లేడును వాహినీ [2]సందోహ ములును వీచుల రత్నములు వహించు
నుర్వీరుహంబులు [3]నొక్కకాలంబున నఖిలర్తు గుణముల నతిశయిల్లు

తే. నంబుసంపూరిత ద్రోణు లగుచు నొప్పు
పర్వతంబులు సకల దిక్పాల వివిధ
గుణము లెల్లను దానె కైకొనుచు దైత్య
విభుఁడు త్రైలోక్యరాజ్య సంవృద్ధి [4]నుండ. 104

వ. ఇట్లు సకలదిక్కులు నిర్జించి, లోకైక నాయకుం డై, తన యిచ్ఛాప్రకారంబున నింద్రియసుఖంబు లనుభవింపుచుం, దనియక శాస్త్రమార్గంబు నతిక్రమించి, విరించి వరజనిత దుర్వార గర్వాతిరేకంబున సురవైరి యైశ్వర్యవంతుం డై పెద్దకాలంబు రాజ్యంబు సేయునెడ. 105

ఉ. ఎన్నఁడు మాకు దిక్కు గల? దెన్నఁడు దైత్యుని బాధ మాను? మే
మెన్నఁడు వృద్ధిఁ బొందఁగల? మెవ్వఁడు రక్షకుఁ? డంచు దేవతా
కిన్నర సిద్ధ సాధ్య ముని ఖేచరనాయకు లాశ్రయించి రా
పన్నగతల్పు భూరి భవబంధ విమోచనుఁ బద్మలోచనున్. 106

వ. ఇట్లు దానవేంద్రుని యుగ్రదండంబునకు వెఱచి, యనన్య శరణ్యు లై రవా
స్యంబున నందఱుం గూడికొని. 107

ఉ. ఎక్కడ నున్నవాఁడు? జగదీశ్వరుఁ డాత్మమయుండు మాధవుం,
[5]డెక్కడి కేఁగి శాంతులు మునీశులు భిక్షులు రారు? గ్రమ్మఱన్
[6]దిక్కుల కెల్ల నెక్కుడు తుదిం జొర దిక్కగు నట్టి దిక్కుకున్
మ్రొక్కెద మేము హస్తయుగముల్ ముకుళించి మదీయ రక్షకున్. 108

వ. అని మఱియు, నాహారనిద్రలు మాని, చిత్తంబులు పరాయత్తంబులు గానీక సమాహిత బుద్ధు లై భగవంతుండును, మహాపురుషుండును, మహాత్ముండును, విశుద్ధ జ్ఞానానందమయుండును నైన హృషీకేశునకు నమస్కరించుచున్నయెడ,

---

1. సాగింపడు (క.ట.త.జ.డ.బ.) చాగింపఁడు (హ) 2. సంఘాత (జ. ద. బ) 3. నురుల తాజాలంబు (తం) 4. నొంది (హ) 5. ఎక్కడికేఁగె (హ) 6. దిక్కులనెల్ల నెక్కడ (హ)

మేఘురవసమాన గంభీరనినదంబున దిశలు ప్రేాయించుచు, సాధులకు నభయంబు
గావింపుచు, దృశ్యమానుండునుం గాక పరమేశ్వరుం డైన హరి యిట్లనియె.

మ. భయముం జెందకుఁ[1]డయ్య! నిర్జరవరుల్ భద్రంబు మీ కయ్యెడిఁ
జయముఁ లాభము భూతసంతతికి మ త్సందర్శన ప్రాప్తి న
వ్యయ మై చేరు నెఱుంగుదుఁ దితిసుత వ్యాపార భాషావిప
ర్యయముం గాలము గూడఁ జంపెదఁ జనుం డంచాఁక మీ ప్రోవలఁ. 110

ఆ. శుద్ధ సాధులందు సురలందు శ్రుతులందు
గోవులందు విప్రకోటియందు
[2]ధర్మపదవియందుఁ దలిగి నాయందు వాఁ
డెన్నఁ డలుగు నాఁడె హింసఁ జెందు. 111

క. కన్నకొడుకు శమ దమ సం, పన్నుని నిరై్వరుఁ డనక ప్రహ్లాదుని వాఁ
డెన్నఁడు రోషంబున నా, పన్నత నొందించు నాఁడె పట్టి వధింతుఁ. 112

శా. వేధోదత్త వర[3]ప్రసాద గరిమఁ వీఁ డింతనాఁ డై మిముం
[4]బాధం బెట్టుచునున్న వాఁ డని మదిఁ భావింతు భావించి నే
సాధింపం దటికాదు కావునఁ గడుఁ సైరించితిఁ మీఁదటఁ
సాధింతుఁ సురలార! [5]నేఁడు సనుఁడా! శంకింప మీ కేటికిఁ? 113

వ. అని యిట్లు దనుజమర్దనుండు నిర్దేశించిన, నిలింపులు గుంపులుగొని ప్రేమొక్కి,
రక్కసుండు [6]ప్రక్కుట నిక్కం బని తమతమ దిక్కులం జనిరి. హిరణ్యకశిపునకు
విచిత్రచరిత్రులు నలువురు పుత్రు లుద్భవించిరి. అందు. 114

—: ప్రహ్లాద చరిత్ర :—

సీ. తనయందు నఖిలభూతములందు నొకభంగి సమహితత్వంబున జరుగువాఁడు
పెద్దలఁ బొడగన్న భృత్యునికై వడి చేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డం బైన మాతృభావన సేసి మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను దీనులఁ గావఁ జింతించువాఁడు

తే. [7]సములయెడ సోదరస్థితి [8]జరుపువాఁడు
దైవతములంచు గురువులఁ దలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు
లలిత మర్యాదుఁ డైన ప్రహ్లాదుఁ డధిప! 115

---

1. రయ్య (క. బ.) 2. తప్పి (ట) 3. ప్రభావ (క) 4. బాధం జేయుచు (హ); బాధల్ పెట్టుచు-అనియుండనగును 5. మీరు సనుడా (క. త.) 6. ప్రగ్గుట (హ) 7. సఖుల (హ) 8. జరుగువాడు (క. చ. ట. డ.); సలుపువాడు (బ)

వ. మఱియును. 116

సీ. ఆకార జన్మ విద్యార్థ [1]వరిష్ఠుఁ డై గర్వ సంస్తంభ సంగతుఁడు గాఁడు
వివిధ మహానేక విషయసంపన్నుఁ డై పంచేంద్రియములచేఁ బట్టువడఁడు
భవ్య వయో బల ప్రాభవోపేతుఁ డై కామ రోషాదులఁ గ్రందుకొనఁడు
కామినీప్రముఖ భోగము లెన్ని గలిగిన వ్యసనసంసక్తి నా వంకఁ బోఁడు

ఆ. విశ్వమందుఁ గన్న విన్న యర్థములందు
వస్తుదృష్టిఁ జేసి వాంఛ యిడఁడు
ధరణినాథ! దైత్యతనయుండు హరిపర
తంత్రుఁ డై హతాన్యతంత్రుఁ డగుచు. 117

ఆ. సద్గుణంబు లెల్ల సంఘంబు లై వచ్చి
యసురరాజ తనయునందు నిలిచి
పాసి చనవు విష్ణుఁ బాయనివిధమున
[2]నెమ్మి దగిలియుండు నిర్మలాత్మ! 118

మ. పగవా రైన సురేంద్రులుఁ సభలలోఁ బ్రహ్లాదసంకాశులఁ
సుగుణోపేతుల నెందు మే మెఱుఁగ మంచున్ వృత్తబంధంబులఁ
బొగడం జొత్తురు సత్కవీంద్రులక్రియఁ భూనాథ! మీబోఁటి స
ద్భగవద్భక్తులు దైత్యరాజ తనయుఁ బాటించి కీర్తింపరే! 119

క. గుణనిధి యగు ప్రహ్లాదుని, గుణము లనేకములు గలవు గురుకాలమునఁ
గణుతింప నళక్యంబులు, ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిఁ. 120

వ. ఇట్లు సద్గుణగరిష్ఠుం డైన ప్రహ్లాదుండు భగవంతుం డైన వాసుదేవునియందు
సహజ సంవర్ధమాన నిరంతర ధ్యాన రతుం డై. 121

సీ. శ్రీవల్లభుఁడు దన్నుఁ [3]జేరిన య ట్లైన చెలికాండ్ర నెవ్వరిఁ జేర మఱచు
నసురారి దనమ్రమోల నాడిన[4] య ట్లైన నసురబాలురతోడ నాడ మఱచు
భక్తవత్సలుఁడు సంభాషించి న ట్లైన పరభాషలకు [5]మాఱుపలుక మఱచు
సురవంద్యుఁ దనలోనఁ జూచినో య ట్లైనఁ జొక్కి సమస్తంబు జూడ మఱచు

---

1. విశిష్టుడై (చ. త. జ. ద.) గరిష్ఠుడై (ట. డ.)
2. నెపుడు (హ) నిండి తగిలియుండు (చ. జ. డ.) నెందు దగిలియుండు (ట. ద. బ.) నేఁడు గలిగియుండు (తం), నేఁడు దగిలియుండు (వా) 3. జేరిన యెట్లైన (హ) యెట్లైన (హ)
4. మారుబలుక వెఱచు (హ) 5. యెట్లైన (హ)

తే. హరి పదాంభోజయుగ చింతనామృతమున
నంతరంగంబు నిండిన ట్లైన నతఁడు
నిత్య పరిపూర్ణుఁ డగుచు నన్నియును మఱచి
జడత లేకయు నుండును జడునిభంగి. 122

శా. పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషింపుచున్ హాస లీ
లా నిద్రాదులు సేయుచుఁ దిరుగుచున్ లక్ష్మింపుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం
ధానుం డై మఱచెన్ సురారిసుతుఁ డేత ద్విశ్వమున్ భూవరా! 123

సీ. వైకుంఠ చింతావివర్జిత [1]చేష్టుఁ డై యొక్కఁడు [2]నేడుచు నొక్కచోట
నక్షాంత హరిభావ నారూఢచిత్తుఁ డై యుద్ధతుఁ డై పాడు నొక్కచోట
విష్ణుఁ డింతియ కాని వేఱొండు లేదని యొత్తిలి నగుచుండు నొక్కచోట
నళినాక్షుఁ డను నిధానముఁగంటి [3]నేఁ డని యుబ్బి గంతులు వైచు నొక్కచోటఁ

ఆ. బలుకు నొక్కచోటఁ బరమేశుఁ గేశవుఁ
బ్రణయ హర్ష జనిత బాష్పసలిల
మిళిత పులకుఁ డై నిమీలిత నేత్రుఁ డై
యొక్కచోట [4]నిలిచి యూరకుండు. 124

వ. ఇట్లు పూర్వజన్మ పరమభాగవత సంసర్గ సమాగతం బైన ముకుంద చరణారవింద సేవాతిరేకంబున నఖర్వ నిర్వాణభావంబు విస్తరింపుచు, నప్పటప్పటికి దుర్జన సంసర్గ నిమిత్తంబునం దన చిత్తం బన్యాయత్తంబు గానీక నిజాయత్తంబు సేయుచు, నప్రమత్తుండును, సంసార నివృత్తుండును, బుధజన విధేయుండును, మహాభాగధేయుండును, సుగుణ మణిగణ గరిష్ఠుండును, బరమ భాగవతశ్రేష్ఠుండును, గర్మబంధలతా లవిత్రుండును, *(బవిత్రుండును నైన పుత్రునియందు విరోధించి, సురవిరోధి యనుకంప లేక చంపం బంపె. అని పలికిన నారదునకు ధర్మజుం డిట్లనియె. 125

శా. పుత్రుల్ నేర్చిన నేరకున్న జనకుల్ పోషింతు రెల్లప్పుడున్
మిత్రత్వంబున బుద్ధి నెప్పి దురితోన్మేషంబు వారింతు రే
శత్రుత్వంబుఁ దలంప [5]రెట్టియెడ నా సౌజన్య రత్నాకరున్
బుత్రున్ లోకపవిత్రుఁ దండ్రి [6]నెగులుం బొందింప నె ట్లోర్చెనో! 126

---

1. స్వాంతుఁడై (డ) 2. నాఁడును (హ) 3. నేనని (హ. తం. వా.) 4. నగుచు (హ)
* తా. ప. ప్రతులలోలేదు. 5. రిట్టియెడ (వా) 6. మిగులం బాధింప (హ)

ఉ. బాలుఁ బ్రభావిశాలు హరి పాఁదయారుహ చింతనక్రియా
లోలుఁ గృపాళు సాధు గురు లోక [1]పదానత ఫాలు నిర్మల
శ్రీలు సమస్త సభ్య నుతశీలు విఖండిత మోహవల్లికా
జాలు నదేల తండ్రి వడిఁ జంపగఁ బంపె ? మునీంద్ర ! సెప్పవే. 127

అధ్యాయము - ౫

వ. అనిన నారదుం డి ట్లనియె. 128

శా. లభ్యం బైన సురాధిరాజపదము౯ లఘింపఁ డశ్రాంతము౯
సభ్యత్వంబున నున్నవాఁ డబలుఁ డై జాడ్యంబుతో వీఁడు వి
ద్యాభ్యాసంబునఁ గాని తీవ్రమతి గాఁడంచు౯ విచారించి దై
త్యేభ్యం డొక్కదినంబునం బ్రియసుతు౯ వీఘించి సోత్కంఠుఁ డై. 129

క. చదువనివాఁ డజ్ఞుం డగుఁ, జదివిన స దస ద్వివేక చతురత గలుగుం
జదువఁగ వలయును జనులకుఁ, జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ. 130

వ. అని పలికి, యసురలోక పురోహితుండును (భగవంతుండును నగు) శుక్రా
చార్య కొడుకులఁ బ్రచండవితర్కు లైన చండామర్కుల రావించి, సత్కరించి
యి ట్లనియె. 131

శా. అంధ [3]ప్రక్రియ నుండు రాఁడు పలుకం డస్మ త్ప్రతాపక్రియా
గంధం బించుక లేదు మీరు గురువుల్ కారుణ్యచిత్తుల్ మనో
బంధుల్ మాన్యులు మాకుఁ బెద్దలు మముం బాటించి యీబాలకున్
గ్రంథంబుల్ చదివించి నీతికుశలుం గాఁ జేసి రక్షింపరే ! 132

వ అని పలికి, వారలకుం బ్రహ్లాదు నప్పగించి, తోడ్కొనిపొం డనిన, వారును
దనుజరాజ కుమారునిం గొనిపోయి, యతనికి సమానవయస్కులగు సహాధ్యాయుల
నసురకుమారులం గొందఱం గూర్చి. 133

ఉ. అంచిత భక్తితోడ దనుజాధిపు గేహసమీపముం బ్రవే
శించి సురారిరాజసుతుఁ జేకొని శుక్రకుమారకుల్ పఠిం
పించిరి పాఠయోగ్యములు పెక్కులు శాస్త్రము లా కుమారుఁ డా
లించి పఠించె నన్నియుఁ జలింపని వైష్ణవభక్తిపూర్ణుఁ డై. 134

క. ఏ పగిది వారు సెప్పిన, నా పగిదిం [4]జదువు గాని యట్టి ట్టని యా
త్మోపింపఁడు తా నన్నియు, రూపించిన మిథ్య లని నిరూఢ మనీష౯. 135

---

1. వదానితఫాలు (హ); వదానతజాలు (క) 2. సురారిరాజపదము౯ (హ) 3. ప్రక్రియ నున్నవాఁడు (తం. వా.) 4. చెప్పు (హ)

శా. అంతం గొన్నిదినంబు లేఁగిన సురేంద్రారాతి శంకాన్వితస్వాంతుం డై నిజనందనుం గురువు లే జాడం బఱింపించిరో ?భ్రాంతుం డేమి పఱించెనో ? పిలిచి సంభాషించి విద్యాపరిశ్రాంతిం జూచెదఁ గాక నేఁ డని మహా సౌంధాంత రాసీనుఁ డై. 136

ఉ. మోదముతోడ దైత్యకులముఖ్యుఁడు రమ్మని చీరఁబంచె ప్రహ్లాదకుమారకున్ భవ మహార్ణవ తారకుఁ గామ రోష లోభాది విరోధివర్గ పరిహారకుఁ గేశవ చింతనామృ తాస్వాద కఠోరకున్ గలుషజాల మహోగ్రవనీ కుఠారకున్. 137

వ. ఇట్లు చారులచేత నాహూయమానుం డై ప్రహ్లాదుండు సనుదెంచిన. 138

శా. ఉత్సాహ ప్రభు మంత్రశక్తి యుత మై యుద్యోగ మారూఢ సంవి త్సంపన్నుఁడ వై తివే ? చదివితే వేదంబులున్ శాస్త్రములో ?వత్సా ! రమ్మని చేరఁ జీరి కొడుకున్ వాత్సల్య సంపూర్ణుఁ డై యుత్సంగాగ్రముఁ జేర్చి దానవవిభుం డుత్కంఠ దీపింపఁగన్. 139

క. అనుదిన సంతోషణములు, జనిత శ్రమ తాప దుఃఖ సంశోషణముల్తనయుల సంభాషణములు, జనకులకుం గర్ణయుగళ సద్భూషణముల్. 140

వ. అని మఱియుఁ బుత్రా ! నీకు నెయ్యది భద్రం బై యున్నది ? చెప్పు మనినఁ గన్న తండ్రికిఁ బ్రియనందనుం డి ట్లనియె. 141

చ. ఎల్ల శరీరధారులకు నిల్లను చీఁకటి నూతి లోపలంద్రెళ్ళక వీరు నే మను మతిభ్రమణంబున భిన్న లై ప్రవర్తిల్లక సర్వము న్నతని దివ్యకళామయ మంచు విష్ణునందుల్లముఁ జేర్చి తా రడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ ! 142

వ. అని కుమారుం డాడిన ప్రతిపక్షానురూపంబు లై న సల్లాపంబులు విని, దానవేంద్రుండు నగుచు ని ట్లనియె. 143

క. ఎ ట్లాడిన న ట్లాడుదు, రిట్టి ట్టని [2]పలుక నెఱుఁగ రితరుల శిశువుల్దట్టించి యెవ్వ [3]రేనియుఁ, బట్టించిరొ ? బాలకునకుఁ బరపక్షంబుల్. 144

శా. నాకుం జూడఁగఁ జోద్య మయ్యెడుఁగదా ! నా తండ్రి యీబుద్ధి దానీకున్ లోపలఁ దోఁచెనో ? పరులు దుర్మంత్రుల్ పఠింపించిరో ?యేకాంతంబున భార్గవుల్ పలికిరో ? యీ దానవశ్రేణికిన్వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్ణింప నీ కేటికిన్ ? 145

---

1. మేపారగా (క) 2. మాఱుపలుక నెఱుగరు శిశువుల్ (క) 3. రేమని (క. చ. తం. వా.)

మ. సురలం దోలుటయో ! సురాధిపతులన్ బ్రుక్కించుటో ! సిద్ధులం
బరివేధించుటయో ! మునిప్రవరులన్ బాధించుటో ! యక్ష కి
న్నర గంధర్వ విహంగ నాగపతుల న్నాళంబు నొందించుటో !
హరి యంచున్ గిరి యంచు నేల చెడ ? మోహాంధుండ వై పుత్రకా ! 146

వ. అనినఁ దండ్రిమాటలకుఁ బురోహితు నిరీక్షించి, ప్రహ్లాదుం డి ట్లనియె. మోహ
నిర్మూలనంబు సేసి, యెవ్వనియందుఁ దత్పరు లైన యెట్టుక గల పురుషులకుఁ
బరులు దా రనియెడు మాయాకృతం బైన యస ద్గ్రాహ్యంబు గానంబడ
దట్టి పరమేశ్వరునకు నమస్కరించెద. 147

శా. అజ్ఞుల్ గొందఱు మేము దా మనుచు మాయం జెంది సర్వాత్మకుం
బ్రజ్ఞాలభ్య వరాన్వయ క్రమములన్ భాషింపఁగా నేర రా
జిజ్ఞాసా పథమందు మూఢులు గదా ! చింతింప బ్రహ్మాది వే
దజ్ఞుల్ త త్పరమాత్మ విష్ణు నితరుల్ దర్శింపఁగా నేర్తురే ? 148

తే. ఇను మయస్కాంతసన్నిధి నెట్లు భ్రాంత
మగు హృషీకేశుసన్నిధి నా విధమునఁ
గరఁగుచున్నది దైవయోగమునఁ జేసి
బ్రాహ్మణోత్తమ ! చిత్తంబు భ్రాంత మగుచు. 149

సీ. మందార మకరంద మాధుర్యమునఁ దేలు మధుపంబు వోవునే ? మదనములకు
నిర్మల మందాకినీ వీచికలఁ దూఁగు రాయంచ సనునె తరంగిణులకు
లలిత రసాలపల్లవ భాది యై చొక్కు కోయిల నేరునే ? కుటజములకుఁ
బూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక మరుగునే ? సాంద్ర నీహారములకు

తే. అంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృత పానవిశేష మత్త
చిత్త మేరీతి [1]నితరంబుఁ జేరనేర్చు
వినుతగుణశీల ! మాటలు వేయునేల ? 150

వ. అనిన విని రోషించి, రాజసేవకుం డైన పురోహితుండు ప్రహ్లాదుం జూచి,
తిరస్కరించి యి ట్లనియె. 151

ఉ. పంచశర ద్వయస్కుఁడవు బాలుఁడ వించుక గాని లేవు భా
షించెదు తర్కవాక్యములఁ జెప్పిన శాస్త్రములోని యర్థ మె
క్కించుక యైనఁ జెప్ప వసుధేంద్రుని ముందట మాకు నౌదలల్
వంచుకొనంగఁ జేసితివి వైరి విభూషణ ! వంశదూషణా ! 152

---

1. నితరుల (హ)

చ. తనయుఁడు గాఁడు శాత్రవుఁడు దానవభ ర్తకు వీఁడు దైత్య చం
దనవనమందుఁ గంటకయుత ఖితిజాతముభంగిఁ బుట్టినాఁ
డనవరతంబు రాఁకసకులాంతకుఁ బ్రస్తుతి సేయుచుండు దం
డనమునఁ గాని శిక్షలకు డాయఁడు పట్టుఁడు కొట్టుఁ డుద్ధతిఁ. 153

క. నీ పాపనిఁ జదివించెద, నీ పాదము లాన యింక నిపుణతతోడం
గోపింతుము దండింతుము, కోపింపకుమయ్య ! దనుజకుంజర వింఁకే ! 154

వ. అని మఱియు, నా రాచపాపనికి వివిధోపాయంబులం బురోహితుండు వెఱపుఁ
జూపుచు రాజసన్నిధిం బాపి, తోడుకొని పోయి యేకాంతంబున. 155

క. భార్గవనందనుఁ డతనికి, మార్గము నెడకుండఁ బెక్కుమాఱులు నిచ్చల్
వర్గ త్రితయముఁ జెప్పె న,నర్గళ మగు మతివిశేష మమర నరేంద్రా ! 156

వ. మఱియు, గురుండు శిష్యునకు సామ దాన భేద దండోపాయంబు లన్నియు
నెఱింగించి, నీతికోవిదుం డయ్యె ననిన నమ్మి నిశ్చయించి, తల్లికి నెఱింగించి,
తల్లి చేత నలంకృతుం డైన కులదీపకు నవలోకించి. 157

ఉ. త్రిప్పకు మన్న మా మతము దీర్ఘము లైన త్రివర్గపాఠముల్
దప్పకు మన్న ! నేఁడు మన దైత్యవరేణ్యుని ప్రేమ నేము ము
న్ను చెప్పినరీతి గాని మఱి నెప్పకు మన్న ! విరోధి [1]నీతులఁ,
విప్పకు మన్న ! దుష్ట మగు విష్ణుచరిత్ర కథార్థ జాలముల్. 158

వ. అని బుజ్జగించి, దానవేంద్రుని సన్నిధికిం దోడి తెచ్చిన. 159

సీ. అడు గడ్డునకు మాధ వానుచింతన సుధామాధుర్యమున మేను మఱచువాని
నంభోజగర్భాదు లభ్యసింపఁగలేని హరిభ క్తి పుంభావ మైనవాని
మాతృగర్భముఁ జొచ్చి మన్నది మొదలుగాఁ జిత్త మచ్యుతుమీఁదఁ జేర్చువాని
నంకించి తనలోన నఖిల ప్రపంచంబు శ్రీవిష్ణుమయ మని చెలఁగువాని

తే. వినయ కారుణ్య [2]బుద్ధివివేక లక్ష
ణాది గుణముల కాటప ట్టయిన వాని
శిష్య బుధలోక సంభావ్యుఁ జేరి గురుఁడు
ముందటికి ద్రొబ్బి తండ్రికి ప్రొక్కు మనుచు. 160

క. శిక్షించితి మన్యము లగు, పక్షంబులు మాని నీతిపారగుఁ డయ్యెఁ
రక్షోవం శాధీశ్వర !, వీక్షింపుము నీ కుమారు విద్యాబలమున్. 161

---

1. శాస్త్రముల్ (హ) 2. శీల (డ)

వ. అని పలికిన, శుక్రకుమారకు వచనంబు లాకర్ణించి, దానవేంద్రుండు దనకు దండ ప్రణామంబు చేసి నిలుచున్న కొడుకును దీవించి, బాహుదండంబులు సాఁచి, దిగ్గనం డగ్గఱం దిగిచి, పెద్ద తడవు గాఢాలింగనంబు సేసి, తన తొడ మీఁద నిడుకొని, చుంచు దువ్వి, చుబుకంబు పుణికి, చెక్కిలి ముద్దుగొని, శిరంబు మూర్కొని, ప్రేమాతిరేక సంజనిత బాష్పబిందు సందోహంబుల నతని వదనారవిందంబుఁ దడపుచు, మందమధురాలాపంబుల నిట్లనియె. 162

శా. చోద్యం బయ్యెడు నింతకాల మరిగెన్ శోధించి యే మేమి సం
[1]వేద్యాంశంబులు సెప్పిరో? గురువు లే వెంటం బఠింపించిరో?
విద్యాసార మెఱుంగఁ గోరెద భవ ద్విజ్ఞాత శాస్త్రంబులోఁ
బద్యం బొక్కటి చెప్పి సార్థముగఁ దాత్పర్యంబు భాషింపుమా! 163

శా. నిన్నుఁ మెచ్చరు నీతిపాఠమహిమ [2]న్నీతోడి ద్వైత్యార్భకుల్
గన్నా రన్నియుఁ జెప్ప నేర్తురుగదా! గ్రంథార్థముల్ దఱు వై
యన్నా! యెన్నఁడు నీవు [3]నీతిమతి వౌ దంచుఁ మహోవాంఛతో
నున్నాఁడ న్ననుఁ గన్నతండ్రి! [4]భవదీ యోత్కర్షముం జూపవే! 164

వ. అనినం గన్నతండ్రికిఁ బ్రియనందనుం డైన ప్రహ్లాదుం డిట్లనియె. 165

క. చదివించిరి నను గురువులు, సదివితి ధర్మార్థముఖర శాస్త్రంబులు నేఁ
జదివినవి గలవు పెక్కులు, చదువులలో మర్మ మెల్లఁ జదివితిఁ దండ్రీ! 166

మ. [5]తను హ్యా ద్భాషల సఖ్యముఁ శ్రవణముఁ దాసత్వముఁ వందనా
ర్చనముల్ సేవయు ‡నాత్మలో నెఱుకయుఁ [6]సంకీర్తనల్ చింతనం
బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్ముఁ హరి న్నమ్మి స
జ్జనుఁ డై యుండుట భద్రమంచుఁ దలఁతుఁ సత్యంబు దైత్యోత్తమా! 167

శా. అం ధేం దూదయముల్ మహోబధిర శంఖారావముల్ మూక స
ద్గ్రింథాఖ్యాపనముల్ నపుంసక వధూకాంతుల్ కృతఘ్నావళీ
బంధుత్వంబులు భస్మ హవ్యములు లుబ్ధ ద్రవ్యముల్ క్రోడ [7]స
ద్గ్రంథంబుల్ హరిభక్తి వర్జితుల రిక్త వ్యర్థ సంసారముల్. 168

---

1. వేద్యార్థంబులు (డ) 2. నీతోటి (హ) 3. నీతినిధి వౌదంచున్ (జ.డ.ద.) నీతివిదుడౌ దంచుఁ (బ. తం. వా.) 4. భవదీయోత్కర్ష తఁ (హ) 5. వాగ్భాషల (హ.త.జ.డ.ద.) 6. సత్కీర్తియుఁ (హ) 7. సద్గ్రంథంబుల్ (హ) † "ఆత్మ నివేదనమ్" అని మూలము(5-23)

సీ. కమలాతు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వా జిహ్వా
సురరతుకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు మధువైరిఁ దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి

తే. దేవదేవునిఁ జింతించు దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు
[1]దండ్రి! హరిఁ జేరు మనియెడి తండ్రి తండ్రి. 169

సీ. కంజాతునకుఁ గాని కాయంబు కాయమే? పవన గుంభిత చర్మభస్త్రి గాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే? ధమధమ ధ్వనితోడి ధక్క గాక
హరిపూజనము లేని హస్తంబు హస్తమే? తరుశాఖ నిర్మిత దర్వి గాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే? తను కుడ్య జాల రంధ్రములు గాక

ఆ. చక్రిచింత లేని జన్మంబు జన్మమే?
తరళ సలిల బుద్బుదంబు గాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుఁడే?
పాదయుగము[2]తోడి పశువు గాక. 170

సీ. సంసారజీమూత సంఘంబు విచ్చునే? చక్రి దాస్యప్రభంజనము లేక
తాపత్ర యాభీల దావాగ్ను లాఱునే? విష్ణుసేవామృత వృష్టి లేక
సర్వంకషాఘౌఘ జలరాసు లింకునే? హరి మనీషా బడబాగ్ని లేక
ఘన విప ద్గాఢాంధకారంబు లణఁగునే? పద్మాతు నుతి రవిప్రభలు లేక

తే. నిరుప మాపునరావృత్తి నిష్కళంక
ముక్తినిధిఁ గానవచ్చునే? ముఖ్య మైన
శార్ఙ్గి కోదండ చింతనాంజనము లేక
తామరస గర్భునకు నైన దానవేంద్ర! 171

వ. అని యి ట్లివ్విధంబున వెఱపు మఱపు నెఱుంగక, యులుకు చెడి పలికెడు కొడుకు నుడువులు సెవులకు ములుకుల క్రియ నొదవినఁ, [3]బెదవు లదరం గదురుచు, నదరి పడి, గురుసుతునిం గనుంగొని, విమత కథనంబులు గఱపినాఁడ వని దానవేంద్రుం డి ట్లనియె. 172

---

1. తగిలి హరిజేరు (ట) 2. తోటి (హ) 3. కటము లదరఁ బెదవులం గఱచుచు (హ. వా) పెదవు లదరం బదరుచు (ట. త.) పెదవు లదుర కనలుచు నదరిపడి (డ)

చ. పటుతర నీతిశాస్త్రచయ పారగుఁ జేసెద నంచు బాలు నీ
వటు గొనిపోయి వానికి ననర్థము లైన విరోధి శాస్త్రముల్
కుటిలతఁ జెప్పినాఁడవు భృగుప్రవరుండ వటంచు సమ్మితిన్
గటకట! బ్రాహ్మణాకృతివి గాక యథార్థపు బ్రాహ్మణుండవే? 173

క. ధర్మేతర వర్తనులును, [1]దుర్మంత్రులు నైన జనుల దురితము లొందున్
మర్మములు గలఁచి కల్మష, కర్మల రోగములు వొందుకై వడి విప్రా! 174

వ. అనిన రాజునకుం బురోహితుం డిట్లనియె. 175

ఉ. తప్పులు లేవు మావలన దానవనాథ! విరోధిశాస్త్రముల్
సెప్పము క్రూరు లై పరులు సెప్పరు మీ చరణంబు లాన సు
మ్మెప్పుడు మీ కుమారునకు నింతయు నైజమనీష; యెవ్వరుం
జెప్పెడిపాటి గాదు ప్రతిచింతఁ దలంపుము నేర్పు కైవడిఁ. 176

క. మిత్రులము పురోహితులము, పాత్రుల మే మదియుఁ గాక భార్గవులము నీ
పుత్రుని నిటువలెఁ జేయఁగఁ, శత్రులమే? దైత్య జలధి చంద్రము వించే? 177

వ. అనినం గురునందనుం గోపింపక దైత్యవల్లభుండు గొడుకు నవలోకించి యి
ట్లనియె. 178

క. ఒజ్జలు సెప్పని యీ మతి, మ జ్జాతుఁడ వైన నీకు మఱి యెవ్వరిచే
నుజ్జాత మయ్యె బాలక!, త జ్జనులం బేరుకొనుము తగ నాత్మోలఁ. 179

వ. అనినఁ దండ్రికిఁ బ్రహ్లాదుం డిట్లనియె, 180

ఉ. అచ్చపుఁ జీఁకటిం బడి గృహవ్రతు లై విషయ [2]ప్రవిష్టు లై
చచ్చుచుఁ బుట్టుచున్ మఱలఁ జర్వితచర్వణు లైనవారికిం
జెచ్చెరఁ బుట్టునే? పరులు సెప్పిన నైన నిజేచ్ఛ నైన నే
మిచ్చిన నైనఁ గానలకు నేఁగిన నైన హరిప్రబోధముల్. 181

ఉ. కాననివాని నూఁతగొని కాననివాఁడు [3]విశిష్ట వస్తువుల్
గాననిభంగిఁ గర్మములు గైకొని కొందఱు కర్మబద్ధు లై
కానరు విష్ణుఁ గొంద ఱటఁ గందు రకించన వైష్ణవాంఘ్రి సం
స్థాన రజోఽభిషిక్తు లగు సంహృతకర్ములు దానవేశ్వరా! 182

---

1. దుర్మైత్రులు (తం) 2. ప్రమత్తులై (హ. క. చ.) 3. నభీష్ట (హ)

శా. శోధింపంబడె సర్వశాస్త్రములు రఘోనాథ! వె య్యేటికిన్
గాథల్ మాధవశేముషీ తరణి సాంగత్యంబునం గాక దు
ర్మేధం దాఁటఁగ వచ్చునే? సుత వధూ మీనోగ్రవాంఛా మద
క్రోధోల్లోల విశాలసంసృతి మహా ఘోరామితాంభోనిధిన్. 183

వ. అని పలికిన కొడుకును ధిక్కరించి, మక్కువ సేయక, రక్కసులఁజేఁడు దన తొడలపై నుండనీక గొబ్బున దిగఁద్రొబ్బి, నిబ్బరం బగు కోపంబు దీపింప, వేఁడి చూపుల మింట మంట లెగయ, మంత్రులం జూచి యి ట్లనియె. 184

—: హిరణ్యకశిపుండు ప్రహ్లాదుని వివిధోపాయంబుల హింసించుట :—

శా. క్రోడం బై పినతండ్రిఁ జంపె నని తాఁ గ్రోధించి చిత్తంబులోఁ
వీడం జేయఁడు బంటుభంగి హరికిన్ విద్వేషికిన్ భక్తుఁ డై
యోడం డక్కట! ప్రాణవాయువులు వీఁ డొప్పించుచున్నాఁడు నా
తోడన్ వైరము[1]పట్టె నిట్టి జనకద్రోహిన్ [2]మహిన్ గంటిరే? 185

వ. అని రాక్షసవీరుల వీక్షించి యి ట్లనియె. 186

శా. పంచాబ్దంబులవాఁడు తండ్రి నగు నా పక్షంబు నిందించి య
త్యంచి ధృతియు లేక విష్ణు నహితుం గీర్తింపుచున్నాఁడు వ
ల్దంచుం జెప్పిన మానఁ డంగమునఁ బ్రాకారతన్ వ్యాధి జ
న్మించెన్ వీని వధించి రండు దనుజుల్ మీ మీ పటుత్వంబులన్. 187

శా. అంగవ్రాతములోఁ జికిత్సకుఁడు దుష్టాంగంబు ఖండించి శే
షాంగశ్రేణికి రక్ష సేయుక్రియ నీ యజ్ఞుం గులద్రోహి దు
స్సంగుం గేశవపక్షపాతి నధముం జంపించి వీరవ్రతో
త్తుంగఖ్యాతిఁ జరించెదన్ గులము నిర్దోషంబుఁ గావించెదన్. 188

క. హంతవ్యుఁడు రక్షింపను, మంతవ్యుఁడు గాఁడు యమునిమందిరమునకున్
గంతవ్యుఁడు వధమున కుప, రంతవ్యుం డనక చంపి రం డీ [3]పడుచున్. 189

వ. అని దానవేంద్రుం డానతిచ్చిన, వాఁడికోఱల రక్కసులు పెక్కండ్రు శూల హస్తు లై వక్త్రంబులు దెఱచికొని యుబ్బి బొబ్బలిడుచు, ధూమసహిత దావ దహనంబునుం బోలెఁ దామ్రసంకాశంబు లైన కేశంబులు మెఱయ, భేదన వాదన చ్ఛేదనంబులు సేయుచు. 190

---

1. చేసెనిట్టి (ట. ద.) 2. కనుంగొంటిరే (హ) 3. వటునిన్ (హ. క. చ. జ.)

చ. బాలుఁడు రాచబిడ్డఁడు కృపాళుఁడు సాధుఁడు లోకమాన్య సం
శీలుఁడు వీఁ డవధ్యుఁ డని చిక్కక ప్రక్కక క్రూరచిత్తు లై
శూలములం దదంగముల సుస్థిరు లై ప్రహరించి రుగ్ర వా
చాలత నందఱుఁ దివిజశత్రుఁడు వల్దనఁ డయ్యో భూవరా ! 191

చ. *పలువురు దానవుల్ పొడువ బాలునిదేహము లేశమాత్రము
న్నొలియదు లోపలఁ రుధిర ముబ్బదు కందదు శల్యసంఘము
న్నలియదు దృష్టివైభవము నష్టముగాదు ముఖేందుకాంతియుఁ
బొలియదు నూతనశ్రమము పుట్టదు [1]పట్టదు దీనభావముఁ. 192

ఉ. తన్ను నిశాచరుల్ వొడువ దైత్యకుమారుఁడు మాటిమాటి కో
పన్నగశాయి ! యో దనుజభంజన ! యో జగదీశ ! యో మహా
పన్న శరణ్య ! యో నిఖలపావన ! యంచు నుతించుఁ గాని తాఁ
గన్నుల నీరుదేఁడు భయకంప సమేతుఁడు గాఁడు భూవరా ! 193

ఉ. పాఱుఁడు లేచి దిక్కులకు బాహువు లొడ్డఁడు బంధురాజిలోఁ
దూఱుఁడు ఘోరకృత్య మని దూఱుఁడు తండ్రిని మిత్రవర్గముఁ
జీరఁడు మాతృసంఘము వసించు సువర్ణ గృహంబులోనికిఁ
దాఱుఁడు కావరే యనఁడు తాపము నొందఁడు [2]కంటగింపఁడుఁ. 194

వ. ఇట్లు సర్వాత్మకం బై యిట్టి దట్టి దని నిర్దేశింపరాని పరబ్రహ్మంబు దాన యై
య మ్మహావిష్ణుని యందుఁ జిత్తంబుఁ జేర్చి, తన్మయుం డై పరమానందంబునం
బొందియున్న ప్రహ్లాదునియందు రాక్షసేంద్రుండు దన కింకరులచేతం జేయింపు
చున్న మారణకర్మంబులు పాపకర్మునియందుఁ బ్రయుక్తంబు లైన సత్కా
రంబులుం బోలె విఫలంబు లగుటం జూచి. 195

ఉ. శూలముల న్నిశాచరులు ప్రక్కల దేహము నిగ్రహింపఁగా
బాలుఁడు నేలపైఁ బడఁడు పాఱుఁడు చావఁడు తండ్రి నైన నా
పాలికి వచ్చి చక్రధరుపక్షము మానితి నంచుఁ బాదముల్
ఫాలము సోఁక మ్రొక్కుఁ డనపాయత నొందుట కేమి హేతువో ? 196

వ. అని శంకింపుచు. 197

సీ. ఒకమాటు దిక్కుంభియూథంబుఁ దెప్పించి కెరలి [3]బాలకునిఁ ద్రొక్కింపఁ బంపు
నొకమాటు విషభీక రోరగశ్రేణులఁ గడువడి నర్భకుఁ గఱవఁ బంపు
నొకమాటు హేతిసం ఘోగ్రానలములోన విసరి కుమారుని వేయఁ బంపు
నొకమాటు గూలంక షోల్లోల జలధిలో మొత్తించి శాబకు ముంపఁ బంపు

★ ఈ పద్యమున క్రియాపద మొకటి యధికముగానున్నది.

1. మోమున (హ. క. చ. త. జ. డ. బ.) 2. కంటగింపఁగన్ (హ) 3. డింభకుని(ద.తం.వా.)

ఆ. విషము వెట్టఁ బంపు విదళింపఁగాఁ బంపు
దొడ్డకొండ చఱులఁ ద్రోయఁ బంపుఁ
బట్టి కట్టఁ బంపు [1]బాధింపఁగాఁ బంపు
బాలుఁ గినిసి దైత్యపాలుఁ డధిప! 198

సీ. ఒకవేళ నభిచార హోమంబు సేయించు నొకవేళ నెండల నుండఁ బంపు
నొకవేళ వానల నుపహతి నొందించు నొకవేళ రంధ్రంబు లుక్కఁ బట్టు
నొకవేళఁ దనమాయ నొదవించి బెగడించు నొకవేళ మంచున నొంటి నిలుపు
నొకవేళఁ బెనుగాలి కున్ముఖుఁ గావించు నొకవేళఁ బాఁతించు నుర్వియందు

తే. నీరు నన్నంబు నిడనీక నిగ్రహించుఁ
గళల నడిపించు ఱువ్వించు గండశిలల
గదల వ్రేయించు నేయించు ఘనశరములఁ
గొడుకు నొకవేళ నమరారి క్రోధి యగుచు. 199

వ. మఱియు ననేక మారణోపాయంబులఁ బాపరహితుం డైన పాపని రూపుమాప లేక యేకాంతంబున దురంత చింతాపరిశ్రాంతుం డై రాజేంద్రుండు దన మనంబున. 200

చ. ముంచితి వార్ధులం గదల మొత్తితి శైలతటంబులందుఁ ద్రో
బ్బించితి శస్త్రరాజిఁ బొడిపించితి మీఁద నిభేంద్రపంక్తిఁ ద్రో
క్కించితి ధిక్కరించితి శపించితి ఘోర దవాగ్నులందుఁ ద్రో
యించితిఁ బెక్కు [2]పాట్ల నలయించితిఁ జావఁ డి దేమి [2]చిత్రమో! 201

చ. ఎఱుఁగడు జీవనౌషధము లెవ్వరు భర్తలు లేరు బాధలఁ
దరలఁడు నైజతేజమునఁ దథ్యము జాడ్యము లేదు మిక్కిలిఁ
మెఱయుచునున్నవాఁ డొక నిమేషము దైన్యము నొందఁ డింక నే
తెఱఁగునఁ ద్రుంతు? వేసరితి దివ్యము వీని ప్రభావ మెట్టిదో! 202

వ. అదియునుం గాక తొల్లి ఘనశ్యేపుం డను మునికుమారుండు దండ్రిచేత యాగ పశుత్వంబునకు దత్తుం డై తండ్రి దనకు నపకారి యని తలంపక బ్రతికిన చందంబున. 203

క. ఆగ్రహమున నేఁ జేసిన, నిగ్రహములు పరులతోడ నెటి నొకనాఁడుఁ
విగ్రహము లనుచుఁ బలుకఁ డ, నుగ్రహములుగాఁ [3]దలంచునొవ్వఁడు మదిలోఁ.

---

1. బాధింపుఁడని (హ) 2. బాధ (హ.క.జ.) 3. హేతువో (ట) 4. స్మరించు(ట.డ.ద.తం.వా.)

వ. కావున వీఁడు మహా తపఃప్రభావ సంపన్నుండు. వీని కెందును భయంబు లేదు. వీనితోడి విరోధంబునం దనకు మృత్యువు సిద్ధించు. అని నిర్ణయించి, చిన్నఁ బోయి ఖిన్నుం డై ప్రసన్నుండు గాక క్రిందు సూచుచు విషణ్ణుం డై చింత నంబు సేయుచున్న రాజునకు మంతనంబునఁ జండామర్కు లి ట్లనిరి. 205

శా. శుభ్రఖ్యాతివి నీ [1]ప్రభావము మహాచోద్యంబు దై త్యేంద్ర! రో
షభ్రూయుగ్మ విజృంభణంబున దిగీశవ్రాతముఁ బోరులఁ
విభ్రాంతంబుగఁ జేసి యేలితి గదా! విశ్వంబు వీఁ డెంత! యీ
దభ్రోక్తుల్ గుణ దోష హేతువులు చింతం బొంద నీ కేటికిన్. 206

ఉ. వక్రుం డై న జనుండు వృద్ధ గురు సేవంజేసి మేధా నయో
పక్రాంతిఁ విలసిల్లు మీఁదట వయఃపాకంబుతో బాలకుఁ
శక్రద్వేషణ [2]బద్ధుఁ జేయుము మదిఁ జాలింపు మీ రోషముఁ
శుక్రాచార్యుఁడు వచ్చునంత కితఁడుఁ సుశ్రీయుతుం డయ్యెడుఁ. 207

వ. అని గురుపుత్రులు పలికిన, రాజశేశ్వరుండు గృహస్థులై న రాజులకు నుపదేశింపం దగిన ధర్మార్థ కామంబులు, ప్రహ్లాదునకు నుపదేశింపుం డని యనుజ్ఞ చేసిన, వారును నతనికిఁ ద్రివర్గంబు నుపదేశించిన, నతండును, రాగద్వేషంబుల చేత విషయాసక్తు లై న వారికి గ్రాహ్యంబు లై న ధర్మార్థ కామంబులు దనకు నగ్రాహ్యంబు లనియును, వ్యవహార ప్రసిద్ధికొఱ కై న భేదంబు గాని యాత్మ భేదంబు లే దనియు, ననర్థంబుల నర్థకల్పనంబు సేయుట దిగ్భ్రమం బనియును నిశ్చయించి, గురూపదిష్ట శాస్త్రంబు మంచి దని తలంపక, గురువులు దమతమ గృహస్థ [3]కర్మానుష్ఠానంబులకుం బోయిన సమయంబున. 208

క. ఆటలకుఁ దన్ను రమ్మని, పాటించి నిశాటసుతులు భాషించిన దో
షాటకులేంద్ర కుమారుఁడు, పాటవమున వారిఁ [4]జేరి ప్రజ్ఞాన్వితుఁ డై. 209

క. చెప్పఁ డొకచదువు మంచిది, చెప్పెడిఁ దగులములు చెవులు చిందఱఁ గొనఁగా
[5]నెప్పుడు మనయెడ నొజ్జలు, నెప్పెద నొక చదువు వినుఁడు చిత్తము లలరఁ.

వ. అని రాచకుమారుండు గావునఁ గరుణించి, సంగడికాండ్రతో నగియెడు చందం బునఁ గ్రీడలాడుచు, సమానవయస్కు లై న దైత్యకుమారుల కెల్ల నేకాంతం బున ని ట్లనియె.

---

1. ప్రతాపము (ట. త. తం. వా.) 2. బుద్ధు (హ.బ.) 3. కర్మానుసంధానము (ట. డ. ద.)
4. ఁజీరి (హ) 5. చెప్పెడు (హ. తం. క. బ.)

అధ్యాయము - ౬

ఉ. బాలకులార! రండు మన ప్రాయముబాలురు కొంద ఱుర్విలోఁ
గూలుట కంటిరే! గురుఁడు [1]క్రూరుఁ డనర్థచయంబునందు దు
శ్శీలత నర్థకల్పనముఁ [2]జేసెడి గ్రాహ్యము గాదు శాస్త్రముల్
మే లెఱిఁగించెదఁ వినిన మీకు నిరంతర భద్ర మయ్యెడిఁ. 212

వ. వినుండు. సకల జన్మంబులందును ధర్మార్థాచరణ కారణం బైన మానుషజన్మంబు దుర్లభంబు. అందుఁ బురుషత్వంబు దుర్గమంబు. అదియు శతవర్ష పరిమితం బైన జీవితకాలంబు నియతం బై యుండు. అందు సగ మంధకార బంధురం బై రాత్రిరూపంబున నిద్రాది వ్యవహారంబుల నిరర్థకం బై చను. చిక్కిన పంచాశ ద్వత్సరంబులందును [3]బాల్య కైశోర వయోవిశేషంబుల వింశతి హాయనంబులు గడచు. కడమ ముప్పది యబ్దంబులు నింద్రియంబులచేతఁ బట్టువడి, దురవగాహంబు లైన కామ క్రోధ లోభ మోహ మద మత్సరంబు లను పాశంబులఁ గట్టువడి, విడివడ సమర్థుండు గాక ప్రాణం బుల కంఱె మధురాయమాణ యైన తృష్ణకు లోనై భృత్య తస్కర వణి క్కర్మంబులఁ ప్రాణహాని యైన నంగీకరించి, [4]పరార్థంబుల నర్థింపుచు రహస్య సంభోగచాతుర్య సౌందర్య విశేషంబుల ధైర్యవల్లికా లవిత్రంబు లైన కళత్రంబులను, మహనీయ మంజుల మధురాలాపంబులు గల్గి, వశు లైన శిశువు లను, శీల వయో రూప ధన్య లగు కన్యలను, వినయ వివేక విద్యాలంకారు లైన కుమారులను, గామిత ఫలప్రదాత లగు భ్రాతలను, మమత్వ ప్రేమ దైన్య జనకు లైన జననీ జనకులను, సకల సౌజన్య సింధువు లైన బంధువులను, ధన కనక వస్తు వాహన సుందరంబు లైన మందిరంబులను, సుకరంబు లైన పశు భృత్య నికరంబులను, వంశ పరంపరాయత్తంబు లైన విత్తంబులను, వర్జింప లేక, సంసారంబు నిర్జింప నుపాయంబుఁ గానక, తంతువర్గంబున నిర్గమద్వార శూన్యం బై న మందిరంబుఁ జేరి, చిక్కువడి, వెడలెడి పాటవంబు సాలక, తగులు వడు కీటకంబు చందంబున, గృహస్థుండు స్వయంకృత కర్మబద్ధుం డై, శిశ్నోద రాది సుఖంబులఁ భ్రమత్తుం డై, నిజ కుటుంబ పోషణ పారవశ్యంబున విరక్తి మార్గంబు దెలియనేరక, స్వకీయ పరకీయ భిన్న భావంబున నంధకారంబునం బ్రవే శించు. కావునఁ గౌమార సమయంబున మనీషాగరిష్ఠుం డై, పరమ భాగవత ధర్మం బనుష్ఠింప వలయు. దుఃఖంబులు వాంఛితంబులు గాక చేకుఱు భంగిని

---

1. క్రూరుఁడు నర్థచయంబునందు (హ) 2. జెప్పెడి (హ) 3. బాల్యయౌవన కౌమార కైశోర వయో విశేషంబుల (హ) 4. పదార్థంబుల నార్జింపుచు (ట. త.)

సుఖంబులును గాలానుసారంబు లై లబ్ధంబు లగు. కావున వృథా ప్రయాసం బున నాయుర్వ్యయంబు సేయం దగదు. హరి భజనంబున మోక్షంబు సిద్ధించు. విష్ణుండు సర్వభూతంబులకు నాత్మేశ్వరుండు. ప్రియుండు. ముముక్షుం డగు దేహికి దేహావసాన పర్యంతంబు నారాయణ చరణారవింద సేవనంబు కర్తవ్యంబు.

సీ. కంటిరే మనవారు ఘనులు గృహస్థు లై విఫలులై కైకొన్న వెట్టితనము
భద్రార్థుడై యుండి పాయరు సంసార పద్ధతి నూరక పట్టువడిరి
కలయోనులం దెల్ల గర్భ ద్వ్యవస్థలఁ బురుషుండు దేహియై పుట్టుచుండుఁ
ద న్నెఱుంగఁడు కర్మతంత్రుఁ డై కడపల ముట్టఁడు భవశతములకు నైన

ఆ. దీన శుభము లేదు దివ్యకీర్తియు లేదు
జగతిఁ బుట్టి పుట్టి చచ్చి చచ్చి
పొరల నేల మనకుఁ బుట్టని చావని
త్రోవ వెదకి కొనుట దొడ్డ బుద్ధి. 214

శా. హాలాపాన విజృంభమాణ మద[1] గర్వారూఢ దేహోల్లస
ద్బాలాలోకన శృంఖలానిచయ సంబద్ధాత్ముఁ డై లేశమున్
వేలా నిస్సరణంబు గానక మహావిద్వాంసుఁడున్ గామినీ
హేలాకృష్ట కురంగశాబక మగున్ హీనస్థితిన్ వింటిరే. 215

ఆ. విషయ సక్తు లైన వివిధాహితుల తోడి
మనికి వలదు ముక్తిమార్గ వాంఛ
నాదిదేవు విష్ణు నాశ్రయింపుఁడు ముక్త
సంగజనులఁ గూడి శ్రేయమున. 216

వ. కావున విషయంబులఁ జిక్కువడిన రక్కసులకు హరిభజనంబు శక్యంబు గాదు. రమ్య మయ్యును, బహుతర ప్రయాసగమ్య మని తలంచితి రేనిఁ జెప్పెద వినుము. సర్వ భూతాత్మకుం డై, సర్వ దిక్కాల సిద్ధుం డైన బ్రహ్మ కడపలగాఁ గొని చరాచర స్థూల సూక్ష్మ జీవసంఘంబు లందును, అంభో వాయు కుంభినీ గగన తేజంబు లనియెడు మహాభూతంబులందును, భూతవికారంబు లైన ఘట పటాదు లందును, గుణసామ్యం బైన ప్రధానమందును, గుణవ్యతికరంబైన మహత్తత్త్వాది యందును, రజ స్సత్త్వ తమోగుణంబుల యందును, భగవంతుం డవ్యయుం డీశ్వరుండు పరమాత్మ పరబ్రహ్మ మనియెడు వాచక శబ్దంబులుంగల్గి కేవలానుభ వానంద స్వరూపకుండు, నవికల్పితుండు, ననిర్దేశ్యుండు నైన పరమేశ్వరుండు

---

1. గర్వాతీత (హ. తం. వా.)

త్రిగుణాత్మకం బైన తన దివ్యమాయచేత నంతర్హి తైశ్వర్యుం డై, వ్యాప్య వ్యాపక రూపంబులం జేసి దృశ్యుండును, ద్రష్టయు, భోగ్యుండును, భోక్తయు నై నిర్దేశింపం దగి, వికల్పితుం డై యుండు. త త్కారణంబున నాసుర భావంబు విడిచి, సర్వభూతంబులందును దయా సుహృ ద్భావంబులు కర్తవ్యం బులు. [1]దయా సుహృద్భావంబులు గలిగిన నథోక్షజుండు సంతసించు. అనంతుం డాద్యుండు, హరి సంతసించిన నలభ్యం బెయ్యదియు లేదు. జనార్దన చరణ సరసీరుహాయుగళ స్మరణ సుధారసపాన పరవశుల మైతిమేని మనకు దైవవశం బున నకాంక్షితంబులై సిద్ధించు, ధర్మార్థ కామంబులును, గాంక్షితం బై సిద్ధించు మోక్షం బన నేలను? త్రివర్గంబును, నాత్మవిద్యయుం, దర్క, దండనీతి, జీవి కాదు లన్నియును, త్రైగుణ్య విషయంబు లైన వేదంబులవలనం బ్రతిపాద్యం బులు. నిస్త్రైగుణ్య లక్షణంబునం బరమపురుషుం డైన హరికి నాత్మ సమర్ప ణంబు సేయుట మేలు. పరమాత్మ తత్త్వ జ్ఞానోదయంబునం జేసి స్వ పర భ్రాంతిఁ జేయక పురుషుండు యోగావధూతత్వంబున నాత్మవికల్ప భేదంబునం గలలోఁ గన్న విశేషంబుల భంగిఁ దథ్యం బనక మిథ్య యని తలంచు. అని మఱియుఁ బ్రహ్లాదుం డిట్లనియె. 217

మ. నరుఁడుం దానును మైత్రితో [2]మెలఁగుచో నారాయణుం డింతయున్
వరుస న్నారద సంయమీశ్వరునకున్ వ్యాఖ్యానముం జేసె ము
హరిభక్తాంఘ్రి పరాగ శుద్ధతను లేకాంతుల్ మహాకించనుల్
పరతత్త్వజ్ఞులుగాని నేరరు మది భావింప నీ జ్ఞానము. 218

వ. తొల్లి నేను దివ్యదృష్టి గల నారదమహాముని వలన సవిశేషం బైన యీ జ్ఞానం బున బరమ భాగవత ధర్మంబును వింటి. అనిన వెఱఁగుపడి, దైత్య బాలకు లద్దనుజరాజ కుమారున కిట్లనిరి. 219

ఉ. మంటిమి కూడి భార్గవ కుమారకు లొద్ద ననేకశాస్త్రముల్
వింటిమి లేఁడు సద్గురుఁడు వేలొకఁ డెన్నఁడు రాజశాల ము
క్కంటికి నైన రాడు సొరఁగా వెలికిం జనరాదు నీకు ని
ష్కంటక వృత్తి నెవ్వఁడు ప్రగల్భుఁడు నెవ్వె గుణాఢ్య! నెప్పుమా. 220

క. సేవింతుము ని న్నెప్పుడు, భావింతుము రాజ వనుచు బహుమానంబుల్
గావింతుము తెలియము నీ, కీ వింత మతిప్రకాశ మే క్రియఁ గలిగెన్. 221

---

1. దయగలిగిన (హ) 2. మెలగుచున్ (క. తం. వా.) 2. కుమారకునొద్ద (హ)

వ. అని యిట్లు దైత్యనందనులు దన్నడిగినఁ బరమభాగవత కులాలంకారుం డైన ప్రహ్లాదుండు నగి, తనకు పూర్వంబునందు వినంబడిన నారదు మాటలు దలంచి యిట్లనియె. 222

అధ్యాయము - ౮

శా. అతీ ణోగ్ర తపంబు మందరముపై నర్థించి మా తండ్రి శు
ద్ధశాంతిం జనియుండఁ జీమగమిచేతఁ భోగిచందంబునఁ
భక్షింపంబడెఁ బూర్వపాపములచేఁ బాపాత్మకుం డంచు ముఁ
రతుస్సంఘము మీఁద నిర్జరులు సంరంభించి యుద్ధార్థు లై. 223

శా. ప్రస్థానోచిత భేరి భాంకృతులతోఁ బాకారియుం దారు [1]శౌ
ర్య స్థైర్యంబుల నేఁగుదెంచినఁ దదీ యాటోప విభ్రాంతు లై
స్వస్థేమల్ దిగనాడి పుత్ర ధన యోషా మిత్ర సంప త్కళా
ప్రస్థానంబులు డించి పాటి రసురుల్ ప్రా ణావ నోద్యుక్తు లై. 224

మత్తకోకిల. ప్రహ్లదంబున వేల్పు లుద్ధతిఁ బాటి రాజనివాసముఁ
గొల్ల వెట్టి సమస్తవిత్తముఁ గ్రూరతం గొనిపోవఁగా
నిల్లు సొచ్చి విశంకుఁ డై యమకేళ్వరుం డదలించి మా
తల్లిఁ దాఁ జెఱవట్టె సిగ్గునఁ దప్త యై విలపింపఁగాఁ. 225

వ. ఇట్లు సురేంద్రుండు మా తల్లినిం జెఱగొని పోవుచుండ, నమ్మగుద కురరియను పులుఁగుక్రియ మొఱయిడినఁ, దెరువున దైవయోగంబున నారదుండు పొడగని యిట్లనియె. 226

ఉ. స్వర్భువనాధినాథ! సురసత్తమ! వేల్పులలోన మిక్కిలి
న్నిర్భర పుణ్యమూర్తివి సునీతివి మానినిఁ బట్టనేల యీ
గర్భిణి నాతురఁ విడువు కల్మషమానసురాలు గాదు నీ
దుర్భర రోషము న్నిలుపు దుర్జయుఁ డైన నిలింపవైరిపై. 227

వ. అనిన వేల్పుతపసికి [2]వేయుఁగన్నులతవర యిట్లనియె. 228

ఉ. అంతనిధాన మైన దివిజాధిపు వీర్యము దీని కుక్షి న
త్యంతసమృద్ధి నొందెడి మహాత్మక! గావునఁ దత్ప్రసూతిప
ర్యంతము బద్ధఁ జేసి జనితార్భకు వజ్రపుధారఁ ద్రుంచి ని
శ్చింతుఁడ నై తుదిఁ విడుతు సిద్ధము దానవరాజ వల్లభఁ. 229

---

1. శౌర్య స్థైర్యంబున (హ) 2. వేయిగన్నులుగల గరువ (త. తం)

వ. అని పలికిన వేల్పుఱేనికిఁ దపసి యి ట్లనియె. 230

శా. నిర్భీకుండు ప్రశస్త భాగవతుఁ[1]డు న్నిశ్వైర్వి జన్మాంత రా
విర్భా తాచ్యుత పాదభ క్తి మహి మావిష్టుండు దై త్యాంగనా
గర్భస్థుం డగు బాలకుండు బహు సంగ్రా మా ద్యుపాయంబులఁ
దుర్భావంబునఁ బొంది చావఁడు భవ ద్దోర్దర్ప [2]విభ్రాంతుఁ డై. 231

వ. అని దేవముని నిర్దేశించిన, నతని వచనంబులు మన్నించి, తానును హరిభక్తుండు గావున దేవేంద్రుండు భ క్తి[3]భావంబున మా యవ్వను విడిచి, వలగొని, సురలోకం బునకుం జనియె. మునీంద్రుండు మ జ్జననియందుఁ బుత్రికాభావంబు చేసి యూఱడించి, నిజాశ్రమంబునకుం గొనిపోయి, నీవు పతివ్రతవు. నీ యుద రంబునఁ బరమభాగవతుం డైన ప్రాణి యున్నవాఁడు. తపోమహా త్త్వంబునం గృతార్థుండై నీ పెనిమిటి రాఁగలండు. అందాఁక నీ విక్కడ నుండుము. అనిన సమ్మతించి. 232

శా. యోషారత్నము నాథదేవత విశాలోద్యోగ మా తల్లి ని
శ్వైషమ్యంబున నాథురాక మదిలో వాంఛించి నిర్దోష యై
యీష ద్ధృతియు లేక గర్భ పరిరక్షేచ్ఛన్ విచారించి శు
శ్రూషల్ సేయుచు నుండె నారదునకున్ సువ్యక్త శీలంబునన్. 233

వ. ఇట్లు దనకుఁ బరిచర్య చేయుచున్న దైత్యరాజకుటుంబినికి నాశ్రితరక్షా విశారదుం డైన నారదుండు నిజసామర్థ్యంబున నభయం బిచ్చి, గర్భస్థుం డైన నన్ను నుద్దేశించి, ధర్మతత్త్వంబును, నిర్మలజ్ఞానంబును నుపదేశించిన, న మ్ముద్ధియ దద్దయుం బెద్దకాలంబునాఁటి వినికియుం గావున, నాఁడుది యగుటంజేసి, పరి పాటి దప్పి సూటిలేక మఱచె. నారదుండు నాయెడఁ గృప గల నిమిత్తంబున.

క. వెల్లిగొని నాఁటనుండియు, నుల్లసితం బైన దైవయోగంబున శో
భిల్లెడు మునిమత మంతయు, నుల్లంబున మఱపు పుట్ట దొకనాఁ డైనన్. 235

ఆ. వినుఁడు నాదుపల్కు విశ్వసించితి రేని
సతుల కైన బాలజనుల కైనఁ
దెలియవచ్చు మేలు [4]దేహాద్యహంకార
దళన నిపుణ మైన తపసిమతము. 236

---

1. ఉన్నిద్రుండు (తం) 2. విక్రాంతుఁడై (హ) 3. బాంధవంబున (ట. త. జ. తం. వా)
4. దేహాద్యలంకార (చ. బ. హ. వా.)

వ. అని నారదోక్త ప్రకారంబున బాలకులకుఁ బ్రహ్లాదుం డిట్లనియె. ఈశ్వరమూర్తి యైన కాలంబునంజేసి వృక్షంబు గలుగుచుండ ఫలంబునకు జన్మ సంస్థాన వర్ధనాపక్షీణత్వ పరిపాక నాశంబులు ప్రాప్తంబు లైన తెఱంగున, దేహమునకుం గాని *(షడ్భావవికారంబు) లాత్మకు లేవు. ఆత్మ నిత్యుండు, వ్యయరహితుండు, శుద్ధుండు, క్షేత్రజ్ఞుండు, గగనాదులకు నాశ్రయుండు, క్రియాశూన్యుండు, స్వప్రకాశుండు, సృష్టిహేతువు, వ్యాపకుండు, నిస్సంగుండు, పరిపూర్ణుండు, నొక్కండు నని వివేకసమర్థంబులగు నాత్మలక్షణంబులు పండ్రెండు నెఱుంగుచు, దేహాదులందు మోహజనకంబు లగు నహంకార మమకారంబులు విడిచి, పసిండిగనులు గల నెలవున విభ్రాజమాన కనకలేశంబు లైన పాషాణాదులందుఁ బుటంబు వెట్టి, వహ్నియోగంబున గరంగ నూఁది, హేమకారకుండు పాటవంబున హాటకంబుఁ బడయుభంగి, నాత్మకృత కార్యకారణంబుల నెఱింగెడి నేర్పరి, దేహంబునం దాత్మసిద్ధికొఱకు నైన యుపాయంబునంజేసి బ్రహ్మభావంబుఁ బడయు. మూలప్రకృతియు, మహదహంకారంబులును, పంచతన్మాత్రంబులు నివి యెనిమిదియుం బ్రకృతు లనియును, రజస్సత్త్వ తమంబులు మూఁడును ప్రకృతిగుణంబు లనియును, గర్మేంద్రియంబు లైన వాక్పాణి పాద పాయూపస్థలును, జ్ఞానేంద్రియంబు లైన శ్రవణ నయన రసనాత్వ గ్ఘ్రాణంబులును, మనంబును, మహీ సలిల తేజో వాయు గగనంబులును నివి పదాఱును వికారంబు లనియును, గపిలాది పూర్వాచార్యులచేతం జెప్పంబడియె. సాక్షిత్వంబున నీ [1]యిరువదియేడింటిని నాత్మ గూడియుండు. పెక్కింటి కూటువ దేహము. అదియు జంగమ స్థావర రూపంబుల రెండువిధంబు లయ్యె. మూలప్రకృతి మొద లైన వర్గంబునకు వేఱై మణిగణంబులం జొచ్చియున్న సూత్రంబు చందంబున నాత్మ యిన్నింటియందునుం జొచ్చి దీపించు. ఆత్మకు జన్మ స్థితి లయంబులు గల వంచు మిథ్యాతత్పరులు గాక, వివేకశుద్ధ మైన మనంబున విచారించి, దేహంబునం దాత్మ వెతకవలయు. ఆత్మకు నవస్థలు గలయట్లుండుఁ గాని యవస్థలు లేవు. జాగరణ స్వప్న సుషుప్తు లను వృత్తులెవ్వనిచేత నెఱుంగంబడు, నతం డాత్మ యండ్రు. కుసుమధర్మంబు లైన గంధంబులచేత గంధాశ్రయుం డైన వాయువు నెఱింగెడుభంగి ద్విగుణాత్మకంబు లై కర్మజన్యంబు లైన బుద్ధిభేదంబుల నాత్మ నెఱుంగం దగు. అని చెప్పి.

సీ. సంసార మిది బుద్ధిసాధ్యము గుణకర్మ గణబద్ధ మజ్ఞాన కారణంబు
కలవంటి దింతియ కాని నిక్కము కాదు సర్వార్థములు మన స్సంభవములు

---

* తా. ప. ప్రతులలో లేదు. 1. యిరువది యేనింటిని (హ)

స్వప్న జాగరములు సమములు గుణశూన్యుఁ డగు పరమునికి గుణాశ్రయమున
భవవినాశంబులు పాటిల్లి నట్లుండుఁ బట్టిచూచిన లేవు బాలురార!

తే. కడఁగి త్రిగుణాత్మకము లైన కర్మములకు
జనక మై వచ్చు నజ్ఞాన సముదయమును
ఘనతర జ్ఞానవహ్నిచేఁ గాల్చిపుచ్చి
కర్మవిరహితు లై హరిఁ గనుట మేలు. 238

వ. అది గావున గురుశుశ్రూషయు, సర్వలాభ సమర్పణంబును, సాధుజన [1]సంగంబును నీశ్వరప్రతిమా సమారాధనంబును, హరికథా తత్పరత్వంబును, వాసుదేవుని యందలి ప్రేమయు, నారాయణ గుణ కర్మ (కథా) నామ కీర్తనంబును, వైకుంఠ చరణకమల ధ్యానంబును, విశ్వంభరమూర్తి విలోకన పూజనంబులును, మొద లైన విజ్ఞాన వైరాగ్య లాభసాధనంబు లైన భాగవతధర్మంబులపై రతి గలిగి, సర్వభూతంబులయందు నీశ్వరుండు భగవంతుం డాత్మ గలం డని సన్మానంబు సేయుచుఁ, గామ క్రోధ లోభ మోహ మద మత్సరంబుల గెలిచి, యింద్రియవర్గంబును బంధించి, భక్తి సేయుచుండ నీశ్వరుం డైన విష్ణుదేవుని యందుల గతి సిద్ధించు. 239

సీ. దనుజారి లీలావతారంబులందలి శౌర్యకర్మంబులు సద్గుణములు
విని భక్తుఁ డగువాఁడు వేడ్కతోఁ బులకించుఁ గన్నుల హర్షాశ్రుకణము లొలుక
గద్గదస్వరముతోఁ గమలాక్ష! వైకుంఠ! వరద! నారాయణ! వాసుదేవ!
యనుచు నొత్తిలి పాడు నాడు నాక్రోశించు నగుఁ జింతనముసేయు నతి యెనర్చు

తే. మరులుకొని యుండుఁ దనలోన మాటలాడు
వేల్పుసోఁకిన పురుషునివృత్తిఁ దిరుగు
బంధములు వాసి యజ్ఞానపటలిఁ గాల్చి
విష్ణుఁ బ్రాపించుఁ దుది భక్తివివశుఁ డగుచు. 240

వ. కావున రాగాదియుక్త మనస్కుం డైన శరీరికి సంసారచక్ర నివర్తకం బైన హరిచింతనంబు బ్రహ్మమందలి నిర్వాణసుఖ మని బుధులు దెలియుదురు. హరి భజనంబు దుర్గమంబు గాదు. హరి సకలప్రాణి హృదయంబులయందును నంతర్యామి యై యాకాశంబుభంగి నుండు. విషయార్జనంబుల నయ్యెడిది లేదు. నిమిషభంగుర ప్రాణు లైన మర్త్యులకు మమతాస్పదంబు లగు చంచలంబు లైన పుత్ర మిత్ర కళత్ర పశు భృత్య బల బంధు రాజ్య కోశ మణి మందిర

---

1. సంగమంబును (చ. బ)

మంత్రి మాతంగ మహీ ప్రముఖ విభవంబులు నిరర్థకంబులు. యాగప్రముఖ పుణ్యాలబ్ధంబు లైన స్వర్గాది లోకభోగంబులు పుణ్యానుభవ క్షీణంబులు గాని, నిత్యంబులు గావు. నరుండు విద్వాంసుండ నని యభిమానించి, కర్మంబు లాచరించి, యమోఘుంబు లైన విపరీతఫలంబుల నొందు. కర్మంబులు కోరక చేయవలయు. కోరి చేసిన దుఃఖంబులు ప్రాప్తించు. పురుషుండు దేహంబుకొఱకు భోగంబుల నపేక్షించు. దేహంబు నిత్యంబు గాదు. తోడరాదు. [2]మృతుం డైన వాని దేహమును శునకాదులు భక్షించు. దేహి కర్మంబు లాచరించి, కర్మబద్ధుం డై క్రమ్మఱుం గర్మానుకూలం బైన దేహంబుఁ దాల్చు. అజ్ఞానంబునం జేసి పురుషుండు కర్మదేహంబుల విస్తరించు. అజ్ఞానతంత్రంబులు ధర్మార్థకామంబులు. జ్ఞానలభ్యంబు మోక్షంబు. మోక్షప్రదాత యగు హరి సకల భూతంబులకు నాత్మేశ్వరుండు. ప్రియుండు. తనచేత నైన మహాభూతంబుల తోడ జీవసంజ్ఞితుం డై యుండు. నిష్కాము లై హృదయగతుం డైన హరిని నిజభక్తిని భజింపవలయు. 241

క. దానవ దైత్య భుజంగమ, మానవ గంధర్వ సుర సమాజములో ల
క్ష్మీనాథు చరణకమల, ధ్యానంబున నెవ్వఁ డైన ధన్యత నొందున్. 242

క. చిక్కఁడు వ్రతములఁ గ్రతువులఁ, జిక్కఁడు దానముల శౌచ శీల తపములన్
జిక్కఁడు [3]యుక్తిని భక్తినిఁ, జిక్కినక్రియ నచ్యుతుండు సిద్ధము సుండీ. 243

క. చాలదు భూదేవత్వము, చాలదు దేవత్వ మధిక శాంతత్వంబున్
చాలదు హరి మెప్పింప వి, శాలోద్యములార! భక్తి చాలినభంగిన్. 244

ఆ. దనుజ భుజగ యక్ష దైత్య మృగాభీర
సుందరీ విహంగ శూద్ర శబరు
లైనఁ బాపజీవు లైన ముక్తికిఁ బోదు
రఖిలజగము విష్ణుఁ డనుచుఁ దలఁచి. 245

క. గురువులు [4]తమకును లోఁబడు, తెరువులు నెప్పెదరు విష్ణు దివ్యపదవికిన్
దెరువులు నెప్పరు చీఁకటిఁ, బరువులు వెట్టంగనేల బాలకులారా! 246

[illegible] సకంబులు, నిం డాచార్యులకు మఱల నేకతమునకున్
[illegible]వారు కర్మపుంజము పాలై. 247

క. ఆడుదము మనము హరి రతిఁ, బాడుద మే ప్రొద్దు విష్ణు భద్రయశంబుల్
వీడుదము దనుజసంగతిఁ, గూడుదము ముకుంద[1]భక్తకోటిఁ సూటిఁ. 248

క. చిత్తము సంస్కృతిపటలము, ప్రవృత్తము కామాది వైరివర్గంబుల నేఁ
డిత్తము చిత్తము హరికినిఁ, జొత్తము నిర్వాణపదము శుభమగు మనకున్. 249

వ. అని యిట్లు ప్రహ్లాదుండు రహస్యంబున నయ్యా వేళల రాక్షసకుమారులకు నపవర్గమార్గంబు నెఱింగించిన, వారును గురుశిక్షితంబు లైన చదువులు సాలించి, నారాయణభక్తిఁ జిత్తంబులం గీలించియుండుటఁ జూచి, వారల యే కాంతభావంబుఁ దెలిసి, వెఱచి, వచ్చి, శుక్రాచార్య నందనుండు శక్రవైరికిట్లనియె. 250

అధ్యాయము - ఏ

శా. రక్షోబాలుర నెల్ల నీకొడుకు చేరం జీరి లోలోన నా
శిక్షామార్గము లెల్లఁ గల్ల లని యాక్షేపించి తా నందఱిఁ
మోక్షాయత్తులఁ జేసినాఁడు మనకున్ మోసంబు వాటిల్లె నీ
దక్షత్వంబునఁ జక్కఁజేయవలయున్ దైతేయవంశాగ్రణీ! 251

క. ఉల్లసిత విష్ణుకథనము, లెల్లప్పుడు మాకుఁ జెప్పఁ డీ గురుఁ డని న
న్నుల్లంఘించి కుమారకు, లొల్లరు చదువంగఁ దానవోత్తమ! వింటే. 252

క. ఉడుగఁడు మధురిపు కథనము, [1]విడివడి జడుపగిదిఁ దిరుగు వికసనమున నే
నొడివిన నొడువులు నొడువఁడు, దుడుకనిఁ జదివింప మాకు దుర్లభ మధిపా!

క. చొక్కపు రక్కసికులమున, [3]వెక్కురు జన్మించినాఁడు [4]పీతాంబరుని
న్నిక్కపు మక్కువఁ గొలిచెడి, నెక్కడి సుతుఁ గంటి రాక్షసేశ్వర! వెఱ్ఱీ.254

వ. అని యిట్లు గురుసుతుండు చెప్పిన కొడుకువలని విరోధవ్యవహారంబులు కర్ణ రంధ్రంబులందు ఖడ్గప్రహారంబు లై సోఁకిన బిట్టు మిట్టిపడి, పాదతాడితం బైన భుజంగంబుభంగిఁ బవనప్రేరితం బైన దవానలంబు చందంబున, దండితాడితం బైన కంఠీరవంబు కైవడి, భీషణ రోష రసావేశ జాజ్వల్యమాన చిత్తుండును, *(పుత్రసంహారోద్యోగ యుక్తుండును) గంపమాన గాత్రుండును, నరుణీకృత నేత్రుండును నై కొడుకును రప్పించి, సమ్మానకృత్యంబులు గా[illegible]
నై యశనిసంకాశ భాషణంబుల [illegible]

శా. సూనుఁ శాంతగుణ ప్రధాను నతి సంశుద్ధాంచిత జ్ఞాను న
జ్ఞా నారణ్య కృశాను నంజలిపుటీ సంభ్రాజమానుఁ సదా
శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృ తాస్వాదనా
ధీనుఁ ధిక్కరణంబుఁ జేసి పలికెం దేవాహితుం డుగ్రతఁ. 256

సీ. అస్మదీయం బగు నాదేశమునఁ గాని మిక్కిలి రవి మింట మెఱయ వెఱచు
నన్ని కాలములందు ననుకూలుఁ డై కాని [1]విద్వేషి యై గాలి వీవ వెఱచు
మత్ప్రతాపానల మందీకృతార్చి యై విచ్చలవిడి నగ్ని వెలుఁగ వెఱచు
నతి తీక్ష్ణ మైన నా యాజ్ఞ నుల్లంఘించి శమనుండు ప్రాణులఁ జంప వెఱచు

తే, నింద్రుఁ డాదల నాజ్ఞాల నెత్త వెఱచు
నమర కిన్నర గంధర్వ యక్ష విహగ
నాగ విద్యాధ రావళి నాకు వెఱచు
నేల వెఱవవు పలువ! నీ కేది దిక్కు. 257

శా. ప్రజ్ఞావంతులు లోకపాలకులు శుంభద్ద్వేషు లయ్యుఁ మదీ
యాజ్ఞాభంగము సేయ నోడుదురు రోషాపాంగ దృష్టిఁ వివే
క జ్ఞానచ్యుత మై జగత్త్రితయముం గంపించు నీ విట్టిచో
నాజ్ఞోల్లంఘన మెట్లు సేసితివి సాహంకారతఁ దుర్మతీ! 258

శా. కంఠక్షోభము గాఁగ నొత్తిలి మహాగాఢంబుగా డింభ! వై
కుంఠుం జెప్పెదు దుర్జయుం డనుచు వైకుంఠుండు వీరవ్రతో
త్కంఠాబంధురుఁ డేని నే నమరులఁ ఖండింప దండింపఁగాఁ
గుంఠీభూతుఁడు గాక రావలదె మద్ఘోరాహవ [1]శ్రేణికిఁ. 259

శా. ఆచార్యోక్తము మాని [4]బాలురకు మోక్షాసక్తిఁ బుట్టించి నీ
వాచాలత్వముఁ జూపి విష్ణు నహితున్ వర్ణించి మద్దైత్యవం
శాచారంబులు [5]నీఱు చేసితివి మూఢాత్ముం గులద్రోహి ని
న్నిచుం జంపుట మేలు చంపి కులము న్నిర్దోషముం జేసెదఁ. 260

క. దిక్కులు గెలిచితి నన్నయు, ది క్కెవ్వఁడు రోరి! నీకు దేవేంద్రాదుల్
దిక్కుల రాజులు వేఱొక, ది క్కెఱుఁగక కొలుతు రితఁడె దిక్కని నన్నున్. 261

క. బలవంతుఁడ నే జగముల, బలములతోఁ జనక వీరభావమున మహా
బలుల జయించితి నెవ్వని, బలమున నాడెదవు నాకుఁ బ్రతివీరుఁడ వై. 262

వ. అనినఁ దండ్రికి మెల్ల మెల్లన వినయంబుతోఁ గొడు కి ట్లనియె. 263

క. బలయుతులకు దుర్బలులకు, బల మెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకుఁ
బల మెవ్వఁడు ప్రాణులకును, బల మెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా! 264

---

1. విద్వేషమున (హ) 2. గంపింప (హ) 3. క్రీడకున్ (క) 4. కాక (త. తం. వా.)
5. నీరు చేసిన (చ)

క. దిక్కులు కాలముతో నే, దిక్కున లేకుండుఁ గలుగు దిక్కుల మొద లై
దిక్కు గల లేని వారికి, ది క్కెయ్యది యదియ నాకు దిక్కు మహాత్మా ! 265

సీ. కాలరూపంబులఁ [1]గల విశేషంబుల నలఘు గుణాశ్రయుం డై న విభుఁడు
సత్త్వ బలేంద్రియ సహజ ప్రభావాత్మఁ డై వినోదంబుల నఖిలజగముఁ
గల్పించు రక్షించు ఖండించు నవ్యయుం డన్ని రూపములందు నతఁడు గలఁడు
చిత్తంబు సమముగాఁ జేయుము మార్గంబు దప్పి వర్తించు చిత్తంబుకంటె

తే. వైరు లెవ్వరు ? చిత్తంబు వైరి గాక
చిత్తమును నీకు వశముగాఁ జేయవయ్య !
మదయు తాసురభావంబు మానవయ్య !
యయ్య ! నీ మ్రోల మే లాడరయ్య ! జనులు. 266

ఉ. లోకము లన్నియుఁ గడియలోన జయించినవాఁడ వింద్రియా
నీకముఁ జిత్తముం గెలువ నేరవు నిన్ను నిబద్ధుఁ జేయు నీ
భీకర శత్రు లార్వురఁ బ్రభిన్నులఁ జేసినఁ బ్రాణికోటిలో
నీకు విరోధి లేఁ డొకఁడు నేర్పునఁ జూడుము దానవేశ్వరా ! 267

క. పాలింపుము శేముషి ను,న్మూలింపుము కర్మబంధముల సమదృష్టిఁ
జాలింపుము సంసారముఁ, గీలింపుము హృదయమందుఁ గేశవభక్తిఁ. 268

వ. అనినఁ బరమ భాగవత శేఖరునకు దోషాచరశేఖరుం డి ట్లనియె. 269

క. చంపినఁ జచ్చెద ననుచును, గంపింపక యోరి [2]పలువ ! కఠినోక్తుల నఁ
గుంపించెదు చావునకుఁ, దెంపరి వై వదరు వాని తెఱఁగునఁ గుమతీ ! 270

శా. నాతోడం బ్రతిభాష లాడెదు జగన్నాథుండు నాకంటె నీ
భూతశ్రేణికి రాజు లే డొకఁడు సంపూర్ణ ప్రభావుండు మ
ద్భ్రాతం జంపిన మున్ను నే వెదకితిఁ బల్మాఱు నారాయణుం
డేత ద్విశ్వములోన లేఁడు మఱి వాఁ డెందుండురా దుర్మతీ ! 271

క. ఎక్కడఁ గలఁ డే క్రియ నే, [3]చక్కని వర్తించు నెట్టిజాడను వచ్చున్ !
జక్కడుతు నిన్ను విష్ణునిఁ, బెక్కులు ప్రేలెదవు వాని భృత్యునిపగిదిఁ. 272

వ. అనిన, హరికింకరుండు శంకింపక హర్ష పులకాంకుర సంకలిత విగ్రహుం డై
యాగ్రహంబు లేక హృదయంబునఁ గేశవునిం దలంచి, నమస్కరించి, బాల
వర్తనంబుల నర్తనంబులు సేయుచు ని ట్లనియె. 273

---

1. ఁగ్రమ (తం. వా.) 2. పడుచ (క. తం. వా.) 3. చక్కటి (తం. వా.)

మ. [1]కలఁ డంభోధిఁ గలండు గాలిఁ గలఁ డాకాశంబునం గుంభినిఁ
గలఁ డగ్నిఁ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలఁ
గలఁ డోంకారమునం ద్రిమూ ర్తులఁ ద్రిలింగ వ్యక్తు లం దంతటఁ
గలఁ డీశుండు గలండు దండ్రి! వెదకంగా నేల యీ యా యెడఁ. 274

క. ఇందుఁ గలఁ డందు లేఁ డని, సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెం దెందు వెదకి చూచిన, నం దందే గలఁడు దానవాగ్రణి! వింటే. 275

వ. అని యి ట్లిధంబున. 276

మ. హరి సర్వాకృతులం గలం డనుచుఁ బ్రహ్లాదుండు భాషింప స
త్వరుఁ డై యెందును లేఁడుఁ లేఁ డని సుతుం దైత్యుండు [2]తర్జింప శ్రీ
నరసింహాకృతి నుండె నచ్యుతుఁడు నానా జంగమ స్థావరో
త్కర గర్భంబుల నన్ని దేశముల నుద్దండ ప్రభావంబునఁ. 277

వ. అ య్యవసరంబున దానవేంద్రుండు. 278

క. డింభక! సర్వస్థలముల, నంభోరుహనేత్రుఁ డుండు నంచు మిగుల సం
రంభంబునఁ బలికెద వీ, స్తంభంబునఁ జూపఁగలవె చక్రిం గిక్రిఁ. 279

క. స్తంభమునఁ జూపవేనియుఁ, గుంభిని నీ శిరము ద్రుంచి కూల్పఁగ రభా
రంభమున వచ్చి హరి వి, స్రంభంబున నడ్డపడఁగ శక్తుం డగునే. 280

వ. అనిన [3]భక్తవత్సలుం డగు శ్రీహరి పరమభక్తుం డైన ప్రహ్లాదుం డి ట్లనియె.

శా. అంభోజాసనుఁ డాది గాఁగఁ దృణపర్యంతంబు విశ్వాత్మఁ డై
సంభావంబున నుండు ప్రౌఢ విపుల స్తంభంబులో నుండఁడే
స్తంభాంతర్గతుఁ డయ్యు నుండుటకు నే సందేహమున్ లేదు ని
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁ బ్రత్యక్ష స్వరూపంబునఁ. 282

వ. అనిన విని కరాళించి, ప్రగ్గన లేచి, గద్దియ డిగ్గ నుఱికి, యొఱ వెఱికిన ఖడ్గంబుఁ
గేల నమర్చి, జళిపించుచు, మహాభాగవతశిఖామణి యైన ప్రహ్లాదుని ధిక్కరింపుచు.

మ. వినరా! డింభక! మూఢచిత్త! [4]గరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెద వైన నిందుఁ గలఁడే యంచున్ మదోద్రేకి యై
దనుజేంద్రుం డఱచేత ప్రేసెను మహోదగ్ర ప్రభాశుంభమున్
జన దృగ్భీషణ దంభమున్ హరిజను స్సంరంభమున్ స్తంభమున్. 284

---

1. కలడంభో నిధులందు (క. చ.) 2. భర్జింప (క); దండింప (ద) 3. భక్తవత్సలుని భటుం డిట్లనియె (తం. వా.) 4. జడిమన్ (క)

—: శ్రీహరి నరసింహ రూపమున స్తంభంబునం దావిర్భవించుట :—

వ. ఇట్లు దానవేంద్రుండు పరిగృహ్యమాణ వైరుండును, వైరానుబంధ జాజ్వల్య మాన రోషానలుండును, రోషానల జంఘన్యమాన విజ్ఞానవినయుండును, వినయ గాంభీర్య ధైర్య జేగీయమాన హృదయుండును, హృదయ చాంచల్యమాన తామసుండును, తామసగుణ చంక్రమ్యమాణ స్థైర్యుండును నై, విస్రంభంబున హుంకరించి, బాలుని ధిక్కరించి, హరి నిందుఁ జూపుమని, కనక్కనక మణిమయ కంకణ క్రేంకార శబ్దపూర్వకంబుగా దిగ్దంతి దంత భేదన పాటవ ప్రశస్తం బగు హస్తంబున సభామండప స్తంభంబు వేసిన, వ్రేటుతోడన దశదిశలును మిణుఁగురులు సెదరుఁ జిటిలి, పెటిలి పడి, బంభజ్యమానం బగు న మ్మహాస్తంభంబు వలనఁ బ్రళయవేళా సంభూత సప్త స్కంధ బంధుర సమీరణ సంఘటిత జోఘుష్య మాణ మహా బలాహకవర్గ నిర్గత నిబిడ నిష్ఠుర దుస్సహ నిర్ఘాతసంఘ నిర్ఘోష నికాశంబు లైన ఛటచ్ఛట, స్ఫటస్ఫట ధ్వనిప్రముఖ భయంక రారావపుంజంబులు జంజన్యమానంబు లై యెగసి, యాకాశ కుహ రాంతరాళంబు నిరవకాశంబు సేసి నిండినం బట్టు చాలక, దోదూయమాన హృదయంబు లై పరవశంబు లైన పితామహా మహేంద్ర వరుణ వాయు శిఖి ప్రముఖ చరాచర జంతుజాలంబు లతోడ బ్రహ్మాండకటాహంబు పగిలి పరిస్ఫోటితంబుగాఁ, బ్రఫుల్ల పద్మయుగళ సంకాశ భాసుర చక్ర చాప హల కులిశాంకుశ జలచర రేఖాంకిత చారు చరణ తలుండును, చరణ చంక్రమణ ఘన వినమిత విశ్వ విశ్వంభరాభర ధారేయ దిక్కుంభి కుంభీనస కుంభినీధర కూర్మ కుల శేఖరుండును, దుగ్ధజలధి జాత శుండాల శుండాదండ మండిత ప్రకాండ ప్రచండ మహోరు స్తంభ యుగళుండును, ఘణఘణాయమాన మణికింకిణీగణ ముఖరిత మేఖలావలయ వలయిత పీతాంబర శోభిత కటిప్రదేశుండును, నిర్జర నిమ్నగావర్త వర్తుల కమలాకర గంభీర నాభీ వివరుండును, ముష్టిపరిమేయ వినుత తనుతర స్నిగ్ధ మధ్యుండును, కులాచల సానుభాగ సదృశ కర్కశ విశాల వక్షుండును, దుర్జన దనుజభట ధైర్యలతికా లవిత్రాయమాన, రజోరాజ వజోభాగ విశంకట క్షేత్ర విలేఖన [1]చుంచు లాంగలా యమాన, ప్రతాపజ్వలన జ్వాలాయమాన, శరణాగత నయనచకోర చంద్రరేఖా యమాన, వజ్రాయుధప్రతిమాన భాసమాన, నిశాత ఖరతర ముఖనఖరుండును, శంఖ చక్ర గదా కుంత తోమర ప్రముఖ నానాయుధ మహిత మహోత్తుంగ మహీధరశృంగసన్నిభ వీరసాగర వేలాయమాన, మాలికా విరాజమాన, నిరర్గ

---

1. చంగ (త. తం.)

ళానేకశత భుజార్గళుండును, మంజు మంజీర మణిపుంజ రంజిత మంజుల హార కేయూర కంకణ కిరీట మకరకుండలాది భూషణ భూషితుండును, ప్రతివళీయుత శిఖరి శిఖరాభ పరిణద్ధ బంధుర కంధరుండును, ప్రకంపన కంపిత పారిజాతపాదప పల్లవ ప్రతీకాళ కోపావేశ సంచలి తాధరుండును, శరత్కాల మేఘజాల మధ్యమ ధగద్ధగాయమాన తటిల్లతా సమాన దేదీప్యమాన దంష్ట్రాంకురుండును, కల్పాంత కాల సకలభువన గ్రసన విలసన విజృంభమాణ సప్తజిహ్వా జిహ్వా తులిత తరళత రాయమాణ విభ్రాజమాన జిహ్వుండును, మేరుమందర మహా గుహాంతరాళ విస్తార విపుల వక్త్ర నాసికా వివరుండును, నాసికావివర నిస్సర న్నిబిడ నిశ్శ్వాస నికర సంఘట్టన సంక్షోభిత సంతప్యమాన సప్త సాగరుండును, పూర్వపర్వత విద్యోత మాన ఖద్యోతమండలసదృశ సమంచిత లోచనుండును, లోచనాంచల సముత్కీర్య మాణ విలోల కీలాభీల విస్ఫులింగ వితాన రోరుధ్యమాన తారకా గ్రహ మండ లుండును, శక్ర చాప సురుచి రోదగ్ర మహా భ్రూలతాబంధ బంధుర భయంకర వదనుండును, ఘనతర గండశైల తుల్య కమనీయ గండభాగుండును, సంధ్యా రాగ రక్త ధారాధరమాలికా ప్రతిమ మహాభ్రంకష తంతన్యమాన పటుతర సటాజాలుండును, సటాజాల సంచాలన సంజాత వాత డోలాయమాన వైమా నిక విమానుండును, నిష్కంపిత శంఖ వర్ణ మహోర్ధ్వకర్ణుండును, మంథదండాయ మాన మందరవసుంధరాధర పరిభ్రమణ వేగ సముత్పద్యమాన వియన్మండల మండిత సుధారాశికల్లోల శీకరాకార భాసుర కేసరుండును, పర్వాఖర్వ శిశిర కిరణమయూఖ గౌర తనూరుహుండును, నిజ గర్జననినాద నిర్ధళిత కుముద సుప్రతీక వామ నైరావణ సార్వభౌమ ప్రముఖ దిగిభరాజ కర్ణకోటరుండును, ధవళ ధరాధర దీర్ఘ దురవలోకనీయ దేహుండును, దేహ ప్రభాపటల [1]నిర్మథ్య మాన పరిపంథియాతుధాన నికురుంబ గర్వాంధకారుండును, ప్రహ్లాద హిరణ్య కశిపు రంజన భంజన నిమి త్తాంతరంగ బహిరంగ జేగీయమాన కరుణా వీర రస సంయుతుండును, మహాప్రభావుండును నైన శ్రీనృసింహదేవుం డావిర్భవించినం గనుంగొని. 285

క. నరమూర్తి గాదు కేవల, హరిమూర్తియుఁ గాదు మానవాకారము కే
సరియాకారము నున్నది, హరి మాయారచిత మగు యథార్థము సూడఁ. 286

ఉ. తెంపున బాలుఁ డాడిన సుధీరత సర్వగతత్వముం బ్రతి
ష్ఠింపఁ దలంచి యిందు నరసింహశరీరము దాల్చి చక్రి శి
క్షింపఁగ వచ్చినాఁడు హరిచే మృతి యంచుఁ దలంతు నైన నా
సొంపునుఁ బెంపు నందఱును జూడఁ జరింతు హరింతు శత్రునిఁ. 287

---

1. సమ్మథ్యమాన (ద)

—: నరసింహమూర్తి హిరణ్యకశిపుని వధించుట :—

వ. అని మెత్తంబడని చిత్తంబున గద యెత్తికొని, తత్తఱంబున నార్చుచు నకుంఠిత కంఠీరవంబు డగ్గఱు గంధసింధురంబు చందంబున నక్తంచరకుంజరుండు నరసింహదేవుని కెదురు నడచి, తదీయ దివ్య తేజోజాల సన్నికర్షంబునం జేసి దవానలంబు డగ్గఱిన ఖద్యోతంబునుంబోలెఁ గర్తవ్యాకర్తవ్యంబులు దెలియక నిర్గత ప్రభుండై యుండె. అంత. 288

మ. ప్రకటం బై ప్రళయావసానమున ముఁ బ్రహ్మాండభాం డావరో
ధక మై యున్న తమిస్రముం జగము నుత్పాదించుచోఁ ద్రావి సా
త్త్విక తేజోనిధి యైన విష్ణునెడ నుద్దీపించునే నష్ట మై
వికలం బై చెడుఁ గాక తామసుల ప్రావీణ్యంబు రాజోత్తమా! 289

వ. అంత నద్దానవేంద్రుండు మహోద్దండం బగు గదాదండంబు గిరగిరఁ ద్రిప్పి, నరమృగేంద్రుని ప్రవేసిన, నతండు దర్పంబున సర్పంబు నొడిసిపట్టు సర్పపరిపంథి నేర్పున దితిపట్టిం బట్టికొనిన, మిట్టిపడి, దట్టించి, బిట్టు కట్టలుక న య్యసుర వరుండు దృఢబలంబున నిట్టట్టు [1]మిడిసి, పట్టుదప్పించుకొని, విడివడి, దిటవుతప్పక కుప్పించి, యుప్పరంబున కెగసి, వినతాంగకులరాజచరణ నిర్గళిత భుజంగంబు చందంబునఁ దలంగ నుటకి, తన భుజాటోపంబున [2]వరకంఠీరవుండు కుంఠితుండయ్యెడి నని తలంచి, కలంగక చెలంగుచుఁ,దన్ను నిబిడ నీరదనికరంబులు మాటున నిలింపులు గుంపులుగొని డాఁగి మూఁగి క్రమ్మఱ నాత్మీయ జీవనశంకాకళంకితు లై మంతనంబులఁ జింతనంబులు సేయుచు నిరీక్షింప, నక్షీణ సమరదక్షతా విశేషం బుపలక్షించి, ఖడ్గ వర్మంబులు ధరియించి, భూనభోభాగంబుల వివిధ విచిత్ర లంఘన లాఘవంబులఁ బరిభ్రమణభేదంబులఁ గరాళవదనుం డై యంతరాళంబున దిరుగు [3]సాళువడేగచందంబున సంచరించిన సహింపక. 290

సీ. పంచాన నోద్భూత పావక [4]జ్వాలల భూనభోంతర మెల్లఁ బూరితముగ
దంష్ట్రాంకు రాభీల ధగధగాయిత దీప్తి నసురేంద్రు నేత్రము లంధములుగఁ
గంటక [5]సన్ని భోత్కట కేసరాహతి, నభ్రసంఘము భిన్న మై చరింపఁ
బ్రళయాభ్ర చంచ లాప్రతిమ భాస్వరము లై ఖర నఖరోచులు గ్రమ్మదేర

తే. సటలు జళిపించి గర్జించి సంభ్రమించి
దృష్టి సారించి బొమలు బంధించి కెరలి
జిహ్వ యాడించి లంఘించి చేత నొడిసి
పట్టె నరసింహుఁ డా దితిపట్టి నధిప! 291

---

1. జడిసి (తం) 2. నరకంఠీరవుం డకుంఠితుం డయ్యె నని (హ)
3. సాళువపుడేగ (తం. వా.) 4. జ్వాలలు (హ. తం. వా.) 5. సన్నిభోత్కర (హ)

క. సరకుగొనక లీలాగతి, సురగేంద్రుఁడు మూషకంబు నొడిసినభంగిఁ
నరకేసరి దను నొడిసిన, సురవిమతుఁడు ప్రాణభీతి సుడివడియె నృపా ! 292

క. సురరాజవైరి లోఁబడెఁ, బరిభావిత సాధు భక్త పటలాంహనకుఁ
నరసింహనకు నుదంచ, త్వరతర [1]జిహ్వానకు నుగ్రతర రంహనకున్.

వ. అంత. 294

మ. విహగేంద్రుం డహి ప్రచ్ఛకైవడి మహోద్వృత్తి న్నృసింహుండు సా
గ్రహుఁ డై యూరువులందుఁ జేర్చి నఖసంఘాతంబులఁ ద్రెచ్చె దు
స్సహు దంభోళి కఠోర దేహు నచలోత్సాహున్ మహాబాహు నిం
ద్ర హుతా శాంతక భీకరున్ ఘనకరున్ దై త్యాన్వయ శ్రీకరున్. 295

శా. చించున్ హృత్కమలంబు శోణితము వర్షించుఁ ధరామండలిఁ
ద్రెంచుం గర్కశ నాడికావళులు భేదించున్ మహా వక్షమున్
ద్రుంచున్ మాంసము సూక్ష్మఖండములుగా దుష్టాసురున్ ద్రెచ్చి ద
ర్పించుం ద్రేవులు కంఠమాలికలు కల్పించు న్నఖోద్భాసి యై. 296

సీ. వక్షఃకవాటంబు ద్రక్కలుసేయుచో ఘన కుఠారంబుల కరణి నొప్పు
గంభీర హృదయపంకజము భేదించుచోఁ గుద్దాలముల భంగిఁ గొమరు మిగులు
ధమనీ వితానంబుఁ దగిలి ఖండించుచోఁ బటు లవిత్రంబుల పగిది మెఱయు
జఠర విశా లాంత్రజాలంబుఁ ద్రెంచుచోఁ ద్రగక చ సంఘంబుల గరిమఁ జూపు

తే. నంకగతుఁ డై న దైత్యుని నాగ్రహమున
శస్త్రచయముల నొంపక సంహరించి
యమరు నరసింహు నఖరంబు లతివిచిత్ర
సమర ముఖరంబు లై యుండె జనవరేణ్య ! 297

క. స్ఫురిత విబుధజన ముఖములు, పరివిదళిత దనుజ నివహపతి తను ముఖముల్
గురురుచి జిత శిఖిశిఖములు, నరహరి కరనఖము లమరు నతజన [2]సఖముల్ .298

వ. ఇట్లు కేవల పురుషరూపంబును మృగరూపంబునుం గాని నరసింహ రూపంబున
రేయునుం బగలునుం గాని సంధ్యాసమయంబున, నంతరంగంబును బహిరంగం
బును గాని సభాద్వారంబున, గగనంబును భూమియుం గాని యూరుమధ్యంబున,
ప్రాణసహితంబులును, ప్రాణరహితంబులును గాని నఖంబులం, ద్రిలోక్యజన
హృదయభల్లుం డై న దైత్య మల్లుని వధియించి, మహా దహన కీలాభీల దర్శ
నుండును, కరాళ వదనుండును, లేలిహాన భీషణ జిహ్వుండును, శోణితపంకాం

---

1. కుద్రగ ఘనరంహనకున్ (తం) 1. సుఖముల్ (చ)

కిత కేసరుండును నై ప్రేవులు కంఠమాలికలుగ ధరించి, కుంభికుంభ విదళనంబుఁ జేసి చనుదెంచు పంచాననంబునుం బోలె దనుజకుంజర హృదయకమల విదళనంబుం జేసి, తదీయరక్తసిక్తంబు లైన నఖంబులు సంధ్యారాగ రక్త చంద్రరేఖ చెలువు వహింప, సహింపలేక లేచి, తన కట్టెదుర నాయుధంబు లెత్తుకొని, తత్తఱంబున రణంబునకు నురవణించు రక్కసులం బెక్కు సహస్రంబులం జక్రాది నిర్వక్రసాధనంబుల నొక్కనిం జిక్కకుండం జక్కడిచె. ఇ వ్విధంబున. 299

శా. రక్షోవీరుల నెల్లఁ ద్రుంచి రణసంరంభంబు చాలించి దృ
ష్టి శేషంబు భయంకరంబుగ సభాసింహాస నారూఢుఁ డై
యక్షీణాగ్రహుఁ డై నృసింహుఁడు కరాళాస్యంబుతో నొప్పెఁ దన్
వీక్షింపం [1]బరికింప నోడి [2]యమరుల్ విభ్రాంతు లై డాఁగఁగన్. 300

క. సుర చారణ విద్యాధర, గరుడోరగ యక్ష సిద్ధ గణములలో నొ
క్కరుఁ డైన డాయ వెఱచును, నరహరి న య్యవసరమున నరలోకేశా! 301

క. తర్షంబుల నరసింహుని, హర్షంబులఁ జూచి నిర్జరాంగనలు మహో
త్కర్షంబులఁ గుసుమంబుల, వర్షంబులు గురిసి రుత్సవంబుల నధిపా! 302

వ. మఱియు, న య్యవసరంబున మింట ననేక దేవతావిమానంబులును, గంధర్వ గానంబులును, నప్సరోగణ నర్తనసంవిధానంబులును, దివ్య కాహళ భేరీ పటహ మురజాది ధ్వానంబులును, ప్రకాశమానంబు లయ్యె. సునంద కుముదాదు లైన హరి పార్శ్వచరులును, మహేశ్వర విరించి మహేంద్ర పురస్సరు లగు త్రిదశ కిన్నర కింపురుష పన్నగ సిద్ధ సాధ్య గరుడ గంధర్వ చారణ విద్యాధరాదులును (మునులును, మనులును) ప్రజాపతులును, నరకంఠీరవ దర్శనోత్కంఠితు లై చనుదెంచి. 303

—: బ్రహ్మాదిదేవతలు నృసింహమూర్తిని వేఱువేఱ స్తుతించుట :—

క. కర కమలయుగళ కీలిత, శిరు లై డగ్గఱిక భక్తిఁ జేసిరి బహు సం
సరణాబ్ధి తరికి నఖరికి, నరభోజనహస్తి హరికి నరకేసరికిన్. 304

వ. ఆ సమయమున దేవత లందఱు వేఱువేఱ వినుతించిరి. అందుఁ గమలాసనుం డిట్లనియె. 305

---

1. బరికింప (హ) 2. ఇతరుల్ (తం. వా.)

మ. ఘన లీలాగుణ చాతురిఁ భువనముల్ గల్పించి రక్షించి భే
దనముం జేయు దురంతశక్తికి ననంతజ్యోతికిఁ జిత్రవీ
ర్యునికి న్నిత్యపవిత్రకర్మునికి నే నుత్కంఠతో నవ్యయా
త్మునికిఁ వందన మాచరించెదఁ గృపాముఖ్య ప్రసాదార్థి నై. 306

వ. రుద్రుం డి ట్లనియె. 307

చ. అమరవరేణ్య! మీఁదట సహస్రయు గాంతము నాఁడు గాని కో
పమునకు వేళకాదు సుర[1]బాధకుఁ డైన తమస్వినీచరుఁ
సమరమునన్ వధించితివి చాలుఁ దదాత్మజుఁ డైన వీఁడు స
ద్వ్యమలుఁడు నీకు భక్తుఁడు పవిత్రుఁడు గావుము భక్తవత్సలా! 308

వ ఇంద్రుం డి ట్లనియె. 309

సీ. ప్రాణిసంఘముల హృత్పద్మ మధ్యంబుల నివసించి భాసిల్లు నీవ యెఱుఁగు
దింతకాలము దానవేశ్వరుచే బాధపడి చిక్కియున్న యాపన్నజనుల
రక్షించితివి మమ్ము [2]రాక్షసేశ్వరుఁ జంపి క్రతుహవ్యములు మాకుఁ గలిగె మఱల
మంటిమి నీసేవ మరగినవారలు కైవల్యవిభవంబు కాంక్షసేయ

ఆ. రితరసుఖము లెల్ల నిచ్ఛయింపఁగ నేల
యస్థిరంబు లివి యనంతభక్తిఁ
గొలువ నిమ్ము నిన్ను ఘోర దైత్యానీక
చిత్తభయద రంహ! శ్రీనృసింహ! 310

వ. ఋషు లి ట్లనిరి. 311

మ. [3]భవదీ యోదరలీన లోకముల నుత్పాదించి రక్షించ నేఁ
డవి దైత్యేశునిచేత భేదితము లై హ్రస్వంబు లై యుండ నీ
యవినీతు న్నరసింహరూపమున సంహారంబు నొందించి వే
దవిధిం గ్రమ్మఱ నుద్ధరించితిగదా! ధర్త్రానుసంధాయి వై. 312

వ. పిత్రదేవత లి ట్లనిరి. 313

శా. చండక్రోధముతోడ దైత్యుఁడు వడిఁ గ్రాద్ధంబులఁ మత్సుతుల్
పిండంబుల్ సతిలోదకంబులుగ నర్పింపంగ మా కీక యు
ద్దండత్వంబునఁ దానె కైకొను మహోదగ్రుండు [4]వీఁ డిక్కడఁ
ఖండింపంబడె నీ నఖంబుల నతుల్ గావింతు మాత్మేశ్వరా! 314

---

1. బంధకుఁడై (డ) 2. రాక్షసుఁ జంపితి (తం.వా.) 3. భవదీయోదరలీల (హ.తం.వా) 4. నేఁడిక్కడన్ (క)

వ. సిద్ధు లి ట్లనిరి. 315

క. క్రుద్ధుం డై యణిమాదిక, సిద్ధులు గై కొనిన దై త్యుఁ జీరితివి మహో
ద్ధవు నీ కృప మాకును, సిద్ధులు మఱలంగఁ గలిగె శ్రీనరసింహా! 316

వ. విద్యాధరు లి ట్లనిరి. 317

క. దానవునిఁ జంపి యంత, ర్ధానాదిక విద్యలెల్ల దయతో మఱలం
గా నిచ్చితివి విచిత్రము, నీ నిరుపమ వై భవంబు నిజము నృసింహా! 318

వ. భుజంగు లి ట్లనిరి. 319

క. రత్నములను మత్కాంతా, రత్నములనుఁ బుచ్చుకొన్న రక్కసు నురమున్
యత్నమున ద్రవ్చి వేసితి, పత్నులు రత్నములు గలిగెఁ బ్రతికితి మీశా! 320

వ. మనువు లి ట్లనిరి. 321

క. దుర్జయుని దై త్యుఁ బొరిగొని, వర్ణాశ్రమ ధర్మ సేతు వర్గము మఱలం
బూర్ణముఁ జేసితి వేమని, వర్ణింతుము కొలిచి బ్రతుకువారము దేవా! 322

వ. ప్రజాపతు లి ట్లనిరి. 323

మ. ప్రజలం జేయుటకై సృజించితి మముం బాటించి దై త్యాజ్ఞ చేఁ
బ్రజలం జేయక యింతకాలము మహాభారంబుతో నుంటి మీ
కుజనున్ వఱుముఁ జీరి చంపితివి సంకోచంబు [1]లే కెల్లచోఁ
బ్రజలం జేయుచు నుండువారము జగద్బ్రాయమానోదయా! 324

వ. గంధర్వు లి ట్లనిరి. 325

క. ఆడుదుము రేయుఁ బగలుం, బాడుదుము నిశాటు నొద్ద బాధించు దయం
జూడఁడు నీచే జమునిం, గూడె మహాపాతకునికిఁ గుశలము గలదే. 326

వ. చారణు లి ట్లనిరి. 327

క. భువనజన హృదయ భల్లుఁడు, దివిజేంద్ర విరోధి నేఁడు దెగె నీచేతన్
భవరోగ నివర్తక మగు, భవదంఘ్రియుగంబుఁ జేరి బ్రతికెద మీశా! 328

వ. యక్షు లి ట్లనిరి. 329

ఉ. భ్రంశము లేని నీ భటుల భంగవిముక్తుల మమ్ము నెక్కి ని
స్సంశయవృత్తి దిక్కులఁ బ్రచారముఁ జేయుచునుండు వీఁడు ని
స్త్రింశముతోడ వీనిఁ గడఁదేర్చితి వాపద మానె నో చతు
ర్వింశతి తత్త్వ శాసక! త్రివిష్టప ముఖ్య జగన్ని వాసకా! 330

---

1. లేదెల్లచో (క. బ.) 2. బ్రతికితిమీశా (క. చ. డ. ద.)

వ. కింపురుషు లి ట్లనిరి. 331

క. పురుషో త్తమ! నేరము కిం, పురుషుల మల్పులము నిన్ను భూషింపఁగ దు
ష్పురుషున్ సకలసుజన హృత్పురుషుం జంపితివి [1]జగము బ్రతికె నధీశా! 332

వ. వై తాళికు లి ట్లనిరి, 333

క. త్రిభువన శత్రుఁడు వడియెను, సభలందును ముఖములందు జగదీశ్వర! నీ
[2]శుభగీతములు పఠింపుచు, నభయుల మై సంచరింతు మా ర్తశరణ్యా! 334

వ. కిన్నరు లి ట్లనిరి. 335

క. ధర్మము దలఁపఁడు లఘుతర, కర్మము సేయించు మమ్ముఁ గలుషాత్మకు దు
ష్కర్మునిఁ జంపితి వున్నత, శర్ముల మై నీదుభ క్తి [3]సలిపెదము హరీ! 336

వ. విష్ణుసేవకు లి ట్లనిరి. 337

ఉ. సంచిత విప్రశాపమునఁ జండనిశాచరుఁ డైన వీని శి
క్షించుట కీడుగాదు కృపచేసితి వీశ్వర! భ క్తితోడ [4]నే
వించినకంటె వైరమున వేగమె చేరఁగవచ్చు నిన్ను నీ
యంచిత నారసింహతను వద్భుత మాపదఁ బాసి రందఱున్. 338

అధ్యాయము - ౯

వ. ఇట్లు బ్రహ్మ రు ద్రేంద్ర సిద్ధ సాధ్య పురస్సరు లైన దేవముఖ్యు లందఱు (నెడ
గలిగి యనేక ప్రకారంబుల వినుతించి, రోష సంరంభ విజృంభమాణుం డైన
నరసింహ దేవుని డగ్గఱ వెఱచి, లక్ష్మీదేవిం బిలిచి యి ట్లనిరి. 339

క. హరికిం బట్టపు దేవివి, హరిసేవా నిపుణమతివి [5]హరిగతివి సదా
హరిరతివి నీవు సని నర, హరి రోషము డింప వమ్మ! హరివరమధ్యా! 340

వ. అనిన నియ్యకొని మహోత్కంఠ తోడ నా కలకంఠి నరకంఠీరవుని యుపకంఠం
బునకుం జని. 341

సీ. ప్రళయార్క బింబంబు పగిది నున్నది గాని నెమ్మోము పూర్ణేందు నిభము గాదు
శిఖి శిఖాసంఘంబు చెలువు చూపెడుఁ గాని చూడ్కి ప్రసాదభాసురము గాదు
వీర రౌ ద్రాద్భు తావేశ మొప్పెడుఁ గాని భూరి కృపారస స్ఫూర్తి గాదు
భయద దంష్ట్రాంకుర ప్రభలు గప్పెడుఁ గాని దరహసి తాంబుజాతంబు గాదు

---

1. జనము (బ.) 2. శుభగీతంబులు పాడుచు (త.) శుభతరగీతము పాడుచు (క.)
3. సలిపెదమీశా (హ.) 4. సేవించుటకంటె (హ. తం. వా.) 5. హరిసతివి (త–బ.)

తే. [1]కఠిన నఖర నృసింహ విగ్రహము గాని
కామినీజన సులభవిగ్రహము గాదు
విన్నదియుఁ గాదు తొల్లి నే విష్ణువలనఁ
గన్నదియుఁ గాదు భీషణాకార మనుచు. 342

క. పలికెద ననిగమకము గొనుఁ, బలికినఁ గడు [2]నలిగి విభుఁడు ప్రతివచనములం
బలుకఁ డని నిలుచు శశిముఖ,బలువిడి హృదయమునఁ జనవు భయమును గదురఁ.

వ. ఇట్లు నరహరిరూపంబు వారిజనివాసిని వీక్షించి, శంకించి, శాంతుం డైన వెనుక డగ్గటియెద ననిచింతింపుచున్న, వారిజసంభవుం డ ద్దేవునిరోషంబు నివారింప నితరుల కలవిగా దని ప్రహ్లాదుం జీరి యి ట్లనియె. 344

క. తీండ్ర మగు రోషమున మీ, తండ్రి నిమిత్తమునఁ జక్రి దారుణమూర్తిన్
[3]వేండ్రము విడువడు మెల్లనఁ, దండ్రీ! శీతలునిఁ జేసి దయసేయఁగదే. 345

వ. ఆనిన నౌఁగాక యని మహాభాగవత శేఖరుం డైన బాలకుండు కరకమలంబులు ముకుళించి, మందగమనంబున నమంద వినయ వివేకంబుల నరసింహదేవుని సన్నిధికిం జని, సాష్టాంగ దండప్రణామంబులు సేసిన, భక్తపరాధీనుం డగు న య్యీశ్వరుం డాలోకించి, కరుణాయత్త చిత్తుం డై. 346

ఉ. ప్రాభవ మొప్ప [4]నుత్కట కృపామతి యై కదియంగ జీరి సం
శోభిత దృష్టిసంఘములఁ జూచుచు బాలుని మౌళియందు లో
కాభినుతుండు వెట్టె నసురాంతకుఁ డుద్భట కాలసర్ప భీ
తాభయ దాన శస్తము ననర్గళ మంగళ హేతు హస్తముఁ. 347

వ. ఇట్లు హరి కరస్పర్శంబున భయవిరహితుండును, బ్రహ్మజ్ఞాన సహితుండును, పులకిత దేహుండును, సముత్పన్న సంతోషబాష్ప సలిలధారా సమూహుండును ప్రేమాతిశయ గద్గద భాషణుండును, వినయ వివేక భూషణుండును, నేకాగ్ర చిత్తుండును, భక్తిపరాయత్తుండును నై, య ద్దేవుని చరణ కమలంబులు దన హృదయంబున నిలిపికొని, కరకమలంబులు ముకుళించి యి ట్లని వినుతించె. 448

—: ప్రహ్లాదుండు నరసింహమూర్తిని స్తుతించుట :—

మ. అమరుల్ సిద్ధులు సంయమీశ్వరులు బ్రహ్మాదుల్ సతాత్పర్య చి
త్తముల న్నిన్ను బహుప్రకారముల నిత్యంబుఁ విచారించి పా
రము ముట్ట న్నుతిసేయ నోప రఁట నే రక్తస్తనూజుండ గ
ర్వ మదోద్రిక్తుఁడ బాలుఁడన్ జడమతిఁ వర్ణింప శక్తుండనే. 349

---

1. కఠినఖరనారసింహ (హ.) 2. నలుగువిభుఁడు (తం. వా.) 3. వేండ్రమగుగాన (క.డ.ద.)
4. గన్గొని (హ.)

మ. తపముఁ వంశము తేజముఁ శ్రుతము సౌందర్యంబు నుద్యోగము
నిపుణత్వంబు ప్రతాప పౌరుషములు నిష్ఠా బల ప్రజ్ఞలున్
జప[1]యోగంబులుఁ జాల వీశ్వర ! భవ త్సంతుష్టికై దంతి యూ
థపు చందంబున భక్తి సేయువలయున్ దాత్పర్య సంయుక్తుఁ డై. 350

మ. [2]అమలజ్ఞాన సుదాన ధర్మరతి సత్యక్షాంతి నిర్హత్సర
త్వములన్ యజ్ఞ తపోఽనసూయల గడున్ దర్పించు ధాత్రీసురో
త్తమకంఠీరవ శ్వపచుండు ముఖ్యుఁడు మనోఽర్థ ప్రాణ వా క్కర్మముల్
సమత [3]నిన్నను నయించెనేని [4]నిజవంశ శ్రీకరుం డౌఁ దుదిన్. 351

సీ. అజ్ఞుండు సేసిన [5]యారాధనములఁ జేపట్టఁ డీశ్వరుఁడు కృపాళుఁ డగుటఁ
జేపట్టు నొకచోట సిద్ధ మీశ్వరునకు నర్థంబు లేకున్న [6]నతఁడు పూర్ణుఁ
డైన నర్థము లీశ్వరార్పణంబులు గాఁగఁ జేయుట ధర్మంబు నేసెనేని
నద్ధంబుఁ జూచిన నళిక లలామంబు ప్రతిబింబితం బగు పగిది మఱల

తే. నర్థములు [7]దోఁచుఁ గావున నధికబుద్ధి
భక్తి సేయంగవలయును భక్తిగాని
మెచ్చఁ డర్థంబు లొసఁగెడు మేరలందుఁ
బరమ కరుణుండు హరి [8]భక్తబాంధవుండు. 352

క. కావున నల్పుఁడ సంస్తుతిఁ, గావించెద వెఱపు లేక కల నేరుపునన్
నీ వర్ణనమున ముక్తికిఁ, బోవు నవిద్యను జయించి పురుషుఁ డనంతా ! 353

సీ. [9]సత్త్వాకరుఁడ వైన సర్వేశ ! నీ యాజ్ఞ శిరముల నిడుకొని చేయువారు
బ్రహ్మాదు లమరులు భయ మొందుచున్నారు నీ భీషణాకృతి నేఁడు చూచి
రోషంబు మాను నీ రుచిర విగ్రహములు కల్యాణకరములు గాని భీతి
కరములు గావు లోకములకు వృశ్చిక పన్నగములభంగి భయముఁ జేయు

తే. నసుర మర్దించితివి [10]సాధుహర్ష మయ్యె
నవతరించిన పని దీఱె నలుక యేల
కలుషహారివి సంతోషకారి వనుచు
నిన్నుఁ దలఁతురు లోకులు నిర్మలాత్మ ! 354

---

1. హోమంబులు (హ.వా.); యాగంబులు (చ. బ. తం.) 2. అమలజ్ఞానతదాన ధర్మ (తం.); ....సదానధర్మ (హ) 3. నీకునొసంగెనేని (డ) 4. భగవత్సంతోషకుండౌఁ (హ) 5. యపరాధములనుఁ (హ. తం. వా.) 6. లేకుండు (హ. తం. వా.) 7. జూచు (తం.) 8. భక్తి (హ. వా.) 9. సర్వాత్మకుఁడ (క. త. జ. బ.) 10. చాలు హర్షమయ్యె (క. ట. ద. బ.)

మ. ఖరదంష్ట్రా భ్రుకుటీ సటా నఖయు న్ముగ్ధ్వానయు ర క్తకే
సరయుం దీర్ఘ తరాంత్రమాలికయు భాస్వ న్నేత్రయు నైన నీ
నరసింహాకృతిఁ జూచి నే వెఱవఁ బూర్ణ క్రూర దుర్వార దు
ర్భర సంసారదవాగ్నికిఁ వెఱతు నీ పాదాశ్రయుం జేయవే. 355

వ. దేవా! సకలయోనులందును సుఖవియోగ దుఃఖసంయోగ జనితం బైన శోకా
నలంబున దందహ్యమానుండ నై, దుఃఖనివారకంబు గాని దేహా ద్యభిమానంబున
మోహితుండ నై, పరిభ్రమించుచున్న యేను, నాకుం బ్రియుండవు, సఖుండవు,
పరమదేవతవు నైన నీయొక్క బ్రహ్మగీతంబు లైన లీలావతార కథా విశేషం
బులఁ బఠియించుచు, రాగాది నిర్ముక్తుండ నై, దుఃఖపుంజంబులఁ [1]దరించి,
భవదీయ చరణకమల స్మరణ సేవా నిపుణు లైన భక్తులం జేరి యుండెద.
బాలునిం దల్లిదండ్రులును, రోగిని వైద్యదత్తం బైన యౌషధంబును, సము
ద్రంబున మునింగెడువాని నావయును, దక్క నొరులు రక్షింపలేని తెఱంగున,
సంసారతాప సంతప్యమానుం డై నీచేత నుపేక్షితుం డైన వాని నుద్ధరింప నీవు
దక్క నన్యుండు సమర్థుండు గాడు. జగంబుల నెవ్వం డేమి కృత్యంబు నెవ్వని
చేతం బ్రేరితుం డై యే యింద్రియంబులంజేసి యేమిటికొఱకు యెవ్వనికి సంబంధి
యై యే స్థలంబున నే సమయంబునం దేమి రూపమున నే గుణంబున నపరం
బైన జనకాది భావంబున నుత్పాదించి, పరం బైన బ్రహ్మాదిభావంబున రూపాంత
రంబు నొందించు, నట్టి వివిధ [2]ప్రకారంబు లన్నియు నీవ. నిత్యముక్తుండవు,
రహితకుండవు నైన నీ యంశం బైన పురుషునికి నీ యనుగ్రహంబునఁ గాలంబు
చేతం బ్రేరిత యై కర్మమయంబును, బలయుతంబును, ప్రధానలింగంబును నైన
మనంబును నీ మాయ సృజించు. అవిద్యార్పిత వికారంబును, వేదోక్త కర్మ
ప్రధానంబును, సంసారచక్రాత్మకంబును నైన యీ మనమును నిన్ను సేవింపక
నియమించి తరియింప నొక్కండును సమర్థుండు లేఁడు. విజ్ఞాననిర్జిత బుద్ధి
గుణుండవు నీవు. †నీవలన వశీకృత కార్యసాధనశక్తి యైన కాలంబు, మాయ
తోడం గూడ షోడశవికారయుక్తం బైన సంసార చక్రంబుఁ జేయుచుండు.
సంసార దావదహన సంతప్యమానుండ నగు నన్ను రక్షింపుము. 356

సీ. జనులు దిక్పాలుర సంప దాయు ర్విభవములు గోరుదురు భవ్యంబు లనుచు
నవి యెంతయును రోష హాస జృంభితమైన మాతండ్రి బొమముడి మహిమఁ జేసి
విహితంబు లగు నట్టి వీరుండు నీచేత నిమిషమాత్రంబున నేఁడు మడిసెఁ
గావున ధ్రువములు గావు బ్రహ్మాదుల శ్రీవిభవంబులు జీవితములు

---

1. విదళించి(క.);పరిహరించి(ద.) 2.ప్రకాశంబులన్నియు (హ.); † "సత్వంహి నిత్యవిజితాత్మ గుణస్వధామ్నా, కాలో వశీకృత విసృజ్యవిసర్గశక్తిః" అని మూలము (9-22)

తే. కాలరూపకుఁ డగు నురుక్రమునిచేత
విదళితము లగు నిలువవు వేయునేల
యితర మే నొల్ల నీమీఁది యెఱుక కొంత
గలిగియున్నది గొలుతుఁ గింకరుఁడ నగుచు. 357

మత్తకోకిల. ఎండమావులవంటి భద్రము లెల్ల సార్థము లంచు మ
ర్త్యుండు రోగనిధాన దేహముతో విరక్తుఁడు గాక యు
ద్దండ మన్మథవహ్ని నెప్పుడుఁ దప్తుఁ డై యొకనాఁడు చే
రండు పారము దుష్ట సౌఖ్యపరంప రాక్రమణంబునఁ. 358

ఉ. శ్రీమహిళా మహేశ సరసీరుహగర్భుల కైన నీ మహో
ద్దామ కరంబుచే నభయదానము [1]సేయని నీవు బాలుఁడఁ
దామస వంశ సంభవుఁడ దైత్యుఁడ నుగ్ర రజోగుణుండ ని
స్సీమదయఁ గరాంబుజము శీర్షముఁ జేర్చుట చోద్య మీశ్వరా! 359

వ. మహాత్మా! సుజను లైన బ్రహ్మాదులందును, దుర్జను లైన మాయందును, సేవానురూపంబునం బఱుపఱుంబులు లేక కల్పవృక్షంబుచందంబున ఫల ప్రదా నంబు సేయుదువు. కందర్పసర్ప సమేతం బగు సంసారకూపంబునం గూలు చున్న మూఢజనులం గూడి కూలెడి నేను, భవదీయ భృత్యుం డగు నారదుని యనుగ్రహంబునంజేసి నీ కృపకుం బాత్రుండ నైతి. నన్ను రక్షించి, మజ్జనకుని వధియించుట నాయందులఁ బక్షపాతంబు గాదు. దుష్టజన సంహారంబును, శిష్ట భృత్య మునిజన రక్షాప్రకారంబును నీకు నైజగుణంబులు. విశ్వంబు నీవ. గుణాత్మకం బైన విశ్వంబు సృజియించి, యందుం బ్రవేశించి, హేతుభూత గుణయుక్తుండ వై, రక్షక సంహారకాది నానారూపంబుల నుండుదువు. సదసత్కారణ కార్యాత్మకం బైన విశ్వంబునకుం బరమకారణంబు నీవ. నీ మాయ చేత వీఁడుఁ దా ననియెడి బుద్ధివికల్పంబు దోఁచుఁ గాని, నీకంటె నొం డెద్దియు లేదు. బీజంబునందు వస్తుమాత్ర భూత సౌక్ష్మ్యంబును, వృక్షంబునందు నీల త్వాది వర్ణంబునుఁ గలుగుటెఱుంగున, విశ్వంబునకు నీయంద జన్మ స్థితి ప్రకాశ నాశంబులు గలుగు. నీచేత నైన విశ్వంబు నీయంద నిలుపుకొని, తొల్లి ప్రళయ కాల పారావారంబునఁ బన్న గేంద్ర పర్యంకంబునఁ గ్రియారహితుండ వై, నిజ సుఖానుభవంబు సేయుచు, నిద్రితునిభంగి యోగ నిమీలిత లోచనుండ వై యుండుచుఁ, గొంత కాలంబునకు నిజ కాలశక్తిచేతఁ బ్రేరితంబు లై, ప్రకృతి

---

1. సేయవునేను (హ. తం. వా.)

ధర్మంబు లైన సత్త్వాదిగుణంబుల నంగీకరించి, సమాధి చాలించి, వెలుంగు చున్న నీ నాభియందు, వటబీజమువలన నుద్భవించు వటంబు తెఱంగున, నొక్క కమలంబు సంభవించె. అట్టి కమలంబున నాల్గుమోముల బ్రహ్మ జన్మించి, దిశలు వీక్షించి, కమలంబునకు నొం డైన రూపంబు లేకుండుటఁ జింతించి, జలాంత రాళంబుఁ బ్రవేశించి, జలంబులందు నూఱు దివ్యవత్సరంబులు వెదకి, తన జన్మంబున కుపాదానకారణం బైన నిన్ను దర్శింప సమర్థుండు గాక, మగిడి కమలంబుకడకుం జని, విస్మయంబు నొంది, చిరకాలంబు నిర్భరతపంబు చేసి, పృథివియందు గంధంబు గనుచందంబునఁ; దనయందు నానా సహస్ర వదన శిరో నయన నాసా కర్ణ వక్త్ర భుజ కర చరణుండును, బహువి ధాభరణుండును, మాయా కలితుండును, మహాలక్షణ లక్షితుండును, నిజప్రకాశ దూరీకృత తముండునుఁ, బురుషో త్తముండును నై న నిన్ను దర్శించె. అ య్యవసరంబున.

క. ఘోటకవదనుఁడ వై మధు, కైటభులం ద్రుంచి నిగమగణముల నెల్లన్
బాటించి యజున కిచ్చిన, కూటస్థుఁడ వీశ్వరుఁడవు కోవిదవంద్యా ! 361

వ. ఈ విధంబునఁ గృత త్రేతా ద్వాపరంబు లను మూఁడు యుగంబులందును, తిర్య క్మానవ ముని జలచ రాకారంబుల నవతరించి, లోకంబుల నుద్ధరింపుచు, ధరియింపుచు, హరియింపుచు, యుగానుకూల ధర్మంబులం బ్రతిష్ఠింపుచు నుండుదువు. దేవా ! యవధరింపుము. 362

సీ. కామ హర్షాది [1]సంకలిత మై చి త్తంబు భవదీయ [2]చింతన పదవి సొరదు
మధురాది రసముల మరగి చొక్కుచు జిహ్వా నీ వర్ణనమునకు నిగుడనీదు
సుందరీముఖములఁ జూడఁగోరెడు చూడ్కి తావకాకృతులపైఁ దగులువడదు
వివిధ దుర్భాషలు వినఁగోరు వీనులు వినవు యుష్మత్కథా విరచనములు

తే. ఘ్రాణ మురవడిఁ దిరుగు దుర్గంధములకుఁ
[3]దనివు గొలుపదు వైష్ణవధర్మమునకు
నణఁగి యుండవు కర్మేంద్రియములు పురుషుఁ
గలఁచు సవతులు గృహమేధిఁ గలఁచునట్లు. 363

వ. ఈ విధంబున నింద్రియంబులచేతం జిక్కువడి, స్వకీయ పరకీయ శరీరంబులందు మిత్రామిత్ర భావంబులు సేయుచు, జన్మమరణంబుల నొందుచు, సంసార వైతరణీ నిమగ్నం బైన లోకంబు నుద్ధరించుట, లోకసంభవ స్థితి లయ

---

1. సంఘటిత మై (క. తం.) 2. చి త్తంబు (హ.) 3. ఁదనువు (హ) ఁదవులు (వా)

కారణుండ వైన నీకుం గర్తవ్యంబు. భవదీయ సేవకుల మైన మా యందుఁ
బ్రియభక్తు లయిన వారల నుద్ధరింపుము. 364

మ. భగవ ద్దివ్య గుణాను [1]వర్ణన సుధా ప్రాప్తైక చిత్తుండ నై
బెగడఁ సంసరణోగ్ర వైతరణికిఁ భిన్నాత్ములై తావకీ
య గుణస్తోత్ర పరాఙ్ముఖత్వమున మాయాసౌఖ్య భావంబులఁ
సుగతిం గానని మూఢులం గని మదిఁ శోకింతు సర్వేశ్వరా ! 365

వ. దేవా ! మునీంద్రులు [2]నిజ విముక్తికాము లై విజన స్థలంబులం దపంబు లాచ
రింతురు. కాముకత్వంబు నొల్లక యుండువారికి నీకంటె నొండు శరణంబు
లేదు. నిన్ను సేవించెద. కొందఱు కాముకులు కరద్వయ కండూతిచేతం దనియని
చందంబునఁ, దుచ్ఛమై పఱు పడి క్రిమి కీట సామాన్యం బైన మైథునాది గృహా
మేధి సుఖంబులం దనియక, కడపట నతిదుఃఖవంతు లగుదురు. నీ ప్రసాదంబు
గల సుగుణుండు నిష్కాముం డై యుండు. మౌనవ్రత జప తప శ్రుతాధ్యయ
నంబులును, నిజ ధర్మవాఖ్యాన విజనస్థల నివాస [3]సమాధులును, మోక్ష హేతువు
లగు. ఐన నివి పదియు నింద్రియజయంబు లేనివారికి భోగార్థంబు లై, విఱ్ర
మించువారికి జీవనోపాయంబు లై, డాంబికులకు వార్తాకరంబు లై యుండు.
సఫలంబులు గావు. భక్తి లేక భవదీయ జ్ఞానంబు లేదు. రూపరహితుండ వైన
నీకు బీజాంకురంబుల కైవడిఁ, గారణ కార్యంబు లయిన స దస ద్రూపంబులు
రెండును ప్రకాశమానంబు లగు. ఆ రెంటియందును భక్తియోగంబున బుద్ధి
మంతులు, మథనంబున దారువులందు వహ్నిం గనియెడి తెఱంగున, నిన్నుం
బొడగందురు. పంచభూత తన్మాత్రంబులును, ఘ్రాణ బుద్ధీంద్రియంబులును, మనో[2]
హంకార చిత్తంబులును నీవ. సగుణంబును, నిర్గుణంబును నీవ. గుణాభిమాను
లై జన్మమరణంబుల నొందు [4]విబుధు లాద్యంతంబులు గానక నిరుపాధికుండ
వైన ని న్నెఱుంగరు. తత్త్వజ్ఞు లైన విద్వాంసులు వేదాధ్యయనాది వ్యాపా
రంబులు మాని, వేదాంత ప్రతిపాద్యుండ వగు నిన్ను సమాధివిశేషంబుల
నెఱింగి, సేవింతురు. అది గావున. 366

సీ. నీ గృహాంగణభూమి నిటలంబు మోవంగ మోదించి నిత్యంబు మ్రొక్కఁ డేని
నీ మంగళ స్తవ నికర వర్ణంబులు పలుమాఱు నాలుకఁ బలుకఁ డేని
నీ యధీనములుగా నిఖలకృత్యంబులు ప్రియభావమున సమర్పింపఁ డేని
నీ పదాంబుజముల నిర్మలహృదయుఁ డై చింతించి మక్కువఁ జిక్కఁ డేని

---

1. వర్తన (హ. తం. వా.) 2. నిజవిముక్త కాము లై (హ. తం. వా.) 3. నియమంబు
లను (హ) 4. విమతులు (త. డ. ద. బ.)

తే. నిన్నుఁ జెవులార వినఁ డేని నీకు సేవఁ
జేయరాఁ డేని బ్రహ్మంబుఁ జెందఁగలఁడె
యోగి యైనఁ దపోవ్రత యోగి యైన
వేది యైన మహా తత్త్వవేది యైన. 367

వ. కావున భవదీయ దాస్యయోగంబు కృపసేయుము. అని ప్రణతుండై న ప్రహ్లాదుని వర్ణనంబులకు మెచ్చి, నిర్గుణుం డై న హరి రోషంబు విడిచి యి ట్లనియె. 368

శా. సంతోషించితి నీ చరిత్రములకుఁ ద భద్ర మౌఁగాక! నీ
యంత ర్వాంఛిత లాభ మెల్లఁ గరుణాయత్తుండ నై యిచ్చెదఁ
జింతం జెందకు భక్తకామదుఁడ నే సిద్ధంబు దుర్లోక్యుఁడఁ
జంతుశ్రేణికి నన్నుఁ జూచిన పునర్జన్మంబు లే దర్భకా! 369

ఆ. సకల భావములను సాధులు విద్వాంసు
లఖిల భద్రవిభుఁడ నై న నన్నుఁ
గోర్కి లి మ్మటంచుఁ గోరుదు రిచ్చెదఁ
గోరు మెద్ది యైనఁ గుట్టి! నీవు. 370

అధ్యాయము-౧౦

వ. అని పరమేశ్వరుండు ప్రహ్లాదునియందుఁ గల సకామత్వంబుఁ దెలియుకొఱకు వంచించి యి ట్లానతిచ్చిన, నతండు నిష్కాముం డై న యేకాంత భక్తుఁడు గావునఁ, గామంబు భక్తియోగంబునకు నంతరాయం బని తలంచి యి ట్లనియె. ఉత్పత్తిమొదలు కామా ద్యనుభవాసక్తి గల నాకు వరంబు లిచ్చెద నని వంచింప నేల. సంసార బీజంబులును, హృదయబంధకంబులును నై న కామంబులకు వెఱచి, ముముక్షుండ నై, నేమంబుకొఱకు నేమంబున నిన్నుం జేరితి. కామంబులును, నింద్రియంబులును, మన శ్శరీర ధైర్యంబులును, మనీషా ప్రాణ ధర్మంబులును, లజ్జా స్మరణ లక్ష్మీ సత్య తేజో విశేషంబులును, నశించు. లోకంబు లందు భృత్య్య లర్థకాము లై రాజుల సేవింతురు. రాజులుం బ్రయోజనంబు లర్థించి, భృత్యులకు నర్థంబు లొసంగుదురు. అ వ్విధంబునఁ గాదు. నాకుం గామంబు లేదు. నీకుం బ్రయోజనంబు లేదు. ఐన దేవా! వరదుండ వయ్యెద వేని కామంబు వృద్ధిఁ బొందని వరంబుఁ గృపసేయుము. కామంబుల విడిన పురుషుండు నితోడ సమానవిభవుం డగు. నరసింహా! పరమాత్మ! పురుషోత్తమ! యని ప్రణవపూర్వకంబుగ నమస్కరించిన, హరి యి ట్లనియె. 371

సీ. నీవంటి విజ్ఞాననిపుణు లేకాంతులు గోర్కులు నాయందుఁ గోర నొల్ల
రక్షింతు బ్రహ్లోద! యసురేంద్రభర్త వై సాగి మన్వంతరసమయ మెల్ల
నిఖిలభోగంబులు నీవు భోగింపుము కల్యాణబుద్ధి నా కథలు వినుము
సకలభూతములందు సంపూర్ణుఁ డగు నన్ను యజ్ఞేశు నీశ్వరు నాత్మ నిలిపి
ఆ. కర్మచయము లెల్ల ఖండించి పూజన
మాచరింపు మీశ్వరార్పణముగ
భోగముల నశించుఁ బుణ్యంబు వ్రతములఁ
బాపసంచయములు పాయు నిన్ను. 372

వ. మఱియు నటమీఁదఁ గాలవేగంబునం గళేబరంబు విడిచి, త్రైలోక్య విరాజ మానంబును, దివిజరాజ భోగీయమానంబును, బరిపూరిత దశదిశంబు నైన యశంబుతోడ ముక్తబంధుండ వై నన్ను డగ్గఱియెదవు వినుము. 373

ఆ. నరుఁడు ప్రియముతోడ నా యవతారంబు
నీ యుదారగీత నికరములను
మానసించె నేని మఱి సంభవింపఁడు
కర్మబంధచయము గడచిపోవు. 374

వ. అనినఁ బ్రహ్లోదుం డిట్లనియె. 375

సీ. దంష్ట్ర వై తొల్లి సోదరుని హిరణ్యాక్షు నీవు సంపుటఁజేసి నిగ్రహమున
మా తండ్రి రోషనిర్మగ్నుఁ డై సర్వలో కేశ్వరుఁ బరము ని న్నెఱుఁగలేక
పరిపంథిపగిది నీ భక్తుండ నగు నాకు నపకారములు సేసె నతఁడు నేఁడు
నీ శాంతదృష్టిచే నిర్మలత్వము నొందెఁ గావున పాపసంఘంబు వలనఁ
తే. బాసి శుద్ధాత్మకుఁడు గాఁగ భవ్యగాత్ర!
వరము వేఁడెద నా కిమ్ము వనజనేత్ర!
భక్తసంఘాత ముఖపద్మ పద్మమిత్ర!
[1]భక్త కల్మషవల్లికా పటు లవిత్ర! 376

వ. అనిన భక్తవత్సలుం డిట్లనియె. 377

మ. నిజభక్తుండవు నాకు నిన్నుఁ గనుటఁ నీ తండ్రి త్రిస్సప్త పూ
ర్వజులం గూడి పవిత్రుఁ డై శుభగతిన్ వర్తించు విజ్ఞానదీ
పజితానేక భవాంధకారు లగు మద్భక్తుల్ వినోదించు దే
శజనుల్ దుర్జను లైన శుద్ధులు సుమీ సత్యంబు దైత్యోత్తమా! 378

---

1. భయదకల్మష (చ. జ.)

సీ. ఘన సూక్ష్మ భూతసంఘాతంబులోపల నెల్లవాంఛలు మాని యెవ్వ రైన
నీచందమున నన్ను నెఱయ సేవించిన మద్భక్తు లగుదురు మత్పరులకు
గుఱిసేయ నీవ యెూగ్యుఁడ వైతి విటమీఁద వేదచోదిత మైన విధముతోడఁ
జిత్తంబు నామీఁదఁ జేర్చి మీ తండ్రికిఁ బ్రేతకార్యములు సంప్రీతిఁ జేయు

తే. మతఁడు రణమున నేఁడు నా యంగమర్మ
నమున నిర్మలదేహుఁ డై నవ్యమహిమ
నపగతాఖిల కల్మషుఁ డై తనర్చి
పుణ్యలోకంబులకు నేఁగుఁ బుణ్యచరిత! 379

వ. అని యిట్లు నరసింహదేవుం డానతిచ్చినఁ, బ్రహ్లాదుండు హిరణ్యకశిపునకుం బరలోకక్రియలు సేసి, భూసురోత్తములచేత నభిషిక్తుం డయ్యె. అ య్యెడం బ్రసాదపరిపూర్ణుం డైన శ్రీనరసింహదేవునిం జూచి, దేవతాప్రముఖ సహితుం డై బ్రహ్మదేవుం డి ట్లనియె. 380

సీ. దేవదే వాఖిలదేవేశ! భూతభావన! వీఁడు నాచేత వరము వడసి
మత్సృష్ట జనులచే మరణంబు నొందక మత్తుఁ డై సకలధర్ములఁ జెఱచి
నేఁడు భాగ్యంబున నీచేత హతుఁ డయ్యెఁ గల్యాణ మమరె లోకముల కెల్ల
బాలు నీతని మహాభాగవతశ్రేష్ఠు బ్రతికించితివి మృత్యుభయము వాపి

తే. వరముఁ గృపసేసితివి మేలు వారిజాక్ష!
నీ నృసింహావతారంబు నిష్ఠతోడఁ
దగిలి చింతించువారలు దండధరుని
బాధ నొందరు మృత్యువుభారిఁ బడరు.† 381

వ. అనిన నృసింహదేవుం డి ట్లనియె. 382

క. మన్నించి దేవశత్రుల, కెన్నఁడు నిటువంటివరము లీకుము పాపో
త్పన్నులకు వరము లిచ్చుట, పన్నగముల కమృత మిడుట పంకజగర్భా! 383

వ. అని యి ట్లానతిచ్చి, బ్రహ్మాది దేవతాసమూహంబుచేతం బూజితుం డై, భగవంతుం డైన శ్రీనరసింహదేవుఁడు తిరోహితుం డయ్యె. ప్రహ్లాదుండును, భూలికిం బ్రణమిల్లి, తమ్మిచూలికి వందనం బాచరించి, ప్రజాపతులకు మ్రొక్కి, భగవత్కళ లైన దేవతలకు నమస్కరించినం జూచి, బ్రహ్మదేవుండు శుక్రాది మునిసహితుం డై, దైత్యదానవ రాజ్యంబునకుఁ బ్రహ్లాదునిఁ బట్టంబు గట్టి,

† నవ్యవై భవ: నీ రక్షణమునఁ జేసి.
ఇది (హ) లో నైదవ పాదముగాఁ గలదు.

యతనిచేతం బూజితుం డై దీవించె. అంతట నీశానాది నిఖలదేవతలు, వివిధంబు లగు నాశీర్వాదంబులచేత నా ప్రహ్లాదునిఁ గృతార్థుఁగాఁ జేసి, తమ్మిచూలి ముందఱ నిడుకొని,తమతమ నివాసంబులకుంజనిరి. ఇట్లు విష్ణుదేవుండు జనిపార్శ్వ చరులిరువురు బ్రాహ్మణశాపంబునం జేసి ప్రథమజన్మంబున దితిపుత్రు లైన హిరణ్యాక్ష హిరణ్యకశిపులను వరాహ నారసింహ రూపంబుల నవతరించి వధియించె. ద్వితీయభవంబున రాక్షసజన్మంబు దాల్చిన రావణ కుంభకర్ణులను శ్రీరామరూపంబున సంహరించె. తృతీయజన్మంబున శిశుపాల దంతవక్త్రు లను పేరులఁ బ్రసిద్ధినొందిన వారలం గృష్ణావతారంబున సంహరించె. ఇ వ్విధంబున మూఁడుజన్మంబుల గాఢవై రానుబంధంబున, నిరంతర సంభావిత ధ్యాను లై, వారలు [1]నిఖిలకల్మష వినిర్ముక్తు లై, హరిం గదిసిరి. అని చెప్పి నారదుం డి ట్లనియె. 384

ఉ. శ్రీరమణీయ మైన నరసింహవిహారము నింద్రశత్రు సం
హారముఁ బుణ్యభాగవతుఁ డైన నిశాచరనాథపుత్రు సం
చారము నెవ్వఁ డైన సువిచారత విన్నఁ బఠించినఁ శుభా
కారముతోడ నేభయము గల్గని లోకముఁ జెందు భూవరా! 385

మ. జలజాతప్రభవాదులుఁ మనములోఁ జర్చించి భాషావళిఁ
బలుకఁ లేని జనార్దనాహ్వాయ పరబ్రహ్మంబు నీ యింటిలోఁ
జెలి యై మేనమఱంది యై సచివుఁ డై చిత్తప్రియుం డై మహా
ఫలసంధాయకుఁ డై చరించుట మహాభాగ్యంబు రాజోత్తమా! 386

—: త్రిపురాసుర సంహారము :—

క. బహుమాయుఁ డైన మయుచే, విహతం బగు వారుని యళము విఖ్యాత జయా
వహముగ నీ భగవంతుఁడు, మహితాత్ముఁడు ము న్నొనర్చె మనుజవరేణ్యా!

ప. అనిన ధర్మనందనుం డి ట్లనియె. 388

క. ఏ కర్మంబున విభుఁ డగు, శ్రీకంఠునియళము మయునిచే సుడివడియెఁ
వైకుంఠుఁ డె వ్విధంబునఁ, గైకొని [2]తత్కీర్తి చక్కఁగా నొనరించెఁ. 389

వ. అనిన నారదుం డి ట్లనియె. 390

క. చక్రాయుధ బలయుతు లగు, శక్రాదుల కోహటించి భ్రమమున నసురుల్
[3]సాక్రోశంబుగ నరిగిరి, విక్రమములు మాని మయుని వెనుకకు నధిపా! 391

---

1. హరినిందాది పాపవిముక్తులై (క) 2. సత్కీర్తి (హ) 3. సక్రోధంబున (హ. త. జ.)

వ. ఇట్లు రక్కసులు దనవెనుకఁ జొచ్చిన, మాయానిలయుండును, [1]దుర్దముండును నైన మయుండు, దన మాయాబలంబున నయో రజత సువర్ణమయంబు లై యెవ్వరికిని లక్షింపరాని గమనాగమనంబులును, వితర్కింపరాని కర్కశ పరిచ్ఛ దంబులును గలిగిన త్రిపురంబులు నిర్మించి యిచ్చిన, నక్తంచరు లందఱు నందుఁ బ్రవేశించి, కామసంచారు లై పూర్వవైభవంబు దలంచి, [2]సనాయకానీకంబు లయిన లోకంబుల నస్తోకంబు లైన బలాతిరేకంబుల శోకంబుల నొందించిన.

క. లోకాధినాథు లెల్లను, శోకాతురు లగుచు నేఁగి చొచ్చిరి దుష్టా
నీక [3]విదళ నాకుంఠ, శ్రీకంఠ భువనభరణ చిత్తోత్కంఠన్. 393

వ. ఇట్లు సకలలోకేశ్వరుం డగు మహేశ్వరుం జేరి, లోకపాలకులు ప్రణతు లై పూజించి, కరకమలంబులు ముకుళించి. 394

క. త్రిపురాలయు లగు దానవు, లపరాజితు లగుచు మాకు నక్షాంతంబున్
వపురాది పీడఁ జేసెద, రపరాధకులను వధింపు మగజాధీశా! 395

క. దీనులము గాక యుష్మ ద, ధీనుల మై యుండు మేము దేవాహిత దో
ర్లీనుల మైనారము బల, హీనుల మగు మమ్ముఁ గావు మీశాన! శివా! 396

వ. అనిన, భక్తవత్సలుం డగు పరమేశ్వరుండు, శరణాగతు లైన గీర్వాణుల వెఱవకుం డని, దుర్వారబలంబున బాణాసనంబుఁ గేల నందికొని, యొక్క దివ్యబాణంబు సంధించి, త్రిపురంబులపై నేసిన, మార్తాండమండలంబున వెలువడు మయూఖజాలంబుల చందంబునఁ, దద్బాణంబువలన దేదీప్యమానంబు లయిన యనేక బాణ సహస్రంబులు సంభవించి, భూ నభోఽంతరాళంబులు నిండి, మండి, కుప్పలు గొని, త్రిపురంబులపైఁ గప్పె. అప్పుడు తద్బాణపావక హేతిసందోహ దందహ్య మాను లై, గతాసు లైన త్రిపురనివాసులం దెచ్చి, మహాయోగిత్వమైన మయుండు సిద్ధరస కూపంబున వైచిన. 397

క. సిద్ధామృత రసమహిమను, శుద్ధ మహావజ్రతుల్య శోభితతను లై
వృద్ధిం బొందిరి దానవు, లుద్ధత నిర్ఘాతపావకోపము లగుచున్. 398

క. కూపామృతర[4]స సంగతి, దీపితు లై నిలిచియున్న దేవాహితులన్
రూపించి చింత నొందెడు, గోపధ్వజుఁ జూచి చక్రి కుహనాన్వితుఁ డై. 399

---

1. దుర్నయుండు (క.తం.వా.) 2. నాకనాయకానీకంబు లైన (హ) 3. విదళనాకంఠున్ (హ) 4. రససిద్ధిని (ట)

శా. ఉత్సాహంబున నొక్క పాఁడిమొద వై యూధంబు ఘ్రాణించుచుఁ
వత్సం బై తనవెంట బ్రహ్మ నడవఁ వైకుంఠుఁ డేతెంచి యు
ద్య త్సత్త్వంబునఁ గూపమధ్యరసముం ద్రావెన్ విలోకింపుచుఁ
దత్సౌభాగ్య నిమగ్ను లై మఱచి రా దైత్యుల్ నివారింపఁగఁ. 400

వ. ఇట్లు విష్ణుండు మోహనాకారంబున ధేను వై వచ్చి, త్రిపురమధ్య కూపామృత రసంబుఁ ద్రావిన, నెఱింగి శోకాకుల చిత్తు లై న, రసకూప పాలకులం జూచి, మహోద్యోగి యైన మయుండు వెఱఁగుపడి, దైవగతిఁ జింతించి, శోకింపక యి ట్లనియె. 401

ఆ. అమరు లై న దనుజు లై నను నరులై న
నెంత నిపుణు లై న నెవ్వ రై న
దైవికార్థచయముఁ దప్పింపఁగా లేరు
వలదు దనుజులార ! వగవ మనకు. 402

వ. అని పలికె. అంత విష్ణుండు నై జంబు లై న ధర్మ జ్ఞాన విద్యా తపో విరక్తి సమృద్ధి క్రియాది శక్తివిశేషంబుల శంభునికిం బ్రాధాన్యంబు సమర్పించి, రథ సూత కేతు వర్మ బాణాసన ప్రముఖ సంగ్రామ సాధనంబులు సేసినం గైకొని.

మ. శరి యై కార్ముకి యై మహాకవచి యై సన్నాహి యై వాహి యై
సరథుం డై సనియంత యై సబలుఁ డై సత్కేతన చ్ఛత్రుఁ డై
పరమేశుం డొక బాణముఁ విడిచెఁ దదాబ్బాణానల జ్వాలలఁ
బురము ల్గాలెఁ జటచ్చట ధ్వని నభో భూమధ్యము న్నిండఁగఁ. 404

వ. ఇట్లు హరుండు దురవగాహంబు లై న త్రిపురంబుల నభిజిన్ముహూర్తంబున భస్మంబు సేసి కూల్చిన, సమర గరుడ సిద్ధ సాధ్య గంధర్వ యక్ష వల్లభులు వీక్షించి, జయ జయ శబ్దంబులు సేయుచుఁ, గుసుమ వర్షంబులు వర్షించిరి. ప్రజలు హర్షించిరి. బ్రహ్మాదులు కీర్తించిరి. అప్సరసలు నర్తించిరి. దివ్య కాహళ దుందుభి రవంబులును, మునిజనోత్సవంబులును, బ్రచురంబు లయ్యె. ఇట్లు విశ్వ జనీనం బగు త్రిపురాసుర సంహారంబున నఖిలలోకులును సంతసిల్లి యుండ న య్యవసరంబున.

ఆ. తృణకణముల భంగిఁ ద్రిపురంబుల దహించి
పరముఁ డవ్యయుండు భద్రయశుఁడు
శివుఁడు పద్మజాది జేగీయమానుఁ డై
నిజనివాసమునకు నెమ్మిఁ జనియె. 406

వ. ఇట్లు నిజమాయా విశేషంబున మర్త్యలోకంబున విడంబించుచున్న విష్ణుని పరాక్రమ విధానంబులు మునిజన వంద్యమానంబు లై, సకలలోక కల్యాణ ప్రదానంబు లై యుండు. అనిన విని, నారదునకు ధర్మనందనుం డి ట్లనియె. 407

అధ్యాయము - ౧౧

—: నారదుండు ధర్మరాజునకు వర్ణాశ్రమ ధర్మంబులు తెలుపుట :—

సీ. అనఘాత్మ ! సకల వర్ణాశ్రమాచార సమ్మత ధర్మ మెయ్యది మానవులకు
నే ధర్మమున నరుం డిద్ధ విజ్ఞానము భక్తియుఁ బ్రాపించుఁ బద్మజునకు
సాక్షా త్సనాతుండవు సర్వజ్ఞుఁడవు నీకు నెఱుఁగరానిది ధర్మ మింత లేదు
నారాయణ పరాయణ స్వాంతు లనఘులు శాంతులు సదయులు సాధువృత్తి

ఆ. మెఱయుచున్న ఘనులు మీవంటి వా రెద్ది
పరమధర్మ మనుచు భక్తిఁ దలఁతు
రట్టి ధర్మరూప మఖిలంబు నెఱిఁగింపు
వినఁగ నిచ్ఛ గలదు విమలచరిత ! 408

వ. అనిన, నారదుండు ధర్మరాజుం జూచి, దాక్షాయణీయందు నిజాంశంబున జన్మించి, భువనశోభనంబుకొఱకు బదరికాశ్రమంబునఁ దపోనిరతుం డై యున్న నారాయణునివలన సనాతనధర్మంబు వింటిని. అది నెపెద్ద. సకల వర్ణంబుల జనులకు సత్యంబును, దయయును, నుపవాసాది తపంబును, శౌచంబును, నైరణయు, సద స ద్వివేకంబును, మనోనియమంబును, బహిరింద్రియ జయంబును, హింస లేమియు, బ్రహ్మచర్యంబును, దానంబును, యథోచిత జపంబును, సంతోషంబును, మార్దవంబును, సమదర్శనంబును, మహాజన సేవయు, గ్రామ్యంబు లైన కోరికలు మానుటయు, నిష్ఫలక్రియలు విడుచుటయు, మితభాషిత్వంబును, దేహంబు గాని తన్ను వెదకి కొనుటయు, ననోన్నదకంబులు ప్రాణులకుం బంచియిచ్చుటయుఁ, బ్రాణులందు దేవతాబుద్ధియు, నాత్మబుద్ధిం జేయుటయు, శ్రీ నారాయణచరణ స్మరణ కీర్తన శ్రవణ సేవార్చన నమస్కార దాస్యాత్మసమర్పణ సఖ్యంబు లనెడి త్రింశల్లక్షణంబులు గలుగవలయు. అందు సత్కులాచారుం డై [1]మంత్రవంతంబు లైన గర్భాధానాది సంస్కారంబులవిచ్ఛిన్నంబులుగాఁ గలవాఁడు ద్విజుండు. ద్విజునకు యజన యాజ నాధ్యయనాధ్యాపన దాన ప్రతిగ్రహంబు లను షట్కర్మంబులు విహితంబులు. రాజునకుఁ

---

1. విధిచోదితంబులైన (హ. చ.)

బ్రతిగ్రహ వ్యతిరిక్తంబు లైన యజనాది కర్మంబు లైదును, బ్రజాపాలనంబును, బ్రాహ్మణులు గానివారివలన దండ శుల్కాదులను గొనుటయు, విహిత కర్మంబులు. వైశ్యునికిఁ గృషి వాణిజ్య గోరక్షణాది కర్మంబులును, బ్రాహ్మణ కులానుసరణంబును విహితంబులు. శూద్రునకు ద్విజశుశ్రూష సేయవలయు. 409

సీ. వినుఁ కర్షణాదిక వృత్తికంటెను మేలు యాచింప నొల్లనియట్టి వృత్తి
ప్రాప్తంబు గైకొని బ్రతుకుకంటెను లెస్స యనుదినంబును ధాన్య మడిగికొనుట
యాయావరముకంటె నధికకల్యాణంబు పటిగ యెన్నుల ధాన్య భక్షణంబు
శిలజీవనముకంటె శ్రేయ మాపణములఁ బడ్డ గింజలు దిని బ్రతుకుఁ గనుట

ఆ. యెడరుచోట నృపతి కీ నాల్గు వృత్తులు
దగుఁ బ్రతిగ్రహంబు దగదు తలఁప
నాప దవసరముల నధముఁ డెక్కువజాతి
వృత్తి నున్న దోషవిధము గాదు 410

వ. వినుము. శిలవృత్తియు, నుంఛవృత్తియు ఋతమనియు, నయాచితవృత్తి యమృత మనియు, నిత్య యాచ్ఞావృత్తి మృత మనియు, కర్షకవృత్తి ప్రమృత మనియు నెన్నుదురు. అట్టి వృత్తుల జీవించుట మేలు. వాణిజ్యంబు సత్యానృతం బనియు, శ్వవృత్తి నీచసేవ యనియుఁ బలుకుదురు. సర్వవేదమయుండు బ్రాహ్మణుండు. సర్వదేవమయుండు క్షత్రియుండు. బ్రాహ్మణ క్షత్రియులకు నీచసేవ నంబు కర్తవ్యంబు గాదు. 411

క. దమమును శౌచముఁ దపమును, శమమును మార్దవముఁ గృపయు సత్యజ్ఞాన
క్షమలును హరిభక్తియు హ, ర్షము నిజలక్షణము లగ్రజాతికి నధిపా! 412

ఉ. శౌర్యము దానశీలముఁ బ్రసాదము నాత్మజయంబుఁ దేజముఁ
ధైర్యము దేవభక్తియును ధర్మము నర్థముఁ గామముఁ బుధా
చార్య ముకుంద సేవలును సత్కృతియుం బరితోషణంబు స
ద్వీర్యము రక్షణంబుఁ బృథివీవర శేఖర! రాజచిహ్నముల్. 413

క. ధర్మార్థ కామవాంఛయు, నిర్మల గురుదేవ విప్ర నివహార్చనముల్
నిర్మదభావముఁ బ్రమదము, శర్మకరత్వమును వైశ్యజన లక్షణముల్. 414

ఉ. స్తేయములేని వృత్తియు శుచిత్వము సన్నుతియు న్ని జేశులన్
మాయలులేక డాయుటయు మంత్రము నెప్పక పంచయజ్ఞముల్
సేయుటయుఁ ధరామరుల సేవయు గోవుల రక్షణంబు న
న్యాయము లేమియుఁ మనుజనాథ! యెఱుంగుము శూద్రధర్మముల్. 415

సీ. నిలయము వాటించి నిర్మలదేహి యై శృంగార మేర్పొద్దుఁ జేయవలయు
సత్యప్రియాలాప చతుర యై ప్రాణేశు చిత్తంబు ప్రేమ రంజింపవలయు
దాక్షిణ్య సంతోష ధర్మ మేధాదుల దైవత మని ప్రియుఁ దలఁపవలయు
నాథుఁ డేపద్ధతి నడచు నా పద్ధతి నడచి సద్బంధుల నడపవలయు

ఆ. మార్దవమునఁ బతికి మజ్జన భోజన
శయన పాన రతులు జరుపవలయు
విభుఁడు పతితుఁ డైన వెలఁది పాతివ్రత్య
మహిమఁ బుణ్యఁ జేసి మనుపవలయు. 416

క. తరుణి తన ప్రాణవల్లభు, హరిభావంబుగ భజించి యతఁడును దానున్
సిరి కైవడి వర్తించును, హరిలోకమునందు సంతతానందమునన్. 417

క. ఉపవాసంబులు వ్రతములుఁ, దపములు వెయ్యేల భర్త దైవత మని ని
ష్కపటతఁ గొలిచిన సాధ్వికి, నృపవర! దుర్లభము లేదు నిఖిలజగములన్. 418

వ. మఱియు, సంకరజాతు లైన రజక, చర్మకారక, నట, బురుడ, కైవర్తక, మేడ, భిల్లు రగు నంత్యజాతు లేడువురకును, జండాల, పుల్కస, మాతంగ జాతులకును నా యా కులాగతంబు లైన వృత్తులఁ, జౌర్య హింసాదులు వర్జించి సంచరింప వలయు. మానవులకుఁ బ్రతియుగంబున నైసర్గికంబు లైన ధర్మంబులు, రెండు లోకంబులందును సుఖకరంబు లని వేదవిదు లైన పెద్దలు సెప్పుదురు. కారు కారున దున్నెడు క్షేత్రంబు లావు చెడు. అందుఁ జల్లిన బీజంబులు నిస్తేజంబు లై యుండి, లెస్సగ నంకురింపవు. నిరంతర ఘృతధారా వర్షంబున దహనంబునకు దాహకత్వంబు శాంతిం జెందు. అందు వేల్చిన హవ్యంబులు ఫలింపవు. తద్విధంబున ననవరత కామానుసంధానంబునఁ గామోన్ముఖం బైన చిత్తంబు కామంబులం దనిసి, నిష్కామం బై విరక్తి నొందుం గావున, సత్త్వస్వభావంబు తోడ నెప్పుడుఁ దప్పక నిజవంశానుగత విహితధర్మంబున వర్తించు నరుండు మెల్లన స్వాభావిక కర్మపరత్వంబు విడిచి ముక్తినొందు. జాతిమాత్రంబునఁ బురుషుని వర్ణంబు నిర్దేశింప లేరు. శమదమాది వర్ణలక్షణ వ్యవహారంబులఁ గన వలయు. అని నారదుం డిట్లనియె. 419

అధ్యాయము-౧౨

క. క్రమమున వర్ణంబుల చి, హ్నాము లెల్లను జెప్పఁబడియె నాశ్రమముల ధ
ర్మము లెఱిఁగించెద నన్నియు, సమదాహితహృదయ శూల! సదమలశీలా! 420

వ. వినుము. బ్రహ్మచారి మౌంజీ, కౌపీన యజ్ఞోపవీత కృష్ణాజిన పాలాశదండ కమండలు ధరుండును, సంస్కారహీన శిరోరుహుండును, దర్భహస్తుండును, శీల

ప్రశస్తుండును, మౌనియు నై, త్రిసంధ్యంబును బ్రహ్మగాయత్రి జపియించుచు, సాయం ప్రాత రవసరంబుల నర్క పావక గురు దేవతోపాసనంబులు సేయుచు, గురుమందిరంబునకుం జని, దాసునిచందంబున భక్తి వినయ సౌమనస్యంబులు గలిగి, వేదంబులు సదువుచు, నధ్యయ నోపక్ర మావసానంబుల గురుచరణంబులకు నమస్కరింపుచు, రేపు మాపును విహితగృహంబుల భిక్షించి, భైక్షంబు గురువునకు నివేదించి, యనుజ్ఞ గొని, మితభోజనంబు గావింపుచు, విహిత కాలంబుల నుపవసింపుచు, నంగనలందు నంగనాసక్తులందుం బ్రయోజనమాత్ర భాషణంబు లొనర్చుచు, గురు పరాంగనలవలన నభ్యంగ కేశప్రసాధన శరీర మర్దన మజ్జన రహస్యయోగంబులు వర్జించుచు, గృహంబున నుండక, జితేంద్రియత్వంబున సత్యభాషణుం డై సంచరింపవలయు. 421

ఆ. పొలఁతి దావవహ్ని పురుషుఁ డాజ్యఘటంబు
[1]కరఁగ కేల యుండుఁ గదిసె నేని
బ్రహ్మ యైన కూఁతుఁ బట్టక మానఁడు
వడుగు కింతిపొత్తు వలదు వలదు. 422

వ. వినుము. స్వరూప సాక్షాత్కారంబున దేహి, బహిరింద్రియాదికం బైన యంతయు నాభాసమాత్రంబుగా నిశ్చయించి, యెందాఁక జీవుండు స్వతంత్రుం డైన యీశ్వరుండు గాకుండు, నంత దడవు నంగన యిది, పురుషుండ నే ననియెడి బుద్ధి మానుట కర్తవ్యంబు గాదు. బ్రహ్మచారి యతి గృహస్థులం దెవ్వఁ డైనఁ జిత్తంబు పరిపక్వంబు గాక యదై వ్యాతాను సంధానంబు సేసిన మూఢుం డగు. కావున రహస్యంబునఁ బుత్రిక నైనం డాయకుండ వలయు. 423

చ. శిరమున మేన సంస్కృతులు చేయక చందన భూషణాద్యలం
కరణము లెల్ల మాని ఋతుకాలముల న్నిజభార్యఁ బొందుచుం
దరుణులఁ జూడఁబాటక ధృతవ్రతుఁ డై మధు మాంస వర్జి యై
గురుతరవృత్తితో మెలఁగు కోవిదుఁ డొక్క గృహస్థు భూవరా! 424

వ. మఱియు, ద్విజుండు గృహస్థుం డై గురువులవలన నుపనిష దంగ సహితం బైన వేదమంత్రంబును బఠియించి, నిజాధికా రానుసారంబుగా నర్థవిచారంబు సేసి, తన బలంబుకొలఁది గురువులకు నభీష్టంబు లొసంగి, గృహంబున నొండె, వనంబున నొండె, నైష్ఠికత్వంబు నాశ్రయించి, ప్రాణులతోడ జీవింపుచు, గురువునందు, నగ్నియందు, నాత్మయందు, సర్వభూతములయందు నచ్యుత దర్శనంబు

---

1. కరఁగకుండరాదు (హ)

సేయుచు, నింద్రియ వ్యసనాది మగ్నుండు గాక యెఱుక గలిగి వర్తింపుచుఁ బరబ్రహ్మంబు నొందు. 425

క. వినుము వనప్రస్థునకుఁ, మునికథితము లైన నియమములు గల వా చొ
ప్పున వనగతుఁ డై మెలఁగెడి, ఘనుఁడు మహర్లోకమునకు గమనించు నృపా!

వ. అటమీఁద గృహస్థాశ్రమంబు విడిచి, వనంబునకుం జని, దున్నక పండెడి నీవా
రాదికంబు లగ్నిపక్వంబు చేసి యొండె, నామంబులు చేసి యొండె, నర్క
పక్వంబు లైన ఫలాదు లొండె, భక్షింపుచు, వన్యాహారంబుల నిత్యకృత్యంబు
లైన చరుపురోడాశంబు లొనర్చుఁ, బ్రతిదినంబునం బూర్వసంచితంబులు
పరిత్యజించి, నూతన ద్రవ్యంబులు సంగ్రహింపుచు, నగ్నికొఱకుఁ బర్ణశాల
యైనఁ, బర్వతకందరం బైన, నాశ్రయింపుచు, హిమ, వాయు, వర్షాతపంబులకు
సహింపుచు, నఖ శ్మశ్రు కేశ తనూరుహంబులు ప్రసాధితంబులు నేయక
జటిలుం డై వసియింపుచు, దండాజిన కమండలు వల్కల పరిచ్ఛదంబులు
ధరియించి, పంచ్రడెం డైన, నెనిమి దైన, నాలు గైన, రెండైన, నొక వత్సరం
బైనఁ, దపఃప్రయాసంబున బుద్ధినాశంబు గాకుండ ముని యై చరింపుచు,
దైవవశంబున జరారోగంబులచేతఁ జిక్కి, నిజ ధర్మానుష్ఠాన సమర్థుండు గాని
సమయంబున నిరశన వ్రతుం డై, యగ్నుల నాత్మారోపణంబులు నేసి,
సన్న్యసించి, యాకాశంబునందు శరీరరంధ్రంబులును, గాలియందు నిశ్శ్వా
సంబును, తేజంబులోపల నూష్మంబును, జలంబుల రసంబును, ధరణియందు
శల్య మాంస ప్రముఖంబులును, వహ్నియందు వక్తవ్యంబుతోడ వాక్కును,
నింద్రునియందు శిల్పంబుతోడఁ గరంబులును, విష్ణునియందు గతితోడఁ బదంబు
లును, ప్రజాపతియందు రతితోడ నుపస్థంబును, మృత్యువందు విసర్గంబుతోడఁ
బాయువును, దిక్కులందు శబ్దంబుతోడ శ్రోత్రంబును, వాయువందు స్పర్శంబు
తోడఁ ద్వక్కును, సూర్యునియందు రూపంబుతోడఁ జక్షువులును, సలిలంబులందుఁ
ప్రచేతస్సహిత యైన జిహ్వాయు, క్షితియందు గంధసహితం బైన ఘ్రాణంబును,
జంద్రునియందు మనోరథంబులతోడ మనంబును, గవి యైన బ్రహ్మయందు
బోధంబుతోడ బుద్ధియు, రుద్రునియం దహంకారంబుతోడ మమత్వంబును,
క్షేత్రజ్ఞునియందు సత్త్వంబుతోడఁ జిత్తంబునుఁ, [1]బరంబునందు గుణంబులతోడ
వై కారికంబునుఁ జెందించి, యటమీఁద బృథివిని జలంబునందును, జలంబును
దేజంబునందును, దేజంబును వాయువందును, వాయువును గగనమందును,

---

1. డిందించి (తం. వా.)

గగనము నహంకారతత్త్వమందును, నహంకారమును మహత్తత్త్వంబునందును, మహత్తత్త్వమును బ్రకృతియందును, బ్రకృతి నఖరుండైన పరమాత్మయందును లయంబు నొందించి, చిన్మాత్రావశేషితుండైన క్షేత్రజ్ఞుని నఖరత్వంబున నెఱింగి, ద్వయరహితుండై, దగ్ధకాష్ఠుండైన వహ్నిచందంబునఁ బరమాత్మయైన నిర్వికారబ్రహ్మంబునందు లీనుండు గావలయు. 427

అధ్యాయము - ౧౪

క. అనఘ! వనప్రస్థుండై, చని తద్ధర్మంబు లిట్లు సలుపుచు మఱియుఁ
మనె నేని సన్న్యసింపం, జను నట మీఁదటను [1]ముక్తిసంగత్వమునఁ. 428

వ. ఇట్లు వానప్రస్థాశ్రమంబు జరిపి, సన్న్యసించి, దేహమాత్రావశిష్టుండును, నిరపేక్షుండును, భిక్షుండును, నిరాశ్రయుండును, నాత్మారాముండును, సకలభూతసముండును, శాంతుండును, సమచిత్తుండును, నారాయణ పరాయణుండును నై, కౌపీనాచ్ఛాదనమాత్రం బైన వస్త్రంబు ధరియించి, దండాది వ్యతిరిక్తంబులు విసర్జించి, యాత్మపరంబులు గాని శాస్త్రంబులు వర్జించి, గ్రహ నక్షత్రాది విద్యల [2]నభ్యసింపక, భేదవాదంబు లైన తర్కంబులు తర్కింపక, యెందును బక్షీకరింపక, శిష్యులకు గ్రంథంబులు వంచించి యుపన్యసింపక, బహువిద్యల జీవింపక, మత్తాది వ్యాపారంబుల నుల్లసిల్లక, పెక్కుదినంబు లొక్కచోట వసియింపక, యూరూర నొక్కొక్క రాత్రి నిలుచుచుఁ, గార్యకారణ వ్యతిరిక్తంబయిన పరమాత్మయందు విశ్వంబు దర్శించుచు, సదసన్మయం బైన విశ్వంబునందుఁ బరబ్రహ్మ మైన యాత్మ నవలోకింపుచు, జాగరణ స్వప్న సంధిసమయంబుల నాత్మనిరీక్షణంబు సేయుచు, నాత్మకు బంధమోక్షణంబులు మాయామాత్రంబులు గాని, వస్తుప్రకారంబున లే వనియును, దేహంబునకు జీవితంబు ధ్రువంబు గాదనియును, మృత్యువు ధ్రువంబనియు నెఱుంగుచు, భూతదేహంబుల సంభవనాశంబులకు మూలం బైన కాలంబుఁ బ్రతీక్షించుచు, ని ర్విధంబున జ్ఞానోత్పత్తి పర్యంతంబు సంచరించి, యటమీఁద విజ్ఞానవిశేషంబు సంభవించినఁ బరమహంసుం డై, దండాది చిహ్నంబులు ధరియించి యెండె, ధరియింపక యెండె, బహిరంగ వ్యక్తచిహ్నుండు గాక, యంతరంగవ్యక్త మైన యాత్మానుసంధానంబు గలిగి, మనీషి యై, బాహ్యానుసంధానాభావంబున మనుష్యులకుం దన వలన నున్మత్త బాల మూకులతెఱంగుఁ జూపుచుండవలయు. 429

---

1. ముక్తసంగత్వమునన్ (తం. వా.) 2. జీవింపక (హ)

—: ప్రహ్లాదాజగర సంవాదము :—

క. మునివల్లభుఁ డజగరుఁ డను, సునయుండు హిరణ్యకశిపు సూనుండును ము
న్నొనరించిన సంవాదము, విను మీ యర్థంబు నందువెలయు నరేంద్రా! 430

వ. తొల్లి భగవత్ప్రియుం డైన ప్రహ్లాదుండు కతిపయామాత్య సహితుం డై, లోక తత్త్వంబు నెఱిఁగెడికొఱకు లోకంబుల సంచరింపుచు, నొక్కనాఁడు కావేరీ తీరంబున సహ్యపర్వతతటంబున ధూళిధూసరితంబు లైన కరచరణా ద్యవయవంబులతోడ గూఢం బైన నిర్మలతేజంబుతోఁ గ ర్హ్యాకార వచో లింగ వర్ణాశ్ర మాదుల నెవ్వరికి నెఱుంగఁబడక, నేల నిద్రింపుచు, నజగర వ్రతధరుం డైన మునిం గని, డాయం జని, విధివత్ప్రకారంబున నర్చించి, మునిచరణంబులకు శిరంబు మోపి, ప్రొక్కి, యతని చరిత్రంబులు దెలియ నిచ్చగించి యి ట్లనియె.

సీ. భూమి నుద్యోగి యై భోగి యై యుండెడి నరునికై నడి మునినాథ! నీవు
ఘనశరీరముఁ దాల్చి కదలవు చిత్ర ముద్యమయుక్తునకుఁ గాని ధనము లేదు
ధనవంతునకుఁ గాని తగు భోగములు లేవు భోగికిఁ గాని సంపూర్ణ మైన
తనువు లే దుద్యోగ ధన భోగములు లేక నేల నూరక పడి నిద్రవోవు

ఆ. నీకు నెట్లు గలిగె నిరుపమ దేహంబు?
సముఁడ వార్యుఁడవు విశారదుఁడవు
బుద్ధినిధివి జనులఁ బొగడవు దెగడవు
నిద్ర ప్రతిదినంబు నిలుప నేల. 432

వ. అని యిట్లు ప్రహ్లాదుం డడిగిన, వికసితముఖుం డై మునీంద్రుండు తదీయ మధురాలాప సుధారస ప్రవాహంబులు కర్ణంబులఁ బరిపూర్ణంబు లైన నతని నవలోకించి యి ట్లనియె. 433

సీ. ఆంతరంగికదృష్టి నంతయు నెఱుఁగుదు వార్యసమ్మతుఁడ వీ వసురవర్య!
విశ్వజంతువుల ప్రవృత్తి నివృత్తి లక్షణములు నీ వెఱుంగనివి లేవు
భగవంతుఁ డగు హరిఁ బాయక నీ మనో వీథి రాజిల్లుచు వెలుఁగుఁజేని
క్రమమున బహిరంధకారంబుఁ బరిమార్చు పరమ సాత్త్వికుఁడవు భద్రబుద్ధి

ఆ. వై న నీవు నన్ను నడిగెదు గావున
విన్నధర్మమెల్ల విస్తరింతు
నిన్నుఁ జూడఁ గలిగె నీతోడి మాటల
నాత్మశుద్ధి గలిగె ననఘచరిత! 434

వ. వినుము. ప్రవాహకారిణి యై, విషయంబులచేతం బూరింపరాని తృష్ణచేతం బడి, కర్మంబులఁ బరిభ్రామ్యమాణుండ నైన నేను నానావిధ యోనులందుఁ బ్రవేశింపుచు, వెడలుచు, నెట్టకేలకు మనుష్యదేహంబు ధరియించి, యందు ధర్మంబున స్వర్గద్వారంబును, నధర్మంబున శునక సూకరాది తిర్యగ్జంతు యోని ద్వారంబులను నొంది, క్రమ్మఱ మనుష్యుం డై పుట్టవలయు ననివివేకించి, సుఖరహిత దుఃఖమోహకరంబుల కొఱకు ధర్మంబులు సేయు దంపతుల వ్యవహారంబుఁ గని, సర్వక్రియానివృత్తిఁ గలిగిన జీవుండు స్వతంత్రుం డై ప్రకాశించు నని నిర్ణయించి, భోగంబులు మనోరథజాత మాత్రంబులు గాని శాశ్వతంబులు గావని పరీక్షించి, నివృత్తుండ నై యుద్యోగంబు లేక నిద్రించుచుఁ, బ్రారబ్ధ భోగంబు లనుభవింపుచు, నుండుదు. ఇ ట్లివ్విధంబునఁ దనకు సుఖరూపం బైన పురుషార్థంబు దనయందుఁ గలుగుట యెఱుంగక, పురుషుండు శైవాలజాల నిరుద్ధంబు లైన శుద్ధజలంబుల విడిచి, యెండమావులు జలంబు లని పాఱెడి మూఢుని తెఱంగున సత్యంబుగాని దైవ్యతంబుఁ జొచ్చి, ఘోర సంసారచక్ర పరిభ్రాంతుం డై యుండు. దైవతంత్రంబు లైన దేహాదులచేత, నాత్మకు సుఖంబును, దుఃఖనాశంబునుఁ గోరుచు, నిరీశుం డైన వాని ప్రారంభంబులు నిష్ఫలంబు లగు. అదియునుం గాక, మర్త్యునకు ధనంబు ప్రాప్తం బైన, నది దుఃఖకరంబు గాని సుఖకరంబు గాదు. లోభవంతు లైన ధనవంతులు నిద్రాహారంబులు లేక రాజ చోర యాచక శత్రు మిత్రాది సర్వస్థలంబులందును శంకింపుచు దాన భోగంబుల మఱచి యుండుదురు. ప్రాణార్థవంతులకు భయంబు నిత్యంబు. శోకమోహ భయ క్రోధ రాగ శ్రమాదులు వాంఛా మూలంబులు. వాంఛ లే కుండవలయు. 435

మ. సరభుల్ గూర్చిన తేనె మానవులకుఁ సంప్రాప్త మైనట్లు లో
భరతుల్ గూర్చిన విత్తముల్ పరులకుం బ్రాపించుఁ బ్రాప్తాశి యై
[1]తిరుగంబోని మహోరగంబు బ్రతుకుఁ దీర్ఘాంగ మై యుండియుఁ
జిరకాలంబును వాని వర్తనములం జింతించి యేకాంతి నై. 436

క. అజగరమును జుంటీఁగయు, నిజగురువులుగాఁ దలంచి నిశ్చింతుఁడ నై
విజనస్థలిఁ గర్మంబుల, గజిబిజి లేకున్న వాఁడ గౌరవవృత్తిఁ. 437

---

1. తిరుగంబాసి (చ)

సీ. అజిన వల్కల దుకూలాంబరంబులు గట్టి [1]యైనఁ గట్టక యైన నలరుచుందు
నాందోళికా రథ హయ నాగముల నెక్కి యైన నెక్కక యైన నరుగుచుందుఁ
గర్పూర చందన కస్తూరికా లేప మైన ధూరజ మైన నలఁదికొందు
ధర్మ శయ్యల నైనఁ బర్ణ శిలా తృణ భస్మంబులం దైనఁ [2]బడుచునుందు
ఆ. మానయుక్త మైన మానహీనం బైనఁ
దీయ నైన మిగులఁ దిక్త మైనఁ
గుడుతు సగుణ మైన గుణవర్జితం బైన
నల్ప మైనఁ జాల నధిక మైన. 438

క. లేదని యెవ్వరి నడుగను, రాదని చింతింపఁ బరులు రప్పించినచోఁ
గాదని యెద్దియు మానను, ఖేదము మోదమును లేక క్రీడింతు ముదిఁ. 439

క. నిందింపఁ బరుల నెన్నఁడు, వందింప ననేక పీడ వచ్చిన మది నా
క్రందింప విభవముల కా, నందింపఁ బ్రకామవర్తనంబున నధిపా! 440

వ. ఇట్లు కోరిక లేక యొక్కసమయంబున దిగంబరుండ నై పిశాచంబు చందంబున నుండుచుఁ, బెక్కు దినంబులంగోలెఁ బెనుబాము వర్తనంబు గైకొని, నిమీలిత లోచనత్వంబున నేకాంతభావంబు విష్ణునియందుఁ జేర్చి, వికల్పంబు భేదగ్రాహక చిత్తవృత్తులను, జిత్తంబు నర్థరూప పరిభ్రమంబు గల మనంబునందును, మనంబు నహంకారంబునందును, నహంకారంబును మాయయందును, మాయ నాత్మాను భూతియందును, లయంబు నొందించి, సత్యంబు దర్శించుచు, విరక్తి నొంది, స్వానుభవంబున నాత్మస్థితుండ నై యుండుదు. నీవు భగవత్పరుండవు గావున రహస్యం బైన పరమహంసధర్మంబు స్వానుభవ గోచరం బైన తెఱంగున నీకు హృద్గోచరం బగునట్లు చెప్పితి. అనిన విని. 441

క. ఘను నజగర మునివల్లభు, దనుజేంద్రుఁడు పూజచేసి తగ వీడ్కొని నె
మ్మనమున సంతోషించుచుఁ, జనియెఁ నిజగేహమునకు శశికులతిలకా! 442

అధ్యాయము - ౧౪

వ. అనిన యుధిష్ఠిరుం డిట్లనియె. 443

క. ననుబోఁటి జడ గృహస్థుఁడు, మునివల్లభ! యిట్టి పదవి మోదంబున నే
యనువునఁ జెందును వేగమ, వినుపింపుము నేఁడు నాకు విజ్ఞాననిధీ! 444

వ. అనిన నారదుం డిట్లనియె. గృహస్థుం డైనవాఁడు, వాసుదేవార్పణంబుగా గృహోచితక్రియ లనుసంధించుచు, మహాములను సేవించి, వారలవలన నారా

---

1. పండుచుందు (తం. వా.) 2. యొండెఁ గట్టక యొండె నుండుచుందు (హ. క. బ.)

యణ దివ్యావతార కథాశ్రవణంబు సేయుచు, నయ్యెడ విహితకాలంబుల శాంతజనులం గూడియుండుచుఁ, బుత్ర మిత్ర కళత్రాది సంగంబులు గలలవంటి వని యెఱుంగుచు, లోపల నాసక్తి లేక సక్తునికైవడి వెలుపలఁ బురుషకారంబు లొనర్చుచుఁ, దగులంబులు లేక, విత్తంబు లిచ్చి జనక సుత సోదర సఖ జ్ఞాతి జనుల చిత్తంబులు సమ్మదాయత్తంబులు గావింపుచు, ధన ధాన్య నిధాన దైవ లబ్ధంబులవలన నభిమానంబు మాని యనుభవింపుచు, గృహక్షేత్రంబులఁ జొచ్చి యుదరపూరణమాత్రంబు దొంగిలించినవాని దండింపక, భుజగ మృగ మూషక మర్కట మక్షికా ఖరోష్ట్రంబుల హింసింపక పుత్రులభంగి నీక్షింపుచు, దేశ కాల దైవంబుల కొలఁదిని ధర్మార్థ కామంబులఁ బ్రవర్తింపుచు, శునక పతిత చండాలాదుల కైన భోజ్యపదార్థంబులు తగినభంగి నిచ్చుచు, నిజవృత్తి లబ్ధంబు లగు నశనాదులచేత దేవ ఋషి పితృ భూత మానవుల సంతర్పించుచుఁ, బంచ మహాయజ్ఞావశేషంబుల నంతర్యామిపురుషయజనంబు, నాత్మజీవనోపాయంబును సమర్థింపుచు నుండవలయు. 445

ఆ. జనక గురుల నైనఁ జంపు నర్థమునకై
ప్రాణ మైన విడుచు భార్యకొఱకు
నట్టి భార్యఁ బురుషుఁ డతిథిశుశ్రూష సే
యించి [1]గెలుచు నజితు నీశు నైన. 446

ఆ. పరముఁ డీశ్వరుండు బ్రాహ్మణముఖమున
నాహరించి తుష్టుఁ డైన భంగి
నగ్నిముఖమునందు హవ్యరాసులు గొని
యైన తుష్టినొందఁ డనఘచరిత! 447

వ. కావున గృహస్థుండు బ్రాహ్మణులందును, దేవతలందును, మర్త్య పశుప్రముఖ జాతులందును, నంతర్యామియు, బ్రాహ్మణాననుండును నైన క్షేత్రజ్ఞునందు నయ్యెడ కోరికలు సమర్పించి, సంతర్పణంబు సేయవలయు. భాద్రపదంబునఁ, గృష్ణపక్షంబునందును, దక్షిణోత్తరాయణంబులందును, రేయింబగలు సమమైన కాలంబులందును, వ్యతీపాతంబులందును, దినక్షయంబులందును, సూర్య చంద్ర గ్రహణంబులందును, శ్రవణద్వాదశియందును, వైశాఖశుక్ల తృతీయయందును, కార్తికశుక్ల నవమియందును, హేమంత శిశిరంబులోన నాలు గష్టక లందును, మాఘశుక్ల సప్తమియందును, మాస నక్షత్రంబులతోడం గూడిన పున్నమ

---

1. కొలుచు (వా)

లందును, ద్వాదశితోడం గూడిన యుత్తరాత్రయ శ్రవణానూరాధలందును, నుత్తరాత్రయ సహిత లైన యేకాదశీ తిథులందును, జన్మనక్షత్ర యుక్త దివ సంబులందును, మఱియుఁ, బ్రళ స్తకాలంబులందును, జననీ జనక బంధుజనులకు శ్రాద్ధంబులును, జప హోమ స్నాన వ్రతంబులును, దేవ బ్రాహ్మణ సమారాధ నంబులును, నాచరింపవలయు. భార్యకుఁ బుంసవనాదికంబును, నపత్యంబునకు జాతకర్మాదికంబును, దనకు యజ్ఞదీక్షాదికంబును, బ్రేతజనులకు దహనాదికంబును, మృతదివసంబున సాంవత్సరికంబును, జరుపవలయు. 448

మ. వినుమే దేశములం దయాగుణ తపో విద్యాన్వితం బైన వి
ప్రనికాయంబు వసించు నే స్థలములఁ భాగీరథీముఖ్య వా
హిను లుండుఁ హరిపూజ లెయ్యెడల భూయిష్ఠ ప్రకారంబులఁ
దనరుఁ భూవర ! [1]యిట్టి చోటులఁ దగున్ ధర్మంబులం జేయఁగఁ. 449

క. హరియందు జగము లుండును, హరిరూపము సాధుపాత్ర మం దుండు శివం
కర మగు పాత్రము గలిగిన, నరయఁగ నది పుణ్యదేశ మనఘచరిత్రా ! 450

వ. మఱియుఁ, గురుక్షేత్రంబును, †గయాశీర్షంబును, బ్రయాగంబును, బులహాశ్ర
మంబును, నైమిశంబును, ఫల్గునంబును, సేతువును, బ్రభాసంబునుఁ, గుశస్థలి
యును, వారాణసియు, మధురాపురియును, బంపా బిందు సరోవరంబులును,
నారాయణాశ్రమంబును, సీతారామాశ్రమంబును, మహేంద్ర మలయాదు లైన
కులాచలంబులును, హరిప్రతిమార్చన ప్రదేశంబులును, హరిసేవాపర పరమభాగ
వతులు వసించెడు పుణ్యక్షేత్రంబులును, శుభకాముం డైన వాఁడు సేవింప
వలయు. 451

ఆ. భూవరేంద్ర ! యిట్టి పుణ్యప్రదేశంబు
లందు నరుఁడు సేయునట్టి ధర్మ
మల్ప మైన నది సహస్రగుణాధిక
ఫలము నిచ్చు హరి కృపావశమున. 452

వ. వినుము. చరాచరం బైన విశ్వ మంతయు విష్ణుమయం బగుటంజేసి, పాత్ర
నిర్ణయ నిపుణు లైన విద్వాంసులు నారాయణుండు ముఖ్యపాత్ర మని పలుకు
దురు. దేవఋషులును, బ్రహ్మపుత్రు లైన సనకాదులును నుండ, భవదీయ
రాజసూయంబున నగ్రపూజకు హరి సమ్మతుం డయ్యె. అనేక జంతుసంఘాత
సంకీర్ణం బైన బ్రహ్మాండ పాదపంబునకు నారాయణుండు మూలంబు.

---

1. యట్టి (వా) † "హయశిరః" (మూలము) (14-81)

తన్నిమిత్తంబున నారాయణసంతర్పణంబు సకలజంతు సంతర్పణమని యెఱుం
గుము. ఋషి నర తిర్య గమర శరీరంబులు పురంబులు. వానియందుఁ దార
తమ్యంబులతోడ జీవరూపంబున భగవంతు డైన హరి వర్తించుటంజేసి, పురుషుం
డనఁ బ్రసిద్ధుం డయ్యె. అందుఁ దిర్యగ్జాతులకంటె నధికత్వంబు పురుషునియందు
విలసిల్లుటంజేసి పురుషుండు పాత్రంబు. పురుషులలోన హరి తను వైన వేదంబు
నుద్ధరింపుచు సంతోష విద్యా తపోగరిష్ఠుం డైన బ్రాహ్మణుండు పాత్రంబు.
బ్రాహ్మణులలోన నాత్మజ్ఞాన పరిపూర్ణుం డైన యోగి ముఖ్యపాత్రం బని పలుకు
దురు. పరస్పర పాత్రంబులకు సహింపని మనుష్యులకుఁ బూజనార్థంబు త్రేతా
యుగంబునందు హరిప్రతిమలు గల్పింపఁబడియె. కొందఱు ప్రతిమార్చనంబుఁ
జేయుదురు. [1]పురుషద్వేషు లైనవారలకు నట్టి ప్రతిమార్చనంబు ముఖ్యార్థ
ప్రదంబు గాదు. మందాధికారులకుఁ బ్రతిమార్చనంబు పురుషార్థప్రదం బగును.

ఆ. అఖిల లోకములకు హరి దైవతము సూడ
హరికి దైవతము [2]ధరామరుండు
పదపరాగ లేశపంక్తిచేఁ దైర్లోక్య
పావనంబుఁ జేయు బ్రాహ్మణుండు. 454

అధ్యాయము - ౧౫

వ. అట్టి బ్రాహ్మణజనులందుఁ గర్మనిష్ఠులు, తపోనిష్ఠులు, వేదశాస్త్రనిష్ఠులు, జ్ఞాన
యోగనిష్ఠులు నై కొందఱు వర్తింతురు. అందు జ్ఞాననిష్ఠునికి ననంత ఫలకామి
యైన గృహస్థుండు పితృజనుల నుద్దేశించి కవ్యంబులును, దేవతల నుద్దేశించి
హవ్యంబులునుఁ బెట్టుట ముఖ్యంబు. దైవకార్యంబునకు నిరువుర నైన, నొకరి
నైనఁ, బితృకార్యంబునకు మువ్వుర నైన నొకరి నైన, భోజనంబు సేయింప
వలయు. ధనవంతున కైనను శ్రాద్ధ విస్తారంబు కర్తవ్యంబు గాదు. దేశ కాల
ప్రాప్త కంద మూల ఫలాదికం బైన హరి నైవేద్యంబున, విధి చోదిత ప్రకా
రంబుగా శ్రద్ధతోడఁ బాత్రంబునందుఁ బెట్టిన యన్నంబు కామదం బై యత్యు
ఫలకారి యగు. ధర్మతత్త్వ వేది యైనవాఁడు శ్రాద్ధంబులందు మాంసప్రదా
నంబు సేయక, భక్షింపక, చరింపవలయు. కందమూలాది దానంబున నయ్యెడి
ఫలంబు, పశుహింసనంబున సంభవింపదు. ప్రాణిహింస సేయక వర్తించుటకంటె
మిక్కిలి ధర్మంబు లేదు. యజ్ఞవిదు లైన ప్రోడలు నిష్కాము లై, బాహ్యకర్మం

---

1. పాత్రపురుషద్వేషులైన (తం. వా. చ.) 2. ధరాధినాథ (హ)

బులు విడిచి, ‡యాత్మజ్ఞాన దీపంబులందుఁ గర్మమయంబు లయిన యజ్ఞంబుల నాచరింతురు. 455

క. పశువులఁ బొరిగొని మఖములు, విశదములుగఁ జేయు బుధుని వీక్షించి తమో
విశసనము చేయునో యని, [1]కసిమసి బెగడొందు భూతగణము నరేంద్రా!

వ. అది గావున ధర్మవేది యైనవాఁడు, ప్రాప్తంబు లైన కందమూలాదికంబులచేత నిత్య నైమిత్తిక క్రియలఁ జేయవలయు. నిజ ధర్మబాధకం బయిన ధర్మంబును, బరధర్మ ప్రేరితం బైన ధర్మంబును, నాభాసధర్మంబును, పాషండధర్మంబును, గపటధర్మంబును, ధర్మజ్ఞుం డైనవాఁడు మానవలయు. నైసర్గికధర్మంబు దురిత శాంతి సమర్థం బగు. నిర్ధనుండు ధర్మార్థంబు యాత్రసేయుచు నైన ధనంబు గోరవలదు. జీవనోపాయంబునకు [2]నిట్టట్టుఁ దిరుగక, కార్పణ్యంబు లేక జీవించుచు, మహాసర్పంబు తెఱంగున సంతోషంబున నాత్మారాముం డై, యెద్దియుం గోరక ప్రతికెడి సుగుణునికిం గల సుఖంబు, [3]కామలోభంబులం దశదిశలం బరిధావనంబు సేయువానికి సిద్ధింపదు. పాదరక్షలు గలవానికిఁ [4]శర్కరా కంటకాదులవలన భయంబులేక మెలంగ నలవడుభంగిఁ, గామంబులవలన నివృత్తి గలవానికి నెల్లకాలంబును భద్రం బగు. ఉపస్థకును, జిహ్వా దైన్యంబునకును బురుషుండు గృహపాలక శునకంబుకైవడి సంచరించుచు సంతుష్టిలేక చెడు. సంతోషిగాని విప్రుని విద్యా తపో విభవ యశంబులు నిరర్థకంబులు. ఇంద్రియలోలత్వంబున జ్ఞానంబు నశించు. సకల భూలోక భోగంబులు భోగించియు, దిగ్విజయంబు సేసియు, బుభుక్షా పిపాసలవలన కామపారంబును, హింసవలనఁ గ్రోధపారంబును జేరుట దుర్లభంబు. సంకల్ప వర్జనంబునఁ గామంబును, గామవర్జనంబునఁ గ్రోధంబును, నర్థానర్థ దర్శనంబున లోభంబులును, నదైవ్యతానుసంధానంబున భయంబును, నాత్మానాత్మ వివేకంబుల శోక మోహంబులును, సాత్త్విక సేవనంబున దంభంబును, మౌనంబున యోగాంతరాయంబును, శరీరవాంఛలేమి హింసయు, హితాచరణంబున భూతజం బైన దుఃఖంబును, సమాధిబలంబున దైవికవ్యథయును, ‡ప్రాణాయామాదికంబున మన్మథవ్యథయును, సాత్త్వికాహారంబుల నిద్రయు, సత్త్వగుణంబున రజస్తమంబులును, నుపశమంబున సత్త్వంబును, గురుభజనకుశలుం డై *(శీలంబున) జయింప వలయు. 457

---

† "ఆత్మ సంయమనేఽనీహాః జుహ్వాతి జ్ఞానదీపితే" మూలము (15-9)

1. క్రశిమన్ (చ. తం. వా.) 2. ఇంటింట (చ) 3. మాన (హ) 4. కర్కశ (హ)

‡ "ఆత్మజం యోగ వీర్యేణ" అని మూలము. 'ఆత్మజం దేహజం' అని వ్యాఖ్య. * తా.ప. ప్రతులలో లేదు.

క. హరి మహిమ తనకుఁ జెప్పెడి, గురువు న్నరుఁ డనుచుఁ దలఁచి కుంఠితభక్తిన్
దిరుగు పురుషు శ్రమమెల్లను, కరిశౌచముక్రియ నిరర్థకం బగు నధిపా! 458

ఉ. ఈ వనజాతనేత్రుఁ బరమేశు మహోత్ముఁ బ్రధానపూరుషున్
[1]దేవశరణ్యు సజ్జనవిధేయు ననంతుఁ బురాణయోగి సం
సేవిత పాదపద్ముఁ దమచిత్తముల న్నరుఁడంచు లోకు లి
చ్ఛావిధిఁ జూచుచుండుదురు సన్మతి లేక నరేంద్రచంద్రమా! 459

వ. వినుము. షడింద్రియంబులలోన నొకటియందుఁ దత్పరులై, యిచ్ఛాపూరణ విధానంబులఁ జరితార్థుల మైతి మనువారలు ధారణాభ్యాస సమాధియోగంబుల సాధింపలేరు. కృషిప్రముఖంబులు సంసారసాధనంబులు గాని మోక్షసాధనంబులు గావు. కుటుంబసంగంబునఁ జిత్తవిక్షేపం బగు. చిత్తవిజయప్రయత్నంబున సన్న్యసించి, సంగంబు వర్జించి, మితంబైన భిక్షాన్నంబు భక్షింపుచు, శుద్ధ వివిక్త సమప్రదేశంబున [2]నొక్కరుఁడు నాసీనుండై సుస్థిరత్వంబునఁ బ్రణవోచ్చారణంబు సేయుచు, రేచక పూరక కుంభకంబులఁ బ్రాణాపానంబుల నిరోధించి, కామాహతంబైన చిత్తంబు పరిభ్రమణంబు మాని, కామవిసర్జనంబు చేసి మరలునంతకు నిజ నాసాగ్రనిరీక్షణంబు సేయుచు, ని ర్విధంబున యోగాభ్యాసంబు సేయువాని చిత్తంబు, కాష్ఠరహితం బైన వహ్ని తెఱంగున శాంతిఁ జెందు. కామాదులచేత వేధింపఁబడక, ప్రశాంత సమస్తవృత్తం బైన చిత్తంబు బ్రహ్మసుఖ సమ్మర్శనంబున లీనం బై మఱీయు నెగయనేరదు. 460

మ. ధరణీదేవుఁడు సన్న్యసించి యతి యై ధర్మార్థ కామంబులన్
బరివర్జించి పున ర్వివాదంబునఁ బ్రారంభి యౌనేని లో
భరతిం గక్కినకూడు మంచి దనుచున్ భక్షించి జీవించు దు
ర్నరుచందంబున హాస్యజీవనుఁ డగున్ నానాప్రకారంబులన్. 461

క. మలమునఁ గ్రిమియునుఁ బడుక్రియ, నిలఁ బడు నొడలాత్మగాదు హేయం బనుచున్
దలఁతురు తద్జ్ఞులు వొగడుదు, రలసత నొడలాత్మ యనుచు నజ్ఞు లిలేశా!

ఆ. వ్రతము మానఁ దగదు [3]వడుగుఁగుట్టునికినిఁ
గ్రియలు మానఁ దగదు గృహగతునికిఁ
దపసి కూర నుండఁ దగదు సన్న్యాసికిఁ
దరుణితోడి పొత్తు తగదు తగదు.

VARNA MEMORIAL LIBRARY
V.R.N.M.M.L.
D. No. 1631
Acc. No.

---

1. దేవవరేణ్యు (చ.తం.వా.) 2. నొక్కచో (హ.వా.) 3. వడుక (చ)

సీ. రథము మేనెల్ల సారథి బుద్ధి యింద్రియగణము గుఱ్ఱములు పగ్గములు మనము
ప్రాణాది దశవిధపవనంబు లిరుసు ధర్మాధర్మగతులు రథాంగకములు
బహుళతరం బైన బంధంబు చిత్తంబు శబ్దాదికములు సంచారభూము
లభిమానసంయుతుం డైన జీవుఁడు రథి ఘనతర ప్రణవంబు కార్ముకంబు
తే. శుద్ధజీవుండు బాణంబు [1]శుభగ మైన
బ్రహ్మ మంచితలక్ష్యంబు పరులు రాగ
భయ మద ద్వేష శోక లోభ ప్రమోహ
మాన మత్సర ముఖములు మానవేంద్ర! 464

వ. ఇట్లు మనుష్యశరీరరూపం బైన రథంబుఁ దనవశంబు సేసికొని, మహాభాగవత చరణకమల సేవానిశితం బైన విజ్ఞానఖడ్గంబు ధరియించి, శ్రీమన్నారాయణ కరుణావలోకన బలంబున రాగాది శత్రునిర్మూలనంబు గావించి, ప్రణవబాణాసనంబున శుద్ధజీవశరంబును సంధించి, బ్రహ్మ మనియెడి గుఱియందుఁ [2]బడనేసి, యహంకార రథికుండు రథికత్వంబు మాని, నిజానందంబున నుండవలయు. అట్టి విశేషంబు సంభవింపని సమయంబున, బహిర్ముఖంబు లైన యింద్రియఘోటకంబులు బుద్ధిసారథి సహితంబు లై, [3]సాభిమాన రథికుని ప్రమత్తత్వంబు దెలిసి, ప్రవృత్తిమార్గంబు నొందించి, విషయ శత్రుమధ్యంబునం గూల్చిన. 465

ఆ. విషయశత్రు లెల్ల విక్రాంతితోడ సా
రథిసమేతుఁ డైన రథికుఁ బట్టి
యుగ్ర తిమిర మృత్యుయుత మగు సంసార
కూప మధ్యమందుఁ గూల్తు రధిప! 466

వ. విను. వైదికకర్మంబు ప్రవృత్తంబును, నివృత్తంబు నను, రెండు తెఱంగు లయ్యె. అందుఁ బ్రవృత్తంబునఁ బునరావర్తనంబును, నివృత్తంబున మోక్షంబును సిద్ధించు. ప్రవృత్తకర్మంబులోన నిష్టాపూర్తంబు లన రెండుమార్గంబులు గలవు. అందు హింసా ద్రవ్యమయ కామ్యరూపంబు లైన దర్శ పూర్ణమాస పశుసోమయాగ వైశ్వదేవ బలిహరణ ప్రముఖంబు లైన యాగాదికంబు లిష్టంబులు. దేవాలయ వన కూప తటాక ప్రముఖంబులు పూర్తంబులు. ప్రవృత్తకర్మంబున దేహంబు విడిచి, దేహాంత రారంభంబున దేహి హృదయాగ్రంబున వెలుంగు. వానితోడ నింద్రియంబులఁ, గూడి, *భూత సూక్ష్మయుక్తు డై ధూమ దక్షిణాయన కృష్ణ పక్ష రాత్రి దర్శంబులవలన సోమలోకంబుఁ జేరి, భోగావసానంబున విలీన

---

1. శుభద (తం. వా.) 2. ఁబడవేసి (హ. వా.) 3. స్వాభిమాన (తం. నా.)

* దేహాంతరారంభంబు నొందు దేహి హృదయాగ్రంబు వెలుంగ (తం)
వెలుంగు వానితోడ నింద్రియంబులుం గూడ (వా)
హృదయాగ్రంబు వెలుంగ, దానితోడ నింద్రియంబులుం గూడ ?

దేహుం డై, వృష్టిద్వారంబునఁ గ్రమంబున నోషధిలతాన్న శుక్లరూపంబులఁ
బ్రాపించి, భూమియందు జన్మించు. ఇది పునర్భవరూపం బైన పితృమార్గంబు.
నివృత్త కర్మనిష్ఠుం డైనవాఁడు, జ్ఞానదీప్తంబు లైన యింద్రియంబులందుఁ
గ్రియాయజ్ఞంబుల యజించి, యింద్రియంబుల దర్శనాది సంకల్పరూపం బైన
మనంబునందును, వికారయుక్తంబైన మనంబును వాక్కునందును, విద్యాదీక్షణ
యైన వాక్కును వర్ణసముదాయంబు నందును, వర్ణసముదాయంబు నకారాది
స్వరత్రయాత్మకం బైన ఓంకారంబు నందును, నోంకారంబును బిందువందును,
బిందువును నాదంబునందును, నాదంబును ప్రాణంబునందును, ప్రాణంబును
బ్రహ్మమందును, నిలుపవలయు. దేవమార్గంబు లైన యుత్తరాయణ శుక్లపక్ష
దివా ప్రాహ్ణ రాకలవలన [1]సూర్యబ్రహ్మలోకంబునందుఁ జేరి, భోగావసానంబున
స్థూలోపాధి యైన విశ్వుం డై, స్థూలంబును సూక్ష్మంబునందు లయించి
సూక్ష్మోపాధి యైన తేజసుం డై, సూక్ష్మంబును గారణంబునందు లయించి కార
ణోపాధి యైన ప్రాజ్ఞుం డై, కారణంబును సాక్షిస్వరూపంబునందు లయించి
తురీయుం డై, [2]సూక్ష్మలయంబునందు శుద్ధాత్ముం డై యి వ్విధంబున ముక్తుం
డగును. 467

ఆ. అమరనిర్మితంబు లై యొప్పు పితృ దేవ
సరణు లెవ్వఁ డెఱుఁగు శాస్త్రదృష్టి
నట్టివాఁడె దేహి యై మోహమున నొందఁ
డతిశయించు బుద్ధి నవనినాథ ! 468

వ. వినుము. దేహాదులకుఁ గారణత్వంబున నాదియందును, నవధిత్వంబున నంత్యమం
దునుఁ గలుగుచు, బహిరంగంబున భోగ్యంబును, నంతరంగంబున భోక్తయుఁ,
బరంబును, నపరంబును, జ్ఞానంబును, జ్ఞేయంబును, వచనంబును, వాచ్యమును,
నప్రకాశమును, ప్రకాశంబు నైన వస్తువునకు వేఱొండు లేదు. ప్రతిబింబాదికంబు
వస్తుత్వంబునంజేసి వికల్పితం బై తలంపంబడుభంగి, నైంద్రియకం బైన సర్వం
బును నర్థత్వంబున వికల్పితం బై తోఁచుం గాని పరమార్థంబు గాదు. దేహాది
కంబులు [3]వినాశ్యంబులు. వానికి హేతువు లైన [4]క్షితి[5]ప్రముఖంబులును వినా
శ్యంబు లగుట సిద్ధంబు. పరమాత్మకు నవిద్యచేత నెంత తడవు వికల్పంబు దోఁచు,
నంత తడవును భ్రమంబుదోఁచు. అవిద్యానివృత్తి యైన సర్వంబును మిథ్య యయి
శాస్త్ర విధినిషేధంబులు[7] కలలోపల మేలుగన్న తెఱంగు లగు భావా

---

1. సూర్యబ్రహ్మ లోకంబులందు(హ) 2. సాక్షి(హ) 3. మిథ్యాత్మకంబులు(చ.తం.వా.) 4. చితి (హ)
5. ప్రముఖంబులకును మిథ్యాత్వం బగుట (తం.వా.) 6. యని (హ. తం.) 7. ల నెఱింగి (హ)

ద్వైత, క్రియాద్వైత, ద్రవ్యాద్వైతంబులు మూఁడు గలవు, అందుఁ బటతంత్ర న్యాయంబునఁ గార్యకారణంబులందు వస్తువొక్కటియై యుండు[1]నని యెఱింగి, యేకత్వాలోచనంబు చేసి, వికల్పంబు లేదని భావించుట భావాద్వైతంబు. మనో వా క్కాయకృతంబు లైన సర్వకర్మంబులను ఫలభేదంబు సేయక, పరబ్రహ్మార్ప ణంబు సేయుట క్రియాద్వైతంబు. పుత్రమిత్రకళత్రాది సర్వప్రాణులకుం దనకును దేహమునకుం బంచభూతాత్మకత్వంబున భోక్త యొక్కండను పరమార్థత్వంబున నర్థకామంబులయెడ నైక్యదృష్టిఁ జేయుట ద్రవ్యాద్వైతంబు. నేర్పున నాత్మ తత్త్వానుభవంబున నద్వైత త్రయంబును విలోకించి, వస్తుభేదబుద్ధియుఁ, గర్మభేద బుద్ధియు, స్వకీయ పరకీయ బుద్ధియు, స్వప్నంబులుగాఁ దలంచి మునియైన వాఁడు [1]మానవలయు. 469

క. వాదములు వేయు నేటికి, వేదోక్తవిధిం జరించు విబుధుఁడు గృహమం
దాదరమున నారాయణ, పాదంబులు గొలిచి ముక్తిపదమున కేగున్. 470

శా. భూపాలోత్తమ ! మీరు భక్తిగరిమస్ఫూర్తిన్ సరోజేక్షణ
శ్రీపాదాంబుజ యుగ్మము న్నియతు లై సేవించి కాదే మహో
గ్రాపత్సంఘములోనఁ జిక్కక సమస్తాశాంత నిర్జేత లై
యేపారంగ మఖంబు సేసితిరి దేవేంద్ర ప్రభావంబునన్. 471

—: నారదుని పూర్వజన్మ వృత్తాంతము :—

వ. వినుము. పోయిన మహాకల్పంబునందు గంధర్వులలోన నుపబర్హణుం డను పేర గంధర్వుండ నైన నేను సౌందర్య చాతుర్య మాధుర్య గాంభీర్యాది గుణంబుల సుందరులకుఁ బ్రియుండ నై క్రీడింపుచు, నొక్కనాఁడు విశ్వసృష్ట లైన బ్రహ్మలు దేవసత్ర మనియెడి యాగంబులోన నారాయణ కథలు గానంబు చేయుకొఱకు నప్సరోజనులను, గంధర్వులనుం బీరిన. 472

ఆ. క్రతువులోని కేను గంధర్వ గణముతోఁ
గలసి పోయి విష్ణుగాథ లచటఁ
గొన్ని పాడి సతులఁ గూడి మోహితుఁడ నై
తలఁగి చనితి నంత ధరణినాథ ! 473

క. వారిజగంధుల పొత్తున, వారిం గైకొనక దలఁగివచ్చిన బుద్ధిన్
వా రెఱిఁగి శాపమిచ్చిరి, వారింపఁగరాని రోషవశమున నధిపా ! 473

---

1. మనవలయు (చ)

ఆ. పంకజాతు నిచటఁ బాడక కామినీ
గణముఁ గూడి చనిన కల్మషమున
దగ్ధకాంతి వగుచు ధరణీతలంబున
శూద్రజాతిసతికి సుతుఁడ వగుము. 475

వ. అని యిట్లు విశ్వసృష్టలు శపించిన, నొక్క బ్రాహ్మణదాసికిఁ బుత్రుండ నై జన్మించి, యందు బ్రహ్మవాదు లైన పెద్దలకు శుశ్రూష చేసిన భాగ్యంబున, నిమ్మహాకల్పంబునందు బ్రహ్మపుత్రుండ నై జన్మించితి. 476

ఆ. కౌశలమున మోక్షగతికి గృహస్థుఁ డే
ధర్మ మాచరించి తగిలిపోవు
నట్టి ధర్మమెల్ల నతివిశదంబుగాఁ
బలుకఁబడియె నీకు భవ్యచరిత ! 477

మ. అఖలాధారుఁ డజాది దుర్లభుఁడు బ్రహ్మం బై న విష్ణుండు నీ
మఖమం దర్చితుఁ డై నివాసగతుఁ డై [1]మర్త్యాకృతిఁ సేవ్యుఁ డై
సఖ యై చారకుఁ డై మనోదయితుఁ డై సంబంధి యై మంత్రి యై
సుఖదుం డయ్యె భవన్మహామహిమఁ దాఁ జోద్యంబు ధాత్రీశ్వరా ! 478

వ. అని యిట్లు నారదుండు చెప్పిన వృత్తాంతం బంతయు విని, ధర్మనందనుండు ప్రేమవిహ్వలుం డై వాసుదేవునిం బూజించె. వాసుదేవ ధర్మనందనులచేతఁ బూజితుం డై, నారదమునియు దేవమార్గంబునం జనియె. అని శుకయోగీంద్రుండు పాండవపౌత్రునకుం జెప్పె నని సూతుండు శౌనకాదులకుం జెప్పె.

క. రాజీవసదృశలోచన !, రాజీవభవాది దేవరాజవినుత ! విభ్రాజిత కీర్తిలతావృత, రాజీవభవాండభాండ ! రఘుకులతిలకా ! 480

మాలిని. ధరణిదుహిత్పరంతా ! [2]ధర్మమార్గానుగంతా !
నిరుపమనయవంతా ! నిర్జరారాతిహంతా !
గురుబుధసుఖకర్తా ! కుంభినీచక్రభర్తా !
సురభయపరిహర్తా ! సూరిచేతోవిహర్తా !

చ. హరపటుచాపఖండన ! మహాద్భుత విక్రమశౌర్య భండనా !
శరనిధి గర్వభంజన ! రసాతనయాహృదయాబ్జ రంజనా !
తరుచర సైన్యపాలన ! సుధాంధసమౌని మనోజ్ఞ ఖేలనా !
సరసిజగర్భ సన్నుత ! నిశాచర సంహార ! త్రైజగన్నుతా !

---

1. మాధుర్య సంభాషియై(హ) మంతవ్యుడై భోక్తయై (చ.ట.త.జ.) 2.ధర్మమార్గావగంతా(హ)
* ఈ పద్యము నెంబరు 4140 ప్రతిలోమాత్ర మధికముగా నున్నది.

గద్య. ఇది శ్రీపరమేశ్వరకరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతం బైన శ్రీమహాభాగవతం బను మహాపురాణంబునందు ధర్మనందనునకు నారదుండు హిరణ్యాక్ష హిరణ్యకశిపుల పూర్వజన్మ వృత్తాంతంబు సెప్పుటయు, హిరణ్యకశిపు దితి సంవాదంబును, సుయజ్ఞ చరిత్రంబును, యమసల్లాపంబును, బ్రహ్మవరలాభ గర్వితుం డైన హిరణ్యకశిపు చరిత్రంబును, ప్రహ్లాద విద్యాభ్యాస కథయును, బ్రహ్లాద హిరణ్యకశిపుల సంవాదంబును, బ్రహ్లాదు వచనంబు ప్రతిష్ఠింప హరి నరసింహరూపంబున నావిర్భవించి, హిరణ్యకశిపుని సంహరించి, ప్రహ్లాదునకు నభయం బిచ్చి, నిఖిల దేవతానివహ ప్రహ్లాదాది స్తూయమానుం డై, తిరోహితుం డగుటయుఁ, ద్రిపురాసుర వృత్తాంతంబును, ఈశ్వరుండు త్రిపురంబుల దహించుటయు, వర్ణాశ్రమ ధర్మ వివరణంబును, బ్రహ్లాదాజగర సంవాదంబును, నారదు పూర్వజన్మ వృత్తాంతంబును నను కథలం గల సప్తమ స్కంధము సంపూర్ణము.

ఓమ్

శ్రీ మ హా భా గ వ త ము

→•←

అ ష్ట మ స్క ం ధ ము

క. శ్రీమన్నామ! పయోద, శ్యామ! ధ రాభృ ల్లలామ! జగదభిరామా!
రామాజనకామ! మహో, ద్దామ! గుణస్తోమధామ! దశరథరామా!

అధ్యాయము - ం

వ. మహనీయ గుణగరిష్ఠు లగు న మ్మునిశ్రేష్ఠులకు నిఖల పురాణవ్యాఖ్యాన వైఖరీ సమేతుం డై న సూతుం డి ట్లనియె. అట్లు ప్రాయోపవిష్టుం డై న పరీక్షి న్న రేంద్రుండు శుక యోగీంద్రుం గనుంగొని. 2

క. వినఁబడియెను స్వాయంభువ, మనువంశము వర్ణ ధర్మ మర్యాదలతో
మనుజుల దనుజుల వేల్పుల, జననంబులు [1]సృష్ట లెల్ల జనియించుటయున్. 3

ఉ. ఏ మనుకాలమందు హరి యీశ్వరుఁ డేటికి సంభవించె నే
మేమి యొనర్చె న [2]మ్మనువు లే రతఁ డేక్రియఁ జేయుచున్న వాఁ
డేమి నటించు మీఁద గత మెయ్యది సజ్జను లై నవారు ము
న్నే మని చెప్పుచుందురు మునీశ్వర! నా [3]కెఱుఁగింపవే! దయన్. 4

వ. అనిన శుకుం డి ట్లనియె. 5

క. ఈ కల్పంబున మనువులు, ప్రాకటముగ నార్వు రై రి పదునలువురలో
లోకముల జనుల పుట్టువు, లాకథితము లయ్యె వరుస నఖిలములు నృపా! 6

వ. ప్రథమమను వై న స్వాయంభువునకు నాకూతి, దేవహూతు లను నిరువురు కూఁతులు గలరు. వారికిఁ ప్రగమంబునఁ గపిల, యజ్ఞ నామంబుల లోకంబులకు ధ ర్మజ్ఞాన బోధంబులు సేయుకొఱకు హరి పుత్రత్వంబు నొందె. అందుఁ గపిలుని చరిత్రంబులు మున్ను చెప్పంబడియె. యజ్ఞుని చరిత్రంబు చెప్పెద వినుము. 7

---

1. సృష్టియెల్ల (హ) 2. మనువులెవ్వరు నేక్రియ (హ) 3. నాకెఱుఁగంగఁ జెప్పవే (చ–బ.)

మ. శతరూపాపతి కామభోగ [1]విరతిఁ సంత్యక్త భూభారుఁ డై
సతియుం దాను వనంబు కేఁగి శతవర్ష ంబుల్ సునందానదిన్
వ్రతి యై యేకపదస్థుఁ డై నియతుఁ డై [2]వాచంయమ స్ఫూర్తితో
గతదోషుండు తపంబు నేనె భువన ఖ్యాతంబుగా భూవరా ! 8

వ. ఇట్లు తపంబు సేయుచు స్వాయంభువమనువు దన మనంబులోన. 9

సీ. సృష్టిచే నెవ్వఁడు చేతన పడకుండు సృష్టి యెవ్వని చేఁతచే జనించు
జగములు నిద్రింప జాగరూకత నుండి యెవ్వఁడు [3]బ్రహ్మంబు నెఱుఁగుచుండు
నాత్మ కాధారంబు నఖిలంబు నెవ్వఁడు నెవ్వని నిజధనం బింతవట్టు
పొడగాన రాకుండుఁ బొడగను నెవ్వఁడు నెవ్వని [4]దృష్టికి నెదురు లేదు

ఆ. జనన వృద్ధి విలయ సంగతిఁ జెందక
నెవ్వఁ డెడప కుండు నెల్లయెడలఁ
[5]దన మహత్త్వసంజ్ఞ తత్త్వ మెవ్వఁడు దాన
విశ్వరూపుఁ డనఁగ విస్తరించు. 10

వ. అని మఱియు, నిరహంకృతుండును, బుధుండును, నిరాశియుఁ, బరిపూర్ణుండును, ననన్యప్రేరితుండును, నృశిక్షా పరుండును, నిజమార్గ సంస్థితుండును, నిఖిల ధర్మ భావనుండు నైన పరమేశ్వరునకు నమస్కరించెద. అని యుపనిష దర్థంబులు పలుకుచున్న మనువుం గనుంగొని. 11

క. రక్కసులు దినఁగఁ గడఁగిన, వెక్కసముగ యజ్ఞనామ విష్ణుఁడు వారిం
జక్కడిచెఁ జక్రధారల, [6]మిక్కుటముగ వేల్పులెల్ల మే లని పొగడన్. 12

వ. ఇది ప్రథమమన్వంతరంబు. ఇంక రెండవ [7]మన్వంతరంబు వినుము. 13

సీ. స్వారోచిషుం డన సప్తార్చి బిడ్డఁడు మనువు వానికి నా ద్యుమ తు్నషేణ
రోచిష్మ దాద్య లారూఢ పుత్త్రులు ధాత్రి యేలిరి రోచనుం డింద్రుఁడయ్యె
నధికులు తుషితాదు లమరు [8]లూర్జస్తంబ ముఖ్య లాఢ్యులు సప్తమునులు నాఁడు
వేదశిరుం డను విప్రుని దయితకుఁ దుషితకుఁ బుత్త్రుఁ డై తోయజాతుఁ

ఆ. డవతరించెను [9]విభుఁ డన నశీత్యష్ట స
హస్రమునులు నధికు లై నవారు
ఘను లనుగ్రహింపఁ గౌమారక బ్రహ్మ
చారి యగుచు నతఁడు సలిపె వ్రతము. 14

---

1. నియతిఁ(త) 2. వాంఛన్ మనస్ఫూర్తితో(జ) 3. బ్రహ్మాండ మెఱుఁగుచుండు(హ.తం.వా.) బ్రహ్మాంత మెఱుఁగుచుండు (త) 4. సృష్టికి (హ) 5. సన్మహత్త్వ తత్త్వ సంజ్ఞ నెవ్వఁడు దాన (తం) 6. మిక్కుటముగ (చ.ట.త.జ.డ,బ.) 7. మనువు వినుము(హ) 8. ఊర్జస్తంభ(తం) 9. విభుఁడను (హ)

వ. తదనంతరంబ. 15

సీ. మనువు మూఁడవవాఁడు మనుజేంద్ర!యుత్తముం డన ప్రియవ్రతునకునాత్మజుండు
పాలించె నిల యెల్లఁ బవన సృంజయ యజ్ఞహో త్రాదు లాతని వుత్త్ర లధిక
గుణులు వసిష్ఠుని కొడుకులు ప్రమథాదు లై రి సప్త ఋషులు నమరవిభుఁడు
సత్యజి త్తనువాఁడు సత్య భద్రాద్యులు సురలు ధర్మునికిని సూనృతకును

ఆ. బుట్టి సత్యనియతిఁ బురుషోత్తముఁడు సత్య
సేనుఁ డనఁగ దుష్టశీలయుతుల
దనుజ యక్షపతుల దండించె సత్యజి
న్మిత్రుఁ డనఁగ జగము మే లనంగ. 16

—: గజేంద్రమోక్షణ కథ :—

వ. చతుర్థమనువు కాలప్రసంగంబు వివరించెద. 17

సీ. మానవాధీశ్వర ! మనువు నాలవవాఁడు తామసుం డనఁగ నుత్తముని భ్రాత
పృథ్వీపతులు కేతు పృథు నర ఖ్యాతాదు లతని పుత్రులు [1]పదు రధికబలులు
సత్యక హరివీర సంజ్ఞులు వేల్పులు త్రిశిఖ నామమువాఁడు దేవవిభుఁడు
మునులు జ్యోతిర్ధ్యామ ముఖ్యులు హరి వుట్టె హరిమేధునకుఁ బ్రీతి హరిణియందు

ఆ. [2]గ్రహనిబద్ధుఁ డైన గజరాజు విడిపించి
ప్రాణభయమువలనఁ బాపి కాఁచె
హరి దయాసముద్రుఁ డఖిల లోకేశ్వరుఁ
డనిన శుకునిఁ జూచి యవనివిభుఁడు. 18

క. నీరాట [3]వనాటములకుఁ, బోరాటం బెట్లు గలిగెఁ, బురుషోత్తము చే
నారాట మెట్లు మా నెను, ఘోరాటవి[4]లోని భద్రకుంజరమునకుఁ. 19

క. మునినాథ ! యీ కథాస్థితి, వినిపింపుము వినఁగ నాకు వేడుక వుట్టెఁ
వినియెదఁ [5]గర్ణేంద్రియములు, పెనుఁ బండువు సేయ మనము ప్రీతిం బొందఁ. 21

క. ఏ కథలయందుఁ బుణ్య. శ్లోకుఁడు హరి నెప్పఁబడును సూరిజనముచే
నా కథలు పుణ్యకథ లని, యాకర్ణింపుదురు పెద్ద లతిహర్షమునఁ. 21

వ. ఇవ్విధంబునఁ బ్రాయోపవిష్టుం డైన పరీక్షన్న రేంద్రుండు బాదరాయణి నడిగె.
అని చెప్పి, సభాసదు లైన మునుల నవలోకించి, సూతుండు పరమ హర్షసమే
తుం డై చెప్పె. అట్లు శుకుండు రాజున కిట్లనియె. 22

---

1. పద్గు రధిక బలులు (తం. వా) పదుగు రధిక బలులు (హ) 2. గ్రాహబద్ధుఁడైన (తం)
3. వనాటులకుం (హ) 4. లోన (హ) 5. కర్ణేంద్రియముల పెనుఁబండువు (తం. వా.)

అధ్యాయము – ౨

సీ. రాజేంద్ర! వినుసుధారాశిలో నొక పర్వతము త్రికూటం బనఁ దనరు చుండు
యోజనాయుత మగు నున్నతత్వంబును నంతియ వెడలుపు నతిశయిల్లుఁ
గాంచనాయస్సార కలధౌత మయము లై మూఁడుశృంగంబులు మొనసియుండుఁ
దటశృంగ బహురత్న ధాతు చిత్రితము లై దిశలు[1] భూనభములుఁ దేజరిల్లు

తే. భూరి భూజ లతా కుంజ పుంజములును
త్రోసి పఱతెంచు సెలయేటి మొత్తములును
[2]మరగి తిరిగెడు దివ్య విమానములును
జఱులఁ గ్రీడించు కిన్నరచయముఁ గలిగి. 23

వ. అది మఱియును మాతులుంగ లవంగ లుంగ చూత కేతకీ భల్లాత [3]కామ్రాతక సరళ పనస బదరీ వకుళ వంజుళ వట కుటజ కుంద కురువక కురంటక కోవిదార ఖర్జూర నారికేళ సిందువార చందన పిచుమంద మందార జంబూ జంబీర మాధవీ మధూక తాల తక్కోల తమాల హింతాల రసాల సాల ప్రియాళు బిల్వామలక క్రముక కదంబ కరవీర కదళీ కపిత్థ కాంచన కందరాళ శిరీష శింశు పాశోక పలాశ నాగ పున్నాగ చంపక శతపత్ర మరువక మల్లికామతల్లికా ప్రముఖ నిరంతర వసంతసమయ సౌభాగ్యసంప దంకురిత పల్లవిత కోరకిత కుసుమిత ఫలిత లలిత విటప విటపి వీరు న్నివ హాలంకృతంబును, మణివాలు కానేక విమల పులిన తరంగిణీ సంగత విచిత్ర విద్రుమలతా మహోద్యాన శుక పిక నికర నినిత సమంచిత చంచూపుట నిర్దళిత శాఖ శాఖాంతర పరిపక్వ ఫల రంధ్ర ప్రవర్షిత రసప్రవాహ బహుళంబును, కనకమయ సలిల కాసార కాంచన కుముద కల్హార కమల పరిమళ మిళిత కబళాహార సంత తాంగీకార భార పరిశ్రాంత కాంతా సమాలింగిత కుమార మత్త మధుకర విట సముదయ సమీపసంచార సముదంచిత శకుంత కలహంస కారండవ జలకుక్కుట చక్రవాక బలాహక కోయష్టిక ముఖర జలవిహంగ విసర వివిధకోలాహల బధిరీభూత భూ నభోంతరాళంబును, తుహినకరకాంత మరకత కమలరాగ వజ్ర వైడూర్య నీల గోమేధిక పుష్యరాగ మనోహర కనక కలధౌత మణిమ యానేక శిఖరతట దరీ విహారమాణ విద్యాధర విబుధ సిద్ధ చారణ గంధర్వ గరుడ కిన్నర కింపురుష మిథున సంతత సరససల్లాప సంగీతప్రసంగ మంగళాయతనంబును, గంధగజ గవయ గండభేరుండ ఖడ్గ

---

1. భూనభమునఁ దేజరిల్లు (హ) 2. మలసి తిరిగెడు (హ) 3. కామ్లాతక (హ)

కంఠీరవ శరభ శార్దూల చమర శల్య భల్ల సారంగ సాలావృక వరాహ మహిష
మర్కట మహోరగ మార్జాలాది నిఖిల మృగనాథ సమూహ సమరసన్నాహ
సంరంభ [1]సంచకిత శరణాగత శమనకింకరంబును నై యొప్పు న ప్పర్వత
సమీపంబునందు. 24

క. భిల్లీ [2]భల్ల లులాయక, భల్లుక ఫణి ఖడ్గ గవయ బలిముఖ చమరీ
ఝిల్లీ హరి [3]శరభక కిటి మల్లాద్భుత కాక ఘూకమయ మగు నడవిఁ. 25

శా. అన్యాలోకన భీకరంబులు జితాశానేకపానీకముల్
వన్యేభంబులు గొన్ని మత్తతను లై ప్రజ్యావివా రాగతో
దన్యత్వంబున భూరి భూధర [4]దరీ ద్వారంబులం దుండి సౌ
జన్యక్రీడల [5]నీరుగాలివడిఁ గాసా రావగాహార్థ మై. 26

ఆ. అంధకార మెల్ల నద్రి గుహాంతర
వీథులందుఁ బగలు వెలిచి డాఁగి
యెడరు వేచి సంధ్య నినుఁడు వృద్ధత నున్న
వెడలె ననఁగ గుహలు వెడలెఁ గరులు. 27

క. తలఁగవు కొండల కైనను, మలఁగవు సింగముల కైన మార్కొనను కడిమిం
గలఁగవు పిడుగుల కైనను, నిల బలసంపన్న వృత్తి నేనుఁగుగున్నల్. 28

సి. పులుల మొత్తంబులు పొదరిండ్లలోఁ దూఱు ఘోర భల్లూకముల్ గుహలు సొచ్చు
భూదారములు నేలబొటియలలో డాఁగు హరిదంతముల కేఁగు హరిణచయము
మడుఁగులఁ జొరఁబాఱు మహిషసంఘంబులు గండశైలంబులఁ గపులు ప్రాఁకు
వల్మీకములు సొచ్చు వనభుజంగంబులు నీలకంఠంబులు నింగి కెగయు

తే. వెలిచి చమరీమృగంబులు విసరు వాల
చామరంబుల విహరణశ్రమము వాయ
భయద పరిహేల విహరించు భద్రకరుల
గాలి వాటిన మాత్రాన జాలిఁ బొంది. 29

క. మదగజ దానామోదము, కదలని తమకములఁ ద్రావి కడుపులు నిండఁ
బొదలుచుఁ దుమ్మెదకొదమల, కదుపులు జుం జు మ్మటంచు గానము సేసెన్. 30

క. తేఁటి యొకటి యొరు [6]ప్రియకును, మాటికి మాటికిని నాగ మదజల గంధం
బేటి కని తన్నుఁ బొందెడి, బోటికి నందిచ్చు నిండు [7]బోటుఁదనమునన్. 31

---

1. సంచరిత (చ. డ. ద.) 2. భల్లు లులూయక (హ) 3. శరభకిటీ, మల్లాద్భుత (హ)
4. తటీ (బ) ల. నీరుగాలి పడి (తం) 6. ప్రియునకు (క.ట.త.జ.డ.బ.) 7. బోటితనమునఁ (హ)

క. అంగీకృత రంగ న్మా, తంగీ మదగంధ మగుచుఁ దద్దయు వేడ్కన్
సంగీత విశేషంబుల, భృంగీగణ మెుప్పె ప్రమాను పెట్టెడి మాడ్కిన్. 32

క. [1]వల్లభలు వాఱి మున్నడ, [2]వల్లభ మని ముసరి రేని వారణ[3]దానం
బొల్లక మధుకరవల్లభు, లుల్లంబులఁ బొంది రెల్ల యుల్లాసంబుల్. 33

వ. అప్పుడు. 34

మ. కలభంబుల్ చెరలాడుఁ బల్వలము లాఘ్రాణించి మట్టాడుచున్
ఫలభూజంబులు రాయుచున్ జివురుజొంపంబుల్ వడిన్ మేయుచున్
బులులం గారెనుపోతులన్ మృగములన్ బోనీక శిక్షింపుచున్
గొలఁకుల్ సొచ్చి [4]కలంపుచున్ గిరులపై గొబ్బిళ్ళు గోరాడుచున్. 35

క. తొండంబుల మదజలవృత, గండంబుల కుంభములను ఘట్టన సేయం
గొండలు దలక్రిం దై పడు, బెండుపడున్ దిశలు సూచి బెగడున్ జగముల్. 36

క. ఎక్కడఁ జూచిన లెక్కకు, నెక్కువ యై [5]యడవి నడచు నిభయూథములో
నొక్క కరినాథుఁ డెడతెగి, చిక్కి నొక కరేణుకోటి సేవింపంగన్. 37

వ. ఇట్లు వెనుక ముందఱ నడుమ నుభయపార్శ్వంబులఁ దృషార్దితంబు లై యరుగు దెంచు నేనుంగుగములం [6]గానక తెఱఁగుదప్పి [7]తొలంగుడుపడి, యీశ్వరా యత్తం బైన చిత్తంబు సంవిత్తంబు గాకుండుటం జేసి తానును, దన కరేణు సముదయంబును నొక్క తెరు వై పోవుచు. 38

సీ. పల్వలంబుల లేఁతపచ్చికఁ మచ్చికఁ జెలుల కందిచ్చు నచ్చికము లేక
నివురుజొంపములఁ గ్రొ వ్వెలయు పూఁగొమ్మలఁ బ్రాణవల్లభలకుఁ బాలు వెట్టు
ఘన దాన శీతల కర్ణతాళంబుల దయితల చెమటార్చుఁ దనువు లరసి
మృదువుగాఁ గొమ్మల మెల్లన గళములు నివురుచుఁ బ్రేమతో [8]నెఱపు వలపు

తే. పిఱుఁదు చక్కట్ల డగ్గఱి ప్రేమతోడ
డాసి మూర్కొని దివికిఁ దొండంబు సాపు
వెద వివేకించుఁ గ్రీడించు విభ్రమించు
మత్త మాతంగమల్లంబు మహిమతోడ. 39

---

1. వల్లభులువారు మున్నడ (హ) 2. వల్లభయని (హ) 3. దానం బొల్లకు (హ)
4. కలంపుచున్ (హ) 5. యడవి నడుమ (హ) 6. గూడికొని (హ) 7. తొలంగుపడి (హ)
8. నెరవు గరపు (హ)

సీ. తన కుంభముల పూర్ణతకు డిగ్గి యువతుల కుచములు పయ్యెద[1]కొంగు లీఁగఁ
దన యూనగంభీరతకుఁ జాల కబలల యూనంబు లందెల నండగొనఁగఁ
దన కరశ్రీఁ గని తలఁగి బాలల చిఱు దొడలు మేఖలదీప్తిఁ దోడుపిలువఁ
దన దంతరుచి కోడి తరుణుల నగవులు ముఖచంద్ర దీప్తుల ముసుఁగు దిగువఁ

తే. దనదు లావణ్యరూపంబుఁ దలఁచి చూడ
నంజనాభ్రము కపిలాది హరిదిభేంద్ర
దయిత లందఱుఁ దనవెంటఁ దగిలి నడువ
గుంభివిభుఁ డొప్పె నొప్పుల కుప్పఁబోలి. 40

వ. మఱియు నానా గహనవిహరణ మహిమతో మదగజేంద్రంబు మార్గంబుఁ
దప్పి, పిపాసా పరాయత్తచిత్తంబున మత్తకరేణువుల మొత్తంబునుం దానును
జని చని. 41

మ. అటఁ గాంచెఁ గరిణీవిభుండు నవ ఫుల్లాంభోజ కల్హారముఁ
[2]నట దిందిందిర వారమున్ గమఠ మీన గ్రాహ దుర్వారముఁ
వట హింతాళ రసాల సాల సుమనో వల్లీ కుటీ తీరముఁ
చటులోద్ధూత మరాళ చక్ర బక సంచారంబుఁ గాసారముఁ. 42

వ. ఇట్లనన్య పురుషసంచారంబును, నిష్కళంకంబును నైన యప్పంకజాకరంబుఁ
బొడగని. 43

సీ. తోయజగంధంబు దోఁగిన చల్లని మెల్లని గాడ్పుల మేను లలర
గమల నా ళావహార విమల వా క్కలహంస రవములు సెవుల పండువులు సేయ
ఫుల్ల దిందీవ రాంభోరు హామోదంబు ఘ్రాణరంధ్రంబుల గారవింప
నిర్మల కల్లోలనిర్గ తాసారంబు వదనగహ్వ్వరముల వాడు దీర్పఁ

తే. ద్రిజగ దభినవ సౌభాగ్య దీప్త మైన
విభవ మిథునములకును విందు సేయ
నరిగి పంచేంద్రియ వ్యవహారములను
మఱచి మత్తేభయూథంబు మడుఁగుఁ జొచ్చె. 44

క. తొండంబులఁ బూరింపుచు, గండంబులఁ జల్లుకొనుచు గళగళ రవముల్
మెండుకొన వలుదకడుపులు, నిండన్ వేదండకోటి నీరుం ద్రావెన్. 45

వ. అప్పుడు. 46

---

1. కొంగులీవ (హ) 2. నటదిందీవర (క. ట. త. ద. బ.)

మ. ఇభలోకేంద్రుఁడు హస్తరంధ్రముల నీ రెక్కించి పూరించి చం
డభ మార్గంబున కెత్తి నిక్కి వడి [1]నుడ్డాడించి [2]పింజింప నా
రభటి †న్నీరములోనఁ బె ల్లెగసి నక్ర గ్రాహ పాఠీనముల్
నభమం దాడెడు మీన కర్కటములన్ బట్టెన్ సురల్ మ్రాన్పడన్. 47 48

వ. మఱియు, న గ్గజేంద్రం బనర్గళ విహారంబున.

సీ. కరిణీ కరోత్క్షిప్త కంకణ చ్ఛటఁ దోఁగి సెలయేటి నీలాద్రి చెలువుఁ దెగడు
హస్తినీ హస్తవిన్యస్త పద్మంబుల వేయుగన్నులవాని వెలివు సూపు
కలభ సముత్కీర్ణ కల్హార రజమునఁ గనకాచలేంద్రంబు ఘనతఁ దాల్చుఁ
గుంజరీ పరిచిత కుముద కాండంబుల ఫణిరాజమండన ప్రభ వహించు

ఆ. మదక రేణు ముక్త మౌక్తిక శుక్తుల
మెఱుఁగు మొగిలుతోడ మేలమాడు
నెదురులేని గరిమ నిభరాజ మల్లంబు
వనజగేహకేళి వ్రాలు నపుడు. 49

వ. మఱియు, నా సరోవరలక్ష్మి మదగజేంద్ర వివిధ విహార వ్యాకులిత నూతన
లక్ష్మీవిభవ యై, యనంగవిద్యా నిరూఢ పల్లవప్రబంధ పరికంపిత శరీరాలంకార
యగు కుసుమకోమలియునుం బోలె; వ్యాకీర్ణ చికుర మత్తమధుకర నికరయు,
విగతరస వదనకమలయు, నిజస్థాన చలిత కుచ రథాంగయుగళ లంపటిత జఘన
పులినతలయు నై యుండె. అంత. 50

సీ. భుగభుగాయుత భూరి బుద్బుద చ్ఛటలతోఁ గదలుచు దివికి భంగంబు లెగయ
భువన భయంకర ఫూత్కార రవమున ఘోర నక్ర గ్రాహకోటి బెగడ
వాలవిక్షేప దుర్వార ఝంఝానిల వశమున ఘుమఘు మావర్త మడరఁ
గలోల జాల సంఘట్టనంబులఁ దటీ [4]తరులు మూలములతో ధరణిఁ గూల

తే. సరసిలోనుండి పొడగని సంభ్రమించి
యుదరి కుప్పించి లంఘించి హుంకరించి
భానుఁ గబళించి పట్టు స్వర్భానుపగిది
నొక్క మకరేంద్రుఁ డిభరాజు నొడిసి పట్టె. 51

---

1. నొడ్డాణించి (క.ట.జ.డ.ద) 2. పైఁజిందు (హ) † నీరముతోన పెల్లెగసి-అనియుండుట యుచితము. 3. నభమం దాడగ వాని బట్టి ఖగముల్ నాకాకసుల్ మ్రాన్పడన్ (క. జ. డ. బ.)
4. తరు లమూలంబులై (తం. వా.)

క. వడి దప్పించి కరీంద్రుఁడు, నిడుదకరం బెత్తి [1]వ్రేయ నీరాటంబుం
బొడ వడఁగినట్లు జలములఁ, బడి కడువడిఁ బట్టెఁ బూర్వ పదయుగళంబున్. 52

చ. పదములఁ బట్టినం దలఁకుఁబా టొకయింతయు లేక శూరతన్
మదగజ వల్లభుండు ధృతిమంతుఁడు దంతయుగాంత ఘట్టనన్
జెదరఁగ జిమ్మె న మ్మకరి చిప్పలు పాదులు దప్ప [2]నొప్పఱన్
వదలి జలగ్రహంబు కరి వాలము మూలమునఁ జీరెఁ [3]గోఱలన్. 53

క. కరిఁ దిగుచు మకరి సరసికిఁ, [4]గరి దరికిని మకరిఁ దిగుచుఁ [5]గరకరి బెరయన్
కరికి మకరి మకరికిఁ గరి, [6]భర మన ని ట్లుతల కుతల భటు లదిరిపడన్. 54

వ. ఇట్లు కరిమకరంబులు రెండును నొండొండ సముద్దండ దండంబు లై తలపడి, నిఖిల లోకాలోకన భీకరంబు లై, యన్యోన్య విజయశ్రీ వశీకరంబు లై, సంక్షోభిత కమలాకరంబు లై, హరి హరియును, గిరి గిరియునుం దాఁకి, పిఱుతివియక వెనంగుతెఱంగున, నీరాటం బైన [7]పోరాటంబునఁ బట్టుచు వెలికి లోనికిం దిగుచుచుఁ, గొలంకు కలంకం బందఁ, గడువడి ని ట్టట్టుపడి, తడఁబడక, బుడబుడానుకారంబు లై, భుగులు భుగుల్లను చప్పుళ్లతో నురువులు గట్టుచు, జలంబులుప్పరంబున కెగయం జప్పరింపుచుఁ, దప్పక వదనగహ్వారంబుల నప్పళింపుచు, నిశిత నితాంత దురంత దంతకుంతంబుల నింతింతలు దునియ లై, నెప్పళంబునం బునుకచిప్పలు కుదుళ్లుదప్పి రక్తంబులు గ్రమ్ముదేర, హుమ్మని యొక్కుమ్మడిం జిమ్ముచు, నితరేతర సమాకర్షణంబులం గదలక, పదంబులు మొదలిపట్టు వదలక, కుదు రై [8]యుండుచుఁ, బరిభ్రమణ వేగంబున జలంబులం దిరుగుచు, మకర కమఠ కర్కటగండక మండూకాది సలిలనిలయంబుల ప్రాణంబులు క్షీణంబులుగా, నొక టొకటిం దాఁకు రభసంబున నిక్కలువడ ముక్కుం ద్రొక్కుచు, మెండు చెడి, బెండువడి, నాఁచు గుల్లచిప్ప తండంబులం బరస్పర తాడనంబులకు నడ్డంబుగా నొడ్డుచు, నోల మాసగొనక, గెలుపుఁదలంపులు బెట్టిదంబు లై రెట్టింప, నహోరాత్రంబులుం బోలెఁ గ్రమక్రమ విజృంభమాణంబు లై, బహుకాల కలహావిహారంబు లై, నిర్గత నిద్రాహారంబు లై, యవక్ర పరాక్రమ ఘోరంబు లై, పోరుచున్న సమయంబున. 55

క. జవమును జలమును బలమును, వివిధములుగఁ బోరు కరటి వీరతకు భువిన్
దివి మకర మీన కర్కట, నివహము లొక్కటన మిత్రనిలయముఁ బొందెన్.

---

1. వైవ (హ) 2. నుప్పరన్ (హ) 3. గోరులన్ (హ) 4. కరి ధరణికి మకరి (క-బ.)
5. కరి కరి బెరయన్ (హ.) 6. భరమనుచును నతల కుతల భటులరుదుపడన్ (తం. వా.)
7. పోరాటం బెట్టుచు (హ) 8. వర్తించు (తం. వా.)

శా. ఆటోపమ్మునఁ జిమ్ము ఱొ మ్మగల వజ్రాభీల దంతమ్ములన్
దాఁటించున్ మెడఁ జుట్టి పట్టి హరి దోర్దండాభ ఖండాహతిన్
నీటన్ మాటికి మాటికిం దిగువఁగా నీరాటము న్నీటి పో
రాటం దోటమిపాటుఁ జూపుట[1] కరణ్యాటంబు వాచాట మై. 57

వ. అప్పుడు. 58

ఆ. మకరితోడఁ బోరు మాతంగవిభుని నో
క్కఁరుని డించిపోవఁ గాళ్ళురాక
కోరి చూచుచుండెఁ గుంజరీయూథంబు
మగలు తగులుగారె మగువలకును. 59

వ. అంత. 60

ఆ. జీవనంబు దనకు జీవనం బై యుంట
నలవు చలము నంత కంత కెక్కి
మకర మొప్పె డస్సె మత్తేభమల్లంబు
బహుళపక్ష శీతభాను పగిది. 61

మ. ఉఱుకుం గుంభయుగంబుపై హరిక్రియన్ హుమ్మంచు పాదంబులం
దిఱుకుం గంఠము వెన్నుదన్న నెగయున్ హేలాగతిఁ వాలమున్
జఱచు న్నుగ్గుగఁ దాఁకు ముంచు మునుఁగున్ శల్యంబులున్ దంతముల్
విఱుగన్ ప్రేయుచుఁ బొంచి పొంచి కదియున్ వేదండ యూథోత్తమున్. 62

మ. పొడ గానంబడకుండ డాఁగు వెలికిం బోవంగఁ దా నడ్డ మై
పొడచూపుం జరణంబులం బెనఁగొనుం బోరాక రారాక బె
గ్గడిలం గూలఁగఁ [2]దాఁచు లేచుతటి నుద్ఘాటించు లంఘించు బల్
విడి జీరున్ దలఁగున్ మలంగు నొడియున్ వేధించుఁ గ్రోధించుచున్. 63

వ. ఇట్లు విస్మిత నక్రచక్రం బై, నిర్వక్ర విక్రమంబున, నల్ప హృదయ జ్ఞానదీపంబు
నతిక్రమించు మహా మాయాంధకారంబునుం బోలె, నంతకంతకు నుత్సాహ
కలహ సన్నాహ బహువిధ జలావగాహం బై న గ్రాహంబును మహోసాహసంబున.

శా. పాదద్వంద్వము నేల మోపి పవనున్ బంధించి పంచేంద్రియో
న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్ [3]మాఱాకు హత్తించి [4]ని
ష్ఖేద బ్రహ్మపదావలంబన గతిం గ్రీడించు యోగీంద్రు మ
ర్యాద న్నక్రము విక్రమించెఁ గరి పాదాక్రాంత నిర్వక్ర మై. 65

---

1. జూపక యరణ్యటంబు? 2. దాఁటు(హ) 3. మాఱాకులొత్తించి(ట.త.జ.డ.) 4. నిఃఖేద(హ)

ఆ. వనగజంబు నెగుచు వనచారిఁ బొడగని
వనగజంబె కాన వ్రజిగజము
వెల్ల నై సురేంద్రు వేచి సుధాంధులఁ
బట్టు పట్టనీక బయలు వ్రాఁకె. 66

ఉ. ఊహ కలంగి జీవనపు టోలమునం బడి పోరుచుఁ మహా
మోహలతా నిబద్ధపదముఁ విడిపించుకొనంగలేక సం
దేహముఁ బొందు దేహిక్రియ దీనదశఁ గజ ముండె భీషణ
గ్రాహ దురంతదంత పరిఘట్టిత పాద ఖురాగ్ర శల్య మై. 67

వ. ఇ ట్లవ్విధంబున. 68

క. అలయక సొలయక వేసట, నొలయక కరి మకరితోడ నుద్దండత రా
త్రులు సంధ్యలు దివసంబులు, సలిపెఁ బో రొక్కవేయి సంవత్సరముల్. 69

మ. పృథుశక్తిఁ గజ మా జలగ్రహముతోఁ బెక్కండ్లు పోరాడి సం
శిథిలం బై తనలావు వై రిబలముం జింతించి మిథ్యా మనో
రథ మింకేటికి దీని గెల్వ సరి పోరం జాలరా దంచు స
వ్యథ మై యి ట్లనుఁ బూర్వపుణ్య ఫల దివ్యజ్ఞాన [1]సంపత్తితోఁ. 70

అధ్యాయము - 8

శా. ఏ రూపంబున దీని గెల్తు, నిటమీఁ దే వేల్పుఁ జింతింతు, నె
వ్వారిం జీరుదు, నెవ్వ రడ్డ మిఁక, ని వ్వారిప్రచారో త్తముఁ
వారింపం దగువార లెవ్వ, రఖిల వ్యాపారపారాయణుల్
లేరే, మ్రొక్కెద దిక్కుమాలిన మొ ఱాలింపం బ్రపుణ్యాత్మకుల్. 71

శా. నానానేకప యూథముల్ వనములోనం బెద్దకాలంబు స
న్మానింపఁ దశలక్షకోటి కరిణీనాథుండ నై యుండి మ
ద్దానాంభఃపరి[2]పుష్ట చందన లతాంత చ్ఛాయలం దుండలే
కీ నిరాశ నిచేల వచ్చితి, భయం బెట్లోకదే, యీశ్వరా! 72

ఉ. ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీన మై
యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాది మధ్య లయుఁ డెవ్వఁడు సర్వముఁ దాన యైన వాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్. 73

---

1. వేయు (హ) 2. సంపూర్తితో (క. చ. ట. త. జ. డ.) 3. పూర్ణ (హ)

క. ఒకపరి జగములు వెలినిడి, యొకపరి లోపలికిఁ గొనుచు నుభయముఁ [1]దా నై
సకలార్థ సాక్షి యగు న, య్యకలంకుని నాత్మమూలు నర్థిఁ దలంతున్. 74

క. లోకంబులు లోకేశులు, లోకస్థులుఁ దెగినతుది నలోకం బగు పెం
జీఁకటి కవ్వల నెవ్వఁడు, నేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్. 75

క. నక్తకునిభంగిఁ బెక్కగు, మూర్తులతో నెవ్వఁ డాడు మునులున్ దివిజుల్
కీర్తింప నేర నెవ్వని, వర్తన మెరు లెఱుఁగ రట్టి వాని నుతింతున్. 76

ఆ. ముక్తసంగు లైన మునులు దిదృక్షులు
సర్వభూత హితులు సాధుచిత్తు
లసదృశ వ్రతాఢ్యు లై కొల్తు రెవ్వని
దివ్యపదము, వాఁడు దిక్కు నాకు. 77

సీ. భవము దోషంబు రూపంబు కర్మంబు నాహ్వాయమును గుణము లెవ్వనికి లేక
జగములఁ గలిగించు సమయించుకొఱకు నై నిజమాయ నెవ్వఁ డిన్నియునుదాల్చు
[2]నా పరేశునకు ననంతశక్తికి బ్రహ్మ [3]కిద్ధరూపికి రూపహీనునకును
జిత్రచారునకు సాక్షికి [4]నాత్మరుచికినిఁ బరమాత్మునకుఁ బరబ్రహ్మమునకు

ఆ. మాటల న్నెఱుకల మనములఁ జేరంగఁ
[5]గాని శుచికి సత్త్వగమ్యుఁ డగుచు
నిపుణుఁ డై నవాని నిష్కర్మతకు మెచ్చు
వాని కే నొనర్తు వందనములు. 78

సీ. శాంతున కపవర్గ సౌఖ్య సంవేదికి, నిర్వాణ భర్తకు నిర్విశేషు
నకు, ఘోరునకు మూఢునకు గుణధర్మికి సౌమ్యున కధికవిజ్ఞానమయున
కఖలేంద్రియద్రష్ట కధ్యక్షునకు బహు క్షేత్రజ్ఞునకు దయాసింధుమతికి
మూలప్రకృతి కాత్మ [6]మూలునకు జితేంద్రియ జ్ఞాపకునకు దుఃఖాంతకృతికి

ఆ. నెఱిన సత్య మనెడి నీడతో వెలుఁగుచు
నుండు నొక్కటికి మహోత్తమునకు
నిఖలకారణునకు, నిష్కారణునకు న
మస్కరింతు నన్ను మనుచు కొఱకు. 79

క. యోగాగ్ని దగ్ధకర్మ్ములు, యోగీశ్వరు లే మహాత్ము నొం డెఱుఁగక స
ద్యోగ విభాసిత మనముల, భాగుగ వీడింతు రట్టి పరము భజింతున్. 80

---

1. గనుచున్ (క) 2. ఆపరమేశు కనంత శక్తికి (క) 3. వేదరూపికి రూపవిరహితునకు (ట)
4. ఆత్మవిభునకు(క.ట.) 5. రాని శుచికి సత్త్వరమ్యుడగు(ట) 6. మూలున కఖలేంద్రియ(తం.వా.)

సీ. సర్వాగమామ్నాయ జలధికి నపవర్గ మయునికి నుత్తమ మందిరునకు
సకల గుణారణి చ్ఛన్న బోధాగ్నికిఁ దనయంత రాజిల్లు ధన్యమతికిఁ
గుణలయోద్దీపిత గురుమానసునకు సంవర్తిత కర్మనిర్వర్తితునకు
దిశలేని నాబోఁటి పశువుల పాపంబు లణఁచువానికి సమస్తాంతరాత్మ్మఁ

ఆ. డై వెలుంగువాని, కచ్ఛిన్ననకు, భగ
వంతునకుఁ [1]దనుజ సువసు దేశ
దార సక్తు లైనవారి కందఁగరాని
వాని కాచరింతు వందనములు. 81

వ. మఱియును. 82

సీ. *వర ధర్మ కామార్థ వర్జితకాము లై విబుధు లెవ్వాని సేవించి యిష్ట
గతిఁ బొందుదురు చేరి కాఙ్క్షించువారి కవ్యయ దేహ మిచ్చు నెవ్వాఁడు కరుణ
ముక్తాత్మ్మ లెవ్వని మునుకొని చింతింతు రానంద వార్ధి మ గ్నాంతరంగు
లేకాంతు లెవ్వని నేమియుఁ గోరక భద్రచరిత్రంబుఁ బాడుచుందు

ఆ. రా మహేశు నాద్యు నవ్యక్తు నధ్యాత్మ
యోగగమ్యుఁ బూర్ణు నున్న తాత్ము
బ్రహ్మ మైన వానిఁ [2]బరుని నతీంద్రియు
నీశు [3]స్థూలు సూక్ష్మ్ము నే భజింతు. 83

వ. అని మఱియు ని ట్లని వితర్కించె, 84

సీ. పావకుం డర్చుల భానుండు దీప్తుల నె బ్భంగి నిగిడింతు రె ట్లడంతు,
రా క్రియ నాత్మకరావళిచేత బ్ర హ్మాదుల వేల్పుల నఖిలజంతు
గణముల జగముల ఘన నామ రూప భే దములతో మెఱయించి తగ నడంచు
నెవ్వఁడు మనము బుద్ధీంద్రియములుఁ దాన యై గుణ [4]సంప్రవాహంబుఁ బఱపు

తే. స్త్రీ నపుంసక పురుష మూర్తియును గాక
తిర్య గమర నరాది మూర్తియును గాక
కర్మ గుణ భేద స దస త్ప్రకాశి గాక
వెనుక నన్నియుఁ దా నగు విభుఁ దలంతు. 85

క. కలఁ డందురు దీనులయెడఁ, గలఁ డందురు పరమయోగి గణములపాలం,
గలఁ డందు రన్ని దిశలను, గలఁడు గలం డనెడువాఁడు గలఁడో లేఁడో. 86

---

1. దనూజపశునివేశ (ట.డ.); * "యం ధర్మ కామార్థ విముక్తి కామా భజంత ఇష్టాంగతి మాప్ను వంతి." (3-19) 2. బరము (తం.) 3. దూరు (వా.); 'అతీంద్రియం సూక్ష్మ మివాతిదూర మనంత మిద్యం పరిపూర్ణమీడే." (3-21) 4. సంప్రవాహంపు బరపు (హ.)

సీ. కలుగఁడే నాపాలి కలిమి [1]సందేహింపఁ గలిమిలేములు లేక గలుగువాఁడు
నా కడ్డపడ రాఁడె నలి నసాధువులచేఁ బడిన సాధుల కడ్డపడెడు వాఁడు
చూడఁడే నా పాటు చూపులఁ జూడక చూచువారలఁ గృపఁ జూచువాఁడు
లీలతో నా మొ ఱాలింపఁడే మొఱఁగుల మొఱ లెఱుంగుచుఁ దన్ను
మొఱఁగువాఁడు

తే. నఖిల రూపులుఁ దనరూప మైనవాఁడు
[2]నాది మ ధ్యాంతములు లేక యడరువాఁడు
భ క్తజనముల దీనుల పాలివాఁడు
వినఁడె చూడఁడె తలపఁడె వేగ రాఁడె, 88

క. విశ్వకరు విశ్వదూరుని, విశ్వాత్మకు విశ్వవేద్యు విశ్వు నవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మప్రభు, నీశ్వరునిం [3]బరమపురుషు నే భజియింతున్. 89

వ. అని పలికి, తన మనంబున నగ్గజేంద్రుం డీశ్వర సన్నిధానంబుఁ గల్పించుకొని యిట్లనియె.

శా. లా వొక్కింతయు లేదు, ధైర్యము విలోలం బయ్యెఁ, బ్రాణంబులున్
తావుల్ దప్పెను, మూర్ఛ వచ్చెఁ, దనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్,
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ, మన్నింపందగున్ దీనునిన్,
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా! 90

క. విను దఁట జీవుల మాటలు, జను దఁట చనరానిచోట్ల శరణార్థుల కో
యను దఁట పిలిచిన సర్వముఁ, గను దఁట సందేహ మయ్యెఁ గరుణావార్ధీ! 91

ఉ. ఓ కమలాత్మ! యో వరద! యో ప్రతిపక్ష విపక్షదూర! కు
య్యో! కవి యోగి వంద్య! సుగుణోత్తమ! యో శరణాగ తామరా
నోకహ! యో మునీశ్వర మనోహర! యో విపులప్రభావ! రా
వే, కరుణింపవే, తలఁపవే, శరణార్థిని నన్నుఁ గావవే. 92

వ. అని పలికి, మఱియు నరక్షిత రక్షకుండైన యీశ్వరుం డాపన్నుండైన [1]నన్నుం గాచుఁ గాక యని, నింగి నిక్కి చూచుచు, నిట్టూర్పులు నిగిడింపుచు, బయ లాలకింపుచు, నగ్గజేంద్రుండు మొఱసేయుచుల్న సమయంబున,

---

1. సందేహించి (హ.) 2. ప్రథమ మధ్యాంతముల గానబడెడు వాడు (క.) .... గానబడని వాడు (ట.) 3. బరమపరుని నే ప్రణుతింతున్ (ట.)

ఆ. విశ్వమయత లేమి వినియు నూరక యుండి
రంబుజాసనాదు [1]లడ్డపడక
విశ్వమయుఁడు విభుఁడు విష్ణుండు జిష్ణుండు
భక్తియుతున కడ్డపడఁ[2] దలంచి. 94

మ. అల వైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబు దా
పల మందార వనాంత రామృతసరఃప్రాం తేందుకాం తోప లో
త్పల పర్యంక రమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి
హ్వాలనాగేంద్రము "పాహి పాహి" యనఁ గు య్యాలించి సంరంభి యై. 95

మ. సిరికిం జెప్పఁడు శంఖ చక్ర యుగముం జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణి కాం
తర ధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాద [3]ప్రోద్ధత శ్రీ కుచో
పరి చేలాంచల మైన వీడఁడు గజ ప్రాణావ నోత్సాహి యై. 96

వ. ఇట్లు భక్తజనపాలన పరాయణుండును, నిఖల జంతు హృదయారవింద సదన సంస్థితుండును నగు నారాయణుండు, కరికులేంద్ర విజ్ఞాపిత నానావిధ దీనాలాపంబు లాకర్ణించి, లక్ష్మీకాంతా వినోదంబులం దనివి సాలించి, సంభ్రమించి, దిశలు నిరీక్షించి, గజేంద్ర రక్షాపరత్వంబు నంగీకరించి, నిజ పరికరంబును మరల నవధరించి, గగనంబున కుద్గమించి, వేంచేయు నప్పుడు. 97

మ. తనవెంటఁ సిరి, లచ్చివెంట నవరోధ వ్రాతముఁ, దాని వె
న్కను బఱీంద్రుఁడు, వాని పొంతను ధనుఃకౌమోదకీ శంఖ చ
క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండుఁ [4]దా వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగువా రాబాల గోపాలముఁ. 98

వ. తదనంతరంబ ముఖారవింద మకరంద బిందుసందోహ పరిష్యందమా నానంద దిందిందిర యగు న య్యిందిరాదేవి, గోవింద కరారవింద సమాకృష్యమాణ సంవాద చేలాంచల యై పోవుచు. 99

మ. తన వేంచేయు పదంబుఁ బేర్కొనఁ, డనాథ స్త్రీ జనాలాపముల్
వినెనో, మ్రుచ్చులు మ్రుచ్చిలించిరో [5]ఖలుల్ వేదప్రపంచంబులఁ,
దనుజానీకము దేవతా నగరిపై దండెత్తెనో, భక్తులం .
గని చక్రాయుధుఁ డేఁడి చూపుఁ డని ధిక్కారించిరో దుర్జనుల్. 100

---

1. లడ్డపడఁగ (హ.) 2. కడ్డఁబడదలంచి (హ.) కడ్డపడఁదలంచె (తం.వా.)
3. ప్రోత్థిత (తం. వా.) 4. రా వచ్చిరొయ్యన (తం. వా.) 5. ఖరుల్ (హ.)

వ. అని వితర్కింపుచు. 101

శా. తాటంకాచలనంబుతో, భుజ నట ద్ధమ్మిల్ల బంధంబుతో,
శాటీ ముక్త కుచంబుతో, నదృఢ చంచ త్కాంతితో, శీర్ణ లా
లా టాలేపముతో, మనోహర కరాలగ్నో త్తరీయంబుతోఁ
గోటీందు ప్రభతో, నురోజ భర సంకోచ ద్వలగ్నంబుతోన్. 102

క. అడిగెద నని కడువడిఁ జను, నడిగిన దను మగుడ నుడుగఁ డని నడ యుడుగున్
వెడ వెడ సిడిముడి తడఁబడ, నడుగిడు [1]నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్. 103

సీ. నిటలాలకము లంటి నివుర జుం జు మ్మని ముఖసరోజము నిండ ముసరుఁ దేంట్లు
నళులఁ జోఁపగఁ జిల్క లల్ల నల్లనఁ జేరి యోష్ఠబింబ ద్యుతు లొడియ నుఱుకు
శుకములఁ దోలఁ జతుర్మినములకు మందాకినీ పాఠీనలోక మెగుచు[2]
మీనపంక్తులు దాఁట మెయిదీఁగెతో రాయ శంపాలతలు మింట సరణి గట్టు

ఆ. శంపలను జయింపఁ జక్రవాకంబులు
కుచయుగంబుఁ దాఁకి క్రొవ్వు చూపు
మెలఁత మొగులు పిటీఁది మెఱుఁగుఁ దీగెయుఁబోలె
జలదవర్ణు వెనుక జరుగు నపుడు. 104

మ. వినువీథిం జనుదేరఁ గాంచి రమరుల్ విష్ణు సురారాతి జీ
వనసంపత్తి నిరాకరిష్ణుఁ గరుణా వర్ధిష్ణు యోగీంద్ర హృ
ద్వన వర్తిష్ణు సహిష్ణు భక్తజన బృందప్రాభ వాలంకరి
ష్ణు నవోద్యోల్లస దిందిరా పరిచరిష్ణున్ జిష్ణు రోచిష్ణునిన్. 105

వ. ఇట్లు పొడగని. 106

మ. చనుదెంచెన్ ఘనుఁ డల్ల వాఁడె హరి పజ్జం గంటిరే లక్ష్మీ శం
ఖనినాదం బదె చక్ర మల్లదె భుజంగధ్వంసియున్ వాఁడె క్ర
న్ననఁ నేతెంచె నటంచు వేల్పులు నమో నారాయణా యేతి ని
స్వను లై క్రమొక్కిరి మింట హస్తిదురవస్థావక్రికిం జక్రికిన్. 107

వ. అ య్యవసరంబునఁ గుంజరేంద్రపాలన పారవశ్యంబున దేవతానమస్కారంబు లంగీకరింపక, మనస్సమాన సంచారుం డై, పోయి పోయి, కొంతదూరంబున శింశుమార చక్రంబునుంబోలె గురు మకర కుళీర మీన మిథునం బై, కిన్న రేంద్రుని భాండాగారంబునుంబోలె స్వచ్ఛ వర కచ్ఛపం బై, భాగ్యవంతుని

---

1. నుడుగిడను (హ.) 2. మెనఁగు (హ.)

భాగధేయంబునుం బోలె సరాగ జీవనం బై, వైకుంఠపురంబునుంబోలె శంఖ
చక్ర కమలాలంకృతం బై, సంసారచక్రంబునుంబోలె ద్వంద్వ సంకుల పంక
సంకీర్ణం బై యొప్పు న ప్పంకజాకరంబుఁ బొడగని. 108

మ. కరుణాసింధుఁడు శౌరి వారిచరమున్ ఖండింపఁగాఁ బంపె స
త్వరితాకంపిత [1]భూమిచక్రము మహోద్య ద్విస్ఫులింగ చ్ఛటా
పరిభూ తాంబర శుక్రమున్ బహువిధ బ్రహ్మాండభాండ చ్ఛటాం
తర నిర్వక్రముఁ బాలి తాఖిల సుధాంధ శ్చక్రముం జక్రమున్. 109

వ. ఇట్లు పంచిన. 110

శా. అంభోజాకర మధ్య నూతన నళి న్యాలింగన క్రీడనా
రంభుం డైన వెలుంగుఱేని చెలు వారన్ వచ్చి నీటన్ గుభుల్
గుంభ ధ్వానముతోఁ గొలంకువు గలంకం బొందఁగాఁ జొచ్చి దు
ష్టాంభోవర్తి వసించు చక్కటికి డాయంబోయి హృద్వేగ మై. 111

శా. భీమం బై తలఁ ద్రుంచి ప్రాణములఁ బాపెం జక్ర మాశుక్రియన్
హేమక్ష్మాధర దేహముం జకిత వన్యేభేంద్ర సందోహమున్
గామ క్రోధన గేహమున్ గరటి రక్తస్రావ గాహంబు ని
స్సీ మోత్సాహము వీతదాహము జయశ్రీ మోహమున్ గ్రాహమున్. 112

వ. ఇట్లు నిమిషస్పర్శనంబున సుదర్శనంబు మకరి తల ద్రుంచు నవసరంబున. 113

క. మకర మొకటి రవిఁ జొచ్చెను, మకరము మఱి యొకటి ధనదు మాటున డాఁగెన్,
మకరాలయమునఁ దిరిగెడు, మకరంబులు కూర్మరాజు మఱువున కరిగెన్. 114

మ. తమముం బాసిన రోహిణీవిభు క్రియన్ దర్పించి, సంసారదుః
ఖము వీడ్కొన్న విరక్తచిత్తుని గతిన్ గ్రాహంబు పట్టూడ్చి, పా
దము లల్లార్చి, కరేణుకావిభుఁడు సౌందర్యంబుతో నొప్పె, సం
భ్రమ దాశా కరిణీ కరోజ్ఝిత సుధాంభస్సాన విశ్రాంతుఁ డై. 115

శా. పూరించెన్ హరి పాంచజన్యముఁ, గృపాంభోరాశి సౌజన్యమున్,
భూరిధ్వాన చలాచలీకృత మహాభూత ప్రచైతన్యమున్,
సారోదార సితప్రభా చకిత పర్జన్యాది రాజన్యమున్,
దూరీభూత విపన్న దైన్యమును, నిర్ధూత ద్విష త్సైన్యమున్. 116

---

1. భూరిచక్రము (హ.)

అధ్యాయము - ౪

మ. మొఱసె న్నిర్జరదుందుభుల్, జలరుహామోదంబు లై వాయువుల్
దిరిగెఁ, బువ్వుల వానజల్లు గురిసెఁ, దేవాంగనా లాస్యముల్
పరఁగెఁ, దిక్కులయందు జీవ జయ[1] ఖేల ధ్వానముల్ నిండె, సా
గర ముప్పొంగెఁ దరంగచుంబిత నభోగంగా ముఖాంభోజ మై. 117

క. నిడుద యగు కేల గజమును, మడువున వెడలంగఁ దిగిచి మదజలరేఖల్
దుడుచుచు మెల్లన పుణుకుచు, నుడివెన్ విష్ణుండు దుఃఖ ముర్వీనాథా! 118

క. [2]శ్రీహరి కర సంస్పర్శను, దేహము దాహంబు మాని ధృతిఁ గరిణీ సం
దోహమును దాను గజపతి, మోహన ఘీంకారశబ్దములతోఁ నొప్పెఁ. 119

క. కరమున మెల్లన [3]నివురుచుఁ, గర మనురాగమున మెఱసి కలయంబడుచున్
గరి హరికతమున బ్రతుకుచుఁ, గరపీడన మాచరించెఁ గరిణుల మరలఁ. 120

సీ. జనినాథ! దేవలశాప విముక్తుఁ డై పటుతర గ్రాహరూపంబు మాని
ఘనుఁడు హూహూనామ గంధర్వుఁ డప్పుడు తన తొంటి నిర్మలతనువుఁ దాల్చి
హరికి నవ్యయునకు నతిభక్తితో ప్రొక్కి తవిలి కీర్తించి గీతములు వాడి
యా దేవు కృప నొంది యందంద మటీయును వినతశిరస్కుఁ డై వేడ్కతోడ

ఆ. దళితపాపుఁ డగుచుఁ దనలోకమున కేఁగె
నపుడు శౌరి కేల [4]నంటఁ దడవ
హస్తిలోకనాథుఁ డజ్ఞానరహితుఁ డై
విష్ణురూపుఁ డగుచు వెలుఁగుచుండె. 121

మ. అవనీనాథ! గజేంద్రుఁ డా మకరితో నాలంబు గావించె, ముఁ
ద్రవిళాధీశుఁ డతండు పుణ్యతముఁ డింద్రద్యుమ్న నాముండు, వై
ష్ణవముఖ్యుండు, గృహీత మౌననియతిఁ సర్వాత్మ నారాయణుఁ
సవిశేషంబుగఁ బూజ చేసెను మహాశైలాగ్ర భాగంబునఁ. 122

మ. ఒకనాఁ డా నృపుఁ డచ్యుతుఁ మనములో నూహింపుచున్ మౌని యై
యకలంకస్థితి నున్నచోఁ గలశజుం డ చ్చోటికిఁ వచ్చి లే
వక పూజింపక యున్న [5]రాజుఁ గని నవ్యక్రోధుఁ డై మూఢ! లు
బ్ధ కరీం ద్రోత్తమ యోనిఁ బుట్టు మని శాపం బిచ్చె భూవల్లభా! 123

---

1 శబ్దధ్వానముల్ (తం. వా.) 2. శ్రీహరి సంస్పర్శనమున (హ.) 3. పుణుకుచు (క. ట.)
4. నంటనడవ (హ.) నంటితడవ (తం.) నంటినడవ (వా.) అంటఁదడవ = అంటినంతనే-అని యర్థము.
5. మౌనిఁగని (హ. తం. వా.)

క. మునిపతి నవమానించిన, ఘనుఁ డింద్రద్యుమ్నవిభుఁడు [1]గౌంజరయోనిం
జననం బందెను విప్రులఁ, గని యవమానింపఁ దగ దు ఘనపుణ్యులకున్. 124

క. కరినాథుఁ డయ్యో నాతఁడు, కరు లై రి ‡భటాదు లెల్ల గజ మై [2]యుండిన్
హరి చరణసేవ కతమునఁ, గరివరునకు నధికముక్తి గలిగె నరేంద్రా! 125

ఆ. కర్మతంత్రుఁ డగుచుఁ గమలాతుఁ గొల్చుచు
నుభయనియతవృత్తి నుండెనేనిఁ
జెడును గర్మమెల్ల శిథిల మై మెల్లనఁ
బ్రబల మైన విష్ణుభక్తి చెడదు. 126

క. చెడుఁగరులు హరులు ధనములుఁ, జెడుదురు నిజసతులు సుతులుఁ జెడు చెనఁటులకున్
జెడక మను నెఱుగుగుణులకుఁ, జెడని పదార్థములు విష్ణుసేవా నిరతుల్. 127

వ. అప్పుడు జగజ్జనకుం డగు న ప్పరమేశ్వరుండు దరహసిత ముఖకమల యగు
న క్కమల కి ట్లనియె. 128

క. బాలా! నా వెనువెంటను, హేల విను వీథినుండి యేతెంచుచు నీ
చేలాంచలంబుఁ బట్టుట, కాలో నేమంటి నన్ను నంభోజముఖీ! 129

క. ఎఱుఁగుదు తెఱవా! యెప్పుడు, మఱవను సకలంబు నన్ను మఱచిన యెడలన్
మఱతునని యెఱిఁగి మొఱఁగక, మఱవక మొఱయిడిర యేని మఱి యన్యములన్

వ. అని పలికిన, నరవింద మందిర యగు న య్యిందిరాదేవి మందస్మిత చంద్రికా
వదనారవింద యగుచు ముకుందున కి ట్లనియె. 131

క. దేవా! దేవర యడుగులు, భావంబున నిలిపి కొలుచు పని నాపని గా
కో వల్లభ! యేమనియెద, నీవెంటనె వచ్చుచుంటి నిఖలాధిపతీ! 132

క. దీనుల కుయ్యాలింపను, దీనుల రక్షింప మేలు దీవనఁ బొందన్
దీనావన! నీ కొప్పును, దీనపరాధీన! దేవదేవ! మహేశా!. 133

వ. అని మఱియును, సముచిత సంభాషణంబుల నంకించుచున్న పరమ వైష్ణవీరత్నం
బును సాదర సరస సల్లాప మందహాస పూర్వకంబుగా నాలింగనంబు గావించి,
సపరివారుం డై, గంధర్వ సిద్ధ విబుధగణ జేగీయమానుం డై, గరుడారూఢుం
డగుచు, నిజసదనంబునకుం జనియె. అని చెప్పి శుకయోగీంద్రుం డి ట్లనియె.

---

1. గుంజరయోనిం (హ.) 2. గజమైయుండెన్ (హ.)

‡ 'భటాదులెల్ల కరులై రి' యనుట అమూలకము. శాపము రాజునకేకాని, భటాదులకు లేదు.

సీ. నరనాథ! నీకును నాచేత వివరింపఁ బడిన యీ కృష్ణానుభావ మైన
గజరాజ మోక్షణ కథ వినువారికి [1]యశము లిచ్చును గల్మషాపహంబు
దుస్స్వప్న నాశంబు దుఃఖసంహారంబుఁ బ్రొద్దుల మేల్కాంచి పూతవృత్తి
నిత్యంబుఁ బఠియించు నిర్మలాత్మకు లైన విప్రులకును బహువిభవ మమరు

తే. సంపదలు గల్గుఁ బీడలు శాంతిఁ బొందు
సుఖము సిద్ధించు వర్ధిల్లు శోభనములు
మోక్ష మటచేతి దై యుండు ముదము చేరు
ననుచు విష్ణుండు ప్రీతుఁ డై యానతిచ్చె. 135

వ. అని మఱియు, నప్పరమేశ్వరుం డిట్లని యానతిచ్చె. ఎవ్వరేనియు నపరరాత్రంబున మేల్కాంచి, సమాహిత మనస్కు లై, శ్వేతద్వీపంబును, నాకుం బ్రియం బైన సుధాసాగరంబును, హేమనగంబును, నిగ్గిరికందర కాననంబులను, వేత్ర కీచక వేణులతా గుల్మ సురపాదపంబులను, ఏనును బ్రహ్మయు ఫాలలోచనుండును నివసించి యుండు నక్కొండశిఖరంబులను, కౌమోదకీ కౌస్తుభ సుదర్శన పాంచజన్యంబులను, శ్రీదేవిని, శేష గరుడ వాసుకి ప్రహ్లాద నారదాది ఋషులను, మత్స్య కూర్మ వరాహా ద్యవతారంబులను, దదవతారకృత కార్యంబులను, సూర్య సోమ పావకులనుఁ, బ్రణవంబును, ధర్మ తప స్సత్యంబులను, వేదంబును, వేదాంగంబులను, శాస్త్రంబులను, గో భూసుర సాధు పతివ్రతాజనంబులను, జంద్రకాశ్యపజాయా సముదయంబును, గౌరీ గంగా సరస్వతీ కాళిందీ సునందా ప్రముఖ పుణ్యతరంగిణీ నిచయంబును, నమరులను, నమరతరువులను, నైరావతంబును, నమృతంబును, ధ్రువుని, బ్రహ్మర్షి నివహంబును, బుణ్యశ్లోకులైన మానవులను, సమాహిత చిత్తు లై తలంచువారలకుఁ బ్రాణావసానకాలంబున మదీయం బగు విమలగతి నిత్తు. అని హృషీకేశుండు నిర్దేశించి, శంఖంబు పూరించి, విహగపరివృఢ వాహనుం డై వేంచేసె. విబుధానీకంబు సంతోషించె. అని చెప్పి శుకుండు రాజున కిట్లనియె. 136

అధ్యాయము - ౫

క. గజరాజ మోక్షణంబును, నిజముగఁ బఠియించునట్టి నియతాత్ములకున్
గజరాజవరదుఁ డిచ్చును, గజతురగ స్యందనములుఁ గైవల్యంబున్. 137

క. తామసు తమ్ముఁడు రైవత, నామకుఁ డై వెలసె మనువు నలువుర మీఁదన్
భూమికిఁ బ్రతివిం ధ్యార్జున, నామాదులు నృపులు మనువు నందనులు నృపా!

---

1. యశము లెచ్చును (హ.)

సీ. మనులు హిరణ్యరోముఁడు నూర్ధ్వబాహుండు వేదశిర్షుండును వీరు మొదలు
నమరులు భూతరయాదులు శుభ్రుని పత్ని వికుంఠాఖ్య పరమ సాధ్వి
యా యిద్దఱకుఁ బుత్రుఁ డై తనకళలతో వైకుంఠుఁ డనఁ బుట్టి వారిజాక్షుఁ
డవనిపై వైకుంఠ మనియెడి లోకంబుఁ గల్పించె నెల్లలోకములు మ్రొక్క

తే. రమ యెదుర్కోలు చేకొనె రాజముఖ్య!
తదనుభావ గుణంబులుఁ దలఁప దరమె?
యీ ధరారేణు పటలంబు నెఱుఁగవచ్చుఁ
గాని రాదయ్య హరి గుణగణము సంఖ్య. 139

వ. తదనంతరంబ. 140

సీ. చతు స్తనూజుండు చాక్షుషుం డను వీరుఁ డాఱవమను వయ్యె నవనినాథ!
భూమీశ్వరులు పురుః పురుష సుద్యుమ్నాదు లాతని నందను లమరవిభుఁడు
మంత్రద్యుమాఖ్యుఁ డమర్త్య †లాప్యాదికు [1]లా హవిష్మ ద్వీరకాది ఘనులు
మునులందు విభుఁడు [2]సంభూతికి వై రాజునకుఁ బుట్టి యజితుండు నాఁగ నొప్పె

ఆ. నతఁడ కాఁడె కూర్మ మై మందరాద్రిని
నుదధిజలములోన నుండి మోసె
నతఁడు సువ్వె దివిజు లర్థింప నమృతాబ్ధిఁ
ద్రచ్చి యిచ్చె నా సుధారసంబు. 141

వ. అని పలికినం, బరీక్షిన్నరేంద్రుండు మునీంద్రున కి ట్లనియె. 142

మ. వినుము న్నేటికిఁ ద్రచ్చె పాలకడలిఁ విష్ణుండు కూర్మాకృతిఁ
వనధిం జొచ్చి య దెట్లు మోసెఁ బలు కవ్వం బై న శైలంబు దే
వనికాయం బమృతంబు నెట్లు వడసెఁ వారాశి నేమేమి సం
జనితం బయ్యె మునీంద్ర! చోద్యము గదా సర్వంబుఁ జెప్పంగదే. 143

క. అప్పటనుండి బుధోత్తమ!, చెప్పెదు భగవ త్కథావిశేషంబులు నా
కెప్పుఁడు దనివి జనింపదు, సెప్పఁగదే చెవులు నిండ [2]శ్రీహరికథలఁ. 144

వ. అని మఱియు నడుగంబడినవాఁ డై యతని నభినందించి, హరిప్రసంగంబు చెప్ప
నుపక్రమించె. అని సూతుండు ద్విజుల కి ట్లనియె. అట్లు శుకుండు రాజుం జూచి.

---

* "ఆప్యాదికు" అనియే అన్ని ప్రతులలోను పాఠము. "దేవా ఆప్యాదయోగణాఃఁ" అని మూలము (5-8) 1. లాహవవృష భీకరాదిఘనులు (హ.) 2. సంభూతికి నాత్మజుం, డై పుట్టి యజితుండు నాఁగ నొప్పె (హ.) 3. శ్రీపతికృతముల్ (ట.)

క. కసిమసఁగి యసురవిసరము, లసిలతికల సురల నెగువ నసువులు వెడలం
[1]జసచెడిరి పడిరి కెడసిరి, యసమ సమరవిలసనముల ననుచెడలి నృపా ! 146

క. సురపతి వరుణాదులతో, [2]సురముఖ్యులు కొంద ఱరిగి సురశై లముపై
సురనుతుఁ డగు [3]నజుఁ గని యా,సురదుష్కృతిఁ జెప్పి రపుడు సొలయుచు నతు లై .

క. దుర్వాసుశాపవశమున, నిర్వ్యూఢ జగములెల్ల నిశ్శ్రీకము లై
పర్వతరిపుతోఁ గూడ [4]న,పర్వము లై యుండె హత సుపర్వావళు లై . 148

ఆ. నెలవు వెడలియున్న నిస్తేజు లై నట్టి
వేల్పుగములఁ జూచి వేల్పు పెద్ద
పరమపురుషుఁ దలఁచి ప్రణతుఁ డై [5]సంపుల్ల
పద్మ వదనుఁ డగుచుఁ బలికెఁ దెలియ. 149

క. ఏనును మీరును గాలము, [6]మానవ తిర్య గ్లతా ద్రుమ స్వేదజముల్
మానుగ నెవ్వని కళలము, వానికి మ్రొక్కెదము గాక వగవఁగ నేలా ? 150

క. *ఆద్యుండు రక్షకుండు న, సాధ్యుఁడు మాన్యుండు లోక సర్గ త్రాణాం
తాద్యాదు లొనర్చు నతం, డాద్యంత విధానములకు నర్హుఁడు మనకున్. 151

క. వరదునిఁ బరము జగద్గురుఁ, గరుణాపరతంత్రు మనము గనుఁగొన దుఃఖ
జ్వరములు చెడు నని సురలకు, [7]సరసిజజని చెప్పి యజితు సదనంబునకున్. 152

వ. తానును, దేవతాసమూహంబును నతిరయంబునఁ జని, గానంబడని య వ్విభు
నుద్దేశించి, ద్వైవికంబు లగు వచనంబుల నియతేంద్రియుఁ డై యి ట్లని
స్తుతియించె. 153

సీ. ఎవ్వని మాయకు నింతయు మోహించుఁ దలిమి యెవ్వనిమాయ దాఁటరాదు
తనమాయ నెవ్వఁ డింతయును గెల్చినవాఁడు నెవ్వనిఁ బొడగాన రెట్టిమునులు
సర్వభూతములకు సమవృత్తి నెవ్వఁడు చరియించుఁ దనచేత జనిత మైన
ధరణి పాదములు చిత్తము సోముఁ డగ్ని [8]ముఖంబును గన్నులు కమలహితులు

---

1. బసఁజెడిరి (హ. తం. వా.) 2. సురమునులుం గొలువఁ గదలి (హ.) 3. నజుఁగాంచిరి, సురదుష్కృతిఁ జెప్పిరపుడు (హ.) 4. సపర్వతమైయుండె (హ.) 5. సంమల్ల (హ) 6. మానవ తిర్యఙ్నగద్రుమ (హ)

* వధ్యుండు రక్షణీయుఁడు, సాధ్యుఁడు మాన్యుఁడని లేక సర్గ త్రాణా
వధ్యాదు లొనర్చు నతం, డాధ్యంత విధానమునకు నర్హుఁడు మనకున్. (తం. వా.)

7. పరగఁగఁ బద్మజుఁడు సెప్పి పరమ ప్రీతిన్ (హ)

8. ము,ఖంబు గన్నులు సోమ కమల హితులు (తం. వా.); "యచ్ఛతురాసీత్తరణిః" అని మూలము (5-36)

తే. చెవులు దిక్కులు రేతంబు సిద్ధజలము
మూఁడుమూర్తుల పుట్టిల్లు మొదలినెలవు
గర్భ మఖిలంబు మూర్ధంబు గగన మగుచు
మలయు నెవ్వని వాని నమస్కరింతు. 154

వ. మఱియు, నెవ్వని బలంబున మహేంద్రుండును, ప్రసాదంబున దేవతలును, గోపం బున రుద్రుండును, బౌరుషంబున విరించియు, నింద్రియంబులవలన వేదంబులును మునులును, మేఢ్రంబునఁ బ్రజాపతియు, వఱుంబున లక్ష్మియు, ఛాయవలనఁ బితృదేవతలును, స్తనంబులవలన ధర్మంబును, బృష్ఠంబువలన నధర్మంబును, శిరం బువలన నాకంబును, [1]విహాసంబువలన నప్సరోజనంబులును, గుహ్యంబువలన బ్రహ్మంబును, ముఖంబువలన విప్రులును, భుజంబులవలన రాజులును (బలంబును) నూరువులవలన వైశ్యులును (నైపుణ్యంబును) పదంబులవలన శూద్రులును, (అవేదంబును) అధరంబువలన లోభంబును, [2]నుపరి రదచ్ఛదంబువలనఁ బ్రీతియు, నాసాపుటంబువలన [3]ద్యుతియు, స్పర్శంబునఁ గామంబును, భ్రూయుగళంబున యమంబును, బఱుంబునఁ గాలంబును సంభవించె, నెవ్వని [4]యోగమాయా విహి తంబులు ద్రవ్య వయఃకర్మ గుణ విశేషంబులు, చతుర్విధ భూత సర్గం బెవ్వని యాత్మతంత్రంబు, నెవ్వని వలన సిద్ధించి, లోకంబులును లోకపాలురుం బ్రతుకు చుందురు, పెరుఁగుచుందురు, దివిజులకు నాయువు బలంబు నై, జగంబులకు నీశుం డై, పరమ మహాభూతి యగు న ప్పరమేశ్వరుండు మాకుం బ్రసన్నుండు గాక! అని మఱియును. 155

క. మొదల జల మిడిన భూజము,దుది నడుమను జల్లఁదనము దొరఁకొను మాడ్కిఁ
మొదలను హరికిని బ్రమొక్కిన, ముద మందుదు మెల్ల వేల్పుమూఁకలు నేముఁ. 157

క. ఆపన్న లగు దిదృక్షుల, కో పుణ్య! భవన్ముఖాబ్జ మొయ్యన [5]తటితోఁ
బ్రాపింపఁ జేయు సంపద, నో పరమదయానివాస! యుజ్జ్వలతేజా! 157

అధ్యాయము - ౬

వ. అని యిట్లు దేవగణసమేతుం డై యనేకవిధంబులఁ గీర్తింపుచునున్న పరమేష్ఠి యందుఁ గరుణించి, దయాగరిష్ఠుం డగు విశ్వగర్భుం డావిర్భవించె. 158

మ. ఒక వేయర్కులు గూడి గట్టొకరు వై యుద్యత్ప్రభాభూతితో
నొకరూ పై చనుదెంచుమాడ్కి హరి దా నొప్పారె; నా వేలుపుల్
వికలాలోకను లై, విషణ్ణమతు లై, విభ్రాంతు లై బ్రమోలఁ గా
నక శంకించిరి కొంతప్రొద్దు; విభుఁ గానం బోలునే వారికిఁ. 159

---

1. విహారంబు వలన(హ); "అప్సరసోపి హాసాత్" (మూ. 6-40) 2. సుపర్వరంధ్రంబు వలన (హ) 3. ధృతియు (హ) 4. యోగమాయా నిర్జితంబులు (హ); "యద్యోగమాయా విహితాన్ వదంతి (5 - 43) 5. తనితో (హ) 6. కదుపై (హ)

160

వ. అప్పుడు.

సీ. హార కిరీట కేయూర కుండల పాదకటక కాంచన రత్న కంకణాది
కాస్తుభోపేతంబుఁ గౌమోదకీ శంఖ చక్ర శరాసన సంయుతంబు
మరకత శ్యామంబు సరసిజనేత్రంబు కర్ణాభరణ కాంతి గండయుగము
కలిత కాంచనవర్ణ కౌశేయవస్త్రంబు శ్రీ వనమాలికా సేవితంబు

ఆ. నై మనోహరంబు నై దివ్యసౌభాగ్య
మైన యతనిరూపు హర్ష మెసఁగఁ
జూచి [1]బ్రహ్మ హరుడు సురలును దానును
బొంగి నమ్రు లగుచుఁ బొగడఁ దొడఁగె. 161

క. జనన స్థితి లయ దూరుని, మునినుతు నిర్వాణసుఖ సముద్రుని సుగుణుం
దనుతనునిఁ బృథులబృథులుని, ననఘుఁ డగు మహానుభావు నభినందింతున్.

క. పురుషోత్తమ! నీరూపము, పరమ్రశేయంబు భువనపంక్తుల కెల్లన్
స్థిర వైదికయోగంబున, వరుసను మీయందుఁ గానవచ్చెను మాకున్. 163

క. మొదలును నీలోఁ దోఁచెను, దుదియు న్నటఁ దోఁచె నడుము దోఁచెను [2]నీవే
మొదలు నడుము దుది సృష్టికిఁ, గదియఁగ ఘటమునకు మన్ను గతి యగు
మాడ్కిన్. 164

క. నీ మాయచేత విశ్వము, వేమాఱు సృజింతు వనుచు విష్ణుఁడ వనుచున్
ధీమంతులు గుణపదవిని, నేమంబున సగుణుఁ డైన నినుఁ గాంతు రొగిన్. 165

ఆ. అన్న మవని యందు నమృతంబు గోవుల
యందు వహ్ని సమిధలందు [3]నరులు
యోగవశతఁ బొందు నోజను బుద్ధిచే
నగుణు నిన్నుఁ గాంతు [4]రాత్మవిదులు. 166

మత్తకోకిల. పట్టులేక బహుప్రకార విపన్న చిత్తుల మైతి మే
మెట్టకేలకు నిన్నుఁ గంటి [5]మభీప్సితార్థము వచ్చెఁ బెఁ
వెట్ట యైన దవానలంబున వేఁగు నేనుఁగు మొత్తముల్
[6]నిట్ట లేచిన గంగలోపల నీరు గాంచిన చాడ్పునన్. 167

---

1. బ్రహ్మేంద్రాది సురలును (హ) 2. నాపై (హ) 3. నమరు (హ) 4. రధిక గుణులు (హ) 5. అభీప్సితార్థము వచ్చు (హ. వా.) అభీప్సితార్థమ వంచు (తం) 6. నిట్టవేర్చిన (వా)

మత్తకోకిల. నీకు నేమని విన్నవింతుము నీవు సర్వమయుండ వై
లోక మెల్లను నిండి యుండఁగ లోకలోచన! నీ పదా
లోకనంబు శుభంబు మాకును లోకపాలకు లేను నీ
నాకవాసులు నీవ యహ్నఁ దనర్చు [1]కేతు తతిక్రియఁ. 168

వ అని కమలసంభవ ప్రముఖులు వినుతిచేసిరి. అని చెప్పిన నరేంద్రునకు శుకుం డి
ట్లనియె. 169

శా. ఈ రీతిం జతురాననాది నుతుఁ డై యేపార జీమూతగం
భీరం బైన రవంబునం బలికె సంప్రీతాత్ముఁ డై యీశ్వరుం
డా రోమాంచిత కాయుల న్నవ విముక్తాపాయులన్ [2]శ్రేయులం
బ్రారబ్ధోగ్ర మహార్ణవోన్మథన వాం ఛానల్పులఁ వేల్పులఁ. 170

క. ఓ నలువ! యో సురేశ్వర!, యో నిటలతటాక్ష! యో సురోత్తములారా!
దానవులతోడ నిప్పుడు, మానుగఁ బోరామి గలిగి మనుటే యొప్పుఁ. 171

వ. అది యె ట్లంటిరేని. 172

క. ఎప్పుడు దనకును సత్త్వము, చొప్పడు నందాఁక రిపులఁ జూచియుఁ దన మైఁ
గప్పికొని యుండవలయు, నొప్పుగ నహి మూషకమున కొదిఁగిన భంగిఁ. 173

క. అమృతోత్పాదన యత్నము, [3]విమలమతిం జేయుటొప్పు వేల్పులు వినుఁడీ
యమృతంబుఁ ద్రావి జంతువు, లమృతగతిం [4]బ్రతుకుచుండు నాయుర్వృద్ధిఁ. 174

సీ. పాలమున్నీటిలోపల సర్వతృణ లతౌ షధములు దెప్పించి చాల వై చి
మందరశై లంబు మంథానముగఁ జేసి తనర వాసుకిఁ దరిత్రాడు నేసి
[5]నా సహాయంబున నలి నందఱును మీరు తరువుఁడు వేగ నతండ్రు లగుచు
ఫలము మీ దయ్యెడు బహుళదుఃఖంబులఁ బడుదురు దైత్యులు పాపమతులు

ఆ. [6]అలసటయును లేక యఖలార్థములు గల్గు
విషధిలోన నొక్క విషము వుట్టుఁ
[7]గలఁగి వెలువ వలదు [8]కామరోషంబులు
వస్తుచయమునందు [9]వలదు చేయ. 175

---

1. లాతితత్రిక్రియన్ (హ) 2. త్రిశేయులన్ (తం. వా.)
3. విశదమతిం (హ); విమృష్టమతిఁ జేయుటొప్పు (తం) 4. బ్రదుకుచుండు రాయుర్వృద్ధిన్ (హ) 5. నాసహాయంబున నెలమి నందఱు (హ) నాసహాయతచేత (వా.) 6. అలసటేమిలేక (తం. వా.) 7. గడఁగి చెఱుపలేవు (హ) 8. కామదోషంబులు (హ) 9. వలయుఁ జేయ (వా)

వ. అని యుపదేశించి. 176

క. అంతాదిరహితుఁ డచ్యుతుఁ, డంతర్ధానంబు నొందె నజ ఫాలాక్షుల్
సంతోషంబునఁ దమ తమ, కాంతాలయములకుఁ జనిరి గౌరవ మొప్పఁ. 177

క. కయ్యంబు సేయ నొల్లక, నెయ్యంబున నతులు వెట్టి నిర్జరనికరం
బి య్యప్పనములు వెట్టుచుఁ, దియ్యంబునఁ గొల్చె బలిని దేవద్వేషిఁ. 178

క. పస చెడి తనకును వశ మై, సుసరముతోఁ గొల్చుచున్న సురసంఘములఁ
గసిమసఁగి చంపఁ బూనిన, నసురుల వారించె బలియు నతి నయయుక్తిఁ. 179

వ. అట్లు వారించి, వై రోచని రాజసముదయంబున కిట్లనియె. 180

క. పగవారు శరణుచొచ్చిన, మగతనములు నెఱపఁ దగదు మగవారలకుఁ
దగు సమయ మెఱుఁగవలదే, మగఁటిమి పాటింపవల దమర్త్యులతోడఁ. 181

వ. అని పలికి, కొలువుకూటంబున [1]నసురనికర పరివృతుం డై, నిఖిలలోక రాజ్య లక్ష్మీసహితుం డై, యఖిల విబుధ వీర విజ యాహంకార నిజాలంకారుం డై, సుఖంబునఁ గొలువున్న విరోచన నందనుం గని, శచీవిభుం డుత్తమ సచివుం డునుం బోలె సాంత్వవచనంబుల శాంతిం బొందించి, పురుషోత్తమ శిక్షితం బై న నీతిమార్గంబున శంబరునికిం బ్రియంబు సెప్పి, యరిష్టనేమి ననునయించి, త్రిపురవాసు లగు దానవుల నొడంబఱిచి, జంభుని సమ్మతంబు చేసికొని, హయ గ్రీవుని [2]విగ్రహంబు మాన్పి, నముచి తారక బాణాదులతో సఖ్యంబు నెఱపి, [3]విప్రచిత్తికిఁ బొత్తు హత్తించి, శకుని విరోచన [4]ప్రహేతులకుఁ బోరామి సూపి, మయ మాలి సుమాలి ప్రముఖులకు మైత్రి యొఱింగించి, [5]కుంభ నికుంభులకు సౌజన్యంబు గైకొలిపి, పౌలోమ కాలకేయ నివాత కవచాదుల యెడ బాంధవంబు ప్రకటించి, వజ్రదంష్ట్రకి [6]వశుం డై, యితర దానవ దైత్య సమూహంబువలన నతిస్నేహంబు సంపాదించి, మనకు నక్కచెలియండ్ర బిడ్డలకు నొడ్డారంబు లేమిటికి? ఏక కార్య పరత్వంబున నడ్డంబు లేక బ్రతుకుదము. అన్యోన్య విరోధంబు లేల? తొల్లి యన్యోన్య విరోధంబున నలంగితిమి. ఇది మొదలు దనుజ దివిజ సముదయంబులకు రాజు విరోచననందనుండ. మనమందఱ మతనిపంపు సేయంగల వారము. ఉభయకులంబును వర్ధిల్లునట్టి యుపాయం బెఱింగింతు. అని యమృతజలధి మథనప్రారంభ కథనంబు దెలియం జెప్పి, అట్లు సురాసుర యూథం

---

1. సురనికర పరివృతుండై (హ. తం. వా.)
2. నిగ్రహంబు (క) 3. విప్రజిత్తునకు (హ) 4. హేతిప్రహేతులకు (చ) 5. శుంభ నిశుంభులకు (చ) 6. నశక్తుండై (హ)

బులు బలారాతి బలి ప్రముఖంబు లై, పర మోద్యోగంబున సుధా సంపాదనా
యత్త చిత్తు లై, సఖ్యంబు నొంది, మందగమనంబున మందరనగంబునకుం జని.

సీ. వాసవు [1]వర్ధకి వాఁడిగాఁ జఱచిన కుద్దాలముఖములఁ గొంత ద్రవ్వి
ముసలాగ్రములు సొన్పి మొదలిపాఁ తగలించి దీర్ఘ పాశంబులఁ దిండుసుట్టి
పెకలించి బాహులఁ బీడించి కదలించి పెల్లార్చి తమ తమ పేరు వాడి
పెటికి మీఁదికి నెత్తి పృథుల హస్తంబులఁ దల భుజంబులఁ దరలకుండ

తే. నాని మెల్లన కుఱుతప్పు టడుగు లిడుచు
భార మధికంబు [2]మఱవకఁ బట్టుఁ డనుచు
మందరనగంబుఁ దెచ్చి రమందగతిని
దేవదైత్యులు జలరాశి తెరువు వట్టి. 183

క. మందరము మోవ నోపమి, నందటిపైఁ బడియె నదియు నతిచోద్యముగాఁ
గొందఱు నేలం గలసిరి, కొందఱు నుగ్గిరి చనిరి కొందఱు భీతిన్. 184

క. ఏలా హరికడ కేఁగితి, మేలా దొరఁకొంటి మధిక హేలన లై లో
న్మూలనము చేసి తెచ్చితి, మేలా పెక్కండ్రు మడిసి రేలా నడుమన్. 185

క. ఏటికి మముఁ బనిపంచె, [3]న్నేటికి మనబోఁటివారి కింతలుపను లిం
కేటికి రాఁడు [4]రమేశ్వరుఁ, డేటి కుపేక్షించె మఱవ నేటికి మనలన్. 186

వ. అని కులకుధర పతనజన్యం బగు వేదన సహింపనోపక, పలవించుచున్న దివిజ
దితిజుల భయంబు మనంబున నెటిఁంగి, సకలవ్యాపకుం డగు హరి తత్సమీపంబున.

మ. గరుడారోహకుఁ డై గదాది ధరుఁ డై కారుణ్య సంయుక్తుఁ డై
హరికోటి ప్రభతో [5]నొహో వెఱకుఁడీ యంచుం బ్రదీపించి త
[5]ద్గిరిఁ గేల నొవకుండఁ గందుకము మాడ్కిన్ బెట్టెఁ బక్షీంద్రుపైఁ
గరుణాలోకసుధన్ సురాసురుల ప్రాణంబుల్ సమర్థింపుచున్. 188

క. వారలు గొలువఁగ హరియును, [6]వారిధి దరి కరుగు మన్నఁగ వసుధాధరమున్
వారిజనయనునిఁ గొంచు న, వారితగతిఁ జనియె విహగవల్లభుఁ డఱుతన్.

క. చని జలరాశి తటంబున, వనజాతుని గిరిని డించి వందనములు స
ద్వినతులు సేసి ఖగేంద్రుఁడు, [8]పనివినియెను భక్తి నాత్మభవనంబునకున్. 190

వ. అప్పుడు. 191

---

1. వర్ధకి(హ) 2.ఎట్టుడి పట్టు డనుచు(చ)3.ఏటికిఁ దగుబోటి వారి కింతలు(హ) 4.మహేశ్వరు(హ) 5. గిరి కేలన్నవకుంద కందుకము మాడ్కిం బట్టి క్రీడించుచున్ (తం.వా.);"గిరిం చారోప్య గరుడే హస్తే నైకేన లీలయా"(6-38) 6. వారధిదరికడకు నేఁగె(హ)7.డుఱుకన్ (హ) 8.పనివినియెన్నాత్మభక్తి(హ)

అధ్యాయము – ౮

సీ. భూనాథ! వినవయ్య భోగీంద్రు వాసుకిఁ బిలిపించి యతనికిఁ బ్రియము సెప్పి
ఫలభాగ మీ నొడఁబడి సమ్మతునిఁ జేసి మెల్లనఁ జేతుల మేను నిమిరి
నీవ కా కెవ్వరు నేర్తు రీ పని కియ్య కొమ్మని యతనిఁ గైకోలు వడసి
కవ్వంపుఁగొండ నిష్కంటకంబుగఁ జేసి [1]ఘర్షించి యతని భోగంబుఁ జుట్టి
ఆ. కడఁగి యమృతజలధిఁ గలశంబుఁ గావించి
త్రచ్చు [2]న చ్చలమునఁ దలఁపు లమర
బద్ధ వస్త్ర కేశ భారు లై యా రెండు
గములవారు తరువఁ గదిసి రచట. 192

వ. తదనంతరంబ. 193

క. హరియును దేవానీకము, సురగేంద్రుని తలలు పట్ట నుద్యోగింపఁ
హరిమాయా పరవశు లై, సురవిమతులు గూడి పలుకఁజొచ్చిరి కడిమిఁ.

మత్తకోకిల. స్వచ్ఛ మైన ఫణంబు మీరలు చక్కఁ బట్టి మథింపఁగాఁ
బుచ్ఛ మేటికి మాకుఁ బట్టఁగఁ బూరుషత్వము గల్గి మే
మచ్ఛమైన తపో బలాధ్యయ నాన్వయంబుల వార మై
యిచ్ఛయింతు మె తుచ్ఛవృత్తికి [3]నిండు మాకు ఫణాగ్రముల్. 195

వ. అని పలుకు దనుజులం జూచి. 196

క. విస్మయముఁ బొంది దానవ, ఘస్మరుఁ డహిఫణము విడువఁ గైకొని యసురుల్
విస్మితముఖు లై యూర్చి [4]ర, విస్మేరతఁ గొనిరి సురలు వీక్ష దోక్ష. 197

వ. ఇట్లు సమాకర్షణ స్థాన భాగ నిర్ణయంబు లేర్పఱుచుకొని, దేవతలు పుచ్ఛంబును, పూర్వదేవతలు ఫణంబులం బట్టి, పయోరాశిమధ్యంబునం బర్వతంబు వెట్టి, పరమాయత్త చిత్తు లై, యమృతార్థంబు ద్రచ్చుచున్న సమయంబున. 198

క. విడు విడుఁ డని ఫణి పలుకఁగఁ, గడు భరమున మొదలఁగుదురు [5]గలుగమి వెడఁగై
బుడబుడ రవమున నఖిలము, వడవడ వణఁకఁగ మహోద్రి వనధి మునింగె. 199

ఉ. గౌరవ మైన భారమునఁ గవ్వపుఁగొండ [6]ధరింపలేక దో
స్సారవిహీను లై యుభయసైనికులు గడు సిగ్గుతో నకూ
పారతటంబునం బడిరి పౌరుషముం జెడి పాండవేయ! యె
వ్వారికి నేరఁబోలు బలవంతపు దైవము నాక్రమింపఁగ. 200

---

1. గర్జించు నతని(హ) 2. నవసరమున(హ) 3. నీడు(హ.) 4. య, విస్మితముగఁ గొలువమేటి (హ)య, విస్మరతి (ట.) 5. గలగమి (హ) 6. భరింప (చ.)

క. వననిధి జలములలోపల, మునిఁగెడి గిరిఁ జూచి దుఃఖమునఁ జింతాబ్ధిఁ
మునిఁగెడి వేల్పులఁ గనుఁగొని, వనజాతుఁడు వార్ధినడుమ వారలు సూడఁ.

—: కూర్మావతార కథా ప్రారంభము :—

సీ. సవర నై లక్షయోజనముల వెడలు పై కడుఁ గఠోరం బైన కర్పరమున
నద నైన బ్రహ్మాండ మైన నాహరించు ఘనతరం బగు ముఖగహ్వారంబు
సకల చరాచర జంతురాసుల నెల్ల మ్రింగి లోఁగొనునట్టి మేటి కడుపు
విశ్వంబుపై వేఱు విశ్వంబు పైఁబడ్డ నాఁగినఁ గదలనియట్టి కాళ్ళు

తే. వెలికి లోనికిఁ జనుదెంచు విపులతుండ
మంబుజంబులఁ బోలెడి యక్షియుగము
[1]సుందరంబుగ విష్ణుండు సురలతోడి
కూర్మి చెలువొంద నొకమహాకూర్మ మయ్యె. 202

మ. కమఠం బై జలరాశిఁ జొచ్చి లఘు ముక్తాశుక్తి చందంబునఁ
నమ దద్రీంద్రము [2]నెత్తె వాసుకి మహానాగంబుతో లీలతో
నమరేంద్రాదులు మౌళికంపములతో నౌ నౌఁ గదే బాపురే
కమలాక్షా! [3]శరణంచు భూ దిశలు నాకాశంబునుఁ బ్రోయఁగాఁ. 203

వ. ఇ వ్విధంబున. 204

క. తరిగాండ్రలోన నొకఁడఁటె, తరికడవకుఁ గుదురు [4]నాఁక త్రాడును జేరుల్
దరిగవ్వంబును దానఁటె, హరి హరి హరి చిత్రలీల హరియే యెఱుఁగుఁ. 205

ఆ. జలధిఁ గడవసేయ శైలంబు కవ్వంబు
సేయ భోగిఁ త్రాడుసేయఁ దరువ
సిరియు సుధయుఁ బడయ శ్రీవల్లభుఁడు దక్క
నొరుఁడు శక్తిమంతుఁ డొకఁడు గలఁడె. 206

ఆ. గొల్లవారి బ్రతుకు గొఱఁతన వచ్చునే
గొల్లరీతిఁ బాలకుప్పఁ ద్రచ్చి
గొల్ల లై రి సురలు గొల్ల యయ్యె విష్ణుండు
చేటులేనిమందు సిరియుఁ గనిరి. 207

వ. ఇట్లు సురాసురయూథంబులు హరిసనాథంబు లై, కవచంబులు నెట్టంబులు వెట్టికొని, పుట్టంబులు పిరిచుట్లు చుట్టుకొని, కరంబులు గరంబుల నప్పళించుచు,

---

1. సుందరంబగు (హ.) 2. నెత్తి (హ.) 3. శరణంబు (హ.) 4. ఆఁకత్రాడఁట చేతుల్ (హ.)

భుజంబులు భుజంబులు నొఱయుచు, లెండు లెండు [1]దరువం దొడంగుఁడు రం
డని, యమందగతిఁ బెరుఁగుఁ ద్రచ్చు మందగొల్లల చందంబున, మహార్ణవ
మధ్యంబున మంథాయమాన మందరమహీధర విలగ్న భోగిభో గాద్యంతంబులం
గరంబులం దెమల్చుచుఁ, బెను బొబ్బలం బ్రహ్మాండకటాహంబు నిర్భరం బై
గుబ్బగు బ్బని [2]యురలఁ, గొండ కవ్వంబుగు త్తి జిఱజిఱం దిరుగు వేగంబున,
ఛటచ్ఛటాయమానంబు లై భుగులు భుగు ళ్ళను చప్పుళ్ళ నుప్పరం బెగసి,
లెక్కకు మిక్కిలి చుక్కల కొమ్మల చెక్కుల నిక్కలువడు మిసిమిగల మీఁది
మీఁగడపాల తేటనిగ్గు తుంపరల పరంపరలవలన నిజకర క్రమక్ర మాకర్షణ పరి
శ్రాంత ఫణి ఫణాగర్భ సముద్భూత నిర్భర విషకీలి కీలజాలంబు లప్పటప్పటికి
నుప్పతిల్లిన, దప్పినొందక, మందగతిం జెందక, య క్ష్మాపార వేలా తటకుటజ
కుసుమ[3]గుచ్ఛ పుచ్ఛ పిచ్ఛిల స్వచ్ఛమకరంద సుగంధి గంధవ హావహనంబునం
గ్రొంజెమట [4]పిచ్ఛిల పెను వఱదగము లొడళ్ళ నిగుర, నొండొరులం బరిహ
సించుచుఁ, బేరువాడి విలసించుచు, మేలు మే లని యగ్గించుచుఁ, గాదు కా దని
భంగించుచు, నిచ్చ మెచ్చని మచ్చరంబులవలన వనధివలమాన వై శాఖ వసుంధ
రాధర [5]పరివ ర్తన సంజనిత ఘుమఘుమా రావంబును, మథనగుణాయమాన
మహాహీంద్రప్రముఖ ముహుర్ముహు రుచ్చలిత భూరి ఘోర ఫూత్కార
ఘోషంబును, గులకుధర పరిక్షేపణ క్షోభిత సముల్లంఘన సమాకులితంబు లై,
[6]వెఱచఱచి, గుబురుగుబురు లై యెరలు కమఠ కర్కట కాకోదర మకర
తిమి తిమింగిల మరాళ చక్రవాక బలాహక భేక సారసానీకంబుల మొఱలు
నుం గూడికొని ముప్పిరిగొని, దనుజ దివిజ భటాట్టహాస తర్జన గర్జన ధ్వనుల
నలుపురి యై మొ త్తి నఱచెన, దళదిగంత భిత్తులును బేడె త్తి వెల్లగిల్లం ద్రుళ్ళుచుఁ
గికురు పొడుచుచు, నొకని కొకనికంచె వడియునుం, [7]దడవునుం గలుగఁ
ద్రచ్చుచుఁ, బంతంబు లిచ్చుచు, సుధాజననంబుఁ జింతింపుచు, నూతన పదార్థంబు
లకు నెదుళ్ళు సూచుచు, నెంత తడవు ద్ర త్త మని హరి నడుగుచు, నెడపడని
తమకంబుల నంతకంతకు మురువు డింపక త్రచ్చు సమయంబున. 208

క. అ ప్పాలవెల్లి లోపల, న ప్పటి కప్పటికి మందరాగము తిరుగం
జప్పుడు నిండె నజాండము, చెప్పెడిదే మజుని చెవులు చిందఱఁ గొనియెన్. 209

వ. అంత న ప్పయోరాశి మధ్యంబున. 210

---

1. దరవం దొడంగు రండని (హ.) 2. యురులు (హ) 3. గుచ్ఛపుచ్ఛ స్వచ్ఛ (హ)
4. పిట్టిలి (హ.) 5. ప్రవ ర్తన (హ) 6. వెఱచి చెఱచి (హ) 7. గడపునుంగలుగ (తం. వా.)

క. ఎడమఁ గుడి మునుపు దిరుగుచుఁ, గుడి నెడమను వెనుకఁ దిరుగు కులగిరి కడలిఁ
గడ వెడల సురలు నసురులు, దొడితొడి ఫణిఫణము మొదలుఁ దుదియును దిగువఁ.

క. వడిగొని కులగిరిఁ [1]దరువఁగ, జడనిధి ఖగ మకర కమఠ ఝష ఫణి గణముల్
సుడివడుఁ దడఁబడుఁ గెలఁకులఁ, బడు భయపడి నెగసి బయలఁబడు నురలిపడుఁ.

క. అమరాసుర కరవిపరి, భ్రమణ ధరాధరవరేంద్ర [2]భ్రమణంబును దాఁ
గమఠేంద్రు వీఁపు తీఁటను, శమియింపఁగఁ జాల దయ్యె జగతీనాథా ! 213

వ. తదనంతరంబ. 214

క. [3]*ఆలోల జలధిలోపల, నాలో నహి విడిచి సురలు నసురులు బలువం
గీలా కోలాహల మై, హాలాహలవిషము వుట్టె నవనీనాథా ! 215

వ. అదియునుం, బ్రళయకా లాభీల ఫాలలోచను లోచనానలశతంబు చందంబున
నమందం బై, విలయదహన సహస్రంబు కైవడి వడి యై, కడపటి పట్టపగటింటి
వెలుంగుల లతు తెఱంగున దుర్నిరీతం బై, తుదిరేయి వెలింగిన మొగులు
గములవలనం బడు బలుపిడుగుల వడువున బెడిదం బై, పంచభూతంబులుం
దేజోరూపంబు లైన చాడ్పున దుస్సహం బై, భుగభుగాయమానంబు లైన
పొగలును, జిటచిటాయ మానంబు లైన విస్ఫులింగంబులును, ధగద్ధగాయ
మానంబు లైన నెఱమంటలుం గలిగి, మహార్ణవ మధ్యంబున మందరనగం బమం
దరంబుగం దిరుగునెడ జనియించి, పెటపెటాయమానం బై, నింగికిం బొంగి,
దిశలకుం గేలుసాఁచి, బయళ్ళు ప్రబ్బికొని, తరిగవ్వంపుఁ గొండ నండ గొనక,
నలుగడలకుం బఱచి, దరుల కుఱికి, సురాసుర సముదయంబులం దరికొని, గిరి
వర గుహాగహ్వారంబుల సుడివడక, కులశిఖరి శిఖరంబుల నెరగలి వడి, గహనం
బులు దహించి, కుంజ మంజరీపుంజంబుల భస్మంబుచేసి, జనపదంబు లేర్చి, నదీ
నదంబు లెరియించి, దిక్కుంభి కుంభంబులు నిక్కలువడ నిక్కి, తరణి తారామండ
లంబులపై మిట్టించి, మహర్లోకంబు దరికొని, యుపరి లోకంబునకు మాఱు
గొన లిడి, సుడివడి, ముసరుకొని, బ్రహ్మాండగోళంబు చిటిలిపడం దాఁటి,
పాతాళాది లోకంబులకు ప్రవేళ్లువాఱి, సర్వాధికం బై శక్యంబుగాక, యెక్కడఁ
జూచినం దాన యై, కురంగంబుక్రియం గ్రేళ్ళుఱుకుచు, భుజంగంబువిధంబున

---

1. దిరుగగ (డ.) 2. బంభ్రమణముదా (తం.): "బిభ్రత్తదా వర్తనమాది కచ్ఛపో మేనేంగ కండూయన మప్రమేయః" (7-10) 3. ఆలోన (హ.)

* గౌతమీ గంథ్రాలయ ప్రతిలోను, ద. బ. ప్రతులలోను ఈ క్రింది పద్యమున్నది.
"కమఠము కర్పరమునగిరి, భ్రమణంబున బొడమి అగ్నిబాడపకణముల్
క్రమముగ సర్వవిషాగ్నిని, నమరంగా కాలకూట మంబుధి బొడమెన్."

నొడియుచు, సింగంబుభంగి లంఘింపుచు, విహంగంబు పగిది నెగయుచు, మాతంగంబు పోలిక నిలువంబడుచు, నిట్లు హాలాహాల దహనంబు జగంబులం గోలాహలంబు సేయుచున్న సమయంబున, [1]మెలకు సెగల మిడుకం జాలక నీ తైన దేవతలును, నేలంగూలిన రక్కసులును, డుల్లిన తారకంబులును, గీటణం గిన కిన్నర మిథునంబులును, గమలిన గంధర్వ విమానంబులును, జీకాకువడ్డ సిద్ధచయంబులును, జిక్కువడిన గ్రహంబులును, [2]జిందఱవందఱ లైన వర్ణాశ్రమం బులును, నిగిరిపోయిన నదులును, నింకిన సముద్రంబులును, గాలిన కాననంబు లును, బొగిలిన పురంబులును, బొనుఁగువడిన పురుషులును, బొక్కిపడిన పుణ్యాం గనా జనంబులును, బగిలి పడిన వర్వతంబులును, భస్మంబు లైన ప్రాణిసంఘం బులును, వేఁగిన లోకంబులును, విపశ లైన దిశలును, నొడ్డగెడవు లైన భూజ చయంబులును, నఱవఱ లైన భూములును నై యకాల విలయకాలం బై తోఁచుచున్న సమయంబున. 216

క. ఒడ్డారించి విషంబున, కడ్డము చనుదెంచి కావ నధికులు లేమిన్
[4]గొడ్డేటి ప్రమంది రా లన, [3]బి డ్డన నెడలేక జనులు పృథ్వీనాథా! † 217

వ. అప్పుడు. 218

మ. చని కైలాసముఁ జొచ్చి శంకరు నివాసద్వారముం జేరి [5]యీ
సున దౌవారికు లడ్డపెట్టఁ దల మంచుం జొచ్చి కుయ్యో మొఱో
విను మాలింపుము చిత్తగింపుము దయన్ వీక్షింపు మం చంబుజా
సన ముఖ్యుల్ గని రార్తరక్షణ కళాసంరంభునిన్ శంభునిన్. 219

క. వారలు దీనత వచ్చుటఁ, గూరిమితో నెఱిఁగి దక్షుకూఁతురుఁ దానున్
బేరోలగమున నుండి ద, యారతుఁ డై చంద్రచూడుఁ డవసర మిచ్చెన్. 220

వ. అప్పుడు భోగిభూషణునకు సాష్టాంగ దండప్రణామంబులు గావించి, ప్రజాపతి ముఖ్యు లిట్లని స్తుతియించిరి. 221

---

1. మెలంగమిడుకం జాలక (తం.) 2. వరుసలెడలిన (ట.)
3. గొడ్డేటి (తం. వా.) 4. బీడన నెడలేక (హ.)
† 217వ పద్యము క్రింద, తాళపత్ర ప్రతులలో నీ క్రింది పద్యము లున్నవి.
"మనుజుల కమృత మొసంగన్, జనితం బగు నంచు మదిని శంభుడు గోరన్
విను డాద్య ఫల మి దీశా, నున కర్పణ మనిరి హరి యనుమతిని సురలున్" (క.)
"మును జలనిధి నమృతము సం, జనితం బగు ననుచు తనకు శంభుడు గోరన్
విను డాద్యధవ మిదీశా, నున కర్పణమనిన హరియనుమతిన్ సురలున్." (డ)
5. యీశుని దవ్వారికు లడ్డపడ్డ (హ)

సీ. భూతాత్మ ! భూతేశ ! భూతభావనరూప ! దేవ ! మహాదేవ ! దేవవంద్య !
యీ లోకములకెల్ల నీశ్వరుండవు నీవ బంధమోక్షములకుఁ బ్రభుఁడ వీవ
యార్తశరణ్యుండ వగు గురుండవు నిన్నుఁ గోరి భజింతురు కుశలమతులు
సకల సృష్టి స్థితి సంహార కర్త వై బ్రహ్మ విష్ణు శివాఖ్యఁ బరఁగు దీవు

ఆ. పరమగుహ్య మైన బ్రహ్మంబు సదసత్తమంబు నీవ శక్తిమయుఁడ వీవ
శబ్దయోని వీవ జగదంతరాత్మవు
నీవ ప్రాణ మరయ నిఖిలమునకు. 222

క. నీయంద సంభవించును, నీయంద వసించి యుండు నిఖిలజగంబుల్
నీయంద లయముఁ బొందును, నీ యుదరము సర్వభూత నిలయము రుద్రా !

సీ. అగ్ని ముఖంబు, పరాపరాత్మక మాత్మ, కాలంబు గతి, రత్నగర్భ పదము,
శ్వసనంబు నీయూర్పు, రసన జలేశుండు, దిశలు కర్ణంబులు, దివము నాభి,
సూర్యుండు గన్నులు, శుక్లంబు సలిలంబు, జఠరంబు [2]జలధులు, చదలు శిరము,
సర్వౌషధులు రోమచయములు, శల్యంబు లద్రులు, మానస మమృతకరుఁడు,

తే. ఛందములు ధాతువులు, ధర్మసమితి హృదయ,
మాస్యపంచక ముపనిష దాహ్వాయంబు,
లైన నీరూపు పరతత్త్వ మై శివాఖ్య
మై స్వయంజ్యోతి యై యొప్పు నాద్య మగుచు. 224

క. కొందఱు కలఁ డందురు నినుఁ, గొందఱు లేఁడందు రతఁడు గుణి గాఁ డనుచుఁ
గొందఱు కలఁ డని లేఁడని, కొందల మందుదురు నిన్నుఁ గూర్చి మహేశా! 225

సీ. తలఁపఁ బ్రాణేంద్రియ ద్రవ్య గుణ స్వభా వుఁడవు, కాల క్రతువులును నీవ
సత్యంబు ధర్మ మమృతము ద్యుతంబును [3]నీవ ముఖ్యుండవు నిఖిలమునకు
ఛందోమయుండవు సత్త్వ రజ స్తమ శ్చతుండ వై [4]యుందు సర్వరూప
కామపురాధ్వర కాలగరాది [5]భూతద్రోహిజయము చోద్యంబు గాదు

తే. లీల లోచనవహ్ని స్ఫులింగ శిఖల
నంతకాదులఁ గాల్చిన యట్టి నీకు
రాజఖండావతంస ! పురాణపురుష !
దీనరక్షక ! కరుణాత్మ ! దేవదేవ ! 226

---

1. నీశక్తి(హ.) 2. జలములు (హ.) 3. నీవగమ్యుండవు (జ.డ.ద.బ.) 4. యుండు(హ.తం.వా.)
5. భూతద్రోహభయము (హ. తం. వా.)

ఆ. మూఁడుమూర్తులకును మూఁడు లోకములకు
మూఁడు కాలములకు మూలమగుచు
[1]భేదమగుచు మది నభేద మై యొప్పారు
బ్రహ్మ మనఁగ నీవ ఫాలనయన! 227

క. స దస త్తత్త్వ చరాచర, సదనం బగు నిన్నుఁ బొగడ జలజభవాదుల్
పెదవులు గదలుప వెఱతురు, వదలక నినుఁ బొగడ నెంతవారము దేవా! 228

మత్తకోకిల. బాహుళ శక్తి సురాసురుల్ సని పాలవెల్లి మథింప హా
లాహలంబు జనించె నేరి కలంఘ్య మై భువనంబు కో
లాహలంబుగఁ జేసి చిచ్చును [2]లాగముం గొని ప్రాణిసం
దోహముం బ్రతికింపవే దయ దొంగలింపఁగ నీశ్వరా! 229

క. లంపటము నివారింపను, సంపద కృపసేయ జయము సంపాదింపఁ
జంపెడివారి వధింపను, సొంపారఁగ నీకె చెల్లు సోమార్ధధరా! 230

క. నీకంఱె నొం డెఱుంగము, నీకంఱెం బరులు గావనేరరు జగముల్
నీకంఱె నొడయఁ డెవ్వఁడు, లోకంబుల కెల్ల నిఖిలలోకస్తుత్యా! 231

—: ఈశ్వరుండు దేవబృందప్రార్థితుం డై హాలాహలమును భానముచేయుట :—

వ. అని మఱియు నభినందింపుచున్న ప్రజాపతిముఖ్యులం గని, సకలభూత సముం డగు న ద్దేవుండు తన ప్రియసతి కిట్లనియె. 232

క. కంటే జగముల దుఃఖము, వింటే జలజనిత విషమువేఁడిమి ప్రభు వై
యుంటకు నార్తుల యాపదఁ[3] గెంటించుట ఫలము దానఁ గీర్తి మృగాక్షీ! 233

క. ప్రాణేచ్ఛ వచ్చి చొచ్చిన, ప్రాణుల రక్షింపవలయుఁ బ్రభువుల కెల్లన్
బ్రాణుల కిత్తురు సాధులు, ప్రాణంబులు నిమిష భంగురము లని మగువా! 234

క. పరహితము [4]సేయు నెవ్వఁడు, పరమ హితుం డగును భూత పంచకమునకున్
బరహిత మె పరమధర్మము, పరహితునకు నెదురు లేదు పద్మేందుముఖీ! 235

క. హరి మది నానందించిన, హరిణాక్షీ! జగంబు లెల్ల నానందించున్
హరియును జగములు మెచ్చఁగ, గరళము వారింపు టొప్పుఁ గమలదళాక్షీ! 236

క. శిక్షింతు హాలహాలమును, భక్షింతును మధుర సూక్ష్మ ఫలరసము క్రియన్
రక్షింతుఁ బ్రాణికోట్లను, వీక్షింపుము నేఁడు నీవు వికచాబ్జముఖీ! 237

---

1. భేదమగుదు దీనభేదమై (హ.) 2. లాలనంగొని (హ.) 3. గెంటింపఁగ ఫలముగాదె కీర్తి (హ.) 4. సేయ (హ. తం. వా.)

వ. అని పలికినఁ, బ్రాణవల్లభునకు వల్లభ యిట్లనియె. దేవా! చిత్తంబు కొలంది నవధరింతు గాక. అని పలికె నని చెప్పిన య మ్మునీంద్రునకు నరేంద్రుం డిట్లనియె. 238

మ. అమరఁ లోకహితార్థ మంచు నభవుం డొఁగాక యం చాడెఁ బో
యమరుల్ భీతిని భ్రమింగుమీ యనిరి వో యంభోజ గర్భాదులుం
దముఁ గావఁ హర! లెమ్ము లె మ్మనిరి వో తాఁ జూచి కన్గంట న
య్యుమ ప్రాణేశ్వరు నెట్లు భ్రమింగు మనె న య్యుగ్రానల జ్వాలలఁ. 239

వ. అనిన శుకుం డిట్లనియె. 240

క. భ్రమింగెడివాఁడు విభుం డని, భ్రమింగెడిదియు గరళ మనియు మేలని ప్రజకుఁ
భ్రమింగు మనె సర్వమంగళ, మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో! 241

మ. తన చుట్టున్ సురసంఘముల్ జయజయ ధ్వానంబులఁ బొబ్బిడఁ
ఘన గంభీర రవంబుతో శివుఁడు లోకద్రోహి! హుం! పోకు ర
మ్మని కెంగేలఁ దెమల్చి కూర్చి కడిగా [2]నంకించి జంబూ[3]ఫలం
బన సర్వంకషముఁ మహావిషము నాహారించె హేలాగతిఁ. 242

వ. అ య్యవిరళ గరళ దహన పాన సమయంబున. 243

మ. కదలంబాఅవు పాఁపపేరు లొడలన్ ఘర్మాంబు జాలంబు పు
ట్టదు నేత్రంబులు నెఱ్ఱగావు నిజ జూటార్ధేందుఁడున్ గందఁడున్
వదనాంభోజము వాడ దా విషము నాహ్వానించుచో డాయుచోఁ
బదిలుం డై కడిసేయుచోఁ [4]దిగుచుచో భక్షింపుచో భ్రమింగుచోన్. 244

క. ఉదరము లోకంబులకును, సదనం బగు నెటిఁగి శివుఁడు చటుల విషాగ్నిన్
గుదురుకొనఁ గంఠబిలమునఁ, బదిలంబుగ నిలిపె సూక్ష్మ ఫలరసము క్రియన్. 245

క. మెచ్చిన మచ్చిక గలిగిన, నిచ్చిన నీవచ్చుఁ గాక యిచ్చ నొరులకుం
[5]జిచ్చుఁ గడిఁ గొనఁగ వచ్చునె, చిచ్చఱచూ పచ్చుపడిన శివునకుఁ దక్కన్. 246

ఆ. హరుఁడు గళమునందు హాలాహలము వెట్టఁ
గప్పు గలిగి తొడవు కరణి నొప్పె
సాధురక్షణంబు సజ్జనులకు నెన్న
భూషణంబు గాదె భూవరేంద్ర! 247

---

1. వల్లభి (హ) 2. నక్కించి (హ) 3. ఫలంబని (హ. తం. వా.) 4. దిరుగుచో (వా)
5. చిచ్చఱ రూపచ్చు పడిన (హ. వా.)

వ. తదనంతరంబ. 248

క. గరళంబుఁ గంఠబిలమున, హరుఁడు ధరించుటకు మెచ్చి 'యౌనౌ' న నుచున్
హరియు విరించియు నుమయును, సురనాథుఁడుఁ బొగడి రంత సుస్థిరమతితోఁ.

క. హాలాహాల భక్షణ కథ, హేలాగతి [1]నై న విన్న నెలమిఁ బఠింపన్
వ్యాళానల వృశ్చికముల, పాలై చెడ రెట్టి జనులు భయవిరహితు లై. 250

అధ్యాయము - ౯

—: పాలకడలిలో నైరావతాదులు జనియించుట :—

వ. మఱియు నా రత్నాకరంబు సురాసురులు ద్రచ్చు నెడ. 251

క. తెల్లని మేనును నమృతము, [2]జిల్లున జల్లించు పొదుఁగు శిత[3]శృంగములున్
బెల్లుగ నర్థుల కోర్కులు, వెల్లిగొలుపు మొదవు పాలవెల్లిం బుట్టెన్. 252

ఆ. అగ్నిహోత్రి యనుచు నా సురభిని దేవ
మునులు పుచ్చుకొనిరి ముదముతోడ
విబుధ సంఘములకు వెరవుతో నధ్వర
హవులు వెట్టుకొఱకు నవనినాథ ! 253

వ. మఱియు నా జలరాశియందు. 254

క. స చ్చంద్రపాండురం బై, యుచ్చైశ్శ్రవ మనఁగఁ దురగ ముదధి జనించెన్
బుచ్చికొనియె బలిదైత్యుం, డిచ్చఁ గొనం డయ్యె నింద్రుఁ డీశ్వరశిక్షన్. 255

క. [4]ఒఱపగు నురమును పిఱుఁదును, నెఱిదోఁకయు ముఖముసిరియు నిర్మలఖురముల్
కుఱుచచెవులుఁ దెలిగన్నులుఁ, దఱచగు కందంబు చూడఁ దగు నా హరికిన్. 256

వ. అంత నా పాలకుప్పయందు. 257

క. దంత చతుష్టాహతి నై, లాంతంబులు విఱిగిపడఁగ నవదాత కుభృ
త్కాంతం బగు నై రావణ, దంతావళ ముద్భవించె ధరణీనాథా ! 258

క. తడలేని నడపువడి గల, యొడలును బెను నిడుదకరము నురుకుంభములున్
బెడఁ గై యువతుల మురిపెపు, నడతలకున్ మూలగురు వనఁ గజ మొప్పెన్. 260

వ. మఱియు న త్తరంగిణీవల్లభు మథింపు న య్యెడ.

---

1. విన్నన్నై న(హ) 2. ఝిల్లున(హ) 3. శృంగములన్(హ) 4. పరపగు (క. చ. ట. డ.)

తే. ఎల్ల ఋతువులందు నెలకారి పరువమై
యింద్రు విరులతోఁట కేపు దెచ్చి
కోరి వచ్చువారి కోర్కుల నీనెడు
వేల్పుభ్రమాను పాలవెల్లిఁ బుట్టె. 261

వ. మఱియునుం గొండకవ్వంబునం గడలి మథింప నప్సరోజనంబు జనించె. అంత262

క. క్రొక్కారు మెఱుఁగు మేనులుఁ, గ్రిక్కిరిసిన చన్నుఁగవలుఁ గ్రిస్సిన నడుముల్
బిక్కటిలి యున్న తుఱుములుఁ, జక్కని చూపులును దివిజసతులకు నొప్పెన్. 263

వ. మఱియు నా రత్నాకరంబునందు సుధాకరుం డుద్భవించి, విరించి యనుమ
తంబునఁ దన యథాస్థానంబునం బ్రవర్తించుచుండె. అంత 264

క. తొలుకారు మెఱుఁగుకైవడి, తళతళ యని మేను మెఱయ ధగధగ యనుచున్
గలుముల నీనెడు చూపుల, చెలువంబుల మొదలిచెంకి సిరి పుట్టె నృపా! 265

సీ. పాలమున్నీటిలోపలి మీఁది మీఁగడ మిసిమి జిడ్డునఁజేసి మేనువడసి
క్రొక్కారుమెఱుఁగుల కొనల తళుక్కుల మేనిచేగల నిగ్గుమెఱుఁగుచేసి
నాఁడునాఁటికిఁ బ్రోది నవకంపుఁ దీఁగెల నునుఁబోద నెయ్యంబు నూలుకొలిపి
క్రొవ్వారు కెందమ్మి కొలఁ కులఁ బ్రొద్దునఁ బొలసిన వలపులఁ బ్రోదివెట్టి

తే. పసిఁడిచంపకదామంబు [1]బాగుఁ గూర్చి
వ్రాలు క్రొన్నెల చెలువున వాఁడి దీర్చి.
జాణతనమునఁ జేతుల [2]జడ్డు విడిచి
నలువ యీ కొమ్మ నొగిఁ జేసి నాఁడు నేఁడు. 266

క. కెంపారెడు నధరంబును, జంపారెడి నడుము సతికి శంపారుచులన్
సొంపారు మోమునఁ గన్నులుఁ, బెంపారుచు నొప్పుఁ గొప్పుఁ బిఱుదును గుచముల్ 268

వ. అని జనులు పొగడుచుండ.

సీ. తరుణికి మంగళస్నానంబు సేయింతు మని పెట్టె నింద్రుఁ డనర్ఘ మైన
మణిమయపీఠంబు మంగళవతు లైన వేలుపుగరితలు విమల తోయ
పూర్ణంబు లై యున్న పుణ్యాహ కలశంబు లిడిరి పల్లవముల నిచ్చె భూమి
కడిమి గోవులు పంచగవ్యంబులను నిచ్చె మలసి వసంతుఁడు మధువు నొసఁగె

---

1. బాగుఁ బెట్టి (హ) 2. జాడదీర్చి (హ)

తే. మునులుఁ గల్పంబుఁ జెప్పిరి మొగిలుగములు
పణవ గోముఖ కాహళ పటహ మురజ
శంఖ వల్లకి వేణు నిస్వనము నిచ్చె,
పాడి రాడిరి గంధర్వపతులు సతులు. 269

క. పండిత సూక్తులతోడుతఁ, దుండంబులు సాఁచి తీర్థతోయము లెల్లఁ
[1]గుండముల ముంచి దిగ్వే, దండంబులు జలకమార్చెఁ దరుణీమణికిఁ. 270

సీ. కట్టంగ పచ్చని పట్టుపుట్టము దోయి ముదితకుఁ దెచ్చి సముద్రుఁ డిచ్చె
మత్తాళినికరంబు మధు వాన మూఁగిన వై జయంతీ మాల వరుణుఁ డిచ్చెఁ
గాంచన కేయూర కంకణ కింకిణీ కటకాదులను విశ్వకర్మ యిచ్చె
భారతి యొకమంచి తారహారము నిచ్చెఁ బాణిపద్మము నిచ్చెఁ బద్మభవుఁడు

ఆ. కుండలివ్రజంబు కుండలముల నిచ్చె
శ్రుతులు భద్ర మైన నుతులు సేసె
నెల్లలోకములకు నేలికసాని వై
బ్రతికె దనుచు దిశలు వలికె నధిప! 271

వ. మఱియును. 272

సీ. పలుకుల నమృతంబు చిలుక నెవ్వానితో భాషించు నతఁడె పో బ్రహ్మ యనఁగ
నెలయించి కెంగేల నెవ్వని వరియించె వాఁడె లోకములకు వల్లభుండు
[2]మెయిదీఁగె నెవ్వని మేనితోఁ గదియించె వాఁడె పో పరమ సర్వజ్ఞమూర్తి
నెలఁతుక యెప్పుడు [3]నివసించు నేయింట నా యిల్లు పర మగు నమృతపదము

ఆ. నెలఁత చూపు వాఱు నె చ్చోటి కచ్చోటు
జిష్ణుధనదధర్మ జీవితంబు
కొమ్మ పిన్ననగవు గురుతరదుఃఖ ని
వారణంబు సృష్టికారణంబు. 273

వ. మఱియు న క్కొమ్మ నెమ్మనంబున. 274

సీ. భావించి యొకమాటు బ్రహ్మాండమంతయు నాటల బొమ్మరి ల్లని తలంచుఁ
బోలించి యొకమాటు భువనంబు లన్నియుఁ దన యింటిలో దొంతు లని తలంచుఁ
[4]బాటించి యొకమాటు బ్రహ్మాది సురలను దన యింటిలో బొమ్మ లని తలంచుఁ
గొనకొని యొకమాటు కుంభినీచక్రంబు నలవడ బొమ్మపీఁటని తలంచు

---

1. దుండముల (హ) 2. మైదీఁగె (హ) 2. నేయింట వసియించె (హ) 1. ప్రాపించి (హ)

ఆ. సొలసి యొక్కమాటు సూర్యేందురోచుల
నచటి దీపకళిక లని తలంచు
[1]భామ యొక్కమాటు భారతీదుర్గల
నాత్మసఖు లటంచు నాదరించు. 275

వ. తదనంతరంబ. 276

ఆ. చంచరీక నికర ఝుంకార నినదంబు
దనరు నుత్పలముల [2]దండఁ బట్టి
మేఘకోటి నడిమి మెఱుఁగుఁ బు త్తడి మాడ్కి
సురలనడుమ నిల్చె సుందరాంగి. 277

క. ఆ కన్నులు నా చన్నులు, నాకురు లాపిఱుఁదు నడుము నాముఖ మా న
వ్యాకారముఁ గని వేల్పులు, చీకాకునఁ బడిరి కలఁగి శ్రీహరి దక్కన్. 278

వ. అట్లు నిలిచి, దళదిళలం బరివేష్టించియున్న యక్ష రక్ష స్సిద్ధ సాధ్య దివిజ గరుడ గంధర్వ చారణ ప్రముఖ యూథంబులం గనుంగొని, య ప్పురాణ ప్రౌఢ కన్యకా రత్నంబు దనమనంబున ని ట్లని వితర్కించె. 279

సీ. ఐదువ నై [3]యుండ నలవడ దొకచోట నొకచోట సవతితో నోర్వరాదు
తగ నొకచోట సంతత వై భవంబుగా దొకచోట [4]వేఁడిమి నుండఁబోల
దొకచోటఁ గరుణలే దొక్కింత వెదకిన నొకచోట డగ్గఱి [5]యుంట బెట్ట
నెఱయంగ నొకచోట నిలుకడ చాలదు చర్చింప నొకచోట జడత గలదు

ఆ. కొన్నిచోట్లు కామ గుణగరిష్ఠంబులు
క్రోధసంయుతములు కొన్ని యెడలు
కొన్ని మోహాలోభ కుంఠితంబులు కొన్ని
ప్రమద మత్స రానుభావకములు. 280

వ. అని సకల సత్పురుష జనన వ ర్తనంబులు మానసించి పరిహరించి. 281

సీ. అమర ముత్తైదువ నై యుండవచ్చును వరుసకు సవతు లెవ్వరును లేరు
వెలయంగ నక్షాంత విభవ మీతని యిల్లు శృంగారచందన శీతలుండు
గలఁగఁ డెన్నఁడు శుద్ధ కారుణ్యమయమూ ర్తి విమలుండు గదిసి సేవించవచ్చు
నెఱి నాడి తిరుగఁడు నిలుకడ గలవాఁడు సకలకార్యములందు జడత లేదు

---

1. బాల (వ్రాతప్రతులన్నిట) 2. దండవెట్టి (హ) 3. యుండ దలవడ నొకచోట (హ)
4. వేడుక (జ) 5. యుంట బెట్టు (వ్రాతప్రతులు); యుంటబెట్ట (తం); యుండబెట్ట (వా).

ఆ. సాధురతుకుండు షడ్వర్గ రహితుండు
నాథుఁ డయ్యెనేని నడప నోపు
నితఁడె భర్త యనుచు నింతి సరోజాతుఁ
బుష్పదామకమునఁ బూజఁ జేసె. 282

క. ఇందీవర దామమున ము, కుందునిఁ బూజించి తనకుఁ గూడి వసింపఁ
మందిరముగఁ ద ద్వ్యతుము, [1]నంద సలజ్జాసుదృష్టి నాలోకించెఁ. 283

ఆ. మోహరుచులవలన ముద్దియ తలయెత్తు
సిగ్గువలన బాల శిరమువంచు
నింతి వెఱఁగువలన నెత్తదు వంపదు
తనదు ముఖము ప్రాణదయితుఁ జూచి. 284

క. హరిసూచిన సిరిసూడదు, సిరిచూచిన హరియుఁ జూడ సిగ్గును బొందుఁ
హరియును సిరియునుఁ దమలో, సరిచూపులఁ జూడ మరుడుఁ సందడి వెట్టెఁ.

చ. జగములతండ్రి యై దనరు శౌరి జగంబుల తల్లి నిందిరం
దగ నురమందుఁ దాల్చి నటఁ ద త్కరుణారసదృష్టిచేఁ బ్రజల్
మగుడఁగఁ దొంటిభంగి నతిమంగళ సాధిపతిత్వ సంపదఁ
నెగడిన లోకముల్ గని రనేకశుభంబులఁ బొంది రత్తఱిఁ. 286

వ. †అటమున్న యబ్ధిరాజు దనయందు నున్న యమూల్యం బైన కౌస్తుభంబు పేరిటి యనర్ఘ మణిరాజంబు న య్యంబుజాతునకు సమర్పించిన దానిఁ దన వక్షస్థలంబున ధరించె. అప్పు డ య్యాదిలక్ష్మియు శ్రీవత్స కౌస్తుభ వైజయంతీ వనమాలికాది తారహా రాలక్రతంబై న పుండరీకాతు వక్షస్థలంబున వసియించె. న య్యవసరంబున. 287

శా. ప్రమోసెఁ శంఖ మృదంగ వేణు రవముల్ ము న్నాడి పెం జీఁకటుల్
వాసెఁ నర్తన గానలీలల సురల్ భాసిల్లి రార్యుల్ జగ
ద్వాసుల్ విష్ణుని [2]బ్రహ్మ రుద్ర ముఖరుల్ ద ల్లింగమంత్రంబులం
బ్రాసక్తిఁ వినుతించి రుల్లసిత పుష్పవ్రాతవర్షంపుచుఁ. 288

క. ఆ పాలవెల్లికూఁతురు, తీపులఁ జూపులను దోఁగి తిలకించి బ్రజల్
చేపట్టిరి సంపదలను, బ్రాపించెను మేలు జగము బ్రతికె నరేంద్రా ! 289

క. పాలేటిరాచ కన్నియ, మేలారెడు చూపు లేక మిడుమిడు కంచుం
జాలిం బురబురఁ బొక్కుచుఁ, దూలిరి రక్కసులు కీడు దోఁచిన నధిపా ! 290

---

1. నందంద సలజ్జదృష్టి(శం.వా) † ఈ వచన మేవ్రాతప్రతిలోనులేదు. 2. బ్రహ్మదేవముఖరుల్ (హ.వా.)

క. [1]వారిధిఁ దరువఁగ నంతట, వారుణి యను నొక్కకన్య వచ్చిన నసురుల్
వారిజలోచను సమ్మతి, వా రై కైకొనిరి దాని వారిజనేత్ర! 291

వ. మఱియుఁ దరువం దరువ న ప్పయోరాశియందు. 292

సీ. తరుణుండు దీర్ఘదోర్దండుండు కంబుకంధరుఁడు పీతాంబరధారి స్రగ్వి
[3]లాలిత భూషణాలంకృతుం డరుణాక్షుఁ డున్నతోరస్కుఁ డత్యుత్తముండు
నీల కుంచిత కేశ నివహుండు జలధర శ్యాముండు మృగరాజ సత్త్వశాలి
మణికుండలుఁడు రత్నమంజీరుఁ డచ్యుతు నంశాంశ సంభవుం డమలమూర్తి

ఆ. భూరి యాగభాగ భోక్త ధన్వంతరి
యనఁగ నమృతకలశ హస్తుఁ డగుచు
నిఖిల వైద్యశాస్త్ర నిపుణుఁ డాయుర్వేది
వేల్పు వెజ్జు కడలి వెడలివచ్చె. 293

వ. త దనంతరంబ.

ఆ. అతనిచేత నున్న యమృతకుంభము సూచి
కెరలు వొడిచి సురలు కికురువెట్టి
పుచ్చుకొనిరి యసుర పుంగవు లెల్లను
మాఱులేని బలిమి మానవేంద్ర! 294

వ. వెండియు. 295

ఆ. చావులేని మందు చక్కఁగ మన కబ్బె
ననుచుఁ గడవ యసురు లాచికొనిన
వెఱచి సురలు హరికి మొఱలువెట్టిరి సుధా
పూర్ణఘటము పోయెఁ బోయె ననుచు. 296

—: శ్రీవిష్ణుమూర్తి మోహినీస్వరూపంబు నొందుట :—

వ. ఇట్లు శరణాగతు లైన వేల్పుల దైన్యంబు వొడగని, భృత్యజన కామదుం డగు న ప్పర మేశ్వరుండు మీరల్లు దుఃఖింప వలవదు. ఏను నామాయాబలంబునం జేసి మీ యర్థంబు మరల సాధించెద. అని పలికె. తత్సమయంబున న య్యమృతపూరంబు నేముం ద్రావుదు మని తమకించు దైత్య దానవజనంబుల లోపల నమంగళం బగు కలి సంభవించిన కతంబునఁ, బ్రబలు లగు రక్కసులు విలోకించి, సత్రయా గంబునందు నడచుచందంబునఁ దుల్యప్రయాస హేతువు లగు సురలును సుధా

---

1. వారధి (హ) 2. లాసిత (తం. వా.)

భాగంబున కర్హు లగుటం బంచి కుడుచుట కర్తవ్యంబు ఇది సనాతన ధర్మం బగుటం జేసి య య్యమృతకుంభంబు విడువుండు. అని, దుర్జను లగు నిశాచరులు జాతమత్సరు లై తమవారల వారింపుచున్న సమయంబున. 298

తే. ఒకనిచేత నుండ నొకఁడు బలిష్ఠుఁ డై
పుచ్చికొనిన వానిఁ బొదుగఁ బట్టి
యంతకంటె నధికుఁ డమృతకుంభము నెత్తి
కొంచుఁ బాఱెఁ బరులు గు య్యిడంగ. 299

వ. అంత. 300

సీ. మెత్తని యడుగుల మెఱుగారు జానువు లరఁటికంబముల దో యైన తొడలు
ఘన మగు జఘనంబు కడు లేఁత నడుమును బల్లవారుణకాంతి పాణియుగముఁ
గడు దొడ్డ[1]పాలిండ్లుఁ గంబుకంఠంబును బింబాధరముఁ జంద్రబింబ ముఖముఁ
దెలి గన్నుఁగవయును నళికుంతలంబులు బాలేందుసన్నిభ ఫాలతలము

తే. నమరఁ గుండల కేయూర హార కంక
ణాదు లేపార మంజీరనాద మొప్ప
నల్ల నవ్వులఁ బద్మదళాక్షుఁ డసుర
పతుల నణఁగింప నాఁడురూపంబుఁ దాల్చి. 301

వ. అ య్యవసరంబున జగన్మోహనాకారంబున. 302

సీ. [2]పాలిండ్లపై నున్న పయ్యెద జాఱించు జాఱించి మెల్లనఁ జక్క నొత్తుఁ
దళుక్కు త ళ్కను గండఫలకంబు లొలయించు నొలయించి కెంగేల నుజ్జగించుఁ
గడు మెఱుంగులువాఱు కడకన్ను లల్లార్చు నల్లార్చి ఱెప్పల నండ గొలుపు
సవరని దరహాస చంద్రికఁ జిలికించుఁ జిలికించి కెమ్మోవిఁ జిక్కుపఱుచు

తే. దళితధమ్మిల్ల కుసుమగంధమ్ము నెఱపుఁ
గంకణాది ఝణంకృతుల్ గడలుకొలుపు
నొడలికాంతులు పట్టులే కులుకఁబాఱు
సన్న[3]వలిపంపుఁ బయ్యెద చొకళింప. 303

---

1. పాలింళ్ళు (హ.) 2. పాలింళ్ళపై (హ.)
1. వలిపంబు వెలువడి చొకళింప (క.చ.ట. త. జ. డ) వలిపంపుఁ బయ్యెద చొకళించి (వా)

అధ్యాయము - ౯

వ. ఇ ట్లవిధంబున నక్కపట యువతీరత్నంబు జగన్మోహన దేవతయునుంబోలె, నెమ్మొగంబుదావికి మత్తిల్లిన తేఁటి మొత్తంబులం గెలిచి, చిగురుఁబొంపంబుల నెడగలుగఁ జడియుచు, మురియుచుండ, రాక్షసవరులు గనుంగొని. 304

సీ. ఔఁ గదె లావణ్య మౌఁ గదే మాధుర్య మౌఁ గదే సతి! నవయౌవనాంగి!
యెటనుండి వచ్చితి వేమి యిచ్ఛించెదు నీ నామ మెయ్యది నీరజాక్షి!
యమర [1]గంధర్వ సిద్ధాసుర చారణ మనుజకన్యలకు నీ మహిమ గలదె
‡ప్రాణ చిత్తేంద్రియ పరిణామ దాయి వై నిర్మించెఁ బో! విధి నిన్నుఁ గరుణ

తే. వనిత! కళ్యపు సంతతివార మేము
భ్రాతలము సురల కే మిద్ధపౌరుషులము
జ్ఞాతులకు మాకు నేకార్థ సంగతులకు
బాలు దీరని యర్థంబు పంచి యిమ్ము. 305

క. సభ వై యుండెద మిందఱ, మభయంబున వచ్చుకొలఁది నమ్మతంబును నీ
విభరాజగమన! తప్పక, విభజింపు విపక్షపక్ష విరహితమతి వై. 306

వ. అని మంత్రించిన దైత్యులం గని, మాయాయువతిరూపుం డగు హరి తన వాఁడి చూపుటంపరలవలన వారల తాలుముల నగలించి చిఱునగవు లెగయ మొగమె త్తి యి ట్లనియె. 307

క. సుందరు లగు పురుషులఁ గని, పొందెడు నాయందు [2]బుద్ధి పుట్టెనె మీకుఁ
బృందారక రిపులారా!, చెందరు కామినుల విశ్వసింపరు పెద్దల్. 308

క. పలుకులు మధు రసధారలు, దలఁపులు నానాప్రకార దావానలముల్
సెలుములు సాలావృకములు, చెలువల [3]నమ్మంగ వేదసిద్ధాంతములే. 309

క. నా నేర్చుకొలఁది మీకును, మానుగ విభజించి యిత్తు మానుఁడు శంకఁ
గానిం డనవుడు నిచ్చిరి, దానవు లమృతంపుఁగడవఁ దరుణీమణికిఁ. 310

క. ఆ [4]శాంతాలోకనములు, నా శీతలభాషణములు నా లాలితముల్
రాశిపరంపర లగుచును, పాశము లై వారినోళ్ళు బంధించె నృపా! 311

---

1. గంధర్వవిద్యాధర చారణ(తం.) ‡ "నూనం త్వం విధినా ప్రేషితాసి శరీరిణాం సర్వేంద్రియ మనఃప్రీతిం విధాతుం సఘృణేన కిమ్" అని మూలము (౭-౬)

2. నిజము పుట్టునె (తం.వా.); "కథం కాశ్యపదాయాదాః పుంశ్చల్యాం మయి సంగతాః. విశ్వాస పండితా జాతు కామినీషునయాంతిహి." (౭-౭) 3. నమ్ముటలు (తం. వా.)

4. ఆ శాతాలోకనములు (క. ట.)

వ. ఇట్లు సుధాకలశంబు చేత నందుకొని, మందస్మిత భాషణంబుల సుందరీరూపుం డగు ముకుందుండు, మేలు కీడనక నేను బంచియిచ్చిన తెఱంగున నంగీకరిం చుట కర్తవ్యంబు అనవుడు నగుంగాక యని, సురాసుర [1]దైత్యదానవ సమూహం బుపవసించి, కృతస్నాను లై, హోమంబు లాచరించి, విప్రులకు గో భూ హిరణ్యాదానంబులు సేసి, తదాశీఃప్రవచనంబులు గైకొని, ధవళ పరిధానులై, గంధ మాల్య ధూప దీపాలంకృతం బగు కనక రత్న శాలా మధ్యంబున, బ్రాగగ్ర కుశపీఠంబులం బూర్వదిశాభిముఖు లై, పంక్తులు గొనియున్న సమయంబున.

క. శ్రోణీభర కుచయుగభర, వేణీభరములను డస్సి వివిధాభరణ
క్వాణ యయి యువిద వచ్చెను, బాణిసరోజమున నమృత భాండముఁ గొంచున్.

క. భాసుర కుండల భాసిత, నాసా ముఖ కర్ణ గండ నయనాంచల యై
శ్రీ సతి యగు సతిఁ గని దే, వాసురయూథంబు మోహ మందె నరేంద్రా !

వ. అప్పుడు. 315

క. అసురుల కమృతము వో యుట, పొసఁగదు పాములకుఁ బాలు పోసినమాడ్కిన్
దొసఁ గగు నంచును వేఱొక, దెసనుం గూర్చుండఁ బెట్టె దేవాహితులన్. 316

వ. ఇట్లు రెండుపంక్తులు గా నేర్పఱించి. 317

సీ. వేగిరపడకుఁడీ వినుఁడు దానవులార ! తడవు సేయక పత్తు దైత్యులార !
యటు చక్కఁ గూర్చుండుఁ డని కన్ను లల్లార్చి చనుఁగవ పయ్యెదఁ జాఱఁ దిగిచి
వదినె[2]మఱందుల వావులు గల్పించి మర్మంబు లెడలించి మఱుఁగు సేసి
మెల్లని నగవుల మేనులు మఱపించి కడు [3]జాణమాటలఁ గాకుపఱిచి

తే. యసురవరుల నెల్ల నణకించి సురలను
దడవు సేయవలదు ద్రావుఁ డనుచు
వచ్చుకొలఁది నమృతవారి విభాగించెఁ
దరుణి దివిజులెల్లఁ దనిసి పొగడ. 318

వ. అ య్యవసరంబున. 319

సీ. మనకు వేల్పులకును మారాటములు [5]రాక పంచిపెట్టెద నని పణఁతి పూనెఁ
దా నేల తప్పును దప్పదు తరళాక్షి గాక ర మ్మనుచును గణఁకఁ బిల్వ
మఱుమాట లాడదో మఱి చూడకుండునో చనుఁగవ గప్పునో చాలు ననుచు
[4]నొం డాడ కలుగుచు నొక్కింత సొలయునో మనయెడఁ గందునో మగువయనుచు

---

1. "దైత్య యూథపాఃశ్" (మూలము) 2. మఱందలి (హ.) 3. జాడమాటల (హ.)
4. నొండెడ కేఁగునో (తం.) 5. మందట లేకుండఁ బంచి (తం.వా.)

ఆ. నెఱత చూడ్కిగముల నీరై కలంగుచుఁ
బ్రణయభంగభీతి బద్ధు లగుచు
నూరకుండ్రి గాని యువిద! తే తెమ్మని
యడుగఁజాల రైరి యసురవరులు. 320

వ. అప్పుడు. 321

మ. అమరవ్రాతములోనఁ జొచ్చి దివిజుం డై రాహు పీయూషపా
నము సేయం గని చంద్రభాస్కరులు సన్నల్ సేయ నారాయణుం
డమరారాతిశిరంబు చక్రహతిఁ దున్మాడెఁ సుధాసిక్త మై
యమరత్వంబునుఁ జెందె [1]మూర్ధము [2]తదన్వాంగంబు నేలం బడెఁ. 322

ఆ. అజుఁడు వానిశిరము నంబరవీథిని
గ్రహము సేసి పెట్టి గారవించె
వాఁడు పర్వములను వైరంబు దప్పక
[3]భానుచంద్రములను బట్టుచుండు. 323

క. ఒకబొట్టు జిక్కకుండఁగ, సకల సుధారసము నమర సంఘంబులకుం
బ్రకటించి పోసి హరి దన, సుకరాకృతిఁ దాల్చె నసురభూరులు బెగడఁ. 324

—: దేవాసుర యుద్ధము :—

మ. అమరుల్ రక్కసులుం బ్రయాస బల హే త్వ ర్థాభిమానంబులఁ
సముల్లై లబ్ధవికల్పు లైరి సురలుఁ సంశ్లేయసంయుక్తు లై
రమరారుల్ బహుదుఃఖముం గనిరి తా మత్యంత దోర్గర్వు లై
కమలాక్షుఁ శరణంబు వేఁడని జనుల్ కల్యాణసంయుక్తులే. 325

ఆధ్యాయము - ౧౦

క. దానవు లమృతము ద్రావం, బూని పయోరాశిఁ ద్రచ్చి పొగిలిన మాడ్కిన్
శ్రీనాథ పరాఙ్ముఖు లగు, హీనులు వొందంగఁజాల రిష్టార్థములన్. 326

క. శోధించి జలధి నమృతము, సాధించి నిలింపవైరి చతుర్గతులన్
రోధించి సురల కిడి హరి, బోధించి ఖగేంద్రు నెక్కి పోయెు నరేంద్రా! 327

క. శుద్ధు లగు సురల కమృతము, సిద్ధించిన నసురవరులు సిడిముడి పడుచున్
గ్రుద్ధులు నానాయుధ స,న్నద్ధులు నై యుద్ధమునకు నడిచిరి బలిమిన్. 328

---

1. మూర్ధ్నము (హ) 2. తదీయాంగంబు (తం.) 3. భానుచందురులను (హ.)

క. ధన్యులు వైరోచని శత, మన్యు ప్రముఖులు మదాభిమానులు తమలో
నన్యోన్యరణము బాహా, సిన్యాసంబులను బేర్చి చేసిరి కడిమిన్. 329

మ. అరుదై కామగ మై మయాసురకృతం బై లోకికాలోక్య మై
వర శస్త్రాస్త్ర సమేత మై తరళ మై వైహాయసం బై మహా
సుర యో ధాన్విత మైన యానమున సంశోభిల్లఁ బూర్ణేందు సు
స్థిర కాంతిన్ బలి చామర ధ్వజ చమూ దీప్తస్థితిన్ ముందటన్. 330

వ. మఱియు, నముచి, శంబర, బాణ, ద్విమూర్ధ, కాలనాభ, శకుని, నికుంభ, కుంభ, అయోముఖ, ప్రహేతి, హేతి, భూతసంతాప, హయగ్రీవ, కపిల, మేఘదుందుభి, మయ, త్రిపురాధిప, విప్రచిత్తి, విరోచన, వజ్రదంష్ట్ర, తారక, అరిష్ట, అరిష్టనేమి, శుంభ, నిశుంభ, శంకు, శిరోముఖ ప్రముఖులును, పౌలోమ కాలకేయులును, నివాత కవచ ప్రభృతులును, దక్కిన దండయోధులునుం గూడికొని, యరదం బులం, దురంగంబుల, మాతంగంబుల, హరిణంబుల, హరి కిరి కీట జలచరంబులను, శరభ మహిష గవయ ఖడ్గ గండభేరుండ చమరీ జంబుక శార్దూల గో వృషాది మృగంబులను, గంక గృధ్ర కాక కుక్కుట బక శ్యేన హంసాది విహంగంబులను, దిమి తిమింగిలాది జలచరంబులను, నరులను, నసుర సురనికర వికృత విగ్రహ రూపంబులగు జంతువులను నారోహించి, తమకు నడియాలంబులగు గొడుగులు, పడగలు, జోడులు, కైదువులు, పక్కరలు, బొమిడికంబులు మొదలగు పోటుము ట్లాయితంబుగఁ గైకొని, వేఱువేఱు మొన లై, విరోచన నందనుం డగు బలిముందట నిలువంబడిరి. దేవేంద్రుఁడు నై రావణారూఢుం డై, వైశ్వా నర వరుణ వాయు దండధరా ద్యనేక నిర్జరవాహినీ సందోహంబులును, దాను నెదురుపడి, పిఱుతివియక మోహరించె. అట్లు సంరంభ సన్నాహ సముత్సాహం బుల తెండుదెఱంగుల వారుం బోరాడు వేడుకల మీఁటగు మంటల సందడింపు చున్న సమయంబున. 331

సీ. వజ్ర దంష్ట్రాంచిత వ్యజనంబులును బర్హ్మ చామరంబులు సిత చ్ఛత్రములును,
చిత్రవర్ణ ధ్వజచేలంబులును వాత చలి తో త్తరోష్ణీష జాలములును
[3]జప్పుళ్ళ నెసఁగు భూషణ కంకణంబులుఁ జండాంశు రోచుల శస్త్రములును
వివిధ ఖేటకములు [4]వీరమాలికలును బాణపూర్ణము లై న తూణములును

---

1. విన్యాసంబులను బేర్మివెలసిరి కడిమిన్ (హ) 2. ద్విమూర్ధ్న (హ.)
3. చప్పుళ్ళనొసఁగు కంకణభూషణంబులు (హ) 4. వీరమాలికెలును (హ)

ఆ. నిండి పెచ్చు రేఁగి నిర్జరాసురవీర
సైన్యయుగ్మకంబు చాల నొప్పె
గాహ తతులతోడఁ [1]గలహాంబునకు వచ్చు
సాగరములభంగి జనవరేణ్య ! 332

క. భేరీ భాంకారంబులు, వారణ ఘీంకారములును వర హరి హేషల్
భూరి రథనేమి రవములు, ఘోరము లై [2]పెల్లగించెఁ గులశైలములన్. 333

వ. ఇ ట్లిద్ధంబున నుభయ బలంబులు మోహరించి, బలితో నింద్రుండును, దారకునితో గుహుండును, హేతితో వరుణుండును, ప్రహేతితోడ మిత్రుండును, గాలనాభుని తోడ యముండును, మయునితో విశ్వకర్మయు, త్వష్టతో శంబరుండును, సవిత తోడ విరోచనుండును. పరాజిత్తుతో నముచియు, వృషపర్వునితో నశ్వినీదేవత లును, బాణాది బలిపుత్ర శతంబుతో సూర్యుండును, రాహువుతో సోముండును, బులోమునతో ననిలుండును, నిశుంభ శుంభులతో భద్రకాళీదేవియును, జంభుని తోడ వృషాకపియును, మహిషునితో విభావసుండును, బ్రహ్మపుత్రులతోడ నిల్వల వాతాపులును, గామదేవునితోడ దుర్మర్షణుండును, మాతృగణము తోడ నుత్కలుండును, శుక్రునితోడ బృహస్పతియును, నరకునితో శనైశ్చరుం డును, నివాత కవచులతో మరుత్తులును, గాలేయులతోడ వసువులను నమరు లును, [3]గ్రోధవశ పౌలోములతో రుద్రవిశ్వేదేవగణంబులును, ని ద్ధంబునఁ గలిసి పెనంగి, ద్వంద్వయుద్ధంబు సేయుచు, మఱియు రథికులు రథికులను, బదాతులు పదాతులను, వాహనారూఢులు వాహనారూఢులం దాఁకి, సింహ నాదంబులు సేయుచు, నట్టహాసంబు లిచ్చుచు, నాహ్వానంబు లొసంగుచు, ననోన్య తిరస్కా రంబులు సేయుచు, బాహునాదంబుల విజృంభించుచుఁ, బెను బొబ్బల నుబ్బి రేఁగుచు, హుంకరింపుచు, నహంకరింపుచు, ధనుర్గుణంబులఁ డంకరింపుచు, శరంబుల నాఁటింపుచుఁ, బరశువుల నటుకుచుఁ, జక్రంబులం జెక్కుచు, శక్తులం దును ముచుఁ, గశలం బెట్టుచుఁ, గుఠారంబులం బొడుచుచుఁ, గదల నడుచుచుఁ, గరం బులం బొడుచుచుఁ, గరవాలంబుల ప్రేయుచుఁ, బట్టసంబుల నొంచుచుఁ, ప్రాసంబులం దెంచుచుఁ, బాశంబులఁ గట్టుచుఁ, బరిఘంబుల మొత్తుచు, ముసలం బుల మోఁదుచు, ముద్గరంబులఁ జదుపుచు, ముష్టివలయంబుల ఘట్టింపుచుఁ, దోమరంబుల నుఱుముచు, శూలంబులఁ జిమ్మచు, నఖంబులం జీరుచుఁ, దరు

---

1. గదనంబునకు వచ్చు (చ.) 2. పెల్లగిల్లెఁ గులశైలంబుల్ (హ) 3. క్రోధవశులైన, పౌలోములతో (హ) పౌలోములతో విశ్వేదేవగణంబును, గ్రోధవశులతో రుద్రులును (తం. వా.)

శైలంబుల రువ్వుచు, నుల్మకంబులం [1]జూడుచు, నిట్లు బహువిధంబులం గలహా విహారంబులు సలుపు నవసరంబున, భిన్నంబు లైన శిరంబులును, విచ్ఛిన్నంబు లైన కపాలంబులును, వికలంబు లైన కపోలంబులును, జిక్కులువడిన కేశబంధంబులును, భగ్నంబు లైన దంతంబులును, గృత్తంబు లైన భుజంబులును, ఖండితంబు లైన కరంబులును, విదళితంబు లైన మధ్యంబులును, వికృతంబు లైన వదనబింబంబులును, వికలంబు లైన నయనంబులును, వికీర్ణంబు లైన కర్ణంబులును, విశీర్ణంబు లైన నాసికలును, విఱిగిపడిన యూరుదేశంబులును, వితథంబు లైన పదంబులును, జినిఁగిన కంకటంబులును, వ్రాలిన కేతనంబులును, గూలిన ఛత్రంబులును, మ్రొగ్గిన గజంబులును, నుగ్గైన రథంబులును, నుఱుమైన హయంబులును, జిందఱవందఱ లైన భటసమూహంబులును, [2]ప్రాణంబుల బొరలెడు మేనులును, నబ్బి యూడెడు భూతంబులును, బాఱెడు రక్తప్రవాహంబులును, గట్టలు గొన్న మాంసంబులును, నెగసి తిరిగెడి [3]కళేబరంబులును, గలకలంబులు సేయు కంక గృధ్రాది విహంగంబులు నై యొప్పు నప్పో రతిఘోరం బయ్యె. 334
అప్పుడు.

శా. నాకాధీశుఁ బదింట మూఁట గజము న్నాల్గింట గుఱ్ఱంబుల
న్నే కాస్త్రంబున సారథిం జొనిపె ద్వైత్యేంద్రుండు [4]వీఁక వియ
ల్లోకాధీశుఁడు ద్రుంచె నన్నిటినిఁ దోడ్తో నన్ని భల్లంబులన్
రాకుండఁ రిపువర్గముం దునిమె [5]గీర్వాణుల్ నుతింపఁ వెసన్. 335

సీ. తన తూపు లన్నియుఁ దరమిడి శక్రుండు నటికిన జోడు విన్ననువు మెఱసి
బలి [6]మహాశక్తిఁ జేపట్టిన నదియును నతఁడు ఖండించె నత్యద్భుతముగ
మఱి ప్రాస శూల తోమరములు గైకొన్నఁ దోడ్తోన నవియునుఁ దునిమివైచె
నంతటఁ బోక యెయ్యది వాఁడు [7]సంధించె దొఁడరి తా నదియును దుమురుసేసె

ఆ. నసురభర్త విరథుఁ డై పోయి పగఱకుఁ
గానఁబడక వివిధ కపటవృత్తి
నేర్పు మెఱసి మాయ నిర్మించె మింటను
వేల్పుగములు [8]సూచి వెఱఁగుపడఁగ. 336

---

1. చూరిడుచు (తం) 2. ఒరలెడు కొఱప్రాణంబులును (తం. వా.) 3. కబంధంబులును (తం. వా.) 4. దా నాకస, ల్లోకాధీశుఁడు (వా) సువ,ర్లోకాధీశుఁడు (హ) 5. గీర్వాణారి యెగ్గింపఁగఁ (హ) గీర్వాణారి యగ్గింపఁగఁ (తం. వా.) 6. మహాశక్తిచేఁ బట్టిన(హ.తం.వా.) 7. సాధించె (హ) 8. గూడి (క. చ. ట. త.)

వ. ఇట్లు దానవేంద్రుని మాయావిశేష విధానంబున సురానీకంబులపై బర్వతంబులు వడియె. దావాగ్ని దందహ్యమాన తరు విస్ఫులింగంబులు గురిసె. [1]శిఖిశిఖాసారంబులు గప్పె. మహోరగ దందశూకంబులు గఱచె. వృశ్చికంబులు మీఱె. వరాహ వ్యాఘ్ర సింహంబులు కదిసి, విదళింపం దొరకొనియె. వన గజంబులు మట్టి మల్లాడంజొచ్చె. శూలహస్తులు, దిగంబరులు నై, బలురక్కసులు శతసహస్ర సంఖ్యలు భేదన చ్ఛేదన భాషణంబు లాడం దొడంగిరి. వికృతవదనులు గదాదండధారులు నాలంబిత కేశభారులు నై, యనేక రాక్షసవీరులు "పోనీకు పోనీకుఁడు, తును ముండని" వెనుతగిలిరి. వర్ష గంభీర నిర్ఘాత సమేతంబు లైన జీమూత సంఘాతంబులు, వాతాహతంబు లై యుప్పతిల్లి, నిప్పుల కుప్పలు, మంటల ప్రోవులుం గురిసె. మహాపవన విజృంభితం బైన కార్చిచ్చు ప్రళయానలంబు చందంబునం దరికొనియె. ప్రచండ ఝంఝూనిలప్రేరిత సముత్తుంగ తరంగావర్త భీషణం బైన మహార్ణవంబు, చెలియలికట్ట దాఁటి వెల్లివిరిసిన ట్లయ్యె. ఆ సమయంబునఁ బ్రళయకాలంబునుం బోలె మిన్నుమన్ను లేయుం బగ లని యొయ్యుంగరా దయ్యె. అ య్యవసరంబున. 337

క. ఆ యసురేంద్రుని బహుతర, మాయా జాలంబులకును మా ఱొయ్యఁగక వ
జ్రాయుధ ముఖరాదిత్యు ల, పాయంబునుఁ బొంది చిక్కువడిరి నరేంద్రా! 338

వ. అప్పుడు. 339

క. ఇ య్యసురలచేఁ జిక్కితి, మెయ్యది దెరు వెందుఁ జొత్తు మిటు వొలయఁ గదే
యయ్యా! దేవ! జనార్దన!, కుయ్యో! మొఱ్ఱో! యటంచుఁ గూయిడి రమరుల్. 340

వ. అట్లు మొఱయిడు నవసరంబున. 341

మ. విహగేంద్రాసన రూఢుఁ డై మణి రమా విభ్రాజితోరస్కుఁ డై
బహు శస్త్రాస్త్ర రథాంగ సంకలితుఁ డై భాస్వ త్కిరీటాది దు
స్సహుఁ డై నవ్య పిశంగచేల ధరుఁ డై సంపుల్ల పద్మాక్షుఁ డై
విహితాలంకృతితోడ మాధవుఁడుఁ దా వేంచేసె న చ్చోటికిన్. 342

చ. అసురుల మాయ లన్నియును నబ్జదళాక్షుఁడు వచ్చినంతటన్
గసిబిసి యై నిరర్థ మయి గ్రక్కునఁ బోయెను నిద్రనొంది సం
తసమున మేలుకొన్నగతిఁ గాంచి చెలంగిరి వేల్పు లందఱుం
బసచెడ కేలయుండు హరిపాద [2]పరిస్మృతి సేయ నాపదల్. 343

---

1. సటంక శిఖర నికర శిలాసారంబులు(తం.వా.) శిలా స్సటంక శిఖరాః (మూలము 10-46)
2. పరిషత్కృసేయ (హ)

వ. అయ్యెడ. 344

ఆ. కాలనేమి ఘోర కంఠీరవము నెక్కి
తార్క్ష్యశిరము శూలధారఁ బొడువ
నతని పోటుమొట్టు హరి కేల నంకించి
దానఁ జావఁబొడిచె దానవునిని. 345

క. పదపడి మాలి సుమాలులు, బెదరించినఁ దలలు ద్రుంచెఁ బృథు చక్రహతిన్
గదఁగొని గరుడుని ఱెక్కలు, చెదరించిన మాల్యవంతు శిరమున్ ద్రవ్వెన్. 346

అధ్యాయము - ౧౧

వ. ఇట్లు పరమపురుషుం డగు హరి కరుణా పరత్వంబునఁ బ్రత్యుపలబ్ధమనస్కులయిన వరుణ వాయు వాసవ ప్రముఖులు పూర్వంబున నెవ్వ రెవ్వరితోఁ గయ్యంబు సేయుదురు, వారు వారలం దలపడి నొప్పించిరి. అ య్యవసరంబున.

క. బాహు బలంబున నింద్రుఁడు, సాహసమున బలిమి గెలువ సమకట్టిన స
న్నాహమున వజ్ర మెత్తిన, హా హా నినదంబు సేసి రఖిలజనంబుల్, 348

వ. ఇట్లు సముద్యత భిదురహస్తుం డై, యింద్రుఁడు తన పురోభాగంబునం బరాక్రమించుచున్న విరోచనునందను నుపలక్షించి యి ట్లనియె. 349

మ. జగతిన్ వైరి మొఱంగి గెల్చు టదియున్ శౌర్యంబె ధైర్యంబె తా
మగవాఁ డయ్యును దన్నుఁ దా నెఱిఁగి సామర్థ్యంబునుం గల్గియున్
బగవానిం గని డాఁగెనేని మెయి సూపంజాలఁ డేనిం గటా!
నగరే బంధులు, దిట్టరే బుధులు, కన్యల్ గూర్తురే దానవా! 350

ఉ. మాయల్ సేయఁగరాదుపో! నగవులే మాతోడి పోరాటముల్?
దాయా! చిక్కితి వ్రక్కలించెదఁ గన ద్దంభోళి ధారాహతిన్
నీ యిష్టార్థము లెల్లఁ జూడుము వెస న్నీ వారలం గూడుకో
నీ యాటోపము నిర్జరేంద్రుఁ డడఁచున్ నే డాజిలో దుర్మతీ! 351

వ. అని పలికిన వజ్రితో విరోచనునందనుం డి ట్లనియె. 352

శా. నీవే పోటరివే సురేంద్ర! తెగడ న్నీ కేల గెల్పోటముల్
లేవే యెవ్వరిపాలఁ బోయినవి మేల్కీడుల్ విరించాదులున్
ద్రోవంజాలుదు రె వ్విధానమున సంతోషింప శోకింప నా
దైవం బేమి కరస్థలామలకమే దర్పోక్తులుం బాడియే. 353

---

1. గెల్పుట యిసీ (తం) గెల్చుటదియున్ (వా)

ఆ. జయము లపజయములు సంపద లాపద
లనిలచలిత దీపికాంచలములు
చంద్రకళలు మేఘచయము తరంగలు
మెఱుఁగు లమరవర్య! మిట్టిపడకు. 354

వ. అని యి ట్లాజ్ఞాపించి. 355

క. వీరుఁడు దానవనాథుఁడు, నారసములు నింద్రు మేన నాఁటించి మహా
ఘోరాయుధ కల్పము లగు, శూరాలాపములు సెవులఁ జొనిపెఁ మరలఁ. 356

వ. ఇట్లు తథ్యవాది యైన బలిచే నిరాకృతుం డై. 357

క. శత్రువు నాజ్ఞాపంబునఁ, దోత్రాహత గజముభంగిఁ ద్రుళ్ళుచు బలి నా
వృత్రారి వీచి వైచిన, గోత్రాకృతి నతఁడు నేలఁ గూలె నరేంద్రా! 358

క. చెలికాని పాటు గనుఁగొని, బలిసఖుఁ డగు జంభుఁ డతుల బాహాశక్తిఁ
జెలితనము సాల నెఱపుచు, నిలు నిలు మని వీఁకఁ దాఁకె నిర్జరనాథుఁ. 359

క. పంచానన వాహనుఁ డై, చంచ ద్గద జంభుఁ డెత్తి శైలారినిఁ దా
కించి సురేభంబును నొ, ప్పించి విజృంభించి యార్చి పేర్చెం గడిమిఁ. 360

క. వీఁక చెడి ఘన గదాహతిఁ, దోఁకయుఁ గదలింపలేక దుస్సహపీడఁ
ద్రోఁకరిలఁ బడియె నేలను, సోఁ కోర్వక దిగ్గజంబు సుడిసుడి గొంచుఁ. 361

వ. అయ్యెడ. 362

క. సారథి వేయు హయంబుల, [1]తే రాయితపఱిచి తేర దేవేంద్రుఁడు దా
నారోహించెను దైత్యుఁ డు, దారత మాతలిని శూలధారం బొడిచెఁ. 363

ఆ. శూలనిహతి నొంది స్రుక్కుచు నొచ్చిన
సూతు వెఱకు మంచు సురవిభుండు
వాని శిరము దునిమె వజ్రఘాతంబున
దైత్యసేన లెల్లఁ దల్లడిలఁగ. 364

చ. చని సురనాథుచేఁ గలన జంభుఁడు సచ్చుట నారదుండు చె
ప్పిన విని వాని భ్రాతలు గభీరబలాధికుఁ డా బలుండు పా
క నముచు లా పురందరునిఁ గాంచి ఖరోక్తులఁ దూలనాడుచుఁ
ఘన జలధారల న్నగము గప్పిన చాడ్పునఁ గప్పి రమ్మలఁ. 365

---

1. తేరాయత్తంబు సేసె (హ)

సీ. విబుధలోకేంద్రుని వేయుగుట్టంబుల నన్ని కోలల బలుం డదర నేసె
నిన్నూట మాతలి నిన్నూట రథమును నారీతి నింద్రు ప్రత్యంగకముల
వేధించెఁ బాకుండు వింట వాఁ డస్త్రంబు లేయుట దొడుగుట యెఱుఁగరాదు
కనకపుంఖంబుల కాండంబు లొకపది యేనింట నమచియు నేసి యార్చె

ఆ. బలిమి నిట్లు మిగురు పగవాని రథసూత
[1]సహితు మించి రస్త్రజాలములను
వనజలోక సఖుని వానకాలంబున
మొగులుగములు మునుఁగ [2]మూఁగినట్లు. 366

వ. అ య్యవసరంబున. 367

మ. అమరారాతుల బాణజాలముల పా లై పోయితే చెల్లరే
యమరాధీశ్వర! యంచు [3]భిన్నతరు లై యంభోధిలోఁ జించల
త్వమునం గ్రుంకు వణిగ్జనంబుల క్రియం దై త్యాధిపవ్యూహ మ
ధ్యమునం జిక్కిరి వేల్పు లందఱు విప ద్ధ్వానంబులఁ జేయుచుఁ. 368

శా. ఓహో దేవతలార! కుయ్యిడకుఁ డే నున్నాఁడ నం చంబుభృత్
వాహుం డా శరబద్ధ పంజరము నంతం జించి తేజంబునన్
వాహోపేత రథంబుతోడ వెలికిఁ వచ్చెఁ నిశాంతోల్లస
న్మాహాత్మ్యంబునఁ దూర్పునం బొడుచు నా మార్తాండు చందంబునఁ. 369

వ. ఇట్లు వెలువడి. 370

చ. విఱిగినసేనఁ గాంచి సురవీరుఁ డొహో యని బిట్టు చీరి క్ర
మ్మఱఁ బురికొల్పి పాక బలమస్తకముల్ నిశితాస్త్రధారల
న్నెఱసిన తీక్ష్ణవజ్రమున నేలకు ద్రావ్చెను వాని చుట్టముల్
వెఱచిరి త చ్చమూపతులు విహ్వలు లై చెడి పాఱి రార్తితో. 371

వ. అప్పుడు నముచి నిలువంబడి. 372

మ. తన చుట్టంబులఁ జంపె వీఁ డనుచు నుద్య త్కోపాధ్మాతుఁ డై
కనకాంతంబును నగ్మసారమయముఁ ఘంటాసమేతంబు నై
జనదృగ్దుస్సహ మైన శూలము నొగిఁ సారించి వై చెఁ సురేం
ద్రునిపై దీన హతుండ వౌ దని మృగేంద్రుం బోలి గర్జించుచుఁ. 373

---

1. సహితముగను శస్త్రజాలములను (హ) 2. ముంచునట్లు (తం) 3. భిన్నతనులై (హ) భిన్నతరులై (తం. వా.)

శా. ఆకాశంబున వచ్చు శూలమును జంభారాతి ఖండించి నా
నా కాండంబుల వాని కంఠము దెగఁ దంభోళియుఁ వైచె న
స్తోకేంద్రాయుధముఁ సురాళిగళముఁ ద్రుంపంగలే దయ్యె వాఁ
డాకంపింపక నిల్చె దేవవిభుఁ డత్యాశ్చర్యముఁ బొందఁగఁ. 374

వ. ఇట్లు నిలిచియున్న నముచిం గనుంగొని వజ్రంబు ప్రతిహతం బగుటకు శంకించి, బలభేది తన మనంబున. 375

సీ. కొండలఱెక్కలు ఖండించి వైచుచో వజ్ర మెన్నఁడు నింత వాఁడి సెడదు
వృత్రాసురాదుల విదళించె నీ పవి తిరుగ దెన్నఁడు పగ దీర్చి కాని
యింద్రుఁడఁ గానొకో యేను దంభోళియుఁ గాదొకో యిది ప్రయోగంబు చెడెనొ
దనుజాధముఁడు మొనతాఁకు దప్పించెనో ఖిదురంబు నేఁ డేల బెండువడియె

ఆ. ననుచు వజ్రి వగవ నార్ద్రశుష్కంబులఁ
జావకుండఁ దపము [1]సలిపె నీతఁ
డితర మెద్ది యైన నింద్ర ప్రయోగింపు
వైళ మనుచు దివ్యవాణి వలికె. 376

వ. ఇట్లుపదేశించిన దివ్యవాణి పలుకు లాకర్ణించి యింద్రుండు. 377

ఆ. ఆత్మబుద్ధిఁ దలఁచె నార్ద్రంబు శుష్కంబు
గాని సాధనంబు ఘేన మనుచు
[2]నదియ వైచి దాన నమరులు మెచ్చంగ
నముచి శిరముఁ ద్రుంచె నాకవిభుఁడు. 378

వ. అ య్యవసరంబున. 379

సీ. పురుహూతు నగ్గించి పుష్పాంజలులు సేసి మునులు దీవించిరి ముదముతోడ
గంధర్వ ముఖ్యులు ఘనులు విశ్వావసుఁడును పరావసుఁడు నిం పెనయఁ బాడి
రమరాంగనాజను లాడిరి దేవతా దుందుభులును భ్రమోసె దురములోన
వాయు వహ్ని కృతాంత వరుణాదులును [3]బ్రతి ద్వంద్వుల గెల్చి రుద్దండవృత్తి

తే. నల్పమృగముల సింహంబు లట్ల తోలి
రమరవర్యులు దనుజుల నదటువాయ
నజుఁడు వుత్తేర నారదుఁ డరుగుదెంచె
దైత్య హరణంబు వారింప ధరణినాథ! 380

---

1. సలిపె నకట (హా) 2. అదియ వైచే దాన (హా) 3. ప్రీతి ద్వంద్వుల గెల్చి (హా)

వ. వచ్చి సురలకు నారదుం డి ట్లనియె. 381

శా. సిద్ధించెఁ సురలార! మీ కమృతముఁ శ్రీనాథసంప్రాప్తు లై
వృద్ధిం బొందితి రెల్ల వారలును విద్వేషుల్ మృతింబొంది రీ
యుద్ధం బేటికి నింకఁ జాలుఁ బనిలే దోహో పురే యంచుసం
బద్ధాలాపము లాడి మాన్చె సురలం బాండవ్య వంశాగ్రణీ! 382

వ. ఇట్లు నారదవచేన నియుక్తు లై, రాక్షసులతోడి సంగ్రామంబు సాలించి, సకల దేవముఖ్యులునుం ద్రివిష్టపంబునకుం జనిరి. హతశేషు లైన దైత్యదానవులు, [1]విపన్నుం డైన బలిం దోడ్కొని, పశ్చిమ శిఖరి శిఖరంబుఁ జేరిరి. విధ్వంసమాన కంధరు లై, వినష్టదేహు లగు యామినీచరుల నెల్లను శుక్రుండు మృతసంజీవని విద్య పెంపునంజేసి బ్రతికించె. బలియును భార్గవానుగ్రహంబున విగత శరీర వేదనుండై, పరాజితుండయ్యును, లోకతత్త్వ [2]విచక్షణుం డగుటంజేసి దుఃఖింపక యుండె. అని చెప్పి రాజునకు శుకుం డి ట్లనియె. 383

అధ్యాయము - ౧౯

సీ. కైలాసగిరిమీఁద ఖండేందుభూషణుం డొకనాఁడు కొలువున నున్న వేళ
నంగన యై విష్ణుఁ డసుర వంచించి సురలకు నమృతంబు చూఱలిడుట
విని దేవియును దాను వృషభేంద్రగమనుఁడై కడువేడ్క భూతసంఘములుగొలువ
మధుసూదనుం డున్న మందిరంబున కేఁగి పురుషోత్తమునిచేతఁ బూజ లొంది

తే. తాను గూర్చుండి పూజించె దనుజవైరి
కుశలమే మీకు మాకును గుశల మనుచు
మధురభాషల హరిమీఁద మైత్రి నెఱపి
హరుఁడు పద్మాక్షుఁ జూచి యి ట్లనియెఁ బ్రీతి. 384

సీ. దేవ! జగన్మయ! దేవేశ! జగదీశ! కాల! [3]జగద్వ్యాపకస్వరూప!
యఖిల భావములకు [4]నాత్మయు హేతువు నైన యీశ్వరుఁడ [5]వాద్యంతములును
మధ్యంబు బయలును మఱి లోపలయు లేక పూర్ణ మై యమృత మై భూరి సత్య
మానంద చిన్మాత్ర మవికార మాద్య మనన్య మశోకంబు [6]నగుణ మఖిల

---

1. విషణ్ణుండైన (తం) 2. లోకకాల (హ. తం.) 3. జగద్రూపక (హ.) 4. భూతములకు (తం. వా.) 5. ఆద్యంతములకు (హ. తం. వా.) 6. నఖిలగుణము (హ.)

తే. సంభవ స్థితి [1]లయముల సంగరహిత
మైన బ్రహ్మంబు నీవ నీ యంఘ్రియుగము
నుభయ సంగ విసృష్టు లై యున్న మునులు
కోరి కైవల్యకాము లై కొల్తు రెపుడు. 385

సీ. భావించి కొందఱు బ్రహ్మంబు నీ వని తలపోసి కొందఱు ధర్మ మనియుఁ
జర్చించి కొందఱు స దస దీశ్వరుఁ డని సరవిఁ గొందఱు శక్తిసహితుఁ డనియుఁ
జింతించి కొందఱు చిరతరుం డవ్యయుఁ డాత్మతంత్రుఁడు పరుం డధికుఁ డనియుఁ
దొడరి యూహింతురు తుది నద్వయ ద్వయ స దస ద్విశిష్ట సంశ్రయుఁడ వీవు

తే. తలఁప నొక్కింత వస్తుభేదంబు గలదె
కంకణాదుల పసిఁడి యొక్కటియ గాదె
కడలు వె క్కైన వార్ధి యొక్కటియఁ గాదె
భేద మంచును నిను వికల్పింప వలదు. 386

సీ. యద్విలాసము మరీచ్యాదు లెఱుంగరు నిత్యుఁడ నై యున్న నేను నెఱుఁగ
[2]న మ్మాయ నంధు లై యమరాసురాదులు వనరెద రఁట యున్న వార లెంత
నే రూపమునఁ బొంద కేపారుదువు నీవు రూపి వై సకలంబు రూపుసేయ
రఱింపఁ జెఱుపఁ గారణ మైన సచరాచ రాఖ్య మై విలసిల్లు దంబరమున

తే. ననిలుఁ డేరీతి విహరించు నట్ల నీవు
గలసి వర్తింతు సర్వాత్మకత్వ మొప్ప
జగములకు నెల్ల బంధమోక్షములు నీవ
నీవ సర్వంబుఁ దలపోయ నీరజాక్ష ! 387

మ. ఘనత న్ని మగపోఁడుముల్ పలుమఱుం [3]గన్నారమ్ము వీనుల
నిను విన్నారము చూడ మెన్నఁడును ము న్నీ యూఁడు చందంబు మో
హిని వై దైత్యులఁ గన్నఁ బ్రామి యమృతం బింద్రాది దేవాళి కి
చ్చిన నీ రూపముఁ జూపుమా కుతుకమ్ము జిత్తంబునం బుట్టెడిఁ. 388

క. [4]మగవాఁడ వై జగంబులఁ, [5]దగిలిచి చిక్కులను బెట్టు దంటవు నీకుఁ
మగువతనంబున జగములఁ, దగులముఁ బొందింప నెంతతడవు ముకుందా ! 389

వ. అని పలుకుచున్న భూలపాణిచే నపేక్షితుం డై, విష్ణుండు భావగంభీరం బగు
నవ్వు నివ్వటిల్ల న వ్వామదేవున కి ట్లనియె. 390

---

1. లయముల దంభకంబు(వా.); లయమూల దంభకంబు (తం.) 2. యన్మాయ (హ.తం.వా.)
3. గన్నారఁ గన్నార మే (హ. వా.) 4. మగవాఁడవయ్యు (తం.) 5. దగులం జిక్కులనుబెట్టు(తం)

శా. శ్రీకంఠా! నిను నీవ యేమఱకుమీ చిత్తింబు రంజించెదఁ
నాకద్వేషుల డాఁగురించుటకు నై నాఁ డేను గైకొన్న కాం
తాకారంబు జగ న్నిమజ్జనము [1]నీ వై చూచెదేఁ జూపెదఁ
గైకో నర్హాము లండ్రు కాముకులు సంకల్ప [2]ప్రభూతార్థముల్. 391

—: శ్రీహరి తన మోహినీస్వరూపముచేత నీశ్వరుని మోహింపఁజేయుట :—

వ. అని పలికి, కమలలోచనుం డంతర్హితుం డయ్యె. అ య్యుమాసహితుం డైన భవుండు విష్ణుం డేడఁ బోయెనో, యెందుఁ జొచ్చెనో, యని దశదిశలుం గలయ నవలోకించుచుండం దన పురోభాగంబున. 392

సీ. ఒక యెలదోఁటలో నొక వీథి నొక నీడఁ గుచకుంభములమీఁది కొంగు దొలఁగఁ
గబరికాబంధంబు గంపింప నుదుటిపైఁ జికురజాలంబులు చిక్కువడఁగ
ననుమాన మై మధ్య మల్లాడఁ జెక్కులఁ గర్ణకుండలకాంతి గంతు లిడఁగ
నారోహభరమున నడుగులు దడఁబడఁ దృగ్దీప్తిసంఘంబు దిశలు గప్ప

తే. వామకరమున జాటిన వలువఁ బట్టి
కనక నూపురయుగళంబు ఘల్లనంగఁ
గంకణంబుల ఝణఝణత్కార మెసఁగ
బంతిచే నాడు ప్రాయంపు టింతిఁ గనియె. 393

వ. కని, మున్ను మగువ మరగి సగమైన మగవాఁ, డమ్మగువ వయో రూప గుణ విలాసంబులు తన్ను నూరింపం, గనుఱెప్ప వెట్టక తప్పక చూచి, మెత్త నైన చిత్తంబున. 394

శా. ఈ కాంతాజనరత్న మెవ్వరిదొకో యీ యాఁడురూపంబు మున్నేకల్పంబులయందుఁ గాన మజుఁడీ యింతిఁ సృజింపంగఁ దా
లేకుం బెల్ల నిజంబు వల్లభత నీ లీలావతిం జేరఁగా
నేకాంతుండు గలండొ క్రీడలను నా కీ యింతి సిద్ధించునే. 395

వ. అని మఱియుం జెఱకువిలుతుని కోలలు [3]మేరమీఱి దఱుమ, నెఱబిరుదు వెఱఁగుపడం, దెఱవఁ దుఱిమిన తుఱుము బిగిముడి వదలి కదిలి భుజముల మెడల నదరి చెదరిన కుఱులు నొసలి మృగమద తిలకంపు టసలు మసల, విసవిస నగు మొగము మెఱుంగులు దశదిశలం బసలుగొలుపఁ, జిఱునగవు మెఱయ, ననుఁజెమటఁ దడంబడి [4]పులకలుగొన, హృదయానంద కందం బగు కందు

---

1. నీకై (హ.) 2. సంకల్ప ప్రభావంబులన్ (హ.వా.) సంకల్ప ప్రభూతాత్మముల్ (తం.)
3. మెరవడి దరిసిన (క. ద.) 4. పులకరములు గులకరములుగొన (తం. వా.)

కంబు కరారవిందంబునం దమర్చి, యక్కునఁ జేర్చి, చెక్కున హత్తించి, చుబుకంబు మోపి, చూచుకంబులం గదియించి, నఖంబుల మీటుచు, మెల్ల మెల్లన గెల్లాడు కరకమలములఁ గనక మణివలయములు ఝణఝుణ యనం, గుచకలశములు నొకటి నొకటి నొఱయ, నెడమ కుడినిం దడంబడఁ, గ్రమ్మన నెగురఁజిమ్మచు, నెగరజిమ్మ, తనకుఁ దానె కొన్ని చిన్న పన్నిదంబులు చేసికొని, బడుగునడుము బెడసి వడవడ వడంక, నటీతి సరులు కలయంబడఁ దిరుగుచుఁ బెనకువలు గొనఁ, జెవులతొడవుల రుచులు కటముల నటనములు సలుపఁ, బవిరి తిరిగి యొడియుచు, నొడిసి కెలంకులకుం జడియుచు, జడిసి జడను వడక, వలువ నెలవువదలి దిగంబడం, గటిస్థలంబునం గాంచీ కనకమణి కింకిణులు మొరయఁ, జరణకటకములు ఘల్లుఘల్లుమనంగ, మితిదప్పిన మోహోతి రేకం బుప్పొంగ, వెనుకొని యుటీకి పట్టుచుఁ, బట్టి పుడమిఁ బడవైచి, పాటువెంటనే మింటి కెగసినం, గెంటక కరంబునం గరంబు దిరం బై పలుమఱు నెగయ నడుచుచు, నెగయునెడ దిగంబడుతటీని, నీలంపు మెఱుంగునిగ్గు సోగపగ్గంబుల వలలు వైచి, రా దిగిచినపగిది వెనుకొనంగ, విలోకనజాలంబులు నిగిడించుచు, మగిడించుచుఁ, గరలాఘవంబున నొకటి, పది, నూఱు, వేయు నేసి, నేర్పు వాటింపుచు నరుణ చరణకమల రుచుల నుదయశిఖరి శిఖర తరణి కరణి సేయుచు, [1]ముఖచంద్ర చంద్రికలు మండలంబులు గావింపుచు, నెడనెడ నురోజదుర్గ నిర్గత చేలాంచలంబుఁ జక్కనొత్తుచుఁ, గపోలఫల కాలోల ఘర్మజల బిందుబృందంబులు నఖాంతంబుల నోసరింపుచు, నధర బింబారుణ సంభ్రాంత సమాగత రాజకీరంబులం జోపుచు, ముఖసరోజ పరిమళాసక్త మత్తమధుపంబుల నివారింపుచు, మందగమనాభ్యాస కుతూహలాయత్త మరాళయుగ్మంబులకుం దలంగుచు, విలాసవీక్షణానందిత మయూరమిథునంబులకు నెడఁగలుగుచుఁ, బొదరిండ్ల యూఅంబులకుం బోక మలంగుచుఁ, గరకిసల యాస్వాదకాముక కలగంత దంపతులకు దూరింపుచుఁ, దీఁగె యుయ్యలల నూఁగుచు, మాధవీమంట పంబు లెక్కుచుఁ, గుసుమ రేణుపటలంబుల గుబ్బళ్ళుగ్రావాకుచు, మకరందస్యంద బిందుబృందం బుత్తరింపుచుఁ, గృతకశైలంబుల నారోహింపుచుఁ, బల్లవ పీఠంబులఁ బరిశ్రమంబు వుచ్చుచు, లతాసౌధభాగంబులఁ బొడసూపుచు, నున్నత కేతకీస్తంభంబుల నొరగుచుఁ, బుష్పదళ ఖచిత వాతాయనంబులఁ దొంగిచూచుచుఁ, గమలకాండ పాలికల నాలంబించుచుఁ, జంపకగేహాళి మధ్యం బుల నిలువంబడుచుఁ, గదళికాపత్ర వాతంబుల నొఱయు పరాగనిర్మిత సాల

---

1. ముఖచంద్ర చంద్రికలఁ జంద్రమండలంబులు గావించుచు (తం. వా.)

భంజికానివహంబుల నాదరింపుచు, మణికుట్టిమంబుల మురియుచుఁ, జంద్రకాంత వేదికల నెలయుచు, రత్నపంజర శారికానివహంబులకుం జదువులు చెప్పుచుఁ, గోరినక్రియం జూచుచుఁ, జూచినక్రియ మెచ్చుచు, మెచ్చినక్రియ వెఱఁగుపడుచు, వెఱఁగుపడినక్రియ మఱచుచు, మఱవక యేకాంతం బగు న వ్వనాంతంబున ననంతవిభ్రమంబుల జగన్మోహిని యై విహరింపుచున్న సమయంబున. 396

ఆ. వాలుఁగంటి వాఁడి వాలారుఁ జూపుల
శూలి ధైర్యమెల్లఁ గోలుపోయి
తఱలి యెఱుకలేక మఱచె గుణంబుల
నాలి మఱచె నిజ గణాలి మఱచె. 397

వ. అప్పుడు, 398

ఆ. ఎగురవై చి పట్ట నెడలేమిఁ జేదప్పి
వ్రాలుబంతిఁ గొనఁగ వచ్చునెడను
బడఁతి వలువ వీడి పడియె మారుతహతిఁ
జంద్రధరుని మనము సంచలింప. 399

మ. రుచిరాపాంగిని వస్త్రబంధనపర రోమాంచ విభ్రాజిత
గుచభారానమితం గరద్వయపుటీ గూఢీకృతాంగిం జల
త్కచబంధం గని మన్మథాతురత నాకంపించి శంభుండు ల
జ్జ చలింపం దన కాంత సూడఁ గదిసెం జంద్రాస్య కేల్దమ్మికిఁ. 400

ఆ. పదము సేరవచ్చు ఫాలాక్షుఁ బొడగని
చీర వీడిపడిన సిగ్గుతోడ
మగువ నగుచుఁ దరులమాటున డాఁగెను
వేల్పుఱేఁడు నబల వెంటఁ బడియె. 401

మ. ప్రబలోద్యత్ కరిణిం గరీంద్రుఁడు రమింపఁ వచ్చులీలన్ శివుం
డబలా! "పోకుము పోకువే" యనుచు డాయం బాఱి కెంగేలఁ దాఁ
గబరీబంధము వట్టి సంభ్రమముతోఁ గౌఁగిళ్ళ నూరార్చె నం
త బహిఃప్రక్రియ నెట్టకేనిఁ గదియం ద ద్భావ నిర్ముక్త యై. 402

సీ. వీడి వెన్నున నాడు వేణీభరంబుతో జఘనభారాగత శ్రాంతితోడ
మాయావధూటి యై మఱలి చూచుచుఁ బాఱు విష్ణు నద్భుతకర్మ వెంటఁ దగిలి
యీశాను మఱల జయించె మరుం డనఁ గరిణి వెఱచను కరి కరణిఁ దాల్చి
కొండలు నేఱులు కొలఁకులు వనములు దాఁటి శంభుఁడు సనం ద న్మహాత్మ

తే. నిర్మ లామోఘ వీర్యంబు నేలమీఁదఁ
బడిన చోఁటెల్ల వెండియుఁ బైఁడి యయ్యె
ధరణి వీర్యంబు వడఁ దన్నుఁ దా నెఱింగి
దేవమాయా జడత్వంబుఁ దెలిసె హరుఁడు. 403

క. జగదాత్మకుఁ డగు శంభుఁడు, మగిడెను హరి నెఱిఁగి తనదు మాహాత్మ్యమునన్
విగత త్రపుఁ డై నిలిచెను, మగువతనం బుడిగి హరియు మగవాఁ డయ్యెన్.

ఆ. కాము గెలువవచ్చుఁ గాలారి గావచ్చు
మృత్యుజయము గలిగి మెఱయవచ్చు
నాఁడు వారి చూపు టంపఱ గెలువంగ
వశముగాదు త్రిపురవైరి కైన. 405

వ. ఇట్లు పురుషాకారంబు వహించిన హరి హరున కిట్లనియె. 406

సీ. నిఖలదేవో త్తమ ! నీ వొక్కరుఁడు దక్క నెవ్వఁడు నా మాయ నెఱుఁగనేర్చు
మానిని యైన నా మాయచే మునుఁగక ధృతి మోహితుండ వై తెలిసి తీవు
కాలరూపంబునఁ గాలంబుతోడ[1] నా యందును నీ మాయ యధివసించు
నీమాయ నన్ను జయింపనేరదు నిజ మకృతాత్మ్మలకు [2]నెల్ల ననుపలభ్య

తే. యిపుడు నీ నిష్ఠ వెంపున నెఱిఁగి తనుచు
సత్కరించిన సఖ్యంబు చాల నెఱపి
దక్షతనయ గణంబులుఁ దన్నుఁ గొలువ
భవుఁడు విచ్చేసెఁ దగ నిజభవనమునకు. 407

శా. పారావారముఁ ద్రచ్చుచో [3]గిరి సముద్వాహోర్థ మై కచ్ఛపా
కారుం డై న రమేశువర్తనము నాకర్ణింపఁ గీర్తింప సం
సారాంభోనిధిలో మునుంగు కుజనుల్ సంశ్రేయమున్ బొంది వి
స్తారోదార సుఖంబుఁ జెందుదురు తథ్యం బింతయున్ భూవరా ! 408

మ. ఎలమిన్ దైత్యుల నాఁడురూపమున మోహింపించి పీయూషమున్
జలితాపన్నులకున్ సురో త్తములకుం జక్కన్ విభాగించి ని
ర్మలరేఖన్ విలసిల్లు శ్రీవిభునిఁ ద న్మాయావధూ రూపమున్
దలఁతున్ మ్రొక్కుదు నాత్మలోన [4]దురిత ధ్వాంతోగ్ర దీపంబుగన్. 409

---

1. తోడుత, నాయందు నీమాయ యధివసించు(హ) 2. ఎట్లు మనుపలభ్య, మిపుడు నీ నిష్ఠ వెంపున నిలిచి తనుచు(హ) 3. గిరిసముద్యద్భార మై (హ.వా.); ఈపాఠమున యతి భంగము. సముద్భారార్థ మై (తం) ఈ పాఠమున అర్థము సరిపడదు. 4. దురిత ధ్వాంతోగ్ర రూపంబుగన్ (హ); దురిత ధ్వాంతార్క రూపంబుగన్ (వా)

అధ్యాయము - ౧౩

వ. అని చెప్పి శుకుం డి ట్లనియె. 410

తే. నరవరాధీశ! యిప్పుడు నడుచుచున్న
వాఁడు సప్తమమనువు వైవస్వతుండు
[1]శ్రాద్ధదేవుం డనందగు జనవరేణ్య!
పదురు నందను లతనికిఁ బ్రకటబలులు. 411

వ. వార లిక్ష్వాకుండును, నభగుండును, ధృష్టుండును, శర్యాతియు, నరిష్యంతుండును నాభాగుండును, దిష్టుండును, గరూశకుండును, వృషధ్రుండును, వసుమంతుండు, ననువారు పదుగురు రాజులు. పురందరుఁ డనువాఁ డింద్రుండును, ఆదిత్య మరు దశ్వి వసు రుద్ర సంజ్ఞలం గలవారు దేవతలును, గౌతమ కశ్య పాత్రి విశ్వామిత్ర జమదగ్ని భరద్వాజ వసిష్ఠ లను వారు సప్తర్షులు నై యున్నవారు. అందుఁ గశ్యపున కదితిగర్భంబున విష్ణుండు వామనరూపుం డై జనియించి, యింద్రావరజుం డయ్యె. ఇప్పు డేడుమన్వంతరంబులు సెప్పంబడియె. రాగల మన్వంతరంబులును, శ్రీహరి పరాక్రమంబునుఁ జెప్పెద. దత్తావధానుండ వై వినుము. అని శుకుం డి ట్లనియె. 412

సీ. జననాథ! సంజ్ఞయు ఛాయయు ననువారు గల రర్కునకు విశ్వకర్మతనయ
లిరువురు వల్లభ లిటమున్న చెప్పితిఁ బరఁగఁ దృతీయయు బడబ యనఁగ
సంజ్ఞకు యమునిఁడును శ్రాద్ధదేవుండును [2]యమునయుఁ బుట్టిరి హర్ష మెసఁగ
ఛాయకుఁ దపతియు సావర్ణియును శనైశ్చరుఁడును గలిగిరి సంవరుణుఁడు

తే. తపతి నాలిఁగఁ గైకొని తా వరించె
నశ్వియుగళంబు బడబకు నవతరించె
వచ్చు నష్టమవసువు సావర్ణి వాఁడు
తపము సేయుచునున్నాఁడు ధరణినాథ! 413

క. ఒకపరి చూచిన వెండియు, నొకపరి చూడంగలేక యుండు సిరులకున్
నొకనొకని [3]చేటువేళకు, [4]నొకఁడొకఁడు మనుండు గాచియుండు నరేంద్రా!

వ. సూర్యసావర్ణి మన్వంతరంబున నతనితనయులు, నిర్మోహ విరజస్కాద్యులు రాజులును, సుతపో విరజామృత ప్రభు లనువారు దేవతలును గాఁగలరు. గాల

---

1. శ్రాద్ధదేవుండు నందురు జనులువాని(క) 2. యమియును(క); "యమోయమీ శ్రాద్ధదేవశ్చ" (13-9); 'యమీ యమునా'(వ్యా)3.చోటువేళకు(తం) 4.ఒక్కఁడొక్కనాఁడు మనువుగాచి(తం.వా.)

వుండును, దీప్తిమంతుండును, బరశురాముండును, ద్రోణపుత్రుం డగు నశ్వ
త్థామయుఁ,గృపుఁడును, మజ్జనకుం డగు బాదరాయణుండును,ఋష్యశృంగుఁడు
ననువారు సప్తర్షు లయ్యెదరు. వార లిప్పుడు దమ తమ యోగబలంబుల
నిజాశ్రమమండలంబులం జరియింపుచున్నవారు. విరోచన నందనుం డగు బలి
యింద్రుం డయ్యెడు. అని చెప్పి శుకుం డి ట్లనియె. 415

సీ. బలి మున్ను నాకంబు బలిమిమ్మెఁ జేకొన్న వామనుం డై హరి వచ్చి వేఁడఁ
బాదత్రయం బిచ్చి భగవ న్నిబద్ధుఁ డై సురమందిరముకంటె సుభగ మైన
సుతలలోకంబున సుస్థితి నున్నాఁడు [3]వెతలేక నిట మీఁద వేదగుహికి
నా సరస్వతికిఁ దా నట సార్వభౌముండు నాఁ బ్రభు వై హరి నాకవిభునిఁ

ఆ. బదవిహీనుఁ జేసి బలిఁ దెచ్చి నిలుపును
బలియు నిర్జరేంద్రు పదము నొందు
నింద్రపదము హరికి నిచ్చినకతమున
దానఫలము చెడదు ధరణినాథ ! 416

వ. అటమీఁదటి కాలంబున వరుణ నందనుం డగు దక్షసావర్ణి తొమ్మిదవ మను
వయ్యెడి. అతని కొడుకులు ధృతకేతు దీప్తకేతు ప్రముఖులు రాజులును, బర
మరీచి గర్గాదులు నిర్జరులును, నద్భుతుం డనువాఁ డింద్రుండును, ద్యుతిమ
ద్ప్రభృతు లగువారలు ఋషులు నయ్యెదరు. అందు. 417

ఆ. దనుజహరణుఁ డంబుధార కాయుష్మంతు
నకు జనించి రక్షణంబు సేయ
మూఁడు లోకములను మోదంబుతో నేలు
నద్భుతాఖ్య నొప్పు నమర విభుఁడు. 418

వ. మఱియు, నుపర్ల్లోకసుతుండగు బ్రహ్మసావర్ణి దశమమను వయ్యెడి. త త్పుత్రులు
భూరిషేణాదులు భూపతులును, హవిష్మ ద్ప్రముఖులు మునులును, శంభుం
డనువాఁ డింద్రుండును, విబుద్ధ్యాదులు నిర్జరులు నయ్యెదరు. అందు. 419

ఆ. [1]విశ్వసృజుని యింట విభుఁడు విషూచికి
సంభవించు నంశ సహితుఁ డగుచుఁ
జెలిమి శంభుతోడఁ జేయు విష్వక్సేనుఁ
డనఁగ జగముఁ గాచు నవనినాథ ! 420

---

1. తెఱఁగొప్ప నటమీఁద దేవగుహికి (క) 2. విశ్వజిత్తునింట (హ)

వ. మఱియుం, దదాగమిష్య త్కాలంబున ధర్మసావర్ణి పదునొకొండవ మను వయ్యెడి. మనుతనూజులు, సత్యధర్మాదులు పదుంద్రు ధరణిపతులును, విహం గమ కామగమన నిర్వాణరుచు లనువారు సురలును, వైధృతుం డనువాఁ డింద్రుండు, నరుణాదులు ఋషులును నయ్యెదరు. అందుఁ 421

ఆ. అంబుజాత నేత్రుఁ డా సూర్యసూనుఁ డై
ధర్మసేతు వనఁగఁ దగ జనించి
వైభవాఢ్యుఁ డగుచు వైధృతుఁ డలరంగఁ
గరుణఁ ద్రిజగములను గావఁ గలఁడు. 422

వ. మఱియుం దద్భవిష్యత్సమయంబున భద్రసావర్ణి పంద్రెండవ మను వయ్యెడి. అతని నందనులు దేవవ దుపదేవ దేవజ్యేష్ఠాదులు వసుధాధిపతులును, ఋతు ధాముం డనువాఁ డింద్రుండును, హరితాదులు వేల్పులును, దపోమూ ర్తి తప ఆగ్నీధ్రకాదులు ఋషులు నయ్యెదరు. అందు. 423

ఆ. జలజలోచనుండు సత్య తప స్సూన్న
తలకు సంభవించుఁ దనయుఁ డగుచు
ధరణిఁ గాచు నంచిత స్వధామాఖ్యుఁ డై
మనువు సంతసింప మానవేంద్ర ! 424

వ. మఱియుఁ దదేష్యత్కాలంబున నాత్మవంతుం డగు దేవసావర్ణి పదుమూఁడవ మను వయ్యెడి. మనుకుమారకులు చిత్రసేన విచిత్రాదులు జగతీనాయకులు. సుకర్మ సుత్రామ సంజ్ఞ లం గలవారు బృందారకులును, దివస్పతి యనువాఁ డింద్రుండును, నిర్మోహ తత్త్వదర్శాద్యులు ఋషులు నయ్యెదరు. అందు. 425

ఆ. [1]ధరణిదేవ ! హోత్రదయితకు బృహతికి
యోగవిభుఁడు నాఁగ నుద్భవించి
వనజనేత్రుఁ డా దివస్పతి కెంతయు
[2]సౌఖ్య మాచరించు జగతినాథ ! 426

వ. మఱియు నచట వచ్చుకాలంబున నింద్రసావర్ణి పదునాల్గవ మను వయ్యెడి. మను నందనులు ఉరుగంభీర వస్వాదులు రాజులును, పవిత్ర చాక్షుష లనువారు దేవ గణంబులును, శుచి యనువాఁ డింద్రుండును, నగ్ని రాహు శుచి శుక్ర మాగ ధాదులు ఋషులు నయ్యెదరు. అందు. 427

---

1. అవని దేవహోత్రుఁ డైన గీష్పతికిని (హ) 2. సఖ్య (హ)

తే. తనర సత్రాయణునకు వితానయందు
భవము నొందెడి హరి బృహద్భానుఁ డనఁగ
విస్తరించుఁ గ్రియాతంతు విసరములను
నాకవాసులు ముదమొంద నరవరేణ్య! 428

క. జగదీశ! త్రికాలములను, బొగడొందు మనుప్రకారములు సెప్పఁబడెఁ
దగఁ బదునలువురు మనువులు, దెగయుగములు వేయు నడువ దివ మజునడకగుఁ.

అధ్యాయము - ౧౪

వ. అనినఁ బరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రున కిట్లనియె. 430

ఆ. ఈ పదంబులందు నీ మనుప్రముఖుల
నెవ్వ రనుపువార లేమి కతన
నధిక విభవు లైరి హరి యేల జనియించె
నెఱుఁగఁ బలుకు మాకు నిర్దచరిత! 431

వ. అనినం బారాశర్య కుమారుం డిట్లనియె. 432

సీ. మనువులు మునులును మనుసుత లింద్రులు నమరులు హరియాజ్ఞ నడఁగువారు
యజ్ఞాదు లందఱు హరి పౌరుషాకృతు లా మనువులు తత్సహాయ శక్తి
జగములు నడుపుదు రొగి నాల్గుయుగముల కడపటఁ గాలసంగ్రస్తమైన
నిగమచయంబును నిజ తపోబలముల మరలఁ గాంతురు ఋషివరులు దొంటి

తే. పగిది ధర్మంబు నాలుగు పాదములను
గలిగి వర్తించు మనువులు గమలనేత్రు
నాజ్ఞఁ దిరుగుదు రేలుదు రవనిపతులు
జగతి భాగించి తమ తమ సమయములను. 433

వ. మఱియుం ప్రాప్తులైన వారల నింద్రపదంబులను, బహుప్రకారంబుల దేవపదం
బులను హరి ప్రతిష్ఠించుచుండు. వారలు విహిత కర్మంబుల జగత్త్రయంబునుం
బరిపాలింతురు. లోకంబులు సువృష్టు లై యుండు. అందు. 434

సీ. యోగీశరూపుఁ డై యోగంబు చూపును మౌనిరూపమునఁ గర్మంబు దాల్చు
సర్గంబుసేయుఁ బ్రజాపతి రూపుఁడై యింద్రుఁ డై దైత్యుల నేపడంచు
జ్ఞానంబు నెఱిఁగించుఁ జతుర సిద్ధాకృతిఁ గాలరూపమునఁ బాకంబు సేయు
నానావిధాకార నామరూపంబులఁ గర్మలోచనులకుఁ [1]గానఁ బడఁడు

---

1. గలఁడులేఁడు (తం.)

ఆ. చనిన రూపములును జను రూపములు నింకఁ
జనఁగ నున్న రూపచయము నతఁడ
వివిధుఁ డై యనేక వృత్తి వెలుంగును
విష్ణుఁ డవ్యయుండు విమలచరిత ! 435

అధ్యాయము - ౧౯

వ. అనిన భూవరుం డి ట్లనియె. 436

—: వామనచరిత్ర ప్రారంభము :—

మ. బలి నంభోరుహనేత్రుఁ డేమి కొఱకై పాదత్రయిఁ వేఁడె ని
శ్చలుఁడుం బూర్ణుఁడు లబ్ధకాముఁడు రమాసంపన్నుఁ డై తాఁ బర
స్థలికిన్ దీనునిమాడ్కి నేల చనియెఁ ద ప్పేమియుఁ లేక ని
ష్కలుషున్ బంధన మేల చేసెను వినం గౌతూహలం బయ్యెడిఁ, 437

వ. అనిన మునినందనుం డి ట్లనియె. 438

సీ. పురుహూతుచే నొచ్చి పోయి భార్గవులచే బలి యెట్టకేలకు బ్రతికి వారి
చిత్తంబు రాఁ గొల్చి శిష్యుఁ డై వర్తింప వారు నాతని భక్తివలన మెచ్చి
విశ్వజి ద్యాగంబు విధితోడఁ జేయింప భవ్య కాంచన పట్టబద్ధ రథము
నర్క-వాజులఁ బోలు హరులు కంఠీరవ ధ్వజము మహాదివ్య ధనువుఁ బూర్ణ

తే. తూణయుగళంబుఁ గవచంబుఁ దొలుత హోమ
పావకుం డిచ్చె నమ్లాన పద్మమాల
కలుషహరుఁ డగు తనతాత కరుణ నొసఁగె
సోమసంకాశ శంఖంబు శుక్రుఁ డిచ్చె. 439

వ. ఇ ట్లిధంబున. 440

క. పాణియు రథియుఁ గృపాణియు, ధూణియు ధన్వియును స్రగ్వి తురగియు దేహా
ఘాణియు ధిక్కృత విమత, ప్రాణియు మణికనక వలయ పాణియు నగుచున్.

మ. పలు దానంబుల విప్రులం దనిపి తద్భద్రోక్తులం బొంది పె
ద్దలకున్ ప్రమొక్కి విశిష్టదేవతల నంతర్భక్తిఁ బూజించి ని
ర్మలుఁ బ్రహ్లాదునిఁ జేరి నమ్రశిరుఁ డై రాజ ద్రథారూఢుఁ డై
వెలిఁగెఁ దానవభర్త శైలశిఖ రోద్దీప్తుల ద్దివాగ్ని ప్రభన్. 442

క. దండిత మృత్యు కృతాంతులు, ఖండిత సుర సిద్ధ సాధ్య గంధర్వాదుల్
పిండిత దిశు లమరాహిత, దండాధీశ్వరులు సములు దన్నుం గొలువన్. 443

క. చూపుల గగనము క్రిందుచు, నేపున దివి భువియు [1]నావ లీవల నేయన్
రూపింపుచు దనుజేంద్రుఁడు, ప్రాపించెను దివిజ నగర పథము నరేంద్రా! 444

వ. ఇట్లు బలవంతుం డగు బలి, సురేంద్రుని సాధింప సమకట్టి, దండగమనంబు నేసి, నిడుద పయనంబులం జని చని. 445

మ. కనియెన్ బుణ్యజనౌకమున్ విగత రోగ స్వప్న [2]పీడాన్నభా
దన సం [3]శోకముఁ బుష్ప పల్లవ ఫలోద్దామ ద్రుమానీకమున్
స్వని తోద్ధూత పతాకమున్ ప్రవిచర ద్వైవ్యమాని కానీకమున్
ఘన గంగా సలిలైకమున్ మఘవయుక్త శ్రీకమున్ నాకమున్. 446

వ. కని, రక్కసులజోఁడు వెక్కసం బై చాల్పుగల వేల్పులనెలవు దరియంజొచ్చి, చెచ్చెర ముందటకుం జని చని, ముందట నెడపడక [4]మొన మొగ్గ యిగురు చిగురు తలిరాకు జొంపంబు నన మొగుడుమొగ్గ యరవిరి నెఱవిరి గుత్తి పిందె పూఁప దోరగాయ పండు గెలలతండంబుల వ్రేఁగు లాఁగలేక, మూఁగి వీఁగి వ్రేఁకలగు వ్రాఁకుల ప్రోకలకుఁ [5]బేట లగు పెందోఁటలును, తోఁటల గాటంబు లై నివ్వటిల్లు మవ్వంపుఁ గ్రొవ్విరులకుఁ గవలు విచ్చక కసిమసలు గలిగి, ముసరి కొసరి [6]పూని పాదుకొని తేనియ లాని, విసరు గలిగి, మసరు గవిసి, క్రొవ్వి, [7]రిమ్మగొని, జుమ్ముజుమ్మంచు జంజాటించు తేఁటిదాఁటుబును, దాఁటు వడక నాటుకొని, కూడి, జోడు వీడక, క్రొమ్మావుల కమ్మని కొమ్మల నిమ్ముల ముసరి, పసిమిగల కిసలయంబులు పొసఁగంగ మెసఁగి, కిసరువడక కసరుచెడి, బిట్టు రట్టడితనంబుల మించి కరాళించు కోయిలల మొత్తంబును, మొత్తంబు లై చిత్తంబులు మత్తంబులుగఁ దత్తఱంబునం దీయని పండ్లకుఁ [8]గదియంబడి, కయ్యంబుసేసి, [9]యేస రేగి, బేసంబులు గాసంబులు గొని, వాసికెక్కి, పలు బాసలాడు బహుప్రకారంబు లగు కీరంబులును, గీరంబులకు నలి గడచి, మింట నంట నెగసి, [10]పెట్టలం బట్టి, చీరి, యిట్టట్టు చనక నెట్టకొని, నెలవుల వ్రాలుచు, నింపుగల రవములం గలుగు కలరవంబులును, కలరవంబు లలరం, [11]దొలంకుల కొలంకుల కెలంకులఁ గడంకలం బ్రియల నిడుకొని, క్రమ్మి, దొమ్మిచేసి,

---

1. ఆతలీతలనేయన్ (తం.) 2. పీడాన్నభాదన సంకేతము (హ.) 3. శోకము (తం. వా). 4. మొనమోసి (తం. వా.) 5. పెంటలగు (హ.) 6. పూనిపోని (తం.) 7. తొమ్ముగొని (హ.); రెమ్మలుగొని (త.) 8. క్రయ్యంబడి (తం.) 9. యాసజెగి (హ.) 10. పిట్టలంబట్టి చీతిన (హ.) 11. తలంకని కొలంకుల కెలంకుల కడపలం (హ.)

యెలదమ్మి [1]తూఁడుల వాఁడు లగు చంచువులం జించి, మెక్కి, చొక్కి, రిక్కల మిక్కిలి కలకలపడుచు నలబలంబులు సేయు హంసంబులును, హంసరుచి జనిత వికసనముల వికవిక నగుచుం బస గలిగి, మిసమిస మెఱచు పసిఁడి కెందమ్మి లిందిరామందిరంబుల చందంబు లగు కొలంకులును, గొలంకుల కరణిఁ దడిసి, వడవడ వడంకుచు, నల్లి బిల్లులు గొని, సాఁగిన తీఁగెయిండ్ల గండ్ల యీఱములం దోరములు నెడి, పలువిరుల కమ్మవలపుల వ్రేఁగునం [2]దూరలేక యీడిగలంబడు గాడ్పులును, గాడ్పులవలన నెగసి, గగనమున విరిసి, పలువన్నెలం జెన్నగు మేలుకట్టు పుట్టంబుల తెఱంగుల దట్టంబు లైన కుసుమపరాగంబులును, బరాగంబుల సరాగంబు లగు వాగుల వంతల చెంతల గజీకజొంపంబుల లంపులు దిని, మంపులు గొని, గుంపులుగొని, నెమర్లువెట్టుచు నొదువు గల పొదువులు గదల, వాడల జాడలం బరుగులిడు దూడల క్రీడల వేడుకలం గూడుకొని, యిళ్ళ వాకిళ్ళ కుంజేరి, పౌరుల [3]కోరికల కనుసారిక లగుచు, నమృతంబు గురియు కామధేనువులును, గామధేనువులకు నిలువ నీడ లగుచు, నడిగిన జనములకు ధనములు ఘనముగఁ బుడుకు కల్పతరువులును, గల్పతరువుల పల్లవమంజరులఁ గుంజరులకు విజీచియిచ్చుచు, మచ్చికల కలిమిని మెచ్చుచుఁ [4]గృతకగిరుల చఱుల నడరు పడఁతుల నడలకు గురువు లగు మత్తేభంబులును, నిభంబుల సరస [5]నొరసికొని, వరుసఁ బరుసఁదనము లెడలి సుకరము లగు మకరతోరణ స్తంభంబులును, తోరణ స్తంభంబుల చేరువ నిలిచి, చెఱకు విలుతుం డొర వెజీకినం బెడిదము లగు నవకంపు మెఱుఁగుజిగురు టడిదముల తెఱంగున నిలుకడ సంపదలు గలుగు శంపల సొంపునం, గర చరణాది శాఖలం గల చంద్రరేఖల పోడిమిని, వాహిని గల మోహినీవిద్యల గ్రద్దన, చూపులకుం దీపు లొదవించుచు, [6]మర్మకర్మంబుల [7]యళంబుల వళంబు గలిగి, యనూనంబు లగు విమానంబు లెక్కి, చక్కవచ్చిన సచ్చరిత్రులకుం జెచ్చెర నెదురుసని, తూకొని, తోకొనిపోవు రంభాది కుంభి కుంభ కుచల కలకలంబులును, గలహంస కారండవ కోక సారస బృంద సుందర సుంద రియు, నిందీవ రారవింద నంద దిందిందిరయు, నభంగయు, సభంగయు నగు గంగ నింగికిం బొంగి, మిగుల దిగులువడఁ బొగడ్తల కెక్కిన యగడ్తలును, నగడ్తల మిన్నేటి తేటనీట నీటు లీను పాటి సూటి చల్లులాటల మేటి కూటు వలు గొనుచు నేచిన ఖేచరకన్యకా వారంబులును, వారవనితానుపూజిత దేహళీ పాటవంబు లగు గోపుర కనకకవాటంబులును, గవాటవేదికా ఘటిత మణిగణ

---

1. తూండ్లవాండ్లగు చంచువులం (హ.) 2 దూఁగలేక (తం.) 3. కోరికలు సారికె లగుచు(హ.) 4. చరమగిరిచరుల (హ.) 5. మెసరుకొని (హ.) 6. ధర్మకర్మంబుల(హ.) 7. వళంబు లరయు యళంబులు (వా.)

కిరణోదారంబు లగు నింద్రనీల స్తంభ [1]గంభీరతలును, గంభీర విమల కమలరాగ పాలికా మాలికావారంబు లగు చతుర్ద్వారంబులును, ద్వారదేశంబుల సావళ్ళం గావ ళ్ళుండి, ప్రొద్దులుపోక, రక్కసులవేల్పుల కయ్యంబులు నెయ్యంబులు సెప్పికొనుచున్న యస్త్ర శస్త్ర ధారులును, శూరులు నైన మహా ద్వారపాలక వీరులును, వీరరసజలధి వేలాకారంబు లయి, శుద్ధ స్ఫటిక బద్ధ మహోత్తాలంబు లగు సోపాన సుకుమారంబులును, సుకుమార మహారజత ప్రదీపంబు లగు వప్రంబులును, వప్రోపరి వజ్రకుడ్య శిరోభాగ చంద్రకాంత కాంత తరుణ హిమకర కిరణ ముఖరంబు లగు సాలశిఖరంబులును, శిఖరస్తోమ ధామ నికృత్త తారకంబులును, దారతారమణి శిలాకార కఠోరంబు లగుచు, మిగుల గరిత యగు నగరిసిరి [2]పెరిమ గల మగల మొగములు పొడగన, నిలుకడలకు నలువ నడిగికొని పడసిన పసిఁడి తెరవలల వడువున బెడంగునం దోరంబు లగు ప్రాకా రంబులును, ప్రాకార కాంచనాంచిత యుద్ధసన్నద్ధ మహాఖర్వ గంధర్వవాహినీ పాలకంబు లగు మరకతాట్టాలకంబులును, నట్టాల కోత్తుంగ వజ్రమయ స్తంభోదంచనంబులును, బరభట ప్రాణవంచనంబులును, సముదంచనంబులు నగు దంచనంబుల తుదలు రథంబుల యిరుసు లొరసికొనం గోట యీవ లావల కావలిదివియల కరణి రుచిరము లగుచున్న దినకర హిమకర మండలంబు లును, హిమకరమండలంబు నిద్దంపు టద్దం బని మూఁగి, తొంగిచూచుచు, [3]నళికఫలకములఁ గులకములు గొను నలకములం దటీమి, తిలకములం దెఱఁగు పఱుచుకొని, సమయముల వెనుక నొదిగి, కదిసి, ముకురమునం బ్రతిఫలితు లైన పతు లితరసతుల రతుల కనుమతు లీని, [4]కలఁగి, తలఁగిచని, [5]కాంతులకు సొలయు ముగుదలకు నేకాంతంబు లై, గగనసముచ్ఛేదనంబు లైన రాజసౌధం బులును, సౌధంబుల సిరుల ముత్తియపు సరులతోడి నిబ్బరపు గుబ్బచన్నుల చెన్నులం బ్రక్కలం జుక్కల పదుపు లుండ, మండిత సౌధశిఖరంబులకు శృంగా రంబు లైన భృంగారంబులును, భృంగారశయన జాలక డోలికా నిశ్శ్రేణికాది విశేషరమ్యంబు లైన హర్మ్యంబులును, హర్మ్య కనకగవాక్ష రంధ్ర నిర్గత కర్పూర కుంకు మాగరు ధూప ధూమంబులును, ధూమంబులు జీమూత స్తోమంబు లని ప్రేమంబున [6]గొబ్బున గిబ్బటు పబ్బంబు లబ్బె నని, పురులుగొని, పురులు వన్నియల సిరులుగొనం గుటవిటపములం దటవట నటింపుచుఁ [7]బలుకులు

---

1. గంభీరంబులును (హ.) 2. మీరనమర మొగులు పొడగని (హ.) మీరనమరు మొగులు పొడగని (తం. వా.) 3. అళికఫలకఫలము లగు కలములుగొను (హ.) 4. కన్నుచెన్ను మఱల నీడ తలంగికలగి చని(హ)5. కాంతులసొలయ(హ); కాంతులు వొలయ(తం. వా.)6. గొబ్బునపాటు వబ్బులచ్చె నని(హ);గొబ్బునం డబ్బాటు పబ్బంబులబ్బెనని(తం.వా.) 7. బరుజువిడిచి కిసురువొడుచుచు (హ)

విరిసి, కికురువొడుచుచు, వలఱేని మఱుఁగుచదువుల టీకలనం, గేకలిడు నెమళ్లును, నెమళ్ళ పురుల నారలు నారు లగు విండ్ల నినదములను తలంపులఁ దోఁకలు వడసి, వీఁకలు మెఱసి, మూఁకలు గొని, దివి కెగిరి, రవికిం గవిసిన రాహువు క్రియం, దివిఁ దడఁబడు పడగలును, పడగలును గొడుగులును దమకు [1]నాలంబులకు నడియాలంబులుగఁ దోరంబు లైన సారంబుల బీరంబులు మెఱసి, బెబ్బులుల గ్రబ్బునం గరుల సిరుల, సింగంబుల భంగంబుల, శరభంబుల రభసంబుల, ధూమకేతువుల రీతుల వైరిం జీరికిం గొనక, శంక లుడిగి, అంకె లిడుచు, లంకె లై లెక్కకు మిక్కి లగుచు, రక్కసుల చక్కటి యొక్కటి కయ్యముల దయ్యము లెఱుంగం దిరుగు వీరభటుల కదంబంబులును, గదంబ కరవాల శూలాదుల మెఱుంగులు మెఱుపుల తెఱంగుల దిశల చెఱంగులం దుఱంగలింప, నేమి నినదంబులు [2]తుఱుము లగు నుఱుములుగ, నడ మొగుళ్ళ పెల్లునం, బ్రవర్షిత రథిక మనోరథంబు లగు రథంబుల గములును, గములుగొని, గమనవేగముల వలన హరిహరుల నగి, గాలిం జాలింబడ గేలిగొని, ఘనంబు లగు మనంబులం దెగడి, నెగడు సురంగంబు లగు తురంగంబులును, రంగ దుత్తుంగ విశద మద కల కరి కటతట జనిత మదసలిల కణగణ [3]విగణిత దశశతనయన భుజ సరళ మిళిత లలిత నిఖిల దిగధిపతి శుభకర కర కనక కటక ఘటిత మణిసముదయ సముదిత రేణు వర్గ దుర్గమంబు లైన నిర్వక్ర మార్గంబులును, మార్గ స్థలోపరి గతాగత శతాయు తానేక గణనాతీత రోహణాచల తట విరాజమానంబు లగు విమానంబులును, విమాన విహరమాణ సుందర సుందరీ సందోహ సంపాదిత భూరి భేరీ వీణా పణవ మృదంగ కాహళ శంఖాది వాద నానూన గాన సాహిత్య నృత్య విశేషంబులును, విశేష రత్న సంఘటిత శృంగార శృంగాటక వాటికా గేహ దేహళీప్రదీపంబులును, దీపాయమాన మానిత సభామంటప ఖచిత రుచిర చింతా రత్నంబులునుం గలిగి, రత్నాకరంబునుం బోలె ననిమిష కౌశిక వాహినీ విశ్రుతం బై, శ్రుతివాక్యంబునుం బోలె నకల్మష సువర్ణ ప్రభూతం బై, భూత పతి కంఠంబునుం బోలె భోగిరాజ కాంతం బై, కాంతాకుచంబునుం బోలె సువృత్తం బై, [4]వృత్తజాలంబునుం బోలె సదా గురు లఘు నియమాభిరామం బై, రామచంద్రుని తేజంబునుం బోలె ఖరదూషణాది దోషాచరానుపలబ్ధం బై, లబ్ధవర్ణ చరిత్రంబునుం బోలె [5]విమలాంతరంగ ద్యోతమానం బై, మానధనుని నడవడియునుం బోలె సన్మార్గభాతి సుందరం బై, సుందరోద్యా

---

1. హారంబులగు (హ.) 2. దశములగు (తం.వా.) 3. విగళిత(తం.వా.)
4. వృత్తజాతంబునుంబోలె (తం. వా.) 5. విమలశుద్ధాంతరంగ (వ్రా. ప్ర.)

నంబునుం బోలె రంభాంచి తాళోక పున్నాగం బై, పున్నాగంబునుం బోలె [1]సురభి సుమనో విశేషం బై, శేషాహి మస్తంబునుం బోలె నున్నత ఋమా విశారదం బై, శారదసముదయంబునుం బోలె ధవళజీమూత ప్రకాశితం బై, సితేతరాజినదానంబునుం బోలె సరస తిలోత్తమం బై, యుత్తమపురుష వచనంబునుం బోలె ననేక సుధారస ప్రవర్షం బై, వర్షాదియునుం బోలె నుల్లస దింద్రగోపం బై, గోపతి మూఁపురంబునుం బోలె విచిత్ర రార్యాలంకృతం బై, కృతార్థం బై న యమరావతి నగరంబు చేరం జని, కోటచుట్టునుం బట్టు గలుగ బలంబును జలంబుల విడియించి, పొంచి, మార్గంబు లెల్ల నరికట్టుకొని, యేమఱక యుండె. అంత. 447

క. మాయరు నగవులకును గను, మూయరు కాలంబుకతన ముదియరు ఖలులం
డాయరు పుణ్యజనంబులఁ, బాయరు సురరాజు వీటి ప్రమదాజనముల్. 448

వ. అప్పుడు. 449

క. దుర్భర దానవశంఖా, విర్భూత ధ్వనులు నిండి విబుధేంద్ర వధూ
గర్భములు వగిలి లోపలి, యర్భకతతు లావు రనుచు నాక్రోశించెన్. 450

వ. అంత. 451

సీ. బలి వచ్చి విడియుట బలభేది వీక్షించి గట్టిగాఁ గోటకుఁ గావువెట్టి
దేవవీరులుఁ దాను దేవతామంత్రిని రప్పించి సురవైరిరాకఁ జెప్పి
ప్రళయానలుని భంగి భాసిల్లుచున్నాఁడు ఘోరరాక్షసులను గూడినాఁడు
మన కోడి చని నేఁడు మరల వీఁ డేతెంచె నేతపంబున వీని కింత వచ్చె

ఆ. నీ దురాత్మకునకు నెవ్వఁడు తోడయ్యె
నింక వీని గెల్వ నేది త్రోవ
యేమి చేయువార మెక్కడి మగఁటిమి
యెదురు మోహరింప నెవ్వఁ డోపు. 452

క. త్రిమిగెడు నాకాశంబును, బొంగెడు నమరాద్రికంటెఁ బొడ వై వీఁడున్
త్రిమిగెడు కాలాంతకుక్రియ, భంగించును మరలఁబడ్డఁ బంకజగర్భున్. 453

క. ఈరాదు రాజ్య మెల్లను, బోరాదు రణంబు సేయఁ బోయితి మేనిన్
రారాదు దనుజచేతను, జారా దిటమీఁద నేమి జాడ మహాత్మా! 454

వ. అనిన సురరాజునకు నాచార్యుం డిట్లనియె. 455

---

1. సురభిమనోమాన విశేషంబై (హ.)

సీ. వినవయ్య ! దేవేంద్ర ! వీనికి సంపద బ్రహ్మవాదులు భృగుప్రవరు లర్థి
నిచ్చిరి రాతు సు నెదురింప వారింప హరి యీశ్వరుఁడు దక్క నన్యజనులు
నీవును నీ సముల్ నీకంచె నధికులుఁ జూలరు రాజ్యంబు సాలు నీకు
విడిచిపోవుట నీతి విబుధనివాసంబు విమతులు నలఁగెడు వేళ సూచి

తే. మరలి మఱునాడు వచ్చుట మా మతంబు
విప్రబలమున వీనికి వృద్ధివచ్చె
వారిఁ గైకొన కిటమీఁద వాఁడి చెడును
దలఁగు మందాక [1]రిపు పేరు తడవవలదు. 456

క. పరు గెలువవలయు నొండెను, సరి పోరఁగవలయు నొండెఁ జావలె నొండెఁ
సరి గెలుపు మృతియు దొరకమి,సరసంబుగ మున్నె తొలఁగి చనవలె నొండెఁ. 457

వ. అనినఁ గార్యకాల [2]నిదర్శి యగు బృహస్పతి వచనంబులు విని, కామరూపు లై దివిజులు త్రివిష్టపంబున్ విడిచి,తమతమ పొందుపట్లకుం జనిరి. బలియునుం బ్రతిభట వివర్జిత యగు దేవధాని నధిష్ఠించి, జగత్త్రయంబునుం దనవశంబు చేసికొని, విశ్వ విజయుం డై, పెద్దకాలంబు రాజ్యంబు సేయుచుండె. శిష్యవత్సలు లగు భృగ్వాదు లతనిచేత శతాశ్వమేధంబులు సేయించిరి. త త్కాలంబున. 458

శా. అర్థుల్ వేఁడరు దాతలుం జెడరు సర్వారంభముల్ పండుఁ బ్ర
త్యర్థుల్ లేరు మహోత్సవంబులను దేవాగారముల్ వొల్చుఁ బూ
ర్ణార్థుల్ విప్రులు వర్షముల్ గురియఁ గాలార్ద్రాంబు లై ధాత్రికిఁ
సార్థం బయ్యె వసుంధరాత్వ మసురేంద్రాధీశు రాజ్యంబునఁ. 459

వ. అంత. 460

అధ్యాయము-౧౯

సీ. తన తనూజులప్రోలు దనుజులు గొనుటయు వేల్పు లెల్లను డాఁగ వెడలుటయును
భావించి సురమాత పరితాపమును బొంది వగ ననాథాకృతి వనరుచుండ
నాయమ్మ వెనిమిటి యగు కశ్యపబ్రహ్మ, మటి యొకనాఁడు సమాధి మాని
తన కుటుంబిని యున్న ధామంబునకు నేఁగి నాతిచే విహితార్చనములు వడసి

ఆ. వంది వ్రాలి కుంది వాడిన యిల్లాలి
వదనవారిజంబు వడువుఁ జూచి
చేరఁ దిగిచి మగువ చుబుకంబు పుణుకుచు
వారిజాక్షి యేల వగచె దనుచు. 461

---

1. రిపు పేఱు దలవవలదు(హ.) 2. ప్రదర్శి(తం.వా.)"గురుణార్థానుదర్శినా"అనిమూలము (15-32)

వ. అ మ్మహాత్ముం డి ట్లనియె. 462

మ తెఱవా! విప్రులు పూర్ణులే జరుగునే దేవార్చ నాచారముల్
తఱితో వేలుతురే గృహస్థులు సుతుల్ ధర్మానుసంధానులే
నెఱి నభ్యాగతకోటి కన్నమిడుదే నీరంబునుం బోయుదే
మఱు లే కర్థుల దాసుల సుజనుల మన్నింపుదే వైదలీ! 463

ఆ. అన్న మైనఁ దోయ మైన ద్రవ్యం బైన
శాక మైనఁ దనకుఁ జరుగుకొలఁది
నతిథిజనుల కడ్డ మాడక యిడఁ జేని
[2]లేమ! వారు కలిగి లేనివారు. 464

వ. మఱియును. 465

ఆ. నెలఁత విష్ణునకును నిఖిల దేవాత్మున
కాననంబు శిఖియు నవనినురులు
వారు దనియఁ దనియు వనజాతలోచనుఁ
డతఁడు దనియ జగములన్ని దనియు. 466

క. బిడ్డలు వెఱతురె? నీ కొఱ, గొడ్డెంబులు సేయ కెల్లకోడంబ్రును మా
రొడ్డారింపక నడతురె, యెడ్డము గా కున్నదే మృగేక్షణ యింట. 467

వ. అని పలికినం బతికి సతి యిట్లనియె. 468

ఉ. ప్రేమ యొకింత లేక దితిబిడ్డలు బిడ్డలబిడ్డలుఁ మహా
భీమ బలాఢ్యు లై తనదు బిడ్డల నందఱిఁ దోలి సాహసా
క్రామిత వైరు లయ్యు నమరావతి నేలుచు నున్న వారు నీ
కేమని విన్నవింతు హృదయేశ్వర! మేలు దలంచి చూడవే. 469

క. అక్కాచెల్లెం ద్రయ్యును, [3]దక్కదు నాతోడి పోరు తానును దితియున్
రక్కసులు సురల మొత్తఁగ, నక్కట వల దనదు చూచు నౌ నౌ ననుచు.

సీ. ఎండక న్నెఱుఁగని యింద్రుని యిల్లాలు పలుపంచలను జాలిఁ బడియె నేఁడు
త్రిభువన సామ్రాజ్య విభవంబు గోల్పోయి దేవేంద్రుఁ డడవులఁ దిరిగె నేఁడు
కలిమి గారాపు బిడ్డలు జయంతాదులు శబరార్భకులవెంటఁ జనిరి నేఁడు
నమరుల కాధార మౌ నమరావతి యసురుల కాటపట్టయ్యె నేఁడు

---

1. చెలగునే (హ.) 2. లేనివారు పుడమిలేనివారు (హ.) లేనివారు కలిగిలేనివారు (వ్రాఁతప్రతులన్నిట) 3. దక్కరు....దనుజులు(హ.)

ఆ. బలి జగముల నెల్ల బలియుచు నున్నాఁడు
వాని గెలువరాదు వాసవునకు
యాగభాగ మెల్ల నతఁ డాహరించెను
[1]ఖలుఁడు సురల కొక్కకడియు నీఁడు. 471

క. ప్రజలకు నెల్లను సముఁడవు, ప్రజలను గడుపారఁ గన్న బ్రహ్మవు నీవుం
బ్రజలందు దుష్టమతులను, నిజముగ శిక్షింపవలదె నీవు మహాత్మా ! 472

మ. సురలఁ సభ్యుల నార్తులఁ విరథులఁ శోకంబు వారించి ని
ర్జరధాని న్నిలుపంగ రాత్రిచరులఁ శాసింప సత్కార్య మే
వెర వేరీతి ఘటించు నట్టి క్రమముఁ వేవేగఁ జింతింపవే
కరుణాలోక సుధారుచిం దనుపవే కల్యాణ సంధాయకా ! 473

వ. అనిన, [2]మనోవల్లభ పలుకు లాకర్ణించి, ముహూర్తమాత్రంబు చింతించి, విజ్ఞాన దృష్టి నవలంబించి, భావికాల కార్యంబు విచారించి, కశ్యపబ్రహ్మ యి ట్లనియె.

మ. జనకుం డెవ్వఁడు జాతుఁ డెవ్వఁడు జనస్థానంబు లెచ్చోటు సం
జననం బెయ్యది మేను లేకొలఁది సంసారంబు లే రూపముల్
వినుమా యంతయు విష్ణుమాయ దలఁపన్ వే ఱేమియుఁ లేదు [3]మో
హ నిబంధంబు నిధాన మింతటికి జాయా ! విన్నఁ బో నేటికిఁ. 475

వ. అగు నైనను గాలోచితకార్యంబు నెవ్వెద. 476

మ. భగవంతుం బరమున్ జనార్దనుఁ గృపాపారీణు సర్వాత్మకున్
జగదీశున్ హరి సేవసేయు మతఁడుఁ [4]సంతుష్టినిం బొంది నీ
కగు నిష్టార్థము లెల్ల నిచ్చు నిఖలార్థావాప్తి చేకూరెడిఁ
భగవ త్సేవలఁ బొందరాదె బహు సౌభాగ్యంబులుం బ్రేయసీ ! 477

వ. అనిన గృహస్థునకు గృహిణి యి ట్లనియె. 478

క. నారాయణుఁ బరమేశ్వరు, నేరీతిఁ దలంతు మంత్ర మెయ్యది విహితా
చారంబు లేప్రకారము, లారాధనకాల మెద్ది యానతి యీవే. 479

వ. అనినం గశ్యపప్రజాపతి సతికిఁ బయోభక్షణం బను వ్రతం బుపదేశించి, తత్కాలంబును, దన్మంత్రంబును, దద్విధానంబును, దదుపవాస దాన భోజన ప్రకారంబులు నెఱింగించెను.

---

1. కడఁగి (హ.) 2. వల్లభి (హ.) 3. మోహనిబద్ధం బది మూలము (హ.) 4. సాంగత్యముం బొంది (హ. తం. వా.)

అధ్యాయము-౧౯

అదితియును, ఫాల్గుణమాసంబున శుక్ల పక్షంబునఁ బ్రథమదివసంబునం దొరఁకొని, పండ్రెండు దినంబులు హరిసమర్పణంబుగా వ్రతంబు సేసి, వ్రతాంతంబున నియత యై యున్న యెడఁ, జతుర్బాహుండును, పీతవాసుండును, శంఖ చక్ర గదా ధరుండును నై, నేత్రంబుల కగోచరుం డైన నారాయణదేవుండు ప్రత్యక్షం బై నం గనుంగొని. 480

క. కన్నుల సంతోషాశ్రులు, చన్నులపైఁ బఱవఁ బులకజాలము [1]లెసఁగఁ
సన్నతులును సన్నుతులును, నున్నతరుచిఁ జేసి నిటల యుక్తాంజలి యై. 481

క. చూపుల శ్రీపతి రూపము, నాపోవక ప్రాపు ప్రాపు హర్షోద్ధత యై
వాపుచ్చి మందమధురా, లాపంబులఁ బొగడె నదితి లక్ష్మీనాథున్. 482

సీ. యజ్ఞేశ! విశ్వంభరాచ్యుత! శ్రవణమం గళ నామధేయ! లోకస్వరూప!
యాపన్న భక్తజనార్తి విఖండనా! దీనలో కాధార! తీర్థపాద!
విశ్వోద్భవ స్థితి విలయకారణభూత! సంత తానంద శశ్వద్విలాస!
యాయువు దేహంబు ననుపమ లక్ష్మియు వసుధయు దివముఁ ద్రివర్గములును

తే. [2]వైదిక జ్ఞానయుక్తియు వైరిజయము
నిన్నుఁ గొలువని నరులకు నెఱయఁ గలదె
వినుతమందార! గుణహార! వేదసార!
ప్రణుతవత్సల! పద్మాక్ష! పరమపురుష! 483

ఆ. అసురవరులు సురల నదరించి బెదరించి
నాక మేలుచున్న నాఁటనుండి
కన్నకడుపు గాన కంటఁ గూరుకు రాదు
గడుపుపొక్కు మాన్పి కావవయ్య. 484

వ. అనిన విని, దరహసితవదనుం డయి, యాశ్రిత కామధేను వైన య ప్పర మేశ్వరుం డి ట్లనియె. 485

శా. నీ కోడండ్రును నీ కుమారవరులుఁ నీ నాథుఁడుఁ నీవు [3]సం
శ్లోకింపఁ సతులుఁ బతుల్ మిగుల సమ్మోదింప రాత్రించరుల్
శోకింపన్ భవదీయ గర్భమునఁ దేజోమూర్తి జన్మించెదఁ
నాకుఁ వేడుక పుట్టు నీ సుతుఁడ నై నర్తించి వర్తింపఁగాఁ. 486

---

1. లెగయఁ (వ్రా.ప్ర.) 2. వైదికజ్ఞానమును ముక్తి(తం.) 3. సు,శ్లోకింపఁ....మిగులసంతో షింప (హ.); ఈ పాఠమున యతిభంగము.

మ. బలిమిన్ దైత్యులఁ జంపరాదు వినయోపాయంబులం గాని సం
చలనం బొందకు నేను నీ నియతికిఁ సద్భక్తికిఁ మెచ్చితిఁ
బలివిద్వేషియు నా నిలింపగణమున్ బౌలోమియుఁ మెచ్చ దై
త్యులరాజ్యంబు హరింతు నింద్రునికి నిత్తుఁ దుఃఖ మిం కేటికిఁ. 487

క. నీ రమణుని సేవింపుము, నా రూపము మానసించి నలి నీ గర్భా
గారంబు వచ్చి చొచ్చెద, గారామునఁ బెంపవమ్మ కరుణన్ నన్నుఁ. 488

క. ఏలింతు దివము సురలను, బాలింతు మహేంద్రయువతి భాగ్యశ్రీలఁ
దూలింతుదానవుల ని, ర్మూలింతు రిపు ప్రియాంగముల భూషణముల్. 489

వ. అని యిట్లు భక్తజన పరతంత్రుం డగు పురాణపురుషుం డానతిచ్చి, తిరోహితుం
డయ్యె. అ య్యదితియుఁ, గృతకృత్య యై సంతోషంబునఁ దన మనోవల్లభుం
డగు కశ్యపు నాశ్రయించి, సేవింపుచుండె. అంత నొక్కదినంబున. 490

ఆ. ఘన సమాధినుండి కశ్యపుఁ డచ్యుతు
నంశ మాత్మ నొలయ నదితియందుఁ
దనదు వీర్య మధికతరము సేర్చెను గాలి
శిఖని దారువందుఁ జేర్చినట్లు. 491

వ. ఇట్లు గశ్యప చిరతర తపస్సంభృత వీర్యప్రతిష్ఠిత గర్భయై, సురలతల్లి యుల్లంబున
నుల్లసిల్లుచుండె. అంత. 492

క. చలచల నై పిదపిద నైఁ, గలలం బై కరుడుగట్టి గళనాళముతోఁ
దల యేర్పడి గర్భం బై, నెల మసలం జీరచిక్కి నెలఁతకు నధిపా! 493

క. నెలఁతకు చూ లై నెల రె, న్నెల లై మఱి మూఁడు నాల్గు నెల లై వరుసఁ
నెల లంతకంత కెక్కుఁగ, నెలలును డగ్గటియె నసుర నిర్మూలతకున్. 494

క. మహితతర మేఘమాలా, పిహితాయుత చండభాను బింబప్రభతో
విహితాంగంబులఁ గశ్యపు, గృహిణీగర్భమున శిశువు గ్రీడించె నృపా! 495

క. తనకడుపున నొకవెఱవున, [1]గొనకొని జగములను నిముడుకొనియెడి ముదుకం
డనిమిషుల జనని కడుపునఁ, దనుగతిఁ గడు నడఁగి మడఁగి తనరెఁ బెడఁగై.

వ. అంత న క్కాంతాతిలకంబు క్రమక్రమంబున. 497

---

1. వనరుహ గర్భాండభాండ వనధి చయంబుల్ గొనకొని జగములు నిడుకొని....మణఁగి మునిఁగి తనరెడు బెగడై (హ.)

మ. నిలిపెఁ జెప్పల బృందిమఁ విశదిమఁ నేత్రంబులం జూచుకం
బుల నాకాశిమ మేఖలఁ [1]ద్రఢిమ [2]నెమ్మోమ్ముఁ సుధాపాండిమఁ
బలిమిం జన్నుల శ్రోణిపాళి [3]గరిమఁ మధ్యంబునఁ బృంహిమన్
లలితాత్మఁ లఘిమఁ మహామహిమ మేనఁ గర్భదుర్వార యై. 498

క. పెట్టుదురు నుదుట భూతిని, బొట్టిడుదురు మేనఁ బట్టుఁ బుట్టపు దోయిన్
బెట్టుదురు [4]వేల్పుటమ్మకుఁ, గట్టుదురును రక్ష పడఁతిగర్భంబునకున్. 499

వ. ఇ ట్టి విధంబున. 500

తే. విశ్వగర్భుఁడు తన గర్భవివరమందుఁ
బూఁటపూఁటకుఁ బూర్ణుఁ డై పొటకరింప
వ్రేఁక జూలాలితనమున వేల్పు వెడ్డ
పొలఁతి కంతట నీళ్ళాడుప్రొద్దు లయ్యె. 501

వ. తదనంతరంబునం జతురాననుం డరుగుదెంచి, యదితి గర్భపరిభ్రమ విభ్రముం
డగు న ప్పరమేశ్వరు నుద్దేశించి యి ట్లని స్తుతియించె. 502

సీ. [5]త్రిభువనమయరూప! దేవ! త్రివిక్రమ! పృథులాత్మ! శిపివిష్ట! పృశ్నిగర్భ!
ప్రీతత్రినాభ! త్రిపృష్ఠ జగంబుల కాద్యంత మధ్యంబు లరయ నీవ
జంగమ స్థావర జననాది హేతువు నీవ కాలంబ వై నిఖిల మాత్మ
లోపల ధరియింతు లోని జంతుల నెల్ల స్రోతంబు లోఁగొను సుందరతను

ఆ. బ్రహ్మలకు నెల్ల సంభవభవన మీవ
[6]దినమునకుఁ బాసి దుర్దశ దిక్కులేక
శోకవార్ధి మునింగిన సురల కెల్లఁ
[7]దేల నాధార మగుచున్న తెప్ప వీవ. 503

క. విచ్చేయు మదితిగర్భము, చెచ్చెర వెలువడు మహాత్మ చిరకాలంబున్
విచ్చలవిడి లే కమరులు, ముచ్చటపడి యున్న వారు ముద మందింపన్. 504

వ. అని యిట్లు కమలసంభవుండు వినుతి సేయ న య్యవసరంబున.

---

1. క్రసిమమున్ (ట) 2. నెమ్మోమారఁగాబాండిమన్ (తం. వా.) 3. ఁబ్రథిమన్ (తం.)
4. వేల్పుటక్కలు (త.) 5. త్రిజగజ్జయోన్నతదేవ యురుక్రమ (తం.) త్రిభువనజయరూఢ (వా.)
6. త్రిదివమెడబాసి (క) 7. దెలియ (హ.)

అధ్యాయము - ౧౮

—: వామనమూ ర్త్యావిర్భావము :—

మ. రవి మధ్యాహ్నమునం జరింప † గ్రహ తారాబద్ధ చంద్రస్థితిన్
శ్రవణ ద్వాదశినాఁడు శ్రోణ నభిజి త్సంజ్ఞాత లగ్నంబునన్
భువనాధీశుఁడు పుట్టె వామనగతిం బుణ్య వ్రతోపేతకున్
దివిజాధీశ్వరు మాతకుం బరమ పాతివ్రత్య విఖ్యాతకున్. 506

వ. మఱియు న ద్దేవుండు, శంఖ చక్ర గదా కమలకలిత చతుర్భుజుండును, బింగవర్ణ [1]వస్త్రుండును, మకర కుండల మండిత గండభాగుండును, శ్రీవత్సవక్షుండును, నిరంతర శ్రీవిరాజిత రోలంబ[2]కదంబ బింబిత వనమాలికా పరిష్కృతుండును, గనకకంకణ కాంచీవల యాంగద నూపురాలంకృతుండును, గమనీయ కంఠ [3]కాస్తుభాభరణుండును, నిఖిలజన మనోహరుండును నై యవతరించిన సమ యంబున. 507

శా. చింతం బాసిరి యట్ల తార్క్ష్య సుమన స్సిద్ధోర గాధీశ్వరుల్
సంతోషించిరి సాధ్య చారణ మునీశ బ్రహ్మ విద్యాధరుల్
గాంతిం జెందిరి భాను చంద్రములు రంగ ద్గీత వాద్యంబులన్
గంతుల్ వై చిరి మింటఁ గింపురుషులున్ గంధర్వులున్ గిన్నరుల్. 508

క. దిక్కుల కావిరి [4]విరిసె, [5]న్నెక్కువ నిర్మలత నొందె నేడుపయోధుల్
[6]నిక్కమెయి నిలిచె ధరణియుఁ, జుక్కలత్రోవయును విప్రజన[7]సేవ్యము లై. 509

క. ముంపుగొని విరులవానల, జొంపంబులు గురియ సురలు సుమనోమధువుల్
తుంపర లెగయఁ బరాగపు, రొంపుల భూభాగ మతినిరూషిత మయ్యెన్. 510

వ. తదనంతరంబ. 511

ఆ. ఈ మహానుభావుఁ డెట్లింతకాలంబు
నుదరమందు నిలిచియుండె ననుచు
నదితి వెఱఁగుపడియె [9]నానంద జయశబ్ద
ములను గశ్యపుండు మొగి నుతించె. 512

---

† గ్రహతారా చంద్ర భద్ర స్థితిన్ (తం. వా.)
1. వక్త్రుండును (హ.) 2. కదంబాలంబిత (వా.) 3 కంఠాభరణుండును (ట.)
4. వానెన్ (హ.) 5. నెక్కువతక్కువలు లేక (హ.) 6. నిక్కమయి (హ.) 7. సేవ్యంబై (హ.)
8. డెట్లకోయీకాల (హ.) డేలొకో యీకాల (వ్రా. ప్ర.) 9. ఆనందభయశబ్ద (హ.)

వ. అంత న విభుండు సాయుధ సాలంకారం బగు తన దివ్యరూపంబు నుజ్జగించి, రూపాంతరం బంగీకరించి, కపటవటుని చందంబున, నుపనయన [1]వయస్కుండై, బాలకుండు తల్లిముందట సముచితాలాపంబు లాడుచుఁ గ్రీడించు సమయంబున, నదితియుం దనయ విలోకన పరిణామ పారవశ్యంబున. 513

ఆ. నన్నఁ గన్నతండ్రి! నాపాలి దైవమ!
నా తపః ఫలంబ! నా కుమార!
నాదు చిన్నివడుగ! నా కులదీపక!
రాఁగదయ్య! భాగ్యరాశి వగుచు. 514

క. అన్నా! రమ్మని డగ్గఱి, చన్నుల పాలేఱువాఱ సంశ్లేషిణి యై
చిన్నారి మొగము నివురుచుఁ, గన్నారం జూచేఁ గన్న కడు పై యుంటన్. 515

క. పురు డీ బోటికి నిందిర, పురు డంబిక గాక యొరులు పురుడే యనుచున్
బురుటాలికి పదిదినములు, పురుడు ప్రవర్తించి రెలమిఁ బుణ్యపురితల్. 516

వ. అంత న బ్బాలునకు సంతసంబున మహర్షులు కశ్యపప్రజాపతిం బురస్కరించుకొని సముచితోపనయన కర్మకలాపంబులు చేయించిరి. సవిత సావిత్రి నుపదేశించె. బృహస్పతి యజ్ఞోపవీతంబును, గశ్యపుండు ముంజియు, గౌపీనం బదితియు, ధరణి కృష్ణాజినంబును, దండంబు సోముండును, గగనాధిష్ఠానదేవత ఛత్రంబును, [2]గమండలువు బ్రహ్మయు, సరస్వతి యక్షమాలికయు, సప్తర్షులు కుశపవిత్రంబులు నిచ్చిరి. మఱియును. 517

క. భిక్షాపాత్రిక నిచ్చెను, యక్షేశుఁడు వామనునకు నక్షయ మనుచున్
సాక్షాత్కరించి పెట్టెను, భిక్షునకు భవాని పూర్ణభిక్ష నరేంద్రా! 518

—: బలిచక్రవర్తి కడకు వామనమూర్తి యేతెంచుట :—

క. శుద్ధబ్రహ్మర్షి సమా, రాద్ధుం డై విహిత మంత్రరాజిఁ జదువుచు
న్నిద్ధం బగు ననలంబున, వృద్ధాచారమున వటుఁడు వేల్చెం గడిమిన్. 519

వ. ఇట్లు కృతకృత్యం డై మాయామాణవకుండు దేశాంతర సమాగతు లగు బ్రాహ్మణులఁ గొందఱ నవలోకించి యి ట్లనియె. 520

క. వత్తురె విప్రులు వేడ, నిత్తురె దాతలును వేడ్క నిష్టార్థములం
దెత్తురె మీరును సంపద, లి త్తెఱఁగున దానవీరుఁ డెవ్వఁడొ సెపుఁడా. 521

---

1. వయస్కుండైన వామనబాలకుండై (తం. వా.) 2. కమండలంబు (హ.)

వ. అనిన నఖిల దేశీయులగు భూసురు లిట్లనిరి. 522

మ. కలరున్ దాతలు నిత్తురు[1] ధనములుం గామ్యార్థముల్ గొంచు వి
ప్రులు నేతెంతురు కాని యీవిని బలిం బోలఁ బదాన్యుండు లే
డలఘుం డై యొనరించు నధ్వర శతం బా భార్గవానుజ్ఞతో
బలి వేఁడం బడయంగవచ్చు బహు సంపల్లాభముల్ వామనా! 523

వ. అని తెలియఁజెప్పిన బ్రాహ్మణ వచనంబు లాలకించి, లోకంబులకుం బ్రీతి
వుట్టింపఁ బయనం బై, లాభవచనంబులు గైకొని, తల్లిదండ్రుల వీడ్కొని,
శుభముహూర్తంబునం గదలి. 524

క. ప్రతీప దివిజవల్లభ, రక్షాపరతంత్రుఁ డగుచు రాజీవాక్షుం
డ ఋణమున బలియింటికి, భిక్షాగమనంబు సేసెఁ బేదటికముతోన్. 525

క. హరిహరి సిరియురమునఁగల, హరి హరిహయు కొఱకు దనుజునడుగఁ జనియెఁ
బరహిత రతమతియుతు లగు, దొరలకు నడుగుటలు నొడలి తొడవులు పుడమిఁ. 526

క. సర్వ ప్రపంచ గురుభర, నిర్వాహకుఁ డగుటఁజేసి నెఱిఁ జనుదేరఁ
ఖర్వుని ప్రేఁగు సహింపక, నుర్వీస్థలి గ్రుంగె, ప్రొగ్గె నురగేంద్రుండున్. 527

వ. ఇట్లు చనిచని. 528

క. శర్మద యమదండఋత, వర్మద నతికఠిన ముక్తివనితా చేతో
మర్మద నంబునివారిత, దుర్మద నర్మదఁ దరించెఁ ద్రోవఁ బటుఁడున్. 529

వ. దాఁటి తత్ప్రవాహంబున కుత్తర తటంబునందు. 530

శా. చండస్ఫూర్తి వటుండు గాంచె బహుధా జల్ప న్నిశాటంబు, ను
ద్దండాహూత మునీభ్య బిభ్య దమృతాంధ స్సిద్ధకూటంబు, వే
దం డాశ్వ ధ్వజినీ కవాటము, మహోద్య ద్ధూమసంఛన్న మా
ర్తాండ స్యందన ఘోటముఁ, బలి మఖాంతర్వేదికా వాటముఁ. 531

వ. కని, దానవేంద్రుని హయమేధవాటిక దాఁటి, దరియంజొచ్చు నయ్యవసరంబున.

శా. శంభుండో, హరియో, పయోజ భవుఁడో, చండాంశుఁడో, వహ్నియో,
దంభాకారత వచ్చెఁ గాక, ధరణిఁ ధాత్రీసురుం డెవ్వఁ డీ
శుంభద్దీప్తతనుఁ డీ మనోజ్ఞతనుఁ డంచుఁ విస్మయభ్రాంతు లై
సంభాషించిరి బ్రహ్మచారిఁ గని, తత్పభ్యుల్ రహస్యంబునన్. 533

క. గుజగుజలు వోవువారును, [2]గజిబిజి పడువారు చాలఁ గలకల పడుచుఁ
గజిబిజి యైరి సభాస్థలిఁ, బ్రజలెల్లను బొట్టివడుగు పాపని రాకఁ. 534

---

1. దాతృవరుల్ వెసన్ ధనములున్ (హ.) 2. గజిబిజిఁబడువారు (హ. తం. వా.)

వ. ఆ సనుయంబున బలి సభామంటపంబు దటీయంజొచ్చి. 535

సీ. చవులుగాఁ జెవులకు సామగానంబులు సదివెడు హోతల చదువు వినుచు
మంత్రతంత్రార్థ సంబంధభావంబులు గొనియాడు యాజులఁ గూడికొనుచు
[1]హోమకుండంబులం దున్న త్రేతాగ్నుల వెలిఁగించు యాజకవితతిఁ గనుచు
దఱు లై బహువిధాధ్వర విధానంబులు సెప్పెడు సభ్యులఁ జేరఁ జనుచు

తే. [2]బెట్టు గోరెడు వేడుక పట్టుపట్టు
నదితిపుట్టువు లచ్చికి నాటపట్టు
కోరి చరియించె సభలోనఁ గొంతతడవు
పుట్టు వెన్నఁడు నెఱుఁగని పొట్టివడుగు. 536

వ. మఱియును. 537

క. వెఱచుచు వంగుచు వ్రాలుచు, నటీముటీ గుబురులకుఁ జనుచు హరిహరి!
యనుచుఁ
మఱుఁగుచు నులుకుచు [3]దిరదిరఁ, గుఱుమట్టపు పొట్టివడుగు గొంత నటించెఁ. 538

క. కొందటితోఁ జర్చించును, గొందటితో జటలుసెప్పు గోష్ఠిం జేయుం
గొందటితోఁ దర్కించును, గొందటితో ముచ్చటాడుఁ గొందఱ నవ్వుఁ. 539

వ. మఱియు ననేకవిధంబుల నందటికి నన్నిరూపు లై వినోదించుచు. 540

క. వెడవెడ నడకలు నడచుచు, నెడనెడ నడుగిడఁగ నడరి యిల దిగఁబడఁగన్
బుడిబుడి నొడువులు నొడువుచుఁ, జిడిముడి తడఁబడఁగ వడుగు సేరెన్ రాజున్. 541

వ. ఇట్లు డగ్గటి మాయా[4]భిక్షుకుండు రక్షోవల్లభుం జూచి యి ట్లనియె. 542

మ. [5]ఇతఁడే దానవచక్రవర్తి సురలోకేంద్రాగ్ని కాలాది ది
క్పతి గర్వాపనయ ప్రవర్తి గత లోభస్ఫూర్తి నానామఖ
వ్రత దాన ప్రవణానువర్తి సుమనోరామా మనోభేదనో
ద్ధత చంద్రాతపకీర్తి సత్య కరుణా ధర్మోల్లస న్మూర్తి దాన్. 543

వ. ఇట్లు కుశ పవిత్రాక్షత సంయుతం బగు దక్షిణహస్తంబు సాఁచి యి ట్లనియె. [6]

ఉ. స్వస్తి జగత్త్రయీ భువన శాసనకర్తకు హోసమాత్ర వి
ధ్వస్త నిలింపభర్తకు నుదారపద వ్యవహర్తకున్ మునీం
ద్రస్తుత మంగళాధ్వర విధానవిహర్తకు నిర్జరీ గళ
న్యస్త సువర్ణసూత్ర పరిహర్తకు దానవలోకభర్తకున్. 545

---

1. హోమగుండంబులందున్న (హ.) 2. బెట్టుగూరెడు (హ.) 3. దిఱుదిఱు (హ. తం. వా.)
4. భిక్షకుండు (హ.) 5. ఇతడా (త.) 6. విశాన (హ.)

వ. అని దీవించి, కరచరణా ద్యవయవంబులు ధరియించిన వేదరాశియునుం బోలె ముందట నకుటిలుండును, జటిలుండును, సదండచ్ఛత్రుండును, గటులంబిత భిక్షా పాత్రుండును, గరకలిత జల కమండలుండును, మనోహర వదన చంద్రమండ లుండును, మాయావాదన [1]పటుండును నగు వటునిం గని, దినకరకిరణ పిహి తంబు లై న గ్రహంబులచందంబునఁ దిరోహితు లయి భృగువులు గూర్చున్న యెడ లేచి సేమం బడిగి తియ్యనిమాటల నాదరించిరి. బలియును నమస్కరించి, తగిన గద్దియ నునిచి,పాదంబులు దుడిచి, తన[2]ప్రాణవల్లభ [3]పసిండికలశంబున నుదకంబులు వోయ, వడుగుకొమరుని చరణంబులు గడిగి, తడియొ త్తి తత్సమయంబున.

ఆ. వటుని పాదశౌచవారి శిరంబునఁ
బరమభద్ర మనుచు బలి వహించె
నే జలము గిరీశుఁ డిందుజూటుఁడు దేవ
దేవుఁ డుద్వహించె ధృతి శిరమున. 547

వ. మఱియు, న య్యజమానుం డభ్యాగతున కి ట్లనియె. 548

మ. వడుగా! యెవ్వరివాఁడ వెవ్వఁడవు సంవాసస్థలం బెయ్యె ది
య్యెడకున్ నీ వరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మమున్
గడు ధన్యాత్ముఁడ నైతి నీ మఖము యోగ్యం బయ్యె నాకోరికల్
గడతేఱెన్ [4]సుహుతంబు లయ్యె శిఖులుం [5]గల్యాణ మి క్కాలమున్. 549

మ. వరచేలంబులొ మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులొ [6]విమృష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీఖండమె కాక యే మడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా! 550

అధ్యాయము - ౧౯

వ. అని ధర్మయుక్తంబుగాఁ బలికిన [7]వైరోచని వచనంబులు విని, సంతోషించి, యాశ్వరుం డి ట్లనియె. 551

సీ. ఇది నాకు నెలవని [8]యేరీతిఁ బలుకుదు నొకచో టనక నిండి యుండనేర్తు
నెవ్వనివాఁడ నం చేమని పలుకుదు నాయంతవాఁడ నై నడవనేర్తు
నీ నడవడి యని యెట్లు వక్కాణింతుఁ బూని ముప్పొకలఁ బోవనేర్తు
నదినేర్తు నిదినేర్తు నని యేల చెప్పంగ నేరుపు లన్నియు నేన నేర్తు

1.నటుండును(తం.వా.) 2.ప్రాణవల్లభి(హ.) 3.పసిండిగిండి(వ్రా.ప్ర.) 4. సుహ్యతంబులయ్యె(హ.)
5. కల్యాణ మెక్కాలమున్(హ.) 6. విశిష్టార్థంబులో(హ.) 7. వైరోచను(క.) 8. యేమనిపలుకుదు(హ.)

ఆ. నొరులు గారు నాకు నొరులకు నే నౌదు
నొంటివాఁడఁ జుట్ట మొకఁడు లేఁడు
సిరియుఁ దొల్లిఁ గలదు నెప్పెద నా కొంకి
సుజనులందుఁ దఱచుఁ జొచ్చియుందు. 552

వ. అది యట్లుండనిమ్ము. 553

సీ. జననాథ! నీ మాట సత్యంబు సత్కీర్తిదంబు కులార్హంబు ధర్మయుతము
కరుణానువర్తులు ఘనసత్త్వమూర్తులు గాని మీకులమందుఁ గలుగ రొరులు
రణభీరువులు వితరణభీరువులు లేరు ప్రత్యర్థి లర్థులు ప్రబ్బికొనిన
దానశౌండు లగుచు దనుపుదు రధికు లై మీతాత లందఱు మేటిమగలు

ఆ. మీకులంబునందు మెఱయఁ బ్రహ్లోదుండు
మింటి చఁద్రుమాడ్కి మేలిరుచులఁ
బ్రథితకీర్తితోడ భవదీయవంశంబు
నీరరాశిభంగి నెగడుచుండు. 554

వ. తొల్లి మీ మూఁడవతాత హిరణ్యాక్షుండు విశ్వజయంబు సేసి, గదాయుధుం
డై భూతలంబునఁ బ్రతివీరులం గానక సంచరింప, విష్ణుండు వరాహరూపంబున
నతని సమయించె. తద్భీత యగు హిరణ్యకశిపుం డది విని, హరిపరాక్రమంబు
నకు నాశ్చర్యంబు నొంది, తన జయంబునుఁ, బలంబునుం, బరిహసించి, గ్రద్దన
నుద్దవిడి న ద్దనుజమర్దను మందిరంబుకుం జనియె. అప్పుడు. 555

క. శూలాయుధ హస్తుం డై, కాలాకృతి వచ్చు దనుజుఁ గని విష్ణుండున్
గాలజ్ఞత మాయాగుణ, శీలత నిట్లని తలంచెఁ జిత్తములోనన్. 556

మ. ఎదు రై పోర జయింపరా దితనిఁ గా కెందేనియుం బోవ భీ
ప్రదుఁ డై ప్రాణులఁ దోలు మృత్యువు క్రియం బై వచ్చు నంచుం గ్రియా
విదుఁ డజ్ఞాతుఁడు సూక్ష్మరూపమున నావేశించె నిశ్శ్వాస రం
ధ్రదిశన్ దైత్య హృదంతరాళమునఁ బ్రత్యక్షక్రియా భీరుఁ డై. 557

వ. అంత నద్దైత్యవల్లభుండు వైష్ణవాలయంబు సొచ్చి, వెదకి, హరిం గానక, మిన్ను
మన్ను నన్వేషించి, త్రిదివంబున నరసి, దిశలం బరికించి, భూవివరంబులు వీక్షించి,
సముద్రంబులు వెదకి, పురంబులు శోధించి, వనంబులు విమర్శించి, పాతాళంబు పరీ
క్షించి, జగంబున నదృష్ట శత్రుం డై, మార్గణంబు సాలించి, తనలో నిట్లనియె.

క. పగవాఁడు మడియనోపును, దెగఁడేనియు నెదురుపడఁడె తెగువ నరులకుం
దెగిన యొడఁ బగఱ మీఁదను, బగ గొనఁదగ దనుచు మానెఁ బ్రాభవశక్తిన్.

వ. అతండు మీ ప్రపితామహుండు. అతని గుణంబు లనేకంబులు గలవు. అది యట్లుండ నిమ్మ్ము. 560

క. ఆతుర భూసురగతిఁ బరు, హూతాదులు దన్ను వేఁడ నొగిఁ గొ మ్మ్మనుచున్
మీ తండ్రి యిచ్చె నాయువు, నేతన్మాత్రుండవె నీవు నీలోకమునన్. 561

క. పలితివి మూఁడు జగములు, దోలితి విం[ద్రాది సురులఁ దొల్లిటివారిం
బోలితివి దానగుణములఁ, [1]జాలితి వీ రాక్షసులను సంరక్షింపన్. 562

వ. అదియునుం గాక. 563

క. [2]రాజ్యంబు గలిగెనేనియుఁ, బూజ్యులకును యాచకులకు భూమిసురులకున్
భాజ్యముగ బ్రతుకఁ డేనియుఁ, ద్యాజ్యంబులు వాని జన్మ ధన గేహంబుల్.

క. ము న్నెన్నుదురు వదాన్యుల, నెన్నెడుచో నిన్నుఁ ద్రిభువనేశుఁడ వనుచు
న్నిన్ని దినంబులనుండియు, నెన్నఁడు నినుఁ బెట్టు మనుచు [3]నీం[ద్రము సేయన్.

ఆ. ఒంటివాఁడ నాకు నొకటి రెం డడుగుల
మేర యిమ్ము నొమ్ము మేర యొల్లఁ
గోర్కెదీర బ్రహ్మకూఁకటి ముట్టెద
దానకుతుకసాం[ద్ర! దానవేం[ద్ర! 566

వ. అనినఁ బరమయాచకునకుఁ బ్రదాత యి ట్లనియె. 567

ఆ. ఉన్నమాటలెల్ల నొప్పును విప్రుండ
సత్యగతులు వృద్ధసమ్మతంబు
లడుగఁ దలఁచి కొంచె మడిగితి వోచెల్ల !
దాతపెంపు సొంపుఁ దలఁపవలదె ? 568

మ. వసుధాఖండము వేఁడితో [4]గజములన్ వాంఛించితో వాజులన్
వెస నూహించితొ కోరితో యువతులన్ వీక్షించి కాంక్షించితో
పసిబాలుండవు నేర వీ వడుగ నీ భాగ్యంబు లీపాటిగా
కసురేం[ద్రుండు పదత్రయం బడుగ నీ యల్పంబు నినేర్చునే. 569

వ. అనిన మొగంబునం జిఱునగవు మొలకలొ త్త,గృహమేధికి మేధావి యి ట్లనియె.

మ. గొడుగో జన్నిదమో [5]కమండలువో నాకున్ ముంజియో దండమో
[6]వడు గే నెక్కడ భూము లెక్కడ కరుల్ వామాటు లశ్వంబు లె
క్కడ నిత్యోచితకర్మ మెక్కడ మదాకాంక్షామితం బైన మూ
డడుగుల్ మేరయ త్రోవ కిచ్చుటయె బ్రహ్మాండంబు నాపాలికిన్. 571

---

1. సోలితివి పిశాచరాక్షసుల రక్షింపన్ (హ.తం.వా.) 2. రాజ్యముగలిగిన మీదట(క.) 3. నీం[ట్రము (క.) నిట్రము (త.) 4. జగములన్ (హ.) 5. కమండలమొ (హ.) 6. వడుగం డెక్కడ (తం.)

వ. అదియునుం గాక. 572

క. వ్యాప్తిం బొందక వగవక, ప్రాప్తం బగు లేశ మైనఁ బదివే లనుచున్
దృప్తిం జెందని మనుజుఁడు, సప్తద్వీపముల నైనఁ జక్కం బడునే. 573

శా. ఆశాపాశము దాఁ గడు న్నిడుపు లే దంతంబు రాజేంద్ర! వా
రాశిప్రావృత మేదినీవలయ సామ్రాజ్యంబు చేకూడియుం
గాసిం బొందిరి గాక వైన్య గయ భూకాంతాదులు న్నర్థకా
మాశన్ బాయఁగనేర్చిరే మును నిజాశాంతంబులం జూచిరే. 574

సీ. సంతుష్టుఁ డీ మూఁడుజగములఁ బూజ్యుండు సంతోషి కెప్పుడు జరుగు సుఖము
[1]సంతోషి గాకుంట సంసారహేతువు సంతసంబున ముక్తిసతియు దొరకుఁ
బూఁటపూఁటకు జగంబున యదృచ్ఛాలాభ తుష్టినిఁ దేజంబు తోన పెరుఁగు
పరితోషహీనతఁ బ్రభ చెడిపోవును జలధార ననలంబు సమయునట్లు

ఆ. నీవు రాజ వనుచు నిఖలంబు నడుగుట
తగవు గాదు నాకుఁ దగినకొలఁది
యేను వేఁడికొ నిన యీ పదత్రయమును
చాల దనక యిమ్ము చాలు చాలు. 575

వ. ఇట్లు పలుకుచున్న ఖర్వునకు నుర్వీశ్వరుం డుర్వీదానంబు సేయం దలంచి, కరకలిత
సలిల కమండలుం డైన య వ్వితరణగుణ ముఖరునిం గని, నిజ విచారయుక్త
దనుజరాజ్యచక్రుం డగు శుక్రుం డి ట్లనియె. 576

సీ. దనుజేంద్ర! యీతఁడు ధరణీసురుఁడు గాఁడు దేవకార్యంబు సాధించుకొఱకు
హరి విష్ణుఁ డవ్యయుం డదితిగర్భంబునఁ గశ్యపసూనుఁ డై గలిగె నకట
యెఱుఁగ వీతనికోర్కె నిచ్చెద నంటివి దైత్యసంతతి కుపద్రవము వచ్చు
నీ లక్ష్మి తేజంబు నెలవు నైశ్వర్యంబు వంచించి యిచ్చును వాసవునకు

ఆ. మొనసి జగము లెల్ల మూఁడుపాదంబుల
నఖిలకాయుఁ డగుచు నాక్రమించు
సర్వధనము విష్ణు [2]సంతర్పణము చేసి
బడుగుపగిది యెట్లు బ్రతికె దీవు. 577

క. ఒక్కపదంబున భూమియు, నొక్కటఁ ద్రిదివంబుఁ ద్రొక్కి యున్నతమూర్తిన్
దిక్కులు గగనముఁ దా నై, వెక్కస మై యున్న [3]నెట్లు వెడలెదు చెపుమా.

---

1. సంతుష్టి గాకున్న (వా.) 2. సంసర్జనము చేసి (క.చ.ట.) 3. నెందు వెడలెదు(చ.)

సీ. ఇచ్చెద నని పల్కి యీఁకున్న నరకంబు ద్రోవ నీవును [1]సమర్థుఁడవె దేవ !
యేదానమున నాశ మేతెంచు నదియును దానంబు గాదంద్రు తత్త్వవిదులు
దానంబు యజ్ఞంబు తపము కర్మంబులు దా విత్తవంతుఁ డై తలఁపవలయుఁ
దనయింటఁ గల సర్వధనమెల్ల నై దుఃఖాగములుగా విభజించి కామమునకు

ఆ. నర్థమునకు ధర్మయశముల కాశ్రిత
బృందములకు సమతఁ బెట్టునట్టి
పురుషుఁ డిందు నందుఁ బూర్ణుఁ డై మోదించుఁ
[2]దన్ను మాని చేఁత తగవుగాదు. 579

వ. అదియునుం గాక యీయర్థంబునందు బహుభంగి బహ్వృచగీతార్థంబు గల
దొకటి. సావధానుఁడ వై యాకర్ణింపుము. 580

సీ. అంగీకరించిన నఖిలంబు పోవుచో నన్యతంబు గాదు లేదనిన నధిప !
యాత్మవృక్షము మూల మన్యతంబు నిశ్చయ [‡3]మన్యతమూలము గల్గ నాత్మ చెడదు
పుష్పఫలము లాత్మభూజంబునకు సత్య మా ఘ్రాను బ్రతుకమి నవియుఁ జెడును
ఫలపుష్పములు లేక పసచెడి వృక్షంబు మూలంబుతో వృద్ధిఁ బొందుఁ గాదె

తే. చేటు గొఱతయు లఘిమయుఁ జెందకుండ
నిచ్చు పురుషుండుఁ జెడకుండు నిర్దచరిత !
కాక యంచిత సత్యసంగతి నటించు
నిజధనం బర్థి కిచ్చిన నీకు లేదు. 581

ఆ. సర్వ మైన చోట సర్వధనంబులు
నడుగ లే దటించు నన్యతమాడు
చెనఁటి పంద నేమిచెప్పఁ ఘ్రాణముతోడి
శవము వాఁడు వాని జన్మమేల. 582

వ. మఱియు నొక్కవిశేషంబు గలదు వివరించెద. 583

ఆ. వారిజాతులందు వై వాహికములందుఁ
ఘ్రాణ విత్త మాన భంగమందుఁ
జకిత గోకులాగ్రజన్మ రక్షణమందు
బొంకవచ్చు నఘము పొంద దధిప ! 584

---

1. సమర్థుడవుగావ (క.తం.వా.) 2. దనుమానిశాత (హ.) 3. మాత్మమూలముగల్గ (హ.)
‡ "వృక్షోజీవతి తన్నాస్యాత్ అన్యతం మూల మాత్మనః." (మూలము 19-39)

అధ్యాయము-౨౦

మ. కులమున్ రాజ్యము తేజమున్ నిలుపు మీ కుబ్జుండు విశ్వంభరుం
డలఁతిం బోఁడు త్రివిక్రమస్ఫురణవాఁ డై నిండు బ్రహ్మాండమున్
గలఁడే మాన్ప నొకండు నా పలుకు లాకర్ణింపు కర్ణంబులన్
వల దీ దానము గీనమున్ బనుపుమా వర్ణిన్ వదాన్యోత్తమా ! 585

వ. అని యిట్లు హితంబు పలుకుచున్న కులాచార్యునకు క్షణమాత్ర నిమీలితలోచ
నుం డై యశస్వి యి ట్లనియె. 586

సీ. నిజ మానతిచ్చితి నీవు మహాత్మక ! [1]మహిని గృహస్థధర్మంబు నిదియ
యర్థంబుఁ గామంబు యశమును వృత్తియు నెయ్యది ప్రార్థింప నిత్తు ననియు
నర్థలోభంబున నర్థిఁ బొమ్మను మెట్లు పలికి లే దనుకంటెఁ బాప మెద్ది
యెట్టి దుష్కర్ముని నే భరించెదఁ గాని సత్యహీనుని మోవఁజాల ననుచుఁ

తే. బలుక దే తొల్లి భూదేవి బ్రహ్మతోడ
సమరమం దడ్డు దిరుగక చచ్చుకంటెఁ
బలికి బొంకక నిజమున బరఁగుకంటె
మానధనులకు భద్రంబు మఱియుఁ గలదె. 587

క. ధాత్రిని హాలికునకు సు, క్షేత్రము బీజములు లెస్స జేకుఱు భంగిం
[2]జిత్రముగ దాత కీవియుఁ, బాత్రము సమకూఱునట్టి భాగ్యము గలదే. 588

శా. కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వా రేరీ సిరి మూటగట్టుకొని పోవంజాలిరే భూమిపైఁ
జే రై నం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాము లై
యీ రే కోర్కులు వారలన్ మఱచిరే యి క్కాలమున్ భార్గవా ! 589

క. ఉడుగని క్రతువుల వ్రతములఁ, బొడగనఁ జననట్టి పొడవు పొడవునఁ గుఱు చై
యడిగెడి నఁట నను బోఁటికి, నిడరాదె మహానుభావ ! యిష్టార్థంబుల్. 590

శా. ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁ దనువుపై నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ బాలిండ్లపై నూత్న మ
ర్యాదం జెందు కరంబు గ్రిం దగుట మీఁ దై నా కరం బుంట మే
ల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే. 591

---

1. మహిత (చ.) 2. జిత్రంబుగ రాజునకును (హ.)

మ. నిరయం బైన [1]నిబంధ మైన ధరణీనిర్మూలనం బైన దు
ర్మరణం బైనఁ గులాంత మైన నిజముఁ రానిమ్మ కానిమ్మ పో
హరుఁ డైనన్ హరి యైన నీరజభవుం డభ్యాగతుం డైన నౌఁ
దిరుగ న్నేరదు నాదు జిహ్వ వినుమా ధీవర్య! వే యేటికిఁ. 592

ఆ. నొడివినంతవట్టు నుసలక యిచ్చుచో
నేల కట్టు విష్ణుఁ డేటిమాట
కట్టెనేనిఁ దాన కరుణించి విడుచును
విడువ కుండనిమ్ము విమలచరిత! 593

క. మేరువు తలక్రిం దైనను, బారావారంబు లింకఁబాటిన లోలో
ధారుణి రజ మై పోయినఁ, [2]దారాధ్వము బద్ధ మైనఁ దప్పక యిత్తున్. 594

మత్తకోకిల. ఎన్నఁడుం బరు వేఁడఁబోడఁట [3]యేకలం బఁట కన్న వా
రన్నదమ్ములు నైన లేరఁట యన్నివిద్యల మూలగో
ష్ఠి న్నెఱింగిన ప్రోడగు జ్ఞఁట చేతు లొగ్గి [4]వసింప నీ
చిన్ని పాపనిఁ ద్రోసిపుచ్చఁగఁ జిత్త మొల్లదు సత్తమా! 595

వ. అని యిట్లు సత్యపదవీ ప్రమాణ తత్పరుండును, వితరణకుతూహల సత్వరుండును, విమల యశస్కుండును, దృఢ మనస్కుండును, నియత సత్యసంధుండును, నర్థిజన కమలబంధుండును నైన బలిం జూచి, శుక్రుండు కోపించి, మదీయశాసన మతిక్ర మించుటం జేసి శీఘ్రకాలంబునఁ బదభ్రష్టుండవు గమ్మని శపియించెను. బలియును, గురుశాపతప్తుం డయ్యును, సూనృతమార్గంబున కభిముఖుం డై యుండె. అప్పుడు. 596

ఆ. బ్రతుకవచ్చుఁ గాక బహుబంధనము లైన
వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక
జీవధనము లైనఁ జెడుఁగాక పడుఁగాక
మాట దిరుగలేరు మానధనులు. 597

వ. అను న య్యవసరంబున. 598

ఆ. దనుజలోకనాథు దయిత వింధ్యావళి
రాజవదన మదమరాళగమన
వటుని కాళ్ళు గడుగ వర హేమఘటమున
జలము దెచ్చె భర్త సన్న యొఱిఁగి. 599

---

1. నిబద్ధమైన (హ.) 2. దారధ్వర ఖండమైన (హ.) 3. ఏకలుండఁట (వా.) 4. వచింప (ట.)

వ. అ య్యవసరంబునఁ గపటవటునకు న ద్దానవేంద్రుం డి ట్లనియె. 600

క. రమ్మా మాణవకో త్తమ! లెమ్మా నీ వాంఛితంబు లేదన కిత్తున్
దెమ్మా యడుగుల నిటు రా, నిమ్మా గడుగంగవలయు నేటికిఁ దడయ. 601

మ. బలిదై త్యేంద్ర కరద్వయీకృత జలప్రక్షాళన వ్యాప్తికి
జలజాతాతుఁడు సాఁచె యోగిసుమన స్సంప్రార్థిత శ్రీదమున్
గలితానమ్ర రమాలలాట పదవీ కస్తూరికా శాదమున
నళినామోదము రత్ననూపురిత నానావేదముం బాదమున్. 602

క. సురలోక సముద్ధరణము, నిరత శ్రీకరుణ మఖిల నిగమాంతాలం
కరణము భవసంహరణము, హరిచరణము నీటఁ గడిగె నసురో త్తముఁడున్. 603

వ. ఇట్లు ధరణీసుర దక్షిణచరణ ప్రక్షాళనంబు చేసి, వామపాదంబు గడిగి, తత్పా
వనజలంబు శిరంబునం జల్లుకొని, వార్చి, దేశకాలాది పరిగణనంబు నేసి. 604

శా. విప్రాయ [1]ప్రకటవ్రతాయ భవతే విష్ణుస్వరూపాయ వే
దప్రామాణ్య[2]విదే త్రిపాదధరణిం దాస్యామి యంచుం గ్రియా
క్షిప్రుం డై దనుజేశ్వరుండు వడుగుం జేసాఁచి పూజించె బ్ర
హ్మప్రీత మ్మని ధారవోసె భువనం బాశ్చర్యముం బొందఁగన్. 605

వ. తత్కాలంబున. 606

ఆ. †నీరధారఁ బడఁగనీక యడ్డంబుగాఁ
గలశరంధ్ర మాఁపగాను దెలిసి
హరియుఁ గావ్యనేత్ర మటు కుశాగ్రంబున
నడువ నేకనేత్రుఁ డయ్యె నతఁడు. 607

వ, అంత. 608

మ. అమరారాతి [3]కరాళ తోజ్జ్వి త పవిత్రాంభఃకణశ్రేణికిం
గమలాధీశ్వరుఁ [4]డొడ్డె ఖండిత దివౌకస్వామి జిష్ణ్వస్తముం
గమలాకర్ష ణ సుప్రశ స్తము రమాకాంతా కచోపా స్తముఁ
విమల [5]శ్రీకుచ శాత చూచుకతటీ విన్య స్తముఁ హ స్తముఁ. 609

[6]నిజన నియమాధారను, జనితాసుర యువతి నేత్ర జలకణ ధారఁ
[7]నిరాధారను, వనజాతుఁడు గొనియె బలివివర్జి త ధారఁ. 610

---

2. విధే (హ.) † ఈ పద్యము తాళపత్ర ప్రతులలో లేదు. దీనికి
(హ.) 4. డొండె....చిన్న్య స్తమున్ (హ.) 5. కాంతా
చుక (హ.) 7. నీరధారను (హ.)

ఆ. కమలనాభు నెఱిఁగి కాలంబు దేశంబు
నెఱిఁగి శుక్రు మాట లెఱిఁగి నాళ
మెఱిఁగి పాత్ర మనుచు నిచ్చె దానము బలి
మహి వదాన్యఁ డొకఁడు మఱియుఁ గలఁడె. 611

క. ఖితి దానమిచ్చు నతఁడును, నతికాంక్షఁ బరిగ్రహించు నతఁడును దురిత
చ్యుతు లై శతవత్సరములు, శతమఖ లోకమునఁ గ్రీడ సలుపుదు రెలమిఁ. 612

వ. అట్లు గావున నే దానంబును భూమిదానంబునకు సదృశంబు గానేరదు. కావున వసుంధరా దానం బిచ్చితి. ఉభయలోకంబులం గీర్తి సుకృతంబులు వడయుము. అని పలికి, [1]య మ్మాయా వటుం డి ట్లనియె. 613

క. ఇది యేమి వేఁడి తని నీ, మది వగవక ధారవోయుమా, [2]సత్యము పెం
పొదవఁగఁ గోరిన యర్థం, బిది యిచ్చుట ముజ్జగంబు లిచ్చుట మాకుఁ. 614

వ. అని పలికిన పలుకులకు హర్ష నిర్భర చేతస్కుం డై వై రోచనుండు. 615

ఆ. పుట్టి నేర్చుకొనెనొ పుట్టక నేర్చెనో
చిట్టి బుద్ధు లిట్టి పొట్టి వడుగు
పొట్టనున్న వెల్ల [3]బూమెలు నని నవ్వి
యెలమి ధరణిదాన మిచ్చె నపుడు. 616

క. †బలి చేసిన దానమునకు, నళినాతుఁడు నిఖిల భూతనాయకుఁ డగుటం
గలకల మనె దళదిక్కులు, భళిభళి యని పొగడె భూతపంచక మనఘా ! 617

ఆ. గ్రహ మునీంద్ర సిద్ధ గంధర్వ కిన్నర
యక్ష పక్షి దేవ తాహి పతులు
పొగడి రతని పెంపుఁ బుష్పవర్షంబులు
గురిసె దేవతూర్యకోటి మొరసె. 618

వ. ఇట్లు ధారా పరిగ్రహంబు చేసి. 619

—: వామనమూర్తి విశ్వరూపము నొంది విజృంభించుట :—

శా. ఇంతిం తై వటుఁ డింత యై మఱియుఁ దా నింతై నభోవీథిపై
నంతై తోయద [4]మండలాభ్రమున కల్లం తై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంత యై ధ్రువునిపై నంతై మహార్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంత సంవర్ధి యై.

---

1. యమ్మాయావర్ధి వటుం డి ట్లనియె(హ.) 2. సజ్జనుఁ బెంపొదువఁగ
† ఈ పద్యము - తం. వా. ప్రతులలో 'కమలనాభు నెఱిఁగి
4. మండలాగ్రమున కల్లంతై (తం. వా.)

మ. రవిబింబం బుపమింపఁ బాత్ర మగు ఛత్రం బై శిరోరత్న మై
శ్రవణాలంకృత మై గళాభరణ మై సౌవర్ణ కేయూర మై
ఛవిమ త్కంకణ మై కటిస్థలి [1]నుదంచ ద్వస్త్ర మై నూపుర
ప్రవరం బై పదపీఠ మై వటుఁడు దా బ్రహ్మాండము న్నిండుచోన్. 621

వ. ఇట్లు విష్ణుండు గుణత్రయాత్మకం బగు విశ్వరూపంబు ధరియించిన, నభంబును, దివంబును, భువనంబును, దిశలును, సముద్రంబులును, జల దచల దఖిలభూత నివహంబులుం దాన యై యేకీభవించి, క్రమక్రమంబున భూలోకంబునకుం బొడవై, భువర్లోకంబు నతిక్రమించి, సువర్లోకంబునుం దలకడచి, మహర్లోకంబు దాఁటి, జనోలోకంబునకు మీఁదై, [2]తపోలోకంబునకు నుచ్ఛ్రయుం డై, సత్య లోకంబుకంటె నౌన్నత్యంబు వహించి, యెడ, లిఱుములు, సందులు, రంధ్రంబులు లేకుండ నిండి, మహాదేహమహితుం డై, చరణతలంబున రసాతలంబును, బాదంబుల మహీయును, జంఘుల మహీధ్రంబులును, జానువులం బత్రి సముదయంబులును, నూరువుల నింద్రసేన, మరుద్గణంబులును, [3]వాసస్థలంబున సంధ్యయు, గుహ్యంబునఁ బ్రజాపతులును, జఘనంబునం దనుజులును, నాభిని నభంబును, నుదరంబున నుదధి సప్తకంబును, నురంబునఁ దారకా నికరంబును, నురోజంబుల [4]ఋతసత్యంబులును, [5]హృదయంబున ధర్మంబును, మనంబునఁ జంద్రుండును, వక్షంబునఁ గమలహస్త యగు లక్ష్మియుఁ, గంఠంబున సామాది [illegible]ులును, భుజంబులం బురందరాది దేవతలును, గర్ణంబుల దిశలును, [illegible]ంబును, శిరోజంబుల మేఘంబులును, నాసాపుటంబున వాయు [illegible]బుల సూర్యుండును, వదనంబున వహ్నియు, వాణి నఖిల [illegible]ను, రసనంబున జలేశుండును, భ్రూయుగళంబున విధినిషే [illegible]రాత్రంబులును, లలాటంబునఁ గోపంబును, నధరం [illegible]నఁ గామంబును, రేతంబున జలంబును, పృష్ఠంబున [illegible]యజ్ఞంబును, ఛాయవలన మృత్యువు, నగవువలన [illegible], రోమంబుల నోషధులును, నాడీప్రదేశంబుల [illegible]ద్ధి నజుండును, ఘ్రాణంబుల దేవర్షిగణంబులును, [illegible] జంతు సంఘంబులును, గలవాఁ డై, జలధర నినద [illegible]న గదాదండ ఖడ్గాంకుశబాణతూణీర విభ్రాజితుండును, [illegible]ల కిరీట కేయూర హార కటక కంకణ కౌస్తుభ మణిమేఖ లాంబర

---

1. నుదంచత్ కాటిపై(క.)నుదంచత్ ఘంటిపై(ట.) 2.తపంబునకు(హ) 3. స్కంధంబున(హ); [illegible]; "సంధ్యాం విభోర్వాససి"(20-24) 4. ఋతుషట్కంబును (హ)5. ఉదరంబున (హ)

వనమాలికా విరాజితుండును, సునంద నంద జయ విజయ ప్రముఖ పరిచర
వాహినీ సందోహ పరివృతుండును, నసమాన తేజో విలసితుండును నై,
బ్రహ్మాండంబు తనమేని కప్పు తెఱంగున నుండ విజృంభించి. 622

మ. ఒకపాదంబున భూమిఁ గప్పి దివి వేఱొంటఁ నిరోధించి యొం
డొకటం మీఁది జగంబు లెల్లఁ దొడి నొండొంటఁ విలంఘించి ప
ట్టక బ్రహ్మాండకటాహముం బగిలి వేండ్రం బై పగుల్ గాన రా
నొకఁ డై వా గ్దళ గలభ్యుఁ డై హరి విభుం డొప్పారె విశ్వాకృతిన్. 623

ఆ. ఒక పదంబు క్రింద నుర్వి పద్మమునంటి
కొనినఁ బంకలవము కొమరుఁ దాల్చె
నొకటి మీఁదఁ దమ్మి కొదిఁగిన తేఁటి నా
వెలసె మిన్ను నృప! త్రివిక్రమమున. 624

వ. తత్సమయంబున. 625

ఆ. జగము లెల్ల దాఁటి చనిన త్రివిక్రము
చరణ నఖరచంద్ర చంద్రికలను
[1]బొనుఁగు వడియె సత్యమున బ్రహ్మతేజంబు
దివసకరుని రుచుల [2]దివియ భంగి. 626

అధ్యాయము - ౨౧

సీ. భవబంధములఁ బాసి బ్రహ్మలోకంబునఁ గాఁపురంబులు సేయు ఘనులు రాజు
లా మరీచ్యాదులు నా సనందాదులు నా దివ్యయోగీంద్రు లచట నెపుడు
మూర్తిమంతంబు లై ప్రేయు పురాణ తర్కామ్నాయ నియమేతిహాస ధర్మ
సంహితాదులు గురు జ్ఞానాగ్ని నిర్దగ్ధ కర్ములై మటీయునుఁ గలుగునట్టి

ఆ. వారలెల్లఁ జొచ్చి వచ్చి సర్వాధిపు
నంఘ్రిఁ జూచి ప్రొక్కి రధికభక్తిఁ
దమ మనంబులందుఁ దలఁచు నిధానంబు
గంటి మనుచు నేఁడు మంటి మనుచు. 127

మ. తన పుట్టి ల్లిదె పొమ్మటంచు నజుఁడుం దన్నాభి పంకేరుహం
బు నిరీక్షించి నటించి యున్నతపదంబుం జూచి తత్పాదసే
చనముం జేసెఁ [3]గమండలూదకములం జల్లించి తత్తోయముల్
వినువీథిం ప్రవహించె దేవనది నా విశ్వాత్మ కీర్తి ప్రభన్. 628

---

1. బొనరువడియె (హ) 2. దివియుభంగి (హ) 3. కమండలోదకమున (హ)

వ. తత్సమయంబున. 629

సీ. యోగమార్గంబున నూహించి బహువిధ పుష్పదామంబులఁ బూజచేసి
దివ్యగంధంబులు దెచ్చి సమర్పించి ధూపదీపములఁ దోడ్తోడ నిచ్చి
భూరి లాజాక్షతంబులు సల్లి ఫలములు గానుక లిచ్చి రాగములఁ బొగడి
శంఖాదిరవముల జయఘోషములు సేసి కరుణాంబునిధి ! త్రివిక్రమ! యటంచు

ఆ. బ్రహ్మ మొదలు లోకపాలురు గొనియాడి
రెల్ల దిశల వనచరేశ్వరుండు
జాంబవంతుఁ డరిగి చాఁటె భేరీధ్వని
వెలయఁ జేసి విష్ణు విజయ మనుచు. 630

క. అన్ని జగంబులఁ దానై, యున్న జగన్నాథుఁ జూడ నొగి భావింపం
గ న్నందక మన మందక, సన్నుతులం జేసి రపుడు సభ్యులు బలియున్. 631

వ. అంత నొయ్యనఁ బూర్వప్రకారంబున నున్న వామనునిం గని, పదత్రయ వ్యాజంబున నితఁడు సకల మహీమండలంబు నాక్రమించె. కపటవటురూప తిరోహితుం డగు విష్ణుం డని యెఱుంగక మన దానవేంద్రుండు సత్యసంధుండు గావున మాటదిరుగక యిచ్చె. అతనివలన నేరంబు లేదు. ఈ కుబ్జుం డప్రతిహత తేజః ప్రభావంబున ని జ్జగంబులం బరిగ్రహించి, [1]పర్జన్యాదులకు విసర్జనంబు చేయం దలంచి యున్నవాఁడు. ఈ వటునిం దూఱి పాఱనీక నిర్జించుట కర్జం బని, తర్జనంబులు, గర్జనంబులు, సేయుచు, వజ్రాయుధాది మరుజ్జేత లగు విప్రచిత్తి రాహు హేతి ప్రహేతి ముఖ్యు లగు రక్కసు లుక్కుమిగిలి, యుద్ధంబునకు సన్నద్ధు లై, పరశు పట్టస భల్లాది సాధనంబులు ధరియించి, కసిమసంగి, ముసరి కొని, దశదిశలం బ్రసరించినం జూచి, హరిపరిచరులగు సునంద నందజయ జయంత విజయ ప్రబలోద్బల కుముద కుముదాక్ష తార్క్ష్య పుష్పదంత విష్వక్సేన శ్రుతదేవ సాత్త్వతు లను దండనాథు, లయుత వేదండ సముద్దండ బలు లై, తమతమ యూథంబుల నాయుధంబులతోఁ గూడికొని, దానవానీకంబులం బరలోకంబున కనుపువార లై యుండ, వారల నెదుర్కొని, కదనంబునకుం బరవసంబు సేయు చున్నం గనుంగొని, శుక్రుశాపంబు దలంచి, దనుజ వల్లభుం డి ట్లనియె. 632

సీ. రాక్షసోత్తములార ! రండు పోరాడక కాలంబు గా దిది కలహమునకు
సర్వభూతములకు సంప దాపదలకుఁ బ్రభు వై న దై వంబు పరిభవింప
మన మోపుదుమె తొల్లి మనకు రాజ్యంబును సురలకు నాశంబు సొరిది నిచ్చి
విపరీతముగఁ జేయు వేల్పు నేమందుము మనపాలి భాగ్యంబు మహిమ గాక

---

1. వాసవునకు నీయ (హ)

తే. వెఱచి వలుమాఱుఁ బాఱెడి విష్ణుభటులు
మిమ్ముఁ గెలుచుట దైవంబు మేర గాదె
మనకు నెప్పుడు దైవంబు మంచి దగును
నాఁడు గెలుతము పగవారి నేఁడు వలదు. 633

వ. అదియునుం గాక. 634

క. బలదుర్గంబులు సచివులు, బలములు మంత్రౌషధములు బహుశేముషియుం
గలిగియు సామోపాయం, బులఁ గాలం బెఱిఁగి నృపుఁడు పోరుట యొప్పున్.

వ. అట్లు గావున రణంబున కిప్పుడు శత్రుల కెదురు మోహరించుట కార్యంబుగాదు. మనకునుం దగు కాలంబున జయింతము. నలంగక తలంగుం డనినఁ, దలంగి, భాగవతభట భీతు లై, చిక్కి, రక్కసులు రసాతలంబునకుం జనిరి. అప్పుడు హరి హృదయం బెఱింగి, తార్క్ష్యనందనుండు [1]యాగసుత్యాహంబున వారుణపాశం బుల నసురవల్లభుని బంధించె. అంత. 636

క. బాహులు పదములుఁ గట్టిన, శ్రీహరికృప గాక యేమిసేయుదు నని సం
దేహింపక బలి నిలిచెను, హాహారవ మెసఁగె దళ ది గంతములందున్. 637

క. సంపద చెడియును దైన్యముఁ, గంపంబును లేక దొంటికంటెను బెంపుం
దెంపును నెఱుకయు ధైర్యము, వంపని సురవైరిఁ జూచి వటుఁ డి ట్లనియెన్.

సీ. [2]దానవ! త్రిపదభూతల మిత్తు నంటివి, [3]తరణి చంద్రాగ్ను లెందాఁక నుందు
రంతభూమియు నొక్కయడుగ యయ్యె నాకును స్వర్లోకమును నొకచరణ మయ్యె
నీసొమ్ము సకలమ్ము నేఁడు రెం డడుగులు గడమపాదమునకుఁ గలదె భూమి
యిచ్చెద నన్నర్థ మీని దురాత్ముండు నిరయంబు నొందుట నిజము గాదె

తే. కాన దుర్గతికినిఁ గొంత కాల మరుగుఁ
గాక యిచ్చెద వేని వేగంబు నాకు
నిపుడు మూఁడవ పదమున కిమ్ము చూపు
బ్రాహ్మణాధీనములు ద్రోవ బ్రహ్మవశ మె. 639

అధ్యాయము - ౨౨

వ. అని యిట్లు వామనుండు వలుక, సత్యభంగ సందేహ విషదిగ్ధ శల్యనికృత్త హృదయుం డయ్యును, విషణ్ణుండు గాక, వైరోచని ప్రసన్నవదనంబుతోడఁ జిన్ని ప్రోడవడుగున కి ట్లనియె. 640

---

1. యాగస్తుత్యాహంబున (హ. తం) "సుత్యేఽహని" (మూ.21-27) "సాత్యే అహని సో మాభిషవదినే" (వ్యాఖ్య) 2. దానము (తం. త.) 3. ధరణిఁ జంద్రార్కు (హ)

ఆ. సూనృతంబ కాని సుడియదు నా జిహ్వ.
బొంకఁజాల నాకు బొంకు లేదు
నీ తృతీయపదము నిజము నా శిరమున
నెలవు సేసి పెట్టు నిర్మలాత్మ! 641

ఆ. నిరయమునకుఁ బ్రాప్త నిగ్రహంబునకును
బదవిహీనతకును బంధమునకు
నర్థభంగమునకు నఖిలదుఃఖమునకు
వెఱవ దేవ! బొంక వెఱచినట్లు. 642

వ. అదియునుం గాక. 643

సీ. తల్లిదండ్రులు నన్నదమ్ములు చెలికాండ్రు గురువులు శిక్షింపఁ గొఱఁత వడునె
పిదప మే లగుఁగాక పృథు మదాంధులకును దానవులకు మాకుఁ దగి యెటింగి
[1]విభ్రంశచతురుల్ వెలయ నిచ్చుటఁ జేసి గురువులలో నాదిగురువ వీవ
నీవు బంధించిన నిగ్రహమో లజ్జయో నష్టియో బాధయో తలంప

తే. నిన్ను నెదిరించి పోరాడి నిర్జరారు
లాదియోగీంద్రు లందెడు నట్టి చెంకి
నందరే తొల్లి పెక్కండ్రు హర్షమూర్తి!
[2]వైరభక్తులు గట్టిగా వలయుఁగాక.† 644

మ. చెలియే మృత్యువు చుట్టమే యముఁడు సంసేవార్థులే కింకరుల్
శిలలం జేసెనె బ్రహ్మ దన్ను దృఢమే జీవంబు నో చెల్లరే
చలితం బౌట యెఱుంగ రీ కపటసంసారంబు నిక్కంబుగాఁ
దలఁచుఁ మూఢుఁడు సత్య దాన కరుణా ధర్మాది నిర్ముక్తుఁ డై. 645

సీ. చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థులు కాంతలు సంసార[3]కారణములు
ధనము లస్థిరములు దను వతి[4]చంచల కార్యార్థ లన్యులు గడచుఁ గాల
[5]మాయువు సత్వర మతిశీఘ్రు మని కాదె యనఘుండు దమతండ్రి నధికరించె
మాతాత సాధుసమ్మతుఁడు ప్రహ్లాదుండు నీపాదకమలంబు నియతిఁ జేరె

---

1. విస్రంభ (హ) "విభ్రంశం చతురాదిశత్" (22-5)
2. వైరిభక్తులు (హ) † తం. ప్రతిలోను, కొన్ని వ్రాతప్రతులలోను, 'ఈశ నీ యెడ నేమి కలదు' అను-అయిదవపాద మున్నది. 3. కపటమతులు (ట) 4. చలనంబు (హ) మైశ్వర్యమతి శీఘ్రమనిగాదె (హ)

తే. భద్రుఁ డతనికి [1]మృతిలేని బ్రతుకు గలిగె
వైరు లై కాని తొల్లి మావారు గాన
రర్థి వై వచ్చి నీవు న న్నడుగు చెల్లఁ
బద్మలోచన ! నాపుణ్యఫలము గాదె. 646

వ. అని యిట్లు పలుకుచున్న యవసరంబున. 647

శా. ఆ దై త్యేంద్రుఁడు పీనవక్షు నవపద్మాక్షున్ బిళంగాంబరా
చ్ఛాదున్ నిర్మల సాధువాదు ఘన [2]సంసారచ్ఛద చ్ఛేదు సం
శ్రీదున్ భక్తిలతా తిరోహిత హరిశ్రీపాదు నిఃఖేదుఁ బ్ర
హ్లాదున్ బోధకళావినోదుఁ గనియెన్ హర్షంబుతో ముందటన్. 648

వ. ఇట్లు సమాగతుం డైన తమ తాతం గనుంగొని, విరోచననందనుండు వారుణ పాశ బద్ధుండు గావునఁ దనకుం దగిన నమస్కారంబు సేయరామిఁజేసి సంకు లాక్షు విలోలలోచనుం డై, సిగ్గుపడి, నతశిరస్కుం డై, నమ్రభావంబున మ్రొక్కు చెల్లించె. అంతఁ బ్రహ్లాదుండును మఖమంటపంబున సునందాది పరిచర సమేతుం డై, కూర్చున్న వామనదేవునిం గని, యానంద బాష్ప జలంబులుం, బులకాంకురంబులు నెఱయ, దండప్రణామం బాచరించి యిట్లని విన్నవించె.

సీ. ఇతనికి మున్ను నీ వింద్రపదం బిచ్చి నేఁడు త్రిప్పుటయును నెఱయ మేలు
మోహనాహంకృతి మూలంబు గర్వాంధతమస [3]వికారంబు దాని మాన్పి
కరుణ రక్షించుట గాక బంధించుటే తత్త్వజ్ఞునకు మహేంద్రత్వ మేల
నీ పాదకమలంబు నియతిఁ గొల్చినదానిఁ బోలునే సురరాజ్య భోగపరత

తే. గర్వ మేపారఁ గన్నులు గానరావు
చెవులు వినరావు చిత్తంబు చిక్కువడును
మఱచు నీసేవ లన్నియు మహిమ మాన్పి
మేలు చేసితి నీ మేటిమేర సూపి. 650

వ. అని పలికి, జగదీశ్వరుండును, నిఖిల లోకసాక్షియు, నగు నారాయణదేవునకు నమస్కరించి, ప్రహ్లాదుండు వలుకుచున్న సమయంబున. 651

మ. తతమత్తద్విపయాన యై కుచ నిరుంధ చ్ఛోళ సంవ్యాన యై
ధృత బాష్పాంబు వితాన యై కరయుగాధీ నాలిక స్థాన యై
'పతి భిక్షాం మమ దేహి కోమలమతే ! పద్మాపతే !' యంచుఁ ద
త్సతి వింధ్యావళి సేరవచ్చెఁ ద్రిజగ ద్రక్షామనున్ వామనున్. 65

---

1. తుదిలేని (త. జ. ద.) 2. సంహారాది విచ్ఛేదు (హ. వా.) 3. విశాల

వ. వచ్చి య చ్చేడియ తచ్చరణసమీపంబునం బ్రణత యై, నిలువంబడి యి ట్లనియె.

క. నీకుం బ్రగీడార్థము లగు, లోకంబులఁ జూచి పరులు లోకులు కుమతుల్
లోకాధీశుల మందురు, లోకములకు రాజ వీవ లోకస్తుత్యా! 654

క. కాదనఁడు [1]పొమ్మ్ము లే దీ, రా దనఁడు జగత్ర్త యైక రాజ్యము నిచ్చె
న్నా దయితుఁ గట్టనేటికి, శ్రీదయితా చిత్తచోర! ప్రీతమందారా! 655

వ. అని యిట్లు వింధ్యావళియునుం, బ్రహ్లోదుండును విన్నవించు నవసరంబున హిరణ్య
గర్భుండు సనుదెంచి యి ట్లనియె. 656

సీ. భూతలోకేశ్వర! భూతభావన! దేవ దేవ! జగన్నాథ! దేవవంద్య!
తనసొమ్ము సకలంబు దప్పక నీ కిచ్చె దండయోగ్యుఁడు గాఁడు దానపరుఁడు
కరుణింప నర్హుండు కమలలోచన! నీకు విడిపింపు మీతని వెఱపుఁ దీర్చి
తోయపూరము చల్లి దూర్వాంకురంబులఁ జేరి నీ పదము లర్చించునట్టి

తే. భక్తియుక్తుఁడు లోకేశపదము నందు
నీవు ప్రత్యక్షముగ వచ్చి నేఁడు వేఁడ
నెఱిఁగి తనరాజ్య మంతయు నిచ్చినట్టి
బలికిఁ దగునయ్య దృఢ పాశబంధనంబు. 657

వ. అని పలికిన, బ్రహ్మవచనంబులు విని, భగవంతుం డి ట్లనియె. 658

సీ. ఎవ్వనిఁ గరుణింప నిచ్ఛయించితి వాని యఖిలవిత్తంబు నే నపహరింతు
సంసార గురుమద స్తబ్ధుఁ డై యెవ్వఁడు దెగడి లోకము నన్ను ధిక్కరించు
నతఁ డెల్ల కాలంబు నఖిలయోనులయందుఁ బుట్టుచు దుర్గతిఁ బొందుఁ బిదప
విత్త వయో రూప విద్యా బలైశ్వర్య కర్మ జన్మంబుల గర్వ ముడిగి

తే. యేక విధమున విమలుఁ డై యెవ్వఁ డుండు
వాఁడు నాకూర్చి రక్షింపవలయువాఁడు
స్తంభ లోభాభిమాన సంసారవిభవ
మత్తుఁ డై చెడ నొల్లఁడు మత్సరుండు. 659

శా. బద్ధుం డై [2]గురు శప్తుఁ డై ఛలితుఁ డై బంధువ్రజ త్యక్తుఁ డై
సిద్ధైశ్వర్యము గోలుపోయి విభవక్షీణుండు నై పేద యై
శుద్ధత్వంబును సత్యమున్ గరుణయున్ [3]జొ ప్పేమియుం దప్పఁడు
ద్బుద్ధుం డై యజయాఖ్య మాయ గెలిచెం బుణ్యుం డితం డల్పుఁడే. 660

---

1. పొండు (చ) 2. గురుశాపతప్తుఁ డయి (హ. వా.) 3. సొంపేమియుం (హ)

ఆ. [1]అసురనాథుఁ డనుచు ననఘుని మర్యాద
యేను జూత మనుచు నింత వలుక
నిజము వలికె నితఁడు నిర్మలాచారుండు
మేలు మేలు నాకు [2]మెచ్చువచ్చె. 661

క. సావర్ణిమనువువేళను, దేవేంద్రుం డగు నితండు దేవతలకు సం
భావిత మగు నా చోటికి, రావించెద నంతమీఁద రక్షింతు దయన్. 662

క. వ్యాధులు దప్పులు నొప్పులు, బాధలు చెడి విశ్వకర్మభావిత దనుజా
రాధిత సుతలాలయమున, నేధితవిభవమున నుండు నిత డందాఁకన్. 663

వ. అని పలికి, బలిం జూచి, భగవంతుం డి ట్లనియె. 664

సీ. నేమంబు నీ కింద్రసేనమహారాజ! వెఱవకు మేలు నీ వితరణంబు
వేలుపు లం దుండ వేడుక పడుదురు దుఃఖంబు లిడుములు దుర్మరణము
లాతురతలు నొప్పు లం దుండువారికి నొందవు సుతలమం దుండు నీవు
నీ పంపు సేయని నిర్జరారాతుల నా చక్ర మేతెంచి నఱకుచుండు

ఆ. లోకపాలకులకు లోనుగా వక్కడ
నన్య లెంతవార లచట నిన్ను
నెల్లప్రొద్దు వచ్చి యేను రక్షించెదఁ
గరుణతోడ నీకుఁ గానవత్తు. 665

క. దానవ దైత్యుల సంగతిఁ, బూనిన నీ యసురభావమును దోడ్తో మ
ద్ధ్యానమునఁ దొలఁగిపోవును, మానుగ సుతలమున నుండుమా మా యాజ్ఞన్. 666

అధ్యాయము - ౨౪

వ. అని యిట్లు పలుకుచున్న ముమ్మార్తులముదుకవేల్పు తియ్యని నెయ్యంపుఁ బలుకుఁ జెఱకురసంపు సోనలు వీనులతెరువులం జొచ్చి, లో బయలు నిండి, ఱెప్పలకప్పు తప్పంద్రోచికొని, కనుఁగవకొలంకుల నలుఁగులు వెడలినచందంబున సంతసంబునం గన్నీరు మున్నై పఱవ, నురఃఫలకంబునం బులకంబులు కుల కంబు లై తిలకంబులొత్తఁ గేలు మొగిడ్చి, నెక్కొన్న వేడుకం ద్రొక్కుడు వడుచుఁ జిక్కనిచిత్తంబునఁ జక్కనిమాటల రక్కసులఱేఁ డి ట్లనియె. 667

---

1. అసురనాథుఁ డయ్యు ననఘుండు-మర్యాద (చ.ట.జ.ద.) 2. మెచ్చువచ్చు (హ.తం.వా.) మెచ్చువచ్చె (ద)

ఉ. ఎన్నఁడు లోకపాలకుల నీ కృపఁ జూడని నీవు నేఁడు న
న్నున్నతుఁ జేసి నా బ్రతుకు నోజయు నానతియిచ్చి కాచి తీ
మన్నన నీదయారసము మాటలపెద్దఱీకంబు చాలదే
పన్నగతల్ప! ని న్నెఱిఁగి పట్టిన నాపద గల్గనేర్చునే. 668

వ. అని పలికి, బంధవిముక్తుం డై, హరికి నమస్కరించి, బ్రహ్మాకుం బ్రణామంబు సేసి, యిందుధరునకు వందనం బాచరించి, తనవారలతోఁ జేరికొని, బలి సుత లంబునకుం జనియె. అంత హరికృపావశంబునం గృతార్థుం డై, కులోద్ధారకుం డైన మనుమనిం గని, సంతోషించి ప్రహ్లాదుండు భగవంతున కిట్లనియె. 669

సీ. చతురాననుఁడు నీ ప్రసాదంబు గానఁడు శర్వుఁ డీ లక్ష్మీల జాడఁ బొందఁ
డన్యులఁ కెక్కడి దసురులకును మాకు బ్రహ్మాది పూజితపదుఁడ వై న
దుర్లభుండవు నీవు దుర్గపాలుఁడ వై తి పద్మజాదులు భవ త్పాదపద్మ
మకరందసేవన మహిమ నై శ్వర్యంబు లందిరి కాక మే మల్పమతుల

తే. మధిక [1]దుర్యోనులము కుత్సితాత్మకులము
నీ కృపాదృష్టి మార్గంబు నెలవు సేర
నేమి తపమాచరించితి మెన్నఁగలమె
మమ్ముఁ గాచుట చిత్రంబు మంగళాత్మ! 670

వ. అదియునుం గాక. 671

ఆ. సర్వగతుఁడ వయ్యు సమదర్శనుఁడ వయ్యు
నొకట విషమవృత్తి నుండు దరయ
నిచ్చలేనివారి కీవు; భక్తులు గోరు
తలఁపు లిత్తు కల్పతరువుమాడ్కి. 672

వ. అని విన్నవించుచున్న ప్రహ్లాదుం జూచి, పరమపురుషుం డిట్లనియె. 673

తే. వత్స! ప్రహ్లాద! మేలు నీ వారు నీవు
సొరిది మనుమనిఁ దోడ్కొని సుతలమునకుఁ
బై న మై పొమ్ము నే గదాపాణి నగుచుఁ
జేరి రక్షింతు దురితంబు చెంద దచట. 674

వ. అని, యిట్లు నియమించినం, బరమేశ్వరునకు నమస్కరించి, వలగొని, కరకమల పుట ఘటిత నిటలతటుం డై, వీడ్కొని, బలిం దోడ్కొని, సకలాసుర యూథం

---

1. దుర్యోధులము (హ. వా.)

బునుం, దాను, నొక్క మహాబిలద్వారంబు సొచ్చి, ప్రహ్లాదుండు సుతలలోకంబు
నకుం జనియె. అంత బ్రహ్మవాదు లైన యాజకుల సభామధ్యంబునం గూర్చున్న
శుక్రునిం జూచి, నారాయణుం డిట్లనియె. 675

ఆ. ఏమి గొఱఁత వడియె నీతని యాగంబు
విస్తరింపు కడమ విప్రవర్య!
విషమ మైన కర్మ విసరంబు బ్రాహ్మణ
జనులు సూచినంత [1]సమతఁ బొందు. 676

వ. అనిన శుక్రుం డిట్లనియె. 677

సీ. అఖిలకర్మంబుల కధినాథుఁడవు నీవు యజ్ఞేశుఁడవు నీవు యజ్ఞపురుష!
ప్రత్యక్షమున నీవు పరితుష్టి నొందినఁ [2]గడ మేల గల్గు నే కర్మములకు
ధన దేశ కాలార్హ తంత్ర మంత్రంబుల కొఱఁతలు నిన్నుఁ బేర్కొనిన మాను
నైనఁ గావింతు నీ యానతి భవదాజ్ఞ మెలఁగుట జనులకు మేలు గాదె

తే. యింతకంటెను శుభము నా కెచటఁ గలుగు
ననుచు హరిపంపు శిరమున నావహించి
కావ్యుఁ డసురేంద్రు జన్నంబు కడమఁ దీర్చె
మునులు విప్రులు సాహాయ్యమునఁ జరింప. 678

వ. ఇ ట్టివిధంబున వామనుం డై హరి బలి నడిగి, మహిం బరిగ్రహించి, తనకు నన్న
యగు నమరేంద్రునకుం ద్రిదివంబును సదయుం డై యిచ్చెను. అప్పుడు దక్ష
భృగు ప్రజాపతులును, భవుండును, గుమారుండును, దేవర్షి పితృగణంబులును,
రాజులును, దానును, గూడికొని, చతురాననుండు, కశ్యపునకు, నదితికి సంతో
షంబుగా, లోకంబులకును, లోకపాలురకును, వామనుండు వల్లభుం డని నియ
మించె. అందఱును ధర్మంబునకు, యశంబునకు, లక్ష్మికి, శుభంబులకు, దేవతలకు,
వేదంబులకు, స్వర్గాపవర్గంబులకు, నమరేంద్రుండు ప్రధానుం డని సంకల్పించిరి.
ఆ సమయంబున. 679

క. కమలజుఁడు లోకపాలురు, నమరేంద్రునిఁ గూడి దేవయానంబున న
య్యమరావతికిని వామను, నమరం గొనిపోయి రంత నటమీఁద నృపా! 680

---

1. శమత (హ) 2. కడమలు గల్గునే (తం)

ఆ. బల్లి దంపుఁ దోడు ప్రాపున నింద్రుని
కింద్రపదము చేరు టిట్లు గలిగెఁ
దనకు నాద్యుఁ డైన తమ్ముఁడు గలిగినఁ
గోర్కి లన్న కేల కొఱఁత నొందు. 681

క. పా లడుగఁడు మే లడుగం, డేలఁడు భిక్షించి యన్న కిచ్చుఁ ద్రిజగముల్
వేలుపులతల్లి కడపటి, చూలుం బోలంగఁ గలరె సొలయని తమ్ముల్. 682

ఆ. కడుపు [1]బరువుగాఁగఁ గొడుకులఁ గనుకంటె
తల్లి కొకఁడె చాలు బల్లిదుండు
ద్రిదశగణముఁ గన్న యదితి కానుపు [2]దీర్చి
చిన్ని మేటివడుగుఁ గన్న యట్లు. 683

వ. ఇట్లు దేవేంద్రుండు వామన భుజపాలితం బగు త్రిభువన సామ్రాజ్య విభవంబు మఱల నంగీకరించె. అప్పుడు బ్రహ్మయు, భర్వుండును, గుమారుండును, భృగు ప్రముఖు లైన మునులును, పితృదేవతలును, దక్షాది ప్రజాపతులును, సిద్ధులును, వైమానికులును, మఱియుం దక్కిన వారలు నద్భుత ప్రకాశుం డైన జిష్ణు ప్రభావంబులకు నాశ్చర్యంబు నొందుచుఁ, బ్రశంసింపుచు, నాడుచుం, బాడుచుం, దమతమ నివాసంబులకుం జనిరి. అని చెప్పి, శుకుం డిట్లనియె. 684

తే. మనుజనాథ ! త్రివిక్రమ మహిమ కొలఁది
యెటోఁగి తర్కింప లెక్కింప నెవ్వఁ డోపుఁ
గుంభినీ రేణుకణములు గుఱుతు వెట్టు
వాఁడు నేరఁడు తక్కినవారి వశమె. 685

క. అద్భుత వర్తనుఁ డగు హరి, సద్భావిత మైన విమలచరితము వినువాఁ
డుద్భట విక్రముఁ డై తుది, [3]నుద్భాసితలీలఁ బొందు నుత్తమ గతులన్. 686

తే. తగిలి మానుష పైతృక దైవకర్మ
వేళలందుఁ ద్రివిక్రమ విక్రమంబు
లెక్క డెక్కడఁ గీర్తింతు రెవ్వరేనిఁ
బొందుదురు నిత్య సౌఖ్యంబు భూవరేంద్ర ! 687

వ. అని, యిట్లు శుకుండు రాజునకు వామనావతార చరితంబు నెఱపె. అని సూతుండు మునులకుం జెప్పిన విని, వార లతని కిట్లనిరి. 688

---

1. బదరగాఁగ (తం. వా.) 2. దీఱి (తం. వా.) 3. నుద్భావిత (హ)

అధ్యాయము — ౨౪

—: మత్స్యావతార కథ :—

సీ. విమలాత్మ! విన మాకు వేడుకయ్యెను మున్ను హరి మత్స్యమైన వృత్తాంతమెల్లఁ
గర్మబద్ధుని భంగి ఘనుఁ డీశ్వరుఁడు లోక నిందితం బై తమోనిలయ మైన
మీనరూపము నేల మేలని ధరియించె నెక్కడ వర్తించె నేమి చేసె
నాద్య మై వెలయు న య్యవతారమునకు నెయ్యది కారణంబు కార్యాంశ మెట్లు

ఆ. నీవు తగుదు మాకు నిఖిలంబు నెఱిఁగింపఁ
దెలియఁ జెప్పవలయు దేవదేవు
చరిత మఖిలలోక సౌభాగ్యకరణంబు
గాదె విస్తరింపు క్రమముతోడ. 689

వ. అని, మునిజనంబులు సూతు నడిగిన, నతం డిట్లనియె. మీర లడిగి యీ యర్థంబుఁ
బరీక్షిన్న రేంద్రుం డడిగిన, భగవంతుం డగు బాదరాయణి యిట్లనియె. 690

సీ. విభుఁ డీశ్వరుఁడు వేద విప్ర గో సుర సాధు ధర్మార్థములఁ గావఁ దనువుఁ దాల్చి
గాలి చందంబున ఘనరూపముల యందుఁ దనురూపముల యందుఁ దగిలియుండు
నెక్కువ తక్కువ నెన్నఁడు నొందక నిర్గుణత్వంబున నెఱియు ఘనుఁడు
గురుతయుఁ గొఱఁతయు గుణసంగతి వహించు మనుజేశ! చోద్యమే మత్స్యమగుట

తే. వినుము పోయిన కల్పాంతవేళఁ దొల్లి
ద్రవిళ దేశపురాజు సత్యవ్రతుండు
నీరు ద్రావుచు హరిఁ గూర్చి నిష్ఠతోడఁ
దపముఁ గావించె నొక యేటి తటమునందు. 691

వ. మఱియు, నొక్కనాఁ డ మ్మేదినీకాంతుండు, కృతమాలిక యను నేటి పొంత
హరిసమర్పణంబుగా జలతర్పణంబు సేయుచున్న సమయంబున, నా రాజు
దోసిటి నొక్కమీను పట్టి, దవిలివచ్చిన నుల్కపడి, మఱలం దరంగిణీ జలంబునందు
శకుల శాబకంబు విడిచె. విడివడి నీటిలో నుండి జలపోతంబు భూతలేశ్వరున
కిట్లనియె. 692

మత్తకోకిల. పాటువచ్చిన జ్ఞాతిఘాతులు పాపజాతి రుషంబు లీ
యేటఁ గొండొక మీనుపిల్లల నేఱి పట్టి వధింప న
చ్చోట నుండక నీదుదోసిలి సొచ్చి వచ్చిన నన్ను న
చ్చోటఁ ద్రోవఁగఁ బాడియే కృప యింతలేక దయానిధీ! 693

ఆ. వలుఁ దారు నింక వచ్చి జాలరి వేఁట
కాఱు నేఱుఁ గలఁచి [1]గార వెట్టి
మిడిసి పోవనీక మెడఁ బట్టుకొని యెద
రప్పు డెందుఁ జొత్తు ననఘ చరిత! 694

క. భక్షించునొండె [2]ఋషములు, శిక్షింతురు [3]ధూర్తులొండె చెడకుండ ననున్
రక్షింపు దీనవత్సల!, ప్రక్షీణులఁ గాచుకంటె భాగ్యము కలదే. 695

వ. అనిన విని, కరుణాకరుం డగు న ద్విభుండు, మెల్లన శకుల డింభకంబును గమం
డలు జలంబునం బెట్టి, తననెలవునకుం గొనిపోయె. అదియు నొక్క రాత్రం
బునం గుండ నిండి, తనకు నుండ నిమ్మ్ర చాలక రాజన్యున కిట్లనియె. 696

క. ఉండ నిది కొంచె మెంతయు, నొండొకటిం దెమ్మ్ర భూవరోత్తమ! యనుడున్
గండకముఁ దెచ్చి విడిచెను, మండలపతి కలశ సలిల మధ్యమునందున్. 697

వ. అదియును, ముహూర్త మాత్రంబునకు మూఁడుచేతుల నిడు పై, యుదంచ
నంబు నిండి, పట్టులేక వేఱొండు దెమ్మనవు, డా రాచపట్టి కరుణాగుణంబులకు
నాటపట్టు గావున, గండకంబును నొక్క చిఱుత మడుఁగున నునిచె. అదియును
నా సరోవర జలంబులకు నగ్గలం బై, తనకు సంచరింప నది కొంచెం బని పలికినఁ,
బుడమి ఱేఁడు మంచివాఁ డగుటం జేసి, యా యుదకచరంబు నుదంచిత జలా
స్పదం బైన హ్రదంబునందు నిడియె. అదియును జలాశయంబునకు నధికం బై,
పెరుఁగ నిమ్మ్రలే దని చెప్పికొనిన, న ప్పుణ్యుం డొప్పెడి నడవడి దప్పనివాఁ
డైన కతంబున, న మ్మ్రహామీనంబును మహార్ణవంబున విడిచె. అదియును,
మకరాకరంబునం బడి, వెను మొసళ్ళు ముసరికొని, కసిమసంగి, మ్రింగెడిని.
ఇంత కాలంబునడపి, కడపట దిగవిడువక, వెడలం దిగువుము. అని [4]యెలుంగింప,
న న్నీటిపొడవునకుం బుడమిఱేఁడు దెలిసి యిట్లనియె. 698

సీ. ఒక దినంబున శతయోజన మాత్రము విస్తరించెదు నీవు వినము చూడ
మిటువంటి ఋషముల నెన్నఁడు నెఱుఁగము మీనజాతుల కిట్టి మేను గలదె
యేమిటి [5]కెవ్వఁడ వీలీలఁ ద్రిప్పెదు కరుణ నాపన్నులఁ గావవేఁడి
యంభశ్చరం బైన హరివి నే నెఱిఁగితి నవ్యయ! నారాయణాభిధాన!

---

1. కారవెట్టి (తం. వా.) తాఱువెట్టి (హ) 2. ఋషముల (హ) 3. ధూర్తులైన (హ) 4. యెఱింగింప (హ) 5. యన్నీటి తిరుగుడు ప్రోడకుం (వా) 6. కెవ్వఁడ వేల ద్రవ్వించెదు (హ) ఏల త్రిప్పించెదు (తం)

తే. జనన సంస్థితి సంహార చతురచిత్త!
దీను లగు భక్తులకు మాకు దిక్కు నీవ
నీదు మీనావతారంబు నిఖలభూత
భూతిహేతువు మ్రొక్కెదఁ బురుషవర్య! 699

క. [1]ఇతరులము గాము చిత్సం, గతులము మాపాల నీవు గలిగితి భక్త
స్థితుఁడ వగు నిన్ను నెప్పుడు, నతి నేసిన వాని కేల నాళము గల్గున్. 700

క. శ్రీలలనా కుచవీథీ, కేళీపరతంత్ర బుద్ధిఁ గ్రీడించు సుఖా
లోలుఁడవు తామసాకృతి, నేలా మత్స్యంబ వైతి వెటిఁగింపు హరీ! 701

వ. అని పలుకు సత్యవ్రతుం డను మహారాజునకు న య్యుగంబు కడపటఁ బ్రళయ
వేళ సముద్రంబున నేకాంత జన ప్రీతుం డై విహరింప నిచ్ఛయించు మీనరూపుం
డైన హరి యి ట్లనియె. 702

సీ. ఇటమీఁద నీ రాత్రి కేడవదినమునఁ బద్మగర్భున కొక్క పగలు నిండు
భూ ర్భువాదిక జగంబులు మూఁడు విలయాబ్ధిలోన మునుంగు నాలోనఁ బెద్ద
నావ చేరఁగవచ్చు నా పంపు పెంపున దానిపై నౌషధతతులు బీజ
రాసులు నిడి పయోరాశిలో విహరింపఁ గలవు సప్తఋషులుఁ గలసి తిరుగ

అ. మ్రోలఁ గానరాక ముంచుఁ బెంజీఁకటి
[2]మినుకుచుండు మునుల మేని వెలుఁగు
దొలకుచుండు జలధి దోధూయమాన మై
నావ తేలుచుండు నరవరేణ్య! 703

వ. మటియు, న న్నావ మున్నిటికరళ్ళకు లోనుగాకుండ, నిరుగెలంకుల వెనుక
ముందఱ నేమఱకుండ, పెన్నెఱు లగు నాగఱులం జడియుచుఁ, బొడువవచ్చిన
బలుగ్రాహంబుల నొడియుచు, సంచరించెద. ఒక్క పెనుఁబాము చేరువ, నా
యనుమతిం బొడచూపెడు. దానంజేసి సుడిగాడ్పులకతంబున నావ వడిఁ
[3]దిరుగంబడకుండ నా కొమ్ముతుదిం బదిలంబుగఁ జేసి, నీకును, మునులకు,
నలజడి చెందకుండ మున్నిటి నిప్పాటం దమ్మిచూలి రేయి వేగునంతకు మెలం
గెద. అది కారణంబుగా జలచరరూపంబుఁ గైకొంటి. మటియునుం బ్రయోజ
నంబు గలదు. నామహిమ పరబ్రహ్మం బని తెలియుము. నిన్ను ననుగ్రహించితి.
అని సత్యవ్రతుండు సూడ హరి తిరోహితుం డయ్యె. అ య్యవసరంబున. 704

---

1. ఇతరులముగదా (హ) 2. మినుకుచుండు (చ) 3. దిఱుగకుండ (హ)

ఆ. మత్స్యరూపి యైన మాధవు [1]నుడుగులు
తలఁచికొనుచు రాచతపసి యొక్క
దర్భశయ్యఁ దూర్పు దలగడగాఁ బండి
కాచి యుండె నాఁటి కాలమునకు. 705

వ. అంతఁ గల్పాంతంబు డాసిన. 706

క. ఉల్లసిత మేఘపంక్తులు, జల్లించి మహోగ్రవృష్టి జడిగొని గురియన్
వెల్లి విరిసి జలరాసులు, సెల్లెలికట్టలను దాఁటి [2]సీమల ముంచెన్. 707

వ. తదనంతరంబ. 708

తే. మున్ను పోయిన కల్పాంతమున నరేంద్ర!
బ్రాహ్మ మనఁగ నై మిత్తికప్రళయ మైన
నింగిపైఁ దొట్టి తొలఁకు మున్నీటిలోనఁ
గూలె భూతాళి జగముల కొలఁదు లెడలి. 709

వ. అంత న మ్మహారాత్రి యందు. 710

మ. నెఱి నెల్లప్పుడు నిల్చి [3]ప్రాణిచయమున్ మిలింప నిర్మించి [4]వీఁ
పిటీయ న్నిల్లుచు నావులింపుచు నజుం డేసృష్టియున్ మాని మే
నొఱఁగఁ జెప్పలు మూసి కే ల్దలగ డై యుండంగ నిద్రింపుచుఁ
గుఱు వెట్టం దొడఁగెఁ గల ల్గనుచు నిర్ఘోషింపుచుఁ భూవరా! 711

ఆ. అలసి సొలసి నిదుర నందిన పరమేష్ఠి
ముఖమునందు వెడలె మొదటిశ్రుతులు
నపహరించె నొక హయగ్రీవుఁ డను దైత్య
భటుఁడు దొంగఁ దొడరఁ బరులవశ మె. 712

క. చదువులు తనచేపడె ననీ, చదువుచుఁ బెఁ బయల నుండ శంకించి వడిఁ
జదువులముదుకఁడు గూరుకఁ, జదువులతస్కరుఁడు సొచ్చె జలనిధికడుపుఁ. 713

వ. ఇట్లు వేదంబులు దొంగిలి, దొంగరక్కసుండు మున్నీట మునింగిన, వాని జయింపవలసియు, బ్రహ్మానుదీఁగెలయందు విత్తనంబుల పొత్తరులు పెన్నీట నాని చెడకుండ మనుపవలసియు, నెల్లకార్యంబులకుఁ గావలి యగు నా పురుషోత్తముండ పైను రేయి చొరుదలయందు. 714

---

1. నడుగులు (హ) 2. జీవుల ముంచెన్ (ట) 3. ప్రాణిచయమున్ నిర్మించి నిర్మించి (తం. వా.) 4. వీపెటీయన్ (హ)

క. కుఱుగఱులు వలుఁదమీసలు, చిఱుదోఁకయుఁ బసిఁడి యొడలు సిరిగలపొడలుఁ
నెఱిమొగము నొక్కకొమ్మును, మిఱుచూపులు గలిగి విభుఁడు మీనం బయ్యెఁ

వ. ఇట్లు లక్ష యోజనాయతం బైన పాఠీనం బై, విశ్వంభరుండు జలధి నొచ్చి.

సీ. ఒకమాటు జలజంతు యూథంబుతోఁ గూడు నొకమాటు దరులకు నుఱికివచ్చు
నొకమాటు మింటికి నుదరి యుల్లంఘించు నొకమాటు లోపల నొదిఁగి యుండు
నొకమాటు వారాశి నొడలు ముంపమి సూపు నొకమాటు బ్రహ్మాండ
మొరయఁ దలఁచు
నొకమాటు ఋషకోటి నొడిసి యాహారించు నొకమాటు జలముల నుమిసివైచు

తే. గఱులు సారించు మీసలు గడలుగొలుపుఁ
బొడలు మెఱపించుఁ గన్నుల [1]పొలప మార్చు
నొడలు ఱుళిపించుఁ దళతళ లొలయు మీన
వేషి వెన్నీట నిగమ గవేషి యగుచు. 717

వ. అంతకుమున్ను సత్యవ్రతుండు మహార్ణవంబులు మహీవలయంబు ముంచు నవస
రంబున, భక్తపరాధీనుం డగు హరిం దలఁచుచునుండ, నారాయణప్రేరిత యై,
యొక్క నావ వచ్చినం గనుంగొని. 718

మ. చని సత్యవ్రత మేదినీదయితుఁ డోజం బూని ప్రాఁ దీఁగె వి
త్తనముల్ పెక్కులు నావపై నిడి హరిధ్యానంబుతో దానిపై
మునిసంఘంబులుఁ దాను నెక్కి వెఱతో మున్నీటిపైఁ దేలుచుఁ
గనియెఁ ముందట భక్తలోక హృదలంకర్మీణముఁ మీనముఁ. 719

వ. కని, జలచరేంద్రుని కొమ్మున నొక్క పెనుఁబాపప్రాఁతనన్నావ గట్టి, సంతసించి
డెందంబు నివిరికొని, తపస్వులతోడఁ గూడికొని, యా రాచపెద్ద మీనాకారుం
డగు వేల్పుఁజేని నిట్లని పొగడె. అప్పుడు. 721

మ. తమలోఁబుట్టు నవిద్యఁ గప్పుగొనఁగఁ దన్మూల సంసారవి
భ్రమ లై కొందఱు దేలుచుఁ గలఁగుచుఁ బల్వెంటలం దైవయో
గమునం దే పరమేశుఁ గొల్చి ఘను లై కైవల్యసంప్రాప్తు లై
ప్రమదం బందుదు రట్టి నీవు కరుణం బాలింపు మమ్మీశ్వరా. 720

---

1. పొలుపుమార్చు (హా)

ఉ. [1]కన్నులులేనివాఁడు మఱి కాననివానికిఁ ద్రోవ సూపఁగాఁ
జన్న తెఱంగు [2]మూఢున కసన్మతి దా గురుఁడౌట సూర్యుఁడే
కన్నులుగాఁగ భూతములఁ గాంచుచు నుండు రమేశ! మాకు ను
ద్య న్నయమూర్తి వై గురువ వై యల సద్గతిజాడఁ జూపవే. 722

క. ఇంగలముతోడి సంగతి, బంగారమువన్నె గలుగుభంగిని నీ సే
వాంగీకృతుల యఘుంబులు, భంగంబులఁ బొందు ముక్తి ప్రాపించు హరీ! 723

క. హృదయేశ! నీ ప్రసన్నత, పదివేలవపాలి లేశభాగము కతనం
ద్రిదశేంద్రత్వము గల దఁట, తుది నిను మెప్పింప నేది దొరకదు శ్రీశా! 724

క. పెఱవాఁడు గురుఁ డటంచును, గొఱగాని పదంబు సూపఁ గుజనుండును నీ
నెఱత్రోవ నడవనేర్చిన, నఱమఱ లేనట్టిపదము నందు దయాబ్ధీ. 725

మ. చెలి వై చుట్టము వై మనస్థితుఁడ వై చిన్మూర్తి వై యాత్మ వై
వల నై కోర్కెలపంట వై విభుఁడ వై వర్తిల్లు ని న్నొల్ల కే
పలువెంటం బడి లోక మక్కట! వృథా బద్ధాశమైపోయెడిఁ
నిలువ న్నేర్చునె హేమరాశిఁ గనియు న్నిర్భాగ్యుఁ డంభశ్శయా! 726

ఆ. నీరరాశిలోన నిజకర్మబద్ధ మై
యుచితనిద్రఁ బొందియున్న లోక
మే మహాత్మచేత నెప్పటి మేల్కాంచు
నట్టి నీవు గురుఁడ వధిప! మాకు. 727

క. ఆలింపుము విన్నప మిదె. వేలుపుగమిఱేని నిన్ను వేఁడికొనియెదఁ
నాలోని చిక్కు మానిచి, నీలోనికిఁ గొంచుఁ బొమ్ము నిఖలాధీశా! 728

వ. అని యిట్లు సత్యవ్రతుండు వలికిన సంతసించి మత్స్యరూపంబున మహోసము
ద్రంబున విహరించు హరి, పురాణపురుషుం డగుటం జేసి, సాంఖ్యయోగ క్రియా
సహిత యగు పురాణసంహిత నుపదేశించె. అ మ్మహారాజు మునిసమేతుం డై,
భగవ న్నిగదితం బై న, సనాతనం బగు బ్రహ్మస్వరూపంబు దెలిసికొని, కృతార్థుం
డయ్యె. ఇ మ్మహాకల్పంబున వివస్వతుం డనం బరఁగిన సూర్యునకు శ్రాద్ధదేవుం
డన జన్మించి, శ్రీహరికృపావశంబున నేడవ మను వయ్యె. అంత న వ్విధంబునం
బెనురేయి నిండు నంతకు సంచరించి, జలచరాకారుం డగు నారాయణుండు,
ద న్నిశాంత సమయంబునందు. 729

---

1. కన్నులు గల్గువాఁడు (వా) 2. మూఢునకు సన్మతి (వా)

మ. ఉఱు కంభోనిధి లోని వేదముల కుయ్యుం దైన్యముం జూచి వే
గఱు లాడించి ముఖంబు సాఁచి బలువీఁక దోఁక సారించి మే
మెఱయఁ దొడలు గీటి మీస లడరఁ మీనాకృతిఁ విష్ణుఁ డ
క్కఱటిం దాఁకి వధించె ముష్టి దళిత గ్రావ హయగ్రీవునిఁ. 730

వ. అంతఁ బ్రళయావసాన సమయంబున. 731

సీ. ఎప్పుడు వేగునం చెదురు సూచుచు నుండు మునుల కెందంబులు ముదము నొందఁ
దెలివితోఁ బ్రక్క నిద్రించు భారతి లేచి యోరపయ్యెద చక్క నొత్తికొనఁగ
మలిన మై పెనుఁదేయి గ్రమ్మిన తేజంబు తొంటిచందంబునఁ దొంగలింపఁ
బ్రాణుల సంచిత భాగధేయంబులు గన్నుల కొలుకులఁ గానఁబడఁగ

తే. నవయవంబులు కదలించి యావులించి
నిదుర దెప్పిటి మేల్కాంచి నీల్గి మలఁగి
యొడలు విఱుచుచుఁ గనుఁగవ [1]నుసుము కొనుచు
ధాత గూర్చుండె సృష్టి సంధాత యగుచు. 732

వ. అ య్యవసరంబున. 733

ఆ. వాసవారిఁ జంపి వాని చేపడియున్న
వేదకోటి చిక్కఁ విచ్చి తెచ్చి
నిదుర మాని యున్న నీరజాసనునకు
నిచ్చెఁ గరుణతోడ నీశ్వరుండు. 744

క. జలరుహ నాభుని కొఱకై, జలతర్పణ మాచరించి సత్యవ్రతుఁ డా
జలధిఁ బ్రతికి మను వయ్యెను, జలజాతునిఁ గొలువ కెందు సంపద గలదే. 735

ఆ. జనవిభుండు తపసి సత్యవ్రతుండును
మత్స్యరూపి యైన మాధవుండు
సంచరించి నట్టి సదమలాఖ్యానంబు
వినినవాఁడు బంధ విరహితుండు. 736

క. హరి జలచరావతారముఁ, బరువడిఁ బ్రతిదినముఁ జదువఁ బరమపదంబుం
బరుఁ డందు వాని కోర్కెలు, ధరణీశ్వర ! సిద్ధివొందుఁ దథ్యము సుమ్మీ. 737

---

1. నుదురుకొనుచు (హ)

మ. ప్రళయాంభోనిధిలోన మేఁ మఱచి నిద్రం జెందు వాణీశు మో
ములఁ వేదంబులు గొన్న దైత్యుని మృతిం బొందించి, సత్యవ్రతుం
డలరఁ బ్రహ్మము మాటలం దెలిపి సర్వాధారుఁ డై మీన మై
జలధిం గ్రుంకుచుఁ దేలుచుఁ మెలఁగు రాజన్మూర్తికిఁ మ్రొక్కెదఁ. 738

వ. అని చెప్పి. 739

క. రాజేంద్ర! దైత్యదానవ, రాజ మహాగహన దహన! రాజస్తుత్యా!
రాజావతంస మానిత!, రాజధరార్చిత! గుణాఢ్య! రాఘవరామా! 740

మాలినీ. దివిజరిపు విదారీ! దేవలోకోపకారీ!
భువనభర నివారీ! పుణ్యరక్షానుసారీ!
ప్రవిమల శుభమూర్తి! బంధుపోష ప్రవర్తి!
ధవళ బహుళ కీర్తి! ధర్మనిత్యానువర్తి! 741

గద్య. ఇది శ్రీ పరమేశ్వర కరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతం బైన శ్రీ మహాభాగవత పురాణం బను మహా ప్రబంధంబునందు స్వాయంభువ స్వారోచి షోత్తమ తామస మనువుల చరిత్రంబును, కరిమకరి యుద్ధంబును, గజేంద్ర రక్షణంబును, రైవత చాక్షుష మనువుల వర్తనంబును, సముద్ర మథనంబును, కూర్మావతారంబును, గరళ భక్షణంబును, అమృతాది సంభవంబును, దేవాసుర కలహంబును, హరి కపట కామినీ రూపంబున నసురుల వంచించి, దేవతల కమృతంబు వోయుటయు రాక్షసవధంబును, హరిహర సల్లాపంబును, గపటకామినీరూప విభ్రమణంబును, వైవస్వత, సూర్యసావర్ణి, దక్షసావర్ణి, బ్రహ్మసావర్ణి, భద్రసావర్ణి, దేవసావర్ణి, ఇంద్రసావర్ణి, మనువుల వృత్తాంతంబును, బలి యుద్ధయాత్రయును, స్వర్గవర్ణనంబును, దేవపలాయనంబును, వామనావతారంబును, శుక్ర బలి సంవాదంబును, త్రివిక్రమ విస్ఫురణంబును, రాక్షస సుతల గమనంబును, సత్యవ్రతోపాఖ్యానంబును, మీనావతారంబును నను కథలు గల యష్టమ స్కంధము సంపూర్ణము.

ఓమ్

శ్రీ మహా భాగవతము

నవమ స్కంధము

క. శ్రీరాజిత! మునిపూజిత!, వారిధి గర్వాతిరేక వారణ బాణా!
సూరిత్రాణ! మహోజ్జ్వల, సారయశస్సాంద్ర! రామచంద్రనరేంద్రా! 1

అధ్యాయము - ఁ

వ. మహనీయ గుణగరిష్ఠు లగు న మ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుం డైన సూతుం డిట్లనియె. అట్లు ప్రాయోపవిష్టుం డైన పరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రునిం గనుంగొని. 2

సీ. మనువుల నడవళ్ళు మర్యాదలును వింటి మన్వంతరంబుల మాధవుండు
దిరిగిన జాడలు దెలిసె సత్యవ్రతుం డను రాజు ద్రవిళదేశాధిపుండు
పోయిన కల్పాంతమున విష్ణు సేవించి విజ్ఞానమునఁ బొంది వెలుఁగుఱేని
కతఁడు వైవస్వతుం డై పుట్టి మను వయ్యె నతనికి నిక్ష్వాకుఁ డాదిగాఁగఁ

తే. బదుగు కొడుకులు గల [1]రంటి పరఁగ వారి
వంశ మేరీతి వర్తించె వారిలోనఁ
జనినవారిని జనువారిఁ [2]జనెడివారిఁ
జెప్పవే వ్యాసనందన! చిత్తగించి. 3

క. చెవులార నేఁడు వినియెద, రవివంశమునందుఁ గలుగు రాజుల కీర్తుల్
వివరింపు వరుసతోడను, భువిఁ బుణ్యుల[3]చరిత వినినఁ బుణ్యముగాదే. 4

వ. అనినం బరాశరమునిమనుమం డిట్లనియె. 5

ఆ. వినుము మనువుకులము వెయ్యినూఱేండ్లును
బరఁగ విస్తరించి పలుకరాదు
నాకుఁ దోఁచినంత నరనాథ! వేగంబ
[4]యెఱుకపడఁగఁ బ్రీతి నేర్పరింతు. 6

---

1. రందు (హ); అండ్రు (వా); 2. చనినవారి (తం) "యేభూతా యేభవిష్యాశ్చ భవం త్యద్యతనాశ్చయే" (1–5) 3. కీర్తి (ద. బ. తం. వా.) 4. యెఱుఁగఁ బడఁగ (హ)

క. ఎక్కువ తక్కువ [1]పొడవుల, కెక్కటి మొద లై న పురుషుఁ డింతయుఁ జెడఁ దా
నొక్కఁడు కల్పాంతంబున, [2]నక్కజ మై నిల్చె విశ్వ మతఁ డై యుంటన్. 7

సీ. భూమిశ ! య మ్మహాపురుషుని నాభిమధ్యమున బంగారుఁ గెందమ్మి మొలచె
నా తమ్మిపూవులో నటమీఁదఁ దనయంత నాలుగు మోముల నలువ పుట్టె
నా బ్రహ్మమనమున నట మరీచి జనించెఁ గశ్యపుం డతనికిఁ గల్గె నంత
నా కశ్యపునికి దక్షాత్మజ యదితికిఁ గొమరుఁ డై చీఁకటిగొంగ వొడమె

తే. జలజబంధుని పెండ్లాము సంజ్ఞయందు
శ్రాద్ధదేవుండు మనువు సంజాతుఁ డయ్యె
మనువునకు శ్రద్ధ యనియెడి మగువయందుఁ
బదురు కొడుకులు గలిగిరి భద్రయశులు. 8

వ. వార లిక్ష్వాకుండును, నృగుండును, శర్యాతియు, దిష్టుండును, ధృష్టుండును, గరూశకుండును, నరిష్యంతుండును, వృషధ్రుండును, నభగుండును, గవియు నన నెగడిరి. అటమున్ను మనువు, కొడుకులు లేనివాఁ డై, మిత్రావరుణుల నుద్దేశించి.

సీ. మనువు బిడ్డలు పుట్ట మఖ మాచరించుచో నతని భార్యయు హోత నాశ్రయించి
కూఁతురు పుట్ట నాకును జేయు మని పల్క వరభక్తితోఁ బయోవ్రతము సల్పె
నా సతి సెప్పిన ట్లధ్వర్యుఁడును హోత నగుఁగాక [3]వేలువు మనుచుఁ బలికె
[4]హవి యందుకొని [5]కూఁతు రగుఁ గాక యని వషట్కారంబు సెప్పుచుఁ గదిసి వేల్వ

తే. హోత [6]వెడసేఁత నిల యను నువిద వుట్టె
దానిఁ బొడగని మనువు సంతాప మంది
కొడుకు మేల్గాక యేటికిఁ [7]గూఁతు రకట !
చెప్పవే యని పోయె వసిష్ఠు కడకు. 10

వ. చని యి ట్లనియె. 11

క. అయ్యా ! కొడుకులకొఱకై, [8]యి య్యాగము నీ యనుజ్ఞ నేఁ జేయంగా
ని య్యాఁడ దేల పుట్టెను, మి య్యంతటివారి కొండు మేరయుఁ గలదే. 12

---

1. పొడవుల నెక్కటి (హ) పొడవుల కెక్కటి పొడవైన (క. ద. బ. తం.) 2. అక్కజమై యుండి విశ్వమంతయు నిల్చె(తం) 3. వేల్పుడుననుచు (హ); వేలుపుమనుచు (తం) 4. హవి నందుకొని (తం); హవిసందుకొని (వా) 5. కూఁతురయ్యెద మని (ట.త.డ.) కూఁతురయ్యెడుమని (తం. వా.) 6. పెడచేత (హ. తం. వా) 7. కూఁతురనుచు (హ) 8. మీయంతటి (తం.వా) ఈ పాఠమున ప్రాసభంగము. మి + అంతటి = మియ్యంతటి. స్వతంత్ర ప్రయోగము. 'అయ్యా-యీ యాగము – నీ యాడదేల - మీయంతటి' (హ).

వ. అదియునుం గాక, మీరు బ్రహ్మవాదులరు. మంత్రవాదులరు. పాపంబు లంద కుండం [1]జేయించువారలు. ఇది యేమి యనవుడు, [2]వసిష్ఠుండు, హోతృవ్యభి చారం బెఱింగి, మనువున కి ట్లనియె. 13

తే. అధిప ! సంకల్ప వైషమ్య మగుటఁ జేసి
హోత [3]కల్లతనంబున నువిద గలిగె
నైనఁ గలిగింతు నీకుఁ బ్రియాత్మజులను
నీవు మెచ్చంగఁ జూడు నా నేర్పుబలిమి. 14

వ. అని పలికి భగవంతుం డగు వసిష్ఠుండు కీర్తి తత్పరుండు గావున, మనువు [4]కొమ రిత మగతనంబు కొఱకు నేకచిత్తంబున నాది పురుషుం డగు హరిం బొగడిన, న ప్పరమేశ్వరుండు మెచ్చి, తపసి కోరినవరం బిచ్చె. అది నిమిత్తంబుగా నిళా కన్యక సుద్యుమ్నుం డను కుమారుం డై రాజ్యంబు సేయుచు. 15

సీ. ప్రొద్దుపో కొకనాఁడు పోయి వేరడవుల వెంట [5]వేఁటాడుచు వేడ్కతోడఁ
గొందఱు మంత్రులు గూడిరా నైంధవం బైన గుఱ్ఱము నెక్కి [6]యంద మైన
బలువిల్లుఁ గ్రొవ్వాఁడి బాణంబులును దాల్చి పెను మెకంబుల వెంట బిరుసుతోడ
నుత్తరదిశకు మహోగ్రుఁ డై [7]చనిచని మేరువుపొంతఁ గుమారవనము

తే. †జేరె నెందు మహేశుండు శివయు నెపుడు
[8]రతి సలుపుచుందు రందుఁ జొరంగఁబోవ
నాఁడ దయ్యాను దోడనె యనుచరులును
బడఁతు లై రి తదశ్వంబు బడబ యయ్యె. 16

వ. ఇట్లు మగతనంబు నెడి, మగువ లై యొండొరుల మొగంబులు సూచి, మఱుఁగు చుండి రనిన విని శుకునకు రా జి ట్లనియె. 17

ఆ. రాజుఁ దోడివారు రమణు లై రంటివి
కాంత లై రి యేమి కారణమున
[9]నిట్టి దేశ మెఱుఁగ మెన్నఁ డా కథలెల్ల
వేడ్కదీర నాకు వి స్తరింపు. 18

---

1. చేయువారలు (క. తం.) 2. మాతాత వసిష్ఠుండు (తం. వా.) 3. కల్లఁ దనంబున (తం) 4. కొమారుని (హ); కొమరాలి (తం); కూఁతు (వా) 5. వేఁటాడెడి (తం) 6. యడవి కేఁగి (హ) 7. యేతెంచి (హ) 8. రతియు సలుపుదు రందు నారాజుపోవ (హ)

† క. చ. ప్రతులలో గీత మిట్లున్నది.

'జేరె నవ్వేళ శంభుండు శివయు దాను, నందు క్రీడింప సొచ్చిన యంత మాత్ర
నాట దయ్యాను రాజు రాజాను చరులు, పడతులై రి తదశ్వంబు బడబ యయ్యె.'

9. నిట్టి దేమెఱుంగ (క)

వ. అదియునుం గాక. 19

ఆ. మగువతనము మాని మగవాఁడు గావచ్చుఁ
గాక పేరు పెంపు గాసి గాఁగ
మగతనంబు మాని మగువ గావచ్చునె
మానవంతుఁ డైన మానవునికి. 20

వ. అని యడిగిన నర్జున పౌత్రునకు వ్యాసపుత్రుం డి ట్లనియె. 21

సీ. పురవైరి కొకనాఁడు పొడసూపు వేడుకఁ దపసులు దిక్కుల తమము లెల్లఁ
[1]దమతమ వెలుఁగులు దగిలి గొందులు సొరఁ గొందఱు [2]మౌనులు [3]గోరి రాఁగ
ప్రాణేశు తొడలపై భాసిల్లు నంబిక వారలఁ జూచి మై వలువలేమి
సిగ్గు పుట్టిన లేచి చీరఁ గట్టినఁ జూచి దేవియు దేవుండు దీర్ఘలీల

తే. నొంటిఁ దమలోనఁ గ్రీడింపుచున్న వారు
మనకు సమయంబు గా దని మరలి మునులు
నరుఁడు నారాయణుండు ననారతంబు
మెలఁగు చోటికి నడచిరి మేదినీశ ! 22

వ. అది కారణంబుగా, భగవంతుం డగు శివుండు తన ప్రియురాలి వేడుకల కొఱకు
ని ట్లనియె. 23

క. ఈ నెల వెవ్వఁడు సొచ్చిన, మానిని యగు ననిన తొంటి మాటకతమునఁ
మానవుఁడు మగువ పోడిమి, మానక వేరడవులందు మఱియుం దిరిగెన్. 24

వ. ఇట్లు చెలికత్తియల మొత్తంబులుం దానును, నా రాచపూఁబోఁడి వాఁడిమి
చూపుల నాఁడు పోఁడిమి నెఱపుచు, దైవయోగంబున సోమసుతుండును, భగ
వంతుండును, నగు బుధుని యాశ్రమంబు సేరి మెలఁగుచున్న యెడ. 25

ఆ. రాజు కొడుకుఁ జూచె రాజీవదళ[4]నేత్రి
రాజవదన చూచె రాజుపట్టి
దొంగకాముఁ డంత దొందడిఁ జిగురాకు
వాలు వెఱికి యుఱికి వారి మొత్తె. 26

వ. ఇ ష్టలరువిల్తుని నెఱబిరుదు చిగురు టడిదంబు మొనకు మోహాటించి, వార లిరు
వురుం బైపడి వేడుకలకుం జొచ్చిన, వారలకుం బురూరవుం డను కుమారుండు
వుట్టె. ఇ ప్విధంబున. 27

---

1. తమమెయి వెలుఁగులు (త. జ.); తమమేని వెలుఁగులు (ద) 2. పథికులు (చ. ట. త.)
3. గొల్చి (బ. తం.) 4. నేత్ర (తం.) 5. పూవు కైదువులుగల నెఱబిరుదు (క)

ఆ. మనుసుతుండు ఘనుఁడు మగనాలి తనమునఁ
గొడుకుఁ గాంచి విసివి [1]కుంది కుంది
చింతఁ బొంది గురు వసిష్ఠుని భావింప
నతని [2]తలఁపుతోన నతఁడు వచ్చె. 28

వ. వచ్చి సుద్యుమ్నుండు మగవాఁడయ్యెడు కొఱకు, న మ్మునిపుంగవుండు శంకరు
నారాధింప, నీశ్వరుండునుం దపసి ప్రయాసంబునకు సంతసిల్లి యి ట్లనియె. 29

మ. తన మున్నాడిన మాటయు న్నిజముగాఁ దన్మోనికిం బ్రీతిగా
[3]మనుచుండుఁ నెల యో నెలం బురుషుఁ డై మాసాంతరం బైనఁ గా
మిని యై యీగతి వీడుపా టమర భూమిం దాన రక్షించుఁ బో
మ్మనినఁ వచ్చె వసిష్ఠుఁ డా మనుసుతుం డారీతి రాజ్యస్థుఁ డై. 30

ఆ. మగువ యగుచు మరల మగవాఁడు నగుచును
భూత ధాత్రి యంత నాతఁ డేలెఁ
బ్రజలు సంతసింప బాహాబలముతోడ
గురుని కరుణఁ జేసి కువలయేశ! 31

వ. అతనికి నుత్కలుండును, గయుండును, [4]విమలుండును ననుకొడుకులు మువ్వురు
గలిగి ధర్మపరు లై, [5]యుత్తరా పథంబునకు రాజు లై రి. సుద్యుమ్నుండు ముదు
సలి యై, ప్రతిష్ఠానపురంబు విడిచి, పురూరవునకు భూమి నిచ్చి, వనంబునకుం
జనియె. ఇ ద్వివిధంబున. 32

అధ్యాయము - ఎ

సీ. కొడుకు సుద్యుమ్నుండు ఘోరాటవుల కేఁగ వందుచు మనువు వై వస్వతుండు
దనకు బిడ్డలు గల్గ దపమాచరించెను హరిఁగూర్చి నూఱేండ్లు యమునలోన
[6]హరి యంత నిక్ష్వాకుఁ డాదిగాఁ బదుగురు పుత్రుల నిచ్చెను బొసఁగ వారి
[7]యందుఁ బృషధ్రాఖ్యుఁడగు వాఁడు గురునాజ్ఞ విమలధర్మంబులు వెలయఁ బూని
తే. పసుల కదుపులు గాచుచు బలు మొగుళ్ళు
వచ్చి నడురేయి [8]జోరున వాన గురియ
మంద విడియించి చుట్టు నేమఱుక యుండె
నడవి మెకములు సొరకుండ నరసికొనుచు. 33

---

1. కుంది కంది (ట) 2. తలఁపులోన (హ) 3. మనుజేంద్రుండు నెలన్నెలం బురుషుఁ డై (హ) 4. విహ్వలుండును (హ) 5. దక్షిణపథంబునకు (హ) 6. హరియును నిక్ష్వాకుఁ డాదిగాఁ బదురు పుత్రుల నిచ్చె మనువుతో దొరయు వారి (తం.) 7. అందులోనఁ బృషధ్రుఁడను వాఁడు (క. చ. ట. బ తం.) 8. బోరన (క. ట.)

వ. అంత. 34

క. ప్రబ్బికొనిన పెంజీఁకటి, నిబ్బరమున నడికి నడికి నింగికి వడితో
గొబ్బున నెగసి తటాలునఁ బెబ్బులి మందావుఁ బట్టెఁ [1]బెల్కుటీ యఱవన్. 35

క. ఉల్లములు గలఁగి మొదవుల, వెల్లువ లన్నియును లేచి విచ్చలవిడితోఁ
జెల్లాచెద రై పాఱెను, బెల్లుగ నంఘా యటంచు బెబ్బులిగాలిన్. 36

వ. అ య్యవసరంబున. 37

శా. ఆ పెంజీఁకటి ప్రమోలఁ గాన కడిదం బంకించి శార్దూల మం
చా పుల్లావు శిరంబు ద్రుంచి తెగదో యంచున్ బులిన్ వెండియున్
వాపోవం దెగవ్రేసి భూవరుఁడు ద్రోవన్ ఖడ్గ రక్తంబుచేఁ
బై పై [2]గీయుచుఁ జేరి చూచెఁ దల ద్రెవ్వం బడ్డ య ద్దేనువున్. 38

వ. చూచి, దుఃఖంతుం డై యున్న పృషధ్రునిఁ గని, కులగురుం డగు వసిష్ఠుండు గోపించి, నీవు రాజత్వంబు వాసి, యీ యపరాధంబున శూద్రుండవు గమ్మని శపియించె. అతండును కృతాంజలి యై, తన కులాచార్యునివలన మరలం గైకోలు వడసి, యతని యనుమతంబున. 39

సీ. అఖలాత్ముఁ డగుచున్న హరియందుఁ [3]బరునందు భక్తితోఁ జాలఁ దత్పరత మెఱసి
[4]యూర్ధ్వరేతస్కుఁ డై యున్న ప్రాణుల కెల్ల [5]నాప్తుఁ డై సర్వేంద్రియముల గెలిచి
సంగంబునకుఁ బాసి శాంతుండు నపరిగ్ర హుండు నై [6]కోరక యుండి తనకు
వచ్చిన యదియ జీవనముఁ గావించుచుఁ దనుఁదాన నిలుపుచు ధన్యబుద్ధి

తే. జడునితెఱఁగున [7]నంధుని చందమునను
జెవిటిభంగిని మహి నెల్లఁ జెల్లఁ దిరిగి
యడవులకు నేఁగి కార్చిచ్చునందుఁ జొచ్చి
చిక్కి నియతుఁ డై బ్రహ్మంబుఁ జెందె నతఁడు. 40

క. కవి యను కడపటి కొమరుఁడు, భవనము రాజ్యంబు విడిచి బంధులతో నేఁ
గి వనమునఁ బరమపురుషునిఁ, బ్రవిమలమతిఁ దలఁచి తలఁచి వరముం బొందెన్.

వ. మటియుఁ గరూశుం డను మానవునివలనం గొందఱు కారూశులు క్షత్రియులు గలిగి, ధర్మంబుతోడి ప్రియంబున బ్రహ్మణ్యు లై, యుత్తరాపథంబునకు రక్షకు

---

1. బెంబడి (ట. త.) 2. గీఱుచు (క.తం.) 3. హరునందు (హ) 4. ఊర్ధ్వరేతస్కులై (హ) 5. ఆర్యుఁడై (హ); ఆధ్యుఁడై (ట) 6. కోరక నుండుఁ దనకు (హ) 7. మందుని (హ)

లై రి. ధృష్టునివలన ధార్ష్టం బనెడి వంశంబు గలిగి, భూతలంబున బ్రహ్మ భూయంబు నొంది నెగడె. నృగుమూలంబున సుమతి గలిగె. అతనికి భూతజ్యోతి వుట్టె. అతనికి వసువు జనియించె. వసువునకుం బ్రతీతుండు గలిగె. ప్రతీతునికి నోఘవంతుండు జనించె. అతని కూఁతు రోఘవతి యను కన్యకను సుదర్శనుండు వివాహం బయ్యె. నరిష్యంతుం డను మనుపుత్రునికిఁ బ్రమతసేనుం, డా విభునకు దక్షుం, డా పుణ్యునకు మీఢ్వాంసుం, డా సుజనునికి శర్వ్యం, డ మ్మహాత్మునికి నింద్రసేనుం, డా రాజునకు వీతిహోత్రుం, డా సుమతికి సత్యశ్రవుం, డా ఘనునికి నురుశ్రవుం, డా వీరునకు దేవదత్తుం, డా పండితునకు నగ్ని వేశుండు సుతులై జని యించిరి. అయ్యగ్ని వేశుండు కానీనుం డన నెగడి, జాతుకర్ణుం డను మహర్షి యై వెలసె. అతనివలన నాగ్ని వేశ్యాయనం బను బ్రహ్మకులంబు గలిగె. ఇ ట్లీధంబున

క. తెలుపఁబడె నరిష్యంతుని, కుల మెల్ల ను నీకు దిష్టకులము [1]దెలియ
దెలిపెద రాజేంద్రోత్తమ !, తెలియుము సర్వంబు నీకుఁ దేటపడంగ. 43

వ. దిష్టునికొడుకు నాభాగుం డనువాఁడు, కర్మవశంబున వైశ్యత్వంబు నొందె. ఆ నాభాగునికి వాలంధనుండు గలిగె. అతనికి వత్సప్రీతియు, వత్సప్రీతికిఁ బ్రాంశువును, నతనికిఁ బ్రమితియుఁ, బ్రమితికి ఖమిత్రుఁడును, ఖమిత్రునికిఁ జాక్షుషుండును, నతనికి వివింశతియు, వివింశతికి రంభుండును, రంభునికి ధార్మికుం డైన ఖనినేత్రుండును, నతనికిఁ గరంధనుండును, గరంధనున కవిక్షత్తును, నా యవిక్షత్తునకు మరుత్తుండును, జనించిరి. ఆ మరుత్తుండు చక్రవర్తి యయ్యె. అతని చరిత్రంబు వినుము. 44

సీ. [2]అంగిర స్సుతుఁడు మహాయోగి సంవర్తుఁ డతని యాగమునకు యాజకుండు
[3]తిరిగి యుండెడివారు మరుదాఖ్య గణము లొప్పారు విశ్వేదేవు లచటి సభ్యు
లధిక [4]దక్షిణల బ్రాహ్మణకోటిఁ దనిపెను సోమపానంబున సురవరుండు
[5]మ త్తిల్లి బంగారుమయము గావించెను యాగవస్తువు లెల్ల నధికనియతి

తే. నా మరుత్తుఁడు సేసినయట్టి భంగి
ధీరభావంబుఁ [6]జాగంబుఁ దెంపుఁ గలిగి
మఖము చేసిన వారిని మటియు నెఱుఁగ
మెల్ల లోకము లందు నరేంద్ర ముఖ్య ! 45

---

1. వరుస (తం) 2. ఆంగీరసుండు (చ) 3. తరగియుండెడి మరుదాఖ్య గణంబులో వారు (హ); (పరివేష్టారః 2–28) 4. లక్షణుల (హ) 5. మంత్రి యై (హ) 6. నమరంగ (హ)

వ. ఆ మరుత్తునకు దమునిండును, దమునకు రాజవర్ధనుండును, రాజవర్ధనునకు సుధృతియు, సుధృతికి సౌధృతేయుండును, సౌధృతేయునకుఁ గేవలుండును, గేవలునకు బంధుమంతుండును, నతనికి వేదవంతుండును, వేదవంతునికి బంధుండును, బంధునకుఁ దృణబిందుండును సంభవించిరి. అంత. 46

క. అచ్చర కన్య యలంబుస, [1]క్రచ్చుఁ దృణబిందుఁ జూచి కామించి తుదిన్
బచ్చవిలుకాని యమ్ములఁ, [2]ముచ్చిచ్చున వచ్చి పొందె మోహాతుర యై. 47

వ. ఆ దంపతులకు నిలబిల యను కూతురు జన్మించె. ఆ కొమ్మను విశ్రవసుండు పొందిన, నై లబిలుం డనఁ గుబేరుండు వుట్టె. ఆ తృణబిందునకు విశాలుండును, శూన్యబంధుండును, ధూమ్రకేతుండు ననువారు మువ్వురు కొడుకులు గలిగిరి. అందు విశాలుండు, వంశవర్ధనుం డై, వైశాలి యను నగరంబు నిర్మించె. ఆ రాజునకు హేమచంద్రుండును, నా నరేంద్రునకు ధూమ్రాశుండును, నా పుడమి ఱేనికి సహదేవుండును, నా బలిష్ఠునికిఁ గృశాశ్వుండును, నాతనికి సోమదత్తుండును జన్మించె. అతండు. 48

ఆ. అమరవిభుఁడు మెచ్చ నశ్వమేధము సేసి
భూరి పుణ్యగతికిఁ బోయె నెలమి
సోమదత్తు కొడుకు సుమతికి జనమేజ
యుం డనంగఁ గొమరుఁ డుప్పతిల్లె. 49

వ. వీరలు వైశాలురనం బరఁగి, తృణబిందుని కీర్తి వహించి, రాజ్యంబు సేసిరి. మఱియును. 50

అధ్యాయము - 4

సీ. శర్యాతి యను రాజు జనియించె బ్రహ్మవరుం డైన మనువుకు రూఢితోడ
నతఁ డంగిరసు సత్రమందు రెండవనాఁటి విహితకర్మము లెల్ల వెలయఁ జెప్పె
నతని కూఁతురు సుకన్యక యను వనజాక్షి తన తండ్రితోఁ దపోవనము కరిగి
చ్యవనాశ్రమముఁ జేరి సఖులును దానును ఫలపుష్పములు గోయఁ బాఱఁదిరిగి

ఆ. యొక్క పుట్టలోన నొప్పారు జ్యోతుల
రెంటిఁ గాంచి వాఁడిముంటఁ బొడిచె
కన్య ముగుద మఱచి ఖద్యోత యుగమంచు
దైవవళము కతనఁ దమకి యగుచు. 51

---

1. క్రచ్చర నాబంధుఁ జూచి (హ) 2. ముచ్చిచ్చున వచ్చి (హ)

క. జ్యోతుల ముంటం బొడిచిన, వాతుల నెత్తురులు గురిసె వసుధేశు భట
వ్రాతముల కెల్ల నచ్చట, నా తఱి మలమూత్రబంధ మయ్యె నరేంద్రా! 52

వ. వారలఁ జూచి, రాజర్షి యగు శర్యాతి విస్మితుం డై, [1]మీర లీ యాశ్రమదూషణము సేయనోపుదురు. అది కారణంబుగా మీ కీ నిరోధంబు సిద్ధించె. అని పలుకునవసరంబునఁ దండ్రికి సుకన్యక యిట్లనియె. 53

తే. అయ్య! యీ పుట్టచేరువ నాడి యాడి
యిందుఁబో రెండుజ్యోతుల నేనుఁ గాంచి
కంటకంబునఁ బొడువ రక్తంబు గురిసె
నేవిధంబునఁ గురిసెనో యెఱుఁగు మీవు. 54

వ. అనిన విని, శర్యాతి భీతుం డై, కూఁతుం దోడ్కొని, వల్మీకంబుకడకుం జని, యందులోఁ దపంబు సేయుచున్న చ్యవనునిం గని, తన నేర్పున నతని వలనఁ బ్రసన్నత వడసి, తపసిచిత్తంబు నెఱింగి, తన పుత్రిక నిచ్చి, యెట్టకేలకుం బ్రతికినవాఁ డై, మునీశ్వరుని వీడ్కొని, పురంబునకుఁ జనియె. నంత. 55

ఆ. పరమకోపుఁ డైన భార్గవుఁ బతిఁ జేరి
మిగుల పనులయెడల మెచ్చఁ దిరిగి
యతని పర్ణశాల నా సుకన్యక యను
మగువ గొన్ని యేండ్లు మనువు మనియె. 56

వ. అంత నొక్కనాఁడ యాశ్రమంబునకు, వేల్పువెజ్జులైన యాశ్విను లిద్దఱు వచ్చిన వారలం బూజించి తన ముదిమి చూపి, చ్యవనుం డిట్లనియె. మీకు మున్ను యాగభాగంబుల లేని సోమపానంబు నేను గల్పించి యిచ్చెద. సోమపానసమయంబునఁ బానపాత్ర మీకు నందిచ్చెద. నా ముదిమి మానుపుం డని యిట్లనియె.

క. నవకం బగు ప్రాయంబున, జవరాండ్రఁ గరంచు మేని చక్కఁదనంబుఁ
[2]శివతరముగఁ గృపసేయుఁడు, దివిజాధిపవైద్యులార! దీవింతు మిమున్. 58

వ. అనిన, నశ్వినీదేవతలు సంతోషించి, సిద్ధనిర్మితం బైన యీ మడుఁగున మునుఁగు మని పలికి. 59

సీ. ముసలితాపసిఁ బట్టి మొగి నెత్తుకొని పోయి మురుగు నా మడుఁగున మునిఁగిలేచి
వనితాజనుల నెల్ల వలపించు వార లై సుందరమూర్తు లై సుభగు లగుచుఁ
గమలమాలికలతోఁ గనక[3]కుండలములతో మంచి చీరలతోడఁ దుల్యు
లై సూర్యతేజస్కు లై యున్న వారల మువ్వురఁ బొడగాంచి ముగుద బాల

---

1. మీరలీయాశ్రమంబున నకృత్యంబు సేయనోపుదురు (తం)
2. శివకరముగ (తం) 3. కుండలములుఁ గాఁ బుష్పసాయకుతోడఁ బోలితుల్యు (హ)

తే. ఇందుఁ బెనిమిటి వీఁ డని యెఱుఁగలేక
గరిత గావున నిజనాథుఁ గానఁ గోరి
సుభగమతులార ! నా నాథుఁ జూపుఁ డనుచు
[1]నశ్వినీదేవతల కపు డ య్యబల మ్రొక్కె. 60

వ. వార లా పతివ్రత నిజమరితనంబునకు మెచ్చి, వయో రూప సంపన్నుం డైన చ్యవనుం జూపి, దంపతుల వీడ్కొని, విమానారూఢు లై, వేలుపుల ప్రోలికిం జనిరి. అంత. 61

సీ. యాగంబు సేయంగ నర్థించి శర్యాతి చ్యవనమునీంద్రు నాశ్రమముకడకుఁ
[2]గూఁతురి నల్లునిఁ గొనిపోవువేడుక వచ్చి పుత్రికకు పార్శ్వంబునందు
సూర్యతేజంబున సొంపారు [3]నరుఁ గని వీఁ డెవ్వఁడో దీనివిభుఁడు గాఁడు
చెల్లరే యని పుత్రి సేసిన ప్రియములు మ్రొక్కులు నొల్లక మోము వాంచి

తే. మాఱు మాటాడ దీవింప మనసు రోసి
చ్యవనుఁ డధికుండు మునిజన సత్తముండు
భువనసన్నుతుఁ డతఁ డెందుఁ బోయె నాతఁ
డెట్లు వంచింపఁబడియె వీఁ డెవ్వఁ డబల ! 62

మ. తగవే ధర్మమె శీలమే కులజ వై [4]దర్పించి మోదింప నా
జగదారాధ్యునిఁ బుణ్యశీలుఁ దపసిన్ సాధ్వీమన స్సమ్మతున్
మగనిన్ మాని భుజంగుఁ బొందఁదగునే మానంబు వాటింపఁగా
దగదే దుర్గతిఁ ద్రోచితే కఠిన వై తండ్రిం బతిం గూఁతురా ! 63

ఆ. పద్మనయన ! మగఁడు ప్రాయంపువాఁ డైన
గాపుఁ బెట్టి కొంతఁ గావనేర్చుఁ
[5]గడఁగి ముసలితపసి గావంగ నేర్చునే
యువతి ముసలిఁ గూర్చు టొప్ప దెందు. 64

వ. అని పలికిన న ప్పరమపతివ్రతా లలామంబు చిఱునగవు చెక్కుటద్దంబులఁ జిడిముడి పడం దండ్రి కి ట్లనియె. 65

క. నీయల్లుఁ డితఁడు భార్గవుఁ, డయ్యా ! జారుండు గాఁడు హర్షముతోడ
న్నెయ్యంబు నిల్పు మంచును, దొయ్యలి సర్వంబు దండ్రితో వినిపించెన్. 66

---

1. నశ్వినీదేవతలకు నయ్యబల మ్రొక్కె (హ) 2. కూఁతు నల్లునిఁ దోడుకొని పోవువేడుక (తం. వా.) గూఁతురు (హ) 3. వరుఁగని (తం. వా.) 4. తప్పుల్ విచారింపకే (ట); తప్పున్ వినోదింప (తం) 5. కపటి (హ)

వ. అంత శర్యాతియు, నప్రమత్తుం డై, కూఁతురిం గౌఁగిలించుకొని, గారవంబున నైదువవు గ మ్మని దీవించె. అంత భార్యాసహితుం డై చ్యవనుండు సని తన మామకు యాగంబు సేయించి యొక్క పాత్రంబున సోమభాగంబుఁ బట్టి నిజ తపోబలంబున నశ్వినీదేవతల కిచ్చినం జూచి. 67

క. కోపముతోడుత వాసవుఁ, డేపున ముని వైవ వజ్రమెత్తిన మరలన్
దాపసుఁడు వజ్రి భుజమున, నా పవి నిలిపెఁ జగంబు లాశ్చర్యపడఁగ. 68

వ ఇ ట్లవిధంబున దేవతావైద్యు లగు నశ్వినీదేవత లిద్దఱు, సోమభాగంబు లేనివా రయ్యును, చ్యవను సామర్థ్యంబునఁ బ్రాప్తభాగు లై చనిరి. శర్యాతికి నుత్తాన బర్హి యు, నానర్తుండును, భూరిషేణుండు ననుమువ్వురు కొడుకులు గలిగిరి. అందు.

సీ. ఆనర్తునకు రైవతాహ్వాయుం డుదయించె నతఁడు కుశస్థలి యను పురంబు
నీరధిలోపల నిర్మించి పెంవుతో నానర్త ముఖ విషయంబు లేలెఁ
గనియెఁ గకుద్మి ముఖ్యం బైన నందన శతము [1]రైవతుఁడు విశాలయశుఁడు
దనకూఁతు రేవతి ధాతముందటఁ బెట్టి తగు వరు నడిగెడి తలఁపుతోడఁ

తే. గన్యఁ దోడ్కొని బ్రహ్మలోకమున కేఁగి
యచట గంధర్వ కిన్నరు లజునిమ్రోల
నాటపాటలు సలుపఁగ నవసరంబు
గాక నిలుచుండె నతఁ డొక్క-ఱుణము దడవు. 70

వ. అంత నవసరం బైన నజునికి నమస్కరించి, [2]రైవతుండు రేవతిఁ జూచి యి ట్లనియె.

ఆ. చాల ముద్దరాలు జవరాలు గొమరాలు
నీ శుభాత్మ్మరాలి కెవ్వఁడొక్కొ
మగఁడు సెప్పు మనిన మదిఁ జూచి పకపక
నవ్వి భూమిపతికి నలువ వలికె. 72

సీ. మనుజేశ! దీనికై మదిలోనఁ దలఁచిన వార లెల్లను గాలవశతఁ జనిరి
వారల బిడ్డల వారల మనుమల వారల గోత్రంబువారి నైన
వినము మేదినిమీఁద వినుము నీ వచ్చిన యీలోన నిరువదియేడు మార్లు
నొండొండ నాలుగు యుగములు చనియె నీ వటు గాన ధరణికి నరుగు మిపుడు

---

1. గకుద్మి (హ) 2. కకుద్మి యి ట్లనియె. (హ)

తే. దేవదేవుండు హరి బలదేవుఁ డనఁగ
భూమిభారంబు మాన్పంగఁ బుట్టినాఁడు
సకలభూతాత్మఁకుడు నిజాంశంబుతోడ
యువతిమణి నిమ్ము జనమణి కున్న తాత్మ ! 73

వ. అని యానతిచ్చిన బ్రహ్మకు నమస్కరించి, భూలోకంబునకుం జనుదెంచి, సోదర స్వజనహీనం బగు తన నగరంబున కా రాజు వచ్చి, బలభద్రుం గాంచి రేవతీకన్య నతని కిచ్చి, నారాయణాశ్రమం బగు బదరికావనంబునకు నియమంబునం దపంబు సేయుటకుం జనియె. 74

అధ్యాయము - ౯

క. నభగుఁ డను [1]మనుజపతికిని, శుభమతి నాభాగుఁ డనఁగ సుతుఁ డుదయించెఁ
బ్రభు లై [2] కవియను తలఁపున, విభజించిరి భ్రాత లతని వి త్తము నధిపా ! 75

వ. అంత నాభాగుండును బ్రహ్మచారి యై, తన తోడం బుట్టువులను ధనంబుపా లడిగిన, వారలు దండ్రి చెప్పిన క్రమంబున నిచ్చెద మనిన, నాభాగుండు తండ్రి యగు నభగుకడకుం జని, విభాగంబు సేయు మని పలికిన, నతం డిందు నంగి రసులు మేధగలవార లయ్యెను, సత్రయాగంబు సేయుచు నాఅవదినంబున నహ్నాకర్మంబులు దోఁపక మూఢు లయ్యెదరు. వారలకు నీవును, వైశ్వదేవ సూక్తంబులు రెం డెటిఁంగించినఁ, గవి యనం బ్రసిద్ధి కెక్కెదవు. [3]దానంజేసి వారలు కృతకృత్యు లై, స్వర్గంబునకుఁ బోవుచు, సత్రావశిష్టం బైన ధనంబు నీ కిచ్చెదరు. అని పలికినం దండ్రి వీడ్కొని నాభాగుండు సని, యట్లు సేసిన, నంగి రసులు సత్ర పరిశేషితధనంబు లతని కిచ్చి, నాకంబునకుం జనిరి. అంత. 76

క. అంగిరసు లిచ్చు పసిఁడికి, మంగళమతిఁ జేరు నృపుని మానిచి యొకఁ డు
త్తుంగుఁడు [4]జలద నిభాంగుఁడు, ముంగల నిలుచుండి వి త్తముం జేకొనియెఁ.

వ. వానిం జూచి, నాభాగుండు దనకు మును లిచ్చుటంజేసి తనధనం బని పలికిన, న మ్మహాపురుషుండు, మీతండ్రి సెప్పినక్రమం బకర్తవ్యం బనిన, నాభాగుండు నభగు నడిగిన, నతండు యజ్ఞమందిరగతం బై, యుచ్ఛిష్టం బగు ధనంబుఁ దొల్లి మహామునులు రుద్రున కిచ్చిరి. అది కారణంబుగా నా దేవుండు, సర్వధనంబులకు నర్హుండు. అనిన విని, వచ్చి, నాభాగుండు మహాదేవునకు నమస్కరించి, దేవా ! యీధనంబు నీయధీనంబని మాతండ్రి సెప్పె. నే నపరాధంబు సేసితి. సహింపుము.

---

1. మానవునకును (తం) 2. వెలయు తలంపున (హ); "తద్భ్రాతరః కవిమ్"(4-1)
3. వారలు దానంబు సేసి కృతకృత్యులై (హ) కృష్ణాంగుఁడు దగ (తం. వా.)

అనవుడు భక్తవత్సలుం డగు న మ్మహాపురుషుండు నభగు సత్యవచనంబులకు, నాభాగుని నిజంబునకు మెచ్చి, నీవు దప్పక పలికితివి కావున, సత్రపరిశేషితం బగు ధనంబు నీకు నిచ్చితి. అని పలికి, [1]మంత్రదర్శిత్వంబును, సనాతనం బగు బ్రహ్మజ్ఞానంబును నుపదేశించి, తిరోహితుం డయ్యె. ఇ ట్లిధంబున. 78

క. భువిలో నాభాగుని కథ, [2]తవిలి మతిఁ రేపు మాపుఁ దలఁచిన మాత్రం
గవి యగు మంత్రజ్ఞుం డగుఁ బ్రవిమలగతిఁ బొందు నరుఁడు భద్రాత్మకుఁ డై.

వ. అంత నాభాగునకు నంబరీషుండు జనియించె. అతనియందు జగదప్రతిహతం బైన [3]బ్రాహ్మణశాపంబు నిరర్థకంబయ్యె. అనిన విని యేమికారణంబున దురంతం బైన బ్రహ్మదండంబువలన నతండు విడువంబడియె ననిన న ప్పుడమిఱేనికి శుకుం డి ట్లనియె. 80

—: అంబరీషోపాఖ్యానము :—

శా. సప్తద్వీపవిశాల భూభరము దోఃస్తంభంబునం [4]బూని సం
ప్రాప్త శ్రీయుతుఁ డై మహావిభవ సంపచ్ఛాతురిం గల్గి దు
ర్వ్యాప్తిం జెందక వైష్ణవార్చనల మేరం గాలముం బుచ్చుచున్
సుప్తిం బొందక యొప్పె సద్గుణోగరిష్ఠుం డంబరీషుం డిలన్. 81

సీ. చిత్తంబు మధురిపు శ్రీపాదములయంద పలుకులు హరిగుణ పఠనమంద
కరములు విష్ణుమందిర మార్జనములంద [5]శ్రవములు హరికథా శ్రవణమంద
చూపులు గోవింద రూపవీక్షణమంద శిరము కేశవ నమస్కృతులయంద
పదము లీశ్వర గేహ పరిసర్పణములంద కామంబు చక్రి కైంకర్యమంద

తే. సంగ మచ్యుత జనగుణ సంగమంద
ఘ్రాణ మసురారి భక్తాంఘ్రి కమలమంద
రసన తులసీదళములంద రతులు పుణ్య
సంగతులయంద యా రాజచంద్రమునకు. 82

వ. మఱియు న మ్మహీవిభుండు. 83

సీ. ఘన వైభవంబునఁ గల్మషదూరుఁ డై యజ్ఞేశు నీశు నబ్జాక్షుఁ గూర్చి
మొనసి వసిష్ఠాది మునివల్లభులతోడఁ దగిలి సరస్వతీ తటమునందు
మేధతో బహు వాజిమేధంబు లొనరించె గణుతింపరాని దక్షిణలు వెట్టి
సమ లోష్టహేముఁ డై సర్వకర్మంబులు హరిపరంబులు గాఁగ నవని యేలె

---

1. అంతర్దర్శిత్వంబు (హ) 2. ధవళ (హ) 3. బ్రాహ్మణ శాపంబువలన విడువంబడియెనని (జ) 4. బూన్చి (త. డ. ద. బ. తం. వా.) 5. విశేషుం (క. బ.) 6. చెవులు మాధవకథా శ్రవణమంద (క. చ. తం.)

ఆ. విష్ణుభక్తులందు విష్ణువునందుఁ గ
లంక మెడల మనసు లంకెపెట్టి
విహిత రాజ్యవృత్తి విడువనివాఁడు నై
యతఁడు రాచతపసి యనఁగ నొప్పె. 84

వ వెండియు న మ్మహాభాగవతుండు. 85

క. హరి యని [1]సంభావించును, హరి యని దర్శించు నంటు నాఘ్రాణించుఁ
హరి యని రుచిగొనఁ దలఁచును, హరిహరి! ఘను నంబరీషు నలవియె పొగడఁ

వ. ఇట్లు పుణ్యచిత్తుం డీశ్వరాయత్తుండు నై, యల్లనల్లన రాజ్యంబుసేయుచున్న సమయంబున. 87

ఆ. అతని కీహ మానె హరులందుఁ గరులందు
ధనములందుఁ గేళివనములందుఁ
బుత్రులందు బంధు మిత్రులయందును
బురమునందు నంతిపురమునందు. 88

వ. అంతఁ గొంతకాలంబున క మ్మేదినీకాంతుండు సంసారంబువలని తగులంబు విడిచి, నిర్మలుం డై యేకాంతంబున భక్తిపరవశుం డై యుండ, నా రాచ తపసికి భక్తలోకవత్సలుం డగు పురుషోత్తముండు ప్రతిభట శిక్షణంబును, నిజ జనరక్షణంబును, నిఖిల జగ దవక్రంబును నగు చక్రం బిచ్చి చనియె. అంత. 89

క. తన తోడినిడకైవడి, ననురూప గుణాఢ్య యైన యాత్మమహిషితో
జనవిభుఁడు ద్వాదశీవ్రత, మొనరఁగ హరిఁగూర్చి చేసె [2]నొకయేఁ డధిపా! 90

వ. ఇట్లు వ్రతంబు సేసి, యా వ్రతాంతంబునం గార్తికమాసంబున మూఁడురాత్రు లుపవసించి, కాళిందీజలంబుల సుస్నాతుం డై, మధువనంబున మహాభిషేక విధానంబున విహిత పరికరసంపన్నుం డై, హరి నభిషేకంబు సేసి, మనోహరంబు లైన గంధాక్షతంబులు సమర్పించి, యభినవామోదంబు లైన పుష్పం బులం బూజించి, తదనంతరంబ. 91

శా. పాలేపై [3]ప్రవహింప [4]డగ్గఱుచు లేఁబ్రాయంబులుఁ రూపముల్
[5]మేలై ధూర్తలు గాక వెండిగొరిజల్ [6]హేమోరు శృంగంబులున్
గ్రాలం గ్రేపుల యట్టి నాకుచును [7]రంగ చ్చేల లై యున్న మం
దాలఁ న్యగ్రోధపటక్క మిచ్చె విభుఁ డుద్య ద్వైదికశ్రేణికిఁ. 92

---

1. సంభాషించును(క.త.జ.డ.బ.) 2. యేటిదరిన్(హ) 3. పఱవంగ(క.త.తం.) 4. నంగరుచులుం బ్రాయం బులున్ రూపముల్ (వా) 5. హేలన్ (హ) 6. హేమోపశృంగంబులున్ (క) 7. నంగచ్ఛాయ లై(హ)

క. పెక్కండ్రు విప్రవరులకు, గ్రక్కున నతిభక్తితోడఁ గడుపులు నిండఁ
జొక్కపు టన్నం బిడి విభుఁ, [1]డొక్కెడఁ బారణముసేయ నుద్యోగించెఁ. 93

వ. అ య్యవసరంబున. 94

క. భాసుర నిగమ పదోప, న్యాసుఁడు సుతపోవిలాసుఁ డనుపమ యోగా
భ్యాసుఁడు రవిభాసుఁడు [2]దు, ర్వాసుం డేతెంచెఁ దన్ని వాసంబునకుఁ. 95

వ. వచ్చిన, న మ్మునివల్లభునకుఁ బ్రత్యుత్థానంబు సేసి, కూర్చుండ గద్దియ యిడి, పాదంబులు గడిగి, పూజించి, సేమం బరసి, తనయింట నన్నంబు గుడువు మని నమస్కరించిన, న మ్మహాత్ముండును, సంతోషించి, భోజనంబునకు నంగీకరించి, నిర్మలం బగు కాళిందీజలంబులం బరమధ్యానంబు సేయుచు, మునింగి, లేచిరాక తడవుసేసిన, ముహూర్తార్ధావశిష్ట యగు ద్వాదశియందుఁ బారణసేయవలయుటఁ జింతించి, బ్రాహ్మణాతిక్రమ దోషంబునకు శంకించి, విద్వజ్జనంబుల రావించి, వారల నుద్దేశించి. 96

క. ముని నీరుసొచ్చి వెడలఁడు, [3]చనియెడు ద్వాదశియు నింతఁ జనియెడు నీలో
[4]నన పారణ చేయవలయు, [5]వినిపింపుం డర్హ మైన విధ మెట్టిదియో. 97

వ. అని పలికిన నా రాజునకు బ్రాహ్మణజను లి ట్లనిరి. 98

ఆ. అతిథి వోయి రామి నధిప! యీ ద్వాదశి
పారణంబు మానఁ బాడిగాదు
గుడువకుండఁ గాదు గుడుచుటయును గాదు
సలిలభక్షణంబు సమ్మతంబు. 99

వ. అని ధర్మసందేహంబు వాపిన, నా రాజర్షిశ్రేష్ఠుండును మనంబున హరిం దలంచి, నీరు పారణంబు సేసి, జలంబుల మునింగిన తపసిరాక కెదురుచూచు చున్న సమయంబున. 100

సీ. యమునలోఁ గృతకృత్యుఁ డై వచ్చి రాజుచే సేవితుం డై రాజచేష్టితంబు
బుద్ధిలో నూహించి బొమముడిమొగముతో నదరెడిమేనితో నాగ్రహించి
రెట్టించి యూఁకలి కొట్టమిట్టాడంగ నీ సంపనున్మత్తు నీ నృశంసు
నీ దురహంకారు నిందఱుఁ గంటిరే విష్ణుభక్తుఁడు గాఁడు వీఁడు నన్నుఁ

---

1. డొక్కట (క. త.) 2. దుర్వాసుఁ డతిథి యయ్యె (తం) 3. చనియెను....జననిదె యూలో (హ) 4. మనపారణయున్ వలయును (ట) 5. వినుఁడర్హంబైన ధర్మ (హ)

తే. గుడువ రమ్మని మునుముట్టఁ గుడిచినాఁడు
ధర్మ భంగంబు సేసి దుష్కర్మఁ డయ్యె
నైన నిప్పుడు సూచెద నన్ని దిశల
నేనుఁ గోపింప మాన్పువాఁ డెవ్వఁ డనుచు. 101

చ. పెటపెటఁ బండ్లు గీఁటుచును భీకరుఁ డై కనుక్రేవ నిప్పుకల్
పొటపొట రాల, గండములు పొంగ, మునీంద్రుఁడు హుంకరింపుచున్
జట మొదలంటఁగాఁ బెటికి చక్కన దానన కృత్య నాయుధో
త్కటఁ [2]వలమాన హస్తయుతఁగా [3]నొనరించె నయించె రాజు పై. 102

క. కాలానల సన్నిభ యై, శూలాయుధహస్త యగుచు సుఅసుఅ స్రుక్కన్
నేలఁ బదంబులఁ ద్రొక్కుచు, వాలి మహాకృత్య మనుజవల్లభుఁ జేరెన్. 103

ఆ. ఆ ప్రకార మెటిఁగి హరి విశ్వరూపుండు
వెట్టితపసి నేయు వేడబంబుఁ
జక్కఁబెట్టు మనుచు చక్రంబుఁ బంచిన
వచ్చె నదియుఁ బ్రళయ వహ్నిపగిది. 104

వ. వచ్చి మునిపంచిన కృత్యను దహించి, తనివి సనక, మునివెంటం బడిన, మునియు మేరుగుహ సొచ్చిన, నదియు వ్యాళంబు వెనుకొను దవానలంబు చందంబునఁ దోన సొచ్చె. మఱియును. 105

మ. భువిఁ దూఱఁ భువిఁ దూఱు నబ్ధిఁ జొర [4]నబ్ధిం జొచ్చు నుద్వేగి యై
దివిఁ బ్రాఁకఁ దివిఁ బ్రాఁకు దిక్కులకుఁ బో దిగ్వీథులం బోవుఁ, జి
క్కి వెసఁ గ్రుంకినఁ గ్రుంగు, నిల్వ నిలుచుఁ, గేడింపఁ గేడించు, నొ
క్కవడిఁ దాపసు వెంటనంటి హరిచక్రం బన్యదుర్వ్రక్ర మై. 106

శా. ఏలోకంబున కైన వెంటబడి తో నేతెంచు చక్రానల
జ్వాలల్ మానుపువారు లేమిఁ జని దేవజ్యేష్ఠు లోకేశు వాఁ
డాలోకించి "విధాత! విశ్వజనన వ్యాపారపారీణ రే
ఖాలీలేఖణ! కావవే కరుణ చక్రంబు న్ని వారింపవే." 107

వ. అనిన బ్రహ్మ యి ట్లనియె. 108

---

1. సూపెద (తం. వా.) మాన్పెద (బ) 2. వనమాలహస్తయును (హ) వరశూలహస్తయును (వా) 3. నొనరించియువై చె (హ) కవించె (వా) 4. నబ్ధుల్ సొచ్చు (తం. వా.)

మ. కర మర్థి ద్విపరార్ధ సంజ్ఞ గల యీ కాలంబుఁ గాలాత్మఁ డై
సారది న్నిండగఁజేసి, లోకముల నాచోటుఁ విభుం డెవ్వఁడో
పరిపూర్తి గనుఁగ్రేవఁ [1]గెంపు లొలుక భస్మంబుగాఁ జేయు నా
హరి[2]చక్రానల లీల కన్యఁ డొకరుం డడ్డంబు గా నేర్చునే. 109

ఆ. ఏను భవుఁడు దక్షుఁ డింద్రాదులునుఁ బ్రజా
పతులు భృగుఁడు భూతపతులు శిరము
లందుఁ దాల్తు మతని యాజ్ఞ జగద్ధితం
బంచు భూరికార్య మతుల మనుచు. 110

వ. కావున సుదర్శన నివారణంబునకు నోపనని, విరించి పలికిన, సంచలించి, దుర్వా
సుండు కైలాసంబునకుం జనుదెంచి, శర్వు నాలోకించి, చక్రానలంబు తెఱం
గెఱింగించిన, న మ్మహాదేవుం డి ట్లనియె. 111

సీ. వినవయ్య! తండ్రి! యే విశ్వేశ్వరునియందుఁ జతురాస్య జీవకోశములు పెక్కు
వేలసంఖ్యలు గూడి వేళతో నిబ్బంగి నగుచుండుఁ జనుచుండు నదియుఁగాక
నె వ్వానిచే భ్రాంతి నే మందుచున్నార మేను దేవలుఁ డసురేంద్ర సుతుఁడు
నారదుఁ డజుఁడు సనత్కుమారుఁడు ధర్మఁ డా కపిలుఁడు మరీచ్యాదు లఖిల

ఆ. [3]నిర్జరులును సిద్ధ [4]నివహ మెవ్వనిమాయ
నెఱుఁగలేము [5]మూల మిట్టి దనుచు
నట్టి నిఖలనాథు నాయుధశ్రేష్ఠంబుఁ
దొలఁగఁజేయ మాకు దుర్లభంబు. 112

వ. మునీంద్రా! నీవు నమ్మహాత్ముని శరణంబు వేఁడుము. అతండు మేలు సేయంగల
వాఁడు. అని పలికిన, నీ శ్వరుని వలన నిరాశుం డై, దుర్వాసుండు వైకుంఠ
నగరంబునకుం జని. 113

శా. ఆ వైకుంఠములోని భర్మ మణి సౌధాగ్రంబు పై లక్ష్మి దాఁ
గ్రేవఁ మెల్లన నర్మభాషణములఁ [6]గ్రీడింపఁ బుణ్యుఁ హరిన్
దేవాధీశ్వరుఁ గాంచి "యో వరద! యో దేవేశ! యో భక్తర
క్షా విద్యా పరతంత్ర! మానుపఁగదే, చక్రానల జ్వాలలన్. 114

---

1. గొలుపన్ భస్మంబులై పోవు (తం.) గదురన్ (వా.) 2. చక్రాకృతివహ్ని (హ)
3. పారవిదులు (తం. వా) 4. పతులు (తం. వా.) 5. దాన నింతవడుదు మట్టి(తం.వా.)
6. గ్రీడించు పుణ్యున్ (తం. వా.)

ఉ. నీ [1]మహిమార్ణవంబు తుది నిక్కముగా నెఱుఁగంగలేక నీ
ప్రేమకు వచ్చు దాసునకుఁ [2]గ్రించుఁ దనంబున నెగ్గుచేసితి
న్నామఱపుఁ సహింపు మట నారకుఁ డైన మనంబులో భవ
న్నామము చింతచేసిన ననంత సుఖస్థితిఁ జెందకుండునే. 115

వ. అని పలికి, పాదకమలంబులకు ప్రొక్కి, లేవకయున్న దుర్వాసునిం గని, హరి
యి ట్లనియె. 116

చ. చలమున బుద్ధిమంతు లగు సాధులు నా హృదయంబు లీల దొం
గిలి గొనిపోవుచుండుదు రకిల్బిష భక్తిలతాచయంబుల
న్నిలువఁగఁ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభి కైవడిఁ
వలలకుఁ జిక్కి భక్తజన వత్సలతఁ జనుచుందుఁ దాపసా! 117

†

ఆ. నాకు మేలుఁ గోరు [3]నాభక్తుఁ డగువాఁడు
భక్తజనుల కేన పరమ గతియు
భక్తుఁ డెందుఁ జనినఁ బఱతెంతు వెనువెంట
గోవు వెంటఁ దగులు [4]కోడె భంగి. 118

వ. అదియునుం గాక. 119

---

1. మడి (హ) 2. బిచ్చతనంబున (హ) 3. కొట్టుదురు(హ)

† 1. చ. శమకరుణా విహారులగు శాంతులు నాదు మనంబు లాలనన్
ప్రగమున యోగమార్గమునఁ గాంచుచు నెప్పుడు గారవంబునన్
మమతను జుట్టికట్టుదురు మచ్చికనే మదదంతి మాడ్కి నా
భ్రమలకు సొక్కి వత్సగతి భద్రముగా చరియింతు భూసురా!

2. చ. క్రతువులు దేవపూజలును కాంచనధేను ముఖప్రదానముల్
వ్రతములు తీర్థయాత్రలును వాసికి నెక్కగ జేయు పుణ్యసం
తతులకు జిక్కి నయ్య తగ తప్పక యెప్పుడు మానసంబులం
దతులిత భక్తి యోగులగు నార్యులకుం బలె సంయమీశ్వరా!

3. చ. పరతరలోక బృందముల భావము నాయది శోక మెన్నగా
నిరతము యోగిచిత్తముల నేను కుతూహల మానసుండ నై
యెరుగుదు నేను యోగులను నెప్పుడు నిశ్చల యోగి సంఘముల్
విరివిగ నాదు చర్యలును వేమరు గాంచుదు రార్య పుంగవా! (జ)

4. గోర నా భక్తులరు కాని (తం) నా భక్తులక కాని (వా) 5. కుట్టి (ట. ద.)

ఆ. తనువు మనువు విడిచి తనయుల చుట్టాల
నాలి విడిచి సంపదాలి విడిచి
నన్నె కాని యన్య మెన్నఁడు నెఱుఁగని
వారి విడువ నెట్టివారి నైన. 120

క. పంచేంద్రియముల తెరువుల, [1]వంచించి మనంబులందు వరమతులు ప్రతి
ష్ఠించి వహింతురు నన్నును, [2]మంచివరున్ బుణ్యసతులు [3]మరగిన భంగిన్. 121

క. సాధుల హృదయము నాయది, సాధుల హృదయంబు నేను జగముల నెల్లన్
సాధుల నేనే యెఱుఁగుదు, సాధు లెఱుంగుదురు నాదు చరితము విప్రా! 122

ఆ. ధారుణీసురులకుఁ దపము విద్యయు రెండు
ముక్తి చేయుచుండు ముదముతోడ
దుర్వినీతు లైన [4]దుర్జన సమితికి
[5]నివియుఁ గీడు సేయ కేల యుండు, 123

క. నాతేజము సాధులలో, నాతత మై యుండు వారి నలఁచు జనులకున్
హేతిక్రియ భీతి నిచ్చును, చేతో మోదంబు చెఱుచు సిద్ధము సుమ్మీ. 124

క. అదె పో బ్రాహ్మణ! నీకును, సదయుఁడు నాభాగసుతుఁడు జనవినుత గుణా
స్పదుఁ డిచ్చు నభయ మాతని, మది సంతసపఱిచి వేఁడుమా శరణంబున్. 125

అధ్యాయము - ౯

మ. అని శ్రీవల్లభుఁ డానతిచ్చిన మహోద్య చ్చక్ర కీలావళీ
జనితాయాసుఁడు నిర్వికాసుఁ డుదిత[7]శ్వాసుండు దుర్వాసుఁ డ
ల్లన యేతెంచి సభక్తిఁ గాంచెఁ గరుణాలావణ్యవేషున్ విదో
షు నయోదారమనీషు మంజు మిత భాషు న్నంబరీషున్ వెసన్. 126

ప. కని, దుఃఖితుం డై, యమ్మహీవల్లభు పాదంబులువట్టి విడువకున్న నా నరేంద్ర
చంద్రుండు చరణ స్పర్శనంబునకు నోడుచుఁ [8]గరుణా పీడిత హృదయుం డై,
హరి చక్రంబు నిట్లని స్తుతియించె. 127

సీ. నీవ పావకుఁడవు నీవ సూర్యుండవు నీవ చంద్రుండవు నీవ జలము
నీవ నేలయు నింగి నీవ సమీరంబు నీవ భూతేంద్రియ నికరములును
నీవ బ్రహ్మంబును నీవ సత్యంబును నీవ యజ్ఞంబును నీవ ఫలము
నీవ లోకేశులు నీవ సర్వాత్మవు నీవ కాలంబును నీవ జగము

---

1. వంచింప (క. చ. త. ద.) 2. పతిన్ (తం) 3. మరగించు క్రియన్ (క.చ.) 4 దుర్జనులకు మీకు (హ) దుర్జనునకు నీకు (క. ద. బ.) 5. విదియుఁ గీడుగాక యేలయుండు (హ) 6. భాగ వతుఁడు (హ) 7. స్వాంతుండు (హ) 8. కరుణారసభరిత (హ. తం. వా.)

తే. నీవ బహుయజ్ఞ భోజివి నీవ నిత్య
మూల తేజంబు నీకు నే ప్రొద్దువాఁడ
నీరజాతుండు చాల మన్నించు నట్టి
శస్త్రముఖ్యమ! కావవే [1]చాలు మునిని. 128

మ. హరిచే నీవు విసృష్ట మై చనఁగ మున్నాలించి నీ ధారలన్
ధరణిఁ ప్రవాలుట నిక్క మంచు మునుపే దై త్యేంద్ర మధ్యంబులన్
శిరముల్ పాదములున్ [2]భుజోరుయుగముల్ చేతుల్ నిజాంగంబులం
దురులఁ ప్రాణసమీరముల్ [3]వెడలు నీ యుద్ధంబులం జక్రమా! 129

ఆ. [4]కలఁగి నిద్రవోవఁ గలలోన వచ్చిన
నిన్నుఁ జూచి దీర్ఘనిద్ర వోదు
రసురవరులు శయ్యలం దున్న సతులు ప్ర
ఖ్యాతమందు లేచి పలువరింప 130

ఉ. చీఁకటి వాపుచుఁ వెలుఁగు సేయుచు సజ్జనకోటి నెల్ల స
శ్రీకులఁ జేయు నీరుచులు చెల్వొగ ధర్మసమేత లై నినున్
వాకున నిట్టి దట్టి దని వర్ణనసేయ విధాత నేరఁ డ
స్తోకము [5]నీదు రూపు గలదుం దుది లేదు పరాత్పరాద్య మై. 131

ఆ. కమలలోచనుండు ఖలుల శిక్షింపంగఁ
[6]బాలుసేయ నీవు పాలు వడితి
వై న నింకఁ జాలు నాపన్నుఁ డై యున్న
తపసిఁ గావు నీవు ధర్మవృత్తి. 132

వ. అని పలికి కేలుఁదమ్మిదోయి నొసటం గదియించి యి ట్లనియె. 133

ఆ. ఏ నమస్కరింతు నింద్రశాత్రవ ధూమ
కేతువునకు ధర్మసేతువునకు
విమల రూపమునకు [7]విశ్వగోపమునకుఁ
జక్రమునకు గుప్త శక్రమునకు. 134

వ. అని మఱియు ని ట్లనియె. 135

---

1. సాధుమునిని (ద) 2. భుజాయుగళముల్ ఛేదింప నంగంబులన్, యొరలన్ (హ) 3. కదలు (హ) 4. కడఁగి (చ. బ.) 5. నీ మహామహిమ దోషనివారి పరాపరాధ్యమే (హ) పరాత్పరాద్యమై (తం. వా.) 6. బాగు (హ) పాలుచేసి నీపు పంపబడితి (చ. ట. ద. క. త.) 7. విశ్వదీపమునకు (హ. వా.)

ఆ. విహిత ధర్మమందు విహరింతు నేనియు
[1]నిష్ట మైన ద్రవ్య మిత్తునేని
ధరణిసురుఁడు మాకు దైవతం బగునేని
విప్రునకు శుభంబు వెలయుఁగాక. 136

క. అఖిల గుణాశ్రయుఁ డగు హరి, సుఖ మై నా కొలువు వలనఁ జొక్కెడి నేనిన్
నిఖలాత్మ మయుం [2]డగుటకు, సుఖమందుం గాక భూమిసురుఁ డి వ్వేళన్. 137

వ. అని, యి వ్విధంబునం బొగడు పుడమిఱేనివలన మన్నించి, తపసిని దాహంబు
నొందింపక, రక్కసుల గొంగ చక్రంబు తిరిగి చనియె. అంత దుర్వాసుండు
శాంతిం బొంది, మెల్లని మేలిమి మాటల నా రాజుం దీవించి, యి ట్లనియె.

మ. నరనాథోత్తమ! మేలు సేసితి కదా నా తప్పు మన్నించి శ్రీ
హరి పాదాబ్జము లింత ముట్టఁ గొలుతే యాశ్చర్య మౌ [3]నెన్నఁ చో
నరుదండ్రఁ జే నిబోఁటి సాధులకుఁ దా నై యిచ్చుటల్ గాచుటల్
సొరిదిన్ నై జగుణంబు లై సరస వచ్చుం గాదె మిత్రాకృతిన్ 139

వ. అదియునుం గాక. 140

మ. ఒకమా ఱెవ్వని పేరు కర్ణములలో నొయ్యార మై సోఁకినన్
సకలాఘంబులు పల్లటిల్లి తొలఁగున్ సంభ్రాంతితో నట్టి స
త్సుకరున్ మంగళతీర్థపాదు హరి విష్ణున్ దేవదేవేశుఁ దా
రకలంకస్థితిఁ గొల్చు భక్తులకు లే దడ్డంబు రాజాగ్రణీ! 141

మత్తకోకిల. [4]తప్పు లోఁగొని చక్రపావక దాహముం బెడఁబాపి తా
నొప్పు నొప్పు భవద్దయారస మో నరేశ్వర! ప్రాణముల్
చెప్ప మున్మును బోయి క్రమ్మఱఁ జేరె ధన్యుఁడ నై తి నీ
కెప్పుడున్ శుభ మేను గోరెద నింకఁ బోయెద భూవరా! 142

క. అనిన విని రాజముఖ్యుఁడు, మునివల్లభు పాదములకు ప్రొక్కి కడున్ మ
న్నన సేసి యిష్టభోజన, మనువుగఁ బెట్టించెఁ దృప్తుఁ డయ్యె నతండున్. 143

వ. మఱియు న మ్మునీంద్రుం డి ట్లనియె. 144

---

1. ఇష్టభద్రమడుగ (చ. ట.); ఇష్టద్రవ్య మడుగ (జ. ద. బ.) 2. అగుటను (తం).
3. నై నచో (హ) 4. తప్పులుం గొని (హ)

శా. [1]కంటి న్నేటికి నిన్ను నీ వచనముల్ కర్ణద్వయ ప్రీతిగా
వింటి న్నన్నముఁ గొంటి నీ గృహమునఁ వేడ్కఁ ఫలం బబ్బె నే
మంటిఁ బోయెద నీ చరిత్ర మమరుల్ మర్త్యుల్ సుఖాసీను లై
మింటఁ మేదిని సన్నుతింపఁ గల రీమీఁద న్నరేంద్రాగ్రణీ ! 145

వ. అని చెప్పి, దుర్వాసుం డంబరీషుని దీవించి, కీర్తించి, మింటితెరువున బ్రహ్మలోక మునకుం జనియె. మునీశ్వరుండు తిరిగి చనువేళకు నొకసంవత్సరంబు నిండి, వ్రతంబు పరిపూర్ణం బయిన. 146

ఆ. అవనిసురుఁడు గుడువ నతిపవిత్రం బైన
వంటకంబు భూమివరుఁడు గుడిచెఁ
[2]దపసి నెగులు మాన్పఁ దా నెంతవాఁడను
హరి కృపామహత్త్వ మనుచుఁ దలఁచి. 147

వ. మఱియును. 148

క. హరిఁ గొల్చుచుండువారికిఁ, బరమేష్ఠిపదంబు మొదలు [3]పదభోగంబుల్
నరకసమం బని తలఁపున, ధరణీరాజ్యంబుతోడి తగులము మానెఁ. 149

వ. ఇట్లు విరక్తుం డై. 150

ఆ. తనకు సదృశు లైన తనయుల రావించి
ధరణిభరము వారిఁ దాల్పఁ బంచి
కాననంబు సొచ్చె కామాది విజయుఁ డై
నరవిభుండు హరిసనాథుఁ డగుచు. 151

క. ఈ యంబరీషు చరితము, తీయంబున విన్నఁ జదువ ధీసంపన్నుం
డై యుండును భోగపరుం, డై యుండును నరుఁడు పుణ్యుఁడై యుండు నృపా !

అధ్యాయము - ఓ

వ. †వినుము మ య్యంబరీషునకు విరూపుండును, కేతుమంతుండును, శంభుండు ననువారు మువ్వురు కొడుకులు. అందుఁ గేతుమంతుండును, శంభుండును హరింగూర్చి తపంబుసేయువా రై, వనంబునకుం జనిరి. విరూపునికిఁ బృషదశ్వుండును, బృషదశ్వునకు రథీతరుండును గలిగిరి. అమ్మహాత్మునికి సంతతి లేకున్న నంగిరసుఁడను

---

1. కంటిన్నంటితి నిన్ను(క.ట.త.జ.డ.బ.) 2.దపసి యెలుఁగుమాన్ప(హ) 3. పరభోగంబుల్ (హ)

† చ. డ. బ. ప్రతులలో నంబరీషునకు సురూపుఁడను నార్గవ కొడుకుండె ననియు, నతఁడు వ్యాఘ్రు నిహతుఁ డయ్యెననియుఁ గలదు.

మునీంద్రుం డతని భార్యయందు బ్రహ్మతేజోధను లైన కొడుకులం గనియె. వారలు రథీతరగోత్రులు, నాంగిరసు లను బ్రాహ్మణులు నై, యితరులందు ముఖ్యు లై ప్రవర్తిల్లిరి. అని చెప్పి శుకుం డిట్లనియె. 153

—: ఇక్ష్వాకు వంశానుక్రమము :—

క. ఒకనాఁడు మనువు దుమ్మిన, వికలుఁడు గా కతని [1]ఘ్రాణవివరము వెంటన్
బ్రకటయశుం డిక్ష్వాకుం, డకలంకుఁడు పుట్టె [2]రవికులాధారుం డై. 154

సీ. ఇక్ష్వాకునకుఁ బుత్రు లెలమిఁ బుట్టిరి నూర్వు రమర వికుక్షియు నిమియు దండ
కుండు నాతని పెద్దకొడుకులు మువ్వు రా ర్యావర్తమందు హిమాచలంబు
వింధ్యాద్రిమధ్య ముర్వీమండలము కొంత యేలిరి యిరువదియేగు రొక్క
పొందుగ నా తూర్పుభూమి పాలించిరి [3]యందఱు పడమటి కధిపు లైరి

తే. యున్న నలువదియేడ్గురు నుత్తరోర్వి
దక్షిణోర్వియుఁ గాచిరి తండ్రి యంత
నష్టకాశ్రాద్ధ మొనరింతు ననుచు నగ్ర
సుతు వికుక్షి నిరీక్షించి శుద్ధ మైన
మాంసఖండంబుఁ దెమ్మనె మహితయశుఁడు. 155

మ. అగుఁగా కంచు వికుక్షి వేఁటసని ఘోరారణ్యభూమిం దగన్
మృగసంఘంబులఁ జంపి బిట్టలసి తా మేనొల్లఁబో నాఁకటన్
సగ మై యొక్క శశంబుఁ బట్టి తిని శేషం బైన మాంసంబు శీ
ఘ్రగతిం దండ్రికిఁ దెచ్చి యిచ్చె నకలంకస్ఫూర్తి వర్తిల్లఁగాన్. 156

తరల. కులగురుండు వసిష్ఠుఁ డంత వికుక్షి కుందెలు దింట లో
పల నెఱింగి యనర్హా మెంగిలి పైతృకం బొనరింపఁగా
వలదు వీఁడు దురాత్మకుం డన వాని తండ్రియు వానిఁ జెం
తలను జేరఁగనీక దేశము దాఁటిపో నడిచెన్ వడిన్. 157

ఆ. కొడుకు వెడలఁగొట్టి గుణవంతుఁ డిక్ష్వాకుఁ
డా వసిష్ఠుఁ డేమి యానతిచ్చె
నదియుఁ జేసి యోగి యై వనంబునఁ గళే
బరము విడిచి ముక్తిపదము నొందె. 158

---

1. ఘ్రాణరంధ్రము వెంటన్ (హ) 2. రవికులాధీశుం డై (హ. తం. వా) 3. కొందఱు(హ)

చ. జనకుఁడు ముక్తిఁ బొంద నయశాలి వికుక్షి శశాదు డంచు భూ
జనులు నుతింప నీ ధరణిచక్ర మశేషము నేలి యాగముల్
గొనకొని చేసెఁ బ్రీతి హరిఁగూర్చి పురంజయుఁ బుత్రుఁ గాంచెఁ బే
ర్కొనె నమరేంద్రవాహుఁడుఁ గకుత్స్థుఁడు నంచును వాని లోకముల్. 159

సీ. కృతయుగాంతంబున దితిసుతామరులకు రణ మయ్యె నందులో రాక్షసులకు
నమరవల్లభుఁ డోడి హరితోడఁ జెప్పిన జలజనేత్రుఁడు పురంజయునియందు
వచ్చి నే నుండెద వాసవ ! వృషభంబ వై మోవు మని పల్క నమరవిభుఁడు
గోరాజమూర్తిఁ గకుత్ప్రదేశంబున నా పురంజయు మోచె నంత నతఁడు

తే. విష్ణుతేజంబు దనయందు విస్తరింప
దివ్యచాపంబు చేపట్టి దీర్ఘ నిశిత
బాణములఁ బూని వేల్పులు ప్రస్తుతింప
†నంతకాలాగ్ని చాడ్పున ననికి నడచె. 160

చ. నడచి శరావళిం దనుజనాథుల మేనులు చించి కంఠముల్
దొడిఁ దొడిఁ ద్రుంచి కాలుపురి త్రోవకుఁ గొందఱఁ బుచ్చి కొందఱ
వడి నురగాలయంబున నివాసము సేయఁగఁ దోలి యంత నూ
రడక నిశాచరేంద్రుల పురంబులు గూల్చె పురంజయాఖ్యుఁడై 161

వ. ఇ ట్లవిధంబున శశాదపుత్రుండు, రాక్షసుల పురంబులు జయించిన కతనం, బురంజ
యుండును, వృషభరూపుం డై యింద్రుండు వాహనం బగుటంజేసి యింద్ర
వాహనుండును, నతని మూఁపురం బెక్కి రణంబు సేసినకారణంబునఁ గకుత్స్థుం
డును నన నీ మూఁడునామంబులఁ బ్రసిద్ధికెక్కి, దైత్యుల ధనంబుల నింద్రుని
కిచ్చె. అ ప్పురంజయునిపుత్రుం డనేనసుండు. అతనిపుత్రుండు పృథుండు. పృథుని
కొడుకు విశ్వగంధుండు. విశ్వగంధు నందనుండు చంద్రుఁడు. చంద్రసుతుండు
[1]యవనాశ్వుండు. యవనాశ్వ తనూభవుండు శవస్తుండు. అతండు శావస్తినామ
నగరంబు నిర్మించె. శవస్తతనయుండు బృహదశ్వుండు. బృహదశ్వునకుఁ గువల
యాశ్వుండు జనించె. ఆ నరేంద్రచంద్రుండు. 162

క. లావు మెఱసి యిరువదియొక, వేవురు నందనులుఁ దాను వీరుఁ డతఁడు భూ
దేవుఁ డుదంకుఁడు వనుప దు, రావహుఁ డై చంపె దుందు [2]నమరాబంధున్.

వ. అది కారణంబుగా దుందుమారుం డన నెగడె. అ య్యసుర ముఖానలంబునఁ
గువలయాశ్వు కుమారు లందఱు భస్మం బైరి. అందు దృఢాశ్వుండును, గపి

---

† అంతఁ గాలాగ్ని (తం. వా.) 1. యవనాశ్వుండు (తం. వా.) 2. నామాపమందున్ (ద)

లాశ్వుండును, భద్రాశ్వుండును ననువారలు ముగ్గురు చిక్కిరి. అందు దృఢాశ్వునకు హర్యశ్వుండును, హర్యశ్వునకు నికుంభుండును, నికుంభునకు బర్హిణాశ్వుండును, బర్హిణాశ్వునకుఁ గృతాశ్వుండును, గృతాశ్వునకు సేనజిత్తును, సేనజిత్తునకు యువనాశ్వుండును జనియించిరి. అ య్యువనాశ్వుండు గొడుకులు లేక నూర్వురుభార్యలుం, దానును నివ్వెఱపడియుండ, నా రాజునకు మునులు కృపసేసి, యింద్రునిఁ గూర్చి సంతతికొఱకై యైంద్రయాగంబు సేయించిరి. అందు. 164

సీ. భూమీశు భార్యకుఁ బుత్రలాభమునకై పోయు తలంపున భూమిసురులు
జలమును మంత్రించి జలకలశము దాఁచి నియమంబుతోఁ గూడి నిద్రవోవ
ధరణీశ్వరుఁడు [1]పేరు దప్పితో నా రాత్రి ధృతిలేక యజ్ఞమందిరముఁ జొచ్చి
యా నీరుఁ ద్రావిన నంత మేల్కని వార లెవ్వఁడు ద్రావె నీ రెందుఁ బోయె

ఆ. ననుచు రాజు ద్రావు టంతయు భావించి
యెఱిఁగి చోద్య మంది యీశ్వరాజ్ఞ
యెవ్వఁ డోపుఁ గడవ నీశ్వరునకు నమ
స్కార మనుచు నేది కార్య మనుచు. 165

వ. వారలు దుఃఖింపుచుండునంతఁ గొంత తడవునకు యువనాశ్వుని కడుపు వ్రక్కలించుకొని, చక్రవర్తి చిహ్నంబులు గల కుమారుండు జన్మించి, తల్లి లేని కతంబునఁ గడుపునకు లేక యేడ్చుచుండ, నింద్రుండు వచ్చి, శిశువునకు నాఁకలి దీఱుకొఱకు వాని నోటం దన ప్రేలిడినం, ద్రావెడి కతంబున వానిపేరు మాంధాత యని నిర్దేశించి చనియె. ఇ వ్విధంబున. 166

ఆ. కడుపు పగుల ముద్దు కొడుకు జన్మించిన
[2]తీఱఁ డయ్యెఁ దండ్రి దేవ విప్ర
కరుణ నట్లకాదె కడిది దైవము లావు
కలుగువాఁడు బ్రతుకుఁగాక చెడునె. 167

వ. ఇట్లు బ్రతికియున్న యువనాశ్వుండు, గొంతకాలంబునకుఁ దపంబుసేసి, సిద్ధిం బొందె. అంత. 168

---

1. నీరు (హ) 2. ధీరుఁడయ్యె (హ)

సీ. పడమటఁ బొడమెడు బాలచంద్రునిమాడ్కిఁ బూఁటపూఁటకు వృద్ధిఁబొందెబాలుఁ
డల్లన పరిపూర్ణ యౌవనారూఢుఁ డై రావణాది రిపుల రాజవరుల
దండించి తనుఁ ద్రసదస్యుఁ డంచు సురేంద్రుఁ డంకింప శూరుఁ డై యఖలదేవ
మయ నతీంద్రియ విష్ణు మాధవు ధర్మాత్మ నజుని యజ్ఞాధీశు నాత్మఁగూర్చి

తే. చేసెఁ గ్రతువులు భూరి దక్షిణల నిచ్చి
ద్రవ్య యజమాన విధి మంత్ర ధర్మ యజ్ఞ
కాల బుత్వి క్ప్రదేశ ముఖ్యంబు లెల్ల
విష్ణురూపంబు లనుచు [1]భావించి యతఁడు. 169

క. [2]బలిమి నడంచుచు నరులం, జలి వెలుఁగున్ వేఁడి వెలుఁగుఁ జనుచో చెల్లన్
జలరుహనయనుని కరుణను, జెలువుగ మాంధాత యేలె సిరి నిండారన్. 170

వ. అంత నా రాజునకు శతబిందు కూఁతు రగు బిందుమతియందుఁ బురుకుత్సుండును, నంబరీషుండును, ముచుకుందుండును ననువారు ముగ్గురు కొడుకులు, నేఁబండ్రు కూఁతులుం జనియించి, పెరుఁగుచున్న యెడ. 171

సీ. యమునా జలములోన నధికుఁడు సౌభరి తపము సేయుచు జల స్థలమునందుఁ
బిల్లలుఁ దన ప్రాణవల్లభయునుఁ గూడి మెలఁగ నానందించు మీనరాజుఁ
గనుఁగొని సంసార కాంక్షి యై మాంధాత నొకకన్య నడుగ నృపో త్తముండు
తరుణి నిత్తును స్వయంవరమునఁ జేకొను మనవుడు ననుఁ జూచి యౌవనాంగి

ఆ. యేల ముసలిఁ గోరు నిట్టట్టు వడఁకెడి
వాఁడఁ జూల నరసినాఁడ నొడల
జిగియు బిగియు లేని శిథిలుండఁ గరఁగింపఁ
బాలఁ దిగిచికొను నుపాయ మెట్లు.

వ. అదియునుం గాక.

ఆ. బాల పువ్వుఁబోణి ప్రాయంపు వానినిఁ
జెన్నువాని ధనముఁ జేర్చువాని
మరగెనేని కొంత మరగుఁగా కెదిరిఁ ద
న్నెఱిఁగి ముసలి తపసి నేల మరగు. 174

వ. అని విచారించి సౌభరి తన తపోబలంబునం జేసి ముసలితనంబు విడిచి, యెల ప్రాయంపుఁ గొమరుం డై, యలంకరించికొని, ముందట నిలువంబడిన, మాంధా

---

1. భావించె నతఁడు (హ) 2. బలిమి నిలనేడు చెరగుల (క-బ)

తయుఁ గన్నియల నగరు గాచికొని యున్న వారికి సెలవు సేసిన, వా ర
మ్మునీంద్రుని, నా రాజపుత్రిక లున్న యెడకుం గొనిపోయి చూపిన. 175

ఉ. కోమలులార ! వీఁడు నలకూబరుఁడో మరుఁడో జయంతుఁడో
యేమటి వచ్చె వీనిఁ దడ వేల వరింతుము, నేమ నేమ యం
చా మునినాథుఁ జూచి చలితాత్మిక లై సొరిదిన్ వరించి రా
భామిను లందఱుఁ గుసుమబాణుఁడు ఘీ యని ఘంట ప్రేయఁగఁ. 176

వ. ఇట్లు రాజకన్యకల నందఱం జేకొని, సౌభరి నిజ తపఃప్రభావంబున, ననేక లీలా
వినోదంబులు గల్పించి. 177

సీ. గృహరాజములయందుఁ గుసుమవల్లులయందుఁ [2]గోలాహలంబై నఁ గొలఁకులందుఁ
గలకంఠ శుక మధుకర నినాదములచే వర్ణ నీయము లై న వనములందు
మణివేదికలయందు మహనీయ పర్యంక పీఠ లీలాశై ల బిలములందు
శృంగారవతు లగు చెలువలు పలువురు తన పంపుసేయ సుస్థలములందు

తే, వస్త్ర మాల్యానులేప సువర్ణహార
భూరి సంపద నిష్టాన్నభోజి యగుచుఁ
బూఁటపూఁటకు నొక [3]వింత పొలుపు దాల్చి
రాజకన్యల నందఱ రతులఁ దేల్చె. 178

క. పెక్కండ్రు రాజముఖులకు, నొక్కఁడు మగఁ డయ్యుఁ దనియకుండె మునీంద్రుం
డెక్కుడు ఘృతధారలచే, నక్కజ మై తృప్తిలేని యనలుని భంగిఁ. 179

వ. ఇ వ్విధంబున. 180

క. ఆరామంబున మునివరుఁ, డా రామలతోడ బహు [4]విహారములుఁ జై
[5]పోరాములఁ దన కిట్టటు, [6]పోరాములఁ జేసి కొన్ని ప్రొద్దులు పుచ్చెన్. 181

వ. అంత నొక్కనాఁడు మేదినీవల్లభోత్తముం డగు నా మాంధాత, మునీశ్వరుం
డెందు వోయె. కూఁతు లెక్కడ నలజడి పడుచున్నవారలో. అని తలంచి,
వెదకవచ్చి, యొక్క మహానగంబున, మణిమయ సౌధంబులం, జక్రవర్తియుం
బోలెఁ బ్రీడించుచున్న తాపసరాజుం గని, సంతసించి, వెఱఁగుపడి, మన్ననలం
బొంది, మెల్లన కూఁతులం బొడగని, సత్కరించి యిట్లనియె. 182

క. నాతోడులార ! మీపతి, [4]మీతోడిద పనులయెడల మేలే యనుడున్
"నాతోడిదె నాతోడిదె, తాతా ! మే"లనుచు ననిరి తరుణులు వరుసన్. 183

---

1. కృతకాచలములందు (తం.వా.) 2. కలువలు విలసిల్లు 3. కొంత (హ) 4. విహారమయుం డై (హ) 5, గారాముల (హ) 6. పోరాములుచేసి (హ. తం. వా.) 7. మీతోడే (వా)

వ. అంత గొంతకాలంబునకు బహు భార్యాచర్యం డగు సౌభరి, యేకాంతంబునఁ దన్నుఁ దానె చింతించుకొని, మీన మిథున సంగదోషంబునం గాఁపురంబు దనకు నగపడుట యెఱింగి, పశ్చాత్తాపంబున ని ట్లనియె. 184

మ. ఉపవాసంబుల డయ్యుటో విషయ సంయోగంబు వర్జించుటో
తపముం బూని చరించుటో హరి పద ధ్యానంబునన్ నిల్చుటో
యపలాపంబున నేల పొందితి హతం బయ్యెం దపం బెల్ల నీ
కపటస్త్రీ పరిరంభముల్ మునులకుం గైవల్య సంసిద్ధులే. 185

చ. మని యఁట తత్త్వవేది యఁట మోక్షముగాని సుఖంబు లెవ్వియుం
జన వఁట కాంత లేఁబ దఁట సౌధచయం బఁట వాసదేశముం
దనయులు నైదువే లఁట నిదానము మీనకుటుంబి సౌఖ్యముం
[1]గను టఁట చెల్లరే నగవు గాక మహాత్ములు సూచి మెత్తురే. 186

ఆ. తపము సేయువాఁడు తత్త్వజ్ఞుఁ డగువాఁడు
నెలమి మోక్ష మిచ్చయించువాఁడు
నేకతంబు విడిచి యేర్పడ నేరఁడు
కాఁపురంబుసేయు కఱటి తపసి. 187

వ. అని దుఃఖించి, తనుం దాన [2]నిందించికొని, తన వేడబంబు విచేఁపుచు, నివా పరసాధకుం డై, కాఁపురంబు విడిచి, సతులుం దానును వానప్రస్థ ధర్మంబున నడవికిం జని, ఘోరతపంబు సేసి, శరీరము గుదియించి, యగ్ని సహితుం డై, పరబ్రహ్మంబు సొచ్చె. అంత. 188

క. మునిపతి వనమున కరిగిన, వనితలు తో నరిగి ప్రాణవల్లభు గతికిం
జనిరి వెనుదగిలి విడువక, ననలముతో శిఖలు నీఱువ కరిగిన భంగిన్.

అధ్యాయము - ఴ

వ. అంత మాంధాత పెద్దకొడు కగు [3]నంబరీషుని, వాని పితామహుండగుటం జేసి, యువనాశ్వుండు దనకుం బుత్రుండు గావలయు నని కోరి పుచ్చికొనియె. అ య్యంబరీషునకు యౌవనాశ్వుండు, నతనికి [4]హారితుండు జనియించిరి. అది కారణంబున నంబరీష యౌవనాశ్వ హారితులు మాంధాతృ గోత్రంబునకుం బ్రవరు లై రి. మాంధాత రెండవ కొడుకు పురుకుత్సుండు. అతని నురగలోకంబునకుం గొనిపోయి భుజంగకుమారులు దమ చెల్లె లగు నర్మద యను కన్యకను వివా

---

1. గనునట (హ) 2. చింతించికొని (హ) 3. అంబరీషుండు (హ) 4. హారివరుండు (హ)

హంబు చేసిరి. పురుకుత్సుండును, నక్కడ ననేక గంధర్వ నాయకుల వధించి, తన నాగలోకసంచరణంబు దలంచువారికి, నురగ భయంబు లేకుండ వరంబు వడసి తిరిగివచ్చె. ఆ పురుకుత్సునకుఁ ద్రసదస్యుండుఁ, ద్రసదస్యున కనరణ్యుండు, న య్యనరణ్యునకు హర్యశ్వుండు, హర్యశ్వునకు [1]నరుణుండు, నరుణునకుఁ ద్రిబంధనుండుఁ, ద్రిబంధనునకు [2]సత్యవ్రతుండును జనించిరి. ఆ సత్యవ్రతుండుఁ ద్రిశంకుం డనం బరఁగె. 190

సీ. గురు శాపవశమునఁ గూలి చండాలుఁ డై యనఘాత్మఁ గౌశికు నాశ్రయించి
యతనిలావున దివిజాలయంబున కేఁగ మన్నింప కమరులు మరల ద్రొబ్బ
దలక్రిందుగాఁ బడి దైన్యంబుతో రాఁగఁ గౌశికుం డప్పటి ఘనత మెఱసి
నిలిపె నాకసమున నేఁడు [3]నుఁవ్వాఁడు త్రిశంకుఁ డాతఁడు హరిశ్చంద్రుఁ గనియె

తే. నా హరిశ్చంద్రుఁ గౌశికుఁ డర్థిఁ జేరి
యాగదక్షిణ మిషమున నఖిలధనముఁ
గొల్లఁగొని మీఁదఁ గులహీనుఁ గొలువఁ [4]బెట్ట
బొంక కలజడిఁ బొందె నా భూవరుండు. 191

వ. ఇట్లు విశ్వామిత్రుండు హరిశ్చంద్రు నెగులువఱచుట విని, వసిష్ఠుండు, విశ్వామిత్రుని గృధ్రము గ మ్మని శపించె. విశ్వామిత్రుఁడును వసిష్ఠుని బకంబు గ మ్మని శపించె. పక్షిరూపు లయ్యును నా యిరువురు యుద్ధంబు సేసిరి. బ్రహ్మ వారించి యెప్పటి నిజాకృతులుగా నొసరించె. అంత హరిశ్చంద్రుండు పుత్రులు లేక, నారదు నుపదేశంబున వరుణోపాసన నతిభక్తితోఁ జేయ, నా వరుణుండు ప్రత్యక్షుం బై న, నతనికి ప్రొక్కి యిట్లనియె. 192

ఆ. వరుణదేవ! నాకు వర వీరగుణములఁ
గొడుకు పుట్టెనేనిఁ గొడుకుఁ బట్టి
పశువుఁ జేసి నీవు పరిణమింపఁగ వేల్తుఁ
గొడుకు నీఁగదయ్య కొసరు లేక. 193

వ. అని పలికినం, గుమారుండు గలిగెడు నని, వరుణుండు వరమిచ్చి చనియె. అంత హరిశ్చంద్రునకు వరుణప్రసాదంబున, రోహితుం డను కుమారుఁడు జన్మించె. వరుణుండును హరిశ్చంద్రకుమారు నుద్దేశించి. 194

---

1. "ఉరుణః"అని మూలము(7-5) 2. సత్యవ్రతుండు, సత్యవ్రతునకు ద్రిశంకుండు జన్మించె(హ)
3. నున్నట్టి (హ) 4. ఁబెట్టి (హ)

సీ. పురిటిలోపల వచ్చి పుత్రు వేలువు మన్నఁ బురుడు వెళ్ళినఁ గాని పొసఁగ దనియెఁ
బలు రాక మునువచ్చి బాలు వేలువు మన్నఁ బండ్లులేకున్న నభావ్యఁ డనియెఁ
బండ్లు రాఁ జూచి డింభకుని వేలువు మన్నఁ బడిపండ్లు రామి నభావ్యఁ డనియెఁ
బడిపండ్లు వొడమినఁ గొడుకు వేలువు మన్నఁ బోరుల కొదవక పొసఁగ దనియెఁ

ఆ. దొడరి యిట్లు కొడుకుతోడి మోహంబునఁ
బ్రొద్దుఁ గడపుచుండె భూవరుండు
దండ్రి తలఁపుకొలఁదిఁ దనలోనఁ జింతించి
యింటనుండ కడవి కేఁగెఁ గొడుకు. 195

వ. ఇట్లు వనంబునకుం జని, శర శరాసనధరుం డై, రోహితుండు దిరుగుచుండి, వరుణగ్రస్తుం డై, హరిశ్చంద్రుండు, మహోదరవ్యాధిచేఁ బీడితుండుగా నుండుట విని, పురంబునకుం దిరిగి రా గమకింప, నింద్రుండు ముసలితపసి యై వచ్చి, యి ట్లనియె. 196

ఆ. పుణ్యభూము లరుగు పుణ్యతీర్థంబులఁ
గ్రుంకు పుణ్యజనులఁ గోరి చూడు
పుణ్యకథల వినుము భూపాలపుత్రక !
మేలు గలుగు [1]నింటిమేర వలదు. 197

వ. అని యిట్లు మగుడించినం, దిరిగి రోహితుం డొక్కయేఁ డ వ్వనంబునం దిరిగి, క్రమ్మఱఁ జనుదేర, నింద్రుండు వచ్చి, తొంటియట్ల నివారించె. ఇ ట్విధంబున.

సీ. ఐదేళ్ళు మరలించె నమరేంద్రుఁ డా బాలు నాఱవయేఁట వాఁ డడవినుండి
యింటికి వచ్చుచు నెలమి [2]నజీగర్తు మధ్యమపుత్రు సమ్మాన్యచరితు
ఘను శునశ్శేపునిఁ గొని యాగపశువుగ నా హరిశ్చంద్రున కాతఁ డిచ్చెఁ
బురుష మేధము సేసి భూపాలవర్యుఁడు [3]వరుణాది నిఖలదేవతలఁ దనిపె

తే. హోత కౌశికుఁ డధ్వర్యుఁ డొనర భృగుఁడు
బ్రహ్మ జమదగ్ని సామంబు పాడువాఁడు
ముని వసిష్ఠుఁ డా మఖమున ముదముఁ బొంది
కనకరథ మిచ్చె నింద్రుఁ డా మనుజపతికి. 199

వ. శునశ్శేపుని ప్రభావంబు వెనుక వివరించెద. అంత భార్యాసహితుం డై న, హరిశ్చంద్రువలనం బ్రీతుం డై విశ్వామిత్రుం డతనికి ముఖ్యజ్ఞానంబు కృపసేసిన,

---

1. నట్టిమేఱగలదు (హ. వా.); మేరవలదు (క. బ.) 2. నజగర్తు (హ) 3. వరుణుఁ డాదిగ దేవతలను దనిపి (హ)

మనం బన్నమయంబు గావున, మనంబున నన్నరూప మైన పృథివి నెఱింగి, పృథివిని జలంబువలన నణంచి, జలంబు తేజంబువలన నింకించి, తేజంబు వాయువు వలనం జేర్చి, వాయువు నాకాశంబునం గలిపి, యాకాసంబు దామసాహం కారంబునందు లయంబుచేసి, [1]యహంకార త్రయంబు మహత్తత్త్వంబునందు డిందించి, పరతత్త్వంబునకు లోకంబునుసృజించెదనను తలంపైన,మహత్తత్త్వంబు నందుల విషయాకారంబు నివర్తించి, విషయవివర్జితుం డై, మహత్తత్త్వంబును బరతత్త్వంబు గా నెఱుంగుచు, న య్యేఱుకవలన సంసారహేతు వైన ప్రకృతిని భస్మంబు సేసి, య య్యేఱుకను నిర్వాణసుఖ పారవశ్యంబునం బరిహరించి, సకల బంధవిముక్తుం డై, హరిశ్చంద్రుం డవాఙ్మానస గోచరం బైన నిజ రూపంబుతో వెలుంగుచుండె.

అధ్యాయము - ౯

అతని కుమారునకు హరితుండు వుట్టె. హరితునకు జంపనామధేయుండు జని యించె. అతండు దనపేర జంపానగరంబు నిర్మించె చంపునకు సుదేవుండు, సుదేవునికి విజయుండు, విజయునకు రురుకుండు, రురుకునకు వృకుండు, వృకు నకు బాహుకుండు జనియించిరి. అందు బాహుకుండు. 200

సీ. దండించి పగవారు తనభూమిఁ జేకొన్న నంగనలునుఁ దాను నడవి కేఁగి
యడవిలో ముసలి యై యాతఁడు సచ్చిన నాతని భార్యఁ దా ననుగమింపఁ
గదియుచో నా స్త్రీకి గర్భంబుగలుగుట యౌర్వ మునీశ్వరుఁ డాత్మ నెఱిఁగి
వారించె నంతన వనజాక్షి సవతులు సూలు నిండారినఁ జూడఁజాల

తే. కర్థి నన్నంబు గుడుచుచో నందుఁ గలిపి
విషము పెట్టిరి పెట్టిన విరిసిపడక
గరముతోఁగూడ సగరుండు ఘనుఁడు పుట్టె
వర యశస్సూ్ఫర్తితోఁ జక్రవర్తి యయ్యె. 201

శా. చండస్ఫూర్తి నతండు దండ్రి పగకై సంగ్రామరంగంబులఁ
జెండెఁ హైహయ బర్బరాదుల వధించెఁ దాళ జంఘాదులఁ
ముండీభూతులుగా నిరంబరులుగా మూర్తుల్ సబీభత్సు లై
యుండం జేసె నిజారులఁ సగర నామోర్వీవిభుం డల్ఫుఁడే. 202

క. ఖగరాజరుచులు గల [2]యల, పగరాజుల నడఁచి యేలె బాహాళ క్తిఁ
నగరాజధీరు భూరుఁ, సగరుఁ హత విమత[3]నగరుఁ జను వినుతింపఁ. 203

---

1. యహంకారంబు మూటిని (హ) 2. యిలఁ (తం. వా.) 3. నిఖలజనులు నుతింపన్ (హ)

సీ. ఔర్వుండు నెప్పఁగ నమర వేదాత్మకు హరి నీశు నమృతు ననంతుఁ గూర్చి
వాజిమేధంబులు వసుధేశ్వరుఁడు సేసె నం దొక్కమఖమున హయము విడువ
నగభేది గొనిపోయి నాగలోకంబునఁ గపిలునిచేరువఁ గట్టి తొలఁగె
నంత గుఱ్ఱముఁ గాన కా రాజు తనపుత్ర నివహంబు దిశలకు [1]నెమకఁ బంపె

తే. వారు నిల యేడుదీవులు వరుస వెదకి
మఖతురంగంబు లేకున్న మగుడి రాక
ప్రాభవంబున దోర్దండబలము మెఱసి
[2]గ్రొచ్చి కోరాడి త్రవ్విరి కుతల మెల్ల. 204

వ. ఇట్లు [3]వసుమతీశు కొడుకులు నేలఁ ద్రవ్వి, పాతాళంబునం దూర్పు ముట్టియున్న
యుత్తరభాగంబునం గపిలమునిఁ బొంత నున్న తురంగంబుఁ గని. 205

చ. ఎటీఁగితి మద్దిరయ్య! తడ వేటికి [4]గుఱ్ఱపుదొంగ యీతఁడే
గుఱుతుగఁ బట్టి చంపుఁ డతిఘోర మునీంద్రుఁడుఁ వోలె నేత్రముల్
[5]దెఱవక బాకినోరు మెదలింపక పైసుకపట్టె నంచుఁ న
య్యఱువదివేవురు న్నిజ కరాయుధముల్ జళిపించి డాయుచోఁ. 206

చ. కపిలుఁడు నేత్రముల్ దెఱవఁగాఁ దమ మేనుల మంటవుట్టి తా
రపగతధైర్యు లై పడి యహంకరణంబున మూఢచిత్తు లై
నృపసుతు లందఱున్ ధరణి నీఱయి రా ఋణమంద సాధులం
దపసులఁ గాసివెట్టెడి మదస్ఫురితాత్ములు నిల్వనేర్తు రే. 207

సీ. కొందఱు కపిలుని కోపానలంబున ద్రుందిరి సగరకుమారు లనుచు
నందు రా ముని శాంతుఁ డానందమయమూర్తి తొడరి కోపించునే దువ్వ నేలఁ
గాక జన్మించునే గగనస్థలంబున నే సాంఖ్యమతమున నిద్ధమతులు
భవసముద్రము మృత్యుపదమును లంఘింతు రా బుద్ధిఁ జేయు పరాత్మభూతుఁ

తే. డఖిలబోధకుఁ డతనికి నరసిచూడ
[7]సఖు లమిత్రులు నెవ్వరు సగరసుతులు
దాము దమచేయు నేరమి దనువులందు
ననలకీలలు పుట్టి నీపైఱి కాక. 208

---

1. వెదుక (హ) 2. క్రొచ్చి కోఱాడి (హ) 3. సుమతి కొడుకులు (హ) 4. గుఱ్ఱపు దొంగబంటు నీ జఱుఁగునిఁ బట్టి చంపుఁ డతి సాధు ముసీంద్రుఁడువోలె (తం. వా.) 5. దెఱవకనున్న వాఁడితనిఁ దెంపుగఁ బైసిగవట్టి వంచు డంచు (హ) 6. పడి రఘూళి కతంబున (బ డ.) 7. సఖులుమిత్రులు (హ)

వ. మఱియు, సగరుండు సుకేశినియందుఁ గన్న పుత్రుం డసమంజసుం డనువాఁడు, సమంజసగుణంబులు లేక, పూర్వజన్మంబున యోగీశ్వరుం డై యుండి, సంగ దోషంబువలన యోగభ్రష్టుం డై, సగరునకు జన్మించి, జాతి స్మరజ్ఞానంబు గలిగి, లోకులకుఁ దమవారలకు నప్రియం బగు వర్తనంబునం దిరుగుచు, నొక్కనాఁడు. 209

చ. వరుస నయోధ్యలోనఁగల [1]వాడల నాడెడు పిన్నవాండ్ర నా
సరయువులోన వై చి జనసంఘముఁ దండ్రియు [2]బిట్టుఁ దిట్ట వాఁ
డురుమతిఁ గొన్నిప్రొద్దులకు యోగబలంబునఁ జేసి బాలురం
దిరిగి పురంబులోపలికిఁ దెచ్చిన నివ్వెఱ గంది రందఱున్ 210

వ. అ య్యసమంజసుని కొడుకు, అంశుమంతుం డనువాఁడు, వినీతుం డై, తనయొద్దఁ బనులు సేయుచుండు నంత సగరుం డమ్మనుమని, నంశుమంతు నశ్వంబు వెదకి తెమ్మని పంచివ, నతండు దమతండ్రుల చొప్పునం జని, వారలు ద్రవ్విన మహా ఖాతంబు సొచ్చి, యందు భస్మరాసుల పొంత నున్న హయంబునుం గని, హయ సమీపంబునం దున్న [3]కపిలాఖ్యుం డై న విష్ణునికి దండప్రణామంబు సేసి, యి ట్లని స్తుతియించె.

సీ. మతిచిక్కఁబట్టి సమాధిగౌరవమున [4]వాసిగాఁ దనకు నవ్వల వెలుంగు
[5]నిను నొక్కనాఁ డై న నెఱుఁగునే యాబ్రహ్మయజుని మనంబున నవయవముల
[6]బుద్ధి జన్మించిన భూరి జంతువులందు హీను లయిన మాకు నెఱుఁగ వశమె
తమలోన నీ వుండఁ దా మెఱుంగరు నిన్ను గుణములు చూతురు గుణము లై నఁ

తే. [7]గాన రొకచోటఁ జీఁకటిఁ గందు రాత్మ
లందుఁ దెలియరు [8]వెలుపల నమరు పొందు
[9]లరయుదురు దేహధారు లత్యంధు లగుచుఁ
గడిఁది నీ మాయ నెన్నఁడుఁ గడవలేక. 212

వ. అని నుతిసేయుచు, హయంబు విడువు మని చెప్పక, తన తండ్రులు నీ ఱగుటం దడవక, బ్రమొక్కి నిలుచున్న యంశుమంతునికిఁ గరుణావిపులుం డగుచుఁ గపిలుం డి ట్లనియె. 213

---

1. వారల (హ. తం. వా) 2. దిట్టుచుండ (హ. వా.) 3. కపిలాఖ్యుండై న (హ)
4. బ్రాలియుఁ దనకు నవ్వల వెలుంగు (ట. తం. వా.) 5. నినుగానఁ డొకనాఁడు, నిన్నెఱుంగునె బ్రహ్మ (చ. తం. వా.) 6. బుట్టి (హ) 7. గాననొకచోట (హ) 8. వేలుపు లరయఁ (హ)
9. అరయుదుర (హ)

క. గుఱ్ఱము గొనిపో [1]బుద్ధుల, కుఱ్ఱుడ ! మీ తాతయొద్దకున్ నీ తండ్రుల్
వెఱ్ఱులు నీఱై రదె యీ, మిఱ్ఱున గంగాజలంబు మెలఁగ శుభ మగున్. 214

వ. అని పలికిన, నమస్కరించి, తురంగంబుం గొనివచ్చి, యీ సగరున కిచ్చిన, సగరుం డా పశువువలన జన్నంబు కడమ నిండించి, యంశుమంతునకు రాజ్యం బిచ్చి, ముక్తబంధనుం డై, యౌర్వుండు సెప్పినమార్గంబున నుత్తమగతికిం జనియె. అంత. 215

అధ్యాయము - ౯

క. జనకులు భ్రమ్గిన చోటికి, ననిమిషనదిఁ దెత్తు ననుచు నటవీస్థలికిన్
జని తపము సేయఁజాలక, మనమున వగ లొలయ నంశుమంతుఁడు దీఱెన్. 216

క. ఆతనికొడుకు దిలీపుఁడు, [2]భూతలమునకు గంగఁ దెచ్చి పొందించుట కై
ప్రీతిం దపంబు సేయుచు, భాతిగఁ దేలేక కాల[3]పరవశుఁ డయ్యెన్. 217

క. అతనిసుతుండు భగీరథుఁ, డతితప మొనరించి కనియె నమృతాపాంగన్
సుతరంగన్ ముఖవనరుహ, రతభృంగన్ శివజటాగ్ర రంగన్ గంగన్. 218

వ. కని, నమస్కరించిన గంగ కృపచేసి, వరంబు వేఁడు మనిన, నా రాచపట్టి యి ట్లనియె. 219

క. మావారి భస్మరాసుల, నీ వారిం గలిపికొనుము నెఱి మావారల్
నీ వారిఁ గలయ నాకము, మా వారికిఁ గలుగు నిది ప్రమాణము తల్లీ ! 220

ఇంద్రవజ్రము. చెల్లన్ మది న్నిన్ను భజింతు గంగన్
[4]ఫుల్లాంతరంగన్ బహుపుణ్యసంగన్
గల్లోలలక్ష్మీ జితకాశమల్లిన్
దల్లిన్ సుధీ కల్పలతా మతల్లిన్. 221

వ. అని వినుతులు సేయుచున్న రాజకుమారునకు లోకపావని యి ట్లనియె. 222

మ. వినువీథిం బఱతెంచి నేలఁ బడ నా వేగంబును న్నిల్ప నో
పినవాఁ డెవ్వఁడు మేదినీతలము నే భేదించి పాతాళమున్
జనుదున్ వచ్చితినేని నా జలములన్ సంస్నాతు లై మానవుల్
ననుఁ బొందించు నఘవ్రజం బెచట నే నాశంబుఁ బొందించెదన్. 223

వ. అది కారణంబుగా విచారించెద. అని పలుకుచున్న లోకమాతకు రాజన్యవర్యుం డగు భగీరథుం డి ట్లనియె. 224

---

1. ముద్దుల (ట) 2. భూతలమున(తం.వా) 3. పరివృతుఁ డయ్యెన్(క.చ.బ.) 4. ఫుల్లత్తరంగన్(తం)

మ. †పరతత్త్వజ్ఞులు శాంతచిత్తులు తపఃపారీణు లార్యుల్ [1]ఘనుల్
పురుషశ్రేష్ఠులు వచ్చి తల్లి! భవదంభోగాహముల్ సేయఁగా
నరసంఘాతము నిన్నుఁ బొందునె జగన్నాథుండు నానాఘసం
హరుఁ డా విష్ణుఁడు వారిచిత్తములఁ దా నై యుంట మందాకినీ! 225

మ. తనలో నిన్నిజగంబులుం గలుగుటం దా నిన్నిటం [2]గల్గుట
జననీ! తంతువులందుఁ జీర గల యా చందంబున విశ్వభా
వనుఁ డై యొప్పు శివుండు గాక మఱి నీ వారి న్నివారింప నే
ర్చినవా రెవ్వరు నిన్ ధరించుకొఱకై శ్రీకంఠునిన్ గొల్చెదన్. 226

వ. అని యెఱింగించి, వీడ్కొని, చని, భగీరథుండు మహేశ్వరు నుద్దేశించి, గ్రద్దనఁ
దపంబుఁ జేసిన. 227

ఆ. భక్తవత్సలుండు ఫాలాక్షుఁ డా భగీ
రథుని మెచ్చి నిజశిరంబునందు
శౌరిపాదపూత సలిల యై దివినుండి
ధరకు వచ్చు గంగఁ దాల్చె నపుడు. 228

—: పరమేశ్వర జటాజూటనిర్గత గంగానదీ ప్రవాహ మహిమానువర్ణనము :—

వ. ఇట్లు మ్మహానది, పురారాతి జటాజూట రంధ్రంబువలన దిగంబడి, నిరర్గళ
ప్రవాహం బై, యిలకు జల్లించి, నెఱసి, నిండి, పెల్లు వెల్లిగొని, పెచ్చుపెఱిగి,
విచ్చలవిడిఁ గ్రేపు వెంబడి నుఱక క్రేళ్ళుఱుకు మఱకప్రాయంపుఁ గామధేనువు
చందంబున ముందటికి నిగుడుచు, ముద్దుఁ జిందురుతోడి నెయ్యంబునఁ గ్రయ్య
నడరి చొప్పుదప్పక సాఁగి చనుదెంచు సుధార్ణవంబుకైవడిఁ బెంపుగలిగి,
మహేశ్వరు వదనగహ్వారంబువలన నోంకారంబుపిఱుంద వెలువడు శబ్దబ్రహ్మంబు
భంగి నదభ్ర విభ్రమంబున న మ్మహీపాలతిలకంబు తెరువు వెంటనంటి వచ్చుచు,
వెలియేనుఁగు తొండంబుల ననుకరించి పఱచు వఱదమొగంబులును, వఱద
మొగంబుల పిఱుంద నందంద క్రందుకొని, పొడచూపి, తొలంగు బాలశారదా
కుచకుంభంబుల పగిది కగ్గలం బై న బుగ్గలును, బుగ్గలసంగడంబునం బారిజాత
కుసుమస్తబకంబుల చెలువంబునుం దెగడు వెలినురువులును, వెలినురువుల చెంగల
నర్ధోన్మీలిత కర్పూరతరు కిసలయంబుల చక్కందనంబుం గేలిగొను సుళు।ను,
సుళ్ళకెలంకుల ధవళజలధర రేఖాకారంబుల బాగు మెచ్చని నిడుదయేఱులును,
నేఱులం గలసి వాయువశంబున నొండొంటిం దాఁకి బిట్టు మిట్టించి, మీఁది

† ఈపద్యము 'బ' ప్రతిలోలేదు. 1. మునుల్ (క. డ.) 2. జెందుటన్ (హ)

కెగయు దురితభంగంబు లైన భంగంబులును, భంగంబుల కొనల భిన్నభిన్నంబు లై కుప్పించి, యుప్పరం బెగసి, ముత్తియంపు సరుల వడువున, మల్లికా దామంబుల తెఱంగునఁ, గర్పూరఖండ కందంబంబుల చెలువంబున, నిందు శకలం బుల తేజంబునఁ, దారకానికరంబుల పొలుపున, మెఱయుచు, ముక్తికన్యా వశీకరంబు లైన శీకరంబులు నుం గలిగి, మధ్యమలోక శ్రీకరం బై, శ్రీకరంబు తెఱంగున విష్ణుపదంబు ముట్టి, విష్ణుపదంబు భాతి నుల్లసిత హంసరుచిరం బై, రుచిరపద్మంబురీతి నతిశోభిత కువలయం బై, కువలయంబుచెన్నున బహుజీవనం బై, జీవనంబులాగున సుమనో వికాస ప్రధానం బై, [1]ప్రధానపర్వంబుపొలుపున [2]నేక చక్ర బక భీమ మహాభంగ సుభద్రార్జున చరి తాభిరామం బై, రామ చిత్తంబు మెలుపునం దనవారిలోఁ జొచ్చిన దోషాచరుల కభయప్రదాన చణం బై, ప్రదానచణ వర్తనంబుభాతి సముపాసిత మృత్యుంజయం బై, మృత్యుం జయు రూపంబు పోలిక విభూతి సుకుమారం బై, కుమారచరిత్రంబు తేవను గ్రౌంచప్రముఖ విజయఁ బై, విజయురథంబుభాతి [3]హరిహయామంథరం బై, [4]మంథరవిచారంబు గ్రద్దన మహారామగిరి వనప్రవేశకామం బై, కామకేతనంబు పెల్లున నుద్దీపిత మకరం బై, మకరకేతను బాణంబుకై వడి నిలీన పరవాహినీ కలిత శంబరం బై, శంబరారాతి చిగురుఁగొంతంబుసూటి నధ్వగవేదనా శమనం బై, శమనదండంబుజాడ నిమ్మోన్నత సమవృత్తం బై, వృత్తశాస్త్రంబు విధంబున వడిఁగలిగి, సదా గురు లఘు వాక్యచ్ఛటా పరిగణితం బై, గణిత శాస్త్రంబుకొలందిని ఘన ఘనమూల వర్గమూల సంకలిత భిన్న [5]మిశ్ర ప్రకీర్ణ ఖాత భీష్మం బై, భీష్మపర్వంబు పెంపున ననేక భగవద్గీతం బై, గీతశాస్త్రంబు నిలుకడను మహాసుషిర తను ఘన నానాశబ్దం బై, శబ్దశాస్త్రంబుమర్యాద నచ్చు వడి హల్లు గలిగి, మహాభాష్య రూపావతారవృత్తి వృద్ధి గుణ [6]సమర్థం బై, యర్థశాస్త్రంబు మహిమను బహుప్రయోజన ప్రమాణ దృష్టాంతరం బై, దృష్టాంతరంబు తెఱంగున సర్వసామాన్య గుణవిశేషం బై, శేషవ్యాపారంబు కరణి సుస్థిరోద్ధరణ తత్పరం బై, పరబ్రహ్మంబుగరిమ నతిక్రాంతానేక నిగమం బై, నిగమంబునడవడి బ్రహ్మవర్ణ పద క్రమ సంగ్రహం బై, గ్రహశాస్త్రంబు పరిపాటిని కర్కట మీన మిథున మకరరాశి సుందరం బై, సుందరీముఖంబు పోఁడిమి నిర్మల చంద్రకాంతం బై, కాంతాధరంబురుచిని [7]శోణచ్ఛాయా విలాసం బై, విలాసవతి కొప్పుచొప్పునఁ [8]గృష్ణాలకాధికం బై, యధికమతి [9]శాస్త్రసంవాదంబుసొంపున నపార సరస్వతీ విజయవిభ్రమం బై, విభ్రమవతి

---

1. పర్వతంబు(హ) 2.ననేక(హ.తం) 3. హరిదయామందిరంబై(హ) 4 మందర(హ) 5.మిత్ర (హ) 6. సమృద్ధం బై (హ) 7. శోణిత (హ) 8. కృష్ణనాగాధిక(తం.వా.) 9. కుశల సంవాదంబు (తం)

చనుదోయిపగిది నిరంతర పయోవ్యాప్తాఖలలోక జీవనప్రద తుంగభద్రాతిరేఖా సలలితం బై, లలితవతి నగవు మించున నపహసిత చంద్రభాగధేయం బై, భాగ ధేయవంతుని వివాహంబులీల మహామేఖలాకన్యకా విస్తారం బై, తార కెంగేలి యొడికంబున [1]నాక్రాంతసూర్యతనయం బై, సూర్యతనయు శరవర్షంబుపోలిక భీమరథ్యాటోప వారణం బై, వారణంబు బిరుసునం బుష్కరోన్నత సంరంభంబై, రంభ [2]నెమ్మోమునడాలున [3]సురసాతిశయ దళం బై, దశరథతనయు బొమ ముడిచాడ్పున సింధుగర్వ ప్రభంజనం బై, ప్రభంజనతనయు గదపెట్టు మాడ్కిని సమీపగత దుశ్శాసన దుర్మద నివారకం బై, వారకన్యక ముంజేతి గతిని ముహుర్ముహు రుచ్చలిత కంకణాలంకృతం బై, కృతయుగంబు నోజనపంకం బై, పంకజాసను ముఖంబు నొఅపునఁ బ్రభూత ముఖ్యవర్ణం బై, వర్ణగుణితంబు తెఱకువను బహుదీర్ఘ బిందువిసర్గం బై, సర్గబంధ కావ్యంబు విన్ననువున గంభీర భావ మధురం బై, మధురాపురంబు సొబగున మహానంద నందనం బై, నందన వనంబుపొందున విహరమాణ కౌశికం బై, కౌశికహయంబురీతి [4]నుదరధ్రువం బై, ధ్రువు తలంపుక్రియను [5]పరికీలిత విశ్వంభరం బై, విశ్వంభరుని శంఖంబు రూపున దక్షిణావర్తోత్తరం బై, యుత్తరా వివాహంబు చందంబునఁ బ్రముదిత [6]నరం బై, నరసింహ నఖరంబులభాతి నాశ్రిత ప్రహ్లాద గురువిభవ ప్రదానం బై, దానకాండంబు సిరిం గామధేను గల్పలతా ద్యభినవం బై, నవసూతికా కుచంబు పేర్మిని నిరంతర పయోవర్ధనం బై, ధనదు నిలయంబు తూనిక సంగత మకర మహాపద్మ కచ్ఛపం బై, కచ్ఛపకర్పరంబు బలిమిని పతిత శైలసముద్ధరణం బై, ధరణీధరంబుసాటి నుత్తుంగ తటముఖ్యం బై, ముఖ్యవరాహంబుగరిమ నున్నత తమం బై, తమాసురహస్తంబు గరగరికను సత్పవిత్ర మనోరామం బై, రామ చంద్రు బాణంబు కడింది నభ్యాగత ఖర దూషణ [7]మదాపహరణ ముఖరం బై, ముఖర రామకుఠారంబురీతిని భూభృ [8]న్మూలభేదన ప్రబలం బై, బలరామ హాలంబుభాతిని బ్రతికూల సన్నికర్షణ [9]ప్రబుద్ధం బై, బుద్ధదేవుని మేని యొఱ పున నభియాతి[10]రమ్యోదార మనోహరం బై, హరతాండవంబుమేర నుల్లసి తానిమిషం బై, యనిమిషావతారంబు కీర్తిని శ్రుతిమంగళప్రదం బై, ప్రదాత యోఁగి సూటి నర్థపరంపరా వామనం బై, వామన చరణరేఖను బలివంశ వ్యపనయం బై, నయశాస్త్రంబు మార్గంబున సామ భేద మాయోపాయ

---

1. నతిక్రాంత (హ) 2. కెమ్మోవి (తం. చ.) 3. సురతనాతిశయ (హ) 4. సుదశ ధ్రువంబై (క. వా.); సుదర్శన ధ్రువంబై (తం) 5. పరిశీలిత (తం. వా. క. ట. జ.) 6. నలవ రంబై (హ) 7. మదాపహార ముఖాభిరామంబై, రామ కుఠారంబు (పాఠాంతరము) 8. మూలచ్ఛేదన (తం. వా.) 9. ప్రవృద్ధంబై (హ) 10. వఱోదార (హ)

చతురం బై, చతురాననాండంబు భావంబున నపరిమిత భువన జంతుజాల
సేవ్యమానం బై, మానిని యన లోఁతు సూపక, గరిత యన [1]సడి చప్పుడు
సేయక, ముగుద యన బయలుపడక, ప్రమద యనఁ గ్రయ్యం బాఱుచుఁ,
బతివ్రత యన నిట్టట్టు సనక, తల్లి యన నెవ్వి యైన లోఁగొనుచు, దైవం బన
భక్తమనోరథంబు లిచ్చుచు, నంతకంతకు విస్తరించి గుఱిగడచి, యవాఙ్మానస
గోచరం బై ప్రవహించి 229

మ. జగతీనాథు రథంబు పజ్జ బహుదేశంబుల్ వడిం దాటి త
త్సగరజ్ఞాపకుమార భస్మములమీఁదఁ ముంచి పాఱఁ మరు
న్నగరావాసము వారు పొందిరి నవీన శ్రీలతో గంగనీ
రుగతిఁ గాక మహోదురంత సుజనద్రోహానలం బాఱునే. 230

మ. హరు [2]మెప్పించి మహోతపో నియతుఁ డై యాకాశగంగానదిఁ
ధరకుం దెచ్చి నితాంత కీర్తిలతికా స్తంభంబుగా నవ్య సు
స్థిరలీలం బితృకృత్య మంతయు నొనర్చెఁ వారితానేక దు
స్తర వంశవ్యధుఁ డా భగీరథుఁడు నిత్యశ్రీకరుం డల్పుఁడే. 231

క. హరిఁ దమ మనమున లోనిడి, హరి పాదాంభోజజనిత మైన నదిన్ సు
స్థిరు లై గ్రుంకి మునీంద్రులు, హరిఁ గలసిరి త్రిగుణరహితు లై య వ్వేళఁ.

వ. అంత నా భగీరథునకు శ్రుతుండును, శ్రుతునకు నాభావరుండును, నాభావరు
నకు సింధుద్వీపుండును, సింధుద్వీపునకు నయుతాయువును, అయుతాయువునకు
ఋతుపర్ణుండును జనియించె. అతండు. 233

ఆ. నయవిశాలబుద్ధి నలచక్రవర్తితో
సంగడీనితనము చాలఁ జేసి
యక్షహృదయ మతని కభ్యస్తముగ నిచ్చి
యశ్వవిద్య నేర్చె నతనివలన. 234

వ. ఆ ఋతుపర్ణునకు సర్వకాముండును, సర్వకామునకు మదయంతీవల్లభుం డై న
సుదాసుండును బుట్టె. ఆ రాజశేఖరుని, మిత్రసహుండును, గల్మాషపాదుండు
నని చెప్పుదురు. ఆ భూవరుండు వసిష్ఠుని శాపంబున రాక్షసుండై, తనకర్మంబున
ననపత్యుం డయ్యె. అనిన విని పరీక్షిన్న రేంద్రుం, డేమికారణంబున సుదాసునకు
గురుశాపంబు ప్రాప్తం బయ్యె, ననిన విని శుకుం డి ట్లనియె. 235

---

1. నలి (హ) 2. మెచ్చించి (ద) 3. అవ్యస్తముగ (హ. వా.)

సీ. ఆ సుదాసుఁడు వేఁటకై వనంబున కేఁగి గర్వించి యొక్కరక్కసునిఁ జంపి.
వాని తోఁబుట్టినవానిఁ బోవిడిచిన వాఁడునుఁ దన[1]తోడివాని [2]మృతికి
నతిదుఃఖితుండు నై యా రాజగృహమున సూదభావంబున సొంపునొంది
యుండ వసిష్ఠున కుర్వీశుఁ డొక్కనాఁ డన్నంబు సేయంగ నతనిఁ బనుప

తే. వాఁడు మానవమాంసంబు వండి తెచ్చి
మునికి వడ్డింపఁ గోపించి ముని నరేంద్రు
బిల్చి మానవమాంసంబుఁ బెట్టిదనుచు
నలుకతో రాక్షసుఁడవు గమ్మని శపించె. 236

వ. ఇట్లు శపియించి పదంపడి, రాక్షసుండు వండితెచ్చుటయు, సుదాసుని యెఱుఁగమియుఁ దనమనంబున నెఱింగి, వసిష్ఠుండు పండ్రెండేండ్లు రక్కసుండ వై యుండు మని [3]నియమించె. అ య్యవసరంబున. 237

మ. గురువున్ మాఱుశపింతు నంచు జలముల్ గోపంబుతో దోయిటన్
నరనాథుండు ధరింపఁ దత్పతి పతిన్ వారింప మిన్నున్ దిశల్
ధరయున్ జీవమయంబకా నిఖిలముం దాఁ జూచి చల్లెన్ ధరా
వరుఁ డాత్మీయపదంబులం గరపుటీ వాఃపూరమున్ [4]బొక్కుచున్. 238

వ. ఇట్లు మిత్రసహుండు గావునఁ గళత్రానుకూలుం డై శపియింప నొల్లక, సుదాసుండు రాక్షసభావంబు నొంది, కల్మాషవర్ణంబు లయిన పాదంబులతో నడవులం దిరుగుచు. 239

క. ఆఁకట [5]మలమల మాడుచు, వీఁక నతం డడవి నున్న విప్రమిథునమున్
దాఁకి తటాలున విప్రునిఁ, గూఁకటి చేఁబట్టి క్రుంగఁ గొనిపోవుతఱిన్. 240

వ. అంత నా బ్రాహ్మణుని భార్య మోఁదికొనుచుం బెగ్గడిల్లి, డగ్గుత్తికతోఁ బతికి నడ్డంబువచ్చి, యేడ్చుచు రాచరక్కసున కిట్లనియె. 241

క. మానుషదేహము గలుగుట, భూనాయక ! దుర్లభంబు పుట్టినమీఁదన్
దానము పరోపకారము, భూనుతకీర్తియును వలదె పురుషున కెందున్. 242

మ. రవివంశాగ్రణి వై సమస్తధరణీ రాజ్యానుసంధాయి వై
భువనస్తుత్యుఁడ వై పరార్థరతి వై పుణ్యానుకూలుండ వై
వివరం బేమియు లేక నా పెనిమిటిన్ విప్రున్ దపశ్శీలు స
త్ప్రవరున్ బ్రహ్మవిదున్ [6]జగన్నుతగుణున్ భక్షింపఁగాఁ బాడియే. 243

---

1. తోటి (హ) 2. చావు, వోనీక కపటియై భూపాల గృహమున నడ బాలతనమున నర్థిఁగొలిచి (తం. వా.) 3. శపియించె (హ) 4. మున్నుచున్ (హ) 5. మటమలు (హ) 6. జగద్భరణునిన్ (హ)

శా. తండ్రీ! మీకు దినేశవంశజులకున్ దైవం బగున్ బ్రాహ్మణుం
డం డ్రా మాటలు లేవె భూమిసుర గోహత్యాభిలాషంబు గై
కొండ్రే మీయటువంటి సాధువులు రక్షోభావ మి చ్చేల మీ
తండ్రిన్ దాతలఁ బూర్వులన్ దలఁపవే ధర్మంబునం బోఁగదే. 244

శా. అన్నా! చెల్లెల నయ్యెదన్ విడువు నీ కన్నంబు వెట్టింతునా
హ్యన్నాథున్ ద్విజు [1]గంగికుట్టి నకటా! హింసింప నేలయ్య! నీ
వెన్నం డింతులతోడఁ బుట్టవె నిజం బిట్టైన [2]మున్ముట్ట నా
పన్నన్ నన్ను శిరంబు ద్రుంచి మటి మత్స్యాణేశు భక్షింపవే. 245

క. అని కరుణ పుట్ట నాడుచు, వనితామణి పలవరింప వసుధాదేవుం
దినియె నతఁడు పులి పశువుం, దినుక్రియ శాపంబుకతన ధీ రహితుం డై. 246

వ. అంత నా బ్రాహ్మణి కోపించి, కామార్త నైన నాదు వెనిమిటిని భక్షించితివి గావున, నీవు నెలఁతలం బొందఁ జేరినవేళ మరణంబును బొందు మని, కల్మాష పాదుని శపించి, పతిశల్యంబులతో నగ్నిప్రవేశంబు సేసి సుగతికిం జనియె. అంత బండ్రెండేండ్లు సనిన నా రాజు మునిశాపవిముక్తుం డై. 247

ఆ. రతులకొఱకు భార్య రావింప నదియును
బెదరి విప్రసతి శపించు టెఱిఁగి
మగని నడ్డపెట్టి మైథునకర్మంబు
మాన్పె సతులగోష్ఠి మానె నతఁడు. 248

క. అది కారణముగఁ బుత్రా, భ్యుదయము లే దా సుదాస భూపాలునకున్
దదనుమతి న వ్యసిష్ఠుఁడు, మదయంతికిఁ గడుపు సేసె మదనక్రీడన్. 249

వ. ఇట్లు సుదాసునిభార్య యగు మదయంతి వసిష్ఠువలన గర్భిణి యై, యేడేండ్లు గర్భంబు ధరియించి, నీళ్ళాడ సంకటపడుచున్న, వసిష్ఠుండు వాఁడి యగు నశ్మమున నా గర్భంబుఁ జీరిన, నశ్మకుం డను కుమారుండువుట్టె. అతనికి [1]మూల కుండు పుట్టెఁ. అతండు. 250

క. వీరుఁ డగు పరశురాముఁడు, ఘోర కుఠారమున నృపులఁ గూలుచు[4]వేళన్
నారీజనములు దాఁచిన, నారీకవచుం డనంగ [5]నరనుతి కెక్కెన్. 251

---

1. ధర్మవర్తి నకటా (క. చ. జ. డ. ద.) 2. మున్నుట్ట (హ) 3. నారీకవచుండు (హ)
4. వెళ్ళన్ (హ) 5. నలి (తం. వా.)

వ. ఆ నారీకవచుండు నిర్మూలం బయిన రవివంశంబునకు మూలం బగుటం జేసి, మూలకుం డయ్యె. [1]మూలకునకు విశ్వసహుండు పుట్టె. విశ్వసహునకు ఖట్వాం గుండు పుట్టి చక్రవర్తి యయ్యె. అతండు. 252

సీ. అమరులు వేఁడిన నసురనాథులఁ జంపి త్రిదశులతోఁ దన [2]బ్రదుకుకాల
మెంతని యడిగిన నిదె నిండుచున్నది తడవులే దేమైన నడుగు మనిన
వరములు గోరక వరవిమానం బెక్కి తనపురి కేతెంచి తత్త్వబుద్ధిఁ
బరమేశ్వరునియందు భావంబు గీలించి కులదైవత ద్విజకులము కంచె

తే. నంగనా ప్రాజ రాజ్య పుత్రాదు లెల్లఁ
గావు ప్రియములు ధర్మంబు గడచి నాదు
మతి ప్రవర్తింప దెన్నఁడు మది నెఱుంగ
నన్య మా యీశ్వరునిఁ దక్క ననుచు మఱియు. 253

మ. ఇలమీఁదం బ్రతుకేల వేల్పుల వరం బేలా ధనం బేల చం
చల గంధర్వపురీ విడంబనము లైశ్వర్యంబు లేలా జగం
బులఁ బుట్టించు తలంపునం బ్రకృతితోఁ బొత్తై తుదిం బాసి ని
ర్మల మై వాఙ్మనసామితం బగు పరబ్రహ్మంబు నేఁ జెందెదన్. 254

వ. అని నిశ్చయించి. 255

మ. కలసెన్ [3]సంగము లెల్లఁ బాసి నియతిన్ ఖట్వాంగుఁ డశ్రాంత మై
[4]కల దయ్యున్ మఱి మీఁద లేదనెడి దై కల్యాణ మై [5]యాత్మలోఁ
దలఁపం బల్కఁగరాని దై పరమ మై తత్త్వజ్ఞు లూహించి హృ
జ్జలజాతంబుల వాసుదేవుఁ డని సంస్థాపించు నా బ్రహ్మమున్. 256

అధ్యాయము - ౧౦

వ. అట్టి ఖట్వాంగునకు దీర్ఘబాహుండు, దీర్ఘబాహునకు రఘువు, రఘునకుఁ బృథు శ్రవుండుఁ, బృథుశ్రవునకు నజుండు, నజునకు దశరథుండును బుట్టిరి. ఆ దశరథునకు సురప్రార్థితుండై పరబ్రహ్మమయుం డైన హరి నాల్గువిధంబు లై, శ్రీరామ లక్ష్మణ భరత శత్రుఘ్ననామంబుల నిజాంశ సంభూతుం డై జన్మించె. తచ్చరి తంబు వాల్మీకిప్రముఖు లైన మునులచేత వర్ణింతం బైనది. ఐనం జెప్పెద. సావధానమనస్కుఁడ వై యాకర్ణింపుము. 257

---

1. మూలకునకు దశరథుండను కుమారుండు పుట్టె. ఆతనికి నై బలుండుపుట్టె. అతనికి విశ్వస హుండు (చ) 2. దెగెడు(హ) 3. సంఘము (హ) 4. కలిగిం దై మరి పైన లేదనెడి దై (హ) 5. సన్నుతిం (హ)

—: శ్రీ రా మ చ రి త్ర ము :—

మ. అమరేంద్రాశకుఁ బూర్ణచంద్రుఁ డుదితుం డై నట్లు నారాయణాం
శమునం బుట్టె మదాంధ రావణ శిరస్సంఘాత సంఛేదన
క్రమణోద్దాముఁడు రాముఁ డా గరితకుఁ గౌసల్యకుం బున్నతా
సమ నైర్మల్య కతుల్య కంచిత జను స్సంసార సాఫల్యకున్. 258

మ. సవరఁజూర్థము దండ్రి వంపఁ జని విశ్వామిత్రుడుం దోడ రా
నవలీలం దునుమాడె రాముఁ డదయుం డై బాలుఁ డై కుంతల
చ్ఛవి సంప జ్జిత హాటకన్ గపట భాషా విస్ఫుర న్నాటకన్
జవభి న్నార్యమ ఘోటకన్ గర విరాజ ల్ఖేటకన్ ధాటకన్. 259

క. గారామునఁ గౌశికమఖ, మా రాముఁడు గాచి దైత్య నధికు సుబాహున్
ఘోరాజిఁ ద్రుంచి తోలెను, మారీచు న్నీచుఁ గపట మంజుల రోచున్. 260

మ. ఒక మున్నూఱు గదల్చి తెచ్చిన లలాటోగ్రాతు చాపంబు బా
లకరీంద్రంబు సులీల మై చెఱకుఁ గోలఁ ద్రుంచుచందంబునఁ
సకలోర్వీశులు సూడఁగా విఱిచె దోశ్శక్తిఁ విదేహాత్మమా
పక గేహంబున సీతకై గుణమణి ప్రస్ఫీతకై లీలతోన్. 261

క. భూతలనాథుఁడు రాముఁడు, ప్రీతుం డై పెండ్లియాడె పృథుగుణమణి సం
ఘాతఁ భోగ్యోపేతఁ, సీతఁ ముఖకాంతి విజిత సితఖద్యోతఁ. 262

క. రాముఁడు నిజబాహుబల, స్థేమంబున భంగపఱిచె దీర్ఘకుతారో
ద్దామఁ విదళీకృత నృప, భామఁ రణరంగభీము భార్గవరామఁ. 263

క. దశరథుఁడు మున్ను కైకకు, వఱుఁ డై తా నిచ్చినట్టి వరముకతన వా
గ్దళ చెడక యడవి కనిచెను, [1]దశముఖ ముఖకమల తుహినధామఁ రామఁ.

క. జనకుఁడు పనిచిన మేలని, జనకజయును లక్ష్మణుండు సంసేవింపఁ
జనపతి రాముఁడు విడిచెను, జనపాలారాధ్య ద్విష దసాధ్య నయోధ్యఁ. 265

క. భరతుఁ నిజపదసేవా, నిరతుఁ రాజ్యమున నునిచి నృపమణి యొక్కెఁ
సురుచిర రుచి పరిభావిత, గురు గోత్రాచలముఁ జిత్రకూటాచలముఁ. 266

ఉ. పుణ్యుఁడు రామచంద్రుఁ డట వోయి ముదంబునఁ గాంచె దండకా
రణ్యముఁ దాపసోత్తమ శరణ్యము నుద్ధత బర్హిబర్హ లా
వణ్యము గౌతమీ విమల వాఃకణ పర్యటన ప్రభూత సా
ద్గుణ్యము నుల్లస త్తరు నికుంజ వరేణ్యము నగ్రగణ్యముఁ. 267

---

1. దశముఖ (హ)

సీ. ఆ వనంబున రాముఁ డనుజ సమేతుఁ డై సతితోడ నొక పర్ణశాల నుండ
రావణు చెల్లెలు రతిఁగోరి వచ్చిన మొగి లక్ష్మణుఁడు దాని ముక్కుగోయ
నది విని ఖరదూషణాదులు పదునాల్గు [1]వేవురు రా రామవిభుఁడు కలన
బాణానలంబున భస్మంబు గావింప జనకనందన మేని చక్కఁదనము

తే. విని దశగ్రీవు డంగజవివశుఁ డగుచు
నరిఁ బంచినఁ బసిఁడిజే యై నటించు
నీచు మారీచు రాముఁడు నెఱి వధించె
నంతలో సీతఁ గొనిపోయె నసురవిభుఁడు. 268

ఉ. ఆ యసురేశ్వరుండు వడి నంబరవీథి నిలాతనూజ న
న్యాయము సేసి నిష్కరుణుఁ డై కొనిపోవఁగ నడ్డమైన ఘో
రాయతపాతిఁ ద్రుంచె నసహాయత రామనరేంద్ర కార్య ద
త్తాయువుఁ బక్షవేగ పరిహాసిత వాయువు న జ్జటాయువున్. 269

వ. అంత నా రామచంద్రుండు లక్ష్మణసహితుం డై, సీత వెదక నరుదెంచి, నిజ కార్య [2]నిహితుం డైన జటాయువునకుం బరలోకక్రియలు గావించి, ఋష్య మూకంబునకుం జని. 270

క. నిగ్రహము నీకు వల దిఁక, నగ్రజు వాలిఁ వధింతు నని నియమముతో
నగ్రేసరుగా నేలెను, సుగ్రీవుఁ చరణభూత చూర్ణగ్రావున్. 271

క. లీలఁ రామవిభుం డొక, కోలఁ గూలంగ నేసె గురు నయశాలిఁ
శీలిన్ సేవితశూలిన్, మాలిన్ వాలిం దశాస్యమానోన్మాలిన్. 272

క. ఇలమీఁద సీత వెదకఁగ, నలఘుఁడు రాఘవుఁడు వనిచె హనుమంతు నతి
చ్ఛలవంతున్ మతిమంతున్, బలవంతున్ శౌర్యవంతుఁ బ్రాభవవంతున్. 273

క. [3]అలవాటు కలిమి మారుతి, లలితామిత లాఘవమున లంఘించెను శై
వలినీగణ సంబంధిన్, జలపూరిత ధరణిగగన సంధిన్, గంధిన్. 274

వ. ఇట్లు సముద్రంబు దాఁటి, సీతం గని, హనుమంతుండు దిరిగి చనుదెంచుచు, నక్షకుమారాదుల వధియించి. 275

క. సముదగ్రత సనిలసుతుం, డమరాహిత దత్త వాల హస్తాగ్నుల భ
స్మము సేసె నిరాతంకన్, సమదాసుర సుభట విగత శంకన్, లంకన్. 276

---

1. వేలువచ్చిన రామ (తం. వా.) 2. సహితుం డైన (హ)
3. అలవాయిగొనక (హ) అలువాయి గలిగి (వ్రా. ప్ర.)

వ. ఇట్లు లంకాదహనంబు సేసి వచ్చి, వాయుజుండు సీతాకథనంబు సెప్పిన విని, రామచంద్రుండు రావణుని సాధింప వనచరనాథ యూథంబులుం, దానుఁ జని చని. 277

శా. ఆ రాజేంద్రుఁడు గాంచె భూరి విధ రత్నాగారమున్ మీన కుం
భీర గ్రాహ కఠోరమున్ విపుల [1]గంభీరంబు నభ్రభ్రమ
ద్ఘో రానోన్య విభిన్న భంగ భవ నిర్ఘోష చ్ఛటాంభఃకణ
ప్రారుద్ధాంబర పారమున్ లవణ పారావారమున్ జేరువఁ. 278

వ. కని, తనకుఁ ద్రోవ యిమ్మని వేఁడిన, నదియు మార్గంబు సూపక మిన్నందిన, నా రాచపట్టి రెట్టించిన కోపంబున. 279

క. మెల్లని నగవున నయనము, లల్లార్చి శరంబు విల్లు నందినమాత్రం
గుల్లలు నాఁచులుఁ జిప్పలుఁ, బెల్లలు నై జలధి పెద్ద బీడై యుండెఁ. 280

వ. ఇట్లు విపన్నుం డగు సముద్రుండు నదులతో మూర్తిమంతుం డై చనుదెంచి, రామచంద్రుని చరణంబులు శరణంబు చొచ్చి, యి ట్లని స్తుతియించె. 281

శా. ఓ కాకుత్స్థ కులేశ! యో గుణనిధీ! యో దీనమందార! నే
నీ కోపంబున కెంతవాఁడ [2]జడధిఁ నీ వేమి [3]భూరాజవే
లోకాధీశుఁడ వాదినాయకుఁడ వీ లోకంబు లెల్లప్పుడున్
నీకుఁ బ్రభవించుచుండు నడఁగు న్నిక్కంబు సర్వాత్మకా! 282

క. ధాతల రజమున దేవ, వ్రాతము సత్త్వమున భూతరాశి దమమునన్
[4]జాతులుగా నొనరించు గు, ణాతీతుఁడ వీవు గుణగణాలంకారా! 283

క. కట్టుము సేతువు లంకన్, జుట్టుము నీ బాణశిఖల సురవై రి తలల్
గొట్టుము నేలం బడఁ జే, పట్టుము నీ యబల నధిక [5]భాగ్యప్రబలన్. 284

ఆ. హరికి మామ నగుదు నటమీఁద శ్రీదేవి
తండ్రి నూర కేల తాగడింపఁ
గట్టఁ గట్టి దాఁటు కమలా ప్తకులనాథ!
నీ యశోలతలకు నెలవుగాఁగ. 285

వ. అని విన్నవించిన, రామచంద్రుండు సముద్రునిం బూర్వప్రకారంబున నుండు. పొమ్మని వీడు కొల్పె. అంత. 286

---

1. గుంభీరంబు (హ) 2. జడుఁడన్ (హ) 3. భూపుండవే (హ) 4. జ్ఞాతులుగా (హ) 5. ప్రభలన్ (హ)

క. ఘనశై లంబులఁ దరువులు, ఘనజవమునఁ బెఱికి తెచ్చి కపికులనాథుల్
ఘన వనరాశిం గట్టిరి, ఘనవాహప్రముఖ దివిజగణము నుతింపన్. 287

వ. ఇట్లు సముద్రంబు దాఁటి, రామచంద్రుండు రావణుతమ్ముం డై న విభీషణుండు శరణంబు వేఁడిన, నభయం బిచ్చి, కూడుకొని లంకకుం జని, విడిసి, [1]వేడె వెట్టించి, లగ్గలు పట్టించిన. 288

సీ ప్రాకారములు [1]ద్రవ్వి పరిఘలు [2]పూడిచి కోటకొమ్మలు నేలఁ గూలఁద్రోచి
వప్రంబు లగలించి వాకిళ్ళు పెకలించి తలుపులు విఱిచి యంత్రములు చెఱిచి
ఘన విటంకంబులు ఖండించి గోపురంబులు విప్పి వలభుల పొందు చెఱిచి
మకరతోరణములు మహిఁ గూల్చి కేతనంబులు సించి సోపానములు గదల్చి

ఆ. గృహము లెల్ల ద్రవ్చి గృహరాజముల గ్రొచ్చి
భర్మ కుంభచయము పాఱవై చి
కరులు కొలను సొచ్చి కలఁచినకై వడి
కపులు లంకఁ జొచ్చి కలఁచి రపుడు. 289

వ. అంత న య్యసురేంద్రుండు వంచినఁ గుంభ నికుంభ ధూమ్రాక్ష విరూపాక్ష సురాంతక నరాంతక దుర్ముఖ ప్రహస్త మహాకాయ ప్రముఖు లగు దనుజ వీరులు, శర శరాసన తోమర గదా ఖడ్గ శూల భిండివాల పరశు పట్టిస ప్రాస ముసలాది సాధనంబులు ధరియించి, మాతంగ తురంగ స్యందన సందోహంబుతో బవరంబు సేయ, సుగ్రీవ పవనతనయ పనస గజ గవయ గంధమాదన నీలాంగద కుముద జాంబవదాదు లా రక్కసుల నెక్కటికయ్యంబులందుఁ దరుల గిరుల కరాఘాతంబుల నుక్కడంచి, ద్రుంచిరి. అంత. 290

క. ఆయెడ లక్ష్మణుఁ డుజ్జ్వల, సాయకములఁ ద్రుంచె నై లసమకాయు సురా
జేయు ననర్గళ మాయో, పాయు నయగుణవిధేయు న య్యతికాయున్. 291

ఆ. రామచంద్రవిభుఁడు రణమున ఖండించె
మేటికడిమి నీలమేఘ కర్ణ
బాహుళ క్తిపూర్ణుఁ బటుసింహనాద సం
కుచిత దిగిభకర్ణుఁ గుంభకర్ణు. 292

క. అలవున లక్ష్మణుఁ డాజి, స్థలిఁ గూల్చెన్ [3]మేఘనాదుఁ జటులాహ్లోద్ధ
బలభేదిజయ వినోదున్, బల జనిత సుపర్వ సుభట భావ విషాదున్. 293

---

1. వెడవెట్టించి (హ) 2. నిండించి (హ) 3. మేఘనాథు (హ. తం.)

వ. అంత. 294

క. తనవా రందఱు భ్రమ్గిన, ననిమిషపతి వై రి పుష్పకారూఢుం డై
యనికి నడచి రామునితో, ఘన రౌద్రముతోడ నంపకయ్యము సేసెఁ. 295

వ. అ య్యవసరంబున. 296

క. సురపతి పంపున మాతలి, గురుతర మగు దివ్యరథము గొనివచ్చిన నా
ధరణీవల్లభుఁ డెక్కెను, ఖరకరుఁ డుదయాద్రి నెక్కు కై వడితోఁపఁ. 297

వ. ఇట్లు దివ్యరథారూఢుం డై, రామచంద్రుండు రావణున కి ట్లనియె. 298

మ. చపలత్వంబున డాఁగి హేమమృగమున్ సంప్రీతిఁ బు త్తెంచుటో
కపట బ్రాహ్మణమూ ర్తి వై యబల నా కాంతారమధ్యంబునఁ
దపలాపించుటయో మదీయ శిత దివ్యామోఘ బాణాగ్ని సం
తపనం బేగతి నోర్చువాఁడవు దురంతం బెంతయుఁ రావణా! 299

క. నీ చేసిన పాపములకు, నీచాత్మక! యముఁడు వలదు నేఁ డిట నా నా
రాచములఁ [1]ద్రుంచి వై చెద, ఖేచర భూచరులుఁ గూడి క్రీడన్ జూడన్. 300

వ. అని పలికి. 301

మ. బలువింటన్ గుణటంకృతంబు నిగుడన్ బ్రహ్మాండ భీమంబుగాఁ
బ్రళయోగ్రానల సన్నిభం బగు మహాబాణంబు సంధించి రా
జలలాముం డగు రాముఁ డేసె ఖర భాషాశ్రావణున్ దేవతా
బల విద్రావణు వై రిదారజన గర్భస్రావణున్ రావణున్. 302

క. దశరథ సూనుం డేసిన, విశిఖము హృదయంబు దూఱ [2]వివశుం డగుచున్
దశకంధరుండు గూలెను, దశవదనంబులను ర క్తధారలు దొరఁగన్. 303

వ. అంత నా రావణుండు దెగుట విని. 304

సీ. కొప్పులు బిగి వీడి కుసుమమాలికలతో నంసభాగంబుల నావరింప
నేస ముత్యంబులు చెదరఁ గర్ణిక లూడఁ గంఠహారంబులు గ్రందుకొనఁగ
వదనపంకజములు వాడి వాతెఱ లెండఁ గన్నీళ్ళ వఱద లంగములు దడుప
సన్నపు నడుములు జవ్వాడఁ బాలిండ్ల బరువులు నడుములఁ బ్రబ్బికొనఁగ

ఆ. నెత్తి మోఁదికొనుచు నెఱిఁ బయ్యెదలు జాఱ
నట్టు నిట్టు తప్పు టడుగు లిడుచు
నసుర సతులు వచ్చి రట భూత బేతాళ
సదనమునకు ఘోరకదనమునకు. 305

---

1. నాజ్ఞ చేసెద (క. చ. బ.) 2. వివశదశుండై (తం)

వ. ఇట్లు వచ్చి, తమతమ నాథులం గని, శోకించిరి. అందు. మండోదరి రావణుం
జూచి, యి ట్లనియె. 306

ఉ. హా దనుజేంద్ర! హా సురగణాంతక! హా హృదయేశ! నిర్జరేం
ద్రాదుల గెల్చి నీవు కుసుమాస్త్రుని కోలల కోర్వలేక సో
న్మాదమునఁ రఘుప్రవరు మానిని నేటికిఁ దెచ్చి [1]తప్పు డేఁ
గాదని చెప్పినఁ వినక కాలవశంబునుఁ బొంది తక్కటా! 307

ఆ. ఎండ గాయ వెఱచు నిసుఁడు వెన్నెలఁ గాయ
వెఱచు విధుఁడు గాలి వీవ వెఱచు
లంకమీఁద నిట్టి లంకాపురికి మాకు
నధిప! విధవభావ మడరె నేఁడు. 308

క. దురితముఁ దలఁపరు గానరు, జరుగుదు రెట కైన నిమిష సౌఖ్యంబులకై
పరవనితాసక్తులకునుఁ, బరధనరక్తులకు నిహముఁ బరముం గలదే. 309

వ. అని విలపింప నంత విభీషణుండు రామచంద్రుని పంపు వడసి, రావణునకు దహ
నాది క్రియలు గావించె. అంత రాఘవేంద్రుండు నశోకవనంబున కేఁగి, శింశుపా
తరు సమీపంబునందు. 310

శా. దైతేయ ప్రమదా పరీత నతిభీత గ్రంథి బంధాలక
వ్రాత నిశ్వసనానిలాక్షుకణ జీవం జీవ దారామ భూ
జాత శుష్క కపోలకీలిత కరాబ్జాత ప్రభూత గృశీ
భూతన్ ప్రాణసమేత సీతఁ గనియె భూమీశుఁ డా ముందట. 311

వ. కని రామచంద్రుండును దాపంబు నొంది, భార్యవలన దోషంబు లేకుండుట
వహ్నివలనం ప్రకటంబు నేసి, దేవతల పంపున దేవిం జేకొని. 312

ఉ. శోషిత దానవుండు నృపసోముఁడు రాముఁడు రాక్షసేంద్రతా
శేష విభూతిఁ గల్ప సమజీవివి గమ్మని నిల్పె నర్థి సం
తోషణుఁ పాపశోషణు నదూషణు శశ్వ దరోషణు మితా
భాషణు నార్యతోషణుఁ గృపాగుణ భూషణు న వ్విభీషణున్. 313

వ. ఇట్లు విభీషణ సంస్థాపనుం జై రామచంద్రుండు సీతాలక్ష్మణ సమేతుం జై,
సుగ్రీవ హనుమదాదులం గూడికొని, పుష్పకారూఢుం జై, వేల్పులు గురియు
పువ్వుల సోనలం దడియుచుఁ, దొల్లి వచ్చిన తెరువు జాడలు సీతకు నెఱిం
గించుచు, మరలి నందిగ్రామంబునకు వచ్చె. అ య్యవసరంబున. 314

---

1. తప్పుడున్ (హ)

ఆ. రామచంద్రవిభుని రాక వీనుల విని
భరతుఁ డుత్సహించి పాదుకలను
మోచికొనుచు [1]వచ్చి ముదముతోఁ బురజను
[2]లెల్లఁ గొలువ నన్న కెదురు వచ్చె. 315

వ. వచ్చి, పాదుకలు ముందట నిడికొని, యెడనెడ సాష్టాంగ దండప్రణామంబులు సేయుచు, మెల్ల మెల్లన డాసి, రామచంద్రుని పాదంబులు నొసలం గదియించి, తచ్చరణ రేణువులు దుడిచి, శిరంబునం జల్లికొని, తనివిలేక మఱియు, న ప్పద కమలంబు [3]లక్కున మోపికొనుచు, సంతసంపుఁ గన్నీటం గడిగి, నేమంబు లరయుచుండె. అంత సీతాలక్ష్మణ సహితుం డై, విభుండును, దనకెదురు వచ్చిన బ్రాహ్మణ జనంబులకు నమస్కరించి, తక్కిన వారలచేత మన్ననలు వొంది, వారల మన్నించె. అ య్యవసరంబున,

చ. నృపవర ! పెక్కు నాళ్ళగొలె [4]నిన్ గనకుండిన యట్టి నేఁడు మా
తపములు పండె నిందఱము ధన్యుల మైతి మటంచుఁ బుట్టముల్
చపలతఁ ద్రిప్పి పువ్వుల వసంతము లాడుచుఁ బాడుచుఁ గత
త్రపులయి యాడుచుం బ్రజలు దద్దయుఁ బండుగ సేసి రెల్లెడఁ. 317

సీ. కవగూడి యిరుదెసఁ గపిరాజు రాక్షస రాజు నొక్కెడఁ జామరములు వీవ
హనుమంతుఁ డతి ధవళాతపత్రము వట్టఁ [5]బాదుకల్ భరతుండు భక్తిఁ దేర
శత్రుఘ్నుఁ డమ్ములు చాపంబుఁ గొనిరాఁగ సౌమిత్రి భృత్యుఁ డై చనువుసూప
జలపాత్ర చేపట్టి జనకజఁ గూడిరాఁ గాంచనఖడ్గ మంగదుఁడు మోవఁ

ఆ. బసిఁడి [6]వేడె మర్థి భల్లూకపతి మోచి
కొలువఁ బుష్పకంబు వెలయ నెక్కి
గ్రహము లెల్లఁ [7]గొలువఁ గడునొప్పు సంపూర్ణ
చంద్రుపగిది రామచంద్రుఁ డొప్పె. 318

వ. ఇట్లు పుష్పకారూఢుం డై, కపిబలంబులు చేరి కొలువ, రామచంద్రుం డయో ధ్యకుం జనియె. అంతకుమున్న య ప్పురంబునందు.

---

1. తూర్యములుమ్రోయఁ బురజనుల్ (చ. ద.) 2. గొల్చుచుండ నన్న కెదురువచ్చె (హ)
3. అక్కునఁ జెక్కున నొత్తి కొనుచు (తం) 4. నిన్నుఁ గనుంగొనఁ గల్గినేఁడు (తం)
5. బావాలు (తం) 6. గద్దె పెద్ద (హ) జోడుబట్టి (చ. త. జ.) 7. వెలయ (హ)

సీ. వీథులు [7]నున్నఁ గావించి తోయంబులుసల్లి రంభా స్తంభచయము నిలిపి
పట్టుచీరెలు సుట్టి బహుతోరణంబులు గలువడంబులు మేలుకట్లు గట్టి
వేదిక లలికించి వివిధ రత్నంబుల మ్రుగ్గులు పలుచందములుగఁ బెట్టి
కలయ గోడల రామకథ లెల్ల వ్రాయించి ప్రాసాదములు దేవభవనములును

తే. గోపురంబుల బంగారు కుండ లెత్తి
యెల్ల వాకిండ్లఁ గానుక లేర్పరించి
జనులు కై సేసి తూర్యఘోషములతోడ
నెదురు నడతెంచి రా రాఘవేంద్రు కడకు. 320

క. సమదగజ దానధారల, దుమదుమ లై యున్న పెద్దత్రోవలతోడ
రమణీయ మయ్యె న ప్పురి, రమణుఁడు వచ్చినఁ గరంగు రమణియ పోలెన్. 321

ఆ. రామభూవరేంద్రు రాకఁ దూర్యములతో
రథ గజాశ్వ సుభట రాజితోడ
నమరెఁ బురము, చంద్రుఁ డరుదేర ఘూర్ణిల్లు
జంతు భంగ మిళిత జలధి భంగి. 322

వ. ఇ ట్లొప్పుచున్న య ప్పురంబు ప్రవేశించి, రాజమార్గంబున రామచంద్రుం డరుగు
చున్న సమయంబున. 323

మ. ఇతఁడే రామనరేంద్రుఁ డీ యబల కా యింద్రారి ఖండించె న
ల్లతఁడే లక్ష్మణుఁ డాతఁడే కపివరుం డా పొంతవాఁడే మరు
త్సుతుఁ డాచెంగట నా విభీషణుఁ డటంచుం జేతులం జూపుచున్
సతులెల్లం బరికించి చూచిరి పురీ సౌధాగ్ర భాగంబుల. 324

వ. ఇట్లు సమస్త జనులు సూచుచుండ రామచంద్రుండు రాజమార్గంబునం జనిచని.

సీ. పటికంపు గోడలు పవడంపు వాకిండ్లు నీలంపు టరుఁగులు నెఱయఁ గలిగి
కమనీయ వైడూర్యక స్తంభ చయముల [2]మకరతోరణముల మహిత మగుచుఁ
బడగల మాణిక్యబద్ధ చేలంబులఁ జిగురు తోరణములఁ జెలువుమీఱి
పుష్పదామకముల [3]భూరి వాసనలను బహుతర ధూపదీపముల మెఱసి

తే. మాఱువేల్పుల భంగిని మలయుచున్న
సతులు పురుషులు నెప్పుడు సందడింప
గుఱుతు లిడరాని ధనముల కుప్పలున్న
రాజసదనంబునకు వచ్చె రామవిభుఁడు. 326

---

1. సక్క (హ. వా.) 2. మరకత భూముల (వ్రా.ప్ర.) 3. భూరివాసనముల (తం)

వ. ఇట్లు వచ్చి. 327

ఉ. తల్లుల కెల్ల మ్రొక్కి తమతల్లికి వందన మాచరించి య
ల్లల్ల బుధాళికిఁ వినతుఁ డై, చెలికాండ్రను దమ్ములం బ్రసం
ఫుల్లతఁ గౌఁగిలించుకొని భూవరుఁ డోలిఁ గృపారసంబు రం
జిల్లఁగఁ జాల మన్ననలు సేసె నమాత్యులఁ బూర్వభృత్యులఁ. 328

వ. తత్సమయంబునఁ దల్లులు. 329

చ. కొడుకులుఁ బెద్దకోడలును గొబ్బున మ్రొక్కిన నెత్తి చేతులఁ
బుడుకుచు మోమునం దలలు భోరన ముద్దులు గొంచు నవ్వుచుఁ
దొడలకు వారి రాఁదిగిచి తోఁగఁగఁ జేసిరి నేత్రధారలఁ
వెడలిన ప్రాణముల్ దగఁ బ్రవిష్టము లయ్యె నటంచు నుబ్బుచుఁ. 330

వ. అంత వసిష్ఠుండు, శ్రీరామచంద్రుని జటాబంధంబు విడిపించి, కులవృద్ధులుం, దానును సమంత్రకంబుగ దేవేంద్రుని మంగళస్నానంబు సేయించు బృహస్పతి చందంబున, సముద్ర నదీజలంబుల నభిషేకంబు సేయించె. రఘువరుండును, సీతాసమేతుం డై, జలంబు లాడి, మంచి పుట్టంబులు గట్టికొని, కమ్మని పువ్వులు దుఱిమి, సుగంధంబు లలందికొని, తొడవులు దొడిగికొని, తనకు భరతుండు సమర్పించిన రాజసింహాసనంబునం గూర్చుండి, యతని మన్నించి, కౌసల్యకుఁ బ్రియంబు సేయుచు, జగత్పూజ్యంబుగ రాజ్యంబు సేయుచుండె. అప్పుడు. 331

సీ. కలఁగు నెల్లను మానెఁ గంధు లేడింటికిఁ జలనంబు మానె భూచక్రమునకు
జాగరూకత మానె జలజలోచనునకు దీనభావము మానె దిక్పతులకు
మాసియుండుట మానె మార్తాండ విధులకుఁ గావిరి మానె [1]దిక్తటములకును
నుడిగిపోవుట మానె నుర్వీరుహంబుల కణఁగుట మానెఁ ద్రేతాగ్నులకును

ఆ. గడిఁది ప్రేఁగు మానెఁ గరి గిరి కిటి నాగ
కమఠములకుఁ బ్రజల కలఁక మానె
రామచంద్రవిభుఁడు రాజేంద్రరత్నంబు
ధరణి భరణరేఖఁ దాల్చు నపుడు. 332

వ. మఱియును. 333

సీ. పొలఁతుల వాలుఁజూపుల యందు చాంచల్య మబలల నడుమలయంద లేమి
కాంతాలకములంద కౌటిల్యసంచార మతివల నడుపులయంద జడిమ
ముగుదల పరిరంభములయంద పీడన మంగనాకుచములయంద పోరు
పడఁతుల రతులంద బంధ సద్భావంబు సతులఁ బాయుటయంద సంజ్వరంబు

---

1. దిగ్గగనములకు (హా)

తే. ప్రియులు ప్రియురాండ్ర మనముల బెరసి తార్పు
లంద చౌర్యంబు వల్లభు లాత్మసతుల
నాఁగి క్రొమ్మళ్ళు వట్టుటం దక్రమంబు
రామచంద్రుండు పాలించు రాజ్యమందు. 334

క. తండ్రిక్రియ రామచంద్రుఁడు, దండ్రుల మఱపించి ప్రజలఁ దా రక్షింపఁ
దండ్రుల నందఱు మఱచిరి, తండ్రిగదా రామచంద్ర ధరణిపుఁ డనుచున్. 335

వ. మఱియు, నా రామచంద్రుండు రాజర్షి చరితుండును, నిజధర్మ నిరతుండును, నేకపత్నీ వ్రతుండును, సర్వలోక సమ్మతుండును నగుచు, ధర్మవిరోధంబు గాకుండఁ గోరిక లనుభవింపుచుఁ, ద్రేతాయుగం బైనఁ. గృతయుగధర్మంబు గావించుచు, బాలమరణంబు మొదలగు నరిష్టంబులు ప్రజలకుఁ గలుగకుండ రాజ్యంబు సేయుచుండె. అయ్యెడ. 336

ఆ. సిగ్గువడుట గల్గి సింగారమును గల్గి
భక్తి గల్గి చాల భయము గల్గి
నయముఁ బ్రియముఁ గల్గి నరనాథు చిత్తంబు
సీత దనకు వశము చేసికొనియె. 337

అధ్యాయము-౧౧

వ. అనిన విని పరీక్షిన్న రేంద్రుం డి ట్లనియె. 338

ఆ. భ్రాతృజనులయందు బంధువులందును
ప్రజలయందు రాజభావ మొంది
[1]యెట్లు మెలఁగె రాముఁ డీశ్వరుం డగు తన్నుఁ
గూర్చి క్రతువు లెట్లు గోరి చేసె. 339

వ. అనిన శుకుం డి టనియె. 340

సీ. భగవంతుఁ డగు రామభద్రుండు ప్రీతితో దేవోత్తముని సగ్వదేవమయునిఁ
దనుఁదాన కూర్చి యధ్వరములు సేసెను హోతకుఁ దూరుపు నుత్తరంబు
సామగాయకునికి శమన దిగ్భాగంబు బ్రహ్మకుఁ గ్రమమునఁ బడమ రెల్ల
నధ్వర్యునకు శేష మాచార్యునకు నిచ్చి సొమ్ములు పంచి భూసురుల కొసఁగి

---

1. యెట్లు మెలఁగె రాఘవేశ్వరుం డీశ్వరుఁ గూర్చి క్రతువులేల (తం) రాఘవేశ్వరుం డెవ్వనిఁ గూర్చి క్రతువు లెట్లు (వా)

తే. [1]తనకు రెండు పుట్టంబులుఁ దనకు నైన
మెలఁత మంగళసూత్రంబు మినుకుఁ దక్క
వినతుఁ డై యుండె నా రాము వితరణంబు
పాండవో త్తమ! యేమని పలుకవచ్చు. 341

వ. అంత నా రామచంద్రుని దానశీలత్వంబునకు మెచ్చి విప్రవరులు తమతమ భూములు మరల నిచ్చి యి ట్లనిరి. 342

ఆ. ధరణి వలదు మాకుఁ దపసుల కేల నీ
వఖిల లోకగురుఁడ వైన హరివి
మా మనంబులందు మలయు చీఁకటిఁ బాపు
భవదుదార రుచులఁ పార్థి వావేంద్ర! 343

వ. అని పలికి, బ్రహ్మణ్యదేవుం డైన రామచంద్రుని వినయోక్తులఁ బూజించి, మునులు సనిరి. ఇట్లు పెద్దకాలంబు రాజ్యంబు నేసి, రాఘవేంద్రుం డొక్క దినంబున. 344

సీ. వసుధపైఁ బుట్టెడు వార్త లాకర్ణించు కొఱకు నై రాముండు గూఢవృత్తి
నడు రేయిఁ దిరుగుచో నాగరజనులలో నొక్కఁడు దనసతి యొప్పకున్న
నొరు నింటఁ గాఁపురం బున్న చంచలురాలిఁ బాయంగలేక చేపట్టె [2]నేమి
తా వెట్టియగు రామ ధరణీశ్వరుండ నే బేల! పొమ్మను మాట బిట్టు వలుక

ఆ. నాలకించి మఱియు నా మాట చారుల
వలన జగములోనఁ గలుగఁ దెలిసి
సీత నిద్రవోవఁ జెప్పక వాల్మీకి
పర్ణశాలఁ బెట్టఁ బనిచె రాత్రి. 345

వ. అంత సీతయు గర్భిణి గావునఁ గుశలవు లనియెడి కొడుకులం గనియె. వారికి వాల్మీకి జాతకర్మంబు లొనరించె. లక్ష్మణునకు నంగదుండును, చంద్రకేతుండును, భరతునకుఁ దక్షుండును, బుష్కలుండును, శత్రుఘ్నునకు సుబాహుండును, శ్రుతసేనుండును సంభవించిరి. అయ్యెడ. 346

క. బంధురబలుఁ డగు భరతుఁడు, గంధర్వచయంబుఁ ద్రుంచి కనకాదుల స
ద్బంధుఁ డగు నన్న కిచ్చెను, బంధువులును మాతృజనులుఁ బ్రజలున్ మెచ్చఁ.

---

1. తనదు (హ) 2. నేని తా వెట్టినగు (హ)

ఆ. మధువనంబులోన మధునందనుం డగు
లవణుఁ జంపి భుజబలంబు మెఱసి
మధుపురంబు సేసె మధుభాషి శత్రుఘ్నుఁ
డన్న రామచంద్రుఁ డౌ ననంగ. 348

వ. అంతఁ గొంతకాలంబునకు రామచంద్రుని కొమారు లైన కుశలవు లిద్దఱును వాల్మీకివలన వేదాది విద్యలయందు నేర్పరు లై, పెక్కుసభలను [1]సతానంబుగా రాము కథాశ్లోకంబులు పాడుచు, నొక్కనాఁడు రాఘవేంద్రుని యజ్ఞశాలకుం జని. 349

మత్తకోకిల. వట్టి మాఁకులు పల్లవింప నవారి యై మధుధార దా
నుట్టఁ బాడిన వారి పాటకు నుర్వరాధిపుఁడుఁ బ్రజల్
బిట్టు సంతస మంది రయ్యెడఁ బ్రీతిఁ గన్నుల బాష్పముల్
దొట్ట నౌదల లూచి వారలతోడి మక్కువ పుట్టఁగాన్. 350

వ. అంత నా రామచంద్రుఁడు కుమారుల కిట్లనియె. 351

ఆ. చిన్ని యన్నలార! శీతాంశుముఖులార!
నళినదళ విశాల నయనులార!
మధుర భాషులార! మహిమీఁద నెవ్వరు
దల్లి దండ్రి మీకు ధన్యులార! 352

వ. అనిన వారు, నేము వాల్మీకి [2]శిష్యులము. రాఘవేశ్వరుని యాగంబు సూడ వచ్చితిమి. అనవుడు, మెల్లన నగి, యెల్లి ప్రొద్దున మీ తండ్రి నెఱిఁగెదరు. ఉండుండు. అని యొక్క నివాసంబునకు సత్కరించి పనిచె. మఱునాఁడు సీతం దోడ్కొని కుశలవుల ముందట నిడుకొని, వాల్మీకి వచ్చి, రఘుపుంగవునిం గని, యనేక ప్రకారంబుల స్తుతియించి యిట్లనియె. 353

ఆ. [3]సీత శుద్ధురాలు చిత్త వాక్కర్మంబు
లందు సత్యమూర్తి యమలచరిత
పుణ్యసాధ్వి విడువఁబోలదు చేకొను
రవికులాబ్ధిచంద్ర! రామచంద్ర! 354

---

1. సుతానకంబుగా (హ) 2. పౌత్రులము (హ); వాల్మీకి శిష్యులము సీతపుత్రులము (జ)
2. ముద్దరాలు (హ. తం.) సుద్దరాలు (వా)

వ. అని వాల్మీకి వలుక, రామచంద్రుండు పుత్రార్థి యై విచారింపఁ, గుశలవులను వాల్మీకికి నొప్పగించి, రామచంద్ర చరణధ్యానంబు సేయుచు, నిరాశ యై సీత భూవివరంబు సొచ్చె. అ య్యెడ. 355

మ. ముదితా! యేటికిఁ గ్రుంకి తీపు [1]మనలో మోహంబు చింతింపవే
వదనాంభోజము సూపవే మృదువు నీ వాక్యంబు విన్పింపవే
తుది సేయం [2]దగదంచు నీశ్వరుఁడు నై దుఃఖించె భూపాలుఁ డా
పద గాదే ప్రియురాలిఁ బాసినయెడఁ భావింప నె వ్వారికిఁ. 356

వ. అని వగచి, రామచంద్రుండు బ్రహ్మచర్యంబు ధరియించి, [3]పదుమూఁడువేల యేం డ్లెడతెగకుండ నగ్నిహోత్రంబులు సెల్లించి, తా నీశ్వరుండు గావునఁ దన మొదలినెలవునకుం జనియె. ఇ ట్విధంబున. 357

ఆ. ఆది దేవుఁ డై న యా రామ చంద్రుని
కబ్ధిఁ గట్టు చెంత యసురకోటిఁ
జంపు చెంత కపుల సాహాయ్య మది యెంత
సురల కొఱకుఁ గ్రీడ చూపెఁ గాక. 358

చ. వళుఁడుగ [4]మొక్కెదన్ లవణవార్ధి విజృంభణతా నివర్తికిన్
దళ దిగధీశ మౌళిమణి దర్పణమండిత దివ్యకీర్తికిన్
దళశత భానుమూర్తికి సుధారుచి భాషికి సాధు పోషికిఁ
దళరథరాజు పట్టికిని దైత్యపతిం బొరిగొన్న జెట్టికిఁ. 359

ఉ. నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు మహోరుగంబులఁ
విల్లును దాల్చువాఁడు గడు విప్పగు వక్షమువాఁడు మేలు పైఁ
జల్లెడువాఁడు నిక్కిన భుజంబులవాఁడు యళంబు దిక్కులం
జల్లెడువాఁడు నై న రఘుసత్తముఁ డీవుత మా కభీష్టముల్. 360

ఆ. † రామచంద్రుఁ గూడి రాకల పోకలఁ
గదిసి తిరుగువారుఁ గన్నవారు
నంటికొన్నవారు నా కోసలప్రజ
లరిగి రాదియోగు లరుగు గతికి. 361

క. మంతనములు సద్గతులకు, పొంతనములు ఘనము లై న [4]పుణ్యముల కిదా
నీంతన పూర్వ మహోఘ ని,క్కంతనములు రామనామ కృతిచింతనముల్. 362

---

1. మదిలో (తం) 2. దగవచ్చు (హ) 3. పదునొకండు (హ) † 'బ' ప్రతిలో ఈ పద్యము లేదు. 4. పుణ్యములకుఁ దా నింతనములు పూర్వాఘని (హ)

వ. ఆ రామచంద్రునకుఁ గుశుండును, గుశునకు నతిథి, యతిథికి నిషధుండును, నిషధునకు నభుండును, నభునికిఁ బుండరీకుండును, బుండరీకునకు క్షేమధన్వుండును, క్షేమధన్వునకు దేవానీకుండును, దేవానీకునకు నహీనుండును, నహీనునకుఁ బారియాత్రుండును, బారియాత్రునకు బలుండును, బలునకుఁ జలుండును, జలునకు నర్కసంభవుం డగు వజ్రనాభుండును, వజ్రనాభునకు శంఖణుండును, శంఖణునకు విధృతియును, విధృతికి హిరణ్యనాభుండును, జయించిరి. ఆ హిరణ్యనాభుండు జైమిని శిష్యుం డైన యాజ్ఞవల్క్యమునివలన నధ్యాత్మయోగంబు నేర్చి, హృదయకలుషంబులంబాసి, యోగచర్యుం డయ్యె. అతనికిఁ బుష్యుండును, పుష్యునకు ధ్రువసంధియు, ధ్రువసంధికి సుదర్శనుండును, సుదర్శనునకు నగ్నివర్ణుండును, నగ్నివర్ణునకు శీఘ్రుండును, శీఘ్రునకు మరు వను రాజశ్రేష్ఠుండును బుట్టె. [1]ఆ రాజు యోగసిద్ధుం డై, కలాప గ్రామంబున నున్నవాఁడు. కలియుగాంతంబున నష్టం బయ్యెడు సూర్యవంశంబుఁ గ్రమ్మఱం బుట్టింపఁ గల వాఁడు మరువు. ఆ మరువునకు ప్రశుశ్రుకుండు, నా ప్రశుశ్రుకునకు సంధియు, నతనికి నమర్ష ణుం, డా యమర్ష ణునికి మహాస్వంతుం, డా మహాస్వంతునకు [2]విశ్వసాహ్యుండు, విశ్వసాహ్యునకు బృహద్బలుండు జనియించె. వాఁడు భారత యుద్ధంబున మీ తండ్రియగు నభిమన్యునిచేత హతుం డయ్యె. వినుము. 363

—: భవిష్య ద్రాజేతిహాస వర్ణనము :—

తే. పరఁగ నిక్ష్వాకుఁడును బృహద్బలుఁడు మొదలుఁ
దుదయుఁ గాఁగల రాజులఁ దోడుతోడ
నెఱుఁగఁ జెప్పితి [3]ని వారి నింకమీఁదఁ
బుట్టఁ గలవారిఁ జెప్పెద భూవరేంద్ర! 364

వ. ఆ బృహద్బలునకు బృహద్రణుండును, బృహద్రణునకు నురుక్షతుండు, నాతనికి వత్సప్రీతుండును, వత్సప్రీతునకుఁ బ్రతివ్యోముండును, ప్రతివ్యోమునకుఁ భానుండును, భానునకు [4]సహదేవుండును, సహదేవునకు బృహదశ్వుండును, బృహదశ్వునకు భానుమంతుండును, భానుమంతునకుఁ బ్రతీకాశ్వుండును, ప్రతీకాశ్వునకు సుప్రతీకుండును, సుప్రతీకునకు మేరుదేవుండును, మేరుదేవునకు [5]సుత

---

1. ఆరాజయోగి సిద్ధుండై (హ. తం. వా.); "యో అసావాస్తే యోగసిద్ధః (12-6)"
2. విశ్వసాహి (హ) 3. నేవారి (హ) 4. దివౌకా వాహినీపతిః సహదేవ స్తతః (12-10)
5. హతక్షత్రః అని మూలము (12-11)

ఋతుండును, సుతఋతునకు బుధుకుండును, బుధుకునకు నంతరిక్షుండును, నతనికి సుతపుండును, సుతపునకు నమిత్రజిత్తు, నతనికి బృహద్వాజియు, నతనికి బర్హియు, బర్హికి ధనంజయుండును, ధనంజయునకు రణంజయుండును, రణంజయునకు సృంజయుండును, సృంజయునకు శాక్యుండును, శాక్యునకు శుద్ధాదుండును, శుద్ధాదునకు లాంగలుండును, లాంగలునకు బ్రసేనజిత్తు, నతనికి క్షుద్రకుండును, క్షుద్రకునకు బుణకుండును, బుణకునకు సురథుండును, సురథునకు సుమిత్రుండును బుట్టుదురు. సుమిత్రుని యనంతర కాలంబున సూర్యవంశంబు నశింపంగలదు. వీరలు బృహద్బలునినుండి క్రమంబునం బుట్టం గలవారలు. అని చెప్పి శుకుం డి ట్లనియె. 365

అధ్యాయము-౧౩

సీ. ధన్యుఁ డా యిక్ష్వాకు తనయుఁడౌ నిమి యాగ మాచరింపఁగఁ గోరి యా వసిష్ఠు
నా ర్త్విజ్యమునకుఁ దా నర్థింపఁ గని యాతఁ డింద్రుని మఖము సేయింప నియ్య
కొనినాఁడ మఱి వత్తుఁ [1]గొదవ లేదన వచ్చి సంసార మెంతయుఁ జంచలంబు
కాలయాపన మేల గ్రతువు సేసెద నని యన్య ఋత్విక్కుల నతఁడు గూర్చి

తే. సేయ నింద్రుని యాగంబు చెల్లఁజేసి
గురుఁడు చనుదెంచి శిష్యుపైఁ గోపమెత్తి
యోరి నా వచ్చునందాఁక నుండ వనుచు
నతని దేహంబు వడుఁగాక యని శపించె. 366

వ. ఇట్లు వసిష్ఠుండు శపించిన, నిమియును, వసిష్ఠునిదేహంబు వడుఁగాక యని మరల శపించిన, న వ్వసిష్ఠుండు మిత్రావరుణుల వలనఁ గడపట నూర్వశికి జన్మించె. గురుశాపంబునఁ బ్రహ్మజ్ఞాని యైన నిమి, విగతదేహుం డైన, నతని దేహంబు మునీశ్వరులు గంధవస్తువులం బొదివి, దాఁచి, దొరకొన్న సత్రయాగంబు చెల్లించిరి. యాగంబు కడపటను దేవగణంబులు మెచ్చి వచ్చిన, వారలకు నిమి దేహంబు సూపి, బ్రతుకం జేయుం డనవుడు వారలు నిమిప్రాణంబులు వచ్చుంగాక యని పలికిన, నిమి తన దేహంబు సొరనొల్లక యి ట్లనియె. 367

మ. అతి మోహాకులితంబు సాంద్ర మమతాహంకార మూలంబు సం
తత నానా సుఖదుఃఖ పీడిత మనిత్యం బిట్టి దేహంబు సం
కృతి నా కేటికి మీనజీవనము భంగిం భీతిబాహుళ్య మం
చితరుల్ పెద్దలు దీనిఁ జేకొనరు సర్వేశ్వ మర్థిఁ గొల్చెదఁ. 368

---

1. కొదవసేసెద వచ్చి (తం. వా)

వ. అని పలికిన నిమిమాటలు గ్రమ్మఱింప నేరక, శరీరులు గన్నులు దెఱచినప్పుడును, మూసినప్పుడును, నిమి గానవచ్చుంగాక యని పల్కి దేవతలు సనిరి. అంత. 369

ఆ. పెద్ద లైన మునులు పృథ్వీస్థలికి రాజు
లేమిఁ జూచి నిమి కళేబరంబు
తరువ నొకఁడు పుట్టెఁ దనయుండు వానిని
జనకుఁ డనుచుఁ బలికె జగము లెల్ల. 370

వ. మఱియు నతఁడు [1]విగతదేహుండు గావున, వైదేహుం డనియును, మథన జాతుండు గావున మిథిలుం డనియుం బరఁగె. అ మ్మిథిలుని చేత నిర్మితం బైనది గావున మిథిలానగరంబు నాఁబరఁగె; ఆ జనకునకు నుదావసుండును, నుదావసు నకు నందివర్ధనుండును, నందివర్ధనునకు సుకేతుండును, సుకేతువునకు దేవ రాతుండును, దేవరాతునకు బృహద్రథుండును పుట్టెఁ. అతనికి [2]మహావీర్యుండును, నతనికి సుధృతియు, నతనికి ధృష్టకేతుండును, నతనికి హర్యశ్వుండు, నతనికి మరువు, నతనికిఁ బ్రతింధకుండును, నతనికిఁ గృతరయుండు, నతనికి దేవమీఢుం డును, నతనికి విధృతుండును, నతనికి మహాధృతియు, నతనికిఁ గీర్తిరాతుండు, నతనికి మహారోముండు, నతనికి స్వర్ణరోముండును, నతనికి హ్రస్వరోముండును, నతనికి సీరధ్వజుండును బుట్టెఁ. 371

ఆ. అతఁడు మఖముసేయ నవని దున్నింపంగ
లాంగలంబు కొనను లతణాంగి
సీత జాత యయ్యె సీరధ్వజుం డన
దానఁ జెప్పఁబడియె ధన్యఁ డతఁడు. 372

వ. ఆ సీరధ్వజునకుఁ గుశధ్వజుండును, గుశధ్వజునకు ధర్మధ్వజుండును, ధర్మధ్వజునకు కృతధ్వజ, మితధ్వజు లను వారిద్దఱుఁ బుట్టిరి. అందుఁ కృతధ్వజునకుఁ గేశిధ్వజుఁ డుదయించె. అతండుఁ దన్నుఁ దా నెఱిఁగెడి విద్యయందు నేర్పరియయ్యె. మిత ధ్వజునకు ఖాండిక్యుండనువాఁడు జన్మించి, తండ్రివలన నెఱుకగలవాఁ డై, కర్మ తత్త్వంబు నేర్చి, కేశిధ్వజునివలన భీతుండై యేఁగె. ఖాండిక్యునకు భానుమం తుండును, భానుమంతునకు శతద్యుమ్నుండును, శతద్యుమ్ననికి శుచియు, శుచికి సనద్వాజుండును, సనద్వాజునకు నూర్ధ్వకేతుండు, నూర్ధ్వకేతునకు నజుండును, నజునకుఁ గురుజిత్తుఁ, గురుజిత్తునకు నరిష్టనేమియు, నరిష్టనేమికి

---

1. విదేహజుండు గావున (వా); "సోఽభూ ద్వైదేహస్తు విదేహజః" (13-13)
2. "తస్య మహావీర్య సుసధృత్పితా" (13-15)

శ్రుతాయువు, శ్రుతాయువునకుఁ బార్శ్వ్వండును, బార్శ్వ్వనకుఁ జిత్రరథుండును, చిత్రరథునకు శమీపియు, శమీపికి హేమరథుండును, హేమరథునకు సత్యరథుండును, సత్యరథునకు నుపగురుండును, ఉపగురునకు నగ్నిదేవు ప్రసాదమున నుపగుర్వ్వండును, ఉపగుర్వ్వనకు సావనుండును, సావనునకు సువర్చసుండును, గలిగె. అతఁడె సుభూషణుం డని వినంబడు. ఆ సుభూషణునకు జయుండును, జయునకు విజయుండును, విజయునకు ఋతుండును, ఋతునకు ననఘుండును, అనఘునకు వీతిహవ్యుండును, వీతిహవ్యునకు ధృతియు, ధృతికి బహులాశ్వుండును, బహులాశ్వునకుఁ గృతియుఁ, గృతికి మహావశి యనువాఁడును జన్మించె. వీరలు మైథిలు లగు రాజు లని చెప్పంబడుదురు. యోగీశ్వర ప్రసాదంబున గృహస్థు లై యుండియు, బంధ విముక్తు లై, యాత్మజ్ఞానంబు గలిగి, నిరంతర బ్రహ్మానుసంధానంబు సేయుచు నుండుదు. అని పలికి, శుకయోగీంద్రుం డిట్లనియె. 373

అధ్యాయము - ౧౪

—: చంద్రవంశ్య లగు రాజుల యితిహాసము :—

ఆ. [1]చంద్రగౌర మైన చంద్రవంశమునందుఁ
జంద్రకీర్తితోడ జనిత మైన
యట్టి పుణ్యమతులు [2]నై ళాదిరాజుల
నింక వినుము మానవేంద్రచంద్ర! 374

సీ. ఒక వేయుతలలతో నుండు జగన్నాథు బొడ్డుఁ దమ్మిని బ్రహ్మ పుట్టె మొదల
నతనికి గుణముల నతనిఁ బోలిన దక్షుఁ డగు నత్రి సంజాతుఁ డయ్యె నత్రి
కడగంటి సూడ్కులఁ గలువలసంగడీఁ డుదయించె విప్రుల కోషధులకు
[3]నమరఁ దారాతతి కజుని పంపున నాథుఁ డై యుండి రాజసూయంబు సేసి

తే. మూఁడు లోకములను గెల్చి [4]మోఅకమునఁ
జని బృహస్పతి పెండ్లాముఁ జారుమూర్తిఁ
దార నిలుసొచ్చి కొనిపోయి తన్ను గురుఁడు
వేఁడు నందాఁక న య్యింతి విడువఁ డయ్యె. 375

వ. అంత వేల్పులతో రక్కసులకుఁ గయ్యం బయ్యె. బృహస్పతితోడి వైరంబునం జేసి, కావ్యుఁడు రాక్షసులతోఁ జేరికొని, చంద్రునిం జేపట్టి, సురాచార్యునిం

---

1. చంద్ర గౌరపమున (హ) 2. నైన రాజులనెల్ల (హ) 3. నంబుగర్భములకు (హ)
4. మోదమునను (హ)

బోఁదోలిన, హరుండు భూతగణసమేతుం డై, తన గురుపుత్రుం డైన బృహస్పతినిఁ జేపట్టె. దేవేంద్రుండును, సురగణంబులుం, దానును బృహస్పతికి నడ్డంబు వచ్చె. అ య్యవసరంబున బృహస్పతి భార్యానిమిత్తంబున రణంబు సురాసుర వినాశకరం బయ్యె. ఆలోన బృహస్పతి తండ్రి యగు నంగిరసుండు సెప్పిన విని, బ్రహ్మదేవుండు చంద్రునిం [1]గోపించి, గర్భిణి యైన తారను మరల నిప్పించినం జూచి, బృహస్పతి దాని కిట్లనియె. 376

ఉ. సిగ్గొకయింత లేక వెలచేడియ భంగిని ధర్మకీర్తులన్
బొగ్గులు సేసి జారు శశిఁ బొంది కటా! కడుపేల [2]దెచ్చికొం
చెగ్గు దలంపఁగా వలదె యిప్పుడు గర్భము దించుకొమ్ము నిన్
బ్రమ్గఁగఁ జేసెదన్ జెనఁటి మానవతుల్ నినుఁ జూచి మెత్తురే. 377

వ. అని కోపించుచుండ, నా చెలువకుఁ బసిండిచాయ మేను గల కుట్టి వుట్టె. వానిం జూచి, మోహంబు చేసి, బృహస్పతి తనకొడు కనియునుం, జంద్రుండు దన కన్నవాఁ డనియును, జగడించిరి. అప్పుడు. 378

ఆ. వారి వాదు చూచి వారింపఁగా వచ్చి
యేర్పరింపలేక యెల్ల మునులు
నమర వరుల నడుగ నా వేడుకలకత్తె
యెఱుఁగుఁ గాని యితరు లెఱుఁగ రనిరి. 379

వ. ఆ పలుకులు విని, సిగ్గుపడియున్న తారకుఁ జిన్ని కొమరుం డిట్లనియె. 380

క. ఇలువరుస చెడఁగ బంధులు, దలవంపఁగ మగఁడు రోయఁ దల్లీ! కట్టా
వెలి నేల[3]దన్నుఁ గంటివి, కలిగించినవాఁడు శీతకరుఁడో గురుఁడో. 381

వ. అని పలుకుచున్న కొడుకునకు మఱుమాట లాడనేరకున్న తార నేకాంతంబునఁ జీరి మంతనంబున బ్రహ్మ యిట్లనియె. 382

మ. చెలువా! నీ యెలసిగ్గు వాపి, గురుఁడో శీతాంశుఁడో యెవ్వఁడో
లలితాకారుఁ గుమారుఁ గన్న యతఁ డేలా దాఁప నీ పాటు నీ
తలనే పుట్టెనె వెచ్చ నూర్పకుము కాంతల్ [4]కామినుల్ గారె మా
టల నిం దేమియుఁ [5]బోదు పో యెరులతోడం [6]జెప్ప విన్పింపవే. 383

వ. అని పలికిన బ్రహ్మకు నెదురు మాటాడ వెఱచి, మంతనంబున న య్యింతి, చంద్రునికిం గన్నదాన. అనవుఁడు నా బాలకునకు బుధుం డను పేరు పెట్టి, చంద్రున కిచ్చి, బ్రహ్మ సనియె. అంత. 384

---

1. తిట్టి(తం.క.చ.ట.త.) 2. చేసికొంటి(తం.క.) 3. నన్ను(తం.వా.) 4. కాముకల్(తం.వా.)
5. బోవదొండొరులతోడన్(తం) 6. జెప్పి (హ)

ఆ. బుద్ధి మంతుఁ డైన బుధుఁడు పుత్రుం డైన
మేను పెంచి రాజు మిన్నుముట్టె
బుద్ధిగల సుతుండు పుట్టినచోఁ దండ్రి
మిన్ను ముట్ట కేల మిన్నకుండు. 385

వ. ఆ బుధునకుఁ దొల్లి చెప్పిన యిళాకన్యకవలనఁ బురూరవుండు పుట్టె. ఆ పురూరవునకుఁ గల శౌర్య సౌందర్య గాంభీర్యాది గుణంబులు నారదునివలన నింద్రసభలోన నూర్వశి విని, మిత్రావరుణుల శాపంబున మనుష్య స్త్రీరూపంబు దాల్చి, భూలోకంబునకు వచ్చి, పురూరవు ముందట నిలువంబడి. 386

తరల. సరసిజాతము మృగేంద్రమధ్యు విశాలవక్షు మహాభుజున్
సురుచిరానన చంద్రమండల శోభితున్ సుకుమారు నా
పురుషవర్యుఁ బురూరవుం గని, పుప్పుటంపర జోదు చేఁ
దొరఁగు క్రొవ్విరి తూపులఁ బదిఁ [1]దూలపోవఁగ భ్రాంత యై. 387

వ. ఊర్వశి నిలిచి యున్నంత. 388

ఉ. భావజు [2]కోలయో మొగులువాసి వెలుంగు మెఱుంగో మోహినీ
దేవతయో నభోరమయొ దీని కరగ్రహణంబు లేనిచో
జీవన మేటి కంచు మరుచేఁ జిగురాకడిదమ్ము జిమ్ములం
దా వడఁకెన్ బురూరవుఁడు తామరపాకు జలంబు కైవడిఁ. 389

వ. ఇట్లు రాచపట్టి చెఱకు వింటివాని దాడికి నోడి, యెట్టకేలకు సైరణచేసి నిలుకడం దెచ్చికొని, య చ్చెలువ కి ట్లనియె. 390

ఉ. ఎక్కడనుండి రాక మన కిద్దఱికిం దగు నీకుఁ దక్కితిన్
[3]మ్రుక్కడి వచ్చెనే యలరు ముల్కుల వాఁ డడిదంబు [4]ద్రిప్పుచే
దిక్కునెఱుంగ [5]నో యబల! దేహము దేహము గేలుఁ గేల నీ
చెక్కునఁ జెక్కు మోపి తగు చెయ్వుల నన్ను విపన్నుఁ గావవే. 391

వ. అనినం బ్రోడచేడియ యి ట్లనియె. 392

మ. ఇవి నా కూర్చు తగళ్లు రెండు దగ నీ వెల్లప్పుడుఁ గాచెదే
ని వివస్త్రుండవు గాక [6]నాకడ సదా నీ వుండుదేనిన్ విశే
ష [7]విలాసాధిక! నీకు నా ఘృతము భక్ష్యం బయ్యె నేనిన్ మనో
జ వినోదంబుల నిన్నుఁ దేల్తు నగునే చంద్రాన్వయ గ్రామణీ! 393

---

1. దొందడించిన (తం. క. జ.) 2. దీమయో (తం. వా. క.) 3. ముక్కడి వచ్చెనో (హ)
4. ద్రివ్వనే (హ); ద్రిప్పెనే (తం) 5. నే (హ) 6. నాకడనుదా (హ); నాకడనుఁ దగన్ (వా);
7. వివేకగుణాలంకృత నీకు నానతము నిక్కంబయ్యె నేనిన్ (హ); లక్ష్యంబయ్యె నేనిన్ (చ)

వ. అని పల్కిన వేల్పుల వెలయాలి ప్రతిమాటల కియ్యకొని తన మనంబున. 394

క. మంచిదఁట రూపు [1]ననురతి, నంచిత యఁట దేవగణిక యఁట మరుచేత
సంచలిత [4]చిత్త యై కా,మించిన దఁట యింతకంచె మేలుం గలదే. 395

వ. అని నిశ్చయించుకొని. 396

ఆ. రాజు రాజముఖుని రతిఁదేల్చె బంగారు
మేడలందుఁ దరుల నీడలందుఁ
[3]దోఁటలందు రత్నకూటంబు లందును
గొలఁకులందు గిరుల కెలఁకులందు. 397

వ. అంత న య్యిద్దఱకుం దగులంబు నెలకొనిన. 398

క. [4]ఒకదిక్క యేగుదురు వా,రొకచోటన కాని నిలిచి యుండరు దమలో
[5]నొకటియె మనమున నెంచుదు, రొకనిమిషము పాయకుందు రువిదయుఁదానుఁ.

క. దయ్య మెఱుంగును వారల, నెయ్యంబును మక్కువలును [6]నిజమరితనముల్
[7]వియ్యములును నెడసందినిఁ, బయ్యదకొం గడ్డమైనఁ ప్రాణము వెడలుఁ. 400

వ. ఇట్లూర్వశియుం, బురూరవుండు నొండొరులవలని మక్కువలు చెక్కొత్తం, బగళ్ళు రేలు నెల్లెడల విహరింప, నొక్కనాఁడు దేవలోకంబున దేవేంద్రుండు గొలువుండు తఱిఁ గొలువున నూర్వశి లేకుండుటం జూచి. 401

క. ఇన్నిదినంబులోపలె నా, యున్న సభామధ్యవేది యూర్వశి లేమిఁ
విన్నఁదనముతో నున్నది, వన్నె దఱిఁగియున్న పసిఁడివడువున ననుచుఁ. 402

వ. ఇంద్రుండు గంధర్వులం బనిచిన, వారు నడురేయిం జని, చీఁకటి నూర్వశి పెంచుకొన్న యేడకంబులం బట్టిన, నవి రెండును మొఱవెట్టిన, వాని మొఱ విని, రతి ఖిన్నుం డై మేను మఱచి, కూరుకుచున్న పురూరవు కాఁగిటనుండి యూర్వశి యిట్లనియె. 403

మ. అదె నా బిడ్డలఁ బట్టి దొంగలు మహాహంకారు లై కొంచు ను
న్మదు లై పోయెద రడ్డపాటునకు సామర్థ్యంబునఁ హీనుఁ డై
కదలం డీ మగపంద కూరుకుగతిం గన్మ్రాసి గుర్వెట్టుచుఁ
[9]వదలంజాలఁడు నాదు కాఁగిలియుఁ దా వంధ్యాత్ముఁ డై చెల్లరే. 404

---

1. సంతతి (హ); ననుమతి (ద) 2. చిత్తు నన్తుఁ (హ) 3. డోలలందు రత్నశాలలందును దమ్మి 4. ఒక దిక్క కాని చనబో (తం.వా.) 5. నొకటియె కాని తలంపరు(క.త.డ.తం.వా.) 6. నిజగరితన ముల్ (హ) 7. వియ్యముగలచో నందడిఁ (హ); తియ్యము లౌనెడ సుందరి (క.జ.డ.) 8. లోమన, మున్న (హ) 9. ప్రిదులం జాలఁడు నాదు కాఁగిలియు సంప్రీతాత్ముఁడై చెల్లరే (చ. జ.) సంభీతాత్ముఁడై చెల్లరే (తం)

క. పగతురు [1]దొంగల రేఁపఁగ, మగఁటిమి వాటింపలేక [2]మగతన మెల్లఁ
మగువల కౌఁగిటఁ [3]జూపెడు, మగవాఁ డగుకంఠె మగఁడు మగువగు టొప్పుఁ

ఆ. అధముఁ డైనవాని కాలగుకంఠె న
త్యధికునింట దాసి యగుట మేలు
హీనుఁ బొంది యోని హింసింపఁగా నేల
యువతిజనుల కూర కుంట లెస్స. 406

క. [4]ఏటికి నీ రాచరికం, బాఁటది మొఱవెట్టఁ బశువు లాతురపడ నో
యాఁట దని లేచి దొంగల, గీఁటవు వెడలంగ శవముక్రియ నుండె దిదే. 407

క. వినియు వినవు రణభీరువు, మనుజాధము నిదురబోతు మందుని నకటా!
నినుఁ జక్రవర్తిఁ జేసిన, వనజాసనుకంఠె వెట్టివాఁడునుఁ గలఁడే. 408

వ. అని పెక్కుభంగుల న య్యింతి, [5]పరుషోక్తు లను కరవాలమ్ములు చెవులఁ
జొనుప, నా రాజశేఖరుం డంకుశంబు పోట్ల [6]నడరు మదగజంబు చందంబున
చీర మఱచి, దిగంబరుం డై, వాలు కేల నంకించి, నడురేయి దొంగల నఱికి
వైచి, మేషంబుల విడిపించుకొని, తిరిగి వచ్చునెడ. 409

ఆ. చీఱలేని మగనిఁ జెలువ దా నీక్షించి
కన్ను మొఱఁగి పోవఁ [7]గడఁక నతఁడు
వెట్టివాని భంగి వివశుఁ డై పడి లేచి
పొగిలి తెఱలి స్రుక్కి పొక్కిపడియె. 410

వ. మఱియుఁ బురూరవుండు మదనాతురుం డై, వెతకుచు, సరస్వతీ తీరంబునఁ
జెలికత్తెలతోఁ గూడియున్న యూర్వశిం గని, వికసితముఖుం డై యిట్లనియె.

మ. తనుమధ్యా! యిది యేల వచ్చి తకటా ధర్మంబె శర్మంబె ముఁ
మనలో [8]నుంకువ లాడికొన్న పలుకుల్ మర్యాదలున్ దప్పెనే
నిను నే బాసినయంతనుండి తనువు న్నేలం బడ[9]బాఱె మే
దినిపై వ్రాలకమున్న నన్నుఁ గరుణాదృష్టిఁ విలోకింపవే. 412

వ. అనిన నూర్వశి యిట్లనియె. 413

---

1. దొంగలనేఁపఁగ (తం. వా.) 2. మగతనమెడలన్ (తం) 3. నడఁగెడు (తం)
4. ఏటికి నీరాచరికము, బోటులు మొఱవెట్టఁ బశువు బోరని యరవన్
వేఁటల నిడ్చెడు దొంగల, గీఁటణఁపవు వెడలి శవము క్రియ నుండెడిదే (హ)
5. పరుసని పలుకులను కఱకు వాలమ్ముల (ట. తం. వా.) 6. నడంగు (హ) 7. కాళ్ళరాక (హ) 8. నుంకుగ (తం. వా) 9. బారె నన్, దిను న్గ్రంపు మృగాళి దీనిఁ (హ. వా)

క. మగువలకు నింత లొంగెదు, మగవాఁడవె నీవు పశువుమాడ్కిన్ వగవం
దగవే మానుషపశువును, మృగములు గని రోయుఁగాక మేలని తినునే. 414

వ. అదియునుం గాక. 415

మ. తలఁపుల్ చిచ్చులు మాట లుజ్జ్వల సుధాధారల్ విభుం డైన పు
వ్విలుతుఁ [1]మెచ్చర [2]యన్యులన్ వలతు రే విశ్వాసమున్ లేదు క్రూ
రలు [3]తోడుం బతినైనఁ జంపుదు రధర్మల్ నిర్దయల్ చంచలల్
వెలయాం డ్రెక్కడ వారి వేడబము లా వేదాంతసూక్తంబులే. 416

ఉ. ఇం కొకయేఁడు వోయిన నరేశ్వర! యాతలి రేయి నీవు నా
లంకెకువచ్చి యాత్మజుల లక్షణవంతులఁ గాంచె దేమియుఁ
గొంకక పొమ్ము నావుడును గొమ్మను గర్భిణిఁగాఁ దలంచుచున్
శంక యొకింత లేక నృపసత్తముఁ డల్లన పోయె వీటికిన్. 417

వ. ఇట్లు మరలి చని, తన పురంబున నొక్కయేఁ డుండి, పిదప నూర్వశి కడ కేఁగి, యొక్క రేయి పురూరవుం డ య్యింతికడ నున్న, నా వెలఁదియు గంధర్వుల వేఁడికొనుము. త న్నిచ్చెదరు. అనవుడు నతండు గంధర్వులను బ్రార్థించిన, వార లతండు పొగడుటకు మెచ్చి, యగ్నిస్థాలి నిచ్చిన, న య్యగ్నిస్థాలిని నూర్వ శింగాఁ దలంచుచు, దానితో నడవిం దిరుగుచుండి, యొక్కనాఁ డగ్నిస్థాలి యని యెటింగి, వనంబున దిగవిడిచి, యింటికిఁ జనుదెంచి, నిత్యంబు రాత్రి దానిన చింతించుచుండఁ, ద్రేతాయుగంబు సొచ్చిన నా రాజు చిత్తంబునఁ గర్మ బోధంబు లై, వేదంబులు మూఁడు మార్గంబులం దోఁచిన, నా భూవరుండు స్థాలికడకుం జని, యందు శమీగర్భజాతం బై న యశ్వత్థంబుఁ జూచి, యశ్వత్థంబు చేత నరణులు రెండు గావించి, ముందటి యరణి దానును, వెనుకటియరణి నూర్వశియును, రెంటినడుమ నున్న కాష్ఠంబు పుత్రుండు నని, మంత్రంబు చెప్పుచుం ద్రచ్చుచుండ, జాతవేదుం డను నగ్ని సంభవించె. అతఁడు విహితా రాధన సంస్కారంబునంజేసి, యాహవనీయాది రూపంబుల మూఁట నెగడి, పురూరవుని పుత్రుం డని కల్పింపంబడియె. ఆ యగ్నిపురూరవునిఁ బుణ్యలోకంబు నకుం బనుపం గారణం బగుటంజేసి. 418

క. ఆ యగ్నిచేఁ బురూరవుఁ, డా యజ్ఞేశ్వరు ననంతు హరి వేదమయున్
శ్రీయుతుఁ గూర్చి యజించె గు, ణాయుతుఁ డూర్వశిఁ గనంగ నరిగెడుకొఱకై

---

1. మెచ్చురు (హ) 2. యన్యులం దలఁతురే (హ) 3. పొత్తుం (హ)

ఉ. §ఒక్కఁడ వహ్ని వేల్ప పురుషో త్తముఁ డొక్కఁడ సర్వ వాఙ్మయం
బొక్కఁడ వేద మా ప్రణవ మొక్కఁడ వర్ణము తొల్లి ప్రేతయం
దెక్కటి మాన్పి మూఁడుగను నేర్పటిచెఁ దన బుద్ధి వెంపుచేఁ
జక్కఁగ నా పురూరవుఁ డశక్తులకుఁ సులభంబు లౌ గతిఁ. 420

అధ్యాయము - ౨౨

వ. ఇట్లు వేదవిభాగంబు గల్పించి, యాగంబు సేసి, పురూరవుం డూర్వశి యున్న గంధర్వలోకంబునకుం జనియె. అతనికి నూర్వశిగర్భంబున నాయువు, శ్రుతా యువు, సత్యాయువు, రయుండు, జయుండు, విజయుం డన నార్గురు పుత్రులు గలిగిరి. అందు శ్రుతాయువునకు వసుమంతుండును, సత్యాయువునకు ద్రుతంజ యుండును, రయునకు శ్రుతుండు, నేకుండు నన నిరువురును, గలిగిరి. జయునకు నమితుండును, విజయునకు భీముండును జనించిరి. ఆభీమునకుఁ గాంచనుండును, గాంచనునకు హోత్రకుండును, హోత్రకునకు గంగాప్రవాహంబు పుక్కిటం బట్టిన జహ్నుండును, జహ్నునకుఁ బూరుండును, బూరునకు బాలకుండును, బాలకునకు నజకుండును, నజకునకుఁ గుశుండును, కుశునకుఁ గుశాంబుండు, ధూర్తయుండు, వసువు, కుశనాభుం డన నలువురును సంభవించిరి. అందుఁ గుశాంబునికి గాధి యనువాఁడు గలిగె. ఆ గాధి రాజ్యంబు సేయుచుండ. 421

సీ. సత్యవతిని గాధిజాతను కన్యను విప్రుఁడు ఋచికుండు వేఁడికొనిన
గాధియు సుత కీడు గాఁడని తెల్లని నవకంపు మేనులు నల్ల చెవులు
గల గుఱ్ఱములు వేయు కన్యకు నీ వుంకు విచ్చిన [1]గూఁతురు నిత్తు ననిన
వసుధామరుండును వరుణుని కడ కేఁగి హరులఁ దెచ్చినఁ గూఁతు నాతఁ డిచ్చె

ఆ. నా మహాత్మ సతియు [2]నత్తయుఁ గొడుకులఁ
గోరి యడుగ నీయకొని యతండు
విప్రరాజ మంత్రవితతుల వేల్పించి
చరువు సేసి గ్రుంకఁ జనియె నదికి. 422

వ. అయ్యెడం దల్లి యడిగిన, సత్యవతి బ్రహ్మమంత్రంబుల వేల్పించిన చరువు దల్లి కిచ్చి, క్షాత్రమంత్రంబులం దల్లికి వేల్పించిన, చరువు దా నందుకొని యుండ, నా ముని సనుదెంచి, చరువు విడ్వడుట యెఱింగి, భార్య కి ట్లనియె.

---

§ ఉ. ఒక్కటి వహ్ని వేల్వఁ బురుషో త్తము డొక్కఁడు వాఙ్మయంబులం
దొక్కటి వేద మా ప్రణవ మొక్కటి వర్ణముదొల్లిఁ ద్రేతయం
దొక్కటి చూచి మూఁడుగను దోరముగా నొనరించె బుద్ధిచేఁ
జక్కన నా పురూరవుఁ డశక్తులకున్ సులభంబు లెట్లగున్. (హ)

1. నే నిత్తునని (తం. వా.) 2. నంతయు (హ)

ఆ. తల్లిచరువు నీవు దాల్చి నీచరు వేల
తల్లిపాల నిడితి తరళనేత్ర!
కొమ్మ యింక నీకుఁ గ్రూరుఁడు వుట్టు మీ
యమ్మ బ్రహ్మవిదుని ననఘుఁ గాంచు. 424

వ. అనిన, న య్యింతి వెఱచి మ్రొక్కి, వినయంబు లాడినం బ్రసన్నుం డై, నీ కొడుకు సాధు వై, నీ మనుమండు క్రూరుం డగుం గాక యని, రుచికుం డనుగ్రహించిన, నా సత్యవతికి జమదగ్ని సంభవించె. ఆసత్యవతియునుం గౌశికీనది యై, లోకపావని యై ప్రవహించె. ఆ జమదగ్నియు రేణువుకూఁతురు రేణుకను వివాహం బై, వసుమనాది కుమారులం గనియె. అందు. 425

క. పురుషోత్తము నంశంబున, ధర జమదగ్నికి జనించె ధన్యుఁడు రాముం
డిరువదియొక మఱి నృపతుల, శిరములు జక్కడిచెఁ దనదు చే గొడ్డంటన్. 426

వ. అనిన విని, భూవరుండు శుకున కి ట్లనియె. 427

—: పరశురాముని చరిత్ర :—

ఉ. ఏటికిఁ జంపె రాముఁ డవనీశులఁ బల్వుర వారియందుఁ [1]ద
ప్పేటిది విప్రుఁడయ్యు నతఁ డేటికి రాజస తామసంబులన్
వాటముఁ బొంది భూభరము వారిత మౌ టది యేవిధంబు నా
మాటకు మౌనిచంద్ర! మఱుమాట ప్రకాశముగాఁగఁ జెప్పవే. 428

వ, అనిన విని శుకుం డి ట్లనియె. 429

సీ. హైహయాధీశ్వరుం డర్జునుం డనువాఁడు ధరణీశ్వరులలోనఁ దగినవాఁడు
పురుషోత్తమాంశాంశుఁ బుణ్యు దత్తాత్రేయు నారాధనము సేసి యతనివలనఁ
బరిపంథిజయమును బాహుసహస్రంబు ననిమాది గుణములు యశము బలము
యోగీశ్వరత్వంబు నోజయుఁ దేజంబు చెడని యింద్రియములు సిరియుఁ బడసి

తే. గాలికై వడి సకలలోకంబులందుఁ
దనకు [2]పోరాని రారాని [3]తలములేక
యెట్టిచో నైనఁ దనయాజ్ఞ యేపు మిగుల
ధరణి వెలుగొందె వినువీథిఁ దరణిమాడ్కి. 430

---

1. తప్పేమిటి (హ); తప్పేటికి (వా) 2. పోరామి రారామి (హ) 3. తావు (ట.వా.)

మ. ఒకనాఁ డా మనుజేంద్రుఁ డంగనలతో నుద్యానమున్ దైవ వీట నుం
డక రేవానది కేఁగి యందుఁ దెలినీటఁ జల్లుఁ బోరాడి దీ
ర్ఘ కరాబ్జంబుల నా నదీజలములఁ గట్టెఁ వడి న్నీరు ప్రో
లకుఁ బెల్లుబ్బి రణాగతుం డయిన యా లంకేశుపైఁ [1]దొట్టఁగఁ. 431

వ. ఇట్లు దిగ్విజయార్థంబు వచ్చిన రావణుం డా రాజు [2]చేకట్టం దొట్టిన యేటినీటికి సహింపక, రోషంబునం బోటరియుఁ బోలె న మ్మేటిమగనితోడి పోరాటము నకుం దొడరినఁ, బాటింపక తన బాహుపాటవంబున. 432

క. వీఁకమెయి నతఁడు రావణు, కూఁకటు లగలించి పట్టికొని మోఁకాళ్ళం
దాఁకించి కోఁతికై వడి, నాఁకం బెట్టించెఁ గింకరావళిచేతఁ. 433

వ. అంత నర్జునుండు మాహిష్మతీపురంబున కేతెంచి. 434

క. ఆ రాజేంద్రుఁడు రావణు, నోరీ! యిటమీఁద నూరకుండుము జగతిఁ
[3]వీరుఁడ ననకుము కాచితిఁ, బోరా యని సిగ్గుపఱిచి పుచ్చెను మరలఁ. 435

వ. అంత. 436

సీ. ధరణీశుఁ డొకనాఁడు దైవయోగంబున వేఁటకై కాంతారవీథి కేఁగి
తిరిగి [4]వేఁటల శ్రాంతదేహుఁ డై జమదగ్నిమునియాశ్రమముఁ జేరి మ్రొక్కి నిలువ
నా మునీంద్రుఁడు రాజు నర్థితోఁ [5]బూజించి యా రాజునకు రాజు ననుచరులకుఁ
దన హోమధేనువుఁ దడయక రప్పించి యిష్టాన్నములు గురియింపఁ దడవఁ

తే. గుడిచి కూర్చుండి మొదవుపైఁ గోర్కిఁ జేసి
[6]సంప దేటికి నీ యావు చాలుఁగాక
యిట్టి గోవుల నెన్నఁడు నెఱుగ మనుచుఁ
బట్టి తెండని తనయొద్ది భటులఁ బనిచె. 437

వ. పంచిన వారలు దర్పంబునం జని. 438

క. క్రేపుం బాపకుఁ డంచును, [7]నాపదలం బడితి ననుచు నంభా యంచున్
జూపోపరు నృపు లంచును, వాపోవన్ మొదవుఁ గొంచు వచ్చిరి పురికిన్. 439

వ. అంత నర్జునుండు మాహిష్మతీపురంబునకు వచ్చునెడ, రాముం డాశ్రమంబున
కే తెంచి. 440

---

1. గొట్టఁగఁ (హ) 2. చెంగటం (హ) 3. వీరుఁడవని నినుఁ గాచితి (హ) 4. ఆకట (క.బ.); ఆటల (వా) 5. దీవించి (క.త.డ.) 6. సంపదయదేల (తం. వా.) 7. వాపీడం బడితిమనుచు (తం.)

ఆ. అద్దిరయ్య యింట నశనంబుఁ గుడిచి మా
యయ్య వల దనంగ నాక్రమించి
[1]కోరి మొదవు రాజు గొనిపోయినాఁ డఁట
యేను రాముఁ డౌట యెఱుఁగఁ డొక్కొ. 441

వ. అని పలికి. 442

మ. ప్రళయాగ్నిచ్ఛట భంగిఁ గుంభి విదళింపఁ బాఱు సింహాకృతిఁ
బెలుచఁ రాముఁ డిలేఱు వెంట నడచెఁ బృథ్వీతలం బెల్ల నా
కులమైఁ గ్రుంగఁ గుఠారి యై కవచి యై కోదండి యై కాండి యై
ఛలి యై సాహసి యై మృగాజిన మనోజ్ఞ శ్రోణి యై తూణి యై. 443

వ. చని మాహిష్మతీపురంబుఁ జేరి నిలుచున్న సమయంబున. 444

మ. కనియెఁ ముందటఁ గార్తవీర్యుఁడు సమిత్కాముం బ్రకామం శరా
సనతూణీర కుఠారభీము నతిరోష ప్రోచ్చలత్ భ్రూయుగా
నన నేత్రాంచల సీము నైణపట నానామాలికోద్దాము నూ
తన సంరంభ నరేంద్ర దార శుభసూత్రఛ్ఛామునిన్ రామునిన్ 445

వ. కని కోపించి. 446

ఉ. బాలుఁడు వెట్టి బ్రాహ్మణుఁడు బ్రాహ్మణు కైవడి నుంటమాని భూ
పాలురతోడ భూరిబల భవ్యులతోడ భయంబుఁ దక్కి క
య్యాలకు వచ్చినాఁడు మనయం దిఁక బాపము లేదు లెండు లెం
డేల సహింప భూసురునినేయుఁడు వేయుఁడు గూల్పుఁ డిమ్మహిన్, 447

వ. అని కదలించి, దండనాయకులం బురికొల్పిన, వారును రథగజతురగపదాతిసమూ
హంబులతో లెక్కకుం బదియే డక్షౌహిణులతో నెదుర నడచి, శరచక్రగదా ఖడ్గ
భిండివాల శూల ప్రముఖ సాధనంబుల నొప్పించిన, న వ్విప్రుండు గన్నులకొలు
కుల నిప్పులు కుప్పలుగొన రెట్టించిన కట్టల్క మిట్టిపడి, యజ్ఞోపవీతంబు చక్క
నిడికొని,కరాళించి, బిట్టు [2]దట్టించి, కఠోరం బగు కుఠారంబు సారించి,మూఁకలపై
కుఱికి, [3]తొలియాడి మొగంబునం [4]గ్రొచ్చెలికపట్టునం జెట్టులు గొట్టు కృషీవలుని
తెఱంగునఁ బదంబులు ద్రెంచుచు, నరఁటికంబంబులఁ దెగనడుచు నారామకారుని
పగిది మధ్యంబులఁ ద్రుంచుచుఁ, దాళఫలంబులు రాల్చు వృక్షారోహకునికైవడి
శిరంబులఁ ద్రుంచుచు, మృగంబుల [5]వండం దుండించు సూపకారునిభంగి నవయవం

---

1. క్రొవ్వి (తం. వా.) 2. రెట్టించి (హ) 3. తొలకరి (తం. వా.) 4. నెట్టంగ (హ)
5. మృగముల ఖండించు (హ)

బులఁ జెక్కుచు, నంతటం దనివి సనక, విలయకాల కీలికేళిని మంట లుమియుచు, విల్లంది యెల్లెడం బిడుగులసోనలు గురియు బలు మొగుళ్ళవడువున నప్రమాణంబు లగు బాణంబులు పఱపి, సుభటసైన్యంబుల దైన్యంబు నొందించుచు, నడ్డంబులు లేని యార్భాటంబులు గల బాణవర్ష ఘృతంబులచే రాహుతులం గోపానలం బున కాహుతులు సేయుచుఁ, దురంగంబుల నిరంగంబులఁ గావించుచు, రథంబుల [1]వితథంబులుగా నొనర్చుచు, ద్విరదంబుల నరదంబులపైఁ బడఁద్రోయుచు, ని
వ్విధంబున సేనల నంపవానల ముంచి, రూపు[2]మాపిన. 448

క. మత్తిల్లి భూతజాలము, చిత్తంబులఁ జొక్కి వేడ్క చిందులువాఱన్
జొత్తిల్లి సమిత్తలమున, నెత్తురు మేదంబు పలలనికరం బయ్యెన్. 449

వ. అ య్యవసరంబున. 450

క. మే లీ బ్రాహ్మణుఁ డొక్కఁడు, [3]నేలం బడఁగూల్చె సైన్యనిచయము నెల్లన్
బాలార్భ నేల యీతనిఁ, దూలించెదఁగాక నాదు దోర్బలమువడిన్. 451

వ. అని పలికి. 452

మ. ఒక యేనూఱు కరంబులన్ ధనువు [4]లత్యుల్లాసి యై తాల్చి వే
ఱొక యేనూట గుణధ్వనుల్ నిగుడ శాతోగ్రాస్త్రముల్ గూర్చి వి
ప్రకుశారంబును నిన్నుఁ గూల్తు ననుచున్ భర్జించి పుంఖానుపుం
ఖ కఠోరంబుగ [5]నేసె రాజు [6]రయరేఖా ధామునిన్ రామునిన్. 453

క. వడిఁ దూపు [7]లేయ గుడుసులు, పడి కార్ముక పంచశతము పరఁగ విభుఁడు సొం
పడరెఁ బరివేషచయముల, నడుమ ఖరద్యుతుల వెలయు నళినాప్తు క్రియన్.

వ. ఇ ట్లర్జునుండు [8]బాణవిలాసంబు సూపిన. 455

మ. ధరణీదేవుఁడు రాముఁ డాధ్యుఁడు జగద్ధానుష్క రత్నంబు దు
ష్కరచాపం బొక చెక్కువెట్టి శరమున్ సంధించి వెల్లేసి భూ
వరు కోదండము లొక్కచూడ్కిఁ దునిమెన్ వా డంతటం బోక వే
గువుల్ ఱువ్వఁ గుశారధార నఱకెన్ దద్బాహు సందోహమున్. 456

[illegible]సిన నతనికి, శిర మొక్కటి చిక్క శైలశిఖరముభంగిం
[illegible]ద్రుంచెను, బరసూదనుఁ డైన ఘనుఁడు భార్గవుఁడు వడిన్.

---

1. తం. వా. 2. మానిన (హ) 3. నేలంగూలించె (హ)
4. [illegible] 5. నేసియార్చె (హ) 6. జయ (తం) 7. లెగయ (హ)

ఆ. తండ్రి వడిన నతని తనయులు పదివేలు
దలఁగి పోయి రతనిఁ దాఁకలేక
పర భయంకరుండు భార్గవుం డంత నా
గోవుఁ బ్రేపుతోడఁ గొనుచుఁ జనియె. 458

వ. ఇట్లు హోమధేనువు మరలం దెచ్చి యిచ్చి తన పరాక్రమంబుఁ దండ్రికిం దోఁబుట్టు
వులకుఁ దెలియఁజెప్పిన, జమదగ్ని రామున కిట్లనియె. 459

క. కల వేల్పులెల్లఁ దమతమ, చెలువంబులు దెచ్చి రాజుఁ జేయుదు రకటా!
బలువేల్పు రాజు వానిం, జలమున ని ర్జీల పోయి చంపితి పుత్రా! 460

క. తాలిమి మనకును ధర్మము, తాలిమి మూలంబు [1]ధర్మ తత్త్వంబునకుఁ
దాలిమి గల దని యీశుం, డేలించును బ్రహ్మపదము నెల్లఁ మనలఁ. 461

క. ఱమ గలిగిన సిరి గలుగును, ఱమ గలిగిన వాణి గలుగు సౌఖ్యము లెల్లన్
ఱమగలుగఁ దోన కలుగును, ఱమ కలిగిన మెచ్చు శౌరి సదయుఁడు తండ్రీ!

క. పట్టపురాజును జంపుట, గట్టలుకన్ విప్రుఁ జంపు కంచెను పాపం
బ ట్టి ట్టనకుము నీ వీ, చెట్ట నెడఁ దీర్థసేవ సేయుము తనయా! 463

అధ్యాయము - ౧౬

క. అని తన్నుఁ దండ్రి పనిచినఁ, బనిపూని ప్రసాద మనుచు భార్గవుఁడు రయం
బున నొకయేఁడు ప్రయాణము, చని తీర్థము లెల్ల నాడి చనుదెంచె నృపా!

ఉ. ఆయెడ నొక్కనాఁడు సలిలార్థము రేణుక గంగలోనికిం
బోయి ప్రవాహమధ్యమునఁ బొల్పుగ నచ్చరలేమపిండుతోఁ
దోయవిహాయుల్ సలుపు దుర్లభుఁ జిత్రరథుఁ సరోజమా
లాయతుఁ జూచుచుండెఁ బతియాజ్ఞ దలంపక కొంత ప్రేమతో. 465

వ. ఇట్లు గంధర్వవల్లభునిం జూచు కారణంబునఁ దడసి. 46[illegible]

ఉ. అక్కట! వచ్చి పెద్దతడ వయ్యెఁడి హోమమువేళ దప్పె నే
నిక్కడ నేల [2]యుండితి మునీశ్వరుఁ డేమనునో యటంచుఁ దా
గ్రక్కునఁ దోయకుంభము శిరస్థలమం దిడి తెచ్చి యిచ్చి వే
గ్రమొక్కి కరంబు మోడ్చి పతి ముందట నల్లన [3]నిల్వఁ జూ[illegible]

---

1. మనకు ధన్యత్వముకుఁ(హ) 2. యుంటి ముని యేమనునోయని భీ[illegible]
3. నిల్చె నల్కుచుఁ (తం. వా.)

వ. అప్పుడు. 468

క. చిత్తమున భార్య దడసిన, వృత్తాంతం బెఱిఁగి తపసి వేగమ సుతులఁ
మత్తం దీనిం జూవఁగ, మొత్తుం డన మొత్త రై రి మునుకుచు వారల్. 469

క. [1]కడుకొని పెండ్లముఁ జంపని, కొడుకులఁ బెండ్లాముఁ జంప గురు [2]డానతి యీ
నడుగులకు నెఱఁగి రాముం, డడు గిడకుండంగఁ ద్రుంచె నన్నలఁ దల్లిన్. 470

శా. తల్లిన్ భ్రాతల నెల్లఁ జంపు మనుచోఁ దాఁ జంపి రాకున్న పెం
పెల్లఁ బోవ శపించుఁ దండ్రి దన పం వేఁ జేయుడుఁ మెచ్చి నా
తల్లిన్ భ్రాతల నిచ్చు నిక్కము తపోధన్యాత్మకుం డంచు వే
తల్లిన్ భ్రాతలఁ జంపె భార్గవుఁడు లేదా చంపఁ జేయాడునే. 471

వ. ఇ ట్లవ్విధంబున. 472

క. అడ్డము చెప్పక కడపటి, బిడ్డఁడు రాముండు సుతులఁ బెండ్లము నచటన్
గొడ్డంటం దెగ నడిచిన, జడ్డనఁ దలయూఁచి మెచ్చె జమదగ్ని మదిన్. 473

క. మెచ్చిన తండ్రినిఁ గనుఁగొని, చెచ్చెర నీ పడినవారి జీవంబులు నీ
విచ్చితి ననుమని మ్రొక్కిన, నిచ్చెఁ వారలును లేచి రెప్పటి భంగిన్. 474

ఆ. పడినవారి మరల బ్రతికింప నోపును
జనకుఁ డనుచుఁ జంపె [3]జామదగ్న్యుఁ
డతఁడు సంపె ననుచు నన్నలఁ దల్లిని
జనకు నాజ్ఞ నైనఁ జంపఁ దగదు. 475

వ. అంత. 476

సీ. పరశురామున కోడి పరుగులు వెట్టిన యర్జున పుత్రకు లాత్మయందుఁ
దండ్రి మ్రగ్గుటకు సంత ప్తు లై పొగులుచు నింతట నంతట నెడరు వేచి
తిరిగి యాడుచు నొక్క దివసమం దా రాముఁ డడవి కన్నలతోడ నరుగఁ బిదపఁ
బగ దీర్పఁ దఱి యని పఱతెంచి హోమాలయంబున సర్వేశు నాత్మ నిలిపి

తే. నిరుపమ ధ్యాన సుఖవృ త్తి నిలిచి యున్న
పుణ్యు జమదగ్ని నందఱుఁ బొదివి పట్టి
కుదుల కుండఁగఁ దలఁ ద్రెంచి కొనుచు జనిరి
యడ్డ మేతెంచి రేణుక యడిచికొనఁగ. 477

మటియును. 478

---

1. కొడుకులఁ 2. ఁడొనఁగినఁదా (హ) 3. జామదగ్ని యతడు (హ)

మ. జనకుం జంపిన [1]వైర మేమఱక రాజన్యాత్మజుల్ నేఁడు మీ
జనకుం జంపిరి రామ! రామ! రిపులన్ శాసింతు రమ్మంచు న
మ్మునిపై [2]వ్రాలి లతాంగి [3]మోఁదికొనియెఁ ముయ్యేడుమాఱుల్ రయం
బున రాముం డరుదెంచి యెన్నికొన నాపూర్ణాపదాక్రాంత యై. 479

వ. ఇ ట్లప్పుడు దల్లి మొఱ విని, జమదగ్ని కుమారులు వచ్చి, యి ట్లని విలపించిరి.

క. వాకిలి వెడలవు కొడుకులు, రాకుండఁగ నట్టి నీవు రాజసుతులచేఁ
జీకాకు నొంది పోవఁగ, నీ కా ళ్లట్లాడెఁ దండ్రి! నిర్జరపురికిఁ. 481

వ. అని విలపించుచున్న యన్నలం జూచి రాముం డి ట్లనియె. 482

ఉ. ఏడువనేల తండ్రితను వేమఱకుండుఁడు తోడులార! [4]నే
సూ డొగిఁ దీర్తునంచుఁ బరశు ద్యుతి భీముఁడు రాముఁ డుగ్రుఁ డై
యోడక యర్జు నాత్మభవు లున్న పురంబున కేఁగి [5]వారు గో
డాడఁగఁ బట్టి చంపె వడి నర్జునజాతుల బ్రహ్మఘాతులఁ. 483

క. ఖండించి రిపుల శిరములు, గొండలుగాఁ బ్రోగులిడియె గురు రక్తనదుల్
నిండికొని [6]పాఱి యుబ్బెను, భండనమున నృపులు రిపులు భయమంద నృపా! 485

వ. మఱియు నంతటఁ బోక. 485

ఆ. అయ్య పగకు రాముఁ డలయక రాజుల
నిరువదొక్క [7]మాఱు లరసి చంపె
జగతిమీఁద రాజశబ్దంబు లేకుండ
సూడు దీర్పలేని సుతుఁడు సుతుఁడె. 486

వ. మఱియు నారామునిండు శమంతకపంచకంబున రాజరక్తంబులం దొమ్మిది మడుఁ
గులు గావించి, తండ్రి శిరంబుఁ దెచ్చి, శరీరంబుతో సంధించి, సర్వదేవమయుం
డగు దేవుండు తాన కావునఁ దన్ను నుద్దేశించి, యాగంబు చేసి, హోతకుం
దూర్పును, నధ్వర్యునకుఁ బడమటి దిక్కును, నుద్గాతృన కుత్తర దిశయును,
నున్న వారల కవాంతర దిశలును, బ్రహ్మకు దక్షిణభాగంబును, గళ్యపునకు మధ్య
దేశంబును, నుపద్రష్టకు నార్యావర్తంబును, సదస్యులకుం దక్కిన యెడలును,
గలయ నిచ్చి, బ్రహ్మనది యైన సరస్వతియం దవబృథస్నానంబు సేసి, కల్మషం
బులం బాసి, మేఘవిముక్తుం డైన సూర్యుండునుం బోలె నొప్పుచుండె. అంత.

---

1. వైరము మనక (హ) 2. వ్రాలె (హ) 3. కొనుచున్ (హ) 4. నే జూడు... డటంచు (హ) 5. సొచ్చికో, దాడకపట్టి (హ) 6. పాసి (హ) 7. మాటు నరసి...

క. ఆప్తుఁ డగు పుత్రువలనను, భ్రాప్తతనుం డగుచుఁ దపము బలిమిని మింటఁ
సప్తర్షి మండలంబున, సప్తముఁ డై వెలుఁగుచుండె జమదగ్ని నృపా ! 488

క. ఆ జమదగ్ని తనూజుఁడు, రాజీవాతుండు ఘనుఁడు రాముఁ డధికుఁ డై
యోజను [1]వేదర్షులలో, రాజిల్లెడు మీఁది మనువు రా న వ్యేళఁ. 489

ఆ. శాంత చిత్తుఁ డగుచు సంగవిముక్తుఁ డై
భవ్యుఁ డై మహేంద్ర పర్వతమున
నున్న వాఁడు రాముఁ డోజతో గంధర్వ
సిద్ధవరులు నుతులు సేయుచుండ. 490

క. భగవంతుఁడు హరి యీ క్రియ, భృగుకులమునఁ బుట్టి యెల్ల పృథివీపతులన్
జగతీ భారము వాయఁగఁ, బగఁగొని పలుమాఱు చంపెఁ బవరమున నృపా ! 491

వ. అంత గాధికి నగ్ని తేజుం డగు విశ్వామిత్రుండు జన్మించి, తపోబలంబున రాజ ధర్మంబును మాని, బ్రహ్మర్షి యై, యేకశత సంఖ్యాగణితు లగు కొడుకులం గనియె. అయ్యెడ భృగుకులజాతుం డై న యజీగర్తుని కొడుకు శునశ్శేపుండు దల్లిదండ్రుల చేత హరిశ్చంద్రుని యాగపశుత్వంబునకు నమ్ముడు వడి, బ్రహ్మాది దేవతల వినుతిసేయుచు, మెప్పించి, పితృదేవతలచేత బంధవిముక్తుం డై న వాని యందుఁ గృప గలిగి, విశ్వామిత్రుండు పుత్రుల కి ట్లనియె. 492

క. కన్నులఁ గంటిని వీనిని, మన్నన కొమరుండు నాకు మక్కువ [2]మీలో
నన్నన్న యనుచు నతనిఁ, మన్నింపుం డనినఁ జూచి మదసంయుతు లై. 493

క. [3]ఇతఁ డన్నఁట వో మాకును, గృతకృత్యుల మైతి మనుచు గేలి యొనర్పన్
సుతులఁ ల్మేచ్ఛులు గం డని, ధృతిలేక శపించి తపసి తిరుగుడు వడఁగఁ. 494

వ. అయ్యెడ నతని శాపంబునకు వెఱచి, మధ్యముం డై న మధుచ్ఛందుం డేఁబండ్రు దమ్ములుం దానును నమస్కరించి, తండ్రీ ! నీ చెప్పిన క్రమంబున శునశ్శేపుండు మా కన్న యని, నమస్కరింపంగలవార మనవుఁడు సంతసించి, మంత్ర దర్శియైన శునశ్శేపుని వారలయందుఁ బెద్దఁ జేసి, మధుచ్ఛందున కిట్లనియె. 495

ఆ. పాడి సెడక వీఁడె నేఁడు నీకతమునఁ
గొడుకు కలిగె నేఁడు కొడుకులార !
కడుపులార మీరు గొడుకులఁ గనుఁ డింకఁ
బ్రీతితోడ దేవరాతుఁ గూడి. 496

---

1. సప్తర్షులలో (క.తం.వా.) 2. మితో(హ); మిరో(హ) 3. ఇతఁడన్నఁట మాకఁట కట(తం)

వ. అని పలికె. అట్లు శునశ్శేపుండు దేవతలచేత విడిపడుటంజేసి, దేవరాతుం డయ్యె. మధుచ్ఛందుండు మొద లైన యేఁ బండ్రును దేవరాతునకుఁ దమ్ము లై రి. పెద్ద లైన యష్టక, హారీత,జయంత, సుమదాసు లేఁబండ్రును వేఱై చనిరి. ఈ క్రమంబున విశ్వామిత్రు కొడుకులు రెండువిధంబు లైనం, బ్రవరాంతరంబు గలిగె. అని చెప్పి శుకుం డి ట్లనియె

అధ్యాయము - ౧౯

ఆ పురూరవు కొడు కగు నాయువునకు నహుషుండును, క్షత్రవృద్ధుండును, రజియును, రంభుండును, ననేనస్సు ననువారు పుట్టిరి. అందు, క్షత్రవృద్ధునకుఁ గుమారుం డగు సుహోత్రునకుఁ గాశ్యుండుఁ, గుశుఁడు, గృత్స్నమదుఁ డను ముగ్గురు గలిగిరి. ఆ గృత్స్నమదునకు శునకుండును, శునకునకు శౌనకుండును, నమ్మహాత్మునకు బహ్వృచప్రవరుండును జన్మించిరి. ఆ బహ్వృచప్రవరుండు తపోనియతుం డై చనియె. కాశ్యునకుఁ గాశియుఁ, గాశికి [1]రాష్ట్రుండును, రాష్ట్రునకు [2]దీర్ఘతపుండు నుదయించిరి. 497

క. ఆ దీర్ఘతపుని కధికుఁడు, శ్రీదై తాంశమునఁ బుట్టె సేవ్యుం డాయు
ర్వేదజ్ఞుఁడు ధన్వంతరి, ఖేదంబులు వాయు నతనిఁ గీర్తనసేయన్. 498

వ. వాసుదే వాంశసంభూతుండగు నా ధన్వంతరి,యజ్ఞభోగంబున కర్హుండు. అతనికిఁ గేతుమంతుండు, కేతుమంతునకు భీమరథుం, డతనికి దివోదాసుం డనం బరఁగు ద్యుమంతుం డుదయించిరి. ఆద్యుమంతునకుఁ బ్రతర్దనుండు జన్మించె. ఆ ప్రతర్ద నుండు శత్రుజి త్తనియు, బుతధ్వజుం డనియుం జెప్పఁబడె. అతనికిఁ గువల యాశ్వుండు సంభవించె. 499

ఆ. వసుమతీశ ! విను కువలయాశ్వభూభ ర్త
లలితపుణ్య ఘను నలర్కుఁ గనియె
నాతఁ డేలె నేల నఱువదియాఱు వే
లేండ్లు వాని భంగి నేలె నెవఁడు. 500

వ. అ య్యలర్కునకు సన్నతియు, నతనికి సునీతుండు, నతనికి సుకేతనుండును, నతనికి ధర్మకేతువును, నతనికి సత్యకేతువును, నాతనికి ధృష్టకేతువును, నా ధృష్ట కేతువునకు సుకుమారుండును, సుకుమారునకు వీతిహోత్రుండును, వీతిహోత్రు నకు భర్గుండును, భర్గునకు భార్గభూమియు జనియించిరి. 501

---

1. సురాష్ట్రుండు (హ) 2. దీర్ఘతముండు (హ)

ఆ. వాఁడు [1]తుదయుఁ గాళ్య వసుమతీశుం డాది
యైనవారు గాశు లనఁగ నెగడి
రవనిమీఁద వార లా ఋత్రవృద్ధుని
వంశజాతు లగుచు వంశవర్య! 502

వ. మఱీయు, ఋత్రవృద్ధునికి రెండవకొడు కగు *(కుశునికిఁ బ్రీతియును, వానికి సంజయుండును, సంజయునికి జయుండును, జయునికిఁ గృతుండును, [2]గృతునకు హర్యధ్వనుండును, హర్యధ్వనునకు సహదేవుండును, సహదేవునికి భీముండును, భీమునకు జయత్సేనుండును, జయత్సేనునకు సంకృతియును, సంకృతికి జయుండును, జయునికి ఋతధర్ముండును బుట్టిరి. వీరలు ఋత్రవృద్ధుని వంశంబునం గల రాజులు.) రంభునికి రభసుండును, రభసునకు గంభీరుండును, గంభీరునికిఁ గృతుండును గలిగిరి. ఆ కృతునికి బ్రహ్మకులంబు వుట్టె. ‡అ య్యనేనసునికి శుద్ధుండును, శుద్ధునకు శుచియు, శుచికి బ్రహ్మసారథి యైన త్రికకుత్తును జనించిరి. అతనికి శాంతరజుండు పుట్టె. అతండు విజ్ఞానవంతుండు, కృతకృత్యుండు, విరక్తుండు నయ్యె. 503

సీ. రజి యనువానికి రాజేంద్ర! [3]యేనూఱు కొడుకులు గలిగిరి ఘోరబలులు
వేల్పు లెల్లను వచ్చి వేఁడిన నారజి దైత్యులఁ బెక్కండ్ర ధరణిఁ గూల్చి
నాకంబు దేవేంద్రునకు నిచ్చె నిచ్చిన రజి కాళ్ళకెఱఁగి సురప్రభుండు
వెండియు నతనికి విబుధగేహము నిచ్చి సంతోషబుద్ధి నర్చన మొనర్చె

ఆ. నంత నా రజి మృతుఁ డైన నతని పుత్రు
లమరవిభుఁడు దమ్ము నడిగికొనిన
నీక యింద్రలోక మేలిరి యాగభో
గములు పుచ్చుకొనిరి గర్వమంది. 504

క. †వేలుపులఱేఁడు గురుచే, [4]వేలిమిఁ బెట్టించి బలిమి వెలయఁగ నిజ దం
భోళిని రజిసుతులను ని, ర్మూలము గావించి స్వర్గముం గైకొనియెన్. 505

---

1. తుదయుఁగాగ (హ) 2. క్రతుండు (క. బ.) * అమూలకము ‡ "క్రుణు వంశమనేనసః" (మూలము) 3. యాబంద్రు (క-బ)

† క. చాల మదిఁ గినిసి చటులో
ద్వేలంబగు కలిమి బలిమి వెలయఁగ నిజదం
భోళిని.....(ద)

4. వేలిమి దప్పించి (హ) వేలిమివేల్పించి (తం. వా)

వ. అది యట్లుండె. నహుషునకు యతియు, యయాతియు, సంయాతియు, నాయాతియు, వియతియుఁ, గృతియు నన నార్గురు కొడుకులు, దేహికి నింద్రియంబుల చందంబున సంభవించిరి. అందుఁ బెద్దకొడు కగు యతికి రాజ్యం బిచ్చిన, నతఁడు విరక్తుం డై. 506

క. రాజ్యంబు పాపమూలము, రాజ్యముతో నొడ లెఱుంగ రాదు సుమతియుఁ
రాజ్యమునఁ బూజ్య నెఱుఁగడు, రాజ్యము గీజ్యంబు ముక్తిరతులకు నేలా. 507

వ. అని పలికి, వాఁడు రాజ్యంబునకుం బాసి చనియె. 508

క. ఆ నహుషుఁడు మఖశతమును, మానుగఁ గావించి యింద్రమానినిఁ గవియం
బూని మునీంద్రులు మోచిన, యానముపై నుండి కూలె నహి యై నేలన్. 509

ఉ. అన్నయుఁ దండ్రియుం జన యయాతి మహీపతి యై చతుర్దిశల్
పన్నుఁగఁ గావఁ దమ్ములకుఁ బాలిడి శుక్రుని కూఁతురిఁ సుసం
పన్నగుణాభిరామ వృషపర్వుని కూఁతురి నోలి నాంద్రుగా
[1]సన్నయశాలి యీ [2]ధరణిచక్ర ధురంధరుఁ డయ్యెఁ బేర్మితో. 510

వ. అనిన విని, పరీక్షిన్న రేంద్రుం డి ట్లనియె. 511

అధ్యాయము-౧౮

—: యయాతి చరిత్ర :—

ఆ. పార్థివుఁడు యయాతి బ్రహ్మర్షి భార్గవుఁ
డల్లుఁ డగుట మామ యగుట యెట్లు
రాజు రాచకూఁతు రతిసేయఁ దగుఁ గాక
విప్రకన్య నొంద విహిత మగునె. 512

వ. అనిన శుకుం డి ట్లనియె. 513

సీ. దనుజేంద్రు కూఁతురు తరళాక్షి శర్మిష్ఠ పురములో నొకనాఁడు బ్రొద్దువోక
వేలసంఖ్యను చెలుల్ వెంటరా గురుసుత యగు దేవయానితో నాట మరగి
పూచిన [3]యెలదోఁట పొంత జొంపము గొన్న క్రొమ్మావి చేరువ కొలఁకుఁ జేరి
యందుఁ దమ్ములతేనె లాని చొక్కుచు మ్రోయు [4]నళుల ఝుంకృతులకు నదరి
పడుచు

---

1. సన్నయశాలియై (తం) 2. ధరణిచక్ర మశేషము నే లె లీలతోన్ (బ)
3. యలతోఁట (హ) 4. నలరు (హ)

ఆ. వలువ లూడ్చి కొలఁకు వడిఁ జొచ్చి తమలోనఁ
బెల్లు రేఁగి నీటఁ జల్లులాడ
నంది నెక్కి మౌళి నిందురోచులు పర్వ
ఘూలి వచ్చేఁ గొండచూలితోడ. 514

చ. మలహారుఁ జూచి సిగ్గుపడి మానిను లందఱు సంభ్రమంబునఁ
వలువలు గట్టుచో దనుజవల్లభు కూఁతురు దేవయాని దు
వ్వలువ ధరించి [1]ముందటికి వచ్చినఁ జూచి యెటిం గెటింగి నా
వలు విది [2]యెట్లు గట్టుకొన వచ్చును [3]దానికి నంచు దెప్పుచుఁ. 515

వ. దేవయాని యి ట్లనియె. 516

శా. ఆ లోకేశు ముఖంబునం గలిగె బ్రహ్మణ్యంబు బ్రహ్మంబు నా
మే లై వైదికమార్గముల్ దెలుపుచున్ [4]మిన్నంది రందుఁ మహా
శీలుర్ భార్గవు లందు [5]శుక్రుఁడు [6]సుధీసేవ్యుండు నే వానికిఁ
జూలఁ నా వలు వెట్లు గట్టితివి రజోజాత వై చేటికా! 517

క. మహిమవతు లైన [7]భూసుర, మహిళల వి త్తంబులు పెఱ మగువల కగునే
మహిఁ బసిఁడిగొలుసు లిడినఁ, విహితములే కుక్కలకు హవిర్భాగంబుల్. 518

క. మీ తండ్రి మాకు శిష్యుఁడు, మా తండ్రి గురుండు గొంతమాత్రం బైనం
బ్రీతిం గావింపక పరి, భూతం జేయుదువె తులువ పోఁడిమిఁ జెనఁటీ! 519

వ. అని భర్జించుచున్న దేవయాని పలుకులు విని, కరాళించి, భ్రమోఁగుచున్న భుజంగిపగిది నిట్టూర్పులు నిగుడించి, పెదవులు [8]గొఱుకుచు, శర్మిష్ఠ యిట్లనియె.

శా. భిక్షుం డై తమతండ్రి మా జనకునిన్ భిక్షించి యుండంగ సం
రక్షింపం దుది నింత యై మఱపుతో రాజీప్రసూతాకృతిఁ
రక్షోరాజ తనూజతో సుగుణతో [10]నాతో సమం బాడెడిఁ
గుక్షిస్ఫోటము గాఁగ దీనిఁ జెలు లీ కూపంబునం ద్రోవరే. 521

వ. అని పలికి. 522

---

1. వేగమున (హ) 2. యేల (హ) 3. దానవికంచు దెప్పుచున్ (ట. డ. బ. హ.)
న్నంది నందున్ (హ) 5. నొప్పెడు (హ) 6. మహాసేవ్యుండు (క–బ) 7. అసుర (హ)
చు (క. బ) 9. ప్రమత్తాకృతిన్ (హ) 10. నాఁజేపముం జేసెదన్ (హ)

ఆ. [1]బోఁటిపిండుచేతఁ బొదువంగఁ బట్టించి
రాజసమున దైత్యరాజ తనయ
తొడరి దేవయానిఁ ద్రోపించె వలు వీక
[2]క్రుంకి నూతిలోనఁ [3]గుదిలకొనఁగ. 523

వ. ఇట్లు సేసి, శర్మిష్ఠ వోయిన వెనుక, యయాతిభూపాలుండు వేఁటమార్గంబున నడవిం డిఱుగుచు, దైవయోగంబున నా దేవయానియున్న నుయ్యి చేరం జను దెంచె. అందు. 524

—: దేవయాని యయాతిని వరించుట :—

క. బంధువుల నెల్లఁ జీరుచు, నందు [4]జలామగ్నమధ్య యై వగచుచు వని
ర్బంధమునఁ జిక్కి [5]వ్రీడా సింధువున మునింగి యున్న చేడియఁ గనియెన్. 525

వ. కనుంగొని 526

శా. సప్తాంభోనిధి మేఖలావృత మహాసర్వంసహా కన్యకా
ప్రాప్తోద్య ద్వర దక్షిణకర ప్రాలంబముం జేసి [6]ప్రో
క్షిప్తం జేసె యయాతి [7]కట్టుకొనఁ బై చేలంబు మున్నిచ్చి ప
ర్యాప్త స్వేదజలాంగి [8]నాళిసముదాయ స్వర్గవిన్ భార్గవిన్. 527

వ. ఇట్లు నుయ్యివెడలించిన రాజునకు రాజవదన యిట్లనియె. 528

మ. ననుఁ బాణిగ్రహణంబు చేసితి గదా నా భర్తవు న్నీవ దై
వనియోగం బిది [9]పౌరుషంబునకు నా వాక్యంబు సిద్ధంబు సౌ
ఖ్యనివాసు [10]న్నిను మాని యొండువరునిం గాంక్షింప నే [11]నోర్తునే
వనజం బానెడి తేఁటి యన్య కుసుమావాసం బపేక్షించునే. 529

వ. అదియునుం గాక, 530

సీ. సుగుణాఢ్య! విను నేను శుక్రుని కూఁతుర దేవయానినిఁ దొల్లి దేవమంత్రి
తనయుండు కచుఁడు మా తండ్రిచేత మృతసంజీవనిఁ దా నభ్యసించువేళ
నతనిఁ గామించిన నతఁ డొల్ల ననవుడు నతఁడు నేర్చినవిద్య యణఁగిపోవ
[12]నతని శపించిన నతఁడు నా భర్త బ్రాహ్మణుఁడు గాకుండెడు నని శపించె

---

1. తోటిచెలులచేత దొడువంగ బట్టించి (ద) 2. క్రుక్కి (హ) 3. ఁగుతిలకొనఁగ (వా) 4. జలామగ్న నగ్నయై (చ. త.) 5. పీడా (హ. తం. వా.) 6. భరదక్ష (క. చ.); భరరక్ష (త. జ. డ. ద.) 7. ఁగట్టుఁగొనఁ (హ) 8. నాళిసముదాయాలంకృతన్ భార్గవిన్ (హ) 9. తప్పదప్పురుషతావాక్యంబు సిద్ధంబు (హ. తం. వా.) 10. నినుజూచి (క. డ.) నినుఁజేరు నాఁటది పరున్ (తం) 11. నేర్తునే (హ) 12. నేశపించిన నాతఁ డెటిఁగి నాభర్త (తం)

తే. నది నిమిత్తంబు నాకు బ్రాహ్మణుఁడు గాఁడు
ప్రాణనాథుఁడ వీ వని పడఁతి వలుకఁ
దనదు హృదయంబు నెలఁతపైఁ దగులువడినఁ
దమక మొకయింతయును లేక తలఁచి చూచి. 531

మత్తకోకిల. దైవ[1]యోగముగాక విప్రసుతఁ వరించునె నా మనం
బే విధంబున నీశ్వరాజ్ఞయు నిట్టి దంచు వరించె ధా
త్రీవరుండును దేవయానిని ధీరబుద్ధులకున్ మనో
[2]భావ మొక్కటియే ప్రమాణ మభావ్య భావ్య పరీక్షకున్. 532

వ. ఇట్లు [3]వరించి, యయాతి చనిన వెనుక దేవయాని శుక్రునికడకుం జని, శర్మిష్ఠ చేసిన వృత్తాంతం బంతయుం జెప్పి, కన్నీరు మున్నీరు గా వగచిన. 533

క. క్రూరాత్ముల మందిరములఁ, [4]బౌరోహిత్యముల కుంట పాపం బీ సం
సారముకంటె శిలల్ దిని, యూరక కాపోతవృత్తి నుండుట యొప్పున్. 534

వ. అని వృషపర్వునికడ నుండుట నిందించుచు, శుక్రుం డాకూఁతుం దోడ్కొని పురంబు వెడలి చన, నయ్యసురవల్లభుం డెఱింగి, శుక్రునివలన దేవతలఁ గెలువఁ దలఁచి తెరువున కడ్డంబు వచ్చి, పాదంబులపైఁ బడి, ప్రసన్నుం జేసిన, నా కోపంబు మాని, శుక్రుండు శిష్యున కిట్లనియె. 535

తరల. చెలులు వేవురుఁ దాను నీ సుత చేటికైవడి నా సుతం
[5]గొలుచుచుండిన దీఱుఁ గోపము గొల్వఁ బెట్టెద వేని నీ
వెలఁదిఁ దోడ్కొని వత్తు నావుడు వేగ ర మ్మని భార్గవిం
గొలువఁ బెట్టె సురారివర్యుఁడు గూఁతు నెచ్చెలి పిండుతోన్. 536

మ. చల మిం కేలని తన్నుఁ దండ్రి వనుపన్ శర్మిష్ఠ సన్నిష్ఠతో
జలజాతాస్యలు సద్వయస్యలు సహస్రంబు న్నజస్రంబుఁ ద
[6]న్నలమన్ దాసి సుదాసి యయ్యెఁ బగ వాయఁ [7]భూరి కోపానలా
కలిత గ్లానికి దేవయానికి మహా గర్వోద్యమ స్థానికిన్. 537

వ. అంత. 538

---

1. యుక్తము (హ) 2. భావమొక్కటియుఁ బ్రమాణము భావ్యభావ పరీక్షకున్ (హ)
3. తరించి (వా) 4. ఁబౌరోహిత్యంబుకంటె (హ.తం.వా.) 5. కొలుచుచుండను (హ); కొలువఁ బెట్టినఁ దీఱుఁ గోపము(తం) 6.న్నెలగన్ దాసియు దాసి యయ్యె వివిధామేహోగ్ర కోపానలా(హ)
7. పీతచేతస్సమాకలిత గ్లానికి (క. చ. జ. డ.)

ఉ. ఆతత మైన వేడ్క దనుజాధిప మంత్రి సురారి నందనో
పేతఁ దనూభవం బిలిచి పెండ్లి యొనర్చె మహావిభూతికిన్
బ్రీతి మహోగ్రజాతికి నభీతికి సాంధువినీతికిన్ సిత
ఖ్యాతికి [1]భిన్న దుష్కలహకా ర్యభియాతికి న య్యయాతికిన్. 539

వ. ఇట్లు యయాతికి దేవయాని నిచ్చి శుక్రుండు శర్మిష్ఠాసంగమంబు సేయకు మని, నియమించి చనియె. పిదప న ద్దేవయానియు, న య్యయాతివలన యదు తుర్వసులను కుమారులం గనియె. ఒక్కరేయి నెఱంగుమాసి, దేవయాని వెలుపలనున్న యెడ శర్మిష్ఠ యొడరు వేచి, యేకాంతంబున యయాతికడకుం జని, చెఱకువింటిజోదు పువ్వుటంపర కోహటించి, తన తలంపు సెప్పిన. 540

—: శుక్రాచార్యులు యయాతికి శాపం బొసంగుట :—

ఉ. ఆ జవరాలిఁ జూచి మన మాఁపఁగలేక మనోభవార్తుఁ డై
యా జనభర్త మున్ను [2]కవి యాడినమాట దలంచి యైనఁ జే
తోజ సుఖంబులం దనిపెఁ ద్రోవఁగవచ్చునె దైవయోగముల్
రా జఁట సద్రహస్య మఁట [3]రాజకుమారిని మాన నేర్చునే. 541

వ. ఇట్లు యయాతివలన శర్మిష్ఠ గర్భం బై క్రమంబున ద్రుహ్యుండును, ననువును, పూరువును ననువారి మువ్వురు తనయులం గాంచె. అంత దేవయాని తద్వృత్తాంతం బంతయు నెఱింగి, కోపించి, శుక్రునికడకుం జని, క్రోధమూర్ఛిత యై యున్న సమయమున యయాతి వెంటం జని, యి ట్లనియె. 542

ఆ. మామ కేల చెప్ప [4]మాను సరోజాక్షి
దనుజతనుజఁ బొంది తప్పు వడితిఁ
గామి నై న ననుఁ గరుణింపు పతిమాట
[5]తండ్రిమాటకంటెఁ దగును నీకు. 543

వ. అని పలికి, పాదంబుల కెఱఁగిన, న య్యింతి యొడంబడక యుండె. అంత నది యెఱింగి శుక్రుం డి ట్లనియె. 544

క. నా మాటఁ ద్రోచి దానవ, భామను బొందితివి ధరణిపాలక ! తగవే
యేమాట యేది రూపము, [6]కాముకులకు లోలుపులకుఁ గలవే నిజముల్. 545

---

1. భిన్నదుఃఖ బహుకార్యభియాతికి (హ. వా.) 2. గని (హ) 3. కుమారుని (హ. వా.); కుమారుడు (క. చ.జ.) 4. మామా సరోజాక్షి (డ. బ. తం.) 5. తండ్రి కెఱుగ జెప్ప తగవె సతికి (చ); తండ్రి మాటకంటెఁ దగును సతికి (వా) 6. కామినిలోలులకు నెచట (హ); కాముకులకు లోకమందు (చ)

వ. అని పలికి, నీవు వనితాజన హేయంబై న ముదిమిం బొందెదవు. అని శపియించిన, యయాతి యి ట్లనియె. 546

క. మామా ! నాపై కోపము, మామా ! నీపుత్రియందు మానవు నాకుం
గామోపభోగ వాంఛలు, ప్రేమన్ రమియించి ముదిమిఁ బిదపన్ దాల్తున్. 547

వ. అని పలికి యనుజ్ఞ గొని, దేవయానిం దోడ్కొని, పురంబునకుఁ జని, పెద్దకొడు కగు యదువుం బిలిచి, యయాతి యి ట్లనియె. 548

శా. నీ తల్లిం గనినట్టి శుక్రువలనన్ నేఁ డీ జరం బొందితిన్
నా తండ్రీ ! యదు నామధేయ ! తనయా ! నా వృద్ధతం దాల్పు వే
నీ తారుణ్యము నాకు నిమ్ము [1]తనివో నిండారఁ గొన్నేండ్లు నేఁ
జేతోజాత సుఖంబులం దిరిగెదన్ శృంగారి నై పుత్రకా ! 549

వ. అనిన విని, తండ్రికి యదు వి ట్లనియె. 550

శా. కాంతాహేయము దుర్వికారము దురాకండూతి మిశ్రంబు హ్యా
చ్ఛింతామూలము [2]పీనసాన్వితము ప్రస్వేద వ్రణాకంపన
శ్రాంతి స్ఫోటక యుక్త మీ ముదిమి వాంఛం దాల్చి నానా సుఖా
పాంతం బైన వయోనిధాన మిది యయ్యా ! తేర యీ వచ్చునే. 551

వ. అని యదుం డొడంబడకున్న, యయాతి తుర్వసు, ద్రుహ్యాదుల నడిగిన, వారును, యదువు పలికినట్ల పలికినఁ, గడకొట్టు కుమారుం డైన పూరువున కి ట్లనియె. 552

ఉ. పిన్నవు గాని నీవు కడుఁ బెద్దవు బుద్ధులయందు రమ్ము నా
యన్న ! మదాజ్ఞ దాఁటవు గదన్న ! వినీతుఁడ వన్న ! నీవు నీ
యన్నలు సెప్పినట్లు పరిహారము సెప్పకు మన్న ! నా జరన్
మన్ననఁ దాల్చి నీ తరుణిమం బొనఁగూర్పుము నాకుఁ బుత్రకా ! 553

వ. అనిన విని, గురుభక్తి గుణాధారుం డైన పూరుం డి ట్లనియె. 554

శా. అయ్యా ! న న్నిటు వేఁడనేల భవదీ యాజ్ఞా సముల్లంఘనం
బయ్యుండఁ బరిహారమున్ నొడువ నే నన్యాయినే నీ జర
న్నెయ్యం బొప్పఁగఁ దాల్చి నా తరుణిమ న్నీ కిచ్చెదఁ బంపినన్
[3]గయ్యం బాడెడి పుత్రకుండు గ్రిమిసంకాశుండుఁ గాకుండునే. 555

---

1. తనివో నిండారఁ గొన్నాళ్ళు (హ) 2. పీనస జ్వరము (హ); పీనసజ్వర తమ స్వేదవ్రణా కంపన (క. బ.) 3. క్రయ్యం బాఁడి (తం)

వ. అదియునుం గాక. 556

క. మునివృత్తి డయ్య నేటికి, జనపాలక ! సుగతిఁ గోరు సత్పురుషులకున్
[1]దనుఁ గన్నతండ్రి సెప్పిన, పని చేసిన సుగతి గొంగుపసిఁడియ కాదే. 557

క. పనుపక చేయుదు రధికులు, పనిచిన మధ్యములు పొందుపఱుతురు తండ్రుల్
పనిచెప్పి కోరి పనిచిన, ననిశము మాఱాడు పుత్రు లధములు దండ్రీ ! 558

వ. అని పలికి, పూరుండు ముదిమి చేకొని, తన లేఁతప్రాయంబు యయాతి కిచ్చె. అ య్యయాతియుం దరుణుం డై. 559

శా. [2]పడుఁ దీవులు నేడు వాడలుగ సర్వేలాతలం బెల్లఁ బెఁ
విడై [3]లోనుగ నేలుచుం బ్రజల నన్వేషించి రక్షింపుచున్
దోడం భార్గవి రా మనోజ సుఖ సంతోషంబులం దేలుచుఁ
గ్రీడించె న్నియతేంద్రియుం డగుచు నా [4]క్రీడావిశేషంబులఁ. 560

క. మర్మంబుల నతిసాధ్వి, ధర్మంబుల దేవయాని దన ప్రాణేశుఁ
నర్మముల మనోవా [5]క్తను, కర్మంబుల నొండు లేక కడు మెప్పించెఁ. 561

శా. ఆకాశంబున మేఘబృందము ఘనం బై సన్న మై దీర్ఘ మై
యేకం బై బహురూప మై యణఁగున ట్లే దేవు గర్భంబులో
లోకశ్రేణి జనించుచున్ మెలఁగుచున్ లోపించు నా దేవు సు
శ్రీకాంతుఁ హరిఁ గూర్చి యాగములు నేసె న్నాహుషుం డిమ్ములన్. 562

వ. మటీయును. 563

మ. చెలికాండ్రన్ గరులఁ రథమ్ముల భటశ్రేణిం దురంగమ్ములఁ
గలలోఁ గన్న ధనాళితో సమములం గాఁ జూచుచుఁ భార్యతోఁ
బలువే లేండ్లు మనోజభోగ లహరీ పర్యాప్తుఁ డై తేలియున్
బలుతృష్ణం గడఁగాన కెంతయు మహాబంధంబులఁ స్రుక్కుచున్. 564

అధ్యాయము - ౧౯

వ. ఒక్క దినంబున నాత్మజ్ఞానంబునం జేసి, కాంతానిమిత్తంబున మోసపోవుట యెఱింగి, యయాతి విషాదంబు నొంది, దేవయాని కిట్లనియె. 565

---

1. తనకన్నతండ్రి (తం)
2. ఏడు ద్వీపము లేడు వాడలుగ (హ) ఏడా ద్వీపము (వా)
3. పోఁడిగ నేలుచున్ (తం.వా.)
4. క్రీడాతిరేకంబులన్ (తం. వా.); క్రీడాద్రి శైలంబులన్ (క. బ.); క్రీడాద్రిదేశంబులన్ (డ)
5. వాక్కుల (హ)

యయాతి దేవయానికి బస్తోపాఖ్యాన మను వ్యాజంబున స్వప్నవృత్తాంతమును దెలుపుట

క. మన చారిత్రమువంటిది, విను మితిహాసంబు కలదు వృద్ధజనంబుల్
మునులును మెత్తురు నీవును, మనమున నంగీకరింపు మంజులవాణీ! 566

వ. అది యెట్టి దనిన. 567

సీ. [1]అజ మొకం డడవిలో నరుగుచుఁ దాఁ గర్మ ఫలమున నూతి లోపలికి జాఱి
[2]లోఁగెడి ఛాగి నాలోకించి కామి యై కొమ్మున చరిఁ గొంత గూలఁ ద్రోచి
వెడలింప న చ్ఛాగి విభునిగాఁ గోరిన నగుఁగాక యని తాను నదియుఁ దిరుగ
నెన్ని యేనియుఁ దన్ను నెంత కామించిన నన్నిటికిని భర్త యై తనర్చి

తే. వాని నేప్రొద్దు [3]రతులకు వశలఁ జేసి
సొరిదిఁ గ్రీడించి క్రీడించి సొక్కి సొక్కి
కాముఁ డనియెడు దుస్సహా గ్రహముకతనఁ
జిత్త మేమఱి మత్తిల్లి చెల్లఁ [4]జిక్కె. 568

క. [5]వెడవింటివాని చిగురా, కడిదపుఁ బ్రేటునకు లొంగి యతిమోహితుఁ డై
విడువక సతులం దగిలెడు, జడునకు [6]నెక్కడివి బుద్ధిచాతుర్యంబుల్. 569

వ. అంత న చ్ఛాగంబు తనపిదపం దగిలిన ఛాగీనివహంబులోపలం జూడ నొప్పెడి ఛాగియందుఁ దగిలి, క్రీడింపం గని, నూతిలోపలం బడి వెలువడిన ఛాగి, తన పతివలని నెయ్యంబు లేకుండుటకు విన్న నై, తన మనంబున. 570

క. పలికిన పలుకులు పలుకఁడు, కలఁచు న్నవకాంతఁ జూచి కడు సంచలుఁ డై
నిలిచిన చోట న్నిలువఁడు, నిలు వెల్లను గల్ల కామి [7]నిజమరి గలఁడే. 571

వ. అని పలికి, విడిచి చనిన, న య్యజవల్లభుండు సురతపరతంత్రుఁ డై, మిసిమిసి యను శబ్దంబు నేయుచు, న చ్ఛాగి వెంటం జని, యొడంబఱుపం జాలకుండె. అంత దానికిఁ గర్త యైన బ్రాహ్మణుండు రోషంబున రతిసమర్థంబు గాకుండ నల్లాడుచున్న ఛాగవృషణంబులు ద్రెంచివేసిన, న చ్ఛాగంబు గ్రిందఁబడి, వేఁడుకొనినఁ, బ్రయోజనంబు వొడగని, యోగవిదుండు గావున, బ్రాహ్మణోత్తముండు గ్రమ్మఱ న య్యజవృషణంబులు సంధించిన. 572

క. వృషణములు మరలఁ గలిగిన, సుషముం డై ఛాగివిభుఁడు సుందరితోడన్
విషయసుఖంబులఁ బొందుచుఁ, దృష తుదిఁ గనఁడయ్యెఁ బెక్కుదివసము లయ్యున్.

అజమొక్కటియు వనమందేగుచును గర్మ(హ) 2. లోగిడి(హ) 3. రతులనువశునిఁజేసి(హ) ం. తం. వా.) 5. వెడవిలుతుకేలి (హ. వా.) 6. నెక్కడిది (హ) 7. నిజమతి (హ)

వ. అని, యి ప్రిధంబున యయాతి దేవయానికి నిజవృత్తాంతంబుఁ గథారూపంబున నెఱింగించి, యి ట్లనియె. 574

మ. ‡అబలా! నీ నిబిడాతి దుర్జయ సలజ్జాపాంగ భల్లంబులం
బ్రబలం బై న మనంబు భగ్నముగ నా ప్రావీణ్యముం గోలుపో
యి బలిష్ఠుం డగు కాముఁ బారిఁ బడి నే [1]నెట్లోర్చెదన్ బందిక
త్తె బడిం బాపపుఁ దృష్ణ యిప్పు డకటా! దీర్ఘాకృతిన్ రొప్పెడిన్. 575

క. [2]అదలదు ప్రాణము లదలినఁ, [3]గదలదు సర్వాంగకములు గదలుచు నున్నన్
వదలదు బిగువులు వదలినఁ, దుదిలే దీ తృష్ణ దీనిఁ ద్రుంపఁగవలయున్. 576

క. [4]వెయ్యేం డ్లయ్యెను నీతోఁ, ప్రయ్యంబడి యున్న వాఁడ గామసుఖములం
[5]గ్రుయ్య దొక యించుకై న, [6]డయ్యదు కొనలిడియెఁ దృష్ణ [7]నవపద్మముఖీ! 577

క. ముదిసెను దంతావళియును, ముదిసెను కేశములుఁ దనువు ముదిసెం దనకున్
ముదియనివి రెండు చిక్కును, బ్రదికెడి తీపియును విషయపఙ్క స్పృహయున్. 578

క. కడ లే దాశాలతకును, గడఁ జూడఁగఁ గానరాదు కడఁ గనిరేనిన్
గడు ముదమున సంసారము, గడఁ గందురు తత్త్వవిదులు కమలదళాక్షీ! 579

క. మండన హాటక పళు వే,దండాశ్వ వధూ దుకూల ధాన్యాదులు పె
క్కుండియు నాశాపాళము, [8]ఖండింపఁగ లేవు మటీయుఁ గడమయ చుమ్మీ. 580

క. కామోపభోగ సుఖములు, వేమాఱును బురుషుఁ డనుభవింపుచు నున్నం
గామంబు శాంతిఁ [9]బొందదు, ధూమధ్వజుఁ [10]డాజ్యవృష్టిఁ ద్రుంగుడువడునే.581

ఆ. అక్క తల్లి చెల్లె లాత్మజ [11]యొక్కిన
పాను పెక్కఁ జనదు పద్మనయన!
పరమయోగి కైన బలిమిని నింద్రియ
గ్రామ మధికపీడఁ గలుగఁ జేయు. 582

క. వెంగలి విత్తె [12]తిరుగక, [13]కంగారై చెడక ముక్తిఁ గాంక్షించు నతం
డంగనలతోడ విడువని, సంగడములు వదలవలయు జలజాతముఖీ! 583

వ. [14]అది గావున నేఁడు మొదలు తృష్ణాఖండనంబు సేసి, నిర్విషయుండ నై, యహంకారంబు విడిచి, మృగంబులంగలసి, వనంబున సంచరించెద. పరబ్రహ్మంబు

---

‡ ఈ పద్యము 'క' ప్రతిలోలేదు. 1. నెట్లోర్తునే (తం.వా.) 2. అడలవు (హ) 3. గదలవు(హ) 4 వెయ్యేండ్లైనను (హ) 5 గ్రుయ్యఁడొక (హ) 6. డయ్యెడు (హ) 7. తవతవ తోడన్ (హ) 8. నిండింపఁగలేవు జగతి నిజమిది సుమ్మి (హ) 9. ఁబొందునె (తం) 10. ధార (క) 11. లెక్కిన (హ) 12. తిరుగుచు (తం. వా.) 13. నంగజు లీలను ముక్తి నాశిం 14. అదియునుంగాక (హ)

నందుఁ జిత్తంబుఁ జేర్చెద. బ్రహ్మనిష్ఠ మనుష్యులకు నాశానివారిణి యగుటం జేసి యే నందుఁ దత్పరుండ నై, యాహార నిద్రాది యోగంబులం బరిహరించెద. ఆత్మవిదుం డై, సంసారనాశంబుఁ దలంచినవాఁడె విద్వాంసుం డని తలంచి పలికి, పూరుని యౌవనం బతని కిచ్చి, ముదిమి తాను గైకొని, విగత లోభుం డై, నిజ భుజశక్తి పాలితం బగు భూమండలంబు విభాగించి, ద్రుహ్యునకుఁ బూర్వభాగంబును, యదువునకు దక్షిణ భాగంబును, దుర్వసునకుఁ బశ్చిమ దిగ్భాగంబును, ననువునకు నుత్తర దిగ్భాగంబును సంరక్షింపుం డని యిచ్చి, వారల సమక్షంబున. 584

క. నాలుగు చెఱఁగుల నేలయుఁ, బాలింపుం డనుచు నగ్రభవులకుఁ బంచెన్
భూలోక మేలు మనుచును, బాలారోకుదారుఁ బూరుఁ బట్టము గట్టెన్. 585

వ. ఇట్లు పూరునికి రాజ్యం బిచ్చి, పెక్కు వర్షంబులయందు ననుభూతంబు లైన, యింద్రియ సుఖంబులు విసర్జించి. 586

క. మిక్కిలి [1]విజ్ఞానంబున, జక్కఁగ [2]దిగవిడిచి వైరి షడ్వర్గంబున్
ఱెక్కలు వచ్చిన విహగము, గ్రక్కున నీడంబు విడుచు కరణి నుదితుఁ డై.

క. కారుణికోత్తముఁ డగు హరి, కారుణ్యము కతన నతఁడు ఘనుఁ డై గెలిచెన్
గ్రూరము లగు విషయంబుల, నూరక గెలువంగ శక్తుఁ డొక్కఁడు గలఁడే. 588

వ. మఱియు, నిర్మూలిత సకల సంగుం డై, సత్వ రజ స్తమో గుణంబులం దిగనాడి నిర్మలం బై, పరమం బైన వాసుదేవాభిధాన బ్రహ్మంబునందు యయాతి భూపాలుండు [3]స్వతస్సిద్ధ యైన భాగవత గతిం జెందె. అంత. 589

సీ. ప్రాణేశుఁ డాడిన పలుకులు నగవులుగాఁ జూడ కంతరంగమున నిలిపి
పథికు లై పోవుచుఁ బానీయశాలలఁ జల్లఁగా నుండెడి జనుల యట్ల
సంసారమునఁ గర్మసంబంధు లై వచ్చి యాలు బిడ్డలు మగం డనుచుఁ గూడి
యుండుట గాని సంయోగంబు నిత్యంబు గా దీశమాయా ప్రకల్పితంబు

తే. దీని విడుచుట తగవని తెగువ మెఱసి
నిద్ర సాలించి మేల్కొన్న [4]నేర్పు చాలఁ
గలిగి భార్గవి సర్వసంగముల విడిచి
హరి [5]పదధ్యాన యై ముక్తి కరిగె నధిప! 590

---

1. సుజ్ఞానంబున (తం. వా. కా.) 2. తెగనడిచి (తం. వా.) 3. స్వసిద్ధియైన (హ)
4. నెలవు (హ); "స్వప్నోపమ్యేన" అని మూలము (19-28) 5. పరాధీనయై (హ. తం. వా.)

వ. అని, యిట్లు యయాతి చరితంబు చెప్పి, భగవంతుండును, సర్వభూత నివాసుండును, శాంతుండును, వేదమయుండు నైన వాసుదేవునకు నమస్కరించెద. అని, శుకుం డిట్లనియె. 591

అధ్యాయము — ౨౦

క. భారత ! నీవు జనించిన, పూరుని వంశంబునందుఁ బుట్టిన వారిఁ
జారుయశోలంకారుల, ధీరుల వినుపింతు నధిక తేజోధనులఁ. 592

వ. పూరునకు జనమేజయుండు, జనమేజయునకుఁ బ్రాచిన్వాంసుఁడతనికిఁ బ్రవిరోధనమన్యు, వతనికిఁ జారువు వుట్టె. ఆ చారునకు సుద్యువు, సుద్యువునకు బహుగతుండును, బహుగతునకు శర్యాతి, శర్యాతికి సంయాతి, సంయాతికి రౌద్రాశ్వుండు, రౌద్రాశ్వునకు ఘృతాచి యను నచ్చర లేమయందు ఋతేపువు, కక్షేపువు, *స్థలేపువు, కృతేపువు, జలేపువు, సన్నతేపువు, ధర్మేపువు, సత్యేపువు, వ్రతేపువు, వనేపువు అను వారు, జగదాత్మ భూతుండైన ప్రాణునకు నింద్రియంబుల చందంబునఁ బదుగురు కొడుకులు జన్మించిరి. అందు ఋతేపునకు నంతిసారుండు, నంతిసారునకు సుమతియు, ధ్రువుండు, నప్రతిరథుండు, నన మువ్వురును బుట్టిరి. అందు నప్రతిరథునకుఁ గణ్వుం, డా కణ్వునికి మేధాతిథి, యతనికి బ్రస్కందుండు మొదలగు బ్రాహ్మణులు జన్మించిరి. ఆ సుమతికి రైభ్యుండు, రైభ్యునకు దుష్యంతుండు వుట్టి. 593

క. పారావార పరీతో, దార ధరాభారదత్త దక్షిణహస్త
శ్రీ రాజిల్లఁగ నొకనాఁ, డా రాజేంద్రుండు వేఁటయం దభిరతుఁ డై. 594

క. గండక కంఠీరవ భే, రుండ శర వ్యాళ కోల రోహిష రురు వే
దండ వ్యాఘ్ర [1]మృగాదన, చండ శరభ శల్య భల్ల చమరాటవులఁ. 595

క. చప్పుడు సేయుచు మృగముల, రొప్పుచు నీరములయందు [2]రోయుచు వలలం
ద్రిప్పుకొని పడఁగఁ జోపుచుఁ, దప్పక యేయుచును వేఁటతమకం బొప్పఁ. 596

క. మృగయూథంబుల వెంటను, మృగలాంఛన సన్నిభుండు మృగయాతురుఁ డై
మృగయులు గొందఱుఁ గొలువఁగ, మృగరాజ పరాక్రమంబు మెఱయఁగ వచ్చెన్.

వ. ఇట్లు వచ్చి వచ్చి, దైవయోగంబునఁ గణ్వమహాముని తపోవనంబు చేరంజని. 598

---

* "సలేపుళ్ళ" అని మూలము (20-4)
1. మృగాధిక (హ) 2. రోజుచు (హ)

సీ. ఉరుతర శ్రాంతాహి యుగళంబులకుఁ భింఛముల విసరెడి కేకి ముఖ్యములను
[1]గరుణతో మదయుక్త కలభంబులకు మేఁత లిడుచు ముద్దాడు మృగేంద్రములను
ఘన మృగాదనములు గాపుగా లేళ్ళతో రతులు సాగించు సారంగములను
ననుపుగా హోమధేనువుల కంఠంబులు దువ్వుచు నాడు శార్దూలములను

తే. [2]దారి కలహించు [3]మూషిక దంపతులకు
మైత్రి నంకించు మార్జాల మల్లములను
మటియు జాతివైరంబులు మాని కూడి
కలసి క్రీడించు మృగములఁ గాంచె నతఁడు. 599

క. ఇ ట్లెఱఁగున మృగజాతుల, [4]పొత్తులు మే మెఱుఁగ మనుచు భూవల్లభుఁడుం
జిత్తములోపల నా ముని, సత్తము సద్వృత్తమునకు సంతస పడుచున్. 600

క. హల్లక బిసరుహ సరసీ, కల్లోలోత్ఫుల్ల యూథికా గిరిమల్లీ
మల్లీ మరువక కురవక, సల్లలి తానిలమువలన సంతుష్టుం డై. 601

వ. దుష్యంతుండు వచ్చు నవసరంబున. 602

క. ఇం దిందిరాతి సుందరి, యిందిందిర చికుర యున్న దిం దిం ద శుభం
బిం దిందువంశ యనుక్రియ, నిందీవరవీథి శ్రీ సె నిందిందిరముల్. 603

క. మా కందర్పుని [6]శరములు, మాకందము లగుటఁ జేసి మాకందంబుల్
మా కందము లను కైవడి, మాకందాగ్రములఁ బికసమాజము నిలిచెన్. 604

వ. అంత. 605

క. ఇందున్న కణ్వమునికిని, వందన మొనరించి తిరిగి వచ్చెద ననుచుం
బొందుగ [7]ననుచరులను దా, నందఱ నందంద నిలిపి యట చని శ్రీమోలఁ. 606

[illegible]ణ్యాశ్రమమందు నీరజనివాసాంత ప్రదేశంబులఁ
[illegible]ముల నీడఁ [8]బుష్పలతికా మధ్యంబునన్ మంజు రం
[illegible]ంచిత శాలలోఁ గుసుమ సంపన్న [9]స్థలిన్ జూచె నా
[illegible]ంతుండు శకుంతల [10]న్నవనటత్ భ్రూపర్యట త్కుంతలఁ. 607

[illegible]ప్పుఁ దుఱుమును మీఁదికి, మిట్టించిన చన్నుఁగవయు [11]మిఱుమిఱు చూడ్కుల్
నట్టాడు నడుముఁ దేనియ, లుట్టెడు మోవియును మనము నూరింపంగన్. 60

---

1. కరిణు లొల్లని కుంభి కలభంబులకు మేఁత (తం. క) 2. చార (హ. తం. వా.
3. నుందుర (తం. వా) 4. మతిని (హ. తం. వా.) 5. పొత్తుల మేమఱునుఁ జూచు (హ)
6. సాయక (హ) 7. సన్నలమాన్యుల (క) 8. కల్పలతికా (హ.తం.వా.) 9. స్థితిన్ (హ)
10. నవనవభ్రూ (తం) 11. మిఱుమిఱు (తం. వా.)

వ. అంత నా రాజకుమారుం డలరుటమ్ముల విలుకాని వెడవింట ఘణఘణాయ
మానలై మ్రోయు ఘంటలకుం [1]బబ్బరించి, తన మనంబున. 609

శా. వన్యాహారములన్ జితేంద్రియత నావాసించు నా కణ్వు డీ
కన్యారత్నము నేగతిం గనియెడిం గా దీ కురంగాక్షి రా
జన్యాపత్యము గాఁగ నోపు నభిలాషం బయ్యె గాదేని [2]నే
యన్యాయ క్రియలందుఁ బౌరవుల కెం దాశించునే చిత్తముల్. 610

క. అడిగిన నృపసుతఁ గా నని, నొడివెడినో కదే మనంబు [3]నొవ్వ నని విభుం
డుడురాజ వదన [4]నడుగఁగఁ, [5]దడుమన యొకకొంతప్రొద్దు తడఁబడఁ జొచ్చెఁ. 611

వ. మఱియు నెట్టకేలకుఁ దన చిత్తోసంచలనంబు సత్యంబుగాఁ దలంచి యి ట్లనియె.

క. భూపాలక కన్యక వని, నీపైఁ జిత్తంబు నాఁటె నీ వా రేరీ
[7]నీ పే రెవ్వరు నిర్జన, భూపర్యటనంబు తగవె పూర్ణేందుముఖీ ! 613

వ. అని పలుకుచున్న రాజకుమారుని [8]వదనచంద్ర చంద్రికారసంబు నేత్రచకోరంబుల
వలనఁ ద్రావుచు, న య్యువిద విభ్రాంత యై యున్న సమయంబున. 614

క. కంఠేకాలుని చేతఁ, గుంఠితుఁ డగు నెట్లు మరుఁడు కుసుమాస్త్రంబుల్
లుంఠించి గుణనినాదము, [9]ఠం ఠ మ్మన బాల నేసె ఠవఠవ [10]గదురఁ. 615

వ. ఇట్లు వలరాజు వాఁడి [11]క్రొవ్విరి కోలల వేఁడిమిఁ దాలిమి పోఁడిమి సెడి, యా
వాలుఁగంటి యి ట్లనియె. 616

మ. అనివార్యప్రభ మున్ను మేనకయు విశ్వామిత్ర భూభర్తయున్
గని రా మేనక డించిపోయె [12]నడవిఁ గణ్వుండు న న్నింతగా
మనిచెన్ సర్వము నా మునీంద్రుఁ డెఱుఁగున్ మద్భాగధేయంబునన్
నినుఁ గంటిం బిదపం గృతార్థ నగుదుఁ నేఁ డీ వనాంతంబునన్. 617

క. నీ వారము ప్రజ మేమును, నీవారముఁ బూజ గొనుము [13]నిలువుము నీవుఁ
నీ వారును మా యింటను, నీవారాన్నంబుఁ [14]గొనుఁడు నేఁడు నరేంద్రా !

వ. అని పలికిన, దుష్యంతుండు మెచ్చి, మచ్చెకంటి యిచ్చ యెఱింగి యి ట్లనియె.

---

1. బంటించి (తం.వా.క.చ.) 2. నీ యన్యాయ త్తములందుఁ బౌరవుల కెట్లాశించునే (హ): నే యన్యాయ....కిట్లాశించునే (తం) 3. నొవ్వనని (హ) 4. నడుగక (హ. వా.) 5. నడుమన నొకకొంత (హ); దడుమునఁబడి (తం) 6. సంచారంబు (తం. వా) 7. నీపేఱది నిర్జనవన (హ) 8. వదనచంద్రికా రసంబు (హ.తం. వా.) 9. ఠంఠమ్మని (హ) 10. లేమిన్(హ) 11. కొవ్వాడి(హ) 12. నటనీ (హ) 13. నేడిట (హ) 14. ఁగుడుడు(హ)

ఆ. రాజతనయ వగుదు [1]రాజీవదళనేత్రి!
మాట నిజము [2]లోనిమాట లేదు
తనకు సదృశుఁ డైన [3]తరుణునిఁ గైకొంట
రాజ సుతకుఁ దగవు రాజవదన! 620

వ. అని మఱియుఁ దియ్యని నెయ్యంపుఁ బలుకులవలన న య్యువిద నియ్యకొలిపి.

క. బంధుర యశుఁడు జగన్నుత, సంధుఁడు దుష్యంతుఁ డుచిత సమయజ్ఞుం డై
గంధగజ గమన నప్పుడు, గాంధర్వవిధిఁ వరించె గహనాంతమునఁ. 622

—: భరతుని చరిత్రము :—

వ. ఇ వ్విధంబున నమోఘ వీర్యుం డగు నా రాచపట్టి, తపసిరాచూలికిఁ జూలు నిలిపి, మఱునాఁడు తన వీటికిం జనియె. అ య్యింతియుం గొంతకాలంబునకుఁ గొడుకుం గనినం, గణ్వమునీంద్రుఁ డా రాచపట్టికి జాతకర్మాది మంగళాచారంబు లొనర్చె. ఆ డింభకుండును దినదినంబునకు బాలచంద్రుండునుం బోలె నెదుగుచు.

క. కుంఠితుఁడు గాక వాఁ డు, త్కంఠం దన పిన్ననాఁడె కణ్వవనచరత్
కంఠీరవ ముఖ్యంబుల, కంఠములన్ బట్టి యడుచుఁ [4]గట్టున్ విడుచున్. 624

వ. అంత నా కణ్వమునీంద్రుండు బాలకుం జూచి శకుంతల కి ట్లనియె. 625

ఉ. పట్టపురాజు నీ మగఁడు పాపఁడు నన్నిట నెక్కు డంతకున్
బట్టపు దేవి వై [5]గరిమ బాగుగ నుండక, [6]పాఱువారితో
[7]గట్టు వనంబులో నవయఁగా బనిలే దిటఁ దర్లి పోఁగదే
[8]పుట్టిన యిండ్లు మాని పతిఁ బొందక యి ట్లనిశంబు నుందురే. 626

వ. అనిన నియ్యకొని. 627

క. ఆ పిన్న వాని నతుల, వ్యాపారు నుదారు వైష్ణవాంశోద్భవునిం
జూపెద నంచు శకుంతల, భూపాలుని కడకు వచ్చెఁ బుత్రునిఁ గొనుచున్. 628

వ. వచ్చి దుష్యంతుం డున్న సభా మంటపంబునకుం జని నిలిచియున్న యెడ. 629

---

1. నేత్ర (తం.వా) 2. లోనిమాటులేదు (తం.క.); లోని మాటులేల (డ); లోనిమాటలేల (చ); లోని మాటులేక (ట) 3. తనయుని (హ) 4. కాననవీథిన్ (హ.) 5. గఱువబాగున (తం.వా.) 6. వారివారితో (హ) 7. కట్ట ; (త) 8. పుట్టిన యిండ్ల మానినులు పోరచిగా ననిశంబు నుందురే (క. తం. వా.) 9. మండపంబునకు (తం. వా.)

మ. [1]వలకేలన్ గురు చక్రరేఖయుఁ బదద్వంద్వంబునం బద్మ రే
ఖలు నొప్పారఁగ [2]విందువచ్చిన రమాకాంతుండు నాఁ గాంతి న
గ్గల మై యున్న కుమారు మారసదృశాకారున్ విలోకించి తాఁ
బలుకం డయ్యె విభుం డెఱింగి సతి విభ్రాంతాత్మ యై [3]వందురన్. 630

వ. ఆ సమయంబున. 631

మ. అదె నీ [4]వల్లభ వాఁడు నీ సుతుఁడు భార్యాపుత్రులన్ [4]బాత్రులన్
వదలం గా దలనాటి కణ్వవనికా వై వాహికారంభముల్
మది నూహింపు శకుంతలా వచనముల్ మాన్యంబు లౌ భూపరేం
ద్ర! దయం జేకొను మంచు ప్రేమ సెను వియద్వాణీ వధూ వాక్యముల్. 632

వ. ఇట్లశరీరవాణి సర్వభూతంబులకుఁ దేటపడ భరింపు మని పలికిన, నాకుమారుండు భరతుం డయ్యె. ఆ రాజు రాజవదన నంగీకరించి, తనూభవుం జేకొని, కొంత కాలంబు రాజ్యంబుఁ జేసి పరలోకంబునకుం జనియె. తదనంతరంబ. 633

క. రెండవ హరిక్రియ ధరణీ, మండల భారంబు నిజ సమంచిత బాహా
దండమున నిలిపి తనకును, భండనమున నెదురులేక భరతుం డొప్పెన్. 634

వ. మఱియు నా దౌష్యంతి, యమునాతటంబున దీర్ఘతపసుండు పురోహితుండుగా డెబ్బది యొనిమిదియును, గంగాతీరంబున నేఁబది యయిదును, నిట్లు నూట ముప్పదిమూఁ డశ్వమేధ యాగంబులు సదక్షిణంబులుగా నొనర్చి, దేవేంద్ర విభవంబున నతిశయించి, పదుమూఁడువేలు న్నెనుబదినాలుగు కదుపు *(ధేనువులు గలయది ద్వంద్వం బనం బరగు. అట్టి వెయ్యి ద్వంద్వంబుల పాఁడిమొదవుల)క్రేపుల తోడ నలంకార సహితలం జేసి, వేవురు బ్రాహ్మణుల కిచ్చి, [6]మష్కార పుణ్య తీర్థకూలంబున విప్రముఖ్యులకు రత్నభూషణ శోభితంబు లై, ధవళదంతంబులు గల [7]నల్లని యేనుంగులఁ బదునాలుగు లక్షలొసంగె. దిగ్విజయకాలంబున †శక, శబర, బర్బర, కష, కిరాతక, హూణ, మ్లేచ్ఛ దేశంబుల రాజుల పీచం బడంచి, రసాతలంబున రాక్షస కారాగృహంబు లం దున్న వేల్పుల గరితలం బెక్కండ్ర విడిపించి తెచ్చి, వారల వల్లభులం గూర్చె. త్రిపురదానవుల జయించి, నిర్జరుల నిజమందిరంబుల నునిచె. అతని రాజ్యంబున గగన ధరణీతలంబులు ప్రజలు గోరిన కోరిక లిచ్చుచుండె. ఇ ట్వివిధంబున. 635

---

1. వలకేల న్నురుచక్ర రేఖయు (క. తం.) 2. నిందు వచ్చిన (హ); నందువచ్చిన (వా) 3. యుండగన్ (హ) 4. వల్లభి (హ) 5. భ్రాతలన్ (హ) * తా. వ. ప్రతులలో లేదు. 7. మహాహ్రదంబను (హ) 8. దంతావళులం (హ)

† "కిరాతహూణాన్ యవనా నాంధ్రాన్ వంగాన్ శకాన్ కశాన్" (20-33) మూలము.

ఆ. సత్యచరితమందుఁ జలమందు బలమందు
భాగ్యమందు లోకపతులకంటె
నెక్కు డైన వేర్మి నిరువదియేడువే
లేండ్లు ధరణి భరతుఁ డేలె నధిప! 636

క. అర్థపతికంటెఁ గలిమిఁ గృ, తార్థుం డై యతుల శౌర్య మలవడియు నతం
డర్థములును బ్రాణములును, వ్యర్థము లని తలఁచి శాంతుఁ డయ్యె నరేంద్రా! 637

క. భరతుని భార్యలు మువ్వురు, వరుసం బుత్రకులఁ గాంచి వల్లభుతోడఁ
సరి గా రని తోడ్తోడను, శిరములు దునుమాడి రాత్మశిశువుల నధిపా! 638

వ. ఇట్లు విదర్భరాజపుత్రికలు శిశువులఁ జంపిన, భరతుం డపుత్రకుం డై మరుత్స్తోమం
బను యాగంబు పుత్రార్థియై చేసి, దేవతల మెప్పించె. అ య్యవసరంబున. 639

సీ. అన్నయిల్లాలిఁ జూలాలిని మమతాఖ్యఁ జూచి బృహస్పతి సురతమునకుఁ
దొరఁకొని పైఁబడ్డఁ దొల్లి గర్భంబున నున్న బాలుఁడు భయం బొదవి వలదు
తగ దని మొఱసేయఁ దమకంబుతో వాని నంధుండ వగు మన్న నలిగి వాఁడు
యోనిలోపలి [1]వీర్య మూడఁదన్నిన నేలఁ బడి బిడ్డఁ డై యున్నఁ బాయలేక

ఆ. నితనిఁ బెంపు కొడుకు లిరువురు జన్మించి
రనుచు వెలయఁ జేయు మనిన మమత
బెంపఁజాల నీవ వెంపు భరింపు మీ
ద్వాజు ననుచుఁ జనియె దాని విడిచి. 640

వ. [2]ఇ ట్లుచథ్యునిభార్య యగు మమతయు, బృహస్పతియు శిశువుం గని, ద్వాజుం
డై న వీని నీవ నీవ భరింపు మని, వదినె మఱందులు దమలో నొండొరువులం
బలికిన కారణంబున వాఁడు భరద్వాజుం డయ్యె. గర్భస్థుం డై నవాఁడు బృహ
స్పతిశాపంబున దీర్ఘతముం డయ్యె. అంత నా బృహస్పతియు, మమతయు
నుదయించిన వాని విడిచి, నిజేచ్ఛం జనిన, మరుత్తులు వానిం బోషించి,
పుత్రార్థి యైన భరతున కిచ్చిరి. భరతుండును, వానిఁ జేకొనియె. వితథం బై న
భరతవంశమునకు నా భరద్వాజుండు వంశకర్త యగుటం జేసి, వితథుం
డనం బరఁగె. ఆ వితథునికి మన్యువు. మన్యువునకు బృహత్క్షత్ర జయ మహావీర్య
నర గర్గులనువా రేవురు సంభవించిరి. అందు నరునికి సంకృతి, సంకృతికి గురుండు,
రంతిదేవుం డన నిరువురు జన్మించిరి. అందు. 641

---

1. వీర్య ముఱలఁ దన్నిన (తం) 2. ఇట్లురుచథ్యుని (హ)

అధ్యాయము-౨౧

—: రంతిదేవుని చరిత్రము :—

సీ. రాజవంశోత్తమ ! రంతిదేవుని కీర్తి [1]యెల్లఁ జెప్పఁగఁబడు నిందు నందు
నా రాజు దన సంచితార్థంబు లన్నియు నెడపక దీనుల కిచ్చి యిచ్చి
సకుటుంబుఁ డై ధైర్యసంయుతుం డై వేద వ్రతు డై కూడు నీరు లే కధమవృత్తి
నెందేని నలువడి యొనిమిది దివసముల్ చరియింప నొకదివసంబు రేపు

ఆ. నెయ్యి పాయసంబు నీళ్లును గలిగిన
బహు కుటుంబభార భయముతోడ
నలసి నీరువట్టు నాఁకలియును మిక్కి
లొదవఁ జూచి కుడువ నుత్సహించె. 642

వ. అ య్యవసరంబున. 643

సీ. అతిథి భూసురుఁ డొక్కఁ డాహార మడిగినఁ గడపక ప్రియముతోఁ గారవించి
హరిసమర్పణ మంచు నన్నంబులో సగ మిచ్చిన భుజియించి యేఁగె నాతఁ
డంతలో నొకశూద్రుఁ డశనార్థి యై వచ్చి పొడసూప లే దనఁబోక తనకు
నున్న యన్నములోన నొకభాగ మిచ్చిన సంతుష్టుఁ డై వాఁడు సనిన వెనుక

ఆ. కుక్కగమియుఁ దాను నొక్కఁ డేతేర నా
యన్న శేష మిచ్చి [2]స న్నయమున
వాని మ్రొక్కి పంప వరుసతోఁ జండాలుఁ
డొక్కఁ డరుగుదెంచి చక్క నిలిచి. 644

క. హీనుఁడఁ జండాలుండను, మానవకులనాథ ! దప్పి మానదు నవలం
బో నేర నీకుఁ జిక్కిన, పానీయము నాకుఁ బోసి బ్రతికింపఁగదే. 645

వ. అనిన వాని దీనాలాపంబులకుఁ గరుణించి, రా జి ట్లనియె. 646

ఉ. అన్నము లేదు [3]కొద్ది మధురాంబువు మాత్రము ద్రావ వన్న రా
వన్న ! శరీరధారులకు నాపద వచ్చిన వారి యాపదల్
గ్రన్ననఁ [4]దాల్చి వారికి సుఖంబులు సేయుటకంటె నొండు మే
లున్నదె నాకు దిక్కు పురుషోత్తముఁ డొక్కఁడ సుమ్ము పుల్కసా. 647

వ. అని పలికి. 648

---

1. యేలచెప్పఁగ వినుమిందునందు(తం.వా.) 2. సన్నయంబు, లాడిమ్రొక్కిపంప నోడక(క.చ. ట. తం. వా.) 3. కొన్ని మధురాంబువు లున్నవి ద్రావుమన్న (తం. వా.) 4. మాన్చి (తం. వా.)

మ. బలవంతం బగు నీరువట్టున నిజప్రాణాంత మై యున్నచో
నలయం డేమియు వీని హృజ్జ్వరము [1]నాయాసంబు ఖేదంబు నా
జలదానంబున నేఁడు మాను ననుచుఁ సర్వేశ్వరాధీనుఁ డై
జలముల్ వోసెను రంతిదేవుఁడు దయం జండాలపాత్రంబునఁ. 649

వ. తదనంతరంబున, బ్రహ్మాదిదేవతలు సంతోషించి, రంతిదేవునికి మేలు సేయం దలంచి, నిజాకారంబులతో ముందట నిలువంబడి, యా రాజు ధైర్యపరీక్షార్థంబు దమ చేసిన వృషలాదిరూపంబు లగు విష్ణుమాయ నెఱింగించిన, నా నరేంద్రుం డంద ఱికి నమస్కరించి. 650

క. వారల నేమియు నడుగక, నారాయణభక్తి తన మనంబున వెలుఁగఁ
ధీరుం డాతఁడు మాయా, పారజ్ఞుం డగుచుఁ బరమపదముం బొందెఁ. 651

క. ఆ రాజర్షిని గొలిచిన, వారెల్లఁ దదీయ యోగవైభవమున శ్రీ
నారాయణచింతను లై, చేరిరి యోగీశు లగుచు సిద్ధపదంబుఁ. 652

వ. ఇట్లు రంతిదేవుండు విజ్ఞానగర్భిణి యగు భక్తివలనఁ బరమపదంబునకుం జనియె. అంత గర్గునకు శిని జన్మించె. శినికి గార్గ్యుండు గలిగె. ఆతనినుండి బ్రాహ్మణ కులం బయ్యె. మహావీర్యునికి [2]నురుక్షయుండు, నురుక్షయునకుఁ ద్రయ్యారు ణియు, కవియుఁ,బుష్కరారుణియు నను మువ్వురు సంభవించిరి. వారు బ్రాహ్మణు లై చనిరి. బ్రహ్మక్షత్రునికి సుహోత్రుండును, సుహోత్రునికి హస్తి యు జనిం చిరి. అతండు దనపేర హస్తినాపురంబు నిర్మించె. ఆ హస్తికి నజమీఢుండును, ద్విమీఢుండును, పురుమీఢుండును నన ముగ్గురు జనియించిరి. అందు నజమీఢుని వంశంబునఁ బ్రియమేధాదులు గొందఱు పుట్టి, బ్రాహ్మణు లై చనిరి. అ య్యజమీఢునికి బృహదిషువు, నతనికి బృహద్ధనువు, నతనికి బృహత్కా యుండు, నతనికి జయద్రథుండు, అతనికి విశ్వజిత్తు, విశ్వజిత్తునకు సేనజిత్తు, సేనజిత్తునకు రుచిరాశ్వుండు, దృఢహనువు, కాశ్యుండు, వత్సుండు నన నలుగురు జనియించిరి. అందు రుచిరాశ్వునకుఁ బ్రాజ్ఞుండు, నతనికిఁ బృథుసేనుండును, బృథుసేనునికిఁ బారుండును, వానికి నీపుండును, నీపునికి నూర్వురు కొడుకులును బుట్టిరి. మఱియును. 653

ఆ. శుకుని కూఁతు నై న సుందరి సత్కృతిఁ
బొందువేడ్క నీపభూవిభుండు
విమల యోగవిత్తు విజ్ఞానదీపితో
దార[3]చిత్తు బ్రహ్మదత్తుఁ గనియె. 654

---

1. వారాటంబు (హ) 2. సురక్షయుండు (తం) 3. విత్తు (హ)

వ. బ్రహ్మదత్తుండు, జైగిషవ్యోపదేశంబున, యోగతంత్రంబునఁజేసి [1]గోదేవి యను భార్యవలన విష్వక్సేనుం డను కుమారునిం గనియె. విష్వక్సేనునకు నుదక్సేనుండు, నుదక్సేనునకు భల్లాదుండు. వీరలు భార్హాదిషవు లను రాజు లైరి. ద్విమీఢునకు యమినరుండు, యమినరునికిఁ గృతిమంతుండు, కృతిమంతునికి సత్యధృతి, సత్యధృతికిదృఢనేమి,దృఢనేమికి సుపార్శ్వకృత్తు,సుపార్శ్వకృత్తునకు సుపార్శ్వుండు సుపార్శ్వునకు సుమతి, సుమతికి సన్నతిమంతుండు జనించిరి. సన్నతిమంతు కొడుకు కృతి యనువాఁడు, హిరణ్యనాభునివలన యోగమార్గం బెఱింగి, శోకమోహంబులు విడిచి, తూర్పుదేశంబున సామసంహిత పఠియించె. అతనికి నుగ్రాయుధుండు, నుగ్రాయుధునకు క్షేమ్యుండు, క్షేమ్యునకు సువీరుండు, సువీరునకుఁ బురంజయుండు, బురంజయునకు బహురథుండు జన్మించిరి. హస్తికొడుకు పురుమీఢునకు సంతతి లేదయ్యె. అ య్యజమీఢునికి నళిని యను భార్య యందు నీలుండు, నీలునికి శాంతి, శాంతికి సుశాంతి, సుశాంతికిఁ బురుజుండు, పురుజునికి నర్కుండు, నర్కునికి భర్మ్యాశ్వుండు, భర్మ్యాశ్వునకు ముద్గల యవీనర బృహదిషు కాంపిల్య సృంజయు లనువా రేవురు పుట్టిరి. 655

క. మించిన భర్మ్యాశ్వుఁడు సుత, పంచకమును జూచి విషయపంచకమును వ
ర్జించితి మే మని పల్కినఁ, బాంచాలురు నాఁగ సుతులు పరఁగిరి ధరణిన్. 656

వ. అంత ముద్గలుని నుండి, బ్రాహ్మణ కులం బై ముద్గలగోత్రంబు నా నెగడె. భర్మ్యాశ్వ పుత్రుం డైన యా ముద్గలునికి దివోదాసుండు, నహల్య యను కన్యకయునుం బుట్టిరి. అహల్యయందు గౌతమునికి శతానందుండు వుట్టె. శతానందునికి ధనుర్వేద విశారదుం డైన [2]సత్యధృతి పుట్టె. అతనికి శరద్వంతుండు వుట్టె. అతం డొక్కనాఁడు వనంబున నూర్వశిం గనిన, నతనికి రేతఃపాతం బై, తద్వీర్యంబు శరస్తంబంబునం బడి, మిథునం బైన సమయంబున.

క. చపలరతి శంతనుం డను, నృపవరుఁ డడవికిని వేఁటనెపమునఁ జనుచుం
గృపతో శిశుయుగముం గని, కృపయుం గృపుఁ డనుచుఁ దెచ్చి గృహమునఁ
బెంచెన్. 658

అధ్యాయము - ౨౨

వ. ఆ కృపి ద్రోణునకు భార్య యయ్యె. దివోదాసునకు మిత్రాయువు, మిత్రాయువునకుఁ జ్యవనుండు, చ్యవనునకు సుదాసుండు, సుదాసునకు సహదేవుండు, సహదేవునకు సోమకుండు, సోమకునకు సుజన్మకృత్తు, సుజన్మకృత్తునకు నూర్వురు

---

1. సరస్వతి (క) 2. సత్యధృతిపుట్టె నతం డొక్కనాఁడు (హ. తం. వా.)

కొడుకులుం గలిగిరి. *(వారిలో జంతు వనువాఁడు జ్యేష్ఠుండు.) కడచూలు [1]పృషదుండు. పృషదునకు ద్రుపదుండు, ద్రుపదునకు ధృష్టద్యుమ్నాదు లయిన కొడుకులును, ద్రౌపది యను కూఁతురుం గల్గిరి. ధృష్టద్యుమ్ననకు ధృష్టకేతువు వుట్టె. వీరలు పాంచాల రాజు లని యెఱుంగుము. మఱియు, న య్యజమీఢుని కొడుకు బుధుండు. బుధునకు సంవరణుం డుదయించె. ఆ సంవరణుండు తపతి యనియెడి సూర్యకన్యక యందుఁ గురువుం గనియె. ఆ కురువు పేరం గురుక్షేత్రం బయ్యె. ఆ కురువునకుఁ బరీక్షిత్తు, సుధనువు, జహ్నువు, నిషధుండు ననువారలు నలువురు వుట్టిరి. అందుఁ బరీక్షిత్తు కొడుకులు లేక చనియె. సుధనువునకు సుహోత్రుండు, నతనికి చ్యవనుండు, చ్యవనునకుఁ గృతి, [2]కృతికి నుపరిచర వసువు, వసువునకు బృహద్రథ, కుసుంబ, మత్స్య, ప్రత్యగ్ర, చేదిపాదులు పుట్టిరి. అందు, బృహద్రథు నకుఁ గుశాగ్రుండు, గుశాగ్రునికి బుషభుండు, బుషభునికి సత్యహితుండు, సత్యహితునికిఁ బుష్పవంతుండు, బుష్పవంతునకు జహ్నువను వాఁడు జనియించిరి. మఱియును.

సీ. ఆ బృహద్రథునకు నన్యభార్యా గర్భమున రెండు [3]తనుఖండములు జనించేఁ
దునుకలు గని తల్లి తొలఁగంగ వైచిన సంధించె నొకటిగా జర యనంగ
నొక దైత్యకాంత వాఁ డొప్పె జరాసంధుఁ డన గిరివ్రజపుర మాతఁ డేలె
నతనికి సహదేవుఁ డతనికి సోమాపి తనయుఁ డాతనికి శ్రుతశ్రవుండు

తే. జహ్నుపుత్రుండు సురథుండు జనవరేణ్య!
యతని కొడుకు విదూరథుఁ డతని పట్టి
సార్వభౌముండు వానికి సంభవుండు
విను జయత్సేనుఁ డనువాఁడు విమలకీర్తి. 660

వ. ఆ జయత్సేనునికి రథికుండు, రథికునకు నయుతాయువు, నయుతాయువునకుఁ గ్రోధనుండుఁ, గ్రోధనునకు దేవాతిథి, దేవాతిథికి బుధుండు, బుధునికి భీమసేనుండు, వానికిఁ బ్రతీపుండుఁ, బ్రతీపునకు దేవాపి శంతను బాహ్లీకు లను మువ్వురు కొడుకులు వుట్టిరి. అందు.

సీ దేవాపి రాజ్యంబు దీర్ఘనొల్లక వనంబున కేఁగెఁ దమ్ముండు పూర్వజన్మ
మందు మహాభిషుఁ డనియెడు వాఁడు శంతనుఁ డయ్యె వాఁడె యీ ధాత్రినెల్ల
నేలుచుఁ గరముల [4]నే వృద్ధు ముట్టిన వాఁడెల్ల నిండుజవ్వనము నొందు
[5]నతఁడు శాంతిప్రాప్తుఁ డై యున్నఁ దానఁ బండ్రెండేండ్లు వఱి వర్షింప కున్న

---

* తా.ప. ప్రతులలో లేదు. 1. పృషతుండు (తం.వా.); "పృషదస్తతః" అని మూలము (22-2) 2. కృతికివసువు (హ.తం.వా.); 'చ్యవన స్తత్సుతః కృతీ; వసు స్తస్యోపరి చరో' (22-5) 3. తగఖండ ములు (హ) 4. నెవని ముట్టినఁ గాని (హ) 5. నధిక (హ)

ఆ. వృష్టిలేని చొప్పు విప్రుల నడిగిన
"నన్న యుండఁ దమ్ముఁ డగ్నిహోత్ర
దార సంగ్రహంబుఁ దాల్చినఁ" బరివేత్త
[1]యంఁడు వాని నీవ యతఁడ వై తి. 662

వ. అది కారణంబుగా నన్న యుండఁ దమ్ముఁడు రాజ్యార్హుండు గాఁడు. నీవు పరివేత్తవు. మీ యన్నకు రాజ్యం బిచ్చిన, ననావృష్టి దోషంబు చెడు. అని బ్రాహ్మణులు వల్కిన, శంతనుండు వనంబునకుం జని, దేవాపికిఁ బ్రియంబు చెప్పి, రాజ్యంబు చేకొ మ్మని పల్కె. అంతకు మున్న [2]వాని మంత్రి దేవాపిని రాజ్యం బున కనర్హుం జేయఁదలంచిఁ, విపులం బంచిన, నా విప్రులు పాషండమత వాక్యం బులు దేవాపికి నుపదేశించిరి. దేవాపి వేదంబుల నిందించినఁ, బాషండుండును, దేవదూషకుండును గావున వానికి రాజ్యంబు లే దని బ్రాహ్మణులు సెప్పిన, శంతనుండును మగుడి వచ్చి, రాజ్యంబుఁ జేకొనియె. అంత వర్ష ంబులు గురిసె. ఇ ట్టి విధంబున. 663

క. దేవాపి కలాపపురం, బావాసము గాఁగ యోగి యై యున్నాఁ డు
ర్వీవర ! కలి నష్టం బగు, నై వాత్మక కులము మీఁద సంస్థాపించున్. 664

వ. బాహ్లీకుం డనువానికి సోమదత్తుండు పుట్టె. సోమదత్తునకు భూరియు, భూరి శ్రవస్సు, శలుం డను వారు మువ్వురు పుట్టిరి. 665

క. *భాతిగ శంతనునకు గం,గాతటినికి వైష్ణవాగ్రగణ్యుఁడు ఘోరా
రాతినయన నీలోత్పల, భీతికర గ్రీష్మఁ డైన భీష్ముఁడు పుట్టెన్. 666

ఆ. పరశురాముతోడఁ బ్రతిఘటించి జయింప
[3]నన్య నొకని నెఱుఁగ మతనిఁ దక్క
వీరయూథపతి వివేక ధర్మజ్ఞుండు
[4]వేల్పు చేటిపట్టి విమలయశుఁడు. 667

---

1. యంఁడుగాన (తం. వా.) 2. వాని తండ్రి దేవాపిని రాజ్యంబున కర్హుం జేయం దలంచి విప్రులం బిలిచిన (హ. తం. వా.)

* ఈ క్రిందిది "హ" ప్రతిపాఠము.

క. భాతిగ శంతనునకు సు,జ్ఞాతుం డై గంగయందు జనియించెను స
దూఢతి విమల కీర్తు లచే, నాతత వ్యోముండు భీష్ముఁ డాత్మజ్ఞుఁడుగా"

3. నన్యుఁడొకఁడు....మతఁడుదక్క (హ) 4. దివిజనది సుతుండు దేవసముఁడు (హ)

వ. ఆ శంతనునకు దాశకన్యక యైన సత్యవతియందుఁ జిత్రాంగద విచిత్రవీర్యులు వుట్టిరి. అందుఁ [1]జిత్రాంగదుండు (చిత్రాంగదుండను) గంధర్వుని చేత నిహతుం డయ్యె. మఱియును. 668

ఉ. సత్యవతీ వధూటి మును శంతను పెండ్లము గాని నాఁడు సాం
గత్యమునం బరాశరుఁడు గర్భము చేసిన బాదరాయణుం
డత్యధికుండు శ్రీహరి కళాంశజుఁ డై ప్రభవించె [2]నిత్యముల్
సత్యము లైన వేదముల సాంగములఁ విభజింప దక్షుఁ డై. 669

ఆ. బాదరాయణుండు భగవంతుఁ డనఘుండు
పరమగుహ్యా మైన భాగవతము
నందనుండ నై న నాకుఁ జెప్పెను శిష్య
జనుల మొఱఁగి యేను జదువుకొంటి. 670

వ. ఆ విచిత్రవీరునికిఁ గాశిరాజు కూఁతుల, నంబి కాంబాలికల భీష్ముండు బలాత్కా రంబునం దెచ్చి వివాహంబుచేసిన, విచిత్రవీర్యుండు వారలం దగిలి, మనోజరాగ మత్తుం డై, చిరకాలంబు నానావిధ క్రీడలఁ విహరింపుచు, రాజయక్ష్మ పీడితుం డై, మృతుం డయ్యె. అంత. 671

క. అతని [3]సతివలన సుతులను, సుత ! కను మని దల్లి వనుప సొరదిం గనియెఁ
ధృతరాష్ట్ర పాండు విదురుల, సుతచరితుఁడు బాదరాయణుండు నరేంద్రా !

వ. అందు, ధృతరాష్ట్రునికి గాంధారియందు దుర్యోధనాదు లగు కొడుకులు నూర్వు రును, దుశ్శల యను కన్యకయును, జన్మించిరి. మృగశాప భయంబునం జేసి, భార్యం బొంద వెఱచిన పాండునకుఁ గుంతీదేవియందు ధర్మానిలేంద్ర ప్రసాదం బున యుధిష్ఠిర భీమార్జును లను మువ్వురును, మాద్రిదేవివలన నాసత్యప్రసా దంబున నకుల సహదేవు లనువా రిద్దరును గా నేవురు పుట్టిరి. అ య్యేవురకును ద్రుపదరాజ పుత్రి యైన ద్రౌపదియందుఁ గ్రమంబునం † బ్రతివింధ్యుండును, శ్రుతసేనుండును, శ్రుతకీర్తియు, శతానీకుండును, శ్రుతకర్ముండు నన నేవురు పుట్టిరి. మఱియు యుధిష్ఠిరునకుఁ బౌరవతియందు దేవకుండును, భీమసేనునికి హిడింబయందు ఘటోత్కచుండును, గాళియందు సర్వగతుండును, సహదేవునికి విజయయందు సుహోత్రుండును, నకులునకు రేణుమతియందు నిరమిత్రుండును,

---

1. చిత్రాంగదుండు గంధర్వులచేత నిహతుం డయ్యె(హ.తం వా.)2. చోరహ్యాత్, దైత్యకరావ కృష్ట మిళితస్థితవేద విభాగదక్షుఁడై (క. చ. ట. త. జ.) 3. సతులవలన సుతుల (తం. వా.)
* "యుధిష్ఠిరాత్ప్రతీ వింధ్యః" (22-29) అని మూలము.

నర్జునునకు నులూపియను నాగ కన్యకయందు నిరావంతుండును, మణలూరు పతి పుత్రికయైన చిత్రాంగదయందు బభ్రువాహనుండును, సుభద్రయందు శౌర్య ధైర్య తేజో విభవంబుల నఖల రాజనికరంబునఁ బ్రఖ్యాతుం డైన యభిమన్యుం డును జన్మించిరి. అందుఁ బభ్రువాహనుం డర్జునుని నియోగంబున మాతా మహుని గోత్రంబునకు వంశకర్త యయ్యె. 673

ఉ. అన్యసుపూజ్య ! నీ జనకుఁ డైన యభిమన్యుఁడు భూవరేంద్ర మూ
ర్ధన్యుఁడు [1]ధన్య మార్గణ కదంబ విదారిత వైరివీర రా
జన్యుఁడు జన్యభీత కురుసైన్యుఁడు సైన్యసమూహనాథ దృ
ఢ్మాన్యుఁడు మాన్య కీర్తి మహిమం దనరెం గురువంశకర్త యై. 674

వ. ఆ యభిమన్యునకు నుత్తరయందు నీవు జన్మించితివి. 675

క. ద్రోణసుతు తూపువేఁడిమిఁ, బ్రాణంబులఁ బాసి హరి కృపాదర్శన సం
త్రాణంబున బ్రతికితె కా, క్షోణీశ్వర ! మున్ను నీ శిశుత్వమువేళన్. 676

వ. నీ కుమారులు జనమేజయ శ్రుతసేన భీమసే నోగ్రసేను లను నల్వురు. వీరల యందు. 677

ఆ. నీవు తక్షకాహి నిహతుఁడ వని విని
సకల సర్పలోక సంహృతముగ
సర్పయాగ మింక జనమేజయుఁడు సేయఁ
గలఁడు పూర్వరోష కలితుఁ డగుచు. 678

వ. మఱియు నతఁడు సర్వధరణీ మండలంబును జయించి, కావషేయుండు పురోహి తుండుగా నశ్వమేధంబు సేయఁగలవాఁడు. వానికి శతానీకుండు జనియించి, యాజ్ఞవల్క్యుని [2]తోడ వేదంబులు పఠియించి, కృపాచార్యునివలన [3]విలువిద్యనేర్చి, శౌనకునివలన నాత్మజ్ఞానంబునుం బడయంగలవాఁడు. ఆ శతానీకునికి సహస్రా నీకుండు, వానికినశ్వమేధజుండు, నశ్వమేధజునికి నాసీమకృష్ణుండు, నాసీమకృష్ణు నకు నిచకుండు జనియించిరి. ఆ నిచకుఁడు గజాహ్వాయంబు నదిచే హృతంబుగాఁ గౌశాంబియందు వసియించు. ఆతనికి నుష్ణుండు, ఉష్ణునికిఁ జిత్రరథుండు, చిత్ర రథునకు శుచిరథుండు, శుచిరథునికి వృష్టిమంతుండు, వృష్టిమంతునికి సుషేణుండు, సుషేణునికి సుపీతుండు, సుపీతునికి నృచక్షుస్సు, నృచక్షుస్సుకు సుఖానిలుండు, సుఖానిలునికిఁ బరిప్లవుండు, పరిప్లవునకు మేధావి, మేధావికి సునయుండు,

---

1. ధర్మమార్గణ (జ. డ. బ.) 2. యందు (హ) 3. తత్వజ్ఞానంబు (హ)

సునయునికి నృపంజయుండు, నృపంజయునికి దూర్వుండు, దూర్వునికి నిమి, నిమికి బృహద్రథుండు, బృహద్రథునకు సుధాంశుండు, సుధాంశునికి శతానీకుండు, శతానీకునకు దుర్దమనుండు, దుర్దమనునికి విహీనరుండు, విహీనరునికి దండపాణి, దండపాణికి మితుండు, మితునకు క్షేమకుండు, క్షేమకునకు బ్రహ్మక్షత్రుండు పుట్టిరి. వాఁడు నిర్వంశుం డై, దేవర్షి సత్కృతుం డై, కలియుగంబునందుఁ జనంగలవాఁడు. 679

క. జగతి నిటమీఁద బుట్టెడు, మగధాధీశ్వరుల నిఖిల మనుజేశ్వరులన్
నిగమాంతవిదులఁ జెప్పెద, సుగుణాలంకార! ధీర! సుభగవిచారా! 680

వ. జరాసంధపుత్రుఁ డైన సహదేవునికి మార్జాలి, మార్జాలికి శ్రుతశ్రవస్సు, శ్రుత శ్రవస్సునకు నయుతాయువు, నయుతాయువునకు నిరమిత్రుండు, నిరమిత్రునకు సునక్షత్రుండు, సునక్షత్రునికి [1]బృహత్సేనుండు, బృహత్సేనునికిఁ గర్మజిత్తు, కర్మజిత్తునికి శ్రుతంజయుండు, శ్రుతంజయునకు విప్రుండు, విప్రునకు శుచి, శుచికి క్షేముండు, క్షేమునికి సువ్రతుండు, సువ్రతునకు ధర్మనేత్రుండు, ధర్మనేత్రునకు శ్రుతుండు, శ్రుతునకు దృఢసేనుఁడు, దృఢసేనునికి సుమతి, సుమతికి సుబలుండు, సుబలునకు సునీతుండు, సునీతునకు సత్యజిత్తు, సత్యజిత్తునకు విశ్వజిత్తు, విశ్వ జిత్తుకుఁ బురంజయుండును, జన్మించెదరు. అని చెప్పి, మఱియు ని ట్లనియె.681

ఆ. వినుము మగధదేశవిభులు జరాసంధ
ప్రముఖ ధరణిపతులు ప్రబలయశులు
వీరు కలియుగమున వెయ్యేండ్లలోపల
పుట్టి గిట్టఁగలరు భూవరేంద్ర. 682

అధ్యాయము - ౨౨

వ. యయాతికొడు కనువునకు సభానరుండు, చక్షువు, పరోక్షుండు ననువారు ముగ్గురు పుట్టిరి అందు సభానరునికిఁ గాలనాథుండు, కాలనాథునకు సృంజ యుండు, సృంజయునకుఁ బురంజయుండు, పురంజయునకు జనమేజయుండు, జనమేజయునకు మహాశాలుండు, మహాశాలునికి మహామనసుఁడు, మహామన సునకు నుశీనరుండు, తితిక్షు వన నిరువురు జన్మించిరి. అం దుశీనరునకు శిబియు, వనుండును, గ్రిమియు, దర్వ్యుండు నన నలువురు జన్మించిరి. అందు శిబికి సుదేవ సువీర మద్ర కేకయులు నలువురు పుట్టిరి. తితిక్షునకు రుశద్రథుండు, యశద్రథు నకు హేముండు, హేమునకు సుతపుండు, సుతపునకు బలి పుట్టిరి. ఆ బలి కేవ

---

1. "బృహత్క్షత్రుఁ" (అని మూలము)

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

మున దీర్ఘతముని వలన అంగ, వంగ, కళింగ, సింహ, పుం డ్రాంధ్రులను పేళ్ళు గలవా రార్వురు కుమారులు పుట్టిరి. వారలు తూర్పుదేశంబునకు రాజు లై, దేశంబులకుఁ దమతమ నామధేయంబు లిడి యేలిరి సువీరునకు సత్యరథుఁడు, సత్యరథునికి [2]నిరథుండు, నిరథునికి ధర్మరథుండు, ధర్మరథునకుఁ జిత్రరథుండు పుట్టిరి. ఆ చిత్రరథుండు రోమపాదుండు నాఁ బరఁగె. 683

క. సంతతి లేనికతంబునఁ జింతింపుచు నుండ నతని చెలికాఁ డగు ధీ
మంతుఁడు దశరథుఁ డతనికి, సంతతిగా నిచ్చె నాత్మజను శాంతాఖ్యన్. 684

వ. అంత రోమపాదుఁడు తనకూఁతురు శాంత యని కైకొని మెలఁగుచుండ, నా రాజు రాజ్యంబునం గొంతకాలంబు వర్షంబులేమికిం జింతించి, విభాండకసుతుం డైన ఋశ్యశృంగుండు వచ్చిన వర్షంబు గురియు నని పెద్దలవలన నెఱింగి. 685

క. ఆ రాజు ఋశ్యశృంగుని, ఘోర తపోనిరతుఁ దెచ్చుకొఱకై పనిచెన్
వారసతుల నేర్పరుల ను, దారస్తనభార భీరుతర మధ్యగలన్. 686

వ. వారును జని. 687

ఆ. కాంతలార! మెగము గన్నది మొదలుగా
నాఁడువారి నెఱుఁగఁ డడవిలోన
గోఁచి బిగియఁగట్టుకొనిన యా వడుగని
మత్తికాని రతికి మరప వలయు. 688

వ. అని పలుకుచు. 689

క. ఆడుచుఁ జెవులకు నింపుగఁ, బాడుచు నాలోక నిశితబాణౌఘములన్
వీడుచు డగ్గఱి నోడుచుఁ, జేడియ లా [2]తపసి కడకుఁ జేరిరి [3]కలఁపన్. 690

వ. అ య్యవసరంబున వారలం జూచి. 691

సీ. మిళితాళినీల ధమ్మిల్లభారంబులు చారు జటావిశేషంబు లనియు
భర్మాంచ లోజ్జ్వల ప్రభ దుకూలంబులు తత చర్మవస్త్ర భేదంబు లనియు
బహు రత్నకీలిత భాసురదామంబు లధిక రుద్రాక్షమాలాదు లనియు
మలయజ మృగనాభి మహిత లేపంబులు బహువిధ భూతిలేపంబు లనియు

తే. మధురగానంబు శ్రుతియుక్త మంత్రజాతు
లనియు, వీణెలు దండంబు లనియు సతుల
మూర్తు లెన్నఁడు నెఱుఁగని ముగుదతపసి
వారిఁ దాపసు లని డాయ వచ్చి భ్రమొక్కి. 692

---

1. ధివిరథుండు (తం. వా); హవిరథుఃడు (మూలము) 2. వడుగు చెంతఁజేరి (జ); తపసి వడుగుఁజేరిరి (తం) 3. కలవఁ (హ)

వ. ఇట్లు వచ్చి మ్రొక్కిన ఋష్యశృంగుం జూచుచు నగుచు డగ్గఱి. 693

సీ. నేమమే యని సతుల్ చేతుల గ్రుచ్చి కర్కశకుచంబులు మోపి కౌఁగిలించి
చిర తపోనియతి డస్సితి గదా యని మోముఁ [1]గంఠంబు నాభియుఁ గలయఁ బుణికి
[2]క్రొత్త దీవన లివి కొను మని వీనుల పొంత నాలుకలఁ జప్పుళ్ళు చేసి
మా వనంబుల పండ్లు మంచివి తిను మని పెక్కు [3]లడ్వంబులు ప్రీతి నొసఁగి

తే. ‡చర్మవస్త్రము వదలించి భర్మకాంతి
మించి చెలఁగు పీతాంబర మిచ్చి వెసను
మనము సొక్కంగ నతనిఁ జేకొనఁగ వారి
మఱుఁగునకుఁ జేరె నతఁడు వే మరగి వారి. 694

వ. ఇట్లు హరిణీసుతుండు [4]కాంతాకటాక్ష పాశబద్ధుం డై, వారలవెంటం జని, రోమ పాదుకడకుం బోయిన, నతండు, దన ప్రియనందన యైన శాంత నిచ్చి పురంబున నునిచికొనియె. అ మ్మునీశ్వరుండు వచ్చిన వర్షప్రతిబంధ దోషంబు చెడి వర్షంబు గురిసె. అంత. 695

ఆ. ఆ నృపాలచంద్రుఁ డనపత్యుఁ డై యుంట
యెఱిఁగి మునికులేంద్రుఁ డింద్రుఁ గూర్చి
యిష్టి చేసి సుతుల నిచ్చె నాతనికృపఁ
బంక్తిరథుఁడు పిదపఁ బడసె సుతుల. 696

వ. ఆ రోమపాదునకుఁ జతురంగుండును, జతురంగునకుఁ బృథులాశుండును, బృథు లాశునికి బృహద్రథుండు, బృహత్కర్మ, బృహద్భానుండు నను వారు మువ్వురను బుట్టిరి. అందు బృహద్రథునకు బృహన్మనస్సును, బృహన్మనస్సుకు జయద్రథుండును, జయద్రథునకు విజయుండును, విజయునకు సంభూతి యను భార్యయందు ధృతియు, నా ధృతికి ధృతవ్రతుండును, ధృతవ్రతునకు సత్య కర్ముండును, సత్యకర్మునకు నతిరథుండును జన్మించిరి. 697

---

1. కందువ (చ. ట. జ. బ. తం) 2. క్రొత్తగా మమ్ముఁ జేకొనుమని (హ)
3. భక్ష్యంబులు (హ. వా)

† క-బ ప్రతులలో పాఠమిట్లున్నది.
నూతనాజినంబు ననుపిది మేలని, గోచి విడిచి మృదుదుకూల మిచ్చి
మౌని మరగ జేసి మాపర్ణశాలకు, బోద మంచు గొంచు పోయి రతని

4. హరిణీ సుతుండు వచ్చిన కతంబున (వ్రాఁతప్రతు లన్నిట)

V.R. NARLA MEMORIAL LIBRARY V.R. NARLA D. P.R.I. ACC. No.

గీ. కుంతి పిన్ననాఁడు గోరి సూర్యునిఁ బొంద
బిడ్డఁ డుదితుఁ డైనఁ బెట్టుఁ బెట్టి
గంగనీట విడువఁ గని యతిరథుఁ డంతఁ
గర్ణుఁ డనుచుఁ గొడుకు గారవించె. 698

వ. ఇట్లతిరథునకుఁ గానీనుం డైన కర్ణుండు కొడు కయ్యె. కర్ణునకు వృషసేనుండు వుట్టె. అ య్యయాతికొడు కైన ద్రుహ్యునకు బభ్రుసేతువు, బభ్రుసేతువునకు నారబ్ధుండు, నారబ్ధునకు గాంధారుం, డా గాంధారునకు ఘర్ముండు, ఘర్మునకు ఘృతుండు, ఘృతునకు దుర్మదుండు, దుర్మదునకుఁ బ్రచేతస్సు జనించిరి. ప్రచేతస్సునకునూఱుగురు వుట్టి, మ్లేచ్ఛాధిపతు లై, యుదీచీదిశ నాశ్రయించిరి. తుర్వసునకు వహ్ని, వహ్నికి భర్గుండు, భర్గునకు భానుమంతుండు, భానుమంతునకుఁ ద్రిసానువు, త్రిసానువుకుఁ గరంధముండు, కరంధమునకు నుదారచిత్తుం డైన మరుత్తుండును బుట్టిరి. అతనికి యయాతి శాపంబున సంతతి లేదయ్యె. వినుము. 699

—: యదువంశ చరిత్రము :—

చ. అనఘ! యయాతి పెద్దకొడు కైన యదుక్షితిపాలు వంశముఁ
వినినఁ బఠించినఁ నరుఁడు వెండియుఁ బుట్టఁడు ముక్తిఁ బొందు న
య్యనుపమ మూర్తి [1]విష్ణుఁడు నరాకృతిఁ బొంది జనించెఁ గావునఁ
వినుము నరేంద్ర! [2]నీకు నిది వీనుల పండువు గాఁగఁ జెప్పెదఁ. 700

వ. యదువునకు సహస్రజిత్తు, క్రోష్టువు, నలుండు, రిపుండు నను వారు నలువురు సంభవించిరి. అందుఁ బెద్దకొడు కైన సహస్రజిత్తునకు శతజిత్తు గలిగె. ఆ శతజిత్తుకు మహాహయ, వేణుహయ, హైహయు లను వారు మువ్వురు పుట్టిరి. అందు హైహయునకు ధర్ముండు, ధర్మునకు నేత్రుండు, నేత్రునకుఁ గుంతి, కుంతికి మహిష్మంతుండు, మహిష్మంతునకు భద్రసేనుండు, భద్రసేనునకు దుర్మదుండు, దుర్మదునికి ధనికుండు, ధనికునికిఁ గృతవీర్యుండు, కృతాగ్ని, కృతకర్మ, కృతౌజుఁ డను నలువురు సంభవించిరి. అందుఁ గృతవీర్యునికి నర్జునుండు జనియించె. అతండు మహాబుద్ధిబలంబున. 701

సీ. హరి కళాసంజాతుఁ డైన దత్తాత్రేయు సేవించి సద్యోగసిద్ధిఁ బొంది
బహు యజ్ఞ దాన తపంబులు గావించి సకల దిక్కులు గెల్చి జయముతోడ
సతతంబు హరి నామ సంకీర్తనము సేసి [3]ధనముల నొంది యుదారవృత్తి
యెనుబదియైదువే లేండ్లు భూచక్రంబు [4]ఘనకీర్తిఁ దన వేరుగాఁగ నేలె

---

1. విష్ణుఁడపరాకృతి (హ) 2. నాపలుకు (హ. తం. వా.) 3. ధనములు నమ్మ కుదార వృత్తి (క. తం.) 4. కలదెల్ల (క-బ.)

ఆ. ముదిమి లేక తరుణమూ ర్తి యై యురుకీ ర్తి
నమరెఁ గా ర్తవీర్యు ¹డనఁగ విభుఁడు
నిజము వానిభంగి నేల యేలినయట్టి
రాజు నెఱుఁగ మెందు రాజముఖ్య! 702

వ. ఆ యర్జునునకుంగల పుత్రసహస్రంబునం బరశురాముని బారికిం దప్పి, జయధ్వజుండు, శూరసేనుండు, వృషణుండు, మధువు, నూర్జితుం డను వా రేవురుం బ్రతికిరి. జయధ్వజునకుఁ దాళజంఘుండు, తాళజంఘునకు నౌర్వముని తేజంబున నూర్వురు కొడుకులుఁ గలిగిరి. అందుఁ బ్రథముండు వీతిహోత్రుండు. మధువునకు వృష్ణుండు, వృష్ణునకుఁ బుత్రశతంబు వుట్టె. ఆ వంశంబువారు మాధవులును, బ్రథముండు వృష్ణి గాన, వృష్ణులు యాదవులు ననఁ బరఁగిరి. యదుపుత్రుండయిన క్రోష్టువునకు వృజినవంతుండు, వృజినవంతునకు శ్వాహితుండు, శ్వాహితునకు భేరుశేకుండు, భేరుశేకునకుఁ జిత్రరథుండు, చిత్రరథునకు శశిబిందుండు వుట్టిరి. 703

మ. కృశమధ్యల్ పదివేవు రంగనలతోఁ గ్రీడం బ్రమోదింప స
త్కుశలుం డై పదివేలలక్షలు సుపుత్రుల్ భక్తి సేయం జతు
ర్దశరత్నుండును యోగి నాఁ బరఁగి సప్తద్వీప రాజేంద్రుఁ డై
శశిబిందుం డురు నీతిమంతుఁ డమరేం సత్కాంతి పూర్ణేందుఁ డై. 704

వ. అతని కొడుకుల మొత్తంబులకు ముఖరు లైన యార్వ్వురలోఁ బృథుశ్రవుఁ డను వానికి ధర్మ్ముండు వుట్టె. ధర్మ్మునకు నుశనుండు వుట్టి, నూ అశ్వమేధంబులు సేసె. అ య్యుశనునకు రుచకుండు వుట్టె. ఆ రుచకునకుఁ బురుజిత్తు, రుక్మ్ముండు, రుక్మేషువు, పృథువు, జ్యామఖుండు నను వా రేవురు వుట్టిరి. అందు జ్యామఖుండు.

సీ. తొట్రు కొల్పెడు శైబ్యతోడి ప్రేమంబున ననపత్యుఁ డయ్యును నన్యభార్యఁ
గైకొన కొకకొంత కాలంబునకుఁ బోయి పగవారియింటను బలిమిఁ బట్టి
యొకకన్యఁ దేరిపై నునిచి తోడ్తేరంగ జననాథుఁ గన్యను శైబ్య చూచి
కోపించి మానవకుహక! యీ పడుచును ²దెచ్చియు నే నుండఁ దేరిమీఁదఁ

ఆ. బెట్టినాఁడ వనుచు బిఱుసులు పలుకంగ
నతఁడు వలికె నంత నతివతోడ
నాకుఁ గోడ లింత నమ్మి మీ లలితాంగి
సవతి గాదు వినుము సత్య మనుచు. 706

---

1. డర్జునుండు (క-బ.) 2. దెచ్చి యేనుండెడి తేరిమీఁద (తం)

వ. అ య్యవసరంబున శ్రైబ్యకొడుకుం గాంచు నని యెఱింగి, విశ్వేదేవతలును, పితృదేవతలును సంతసించిరి. వారల ప్రసాదంబున. 707

క. [1]తన సవతి మొఱఁగి పెనిమిటి, తనుఁ బొందిన శ్రైబ్య మఱి విదర్భునిఁ గనియెఁ దనయుఁ గని జ్యామఖుండును, దన తెచ్చినకన్యఁ దెచ్చి తనయున కిచ్చెఁ.708

అధ్యాయము - ౫౪

వ. ఆ కన్యకయందు విదర్భునకుఁ గుశుండును, క్రథుండును, రోమపాదుండునుం బుట్టిరి. రోమపాదునకు బభ్రువు, బభ్రువునకు విభువు, విభువునకుఁ గృతి, కృతికి నుశికుండు, ఉశికునకు చేది, చేదికి శ్రైద్యాదులు పుట్టిరి. క్రథునకుఁ గుంతి, కుంతికి ధృష్టి, ధృష్టికి నిర్వృతి, నిర్వృతికి దశార్హుండు, దశార్హునకు వ్యోముండు, వ్యోమునకు జీమూతుండు, జీమూతునకు వికృతి, వికృతికి భీమరథుండు, భీమ రథునకు నవరథుండు, నవరథునకు దశరథుండు, దశరథునకు శకుని, శకునికిఁ గుంతి, కుంతికి దేవరాతుండు, దేవరాతునకు దేవక్షత్రుండు, దేవక్షత్రునకు మధువు, మధువునకుఁ గురువశుండు, కురువశునకు ననువు, అనువునకుఁ బురు హోత్రుండు, నతనికి నంశువు, నతనికి సాత్త్వతుండు, సాత్త్వతునకు భజమా నుండును, భజియు, దివ్యుండును, వృష్ణియు, దేవాపృథుండును. నందకుండును, మహాభోజుండు నను నేడ్గురును బుట్టిరి. అందు భజమానునకుఁ బ్రథమభార్యయందు నిమ్రోచి కంకణ వృష్ణులు మువ్వురును, రెండవ భార్యయందు శతజిత్తు, సహస్ర జిత్తు, అయుతజిత్తు నను మువ్వురును బుట్టిరి. అందు దేవాపృథునికి, బభ్రువు వుట్టెఁ. వీర లిరువుర ప్రభావంబులఁ బెద్దలు శ్లోకరూపంబునఁ బఠియించుదురు. అట్టి శ్లోకార్థం బెట్టి దనిన. 709

తే. వినుము దూరంబు [2]నం దేమి వినుచునుండు
[3]మదియ చూతుము డగ్గఱ నరుగుదేర
నరులలో బభ్రుకంటె నున్నతుఁడు లేఁడు
యోజ దేవా[1]పృథున కెన యొరుఁడు గలఁడె. 710

క. పదునాలుగు వేవురు నఱు, వది[4]యేవురు నరులు ముక్తి వడసిరి బభ్రుం
డుదితుఁడు దేవాపృథుఁడును, బదపడి యోగంబుఁ దెలియఁ బలికిన కతనఁ.

వ. మహాభోజుం డతిధార్మికుండు. వాని వంశంబువారు భోజు లని పలుకంబడిరి. వృష్ణికి సుమిత్రుండును, యుధాజిత్తును జన్మించిరి. అందు యుధాజిత్తునకు

---

1. తన చెలువలాతి పెనిమిటి (క. చ.) 2. నాడిన (హ) 3. మఱియుఁ జూడము (హ) 4. నాలుగు (హ)

శినియు, అనమిత్రుండును జనించిరి. అనమిత్రునికి నిమ్నుండు, నిమ్నునికి సత్రాజితుండు, ప్రసేనుండు నన నిరువురు వుట్టిరి. మఱియు, ననమిత్రునికి శిని యను వాఁడు వేఱొకండుఁ గలఁడు. అతనిపుత్రుండు సత్యకుండు.అతనికి యుయుధానుండనఁ బరఁగిన సాత్యకియు, నా సాత్యకికి జయుండును, జయునకుం గుణియు, నా కుణికి యుగంధరుండును బుట్టిరి. మఱియు ననమిత్రునకుఁ బృశ్ని యను వేఱొక కొడుకుం గలఁడు. వానికి శ్వఫల్క చిత్రకులు గలిగిరి. అందు శ్వఫల్కునకు గాందినియం దక్రూరుండును, నసంగుండును, సారమేయుండును, మృదుకుండును, మృదుపచ్చివుండును, వర్మదృక్కును, ధృష్టవర్ముండును, ఉత్రోపేతుండును, అరిమర్దనుండును, శత్రుఘ్నుండును, గంధమాదుండును, ప్రతిబాహువు ననువారు పన్నిద్దఱు కొడుకులును, సుచారు వను కన్యకయుం జనించిరి. వారియం దక్రూరునికి దేవలుండును, అనుపదేవుండును బుట్టిరి. మఱియుఁ జిత్రునకుఁ బృథుండును, విదూరథుండును, మొదలుగాఁ గలవారు పెక్కండ్రు వృష్ణివంశజాతు లయిరి. భజమానుండు, కుకురుడు, శుచి, కంబళబర్హిషుండు నన నలువు రంధకునికిఁ బుట్టిరి. కుకురునకు వృష్ణి, వృష్ణికి విలోమతనయుండు, విలోమతనయునికి కపోతలోముండు, కపోతలోమునికిఁ దుంబురుసఖుం డైన యనువు, అనువునకు దుందుభి, దుందుభికి దవిద్యోతుండు, దవిద్యోతునకుఁ బునర్వసువు, అతనికి ఆహుకుం డను కుమారుండును, ఆహుకి యను కన్యకయుం గలిగిరి. ఆ యాహుకునికి దేవకుండు, ఉగ్రసేనుండు నన నిరువురు జనించిరి. అందు దేవకునికి దేవలుండు, అనుపదేవుండు, సుదేవుండు, దేవవర్ధనుం డన నలుగురు గలిగిరి. వారలకు ధృతదేవయు, శాంతిదేవయు, ఉపదేవయు, శ్రీదేవయు, దేవరక్షితయు, సహదేవయు, దేవకియు ననఁ దోఁబుట్టువు లేడ్వురు గలిగిరి. 712

క. అసదృశ లలితాకారలఁ, గిసలయ కరతలల దేవకీముఖ్యల నా
బిసరుహనయనల నందఱు, వసుదేవుఁడు పెండ్లియాడె వసుధాధీశా! 713

వ. ఉగ్రసేనునకుఁ గంసుండును, న్యగ్రోధుండును, సునామకుండును, కహ్వుండును, శంకుండును, సుభువును, రాష్ట్రపాలుండును, విసృష్టుండును, తుష్టిమంతుండును కొడుకులును, కంసయు, కంసవతియు, సురాభువు, రాష్ట్రపాలికయు ననుకూఁతులుం బుట్టిరి. వారు వసుదేవానుజ భార్య లైరి. భజమానునికి విదూరథుండును, విదూరథునికి శినియు, నతనికి భోజుండు, భోజునికి హృదికుండు, హృదికునకు దేవమీఢుండు, శతధనువు, కృతవర్మయు నను కొడుకులు గలిగిరి. ఆ దేవమీఢునికి మారిష యను భార్యయందు వసుదేవుండును, దేవభాగుండును, దేవ

శ్రవుండును, ఆనకుండును, సృంజయుండును, శ్యామకుండును, కంకుండును, అనీకుండును, వత్సకుండును, వృకుండు ననువారు పదుగురు కొడుకులును, పృథయు, శ్రుతదేవయు, శ్రుతకీర్తియు, శ్రుతశ్రవసయు, భాజాధిదేవియు ననుకూఁతు లేవురును బుట్టిరి. అందు. 714

—: వసుదేవుని వంశక్రమాను వర్ణనము :—

ఉ. ధీనయశాలి యైన వసుదేవుఁడు వుట్టిన వెంట మింటిపై
నానకదుందుభుల్ మొరసె నచ్యుతుఁ డీతనికిం దనూజుఁ డై
మానుగఁ బుట్టు నంచు గరిమంబున దేవత లుబ్బ రాజపం
చానన! తన్నిమిత్తమున నానకదుందుభి యయ్యె వాఁ డిల. 715

క. తన చెలికాఁ డగు కుంతికిఁ, దనయులు లేకున్నఁ జూచి తన తనయఁ బృథ
దనయఁగ నిమ్మన శూరుఁడు, దనయందుల మైత్రి నిచ్చె ధరణీనాథా! 716

వ. అ య్యింతి కుంతిభోజునియింటం బెరుగుచుండ, నొకనాఁడు దూర్వాసుం డరుగు
దెంచిన, న మ్మహాత్మునకుఁ గొన్నిదినంబులు పరిచర్యలు చేసి, వేల్పులం జేరఁ
జీరు విద్య వడసి, యా విద్య లా వెఱుంగ నొక్కనాఁ డేకాంతంబున వెలుంగు
జూని నాకర్షించిన, నా దేవుండు వచ్చినం జూచి, వెఱఁగువడి యిట్లనియె. 717

క. మంత్రపరీక్షార్థం బభి, మంత్రించితిఁ గాని దేవ! మదనక్రీడా
తంత్రంబుఁ గోరి చీరఁ, మంత్రించిన తప్పు సైచి మరలు దినేశా! 718

వ. అనిన న య్యువిదకుం బద్మినీవల్లభుం డిట్లనియె. 719

మ. [1]తెఱవా! నీ పలు కట్ల యీ వినుములే[2] దేవోత్తమాహ్వానముల్
మొఱఁగం బోలునె వేల్పులం బడయుటల్ మోఘంబులే నీకు నీ
తఱి గర్భం బగుఁ బుత్రుఁడుం గలుగు నీ తారుణ్యముం బూజ్య మౌ
[3]వెఱవం గార్యము లేదు సిగ్గు దగునే వ్రీడావినమ్రాననా! 720

చ. అని తగ నీయకొల్పి లలితాంగికి గర్భము సేసి మింటికిఁ
జనియె దినేశ్వరుం డపుడు చక్కని రెండవసూర్యుఁడో యనఁ
దనరెడు పుత్రుఁ గాంచి కృప దప్పి జగజ్జన వాదభీత యై
తనయుని [4]నీటఁ బోవిడిచి తా నరిగెం బృథ దండ్రియింటికిఁ. 721

---

1. తెఱవా: నీ ప్రతిమా గృహోటనము లే దేవోత్త మాహ్వానముల్ (క) 2. అసదులే (తం.)
3. వెఱవం గారణ మేమి (ట) 4. నేటిలో విడిచి (తం)

వ. అ య్యువిదను నీ ప్రపితామహుం డైన పాండురాజు వివాహం బయ్యె. అ య్యంగనకుఁ బాండురాజువలన ధర్మజ భీ మార్జునులు పుట్టిరి. అ మ్మగువ చెల్లె లగు శ్రుతదేవను, గారూషకుం డైన వృద్ధశర్మ పెండ్లియాడె. అ య్యిద్దఱి కును మునిశాపంబున దంతవక్త్రుం డను దానవుండు జన్మించె. దాని తోడం బుట్టు వగు శ్రుతకీర్తినిఁ [1]గేకయుండు పెండ్లియాడె. ఆ దంపతులకుఁ బ్రతర్ద నాదు లేవురు వుట్టిరి. దాని భగిని యైన రాజాధిదేవిని జయత్సేనుండు పరిణయం బయ్యె. ఆ మిథునమునకు విందానువిందులు సంభవించిరి. చేదిదేశాధిపతి యైన దమఘోషుండు శ్రుతశ్రవసను బరిగ్రహించె. వారలకు శిశుపాలుం డుదయించె. వసుదేవుని తమ్ముఁ డైన దేవభాగునికిఁ గంసయందుఁ జిత్రకేతు బృహద్బలు లిరువురు జనించిరి. వాని భ్రాత యగు దేవశ్రవ స్సనువానికిఁ గంసవతియందు వీరుండును, నిషుమంతుండును నుప్పతిల్లిరి. వాని సోదరుం డైన కంకునికిఁ గంక యను దానికి బకుండును, సత్యజిత్తు, పురజి త్తనువారు జనించిరి. వాని సహాజుం డైన సృంజయునికి రాష్ట్రపాలియందు వృష, దుర్మర్ష ణాదులు జనించిరి. వాని యనుజాతుం డైన శ్యామకునకు సురభూమియందు హరికేశ హిరణ్యా క్షులు ప్రభవించిరి. వాని తమ్ముం డైన వత్సుండు మిశ్రకేశి యను నప్సరస యందు వృకాది సుతులం గనియె. వృకుండు దూర్వాక్షి యందుఁ దక్ష పుష్కర సాళ్వాదుల నుత్పాదించె. వాని జఘన్యజుం డయిన యనీకుండు సుదామని యను దానియందు సుమి త్రానీక బాణాదు లయిన కొడుకులం బడసె. వాని యనుజుం డైన యానకుండు కర్ణికయందు ఋత ధామ జయులం గాంచె. వసుదేవునివలన రోహిణియందు బలుండును, గదుండును, సారణుండును, దుర్మదుండును, విపులుండును, ధ్రువుండును, కృతాదులును, పౌరవియందు సుభద్రుండును, భద్రబాహుండును, దుర్మదుండును, భద్రుండును, భూతాదులుం గూడఁ బన్నిద్దఱును, మదిరయందు నందోపనంద కృతక శ్రుత శూరాదులును, గౌసల్యయందుఁ గేశియు, రోచనయందు హస్త హేమాంగాదు లును, నిశయందు యదుముఖ్యు లయిన యురువల్కలాదులును, ధృతదేవయందుఁ ద్రిపృష్ఠుండును, శాంతిదేవాత్మజయందు బభ్రుమ ప్రశ్రితాదులును, నుపదేవ యందుఁ గల్పవృష్ట్యాదులు పదుంద్రును, శ్రీదేవయందు వసుహంస, సుధన్వాదు లార్గురును, దేవరక్షితయందు గదాదులు తొమ్మండ్రును, సహదేవయందుఁ బురూధ శ్రుతముఖ్యాదు లెనమండ్రును, దేవకీదేవియందుఁ గీర్తిమంతుఁడును,

---

1. కేకయరాజైన ధృష్టకేతుండు (తం. వా.)

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.II
Acc. No

సుషేణుండును, భద్రసేనుండును, బుజువును, సమదనుండును, భద్రుండును, సంకర్షణుండును ననువా రేడ్వురు పుట్టిరి. మఱియును. 722

క. దుష్టజన నిగ్రహంబును, [1]శిష్టజనానుగ్రహంబు సేయుటకొఱకై
యష్టమగర్భమున గుణో, త్కృష్టుఁడు దేవకికి విష్ణుదేవుఁడు పుట్టెఁ. 723

ఆ. విష్ణుఁ డుదితుఁ డైన వెనుక నా దేవకి
భద్రమూర్తి యగు సుభద్రఁ గనియె
నా గుణాఢ్య ముత్త వగు నీకు నర్జున
దయిత యగుటఁ జేసి ధరణినాథ ! 724

క. ఎప్పుడు ధర్మక్షయ మగు, నెప్పుడు పాపంబు పొడము నీ లోకములో
నప్పుడు విశ్వేశుఁడు హరి, దప్పక విభుఁ డయ్యుఁ దన్నుఁ దా సృజియించున్.

క. తన మాయ లేక [1]పరునకు, ఘనునకు నీశ్వరున కాత్మకర్తకు హరికిన్
[2]జననములకుఁ గర్మములకు, మనుజేశ్వర ! కారణంబు మఱియును గలదే. 726

క. తలపఁగ నెవ్వని మాయా, విలసనములు జనన వృద్ధి విలయంబులకుం
గలిమి కనుగ్రహ మోక్షం, బులకును జీవులకు మూలములు నా నెగడున్. 727

సీ. అట్టి సర్వేశుని కరయంగ జన్మాది పరతంత్రభావ మెప్పాటిఁ గలదు
రాజ లాంఛనముల రాక్షసవల్లభు లక్షౌహిణీశు లై యవనిఁ బుట్టి
జనులను బాధింప శాసించుకొఱకు నై సంకర్షణునితోడ జనన మంది
యమరుల మనముల కైన లెక్కింపఁగ రాకుండు నట్టి కర్మములఁ జేసి

తే. కలియుగంబున జన్మింపఁ గలుగు నరుల
దుఃఖ [3]శోకతమంబులఁ దొలఁగఁ జేసి
నేల [4]వేఁగెల్ల వారించి నిఖలదిశల
విమలకీర్తులు వెదచల్లి వెలసె [4]శౌరి. 728

సీ. జనకుని గృహమున జన్మించి మందలోఁ బెరిఁగి శత్రుల నెల్లఁ బీఁచ మణఁచి
పెక్కండ్రు భార్యలఁ బెండ్లియై సుతశతంబులఁ గాంచి తను నాదిపురుషుఁ గూర్చి
[5]శరణన్న వారినిఁ గరుణించి పాండవ కౌరవులకు నంతఁ గలహ మైన
నందఱ సమయించి యర్జును గెలిపించి యుద్ధవునకుఁ దత్త్వ మొప్పఁ జెప్పి

---

1. శిష్టప్రతిపాలనంబు (క. చ.) 2. జనములకుఁ గర్మములకును (హ.వా.) 3. జాలంబు 4. లన్నిటిఁ దొలఁగ నడఁచి (హ) 4. సధిప (హ) 5. కృతువులు పెక్కులు గావించి (క. త.)

తే. మగధ పాండవ సంజయ మధు దశార్హ
భోజ వృష్ణ్యంధకాది సంపూజ్యఁ డగుచు
నుర్విభరము నివారించి యుండ నొల్ల
కా మహామూర్తి నిజమూర్తియందుఁ బొందె. 729

క. మంగళ హరికీర్తి మహో, గంగామృత మించుకైనఁ గర్ణాంజలులఁ
సంగతము [1]సేసి ద్రావఁ దొ,లంగును గర్మంబు లావిలం బగుచు నృపా! 730

క. వనజాతుని మందస్మిత, ఘన కుండల దీప్తి గండ కలితాననముఁ
వనితలుఁ బురుషులుఁ జూచుచు, ననిమిష భావంబు లేమి కలయుదు రధిపా!

చ. నగుమొగముఁ సుమధ్యమును నల్లనిదేహము లచ్చి కాటప
ట్టగు నురముఁ మహాభుజము లంచిత కుండలకర్ణముల్ మదే
భగతియు నీలవేణియుఁ గృపారస దృష్టియుఁ గల్గు వెన్నుఁ డి
మ్మొగఁ బొడసూపుఁ గాతఁ గను మూసిన యప్పుడు విచ్చునప్పుడుఁ. 732

వ అని చెప్పి. 733

క. జనకసుతా హృచ్చోరా!, జనక వచోలబ్ధ విపిన శైల విహారా!
జన కామిత మందారా!, జనకాది మహేశ్వరాతిశయ సంచారా! 734

మాలిని. [2]జగదవన విహారీ! శత్రులోక ప్రహారీ!
సుగుణ [3]ఘనవిహారీ! సుందరీ మానహారీ!
విగత కలుష [4]పోషి! వీరవిద్యాభిలాషి!
స్వగురు హృదయతోషి! సర్వదా సత్యభాషి! 735

గద్య. ఇది శ్రీ పరమేశ్వర కరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతం బైన శ్రీ మహాభాగవతం బను మహాపురాణంబునందు సూర్యవంశారంభంబును, వైవస్వతమను జన్మంబును, హైమచంద్ర కథనంబును, సుద్యుమ్నాది మనుసూనుల చరిత్రంబును, మరుత్తు, తృణబిందు, శర్యాతి, కకుద్మి, సగర, నాభాగ ప్రముఖుల చరిత్రంబులును, నంబరీషుని యందుఁ బ్రయోగింపఁబడిన దుర్వాసుని కృత్య నిరర్థక యగుటయు, నిక్ష్వాకు వికుక్షి, మాంధాతృ, పురుకుత్స, హరిశ్చంద్ర, సగర, భగీరథ ప్రముఖుల చరి

V.R. NARLA LIBRARY V.R. NARLA D.P.R.I. Acc. No.

---

1. చేసిరేని (తం) 2. జగదుపవనచారీ సర్వలోకోపకారీ (హ) 3. వన (తం.వా.)
4. దోషి (హ) 5. పోషి (హ)

త్రంబులును, భాగీరథీప్రవాహ వర్ణనంబును. గళ్మాషపాద, ఖట్వాంగప్రము ఖుల వృత్తాంతంబును, శ్రీరామచంద్ర కథనంబును, దదీయ వంశపరంపరా గణనంబును, నిమికథయును, జంద్రవంశారంభంబును, బుధపురూరవుల కథ యును, జమదగ్ని పరశురాముల వృత్తాంతంబును, విశ్వామిత్ర నహుష యయాతి పూరు దుష్యంత భరత రంతిదేవ పాంచాల బృహద్రథ శంతను భీష్మ పాండవ కౌరవ ప్రముఖుల వృత్తాంతంబులును, ఋష్యశృంగ వ్రతభంగంబును, ద్రుహ్యానుతుర్వసుల వంశంబును, యదు కార్తవీర్య శశిబిందు జామద గ్న్యాదుల వృత్తాంతంబులును, శ్రీకృష్ణావతార కథా సూచనంబును నను కథలం గల నవమస్కంధము సంపూర్ణము.

AQUA105B151

BC

ముద్రణ కొండేషన్ పుస్తకాల పరిశీలనావర్తిక

[illegible]	[illegible] 158151
పుస్తకం పేరు	శ్రీమద్భాగవతము03
[illegible]	[illegible]
[illegible]	YES
[illegible]	[illegible] 311 YES
[illegible]	NO
కూర్చే పేజీలు	ci, 4, 6, BC
లేని పేజీలు	
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	Vedavathi
మ్యాపు చేసినది	
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	బాగుంది